శ్రీమత్ భాగవత సామ్రాజ్యము



బహుశ్రీ యులంద్రాజు శ్రీనివాసరావు

Yalamraju Srinivasa Rao
Brahmasri
www.adaivedanta.in

శ్రీమత్ భాగవత సామ్రాజ్యము



ప్రణేత

భాగవతదుర్గపాల - భగవద్భక్తిరసలోల

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

శ్రీమత్ భాగవత సామ్రాజ్యము

గ్రంథకర్త :
బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

తృతీయ ముద్రణ : ఏప్రియల్, 2005

మూల్యం : రూ.

ప్రతులకు :

1. యల్లంరాజు శ్రీనివాసరావు
   F1, వేంకటసాయి టవర్స్,
   పాపరాజు వీధి, సత్యనారాయణపురం
   విజయవాడ - 520 011
   ఫోన్: 0866-2538526

2. యం. సుధాకర్
   సత్యనారాయణపురం,
   విజయవాడ - 520 011
   సెల్: 94405 24168

ముద్రణ :
నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
గాంధీనగర్, విజయవాడ-3.
ఫోన్ : 0866-2574828

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

విషయ సంగ్రహము

1.	పురాణములు-వాటి విశిష్టత	19
2.	భాగవత ప్రాశస్త్యము	37
3.	సంకేతవాదము	58
4.	రచనా ప్రణాళిక	81
5.	విష్ణు పారమ్యము	101
6.	అవతారములు - కృష్ణతత్త్వము	128
7.	అనన్యభక్తి	175
8.	కర్మయోగులు - దక్షాదులు	198
9.	సమాధియోగులు - భీష్మాదులు	226
10.	సగుణ భక్తులు - కుంతీ ప్రభృతులు	252
11.	సగుణ నిర్గుణ సంధి - గజేంద్రుడు	294
12.	నిర్గుణ భక్తులు - ప్రహ్లాదుడు	324
13.	నిర్గుణ భక్తులు - కుచేలుడు	355
14.	భాగవతము - సందేశసారము	382

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

ప్రతిష్ఠాపన

భాగవత సామ్రాజ్యమని నేనీ గ్రంథానికి పెట్టిన పేరు. దీనికి పేరు పెట్టటంలో నాకు స్ఫూర్తి నిచ్చింది త్యాగరాజస్వామి వారి రామభక్తి సామ్రాజ్యమనే పాట. ఆ పాటలో సామ్రాజ్యమనే మాట నాకు చాలా ముచ్చటగా కనిపించి దీనికి కూడా అలాంటి నామకరణమే చేశాను. భాగవతుల సామ్రాజ్యమిది. మన ఈ భౌతికమైన సామ్రాజ్యాలలాగా నశ్వరం కాదు. శాశ్వతమైనది. ఎప్పటికైనా మానవుడా సామ్రాజ్యంలో పౌరసత్త్వం సంపాదిస్తేనే బాగుపడతాడనే హెచ్చరిక కూడా గర్భితమయి ఉంది ఇందులో. భాగవత పురాణం మీద సాగిన ఈ సమీక్షా గ్రంథం నా రచనా వ్యానంగంలో మలిఘట్టానికి చెందిన తొలి రచన. తొలిఘట్టానికి సంబంధించి ఒక అయిదు గ్రంథాలు ఇంతకుముందే వ్రాసి ప్రకటించాను. నిర్వాణదశక వ్యాఖ్యా దక్షిణామూర్తి స్తోత్రార్థ వివరణమూ, ప్రస్థానత్రయ పారిజాతమూ, సాధకగీత, జగద్గురు మహోపదేశమూ, ఇవన్నీ తత్త్వ సాహిత్యమనే Literature of Philosophy శీర్షిక క్రిందికి వస్తాయి. పోతే ఇక సాహిత్య తత్త్వమనే Philosophy of Literature శీర్షిక క్రింద మరొక అయిదు రచనలు చేయాలని నా సంకల్పం. ఆ పరంపరలో మొట్టమొదటిదీ భాగవత సామ్రాజ్యం. దీని తరువాత వరుసగా రామాయణ రామణీయకమనీ, మహాభారత వైభవమనీ, కాళిదాస ప్రత్యభిజ్ఞ అనీ, ద్వాదశాదిత్యులనీ, ఇలా మరి నాలుగు కృతులు నాభావాంబర వీథి నుంచి నేల కవతరించవలసి ఉంది. దానితో సాహిత్య తత్త్వమనే ఈ మలిఘట్టానికి కూడా భరత వాక్యం పలికినట్టవుతుంది.

"అభ్యర్హితమ్ ప్రథమ"మని ఒక ఆర్యోక్తి ఉన్నది. అభ్యర్హితమంటే విశిష్టమైనది. విశిష్టమైనదేదో దానికి ప్రాథమ్య priority మివ్వాలట. మరి అలాటి విశిష్టమైన వస్తువేది. భౌతిక జగత్తుకన్నా విజ్ఞాన జగత్తు విశిష్టమైతే ఆ విజ్ఞానాలన్నిటిలో విశిష్టమైనది సర్వాత్మ భావ The subjective unity of all things రూపమైన అద్వైత విజ్ఞానం. అదే అన్నింటికీ మూల భూతమైన

తత్త్వం. దాని మీద ఆధారపడ్డదే మిగతా ప్రపంచమంతా కాబట్టి దాని స్వరూపమేమిటో ముందు సాంగోపాంగంగా తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉంది మనకు. తెలుసుకొంటే ఆ తత్త్వ సాహిత్యం వెలుగులో సాహిత్య గ్రంథాలను పరిశీలించవచ్చు. వాటి విలువలు నిర్ణయించవచ్చు. తత్త్వమనేది లక్షణమైతే Science సాహిత్యమనేది దానికి లక్ష్యం Application or Illustration. లక్షణాన్ని లక్షణంగానే చూచామింతవరకూ, దానినిప్పుడు లక్ష్యంతో కూడా సమన్వయించి చూడబోతాము. అలా చూడటంవల్ల శాస్త్రజ్ఞానం పాఠకులకు చక్కగా మనసుకు పడుతుంది. ఒక విధమైన ప్రరోచన Taste కలుగుతుంది. ఇది మన తలకు మించిందనే భయం తొలగిపోయి అతిసన్నిహితమనే భావమేర్పడుతుంది. అంతేకాదు, తత్త్వమూ, సాహిత్యమూ రెండూ తీర్థానికి తీర్థం ప్రసాదానికి ప్రసాదమని వేరుగాక రెండూ ఒకటేననే సమన్వయ జ్ఞానముదయిస్తుంది.

అయితే కొందరు బుద్ధిమంతులిలా ఆశంక చేయవచ్చు. సాహిత్యమంటే పురాణేతి హాసాలు, కావ్యనాటకాలూ, నవలా కథానికలూ ఇలాంటి ప్రక్రియలు గదా సాహిత్యం. దీనికీ మీరు చెప్పే వేదాంతానికి ఏమి సంబంధం. దాని వెలుగులో దీనిని విమర్శించటమేమిటి. ఈ ప్రక్రియలను విమర్శించాలంటే సాహిత్య లక్షణమనేది వేరే ఉంది గదా. కథా వస్తువూ, సన్నివేశాలూ, వివిధ పాత్రలూ, వారి ప్రవృత్తులూ, వర్ణనలూ, కల్పనలూ ఇంకా అయా అలంకారాలూ, రీతులూ, వృత్తులూ, రసభావాలూ ఇలాంటి దృష్టితో గదా చూడవలసింది సాహిత్య గ్రంథాలను, అది వదలిపెట్టి జుట్టుకూ మోకాళ్లకూ ముడి వేసినట్టు వేదాంతానికీ దానికీ ముడివేయటమేమి బాగు.

ఇది సరిగా ఆలోచించక చేసే ఆక్షేపణ. వేదాంతమూ, తత్త్వమూ అనగానే నూటికి తొంబది తొమ్మిది మంది తలపట్టుకొని కూచుంటారు. ఏదో వినరాని మాట విన్నట్టు బాధపడతారు వారు. అన్ని జ్ఞానాలకూ అంతిమమైన జ్ఞానమేదో అది వేదాంతం. అన్ని పదార్థాల తాలూకు స్వరూపమేదో అది తత్త్వం. నిత్యజీవితంలో మనమేదైనా చూస్తే, ఇది ఏమిటిది, దీని తత్త్వమేమిటి, ప్రయోజన మేమిటని ప్రశ్నిస్తాము. దానికి జవాబు దొరికే వరకూ విచారణ సాగిస్తాము. జవాబు దొరికితే ఏదో

నిధి దొరికినంతగా సంతోషపడతాము. లౌకిక జీవితంలోనే ఇది అనివార్య మయినప్పుడిక సాహిత్య జీవితంలో చెప్పవలసినదేముంది. సాహిత్యమంటే లోకానికి ప్రతిబింబమే గదా. లోకంలో ప్రతిదాని స్వరూప స్వభావాలేమిటా అని ఎలా అన్వేషిస్తున్నామో సాహిత్యంలో కూడా అలాగే తత్త్వగవేషణ చేయవలసి ఉంటుంది. నీవు కథలన్నావు. పాత్రలన్నావు. రసమన్నావు. భావమన్నావు. వర్ణనలూ సన్నివేశాలన్నావు. ఇవన్నీ లేవనటం లేదు మేము. కావనటం లేదు. వీటన్నిటి తత్త్వమేమిటి ప్రయోజనమేమిటనే మా ప్రశ్న. ప్రశ్న దేనికి. వాటిని వాటి మేరకు చూచి సరిపుచ్చుకోమనవచ్చు నీవు. అది సత్యాన్వేషకుడి లక్షణం కాదు. గమ్యమేమిటో తేల్చుకొనే వరకూ అన్వేషణ చేయక తప్పదు.

ఆ దానికేమి, సాహిత్యానికి గమ్యమేమిటని ఇంత దూరం విచారణ దేనికి. సౌందర్యమే దాని తత్త్వం. లోకోత్తరమైన ఆహ్లాదాన్ని ప్రసాదించటమే దాని గమ్యం. ఇంతకన్నా ఏమున్నదని బుకాయించవచ్చు. కాని ఇది ఒక సమాధానం కాదు. చాలా పేలవమైన సమాధానమిది. సౌందర్యమే అయితే ప్రకృతిలో కావలసినంత కనిపిస్తుందది. ఒక పర్వతమేమిటి, సముద్రమేమిటి, ఒక శరజ్జ్యోత్స్న ఏమిటి, ఒక నక్షత్ర కవచితమైన వినీలాకాశమేమిటి, ప్రకృతి దృశ్యాలన్నీ సహజ సుందరాలే. అలాగే ఆయా దృశ్యాలు తిలకించేటపుడూ శబ్ద స్వర్శాదులనుభవించేటప్పడూ, కలిగే ఆనందం కూడా మనకు సహజంగానే కలుగుతున్నది. అలాంటప్పడొక సాహిత్యమనేది క్రొత్తగా సృష్టించుకొని దానివల్ల కృత్రిమంగానైనా పొందవలసిన అగత్యమేమున్నది.

కేవలం సౌందర్య దృష్టే కాదు. దాని కతీతమైన ఉపదేశ దృష్టి కూడా ఉంది సాహిత్యానికని కొందరు వర్ణిస్తారు. వాస్తవమే. సద్యఃపర నిర్వృతే Delight గాక ఉపదేశ ప్రయోజనం Instruction కూడా ఉందనే చెబుతా రాలంకారికులు Literary critics దానికి తగినట్టు మహాకవులు కూడా అలాగే సాహిత్య సృష్టి చేస్తూ వచ్చారు.దృష్టిలేని సృష్టి అంటూఎక్కడా లేదు.ఏదో ఒక దృష్టి పెట్టుకొనే సృష్టిస్తాడే రచయిత అయినా. అది రచన ఆ మూల చూడమూ వ్యాపించి ఉంటుంది. దానితో సహితమై ఉండటం మూలాన్నే అది అసలు సాహిత్యమయిందని కూడా అనుకోవచ్చు. దృష్టి

ఆత్మ అయితే సృష్టి దానికి శాబ్దికమైన ఒక శరీరం. అది అమూర్తం కాబట్టి, ఇది దాన్ని మనకు మూర్తీకరించి చూపుతుంది. అంతవరకూ నిజమే. కాదనలేదు.

కాని ఈ దృష్టి అని పేర్కొంటున్నామే. ఏమిటీ దృష్టి. మానవుడెప్పుడు గానీ తన దేశ కాలాలను దాటిపోలేడు. తన పరిధిలోనే ఏదైనా ఆలోచిస్తుంటాడు. అది తన గృహ జీవనమో, తన చుట్టూ ఉన్న సమాజ జీవనమో, ఈ రెండింటి మీదా ప్రభావం చూపే రాజకీయమో ఇలాంటి రాజకీయాలు పెక్కింటికి నెలవైన ఈ ప్రపంచమో, ఈ ప్రాపంచిక శ్రేయస్సు కంతటికీ మూలమైన నైతిక ధార్మిక ప్రవర్తనమో, ఇదే గదా మానవుడి భావనా పరిధి. ఇంతకు మించి మరేమున్నది. తరచి చూస్తే ఇందులో ఏ ఒక్క రంగమైనా అది పరిమితమే. ఎందుకంటే ప్రతి ఒకటీ ఒకదానికొకటి సాపేక్షం Related ఒకటిగా గాక అన్నింటినీ కలుపుకొని చూచినా అదీ పరిచ్ఛిన్నమే. తద్ద్వారా కలిగే ఫలితమేమిటి మనకు. ఒక ప్రబోధమో Enlightenment ఒకానొక మానసిక పరివర్తనమో Transformation. ఇంతేగదా. అదైనా ఎంత ప్రబోధమని. ఎంత పరివర్తనమని పరిపూర్ణం కాదు. శాశ్వతికం కాదు.

కాబట్టి అటు సౌందర్యారాధనా, ఇటు కర్తవ్య ప్రబోధనా, ఇవి ఏవీ పూర్తిగా గమ్యం కావు సాహిత్యానికి. ఇలాంటి ప్రయోజనాలెన్ని చెప్పినా అవి పాక్షికమైనవే. అంధ గజ దృష్టాంతాన్ని జ్ఞప్తికి తెస్తాయివన్నీ, ఏ అంధుడు చూచానని చెప్పినా అది సమగ్రమైన ఏనుగు రూపం కాదు. అందులో ఏదో ఒక అవయవమే వాడు చూచింది. అలాగే ఏ సారస్వతేయుడే అభిప్రాయంతో విమర్శించి చెప్పినా, అది సాహిత్య స్వరూపంలో ఏకదేశమే Particular phase. సార్వత్రికం కాదు. సార్వత్రికం కానంత వరకూ అది సత్యమూ కాదు. భావుకుడైన వాడికి దానివలన సంతృప్తి లేదు.

పోతే ఇక సాహిత్యమనేది ఏ దృష్టితో పరిశీలిస్తే అది సర్వాంగీణమైన Comprehensive దృష్టి అని ఇప్పుడు ప్రశ్న. అదే మేము మొదట వర్ణించి చెప్పిన తాత్త్విక దృష్టి. తాత్త్విక దృష్టితో చూచినప్పుడే అది నిజమైన సాహిత్య విమర్శ. తత్త్వమంటే ఏమని చెప్పాము. వస్తు స్వరూపమని గదా. ఒక

మూల పదార్థంలో నుంచి వచ్చిన వస్తువులన్నిటికీ ఆ మూల పదార్థమే స్వరూపం. బంగారం నుంచి తయారైన ఆభరణాలన్నిటికీ బంగారమే గదా స్వరూపం. అది కటకంలో ఉన్నది. కేయూరంలో ఉన్నది. కుండలంలో ఉన్నది. కిరీటంలో ఉన్నది. సామ్ములన్నింటిలోనూ పరుచుకొని ఉన్నదది. కనుక వాటన్నిటికీ వాటి వాటి ప్రాతిస్వికమైన Individual రూపాలు గాదు స్వరూపం. వ్యస్తమైన ఆ రూపాలన్నిటినీ వ్యాపించిన ఈ సువర్ణమనే సమస్త రూపం. అది స్వరూపమంటే.

ఈ స్వరూపమనేది మనకు కనిపిస్తూన్న ఈ సమస్త ప్రపంచానికీ మనతో సహా ఆ ఈశ్వర చైతన్యమేనని గదా నిరూపించాము తత్త్వ సాహిత్యంలో. మరి ఈ భౌతిక ప్రపంచానికే అయినప్పడీ ప్రపంచాన్ని చూచి రూపుదిద్దుకొన్న ఆ సాహిత్య ప్రపంచానికి మాత్రమెలా కాకపోతుంది. దానికీ ఆ పరిశుద్ధ చైతన్యమే స్వరూపమయి తీరాలి తప్పదు. కాగా ఆ చైతన్యమనేది మనమింతకు ముందు చెప్పకొన్న వైయక్తిక సామాజిక రాజకీయాది రంగాల మాదిరి పరిమితం కాదు. ఎందుకంటే అది సాపేక్షమైనది కాదు గనుక. సమస్త దేశ కాల వస్తువులనూ వ్యాపించినది గనుక నిరపేక్షమైన పదార్థమది. నిరపేక్ష మెప్పడయిందో అప్పడది పరిచ్ఛిన్నం కావటానికి లేదు. అంచేత మిగతా వాటి మాదిరి గాక అపరిచ్ఛిన్నమూ పరిపూర్ణమూ అయినది దాని క్షేత్రం.

ఇలాటి పరిపూర్ణమైనది గనుకనే తాత్త్వికమైన దృష్టి అన్ని దృష్టులకన్నా ఉత్కృష్టమైనది. అది అన్ని దృష్టులనూ, వాటి మూలంగా ఏర్పడిన అన్ని సృష్టులనూ కూడా వ్యాపిస్తుంది. అది స్వరూపమైతే ఇవన్నీ దాని విభూతి, బంగారం స్వరూపమైతే కటక కుండలాదులన్నీ దాని విభూతి అయినట్టే ఇదంతా దాని విభూతే. ఇదంటే ఈ కనిపించే ప్రపంచమనే గాదు. దీనితో పాటు దీనికి ప్రతిరూపమైన సాహిత్య ప్రపంచం కూడా దాని విభూతే కావలసి ఉంది. అంటే ఏమన్నమాట. శ్రుతి స్మృతి పురాణేతి హాస కావ్య నాటకాఖ్యాన కాఖ్యాయికాది శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న ఈ మన సాహిత్యంలో కథలనీ, పాత్రలనీ, సన్నివేశాలనీ, వర్ణనలనీ, భావాలనీ, ఉద్దీపనలనీ ఏయే అంశాలే కరువు పెడుతున్నానో అవన్నీ ఈ విశ్వానికంతా మూల భూతమైన ఆ చైతన్యం తాలూకు మూర్తులే కళలే.

"సర్వమున్నతని దివ్య కళామయ"మన్నట్టు సర్వ ప్రపంచంతోపాటు సర్వ సాహిత్య సామగ్రి దాని వివిధ రూపాలే. అదే ఆయా కథలుగా పాత్రలుగా సుఖదుఃఖాదిభావాలుగా అవతారమెత్తి మనకనేక భంగిమలలో అక్షర రూపంగా సాక్షాత్కరిస్తున్నది. అంతా తదాత్మకమే తన్మయమే.

ఇది ఏమిటి ఎలాగా అని ఆశ్చర్యపోనక్కరలేదు. అమూర్తమైన కవి భావనే మూర్తీభవిస్తే గదా దాన్ని కావ్యమన్నారు. అమూర్త దశలో అది ఒక భావం. కేవలమతని దృష్టే అది. ఆ దృష్టితో అతడు సృష్టి చేస్తాడు. అయితే అతడికి బాహ్యంగా ఒక ప్రపంచమంటూ ఉంది కాబట్టి అందులోని వ్యక్తులకూ, వారి భావాలకూ, జీవితాలకూ, ప్రతిరూపంగా ఒక శాబ్దికమైన చిత్రాన్ని నిర్మించుకొంటాడు. అది తనకు కలిగిన భావనా లేక దృష్టిని బట్టి రూపుదిద్దుకొంటుంది. అందుకే చెప్పారు మన అలంకారికులు "అపారే కావ్య సంసారే, కవిరేవ ప్రజాపతిः యథాస్మైరోచతే విశ్వమ్, తథేదమ్ పరివర్తతే" అని ప్రపంచానికి సృష్టికర్త పరమేష్ఠి ఒకడెలా ఉన్నాడో అలాగే కావ్య ప్రపంచానికి కూడా ఒకడున్నాడు సృష్టికర్త. వాడే కవి. పోతే ఆ సృష్టికర్త ఇచ్ఛానుసారంగా ఆ సృష్టి ఎలా జరిగిందో ఈ కవి అనే సృష్టికర్త భావానికనుగుణంగా ఈ కావ్యసృష్టి కూడా చిత్ర విచిత్రంగా పరిణమిస్తుందట.

సరిగా ఇది "మయాధ్యక్షేణ ప్రకృతి, స్సూయతే సచరాచరమ్, హేతునా ఽనేన కౌంతేయ జగద్విపరివర్తతే" అనే గీతా శ్లోకానికి తోబుట్టువుగా కనిపిస్తున్నది. అక్కడా పరివర్తతే ఇక్కడా పరివర్తతే అని ఒకే క్రియా పదం ప్రయోగించబడింది. ప్రకృతి అనేది పారమేశ్వరమైన శక్తి. పరమేశ్వరుడు స్వరూపతः ఉదాసీనుడే అయినా, తన ఇచ్ఛాశక్తిని బట్టి ఈ జగత్తునంతా సృష్టి చేస్తాడు. అది ఆయన సంకల్పానికనుగుణంగా నడుస్తూ పోతుందట. అలాగే సాహిత్య జగద్వ్యవహారం కూడా కవి భావనా శక్తి కనుగుణంగానే సాగుతుంది. అయితే ఒక్కటే తేడా దానికీ దీనికీ. అదేమిటంటే పరమేశ్వరుడు నిర్మించిన ఈ భౌతిక జగత్తు "నిరుపాదాన సంభార, మభిత్తావేవ తన్వతే" అన్నట్టు ఏ సామగ్రీ చేతికి తీసుకోకుండా ఏ ఆధారమూ లేకుండానే నిర్మించాడు. పోతే సాహిత్య జగద్విషయమలా కాదు. లోకంలో సిద్ధంగా ఉన్న వస్తు సామగ్రిని చూచి దాని సహాయంతో

నిర్మిస్తాడు కవి. అయితే సిద్ధంగా ఉన్నా ఆ సిద్ధమని చెప్పే జగత్సామగ్రి పరమేష్ఠి భావనా కల్పితమే గాని యథార్థం కాదు గదా. అలాంటప్పుడు దాని నాలంబనం చేసుకొని కవి తన భావనా బలంతో కల్పించిన ఈ సాహిత్య జగత్తు మాత్రం వాస్తవమెలా కాగలదు. అది ఒక మారు కాల్పనికమైతే ఇది రెండు మార్లు కాల్పనికం Twice removed from truth.

దీనిని బట్టి చూస్తే సాహిత్యమని ఊరక గంతులు వేయనక్కరలేదు మనం. అది ఏదో బంగారం, దానికేదో ప్రత్యేకమైన స్థాయి కల్పించాలని కంగారు పడనక్కరలేదు. వాస్తవమైన పదార్థం కాదు. కవి భావన, అతడి దృష్టి ఏదుందో అది వాస్తవం. ఆ దృష్టి కూడా ఎంత గొప్పదైతే అంత గొప్ప వాస్తవం. గొప్ప తనమెప్పుడు వస్తుంది. అంతకంతకు ఎత్తుకుపోయే కొద్దీ గొప్పదవుతుంది దృష్టి. అది ఇంతకు ముందు వర్ణించిన వైయక్తిక సామాజిక రాజకీయ నైతికాది రంగాలేవైనా కావచ్చు. వాటిలో ఏ స్థాయి కెదిగి చూస్తాడో కవి ఆ మేరకే చూడగలుగుతుందతని దృష్టి. అక్కడికదే తనకు వాస్తవం. దాని కనుగుణమైన సృష్టే చేసే చూపుతాడు. అది ఆ మాత్రమైన ప్రయోజనాన్నే మనకందిస్తుంది.

కాగా ఈ భావనా యాత్రలో పోవలసినంత ఎత్తులకు పోయి చూడవలసిన స్థాయి ఒకటున్నది. ఒకటి మాత్రమే ఉన్నది. అదే ఆధ్యాత్మికమైన, తత్త్వికమైన భూమిక. అది సర్వమూ ఏకమని చూచే చూపు కాబట్టి అన్నిటికన్నా ఆఖరు భూమిక. కవి ఆ భూమిక నందుకొనేసరికి నిజమైన కవి అవుతాడు. అతడి భావనా అసలైన భావనే అవుతుంది. ఎందుకంటే పరిపూర్ణమైన తత్త్వాన్నే భావిస్తాడతడు. అలాగే దర్శిస్తాడు. ఇలాంటి సమగ్రమైన దర్శనం కలవాడే కవి. "క్రాంత దర్శీకవిః " అన్నారు. దేశకాలాదులైన అవధుల నతిక్రమించి చూడగలగటమే క్రాంత దర్శనం. అలా దర్శించే వాడికే ఋషి అని పేరు. "ఋ" అనే ధాతువుకు గతి అనీ దర్శనమనీ అర్థం. దర్శించబడేది గనుకనే సత్యాన్ని ఋతమని కూడా వ్యవహరించారు. ఇలాంటి ద్రష్టలే ఋషులంటే. కవి అనే మాట ఈ ఋషి అనే మాటకు పర్యాయమే. కనుకనే "నా నృషిః కురుతే కావ్య"మని నానుడి. ఋషికానివాడు కవి కూడా కాలేడు. అంటే ద్రష్ట Visionary అయిన వాడే కవి వాడు సృష్టించిందే కావ్యమని భావం.

Brahmasri Vaddiraju Venkata Subba Rao
Vaddiraju Srinivasa Rao
www.vaddiraju.in

అయితే ఈ దృష్టి Imagination సృష్టి Creation ఆయా భూమికలలో కూడా జరుగుతూనే వస్తున్నది. వారూ ఆయా రంగాలలో భావన చేస్తూనే ఉన్నారు. వివిధ సాహిత్య ప్రక్రియలను సృష్టిస్తూనే ఉన్నారు. తద్వారా లోకాని కుపదేశిస్తూనే ఉన్నారు. కాని దాని ఫలం ముందు పేర్కొన్నట్టు సాపేక్షమే. పాక్షికమే. నిరపేక్షమూ అనంతమూ అయిన ప్రయోజన సిద్ధి వీటిలో దేనిలోనూ ఆశించలేము. అలాటి సిద్ధి కావాలంటే దానికొక్క, తాత్త్వికమైన దృష్టి తదనుసారిగా చేసే సాహిత్య సృష్టే శరణ్యం. అది ఒక్కటే అయితే మిగతా సాహిత్యమంతా ఏమి కావాలి. దాని గతేమిటని ప్రశ్నించవచ్చు. అది కూడా ఆయా లౌకిక రంగాలలో ప్రయాణం సాగిస్తున్నా, ఎక్కడో ఒక చోట చివరికి తత్త్వసాగరంలో పోయి కలిసినప్పడే చరితార్థమవు తుంది. అప్పడే అది మనకుపాదేయం కూడా అవుతుంది. అంతేగాని ఆది మధ్యాంతాలలో ఎక్కడా కూడా తాత్త్వికమైన స్పర్శ ఏ మాత్రమూ లేని సాహిత్యానికసలు విలువా లేదు. అది సాహిత్యమూ కాదు. ఒకవేళ అది ఎంతో కొంత సౌందర్యమూ, ప్రబోధమూ సాధిస్తే సాధించి ఉండవచ్చు. కాదనటంలేదు. కాని అదంతా మనకు తాత్త్విక దృష్టిలోనే కలిసి వస్తుంది. "యావానర్థ ఉదపానే" అనే గీతా శ్లోకాన్ని గుర్తు చేసుకొంటే సరిపోతుంది. ఒక నదిలో స్నానం చేస్తే చాలు. తటాకంలో చేయనక్కరలేదు. సముద్రంలోనే చేయగలిగితే ఇక నది కూడా అక్కరలేదు. నదీనామ్ సాగరో గతిః - అన్నట్టు సకల నదులూ సముద్రంలోనే లీనమయి ఉన్నాయి గదా. అలాగే సకల సాహిత్య ప్రక్రియలూ, వాటి ప్రయోజనాలు, ఇవన్నీ గంగా యమునా నది తరంగిణులైతే, తాత్త్విక దృష్టితో చేసిన సాహిత్య సృష్టి ఒక మహా సముద్రం. అందులోనే అవన్నీ అంతర్భవించటంలో ఆశ్చర్యమేముంది.

అంచేత ఇంతకూ చెప్పవచ్చేదేమంటే బుద్ధి పూర్వకంగా నైనా సరే అబుద్ధి పూర్వకంగానైనా సరే తాత్త్విక దృష్టితో చేసిన సాహిత్య సృష్టే సృష్టి. అదే కలకాలమూ నిలుస్తుంది. అబుద్ధి పూర్వకమైతే ఎలా నిలుస్తుందని ఆశంకించరాదు. కవి ఉద్దేశించకపోయినా అతడే ఉద్దేశంతో వ్రాసినా ఆ వ్రాతలో అది అంతర్వాహినిగా చోటు చేసుకొనే ఉంటుంది. చివరకందులోనే పర్యవసిస్తుంది. ఆనాటి పురాణాలే కాదు.

ఈ నాటి నవలలూ, కథానికలూ కూడా దాని పరిధిని దాటి పోలేవు. తత్త్వభావాన్ని తప్పించుకోలేవు. ఎందుచేత, నీవెలాటి కథ వ్రాసినా, ఏ పాత్రలను నన్నివేశాలను సృష్టించినా అందులో మంచి చెడులూ, కష్టసుఖాలూ, రాగద్వేషాలూ ఇలాటి ద్వంద్వాల సంఘర్షణకు చోటు లేకపోదు గదా. అందులో చెడో మంచో ఏదో ఒకటి గదా చివరకు గెలుపొందవలసింది. చెడు గెలిచినట్టు చూపావా ప్రాపంచిక విషయాల అనిత్యత్వాన్ని చాటి వాటిమీద లోకులకు వైరాగ్యం పుట్టించటమే అవుతుంది. మంచి జయించినట్టు చూపావా అన్ని మంచి గుణాలకూ ఆశ్రయమైన ఆ విశ్వ చైతన్యాన్నే గుర్తించి దాని నీడలోనే బ్రతుకుతూ జీవిత గమ్యాన్ని చేరమని చెప్పినట్టవుతుంది. ఏది చెప్పినా అది తత్త్వ పర్యవసాయి అయిన మాటే.

అసలు రహస్యమేమంటే తత్త్వమనేది స్వరూపమైతే సాహిత్యమంతా దాని విభూతి అని గదా చెప్పాము. స్వరూపమే సత్యంగాని విభూతి అనేది సత్యం కాదు. అది దాని ఆభాస మాత్రమే. ఒక సువర్ణం నానా విధాభరణాలుగా మారితే అవన్నీ అన్ని నత్యమైన పదార్థాలు కావు. సువర్ణమనేది ఒక్కటే అక్కడ సత్యంగా ఉన్న పదార్థం. తతిమావన్నీ దాని విలాసాలే విభ్రమాలే. అయితే విశేషమేమంటే సువర్ణంలో కనిపించని ఒక అందమూ, సౌందర్యమూ, వీటిలో కనిపిస్తుంది మనకు. దానివల్ల కలగని ఉపయోగం కూడా వీటివల్లనే కలుగుతుంది. అయితే ఈ సౌందర్యమూ, ఉపయోగమూ ఇవి రెండూ ఆ సువర్ణమనే మూలతత్త్వాన్ని వదలకుండానే కలుగుతున్నాయి. ఇదంతా ఆ సువర్ణం తాలూకు వివిధ రూపాల సౌందర్యమే. వివిధ రూపాల ఉపయోగమే. అంటే ఏమన్న మాట. సువర్ణాన్నే అనేక రూపాలలో దర్శిస్తున్నాము. ధరిస్తున్నాము. ఆనందిస్తున్నాము. ఇదే సౌందర్యమంటే అలాగే ఈ ఆభరణాలెంత సుందరంగా ఉన్నా, ఎంత మనకుపయోగపడుతున్నా ఇదంతా ఆ సువర్ణ వికారమే గదా. ఎప్పటికైనా ఆ సువర్ణంగానే గదా వీటికి విలువ, అని వీటి ననుభవిస్తున్నప్పడల్లా ఆ సువర్ణస్ఫూర్తి కలుగుతూనే ఉండాలి మనకు. ఇదే ప్రబోధమంటే.

సాహిత్య సృష్టిలో కూడా మనం చూచే సౌందర్య ప్రబోధాలిలాగేనని అర్థం చేసుకోవలసి ఉంటుంది. కవి భావనే గదా కావ్య రూపం

తాలుస్తుందని చెప్పాము. అది విశ్వవ్యాపి అయిన తాత్త్విక స్థాయిలోనే కలిగినప్పడిక దానికి బాహ్యంగా విశ్వమంటూ ఒకటిలేదు. విశ్వమంతా భావనే. విశ్వతోముఖమైన విశ్వజనీనమైన భావన అది. అది ఏకరూపమైనా సువర్ణం మాదిరి బహురూపాలు ధరించి కటక కుండలాదుల లాగానే బహుముఖంగా దర్శనమిస్తుంది మనకు. సాహిత్యంలో మనం చూచే కథలూ, పాత్రలూ, సన్నివేశాలూ, వర్ణనలూ, రసభావాలూ అన్నీ సువర్ణాభరణ న్యాయంగా ఆ తాత్త్విక దృష్టి ధరిస్తూ పోయే నానావిధాకృతులే. ఉదాత్త గంభీరమైన ఆ భావనే ఆయా పాత్రలుగా భావాలుగా మాటలుగా చేష్టలుగా మూర్తిభవించి అనేక భంగిమలలో కనిపిస్తున్న దనుకోవాలి. అలాటి దృష్టితో చూడాలి మనం. ఒక అద్దాల మహలులో మధ్య నిలుచొని చుట్టూ చూచినట్టు. "నర్తకుని భంగి పెక్కగు మూర్తులతో నెవ్వాడాడు" అన్నట్టు ఒకే తత్త్వం పెక్కు, రూపాలతో గోచరిస్తే అంతకన్నా అందమేముంది సృష్టిలో, స్వరూపంలో అంతర్గతంగా ఉన్న అందం దాని విభూతిలో బయట పడుతుంది. కనుకనే కవి భావనలో కనిపించని సౌందర్యమెప్పడూ తత్కావ్య రచనలో బయటపడేది. ఇదే కావ్య సౌందర్యమంటే.

అలా భాసించే సౌందర్యమంత మాత్రంతో నిలిస్తే మరలా సుఖంలేదు. ఈ కథా పాత్ర సన్నివేశాదులన్నీ మరలా ఏమిటా ఎక్కడివా వీటి గమ్యమేమిటా అని పరామర్శిస్తే చాలు. అవి అంతకంతకూ తమ ప్రత్యేకత్వాన్ని కోలుపోయి అన్నీ కలిసి చివరకా మూలతత్త్వాన్నే మనకు వ్రేలుపెట్టి చూపుతాయి. అందుకోసమే మేమున్నాము. మా సృష్టి అందుకే మా ద్వారా దానినందుకొంటే చాలు అదే మేము మీకు చేయగలిగిన ఉపకారమని మౌనభాషలో వ్యంగ్యంగా మనకొక ప్రబోధమిస్తాయి. అప్పడివన్నీ సత్యం కావు. సత్యాన్ని అడుగడుగునా మనకు జ్ఞాపకం చేసే సంకేతాలు Symbols మాత్రమేనని బోధపడుతుంది. స్వరూపం సత్యమైతే విభూతి అంతా అప్పటికి దాన్ని చేరే ఒక సాధనం Means మాత్రమే నన్న మాట. ఇందులో స్వరూపం విభూతిగా మారటం సౌందర్యమైతే ఈ విభూతి అంతా మరలా ఆ స్వరూపమే నని గ్రహించటం గొప్ప ప్రబోధం మన పాలిటికి.

తత్త్వ సాహిత్యాలకు నడుమ ఉన్న ఈ సమన్వయ రహస్య సూత్రాన్ని గ్రహించి ఆ సూత్రాన్ని వదలకుండా సాహిత్య సృష్టి చేయగలవాడే మహాకవి. దేశ కాల వ్యవధులను దాటిపోయిన చూపుగలవాడు కాబట్టి వాడే మహర్షి. ఇలాటి మహర్షులైన మహాకవులెందరో లేరు లోకంలో. "ద్విత్రాः పంచ షావా" అన్నాడు అలంకారిక మూర్ధన్యుడైన ఆనంద వర్ధనుడు. ఇద్దరో ముగ్గురో, నలుగురో, అయిదుగురో వేళ్లమీద లెక్క పెట్టవచ్చు. వారిని. ఒక వ్యాసుడు, ఒక వాల్మీకి, ఒక కాళిదాసు వీరంతా ఋషిత్వమూ, కవిత్వమూ రెండూ అలవడిన మహనీయులు. దృష్టిచేత ఋషులైతే, సృష్టిచేత కవులు. వారి దృష్టి ఆయా దేశకాలాలకు గాని, పరిస్థితులకు గాని, ఒకానొక చరిత్రకు సమాజానికి గాని పరిమితమైనది కాదు. సార్వకాలికమూ, సార్వజనికమూ అయిన విశాల గంభీరమైన దృష్టి. వ్యాస భగవానుని మహాభారతాన్ని వర్ణిస్తూ భట్టబాణుడిలా అంటాడు. "కిమ్ కవేస్తస్య కావ్యేన - సర్వ వృత్తాంతగామినీ కథేవ భారతీ యస్య, నవ్యాప్నోతి జగత్త్రయమ్" ఆ కవి దేనికి ఆ కావ్యం దేనికి మహాభారత కథలాగా మూడు లోకాలూ వ్యాపించకపోతే.

అక్షరాలా యథార్థ మీ మాట. తత్త్వమనేది సర్వవ్యాపకం గదా. దాని వివర్తమే గదా ఈ సర్వ ప్రపంచమూ. కాబట్టి తాత్త్వికుడైన కవి భావన కూడా ఈ సమస్త సృష్టినీ వ్యాపించి తీరాలి తప్పదు. అలా వ్యాపించటం మూలాన్నే పురాణేతి హాసప్రణేతలైన మహర్షులు జగత్త్రయ వృత్తాంతాన్నీ ఆపోశనం పట్టారు. వారికి విశ్వమంతా కథా వస్తువే. ఇందులో నివసించే ప్రాణులందరూ పాత్రవర్గమే. ఒక మానవులే గాదు పశు, పక్షి, సరీసృప వృక్షలతా, గుల్మాదులు కూడా వారితోపాటు వ్యవహరించే వ్యక్తులే వారి దృష్టికి. ఆ మాటకు వస్తే చేతన ప్రకృతే గాదు. వన నదీ సముద్ర పర్వత సూర్య చంద్ర గ్రహ నక్షత్ర తారాది జడ ప్రకృతి కూడా పిలిస్తే పలుకుతుంది వారికి. పోతే ఇక అత్యుదాత్త భావాల దగ్గరి నుంచీ అతి నికృష్ట భావాలదాకా ఎంతెంత భావ వైచిత్రి ఉందో అదంతా వారికి వర్ణనీయమే ఏదీ వర్జనీయం కాదు.

అలాగైతే ఈ మానవులకు వారు చేసే ప్రబోధమేమిటి. అంత వైషమ్యంలో మనం చూచే సౌందర్యమేమిటి. అదే చిత్రం. సృష్టిలో ఇది

సుందరమది అసుందరమని లేదు. "రమ్యమ్ జుగుప్సిత ముదార మథాపి నీచ"మన్నారు పెద్దలు. తత్తద్దేశ కాల వ్యక్తి వయోపస్థాదులను బట్టి ఎక్కడ ఏది ఎప్పడెలా ఉండాలో అక్కడ అదే సుందరం. అలా లేకపోతే అదే అసుందరం. సర్వత్రా ఆ విశ్వ చైతన్య మనుస్యూతమయ్యే ఉంది. ఆ అంత స్సూత్రాన్ని పట్టుకొని చూచినప్పడంతా రమణీయమే. ఏదీ హేయం కానేరదు. ఒక దేవతల సృష్టి ఎలాటిదో దానవుల సృష్టి అలాటిదే. రెండూ వాటి వాటి స్థానాలలో అవి సుందరమే. ప్రబోధకమే. ప్రబోధకమెలా అయిందని అడుగరాదు. మంచి చెడ్డలను వర్ణించటంలో కూడా వారు లోకోద్ధరణమే లక్ష్యంగా పెట్టుకొన్నారు. "వినేయ జన హితార్థమేవ నాటకాది గోష్ఠిలోకే ముని భి రవ తారితా" అని కావ్య విమర్శకుల సూక్తి. కావ్య నాటకాది గోష్ఠి కూడా భరతాది మహర్షులు లోకహితార్థమే కావించారట. శివేతర క్షతి అని, విశ్వశ్రేయస్సని, జగద్ధితమని, లోక కళ్యాణమని, మహాకవులు వాకొనటంలో ఇదే ఆంతర్యం. సూటిగానో, చాటుగానో దానిని సాధించటమే వారు చేసిన పని. అందులో మంచిని సూటిగా బోధిస్తే చెడ్డను చాటుగా బోధించారు. మంచిని బోధించటం దాని నాచరించమని చెప్పటానికి. చెడ్డను బోధించటం దాని నుంచి వైదొలగమని చాటటానికి. "రామాదివద్వర్తి తవ్యమ్ - న రావణాదివ" త్తని గదా ఆభాణకం.

ఈ లోకహిత కామనతోనే వ్యాస వాల్మీకి ప్రభృతులు ఉచ్ఛావచంగా పాత్రలను సృష్టించటం. జుగుప్సాకరంగా ఉద్వేజకంగా కనిపిస్తున్నా ఆయా సన్నివేశాలు కల్పించటం. మహర్షుల అప్సరసల, ప్రజాపతుల కోపతాప జారచోరాది వ్యవహారమంతా ఇందుకే. తద్ద్వారా ఎన్నో హెచ్చరికలు లోకానికి చేయటమే వారి ఉద్దేశ్యం. కథ గాదిక్కడ మనం చూడవలసింది. పాత్రలంతకన్నా కావు. ఈ కథలూ, పాత్రలూ వారి ప్రవృత్తులూ, ఇదంతా ఒక అర్థవాదం Allegory. ఒక సంకేతం Symbolism ప్రపంచంలాగా సాహిత్య ప్రపంచం కూడా సంకేతమేనని గదా చెప్పాము. దానిలోలాగా దీనిలో కూడా ఆది మధ్యాంతాలలో అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉన్నదా విశ్వ చైతన్య ధారే. దానిని మరచిపోకుండా మనకడుగడుగునా స్ఫురింపజేయటానికే ఈ కథలూ, పాత్రలూ,

Brahmasri Vaasa Rao
www.advaitavedanta.in

సన్నివేశాలూ. దాని ఆభాసే ఈ కలాపమంతా. చిత్ర విచిత్రమైన పోకడలతో కనిపించే ఈ పరికరాలన్నింటినీ ఒక ఆలంబనంగా చేసుకొని ఈ బృహద్దర్పణంలో ఆ ఏకైకమైన విశ్వ సత్యాన్ని వీక్షించి ఆ వెలుగులో మీ జీవితాలు సరిదిద్దుకొమని చెప్పటానికే మహర్షులుచేసిన ఈ మంచి చెడ్డల గారడీ అంతా. ఇందులో ముందు చెప్పినట్టు మంచి అనులోమంగా చేసిన బోధ అయితే చెడ్డ ప్రతిలోమంగా చేసిన బోధ.

ఇలాంటివీ వారు సాధించిన సౌందర్య ప్రబోధాలు Beauty and Sublimity ఇవి తమ అపారమైన సాహితీ సృష్టి ద్వారా అప్రయత్నంగా అతిసహజంగా సాధించి చూపారు వ్యాస వాల్మీకి ప్రభృతులైన మహర్షులు. వారి అడుగుజాడలలోనే పయనిస్తూ అంత విశాలమైన సృష్టి గాకున్నా చాలా వరకా కోవనందుకొని మనకలాంటి విజ్ఞాన సంస్కారాలే అందించారు కాళిదాసాది మహాకవులు. అపారమైన ఆసౌందర్య ప్రబోధాలనంతగా అందుకోలేక తత్తన్మాత్ర సంతృప్తులయ్యారు ఆ తరువాతి కాలంలో వచ్చిన కవులు, ఆ పిమ్మట కాలానుగుణంగా విలువలు దిగజారి దానికి కూడా నోచుకోని కవులు పరభాగ్యోప జీవులయి బ్రతుకుతూ వచ్చారు. ఈ ప్రకారంగా పురాణ కవులకున్న ఏ ఉదాత్త విశాలమైన దృష్టి ఉందో అది రాగా రాగా తరువాతి కవులందరికీ తగ్గుతూ వచ్చింది. కనుకనే వారు మహాకవులైతే వీరంతా కేవలం కవులు మాత్రమే. అదైనా ఆ దృష్టి కొంతకు కొంత ఉండటం మూలాన్నే. అసలే దానివాసన లేకపోతే వాడు కవి శబ్దవాచ్యుడే కాడు. ఒక వ్రాయసకాడు మాత్రమే.

మొత్తం మీద అలాటి ఒక మహాకవీ, మహర్షీ కావించిన వరమాద్భుతమైన సాహిత్య సృష్టి ఈ భాగవతం. తత్త్వ పారమ్యాన్ని రమ్యమైన కథా వస్తువుతో, పాత్రలతో వారి ప్రవృత్తులతో మేళవించి ఒక మధురమైన రసాయనంలాగా అందించాడు మనకు బాదరాయణుడు. వెనుక చెప్పినట్టు కథలూ, వర్ణనలూ, కావాయన వివక్షితం Intension. "విజ్ఞాన వైరాగ్య వివక్షయా" అని ఆయనే స్వయంగా చాటాడు లోకానికి. అనిత్యమూ, అసుఖమూ అయిన ఈ బాహ్య జగద్వ్యవహారం నుంచి విముఖుణ్ణి చేసి అంతకంతకు మానవుణ్ణి పరమపదంలో పట్టాభిషిక్తుణ్ణి చేయాలనే మహర్షి సంకల్పం. అందుకోసమల్లినదే ఈ కథాజాలమంతా.

కనుకనే మనం కూడా ఈ నన్నివేశమేమిటిలా ఉంది. ఈ వ్యక్తి జీవితమేమిటింత అశ్లీలం ఇదేమి టింత అనహజం అని ఆక్షేపణ చేయరాదు. అలాగే ఈ కల్పన చూడు. ఎంత బాగుందో, ఈ వర్ణన చూడు, ఎంత మనోజ్ఞమో అని వంది మాగధులలాగా కైవారమూ చేయరాదు. ఇదంతా అకించిత్కరమూ, అనభిప్రేతమూ మహర్షికి. లోకానికి హితా హిత వివేక జ్ఞానముపదేశించటానికిది ఒక వ్యాజం మాత్రమే Pretext నని గదా పేర్కొన్నాము. అది ఆయన చూపయినప్పడా చూపు సడలకుండానే చూడాలి మనం కూడా ఈ ద్వాదశస్కంధ సమ్మితమైన పురాణ సంహితనంతా. అలాటి పావనోదారమైన చూపుతోనే చూచి నేనీ పురాణ హృదయాన్ని ఆవిష్కరించటానికి నా శాయశక్తులా ప్రయత్నించాను. హరివంశాన్ని వ్యాఖ్యానిస్తూ నీల కంఠుడొక భేషైన మాట అన్నాడు.

టీకాంత రాణీందు రవి ప్రభాణి, బాహ్యార్థ రత్నాని చకాసయంతు అంతర్నిగూఢార్థచయ ప్రకాశే, దీపఃక్షమో భారత మందిరే ఽస్మిన్ బాహ్యార్థాలను మాత్రమే బయట పెట్టే వ్యాఖ్యానాలు చాలా ఉన్నాయి లోకంలో. కాని నా వ్యాఖ్యానమలాంటిది కాదు. ఇది అంతరాంతరాల్లో దాగి ఉన్న భావ రత్నాలను ప్రకాశింపజేసే భావదీపమని చాటుతాడు. అంత పెద్దరికం నాకుందని కాదుగాని నేనూ అలాటి మేధాసంపన్నుల మార్గంలో ఆలోచన సాగిస్తూ చేసిన నిర్మాణమిది. నిజానికి నేను గాదీ సామ్రాజ్య నిర్మాతను. నా హృదయాంతరాళంలో నిత్యమూ చోటు చేసుకొని ఉన్న ఆ శ్రీధర నీలకంఠ పోతనాది పురాణ వ్యాఖ్యాతలే. వారి కరుణా కటాక్ష వీక్షాబల నిర్మితమే ఈ భాగవత మహా సామ్రాజ్యం. పోతన మహాకవి చెప్పినట్టు మనమంతా నిజమైన రసిక భావ విదులమైతే ఆ సామ్రాజ్య పదవిని తప్పకుండా అందుకోగలమని హామీ ఇస్తున్నాను.

Yallamraju Srinivasa Rao
Brahmasri Vaddiraju Venkata Subbaiah
www.advaitavedanta.in

1. పురాణములు - వాటి విశిష్టత

సృష్టిలో మానవుడొక్కడే బుద్ధి జీవి. దాని బలంతో అతడు శోధించి కూడబెట్టిన జ్ఞాన ధనమింతా అంతా గాదు. అది అనంతమైనది. నాటి శ్రుతుల దగ్గరి నుంచీ నేటి కావ్యాలదాకా విస్తరించి ఉన్న వాఙ్మయమే ఆ ధనం. శాఖోపశాఖలుగా కనిపించే ఈ వాఙ్మయానికంతటికీ మూలం మాత్రమాశ్రుతి చతుష్టయమే. ఋగ్యజు స్సామాథర్వణాలనే ఆ నాలుగు శ్రుతులకూ అపౌరుషేయమని అభిజ్ఞులు పెట్టిన పేరు. పురుష బుద్ధిజన్యం కానిదేదో అది అపౌరుషేయం. బుద్ధి జన్యం కాకుండానే ఎలా అవతరించిందని ఆశ్చర్య పడనక్కరలేదు. బుద్ధి అనేది రెండు విధాలు. ఒకటి ప్రాకృతం. మరొకటి సంస్కృతం. ప్రకృతి గుణాలకు లోబడి ఆ మేరకే నడిచేది ప్రాకృతం. ప్రస్తుతం మన బోంట్లకున్న బుద్ధులన్నీ ఇలాంటివే. మనవే గాదు. మనలో గొప్ప కళాకారులూ-శాస్త్రకారులూ అనుకొన్న పెద్దల బుద్ధులు కూడా ప్రాకృతాలే. ఎందుకంటే ఏ మేధావంతుడి కెలాటి ఆలోచన వచ్చినా అది పాంచ భౌతికమైన పరిధి నతిక్రమించి పోయేదికాదు.

అలా పోగలిగతే ఇక అది ప్రాకృతం కాదు. అప్పుడా బుద్ధికి సంస్కృతమని పేరు. ఇది గుణాతీతమైనది. కాబట్టి దానికి త్రిగుణాత్మకమైన సృష్టి రహస్యమంతా కరతలామలకంగా గోచరిస్తుంది. ఒక పట్టణమెంత ఉందో ఎలా ఉందో చూడాలంటే మన మావీధీ, ఈ వీధీ తిరుగుతూ పోతే సుఖంలేదు. దగ్గరలో ఉండే ఒక కొండపైకి ఎక్కిగాని, ఒక విమానంలో కొంత పైకి పోయిగాని, క్రిందికి చూచామంటే సకలమూ మనకు స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే దేశ కాలాదులైన ప్రకృతి గుణాల హద్దులలో మెలగుతూనే ప్రకృతి రహస్యాన్ని భేదించలేము. అలా భేదించి తెలుసుకోవాలంటే ఆ హద్దులను కూడా అతిక్రమించి పోవాలి మన బుద్ధి. అప్పుడది వర్తమానంతో పాటు అతీతా నాగత సత్యాలను కూడా ఆకళించుకోగలదు. దీనికే క్రాంత దర్శనమని వ్యవహారం. ఇలాటి దర్శనం గలవారే మన ప్రాచీనులైన మహర్షులు. వారివి

మనలాంటి ప్రాకృతమైన బుద్ధులు కావు. కాబట్టి ఆ ఎత్తులకు పోయి వారు దర్శించి చెప్పిన విషయమిక పౌరుషేయం కాదు. అపౌరుషేయమే కావలసి ఉంది. అదే ఈ ఋగ్వేదాదికమైన వేద వాఙ్మయం.

అపౌరుషేయమైన ఈ వేదం మనకు బోధించే సత్యాలు రెండు. మొదటిది ధర్మం. రెండవది బ్రహ్మం. ఇవి రెండూ మానవుడి జీవితానికి అన్నివిధాలా వాంఛనీయం. కాబట్టి వీటికి పురుషార్థాలని పేరు వచ్చింది. ఇవిగాక మరి రెండు కూడా ఉన్నాయి పురుషార్థాలు, అర్థం కామమనేవి. అవి జీవిత కాలం వరకేగాని అనంతరం పనికివచ్చేవి కావు. జీవితంలోనే గాక తరువాత కూడా ఉపకరించేవి ముందుదాహరించినవి రెండే. ఇవి ప్రేయస్సైతే అవి మన పాలిటికి శ్రేయస్సు. తాత్కాలికమైన సుఖాన్ని ఇస్తుంది ప్రేయస్సు. శ్రేయస్సు శాశ్వతికమైన సుఖాన్నే ప్రసాదిస్తుంది. అయితే మనమూ మన జీవితమూ, రెండూ శాశ్వతం కావే. అనుభవించే సుఖం శాశ్వతమెలా కాగలదని ప్రశ్న రావచ్చు. జీవితమంటే మనకు కనిపించే ఈ వర్తమాన జీవితమేగాదు. దీనికి ముందూ వెనకా కూడా ఉంది జీవితం. దాననుభవించటానికి జీవులమైన మనమూ ఉన్నాము. ఇటూ అటూ లేకుండా ఏదీగానీ మధ్యలో మాత్రమే ఉండబోదు. ఉన్నదంటే అంతకు ముందది ఏమిటి – ఆ తరువాత ఏమిటని ప్రశ్న వస్తుంది. ఏదీకాదంటే అభావంలో నుంచి వచ్చి అది మరలా అభావంలోనికి పోయిందని చెప్పవలసివస్తుంది. అది ఆధ్యాత్మికం దేవుడెఱుగు ఆధి భౌతిక శాస్త్రానికే విరుద్ధం. కాబట్టి దేహానికతిరిక్తంగా జీవుడూ, జన్మ కతిరిక్తంగా జన్మాంతరమూ, లోకాని కతిరిక్తంగా లోకాంతరమూ ఒప్పుకోక తప్పదు. ఒప్పు కొన్నప్పుడంతకంతకు ఉత్తమమైన జన్మ ఎత్తి ఉత్తమ లోకాలలో ఉత్తమ భోగాలను భవించాలంటే జీవుడు శాస్త్రనిషిద్ధమైన అధర్మాన్ని దూరం చేసుకొని విహితమైన ధర్మాన్ని మాత్రమే పాటిస్తూ పోవాలి. దానివల్ల అభ్యుదయమనే ఫలితం కలుగుతుంది మానవుడికి. ఇదే ధర్మమనే పురుషార్థం మూలంగా మనకు లభించే శ్రేయస్సు.

పోతే శ్రేయస్సైనా ఇది కూడా సాపేక్షమేగాని నిరపేక్షమైన శ్రేయస్సుగాదు. తరువాత ఏమిటనే ప్రశ్నకు చోటిచ్చినంతవరకూ అది సాపేక్షమే. ఆ ప్రశ్న భేదమనేది ఉన్నపుడే ఏర్పడుతుంది. జీవుడూ, శరీరమూ, జన్మా కర్మా, లోకమూ, లోకాంతరమూ అన్నప్పుడే అది భేదం. ఇలాంటి భేదమున్నదాకా తన్మూలంగా కలిగే శ్రేయస్సు

కూడా సాపేక్షమే కావాలి గాని నిరపేక్షమెలా అవుతుంది. మరి నిరపేక్షమైన శ్రేయఃఫలమే కావాలంటే జీవ జగదభిన్నమైన ఈశ్వరతత్త్వాన్నే పట్టుకోవాలి మనం. అదీ మనకు పరోక్షంగా కాక ఆత్మరూపంగానే Subjective భావించాలి. దానికే బ్రహ్మమని పేరు. అది ఇక పరిపూర్ణమైన అభేద దృష్టి కాబట్టి అపేక్ష అనే భావానికక్కడ తావులేదు. అంటే నిరపేక్షమని అర్థం. నిరపేక్షమైతే తన్నిమిత్తంగా కలిగే శ్రేయస్సుకూడా శాశ్వతం కాక తప్పదు. ఇంతకు మించిన శ్రేయస్సు మరొకటి సృష్టిలోనేలేదు కనుక దీనిని పెద్దలు నిశ్శ్రేయసమని Summum Bonum పేర్కొన్నారు. మరి సమస్తమైన భేద ప్రపంచంనుంచీ వైదొలగటం గనుక దీనికి ముక్తి మోక్షమని కూడా నామాంతర మేర్పడింది.

మొత్తంమీద అటు ధర్మమూ, ఇటు బ్రహ్మమూ, రెండూ మానవుడికి శ్రేయోదాయకాలు కాబట్టి ఇవి రెండే వాస్తవంలో పురుషార్థాలు. ఇహంలోనే గాక పరంలోనూ సుఖప్రదాలివి. ఇదుగో వీటి రెండింటి స్వరూపాన్ని మానవులకు బోధించడమే శాస్త్ర ప్రయోజనం. అసలు శాస్త్రమనేది అందుకోసమే అవతరించింది. శాస్తీతి శాస్త్రమన్నారు. శాసించేదేదో అది శాస్త్రం. ఇది నీకు హితం-దీనినాచరించు - బాగుపడతావని ఉపదేశించటమే శాసనం. అది ధర్మ బ్రహ్మముల విషయంలోనైతేనే చెల్లుతుంది. అర్థకామాల విషయంలోనైతే అవసరం లేదు. అర్థ కామాలనేవి కేవలమైహికానికి చెందినవి. లోక వ్యవహారం వల్లనే సిద్ధిస్తున్నది వాటి జ్ఞానం. దానికి క్రొత్తగా ఒక శాస్త్రం దేనికి. పోతే మన చక్షురాదికమైన ప్రత్యక్ష ప్రమాణానికి మనస్సనే అనుమానానికీ కూడా అందని అతీంద్రియమైన వారెండు పురుషార్థాలే కాబట్టి వాటి నిదమిత్థమని బయట పెట్టడానికే మూడవదైన శాస్త్ర ప్రమాణమావశ్యక మయింది. శాస్త్రమంటే ఇక్కడ మన తర్క వ్యాకరణ వైద్యజ్యోతిషాదులు కావు. అవీ శాస్త్రాలే ఒక విధంగా కాని శాస్త్రమనే మాట ఇక్కడ పారిభాషికం Technical. దానిని బట్టి చతుర్విధమైన వేద వాఙ్మయానికే ఇక్కడ శాస్త్రమని వ్యవహారం.

అంతేకాదు. అపౌరుషేయమైన శ్రుతివరకే గాక ఈ వ్యవహారం పౌరుషేయమైన స్మృతుల వరకూ మనం పొడగించవచ్చు. శ్రుతులెంతో స్మృతులంతే. శ్రుతులు ప్రతిపాదించిన అర్థాన్నే స్మృతులు కూడా అనువదిస్తాయి. అది అపౌరుషేయమైతే ఇది పౌరుషేయం. అంతే తేడా. స్మరించేదేదో అది స్మృతి. స్మరించట మంటేనే

అది మనోధర్మం కాబట్టి పౌరుషేయమని వేరుగా చెప్పబనిలేదు. శ్రుతి ప్రతిపాదితమైన ధర్మమోక్షాల స్వరూపాన్నే తరువాత స్మృతికారులైన మను యాజ్ఞవల్క్యాదులు తమ మనస్సనే మందరం పెట్టి మథించారు.

అందులో సూక్ష్మంగా సంగ్రహంగా చెప్పిన ధర్మాలనే మానవుల వర్ణాశ్రమ వయోవస్థాదుల కనుగుణంగా విభజించి వారిదైనందిన జీవితానికి పనికి వచ్చేలాగా సవరించి వ్యాఖ్యానిస్తూ వచ్చారు వారు. వీటికి ధర్మ శాస్త్రమని కూడా నామాంతరం. ఇవి కొన్ని లోక ధర్మాలు – కొన్ని వ్యక్తి ధర్మాలు – కొన్ని గృహస్థ ధర్మాలు – కొన్ని సమాజ ధర్మాలు. ఒకటిగాదు. అసంఖ్యాకంగా ఉన్నాయి. అందులోనూ ఒకటి అభ్యుదయ ఫలమిచ్చే ప్రవృత్తి మార్గమైతే ఇంకొకటి నిశ్రేయస ఫలమిచ్చే నివృత్తి మార్గం. ఈ రెండు ప్రధానమైన ప్రణాళికలలో ప్రవహిస్తూ పోతాయి సకల విధములైన స్మృతి ధర్మాలు. ఎలా ఎంత దూరం ప్రవహించినా అది శ్రుతుల అడుగు జాడలలోనే. కాబట్టి శ్రుతుల మాదిరి స్మృతులు కూడా శాస్త్రమే మన పాలిటికి. ఈ శాస్త్ర ప్రమాణం బోధించే ధర్మమోక్షాలనే రెండు పురుషార్థాలనూ పట్టుకొని తదనుగుణంగా జీవితయాత్ర సాగిస్తూనే తాత్కాలికమైన ప్రేయస్సునే గాక సార్వకాలికమైన శ్రేయస్సును – నిశ్రేయసాన్ని కూడా అందుకోటమే ఎప్పటికైనా మానవజన్మ ఎత్తినందుకు సార్థకం.

కానీ ఇందులో వచ్చిన తిరకాసేమంటే శాస్త్రం బోధించే విషయం గొప్పదే సందేహం లేదు. కానీ ఆ బోధించే విధానంలో మనకు నాజూకు కంటే కాఠిన్య మెక్కువగా కనిపిస్తుంది. శాస్త్రమనే పేరు పెట్టటంలోనే ఉంది దాని చెహరా. శాసించేదేదో అది గదా శాస్త్రమని పేర్కొన్నాము. శాసనమంటే ఏమిటి. ఒక పనిచేయమని గాని చేయవద్దని గాని విధి నిషేధాలను మానవులకు నిర్దాక్షిణ్యంగా కుండబద్దలు కొట్టినట్టు చెప్పటమే గదా. అలా చెప్పటంలో ఆకర్షణ ఏ మాత్రమూ ఉండబోదు. ఆకర్షణ లేకపోగా వినే వారికది ఉద్వేజకంగా కూడా కనిపిస్తున్నది. దేశమేలే ప్రభువుల శాసనం లాంటిదది. ప్రభువైన వాడికి మొగమాటం లేదు. ప్రజా క్షేమమే వాడి కర్తవ్యం. అది ధర్మపాలనం మీద ఆధారపడి ఉంటుంది. ప్రతిఒక్కడూ తన ధర్మాన్ని పాటించేటట్టు చూడాలంటే అందులో దయా దాక్షిణ్యాలు పెట్టుకొంటే లాభంలేదు. కఠినంగా శాసించి చెప్పవలసిందే. అలాగే శాస్త్రం కూడా ఇది హేయమిది ఉపాదేయమనే జ్ఞానం మనకు శాసన రూపంగానే అందజేయవలసి

ఉంది. కనుకనే శాస్త్రాన్ని ప్రభు సమ్మితమని వర్ణిస్తారు. అయితే సూటిగా ఘాటుగా విషయాన్ని బోధించటం వల్ల ఆబాల గోపాలమందరూ దాని విషయంలో సుముఖత చూపరు. గణిత శాస్త్రంలో మాదిరి ఏకొంద రుత్తమాధికారులో దానిలో కూడా సారస్యం చూడగలిగిన వారుండవచ్చు. మిగతా మంద మధ్య మాధికారులంతా దానికి చాలావరకు విముఖులే. పూర్తిగా విముఖులైతే శాస్త్రానికి సార్వజనీనత లోపిస్తుంది. అది మొదలు చెడ్డబేరం. అంచేత సర్వులకూ దానియెడల సౌముఖ్యం కలగాలంటే అంతకన్నా సుకుమారమైన మార్గాన్ని అవలంబించాలి. ఏతాదృశ మార్గావలంబన ఫలమే పురాణేతి హాసాల ఆవిర్భావం. శ్రుతిస్మృతి రూపమైన శాస్త్రం ప్రభు సమ్మితమైతే ఇవి రెండూ మిత్ర సమ్మితం. మిత్రుడు ప్రభువు మాదిరి శాసించడు-మనలను దండించడు. అతడికా అధికారం లేదు. అయినా మన మేలు కోరేవాడు కాబట్టి శాసించక పోయినా దగ్గర జేరి సలహా ఇస్తాడు. ఇది నీకు మంచిది-ఇంతకు పూర్వం ఫలానా వాడిలా నడచుకొని బాగుపడ్డాడు-ఇదుగో ఇది నీకే మాత్రమూ మంచిది గాదు. ఈ మార్గంలో నడచి పూర్వం ఫలానా వాడు చెడిపోయాడని దృష్టాంత పూర్వకంగా హితా హితాల నుపదేశిస్తాడు. శాస్త్రమనేది ఇలా దృష్టాంతం చెప్పదు. అది ప్రతిపాద్యమయిన అర్థాన్ని నగ్నంగా బయట పెడుతుంది. అది కేవలం సిద్ధాంతం. దృష్టాంతం చూపనంత వరకు ఎంత సిద్ధాంతం ఏ కరువు పెట్టినా అది మన బుద్ధులకు పరోక్షం. దృష్టాంత బలంతోనే పరోక్షంగా వర్తించే విషయమెప్పుడూ మానవుడి మనోనేత్రానికి ప్రత్యక్ష రూపంగా భాసిస్తుందంటారు భగవత్పాదులు.

పురాణాలూ ఇతిహాసాలూ ఇలా ఒక మిత్రుడి లాగా మనకు ఆయా సత్యాలను దృష్టాంతరూపంగా ఆవిష్కరిస్తూ పోతాయి. ఈ దృష్టాంతాలకే ఆఖ్యానాలనీ, ఆఖ్యాయికలనీ, కథలనీ అనేక నామధేయాలు. కథారూపంగా ఏది చెప్పినా అది శ్రోతల మనసును ఆకర్షిస్తుంది. కారణ మేమంటే మానవుడి జీవితమే ఒక కథ. భౌతిక జగత్తులో జీవితమైతే వాఙ్మయ జగత్తులో అది కథ. ఇక్కడ మానవులైతే అక్కడ వారు పాత్రలు. ఇక్కడ వీరనుభవించే సుఖదుఃఖాది ద్వంద్వాలే అక్కడ రస భావాదులుగా చెలామణీ. ఇంత సన్నిహితంగా బింబానికి ప్రతిబింబంలాగా జతపడటం మూలాన్నే కథా రూపంగా ఏది చెప్పినా మానవుడు అది తన జీవితంగానే

భావించి పరవశుడవుతాడు. అందలి పాత్రలు తానేనని వారి సుఖదుఃఖాలు తనవేనని తాదాత్మ్యం Identity చెందుతాడు. ఈ మనస్తత్వం మానవులకుండటం బాగా కనిపెట్టే క్రాంతదర్శులైన మన మహర్షులు వారి స్థాయికి తగినట్టుగా ఈ పురాణేతి హాసరచన చేయవలసి వచ్చింది.

శాస్త్రాలు కేవలమొక ఉత్తమాధికారులకే గాని మిగతా జనబాహుళ్యానికి కొఱుకుడు పడవు. ఇవి అలా కాక మన జీవితానికింకా సన్నిహితం కాబట్టి పదిమంది మనసునూ ఆకర్షిస్తాయి. ముఖ్యంగా స్త్రీలూ శూద్రులూ ద్విజబంధువులూ – ఈ మూడు వర్గాల వారికీ ప్రభు సమ్మితమైన శాస్త్రం అందని వ్రేమాని పండు. స్వతహాగా అర్థం చేసుకోలేరు. ఒకరు చెప్పినా బోధ పడదు. అదేమిటి. వారూ మనలాంటి మానవులే గదా – మనకున్న హక్కు వారికి లేదా – వారిని మనం చిన్న చూపు చూడటం దేనికని ఆక్షేపించరాదు. గ్రహణశక్తికీ మానవత్వానికీ సంబంధం లేదు. ఎంత గుణవంతుడైనా ఒక విషయాన్ని గ్రహించలేకపోవచ్చు. పనికి రానివాడైనా గ్రహించవచ్చు. సాధారణంగా స్త్రీలు గృహమాత్ర ప్రజ్ఞలు. బయట నలుగురి మధ్యా తిరిగి నాలుగు విషయాలు గ్రహించే అవకాశం వారికి తక్కువ. విశేషించి పూర్వ కాలంలో అసలే లేదని చెప్పవచ్చు. దీనికి తోడు పిల్లలను కనటం పెంచటం – ఇల్లూ వాకిలీ చక్కబెట్టుకోటం – అతిథి అభ్యాగతులకు చేసి పెట్టటం – వీటితోనే జీవితమంతా గడచిపోయేది. అలాంటప్పుడొక ఉపనయనమనీ లేదా అధ్యయనమనీ, సంస్కారమనీ ఇలాటి కలాపాని కవకాశమెక్కడిది.

ఇలాగే శూద్రులు కూడా. శూద్రుడంటే చదువు సంస్కారం లేని మానవుడని అర్థం. జన్మతః ప్రతివాడూ శూద్రుడే. జన్మనా జాయతే శూద్రః అన్నారు. సంస్కారం పొందిన తరువాతనే ద్విజుడనిపించుకొంటాడు. ద్విజ అంటే రెండు జన్మలెత్తిన వాడని శబ్దార్థం. రెండు జన్మలేమిటి. ఒకటి భౌతిక జన్మ. మరొకటి జ్ఞాన జన్మ. ఈ రెండవ జన్మ లేనంతవరకూ వాడికి ఏకజాతి అని పేరు. అంటే ఒకే జన్మగలవాడు. పుట్టినట్టే బ్రతుకుతున్నాడని భావం. అలా బ్రతుకు సాగిస్తూ ఉన్నంతవరకూ వాడు శూద్రుడే. శూద్రుడయినంత వరకూ వాడికి శాస్త్రం చదివి బోధపరుచుకొనే సామర్థ్యముండబోదు.

పోతే ద్విజ బంధువులని కొందరున్నారు. వీరు పురాకృత సుకృతం కొద్దీ ద్విజుల వంశంలో పుట్టి ఉంటారు. కాని ద్విజలక్షణాలకు వేటికీ నోచుకోరు. జాతి మాత్రోపజీవులు వీరు. అంటే ఫలానా వారు మా బంధువులని చెప్పుకోటమే తప్ప వారిలాగా విద్యా వినయాది సంపత్తి లేశమాత్రం కూడా ఆర్జించని వారు. ద్విజ బంధువులంటే ఇలాంటి వారే. వీరికీ అర్హత లేదు శాస్త్రాధ్యయనానికి. ఇలాంటి వారందరికీ పనికి వస్తుందనే మహర్షులీ ఇతాహాస పురాణాలు రచించారు. అలా తగ్గు స్థాయికి దిగి వచ్చి చేసిన రచనలు కాబట్టి అవి ఎలాంటివారికి బోధించినా ఎంతో చక్కగా అవగాహన చేసుకోగలరు. వీటి సహాయం లేకుండా అసలైన శాస్త్రార్థాన్ని సూటిగా బోధించినా మనసుకు పట్టటం కష్టసాధ్యమే. కనుకనే **'ఇతిహాస పురాణాభ్యామ్ వేదాన్ సముప బృంహయేత్త'**న్నారు పెద్దలు. ఇతిహాస పురాణాల తోడ్పాటుతోనే నాలుగు వేదాలనూ బలపరిచి బాగా గట్టి చేసుకోవాలట. అవి లేకపోతే వాటికి పరిపూర్ణత లేదు.

అసలు వేదంలోనే పురాణేతి హాసాల ప్రస్తావన వస్తుంది. మంత్ర బ్రాహ్మణాత్మకం గదా వేదమంటే. అందులో మంత్రమొక అలౌకికమైన విషయాన్ని మనకు బోధిస్తే బ్రాహ్మణం దాని భావాన్ని వివరించి అది అనుష్ఠించే విధానాన్ని మనకు బోధిస్తుంది. ఒక విధంగా మంత్ర వ్యాఖ్యాన రూపాలు బ్రాహ్మణాలు. ఈ బ్రాహ్మణాలనేవి అష్టవిధాలన్నారు సాంప్రదాయికులు. వాటిలో ఇతిహాసం పురాణమనేవి కూడా చోటు చేసుకొని ఉన్నాయి. **"ఊర్వశీ హాప్సరా"** ఇలాటి వాక్యాలు ఇతిహాసాలైతే **"సదేవ సోమ్యేద"** మిత్యాది వచనాలు పురాణాల క్రిందికి వస్తాయన్నారు భాష్యకారులు. కర్మచ్ఛిద్రాలని కొన్ని ఉన్నాయి. ద్వాదశ వార్షికాలని శతవార్షికాలని దీర్ఘకాలిక యాగాలు చేసేటపుడు మధ్య మధ్య విరామాలు కొన్ని ఏర్పడుతుంటాయి. వీటికి కర్మచ్ఛిద్రాలని పేరు. ఆ సమయంలో ఋత్విక్కులు యజమానుడికి కొన్ని కథలూ, గాథలూ చెబుతుంటారు. అవి ఏవో ఉబుసుపోకకు చెప్పే కథలు గావు. ఆ యాగానుష్ఠానానికి అనుకూలమైనవీ దానికి పనికి వచ్చేవే. పారిప్లవాలని కూడా వీటికొక నామధేయముంది.

ఇలాంటి సందర్భాలకు శాస్త్రంలో అర్థవాదమని పేరు. మన పురాణాలూ, ఇతిహాసాలూ, అన్నీ ఇలాంటి అర్థవాదాలే. **విధిశేషోఽర్థవాదః** అన్నారు జైమినుల

వారు. విధి వాక్యంవల్ల గ్రహించిన అర్థానికి పూరకమే అర్థవాదం. అర్థమంటే ధర్మ మోక్షాలనే పురుషార్థాలు.వాటిని విధి వాక్యాలు బోధిస్తుంటే అది శ్రోతల చిత్తానికి బాగా హత్తుకోటాని కుపోద్బలకంగా చెప్పే వాక్యాలీ అర్థవాదాలు. అయితే విధి వాక్యం సూటిగా అర్థాన్ని బోధిస్తే ఇవి దానిమీదా దీనిమీదా నెపం పెట్టి బోధిస్తాయి. కనుక అర్థవాదాలన్నీ కల్పనాకథలు. కల్పనలైనా ఇవి శాస్త్ర ప్రతిపాదితమైన అర్థాన్నే ఏదో ఒక విధంగా వర్ణిస్తున్నాయి. కాబట్టి ఆ దృష్ట్యా మనకుపాదేయమే. వాటి పాటికవి అసత్యమైనా అవి బోధించే పురుషార్థాన్ని బట్టి చూస్తే సత్యమే. విధాన మసత్యమూ, విషయం సత్యమూ. సత్యాని కసత్యమే ఆలంబనమని పెద్దల మాట. **అసత్యే వర్త్మని స్థిత్వా తత స్సత్యమ్ ప్రసాధయేత్.** అసత్యమైన మార్గంలోనే సత్యాన్ని అందుకోవాలి మానవుడు. అప్పుడసత్యమైనా అది మనకు హేయం కాదు. ఉపాదేయమే. దీనిని బట్టి అర్థవాదాలకూ విధులకూ ఏకవాక్యత సిద్ధిస్తున్నది. అంతేగాక వాటికివి అంగంగా కూడా పరిణమిస్తున్నాయి. కనుకనే ఇతిహాస పురాణాలు వేదాని కంగభూతమని వర్ణించటం.

పోతే ఈ అర్థవాదమనేది నాలుగు విధాలుగా నడుస్తుంది. ఒకటి స్తుతి. మరొకటి నింద. ఇంకొకటి పురాకల్పం. వేరొకటి పరకృతి. ఒక విషయం చెప్పి దాన్ని తప్పకుండా ఆచరించమని చెప్పటానికా విషయాన్ని ప్రశంసించాలి. తద్విరుద్ధమైన పని చేయకుండా అలాంటి వ్యవహారాన్ని దూషించాలి. అది మేము క్రొత్తగా చెప్పటం కాదు. ఎప్పటినుంచో వస్తూ ఉన్న సందర్భమే నని పురావృత్తాన్ని ఉదాహరించాలి. అది కూడా నీవూ నేనూ కాదు మహనీయులెందరో చేసి సత్ఫలితాన్ని పొందారని పరులకృతిగా దాన్ని వర్ణించి చెప్పాలి ఇంత పకడ్బందీగా వర్ణించేసరికి ఎంత వాడికి కూడా శాస్త్రచోదితమైన అర్థాన్ని తప్పకుండా అనుష్ఠించాలనే ఒక ప్రరోచన Inclination కలుగుతుంది. ఇలాటి ప్రరోచన మామూలుగా చెబితే కలగదు. అది శుష్కమైన మాట. ఇది అలా కాదు. అర్థవాదంతో కూడింది. కాబట్టి సరసంగా మారి శ్రోతకు ప్రరోచకమవుతుంది. ప్రరోచనే గాక అలా వర్ణించటం మూలాన ప్రతి పత్తి సౌకర్యం కూడా ఉందన్నారు భగవత్పాదులు. ప్రతిపత్తి అంటేవిషయ గ్రహణం. అది సులభంగా మనసుకు రావాలి మానవుడికి. శాస్త్రం నేరుగా ఏ కరువు పెడితే రాదది. ఈ ప్రణాళికలో అయితే బాగా మనసుకు పడుతుంది. సాధారణంగా మానవులది

పసిపిల్లల మనస్తత్వం. సూటిగా ఉన్నదున్నట్టు చెబితే వినటానికి బుద్ధి పుట్టదు. అదే కథా రూపంగా అందిస్తే ఎంతో ఉత్సాహంతో ఆలకిస్తారు. తదనుగుణంగా ఆచరిస్తారు. అందుకే చిన్న పిల్లలకు మనం కాకి పిట్ట కథలు చెప్పి వారి నానంద పరచటం. వీటికే శాస్త్రజ్ఞులర్థవాదాలని పేరు పెట్టారు వాటి కోవకు చెందినవే ప్రస్తుత మీ ఇతిహాసాలూ, పురాణాలూ. ఇవి చిన్న పిల్లల కథలలాగా కేవలం కాల్పనికమే. కానీ కాల్పనికమైనా ఆకల్పితమైన ప్రత్యయాలనే బయటపెడుతుంటాయి. ఇదుగో ఇలా శాస్త్రంయొక్క అడుగుజాడలలోనే పయనిస్తున్నాయి కాబట్టి శ్రుతి స్మృతులెంత ప్రమాణమో అవీ మనకంత ప్రమాణమే. రెండూ మనకొకే జీవిత సత్యాలను చాటుతున్నాయి. అవి ప్రభు సమ్మితంగా అయితే ఇవి మిత్ర సమ్మితంగా. అంతే తేడా మిత్ర సమ్మితం కాబట్టి వాటికన్నా ఇవే మనకింకా సన్నిహితం. కథాత్మకం కాబట్టి ఇంకా మనోరంజకం.

అయితే ఒక చిన్న ఆశంక. పురాణాలైనా ఇతిహాసాలైనా రెండూ అర్థవాదాలే గదా. కథా రూపాలే గదా. వాటి రెంటికీ తేడా ఏమిటీ అని. రెండూ కథలే అయినా రెండింటిలో ఒక విశేషముంది. శాస్త్రం మనకు బోధించే పురుషార్థాల నివి రెండూ చెరి ఒకటి పంచుకొన్నాయి. ధర్మమూ, మోక్షమూ ఇవి రెండే గదా పురుషార్థాలని చెప్పాము. ఇందులో ఇతిహాసం ధర్మాన్ని ప్రధానంగా బోధిస్తుంది. పురాణం మోక్షాన్ని ప్రధానంగా ప్రతిపాదిస్తుంది. అయితే ఇది ప్రాధాన్యాన్ని బట్టి మాత్రమే చెప్పిన మాట. అంచేత ఇతిహాసంలో మోక్షప్రసక్తి లేదని పురాణంలో ధర్మప్రసంగమే ఉండబోదని మరలా అపోహ పడరాదు. ఉంటుంది. అయితే దానికి ప్రాధాన్యం ఉండబోదు. కేవల ముపసర్జనం Subsidiary మాత్రమే.

ఇంతెందుకు. రామాయణ భారతాలనే తీసుకొని చూడండి. ఇవి రెండే ఇతిహాసాలు మనకు. రెండూ ధర్మ ప్రధానాలే. రామాయణంలో ఎక్కడ ఏ ఘట్టం చూచినా పితృధర్మం-పుత్ర ధర్మం-భ్రాతృ ధర్మం- స్వామి ధర్మం - భృత్య ధర్మం - మిత్ర ధర్మం -రాజధర్మం - అన్నీ ధర్మాలే. మోక్షధర్మమనే గంధం కూడా లేదందులో. మరి భారతంలో కూడా విదురనీతి గాని ధర్మవ్యాధోపాఖ్యానాదులుగానీ, శాంత్యను శాసనాది పర్వాలుగానీ - ఏవి చూచినా రాజలోక వ్యక్తి ధర్మాలే కుప్పతెప్పలుగా కనిపిస్తాయి. అయితే భగవద్గీత, సనత్సుజాతీయం, మోక్షధర్మాలు, అను గీతలు-

ఇలాంటి మోక్ష పురుషార్థ బోధకమైన ఘట్టాలు కూడ లేకపోలేదు. అయినా అవి ఆపాతతః బోధించటం వరకేగాని వాటి నాకర్ణించిన ధృతరాష్ట్ర ధర్మజార్జునాదులా మోక్షమార్గంలో పయనించింది లేదు. మోక్షాన్ని పొందింది లేదు. శ్రవణం వరకే అవి. సాక్షాత్కారానికి నోచుకోలేదు వారు. సాక్షాత్కారమే అయితే మోక్షపదవినే అందుకొని ఉండేవారు. ఏదీ ధర్మజుడు గాని, అర్జునుడు గాని ఎవరూ భారతంలో ముక్తులయినట్టు నిదర్శనం లేదు. కేవలం స్వదిలినీనిరోహణంతోనే సమసిపోయింది వారి జీవితం. దీనిని బట్టి ఇతిహాసాలన్నీ ధర్మ ప్రధానాలే గాని మోక్షపరాయణాలు కావు.

ధర్మప్రధానాలు గనుకనే ఇతిహాసాలలో మానవులే ప్రధాన పాత్రలు. సామాన్య మానవులందరికీ కావలసిందీ ఆచరణ యోగ్యమయిందీ ధర్మమే గదా. కనుకనే వారికే అందులో ప్రాధాన్యం భగవత్తత్త్వానికంత ప్రాధాన్యం లేదు. అది కేవలం వారి వెనకాల చేరి వారి జీవితాలను సరియైన మార్గంలో నడపటం వరకే. పోతే అప్పుడప్పుడు వారికేవైనా ఉపద్రవాలు సంభవించినప్పుడాదుకోవటం కూడా కద్దు. అంత మాత్రమే పరమాత్మకు ప్రవేశం. అలా ప్రచ్ఛన్నంగా ఉండి నాటకం నడుపుతూ పోవలసిందే గాని తాను ముందుకు వచ్చి ఒక పాత్రను నిర్వహించటమంటూ కానరాదు. ఇది భారతం ఆమూలాగ్రంగా చదివిన వారందరికీ విదితమే. అయితే రామాయణంలో కథానాయకుడు సాక్షాత్తూ అవతార పురుషుడే గదా అక్కడ ఈ సూత్రమెలా సరిపడుతుందని అడగవచ్చు. అవతార పురుషుడే అయినా మాయా మానుషుడాయన **"ఆత్మానమ్ మానుష మ్మన్యే"** అని ఏమని వాక్రుచ్చాడో ఆ మాటకు దగినట్టు తన దివ్యత్వాన్ని కప్పి పుచ్చి కొనా మొదలూ మానవోచితంగానే వ్యవహరించాడు. అంచేత అందులోనూ భారతంలాగా మానవుడికే ప్రాధాన్యం.

ఇది ఇతిహాస లక్షణమైతే పురాణ లక్షణం దీనికి వ్యతిరిక్తంగా కనిపిస్తుంది. ఇతిహాసాలు ధర్మ ప్రధానమని గదా పేర్కొన్నాము. వాటికి భిన్నంగా పురాణాలన్నీ మోక్షప్రధానాలు. ఆయా లోక ధర్మాలక్కడక్కడా ప్రవచించినా మోక్ష పురుషార్థాన్ని ప్రదర్శించటమే వీటి ఏకైక లక్ష్యం. కనుకనే వీటిలో పాత్రలు సామాన్య మానవులు కారు. **"మనుష్యాణామ్ సహస్రేషు"** అన్నట్టు లక్షకు కోటికొకడుంటాడు మోక్షకామి అయిన వ్యక్తి. అలాంటి పరతత్త్వ జిజ్ఞాసువులూ ముముక్షువులూ అయిన మహనీయులెవరో వారే పురాణాలలో పాత్రలు. మోక్షపురుషార్థమే ప్రతిపాద్యమైన

విషయం కాబట్టి ముముక్షువులైన భక్తులూ జ్ఞానులే పురాణ పాత్రలు కావటంలో ఆశ్చర్యం లేదు. మరి వారికలాంటి జ్ఞానాన్ని మోక్షాన్ని ప్రసాదించవలసిన వాడు భగవానుడే కాబట్టి ఆయనే పురాణాలలో కథా నాయకుడు. ఏ పురాణం చూచినా భగవంతుండే ప్రధాన పురుషుడు. తన్ముఖంగానే నడుస్తుంది పురాణమంతా. భగవంతుని నామమూ-ఆయన అవతారాలూ-ఆయన లీలలూ - వీటిని చిలవలు పలవలుగా వర్ణించటమే పురాణ జీవితం. నిత్యముక్తుడైన పరమాత్మ ప్రధానపాత్ర వహిస్తే ముముక్షువులైన సాధకులంతా ఆయన చుట్టూ పరిభ్రమిస్తూ తమ జీవితాలు గడుపుతుంటారు.

ఇది భాగవతాది పురాణాలేవి చూచినా మనకు తార్కాణమయ్యే సత్యం. లీలా మానుషమూర్తిగా అవతరించిన శ్రీకృష్ణ భగవానుడే గదా భాగవత కథా గమనాని కంతటికీ సూత్రధారుడు. ప్రథమ స్కంధం నుంచీ ద్వాదశ స్కంధం దాకా పరచుకొని ఉన్నదా మహనీయుడి చరిత్ర. కృష్ణ కథామృతంబని ఈ పురాణానికి పేరు పెట్టటం కూడా ఇందుకే. పోతే ప్రహ్లాద కుచేలాది భాగవతులంతా ఇక ఆ భగవదర్పిత చిత్త వృత్తులయి తమ జీవితాలు సాగించిన వారే. వారందరూ ఆ భగవన్మార్గంలోనే సంచరించారు. వారికి కావలసిన దాయన సాయుజ్యమే. స్వర్గాదులేవీ కావు. **మమ వర్త్మాను వర్తంతే** అని భగవానుడు చాటిన మాట వారందరి పట్లా అక్షరాలా సమన్వితమైన మాట. ఇలా ఆశ్రితాశ్రయ భావంతో అవినాభావంగా సాగిన చరిత్ర కాబట్టి అది భగవంతుడి చరిత్రా భాగవతుల చరిత్ర కూడా. దీనిని బట్టి ప్రతి పురాణమూ ఒక భాగవతమే కారణమేమంటే ప్రతి ఒక్కటీ భగవద్భాగవత కథామయమే. మోక్ష పురుషార్థ ప్రధానమే.

ఇంతకూ ప్రభు సమ్మితమైన శాస్త్రాలూ ధర్మమూ మోక్షమూ రెండింటినీ బోధిస్తే - అందులోనూ శుష్కమైన మార్గంలో బోధిస్తే - మిత్ర సమ్మితమైన పురాణేతి హాసాలు రెండూ వాటినే సరసంగా కథారూపంగా వర్ణిస్తాయి. అందులో కూడా ఇతిహాసాలు ధర్మాన్నే ప్రధానంగా పేర్కొంటే పురాణమలా కాక ధర్మాన్ని ఉపసర్జనం చేసి పరమ పురుషార్థమైన మోక్షాన్నే తాత్పర్య దృష్టితో లోకానికి చాటుతున్నది. కనుక శాస్త్రం కంటే ఇతిహాసం-ఇతిహాసం కంటే పురాణం మానవుడి కతి సన్నిహితమూ - మనోరంజకమూ - శ్రేయోదాయకమూ నని వేరుగా చెప్పనక్కరలేదు.

పురాణ వాఙ్మయానికింతటి విశిష్టత ఉండటం మూలాన్నే మొదటినుంచీ జన సమాజంలో పురాణ శ్రవణమనేది బాగా ప్రచారంలోకి వచ్చింది. పెద్దపెద్ద రాజాస్థానాల్లో పౌరాణికులైన పండితులెందరో ఉండేవారు. నానాపురాణ విజ్ఞాన నిరతుణ్ణని ఆది కవి నన్నయ భట్టు స్వయంగా చెప్పుకొంటాడు. పది మందికి కలిగే సందేహాలు ఎప్పటి కప్పుడీ పౌరుణికులు తీరుస్తుండే వారు. ఇప్పటికీ దేవాలయాలలో బహిరంగంగానూ – ధనికులైన ఆస్తికులైన గృహస్థుల ఇండ్లలో అంతరంగంగానూ – పురాణ కాలక్షేపం జరుగుతుండటం ఒక ఆచారం. భాగవతులనీ – హరికథకులనీ – హరిదాసులనీ – ఇలాంటి సంప్రదాయం లోకంలో ఈ పురాణ పఠన పాఠనాల వల్లనే అవతరించింది. భగవత్తత్త్వాన్నే అనేక విధాల లోకానికి చాటుతూ పరమార్థమైన మోక్ష పురుషార్థాన్నే ముఖ్యంగా చాటిచెప్పే పురాణ వాఙ్మయానికింత బహుళ ప్రచారం వచ్చిందంటే ఆశ్చర్యమేముంది. అది సర్వ విధాలా సముచితమే – సమంజసమే ననిపిస్తుంది.

"పురాఽపి నవమే వేతి పురాణ" మని వక్కాణించారు మన పెద్దలు. ప్రాచీనమైనప్పటికీ నవీనమైనదేదో అది పురాణ మాట. చూడబోతే ఈ నిర్వచనం ప్రౌఢమే గాక చాల వింతగా కనిపిస్తుంది. ప్రాచీనమై నవీనమెలా అయిందది. ప్రాచీనత అనేది తత్ప్రతి పాదితమైన వస్తువులో అయితే – నవీనత తత్ప్రతి పాదన మార్గంలో నని జవాబు. పురాణ ప్రతిపాద్యమైన వస్తువేది. పరమాత్మ తత్త్వం తద్విజ్ఞానం వల్ల కలిగే మోక్షఫలం. ఇది ఎప్పుడూ ఉన్నదే. మనం క్రొత్తగా సృష్టించేది గాదు. మానవుడు తెలుసుకోకముందూ ఉంది. తెలుసుకొనేప్పుడూ ఉంది. తెలుసుకొన్న అనంతరమూ ఉంది. అనాదీ అనంతమూ అయిన భావమది. అది ఈ ప్రపంచానికీ మనకూ గూడ స్వరూపమే. అయితే ఆ సత్యాన్ని మరచి పోయాము. కాబట్టి మరలా జ్ఞాపకం చేస్తూంది పురాణం. అంచేత **"వాస్తవ మత్ర వస్తు శివదమ్"** అని భాగవతకారుడు చెప్పినట్టు పురాణ వస్తువు ప్రాచీనమే.

అయితే మరి నవీనమేమిటి. నవీనం దాని నిర్మాణం. దాని ప్రణాళిక. దాని ప్రతిపాదన. విషయం ప్రాచీనమైనా దాని నావిష్కరించే పద్ధతి క్రొత్తది పురాణంలో. విషయమంటే పరమాత్మ తత్త్వమేనని గదా పేర్కొన్నాము. తత్త్వాన్ని సూటిగా చెప్పదు పురాణం. చెబితే అందులో స్వారస్యం లేదు. శుష్కంగా తయారవుతుంది. అప్పుడదీ

ఒక శ్రుతిలాగా ప్రభు సమ్మితమయి కూచుంటుంది. అంచేత దానినే ఆఖ్యానాల రూపంగా ఉపాఖ్యానాల రూపంగా రకరకాల వన్నెలు చిన్నెలు పెట్టి అనేక విధాల వర్ణిస్తూ పోతుంది. మరి తత్త్వమనేది ఏకరూపం గదా. అనేక రూపాలుగా వర్ణిస్తే అది యథార్థమెలా అవుతుంది. ఇక్కడే ఉంది రహస్యం. ఏకమైనా అది అనేక రూపాలుగా భాసిస్తున్నది. అదే ఈ ప్రపంచం. అలా భాసించటం దాని యోగమాయా ప్రభావం వల్లనైనా కావచ్చు. అనాది సిద్ధమైన మన అజ్ఞాన విజృంభణ వల్లనైనా కావచ్చు. ఏదైతే నేమి ఫలితమొక్కటే. అది ఏకమైన తత్త్వం అనేక రూపాలుగా గోచరించడం. అనేకంగా గోచరించేసరికీ నామరూపాలలో ఎక్కడికక్కడ తగులుకొని మానవుడి బుద్ధి దీనినంతటినీ కలుపుకొని సమష్టిగా దర్శించే శక్తిని కోలుపోయింది. మన బుద్ధి బలహీనమయ్యే కొద్దీ నామరూపాత్మకమైన సృష్టి బలాన్ని పుంజుకొన్నది. మనమీద నిత్యమూ దాడి చేస్తున్నది. సుఖదుఃఖాది ద్వంద్వాలకు మనలను గురి చేస్తున్నది. దానితో అసలు తత్త్వానికి బాగా దూరమై పోయాము. ఇదే సంసారమంటే.

ఇప్పుడీ సంసార జంబాలం నుంచి బయట పడాలంటే మరలా మన మా పరమాత్మతో సాయుజ్యాన్ని భజించాలి. అంటే అనేకత్వం నుంచి మరలా ఏకత్వంవైపు పయనించాలి. అనేకత్వమెప్పుడూ అసత్యమే. అది ఏకత్వం తాలూకు ఆభాస. ఏకత్వమే వస్తువు. వస్తువే సత్యం కాని ఆభాస అనేది సత్యం కాదు. కారణమేమంటే నిరూపణ చేసి చూస్తే వస్తువుకంటే భిన్నంగా కనిపించదది. ఇప్పుడీ చరచార ప్రపంచమంతా సచ్చిద్రూపమైన పరమాత్మకన్నా అతిరిక్తంగా లేదు. కాబట్టి ఇది అసత్యం. అసత్యమైనా దీని నసత్యమని చూడటం లేదు మనం. మీదు మిక్కిలి ఎంతో గొప్ప సత్యమని నిత్యమూ దర్శిస్తున్నాము. ఇప్పుడీ దర్శన మొక్కసారిగా మిథ్య అని శాస్త్రజ్ఞులు చెబితే మనకు నమ్మటానికి బుద్ధి పుట్టదు. పైగా అది మన ప్రకృతానుభవానికి విరుద్ధంగా తోచటంవల్ల త్రోసి పుచ్చుతాము. త్రోసి పుచ్చితే పుచ్చారు లెమ్మని చెప్పి శాస్త్ర ముదాసీనంగా ఉండబోదు. పిల్లవాడు తెలియక హఠం చేసినా తల్లి బుజ్జగించినట్టు ఏదో ఒక మార్గంలో మనకు హితం చెప్పటానికే ప్రయత్నిస్తుంది. ఆ మార్గమేదో గాదు. మన అనుభవాన్ని కాదనకుండా మనల ననుసరిస్తూనే క్రమంగా మన చేతనే దాన్ని కాదనిపించటం. దీనినే అధ్యారోపాపవాద న్యాయమంటారు శాస్త్రంలో.

ప్రభు సమ్మితమైన ఈ శాస్త్ర మార్గాన్నే సుహృత్సమ్మితమైన పురాణం కూడా అనుసరిస్తుంది. సర్వాధిష్ఠాన భూతమైన తత్త్వాన్ని పూర్తిగా మరచి మన మీ సంసారాన్ని చూస్తూ దీనిలో తల మునకలవుతుంటే ఇది అంతా ఏదో గాదు ఆ పరమాత్మ విభూతే సుమా – ఇటు జీవసృష్టి – అటు జగత్సృష్టి – రెండూ దాని నాటకమే నని వర్ణిస్తుంది. నిజానికి సృష్టి స్థితి సంహార కథ అంతా వట్టిదే **"ఏక మేవా ఽ ద్వితీయమ్ బ్రహ్మ"** అన్నప్పుడిక ద్వితీయమైన భావానికి చోటెక్కడిది. ఆదిలోనూ లేదు. అంతంలోనూ లేదు. ఆద్యంతాలలో ఉన్నదొక్క బ్రహ్మమే. కనుకనే శాస్త్రమాదిలో అద్వితీయమని ఎలా వర్ణించిందో అంతంలోనూ అలాగే అద్వితీయ తత్త్వంతోనే ఉపసంహరిస్తుంది. **"ఐతదాత్మ్యమిదమ్ సర్వమ్ – తత్సత్యం – స ఆత్మా – తత్త్వమసి"** పోతే మధ్యలో మాత్రమే జగత్సృష్ట్యాదికమైన భేద కథ పట్టుకు వస్తుంది. ఆదిలో అంతంలో లేని భేదం మధ్యలో ఎలా వచ్చింది. వచ్చింది చేసిందని కాదు. అది ఒక వేదాంత ప్రక్రియ Methodology. అభేదాన్ని దృఢంగా మనసులో నిలుపుకోటాని కొక ఉపాయ Means మది. **"ఉపాయస్సోవతా రాయ నాస్తి భేదః కథంచన"** అని గౌడపాదులెప్పుడో చెప్పారు. జగత్సృష్టి జీవ ప్రవేశాది వర్ణనమంతా అప్పటికి యథార్థంగా జరిగిందని చేసిందని భావించరాదు మనం. అభిన్నమైన తత్త్వాన్ని అర్థం చేసుకోటానికి – అందుకోటానికి – ఒక ఆలంబనంగా సంకేతంగా తీసుకోవాలి దాన్ని. అది ఎలాగ.

పరమాత్మను మరచిపోయి కేవల మీ నామరూపాత్మకమైన సంసారాన్నే చూస్తున్నాము. కాబట్టి ఈ జగత్తు నుంచి మన దృష్టి దానివైపు మళ్లించాలి. మళ్లించాలంటే ఏమి చేయాలి. దీని సృష్టి స్థితి లయాలన్నీ దాని మూలంగానే జరిగాయని దీనియావద్భారాన్నీ దానిమీద అసలు లేకపోయినా ఉన్నట్టు ఆరోపించాలి. అప్పుడిదంతా దాని వైభవమే దాని విలాసమేనని ఆ సూత్రాన్ని విడవకుండా దీనిని పట్టుకొంటాము. దీనివల్ల కేవల సంసారమనే దృష్టి పోయి ఇది ఆ ఈశ్వర విభూతి అనే ఉదాత్తమైన దృష్టి ఏర్పడుతుంది మానవుడికి. ఇలా ఈశ్వర విభూతేనని ఎప్పుడు దర్శించామో ఆదర్శనమంతకంతకు గట్టి పడే కొద్దీ ప్రతి ఒక్కటీ ఇందులో ఈశ్వర చైతన్యమే గాని అంతకు భిన్నంగా మరేమీ కాదని ప్రపంచమంతా నిరాకృతమవు తుంది. కేవల మీశ్వర స్వరూపమే మిగులుతుంది. అప్పుడు సంసారంలాగా విభూతి కూడా మిథ్య అని తేలిపోయి ఏకమే వాద్వితీయమనే స్వరూప స్థితినే అందుకోగలం.

దీనిని బట్టి మూడు భూమికలు తేలుతున్నాయి మనకు. మొదటిది ప్రపంచ భావన. ఇందులో ఈశ్వర దృష్టి కేమాత్రమూ ఆస్పదం లేదు. రెండవది విభూతి భావన. ఇందులో అధిష్ఠాన రూపంగా ఈశ్వరుడూ తత్క్రీడా రంగంగా ఈ జగత్తూ రెండూ గోచరమవుతుంటాయి. మూడవది స్వరూప భావన. ఇందులో చరాచర సృష్టి అంతా ఈశ్వరుడిలోనే లయమై ఆ ఈశ్వరుడు మన ఆత్మరూపంగానే అనుభవానికి వస్తాడు. ఇక్కడికి వచ్చే సరికిక సంసారమూ లేదు. విభూతీ లేదు. ఈ మొదటి రెండు భూమికలూ అబద్ధమే నని తేలుతుంది. అయితే ఒక రహస్యం గుర్తుంచుకోవాలి మనం. సంసారమనే మొదటి భూమికలో ఈశ్వర స్పర్శ బొత్తిగా లేదు. కాబట్టి అది సాధకుడికి హేయం. కాగా రెండవదైన విభూతి భూమిక నుంచీ దాని స్పర్శ కనిపిస్తుంది. స్వరూప స్థితి అనే తృతీయ దశలో అది పరిపూర్ణంగా అనుభవానికి వస్తుంది. కనుక అదే మనకుపాదేయం. సత్యమైన దాస్థితి. అలాంటి సత్యాన్ని చేరేందుకు సాధనంగా పని చేస్తుంది కాబట్టి అసత్యమైనా విభూతి దశకూడా మనకు వాంఛనీయమే. అది ఇటు సంసార దశను దాటించి మనలను సాయుజ్య దశకు చేర్చే ఒక గొప్ప నిశ్శ్రేణిక లాంటిది. ఈశ్వర స్పర్శ ఉంది కాబట్టి తనపాటికి తాన సత్యమైనా సత్యమైన పరమాత్మ యొక్క అనుభూతిని ప్రసాదిస్తుందది.

ప్రస్తుతం పురాణాలలో మనం చూచే వ్యవహారమంతా ఈ విభూతి వర్ణనే. సృష్టి స్థితి లయాలే గదా పురాణాలన్నీ వర్ణించే విషయం. అసలు పురాణ లక్షణమే అది. **"సర్గశ్చ ప్రతి సర్గశ్చ - వంశో మన్వంత రాణిచ - వంశాను చరితమ్ చేతి - పురాణమ్ పంచ లక్షణ"**మన్నా రభిజ్ఞులు. ఈ అయిదింటిలో సర్గమంటే సృష్టీ. ప్రతి సర్గమంటే లయం. పోతే ఒక మనువు కాలమయి పోయి మరొక మనువు కాల మారంభమైతే అది మన్వంతరం. అందులోనే మనుసంతతీ - వారి సంతతీ - వంశమూ - వంశాను చరితమనేవి. ఇదంతా ప్రపంచ స్థితి క్రిందికి వస్తుంది. అప్పటికి సృష్టి స్థితిలయాలే ఈ అయిదింటి తాత్పర్యం. మరి ఈ సృష్టి స్థితి లయాలే భగవద్విభూతి అంటే. పోతే ఈ స్థితి కాలంలో ధర్మమనేది అంతరించకుండా కాపాడటానికే భగవంతుడి అవతారాలన్నీ. అందులో దుష్టులైన రాక్షసులను సంహరించటం - శిష్టులైన దేవ ఋషి మనుష్యాదులను అనుగ్రహించటం - దాని కానుషంగికం. ఇవే గదా పురాణాలలో మనకు కనిపించే కథలన్నీ. భగవంతుడి

లీలలని – భగవద్భక్తుల చరిత్రలనీ చెప్పుకొనేవన్నీ ఇవే. ఇవి ఆ సృష్టి స్థితి లయాలు మూడింటి మీదా ఆధారపడి ఉన్నాయి. అది మరలా వాస్తవంగా జరిగింది కాదు. అంతా ఒకే ఒక స్వరూప మయినప్పుడెలా జరుగుతుంది. అయినా జరిగినట్టు పురాణం వర్ణించిందంటే అది ఈ విభూతి ద్వారా ఆ పరతత్త్వాన్ని భజించటం కోసమే. సత్యమైన ఆ స్వరూపాన్ని అందుకోటానికి కథలన్నీ ఒక సంకేతంగా భావించాలి గాని ఈ కథలే సత్యమని భ్రాంతి పడరాదు.

అయితే లోకంలో ఇది ముప్పాతిక మూడు పాళ్ల మంది కర్థం కావటం లేదు. కొందరు నాస్తికులు ఇదంతా కాకి పిట్ట కథలని హేతువాదం చేసి త్రోసి పుచ్చితే – మరి కొందరాస్తికులు ప్రతి ఒక్క మాటా యథార్థంగానే ఒకప్పుడు జరిగిందని సమర్థించబోతారు. ఇద్దరిదీ అస్థాన సంరంభమే. పురాణాలలో ఎక్కడ ఏది చెప్పినా అది తత్త్వం కాదు. తత్త్వజ్ఞానం కోసం చేసిన ఒక మనోజ్ఞమైన కల్పన. **"భాగవతామ్నాయము బాదరాయణుడు తా గల్పించె నేర్పొప్ప గన్"** అని వాక్రుచ్చాడు పోతరాజు. భాగవతం జరిగిన కథ కాదట. కల్పించిన కథ. కల్పించాలంటే దానికెంతో నేర్పు కావాలి. బాదరాయణుడలాంటి నేర్పరి గనుకనే అంత గొప్ప కల్పన చేశాడు. అసలు మూలకారుడే చాటాడొక ముత్యంవంటి మాట.

కథా ఇమాస్తే కథితా మహాత్మనామ్
విధాయ లోకేషు యశః పరేయు షామ్
విజ్ఞాన వైరాగ్య వివక్షయా విభో
వచో విభూతి – ర్నతు పారమార్థ్యమ్

ఇది భాగవతం ద్వాదశ స్కంధంలోని శ్లోకం. అన్నీ అయిన తరువాత శుకుడు పరీక్షిత్తుకు చెప్పిన ముక్తాయింపు వాక్యమిది. నేనీ కథలన్నీ ఇంత చిలువలు పలువలుగా నీకు వర్ణించి చెప్పానంటే – ఇదంతా నిజంగానే జరిగింది చేసిందని భావించబోకు. ఇది కేవలం వక్తయొక్క వాగ్వైభవమే గాని పరమార్థం కాదు. పరమార్థం కాకపోతే ఎందుకీ కంఠశోష అని ప్రశ్నిస్తావేమో. తద్ద్వారా మీ బోటి జిజ్ఞాసువులకు పారమార్థికం మీద విజ్ఞానమూ – ప్రాపంచిక విషయాల మీద వైరాగ్యమూ – ఇవి రెండూ కలిగించటమే మా ఈ కథా వర్ణనలలోని ఆంతర్యం.

దీనిని బట్టి పురాణ లక్ష్యమేమిటో మనకు తేట పడుతున్నది. జ్ఞాన వైరాగ్యోత్పాదనమే దాని లక్ష్యం. శ్రుతి స్మృతి రూపమైన శాస్త్రానికేదో దానికీ అదే. అలాగైతేనే రెంటికీ ఏకవాక్యత uniformity సిద్ధిస్తుంది. లేకుంటే తీర్థానికి తీర్థం – ప్రసాదానికి ప్రసాదమయి దేని దారి దానిదే అవుతుంది. బ్రహ్మజ్ఞానం మానవుడి కందివ్వటమే శాస్త్రోద్దేశం. దాని కోస మక్కడక్కడ మనోహరమైన ఆఖ్యాయికలూ – అలంకారాలూ ఏ కరవు పెడుతుంది. సనత్కు మార నారద సంవాదం – ఇంద్ర విరోచనా ఖ్యాయికా – నచికేతుని కథా–యాజ్ఞవల్క్య జనక సంవాదమూ – ఇలాంటి ఆఖ్యాయిక లెన్నో ఉన్నాయి ఉపనిషత్తులలో. పోతే **"అజా మేకామ్ లోహిత శుక్ల కృష్ణామ్ – ద్వా సుపర్ణా సయుజా సఖాయా – ఊర్ధ్వమూలో ఽ వాక్శాఖః – ప్రణవో ధనుశ్శరోహ్యాత్మా–ఆత్మానమ్ రథినమ్ విద్ధి"** ఇలాంటి రూపకల్పన లెన్నో కనిపిస్తాయి. ఇవన్నీ శాస్త్ర తాత్పర్యం కాదు గదా. శాస్త్ర తాత్పర్యమైన బ్రహ్మాత్మ భావాన్ని అందుకోటానికి కల్పించిన సంకేతాలు–కల్పనలు. వీటిని అర్థవాదాలన్నారు శాస్త్రంలో.

అలాంటి అర్థవాదాలే ఈ పురాణ కథలు కూడా. బ్రహ్మతత్త్వాన్నీ దాని నందుకొనే మార్గాన్నీ మనకు బోధించటానికి చేసిన కల్పనలే ఇవన్నీ. కల్పనే కాకపోతే స్తంభాన్ని పెకలించుకొని ఒక సింహరూప మావిర్భవిస్తుందా – తిర్యగ్జంతువైన ఒక గజం మొరపెడితే భగవంతుడు పరుగెత్తి వస్తాడా – ఇలాంటివన్నీ అక్షరాలా జరిగాయని వాదించనక్కరలేదు. అయ్యో జరగలేదని నమ్మకపోతే అది ఎంత అపచారమోనని ఊరక ఉలిక్కి పడనక్కర లేదు. జరిగినవే అయితే ఒక వృత్తాంత మొక పురాణంలో ఒక విధంగా మరొక పురాణంలో మరొక విధంగా పేర్కొనటం సంభవం కాదు గదా. అసలీ చరాచర జగత్తే అబద్ధమది కేవలం మన అవిద్యా విలసితమేనని శాస్త్రం ఘోషిస్తుంటే పురుష బుద్ధి కల్పితమైన ఈ పురాణ గాథలు సత్యమని మనం పట్టు పట్టటమేమిటి. భౌతిక సృష్టిని బట్టే గదా వాఙ్మయసృష్టి. భౌతిక సృష్టి పరమార్థానికి ఒక రెట్టి దూరమైతే దాని ననుసరించి వచ్చిన వాఙ్మయ సృష్టి రెండు రెట్లు దూరం కావలసి ఉంది. కాబట్టి దీనిలో కనిపించిన ప్రతి ఒక్క అంశమూ సమర్థించటానికి పూనుకోటం అవివేకం. అంతరమైన భావాన్ని కాక పై అక్షరాన్ని మాత్రం పట్టుకు కూచున్నప్పుడే ఇలాంటి తప్పిదం జరుగుతుంది. అంతర్యమేమిటో ఇంతకు ముందే సూచన చేశాము – భగవత్తత్త్వ ప్రతి పాదనమేనని.

అది ముఖ్య ప్రాణమైతే పురాణానికి – మిగతా కథా కథన సామగ్రి అంతా దానిని చక్కగా ఆవిష్కరించటానికి కావించిన ఒక బృహత్కల్పన. ఇది పురంజనో పాఖ్యానాదులలో స్పష్టంగానే దాఖలా అవుతుంది మనకు. అది ఔషధం సేవించటానికి వైద్యుడు మనకు కట్టి ఇచ్చే ఒక మోతాదు పొట్లం లాంటిది ఆ మోతాదులోనే మిగతా మందు మనమెలా సేవించాలో అలాంటి దృష్టితోనే చూడాలి మనం పురాణ ప్రపంచాన్నంతటినీ. అలా చూచి దాని తత్త్వాన్ని ఆకళించుకొన్నప్పుడే అది ప్రభు సమ్మితమైన శాస్త్రం కన్నా – మిత్ర సమ్మితమైన ధర్మ ప్రధానమైన ఇతిహాసం కన్నా – పరమ పురుషార్థమైన మోక్షాన్నే ప్రతిపాదిస్తుంది. కాబట్టి వాఙ్మయానికంతటికీ తలమానిక మయి మానవజాతి కత్యంతో ఉపకారకమూ ఉపాదేయమూ కాగలదు.



Brahmasri Yallampalli Srinivasa Rao
www.vedanta.in

2. భాగవత ప్రాశస్త్యము

మన వాఙ్మయంలో పురాణాలకున్న స్థానమేమిటో – వాటి విశిష్టత ఏమిటో చర్చించాము. పోతే ప్రస్తుత మీ పురాణాలలో భాగవత పురాణానికున్న ప్రాశస్త్య మెలాంటిదో పరిశీలించవలసి ఉంది. **"మద్వయమ్ భద్వయం చైవ – బ్రత్ర యమ్ – వచతుష్టయమ్ – అనాపలింగ కూస్కాని – పురాణాని పృథక్పృథక్"** అని మొత్తం పద్దెనిమిది మహా పురాణాలను పరిగణించారు మన ప్రాచీనులు. మద్వయమంటే మత్స్య మార్కండేయాలు. భద్వయమంటే భవిష్య భాగవతాలు. బ్రత్రయమంటే బ్రహ్మ బ్రహ్మాండ బ్రహ్మ వైవర్తాలు. వచతుష్టయ మంటే వరాహ విష్ణు వామన వాయు పురాణాలు. అ అంటే అగ్ని, నా అంటే నారద, ప అంటే పద్మ, లిం అంటే లింగ, గ అంటే గరుడ, కూ అంటే కూర్మ, స్క అంటే స్కంద పురాణాలు. ఈ అష్టాదశ పురాణాలలోనూ భాగవతమనేది చుక్కలలో చంద్రుడిలాగా చాలా ప్రసిద్ధి కెక్కింది. రామాయణ భారతాలు ఇతిహాసాలకైతే పురాణ శాఖ కంతటికీ ఒక్క భాగవతమే ప్రాతినిధ్యం వహించగలదు.

అయితే లోకంలో ఎంత ప్రసిద్ధమైనా విమర్శక లోకంలో మాత్రమింకా దీని విషయంలో కొంత విచికిత్స ఉండనే ఉంది. ఇది మిగతా పురాణాల మాదిరి వ్యాస ప్రోక్తమేనా – లేక మరెవరైనా మహానుభావుడు రచించి ఆయనపేరు పెట్టాడా – అని కొందరి అనుమానం. ఈ అనుమానం కూడా కేవలం నిరాధారమైనది గాదు. కొంత లోతుకు దిగి చూస్తే మనకు చాలా ఉపపత్తులు కనిపిస్తాయి. అసలు భాగవతమని నామకరణం చేయటమే చిత్రంగా ఉంది. భాగవతమంటే భగవంతుడి చరిత్ర అని మాత్రమే అర్థం. భగవంతుడి చరిత్ర కాని పురాణమేముందని, అసలు పురాణమంటేనే భగవచ్చరిత్ర అని పేర్కొన్నాము. అలాంటప్పుడు భాగవతమని పేరు పెట్టటమే ఒక విధమైన పునరుక్తి. మిగతా పురాణాల విషయమలాకాదు. అందులో ప్రతిపాదించిన విషయాన్ని బట్టి వాటికా పేరు వచ్చింది. అగ్ని వాయు – ఇలాటి వాయా దేవతల చరిత్రలు. వరాహ వామన కూర్మ నారసింహాదు లాయా అవతార

చరిత్రలు. బ్రహ్మ విష్ణు లింగాదులు త్రిమూర్తుల మాహాత్మ్యాన్ని వర్ణిస్తాయి. ఇవన్నీ భగవద్విభూతి వర్ణనలే. ఇవన్నీ కాక ఇక క్రొత్తగా ఒక పురాణమేముందని దానికి భాగవతమని నామం కల్పించటం.

అంతే కాదు. విష్ణు పురాణమని – హరి వంశమని – రెండు పురాణాలున్నాయి. వీటిలో మొదటిది అష్టాదశ పురాణాలలో చేరిందేగాని రెండవది అలా చేరింది కాదు. ఇవి రెండూ అమూలాగ్రమూ విష్ణు మాహాత్మ్యాన్నీ – దశావతార వృత్తాంతాన్నీ – భగవల్లీలలనూ – కరతలామలకంగా వర్ణించే పురాణాలు. వీటిలో ఏయే కథలు చెప్పబడ్డాయో అవే మనకు భాగవతంలోనూ తారసిల్లుతాయి. అంతకు మించి క్రొత్తగా చెప్పిన ఉదంతమొకటి కూడా కానరాదు. పురంజనో పాఖ్యానాదులొకటి రెండుంటే ఉండవచ్చు. మిగతావన్నీ విష్ణుకథలూ – కృష్ణ కథలే. విష్ణు కథలకు విష్ణు పురాణముంది. కృష్ణ కథలకు హరివంశముంది. ఇక భాగవతానికి ప్రసక్తి ఏముందనిపిస్తుంది. చూడబోతే భాగవతమైనా వాటికి పునరుక్తి కావాలి. లేదా అవైనా దానికి పునరుక్తి కావాలి. ఇందులో విష్ణు పురాణ మష్టాదశ పురాణాల జాబితాలో ఎలాగూ చేరి ఉంది. అలా చేరనిది హరి వంశమొక్కటే. కాబట్టి భాగవతమో హరివంశమో ఏదో ఒకటి మాతృక అయి మరి ఒకటి దాని కనుకరణం కావలసి ఉంది. ఏది మాతృక అని ప్రశ్న.

హరి వంశమనే పేరులోనే ఉంది కృష్ణుడి వంశమని – కృష్ణుడి చరిత్ర అని. కురువంశాని కనుబంధం హరివంశం. కురు వంశ చరిత్రే గదా భారతం. దానికి హరి వంశం ఖిల పురాణమని ఒక ఆభాణకముంది. కాబట్టి భాగవతమని పరంపరగా చెప్పుకొనే దానికంటే కృష్ణుని చరిత్రకు సాక్షాత్తుగా సంబంధించిన హరివంశాన్ని పరిగణించటమే సమంజసమని తోస్తుంది. పైగా అష్టాదశ పురాణాలూ వ్యాస ప్రోక్తాలని గదా అనుస్యూతంగా వస్తున్నమాట. వ్యాస భగవానుడి శైలి మహా భారతంలో గాని, మిగతా పురాణాలలో గాని ఎక్కడ చూచినావచ్చీ పోయి ఒకే బాణీలో నడుస్తుంది అది అతి స్పష్టమైన సుగమమైన అందమైన అనన్యాదృశమైన ఆర్షవాణి. విష్ణు పురాణ హరి వంశాలలో కూడా అదే శైలి కనిపిస్తుంది మనకు. పోతే దీనికెటు వచ్చీ అపవాదమొక్క భాగవతమే. భాగవతంలో మాత్రమే అలాంటి శైలి కనిపించదు. శబ్ద ప్రయోగమైతే నేమి–వాక్య నిర్మాణమైతే నేమి, చాలా విద్దూరంగా

కనిపిస్తుంది. శ్లోకాన్వయం కూడా అంత సుకరంగా ఉన్నట్టు తోచదు. శ్లోకాలు అనుష్టుప్పు దగ్గరి నుంచీ శార్దూల వృత్తాలదాకా ఎన్నో రీతులలో నడుస్తూ పోతాయి. అక్కడక్కడ వాడిన గద్య ఏ కావ్యాలలోనూ కానరాదు. ఒక్కమాటలో చెబితే తక్కిన పురాణాలకూ దీనికీ రచనలో మూడు వంతులసలు సాజాత్యమే లేదని చెప్పవచ్చు.

భాషాశైలిలోనే గాదు ఇలాంటి వైపరీత్యం. ప్రతిపాద్యమైన విషయంలో కూడా అక్కడక్కడా వైరుద్ధ్యం గోచరిస్తుంది. ఒకటి రెండుదాహరణ లిస్తాను. బుద్ధుడు వ్యాసుని తరువాత వచ్చిన వాడు. చారిత్రకంగా వారిద్దరికీ ఎలాటి సంబంధమూ లేదు. అలాటి బుద్ధుడు ఒక అవతారంగా భావించి వర్ణిస్తుంది భాగవతం. వ్యాసుడే భాగవత కర్త అయితే ఇలా జరగటానికి లేదు. దీనిని సమర్థించటాని కీబుద్ధుడు గాక మరొక బుద్ధుడున్నాడు. రాక్షస సంహారం కోసం వారి భార్యల పాతివ్రత్యాన్ని దోచుకొన్న బుద్ధుడాయన. ఆయన కేవలం విష్ణ్వంశజాతుడని వాదిస్తారు కొందరు. అది ఉన్న దాన్ని సమర్థించే ప్రయత్నమే గాని మరేదీ గాదు. బుద్ధావతార మనేది లేదసలు. గౌతమ బుద్ధుడే బుద్ధుడు. నాస్తిక మతాన్ని ప్రచారం చేసిన వాడతడే. మనవారు భావించే అవతార పురుషుడైన బుద్ధుడు కూడా నాస్తిక మతప్రచారం లోకంలో చేయటానికవతరించినట్టు చెబుతున్నది భాగవతం. ఇదివిష్ణు పురాణ హరి వంశాలలో లేని వృత్తాంతం.

పోతే మరొక విషయమేమంటే కపిలుడనే వాడు సాంఖ్య మతప్రవర్తకు డొకడున్నాడు. భగవదవతారమైన కపిలుడొకడున్నాడు. సగర పుత్రులను భస్మం చేసిన వాడితడే. ఇతడతడు కాదు. అతడు కేవలమొక దార్శనికుడైన ఆచార్యుడు. అతని సాంఖ్యదర్శనాన్ని నిర్మొగమాటంగా ఖండిస్తాడు వ్యాసుడు తన భారతంలో. అలాంటి కపిలాచార్యుణ్ణి మరలా అతడెలా నెత్తిన పెట్టుకొని ప్రశంసిస్తాడు. కాని అలా ఎంతో ప్రశంస చేసినట్టు కనిపిస్తుంది భాగవతంలో. కపిల దేవహూతి సంవాదమంతా సాంఖ్య మత ప్రశసనమే. ఒకే వ్యాసుడు భారతంలో ఒక మాటా భాగవతంలో ఒక మాటా ఎలా చెప్పగలడు. పైగా ఈ మతాచార్యుడికీ అవతారమూర్తికీ ఏమీ భేదం లేదన్న అభిప్రాయమిస్తుంది మనకు భాగవతం. ఇలా విషయ కోటిలో కూడా ఎంతో వైరుద్ధ్యం కనిపిస్తుంది భాగవతంలో. ఇలాటి వైరుధ్యం హరి వంశంలో మనకు తారసిల్లదు.

దీనిని బట్టి భాగవతం వ్యాసరచిత మవునా కాదా అని తద్జ్ఞులు సందేహిస్తున్నా రంటే అందులో కొంత సబబు లేకపోలేదు. అష్టాదశ పురాణాలలో విష్ణు పురాణ మెలాగూ అంతర్గతమయి ఉంది. పోతే వివాద గ్రస్తమైన భాగవతాన్ని పద్దెనిమిదవదిగా పరిగణించే దానికంటే నిర్వివాదమైన హరివంశాన్నే తీసుకొంటే సరిపోతుంది. దానినే భాగవతమని వ్యవహరించవచ్చు. వాస్తవానికది భాగవతమే సందేహంలేదు. అయితే ప్రస్తుతం మనకు కనిపించే ఈ భాగవతమేమిటి. ఇది వైయాసికం కాకపోతే మరెక్కడి నుంచి ఊడిపడిందని ప్రశ్న. ఇది వైష్ణవ మతం బాగా బలం పుంజుకొన్న రోజుల్లో విష్ణు భక్తి దేశంలో నలుగురికీ ప్రచారం చేయాలనే దృష్టితో ఎవరో వీరవైష్ణవుడు రచించిన గ్రంథమని పేర్కొంటారు. వోపదేవుడనే ఒక మహా భాగవతుడూ మహా విద్వాంసుడు మహాకవీ ఉండేవాడని – ఆయన గారే ఈ భాగవతాన్ని రచించి దానికి లోకంలో ప్రసిద్ధి రావాలని వ్యాస భగవానుడి పేరు పెట్టాడని – చాలామంది విమర్శకుల అభిప్రాయం. కొంత వరకిది వాస్తవమే కావచ్చు. అతడు వంగ దేశస్థుడే అయితే మహాభాగవతులలో కూడా కృష్ణ చైతన్య తత్త్వంలో బాగా పండిపోయి ఉంటాడు. దీని కుపోద్బలకంగా భాగవతం శివ చతుర్ముఖాదులను తగ్గించి విష్ణుపారమ్యాన్నే ఎక్కువగా చాటటం – అందులోనూ కృష్ణావతార తత్త్వాన్ని సర్వోత్కృష్టంగా నిరూపించటం – గమనించదగ్గ విషయం.

ఇంత ఆధునికం గనుకనే నేమో అసలు శంకర భగవత్పాదులు పురాణ వాక్యాల నుదాహరించవలసిన చోట్ల నెల్లా విష్ణుపురాణాదులలో శ్లోకాలనే ప్రమాణంగా ఉదహరిస్తారు గాని మచ్చుకైనా ఒక భాగవత శ్లోకాన్ని పేర్కొనలేదు. ఆ కాలానికిది లేకపోవటం వల్లనైనా కావచ్చు. లేక దానిలో శ్రుతి స్మృతి సిద్ధాంతాలకు విరుద్ధమైన సందర్భాలు కొన్ని అక్కడక్కడా దొర్లటం వల్లనైనా కావచ్చు. ఏది ఏమైతేనేమి మొత్తానికి భాగవతం ప్రామాణ్య విషయం చాలా వివాదా స్పదంగా కనిపిస్తుంది. ఇలాంటి వివాదానికి హరివంశ విష్ణు పురాణాలలో మాత్రం కొంచెమైనా ఆస్కారం లేదు. కాబట్టి దీనికన్నా అవే మనకు ప్రామాణికమైన పురాణాలు. దీనిని విడిచిపెట్టి చూచినా వాటితో కలిపి అష్టాదశమనే పురాణసంఖ్య సరిపోతుంది.

అయితే అలాంటప్పుడు మన మీ భాగవతాన్ని పట్టుకొని వ్రేలాడటం దేనికి. విష్ణు పురాణాదులనే భాగవతంగా పరిగణించి వాటినే విమర్శ చేయవచ్చు గదా –

అని సహృదయులు ప్రశ్నించవచ్చు. నిజమే, అలాగే చేయవచ్చు. సందేహంలేదు. కాని భాగవతమనేది ఎంత వివాదగ్రస్తమైనా అది పండిత లోకంలోనే. లోకంలో మాత్రమది ఎంతగానో ప్రచారంలో ఉంది. దీనికున్నంత బహుళమైన ప్రచారం విష్ణు పురాణానికి లేదు. హరివంశానికి లేదు. అసలా మాటకు వస్తే మరి ఏ పురాణానికి కూడా లేదు. ఇతిహాసమంటే భారత రామాయణాలు – పురాణమంటే భాగవతం. ఇదే లోకంలో పిన్న దగ్గరి నుంచి పెద్ద వరకూ ప్రతి ఒక్కడి అభిప్రాయం. జనవాక్యం తు కర్తవ్యమన్నారు పెద్దలు. బహుజనాభిప్రాయాన్ని మనం కాదనటం దేనికి. ఇంతకాలం నుంచి ఇంతమంది ఆదరణకు పాత్రమైన గ్రంథాన్ని మనం త్రోసిపుచ్చటం మంచిది కాదు. అది వ్యాసప్రోక్తమో కాదో భగవానుడి కెఱుక, వ్యాసుడే రచించినా మరి ఒక అభినవ వ్యాసుడే రచించినా మనకు దానితో నిమిత్తం లేదు. అంతగా స్తనశల్య పరీక్ష కూడా మనకక్కరలేదు. ముఖమున్నది అద్దమున్నదన్నట్టు ఆ గ్రంథమున్నది లోకమున్నది. లోకానికి కావలసినదంతా దానిలో ఉన్నది. దానిలో ఉన్నదంతా లోకానికి కావలసిందే. మోక్ష పురుషార్థాన్నే బోధిస్తున్నదది. అందులో కథలన్నీ దాని కోసమల్లినవే. అవి విష్ణు పురాణంలో ఉన్నా – మరొక దానిలో ఉన్నా – అవే ఇవి. ఆ గజేంద్రుడే. ఆ ప్రహ్లాదుడే. ఆ కుచేలుడే. ఆ దశావతారాలే. ఆ ధర్మ సంస్థాపనమే. అలాంటప్పుడేదైతేనేమి. విష్ణు పురాణం చదివితే నేమి – భాగవతం చదివవితేనేమి. అందులో విషయమే ఇందులో ఉన్నప్పుడేదైనా ఒక్కటే. ఏదైనా పఠన యోగ్యమే మనకు. ఒక విష్ణు పురాణమే చదువుతున్నామనుకొని చదివినా చదవవచ్చు గదా. మన మాస్తికుల మయినప్పుడు – మనకు కావలసింది భగవత్తత్త్వ విజ్ఞానమయినప్పుడు అందుకోవలసింది ఎప్పటికైనా జీవిత పరమావధి అయిన సాయుజ్య మయినప్పుడు – ఏదైతే నేమి నష్టం. అసలీ పురాణాలూ – కథలూ – అన్నీ కల్పితమే గదా. భగవత్సాయుజ్య ప్రాప్తి కది ఒక సంకేతమూ – ఒక ఆలంబనమేననే గదా ప్రతిపాదించాము. అది దేనివల్ల ఒన గూడితే మనకది ప్రామాణికం. ఒనగూడదో అది అప్రామాణికం. ఈ సూత్రాన్ని బట్టి చూస్తే విష్ణు పురాణాదుల లాగా భాగవతమూ మనకు ప్రామాణికమే.

అయితే కొన్నివైరుద్ధ్యాల మాటేమిటని అడగవచ్చు. అది మనం వ్యాఖ్యానించటం లోనూ సమన్వయించటంలోనూ ఉంటుంది. చక్కగా అర్థం చేసుకొని సమన్వయిస్తే

ఏ వైరుధ్యమూ ఉండబోదు. అది లేకనే ఈ విరోధాభాస. ఆ మాటకు వస్తే శ్రుతి స్మృతులలోనే ఎన్నో పూర్వాపర విరుద్ధాంశాలు గోచరిస్తాయి. అవి కేవల మాభాసమే గాని నిజానికే వైరుధ్యమూ లేదని భగవత్పాదుల లాంటి మహనీయులు తెలిపేంత వరకూ లోకానికి తెలియలేదు గదా. అలాగే ఇందులో కూడానని మనమర్థం చేసుకోవలసి ఉంది. అందుకేనేమో భాగవతము తెలిసి పలుకుట కష్టంబని మహాకవి వాపోయింది. తెలిసి పలకాలంటే ఏదైనా సామాన్యం కాదు. దానికి స్వకీయమైన ఆలోచన మాత్రమే సరిపోదు. విబుధ జనులతోడి సాంగత్యముండాలి. ఎవరా విబుధులు **"బుధా భావ సమన్వితాః"** అన్నది గీత. బుధాః అంటే **అవగత పరమార్థ తత్త్వాః** అని అర్థం వ్రాశారు భగవత్పాదులు. గ్రంథ పరమార్థమేదో అది గ్రహించినవాడే బుధుడు. అలాంటి వారే భాగవత వ్యాఖ్యాతలైన శ్రీధరాదులు. వారే పోతనకు మార్గదర్శకులు. మరి వారంతా భాగవతం వ్యాసరచితమనే విశ్వసిస్తూ వచ్చారు. కాబట్టి అటు లోకంలోనూ ఇటు కతిపయ పండిత లోకంలోనూ ఇంతగా ప్రఖ్యాతిగాంచిన ఈ పురాణాన్ని ప్రామాణికంగా స్వీకరించటంలో మనకిక అభ్యంతరం ఉండరాదు. ఎక్కడైనా కొన్ని చిక్కులుంటే విష్ణు పురాణ హరివంశాలుండనే ఉన్నాయి మనకు. వాటి వెలుగులో చూచి సమన్వయించుకోవచ్చు. ఆ మాటకు వస్తే అవి కూడా నిజానికి భాగవతమే గదా.

భాగవతమంటే ఏమిటసలు. భగవత ఇదమ్ భాగవతమన్నారు. భగవంతుడి చరిత్ర భాగవతం. భగోస్యాస్తీతి భగవాన్ అని భగవచ్ఛబ్దానికి వ్యుత్పత్తి. **"ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః జ్ఞానవైరాగ్యయోశ్చైవ - షణ్ణామ్ భగ ఇతీరణా"** అని విష్ణు పురాణ వచనం. జ్ఞానైశ్వర్య బల వీర్యయశో వైరాగ్య సంపదలనే ఆరు గుణాలకూ భగమని పేరు. ఈషాడ్గుణ్యమూ ఎవనిలో సమగ్రంగా ఉందో వాడు భగవానుడు. మరొక విధంగా కూడా నిర్వచిస్తారు భగవచ్ఛబ్దాన్ని **"ప్రవృత్తించ నివృత్తించ-భూతానా మాగతిమ్ గతిమ్-వేత్తి ధర్మ మధర్మంచ-సవాచ్యో భగవానితి"** ప్రవృత్తి నివృత్తులూ - గతా గతాలూ - ధర్మా ధర్మాలూ - ఈ ఆరూ పరిపూర్ణంగా తెలిసిన వాడే భగవంతుడట. ఏదైనా ఒక్కటే. ఒక్క మాటలో చెబితే జ్ఞానశక్తీ క్రియాశక్తీ రెండు శక్తులూ స్వత స్సిద్ధంగా సమగ్రంగా ఉన్నవాడని చెప్పవచ్చు. ఇవి జీవుడికీ ఉన్నాయి కాని సమగ్రం కావు. కావు గనుకనే వీడు ముముక్షువు. వాడు నిత్యముక్తుడు.

అలాటి నిత్యముక్తుణ్ణి భజిస్తే వీడూ భ్రమర కీటన్యాయంగా ముక్తుడవుతాడు. వీరిరువురికున్న ఈ ఆంతరిక సంబంధాన్ని నిరూపిస్తుంది గనుకనే భాగవతమనే సంజ్ఞ సార్థకమవుతున్నది భాగవతమంటే భగవంతుడి చరిత్ర కావచ్చు. భాగవతుల చరిత్ర కావచ్చునని గదా ఇంతకు ముందు పేర్కొన్నాము.

భాగవతానికి మరి రెండు నామధేయాలు కూడా ఉన్నాయి. ఒకటి సాత్వత పురాణం. వేరొకటి పారమ హంస్య సంహిత. సత్త్వగుణ ప్రధానుడు సత్త్వంతుడు. త్రిమూర్తులలో సత్త్వం విష్ణువుది. కాబట్టి సత్త్వంతుడంటే విష్ణువు. ఆయన గుణ చేష్టాదులను వర్ణించేది గనుక ఈ పురాణం సాత్వతమయింది. అంతేకాదు. ఆయనే గాక ఆయన భక్తులు కూడా సత్త్వగుణ ప్రధానులే. కనుక సాత్వతమంటే ప్రహ్లాదాది భాగవతుల చరిత్ర కూడా నని అర్థం చెప్పుకోవచ్చు. పోతే ఇక పారమ హంస్య మనే మాట. పరమ హంసలకు సంబంధించింది పారమ హంస్యం. కుటీచక బహూదక హంస పరమహంసలలో పరమహంస దానిని కూడా దాటిపోయి ఆత్మ విద్య పారాన్నే అందుకొన్నవాడు. అసలు హంస జీవాత్మ అయితే పరమహంస నిత్యముక్తుడైన పరమాత్మ. ఈ హంసలు రెండింటి వృత్తాంతమూ మనకు పురంజనో పాఖ్యానంలో వ్యంగ్యంగా వాచ్యంగా కూడా వివరించింది భాగవతం. అప్పటికి పరమాత్మకు చెందినదే పారమహంస్యమంటే. అలాంటి పరమాత్మ తత్త్వాన్ని అందుకోవలసిన వాడు గనుక ముముక్షువైన జీవుడికి చెందినది కూడా కావచ్చు. మొత్తం మీద ముముక్షువులైన గృహస్థులూ, సన్యాసులూ ఇద్దరూ దీని కధికారులే. ఆగమరూపమైన ఉపనిషత్తులు కేవలం సన్యాసులకే నని నియమమున్నా ఇది పురాణ సంహిత గనుక స్త్రీ శూద్రాది న్యాయాన్ని బట్టి మిగతా ఆశ్రమాల వారికి కూడా పఠన యోగ్యమే.

పోతే ఈ భాగవత మాహాత్మ్య మెలాటిదో మనకు మొదటి రెండు శ్లోకాలే ఎంతో మనోజ్ఞంగా ప్రతిపాదిస్తాయి.

జన్మాద్యస్యయతో ఽన్వయా దితరత శ్చార్థే ష్వభిజ్ఞః స్వరాట్
తేనే బ్రహ్మ హృదాయ ఆది కవయే - ముహ్యంతి యత్సూరయః
తేజో వారి మృదామ్ యథా వినిమయో యత్ర త్రిసర్గోమృషా
ధామ్నా స్వేన సదా నిరస్త కుహకమ్ సత్యమ్ పరమ్ ధీమహి

ధర్మః ప్రోజ్ఝిత కైతవో ఽత్రపరమో నిర్మత్స రాణామ్ సతామ్
వేద్యం వాస్తవ మత్ర వస్తు శివదమ్ తాపత్రయో న్మూలనమ్
శ్రీమద్భాగవతే మహాముని కృతే - కిమ్ వా పరైః కేశవ
స్సద్యో హృద్యవరుధ్యతే ఽత్ర కృతిభి-శ్శు శ్రూషు భి స్తత్ క్షణాత్

ఇందులో మొదటి శ్లోకం సత్యాన్నీ రెండవ శ్లోకం ధర్మాన్నీ పేర్కొంటున్నాయి. భాగవత పురాణం లోకానికి బోధించే అమూల్యమైన రహస్యాలివి రెండే. ఇవి రెండే మానవ జీవితానికి కావలసిన పరమార్థం కూడా. ఇంతకు మించి మరేదీ లేదు. ఇందులో సత్యమనేది త్రికాలా బాధ్యమై శుద్ధ చైతన్య రూపమై సర్వ వ్యాపకమై ఎప్పటికీ చెడని పదార్థం. అది మన స్వరూపమే. అదే మన జీవిత గమ్యం. పోతే ఆ గమ్యాన్ని చేర్చే గమకం రెండవదైన ధర్మం. అది గమ్యమైతే ఇది గమకం. అది లక్ష్యమైతే ఇది లక్షణం. అది సాధ్యమైతే ఇది సాధనం. ఒకటి చెప్పవలసినది. మరొకటి చేయవలసినది. కనుకనే **"సత్యం వద ధర్మం చర"** అన్న దుపనిషద్వాణి. సత్యం చేసేది గాదు. ధర్మం చెప్పేది గాదు. చెబితే చాలు సత్యం. చేసి తీరాలి ధర్మం. అంటే ఏమన్నమాట. సత్యమనేది జీవిత ధ్యేయంగా పెట్టుకొని ధర్మాన్ని పట్టుకొని పయనిస్తే అది ఎప్పటికైనా మనల నాధ్యేయాన్ని చేరుస్తుంది. అది ఇక మన స్వరూపమే కాబట్టి దానితో తాదాత్మ్యాన్ని భజిస్తే అది మానవుడికి మోక్షఫలాన్ని ప్రసాదిస్తుంది. కనుక ఈ సత్య ధర్మాలే ఏ మానవుడికైనా ఏ విద్య అయినా బోధించవలసింది. తద్వారా మానవుడు సాధించవలసింది.

రెండు మాటలూ మనకు వైదిక వాఙ్మయంలోనే సాక్షాత్కరిస్తాయి. వాటి అర్థం కూడా మనకు విదిత పూర్వమే. కాని ఇక్కడ భాగవత మారెండు మాటలనూ ఏ అర్థంలో ప్రయోగిస్తున్నదో అది కొంచెం సావధానంగా పరిశీలించవలసి ఉంది. శాస్త్రంలో సత్యమంటే కర్మఫలమైన స్వర్గం కావచ్చు. అపర విద్యా ఫలమైన హిరణ్యగర్భలోక ప్రాప్తి కావచ్చు. అవి రెండూ ఆపేక్షికమైన సత్యమే గాని నిరపేక్షమైనది కాదు. ప్రస్తుతం భాగవతం వర్ణించేది కేవలం నిరపేక్షమైన పరిపూర్ణమైన సత్యం. అది ఎలాంటిదో మరి దాని లక్షణమేమిటో వివరిస్తున్నాడు. **జన్మాద్యస్యయతః** స్వతహాగా అది పరమైనా అదే మరలా అపరం కూడా. స్వరూపతః పరమైతే విభూతితః

అపరం. దాని విభూతే ఈ జగత్తంతా. దీని జన్మస్థితి భంగాలకన్నింటికీ అదే కారణం. కారణముంటేనే కార్యం. లేకుంటే లేదు. ఇలా అన్వయ వ్యతిరేకాలను బట్టి చూస్తే ఈ కనిపించే జగద్విభూతి అంతా దానికే మాత్రమూ భిన్నం కాదు. పోతే అది ఏమిటీ ఎలా ఉంటుందా స్వరూపం. **అర్థేష్వభిజ్ఞః స్వరాట్.** అన్ని విషయాలూ తెలుసుకొనేది స్వతస్సిద్ధమైనదీ అది. అంటే చిద్రూపం – సద్రూపమని భావం. **తేనే బ్రహ్మ హృదాయ ఆది కవయే** – అలాంటి ఆ శుద్ధమైన సచ్చిద్రూపాన్ని ఆకళించుకొని అనుభవానికి తెచ్చుకోవాలంటే అందరికీ సాధ్యం కాదు. ఆగమ జ్ఞానమనే దీప ప్రకాశంలోనే మనకది అవగాహనకు వచ్చేది. బ్రహ్మమంటే అలాటి శబ్ద బ్రహ్మం. లేదా బ్రహ్మాకార భావన. దానిపాటికది కలగదు. సద్గురూప దేశం కావాలి దానికి. ఆది గురువా నారాయణుడే. ఆయనే ఆది కవి హిరణ్యగర్భుడికి ప్రపథమంగా అనుగ్రహించాడా విద్య. భగవదను గ్రహమే లేకపోతే ముహ్యంతి యత్సూరయః ఎంత మేధావంతులైనా స్వయంగా ఊహించి పట్టుకొనే విషయం కాదు. ఏమి. ఎందుకని. **"తేజో వారి మృదాం యథా వినిమయో – యత్ర త్రిసర్గోమృషా** – తేజో బన్న రూపంగా త్రివృత్కృతమైన ఈ సృష్టి అంతా విచారిస్తే అసలు నిజంగా సృష్టి కాలేదు. అయినట్టు భాసిస్తున్నదంత మాత్రమే. ఎంచేత. ఆ సచ్చిత్తులే ఈ త్రిగుణాత్మకమైన జగత్తుగా మరొక వేషం వేసుకొని కనిపిస్తున్నది మనకు. దీనికే సంస్థానమని పేరు. మృత్తికే ఘటశరావాది రూపాలుగా సంస్థితమై కనిపిస్తుంది. ఈ సంస్థానాలా మూలపదార్థం కంటే వ్యతిరిక్తం కాదు గదా. అలాగే చైతన్యమే ఆయా చరాచర పదార్థాలుగా భాసిస్తూంది కాబట్టి అంతా చైతన్యమే. తద్భిన్నంగా ఏదీ సృష్టి కాలేదసలు. కనుకనే అది అపరమైతే ఇది పరమని చెప్పటం.

అయితే అంతా అదే అయిన నాడు నామరూపాది సృష్టి మనకిలా నిత్యమూ ఎందుకు ప్రత్యక్షమవుతున్నది. అసత్యమైనా ఎలా గోచరిస్తున్నది. అదే మాయ. కుహకమంటే మాయే. లేనిదున్నట్లు భాసిస్తే అది మాయగాక మరేమిటి. అందుకే ఇది ఎందుకు ఎలా అని ప్రశ్నలేదు. ఎలా తొలగించుకోవాలనే మనం వేయవలసిన ప్రశ్న. ఆ ప్రశ్నకు జవాబు అన్వేషిస్తూ పోతే అది ఆఖరయ్యే సరికన్ని ప్రశ్నలకూ అక్కడే పరిష్కారం లభిస్తుంది. **"ధామ్నా స్వేన సదా నిరస్తకుహక"** మనే మాట కర్థం. కుహక మనేది నిరస్తం కావాలి ఇంతకూ దాన్ని నిరాసం చేయాలంటే ఏమిటి

మార్గం. ధామ్నా స్వేన - స్వకీయమైన ధామమే. ధామమంటే తేజస్సు ప్రకాశం. స్వకీయమంటే తనకు సంబంధించిన అంటే తన ఆత్మచైతన్య ప్రకాశంతోనే తన అజ్ఞాన తిమిరాన్ని పారదోలాలి. ఇది నా చైతన్యమే - నేనే - ఈ సృష్టిలో నాకేది తారసిల్లినా అది సత్త్వమే చిత్త్వమే-అని తద్రూపంగా మార్చుకొని తదేక దృష్టితో ప్రతి ఒక్కటీ దర్శిస్తూ పోతే ఆ వెలుగులో ఈ త్రిగుణాత్మక ప్రపంచమనే చీకటి పటాపంచెలు గాక తప్పదు. అప్పుడపరంపోయి పరమే మిగులుతుంది మనకు. అది ఈ ప్రపంచానికీ మనకూ రెంటికీ ఏకైకమైన స్వరూపమని అనుభవానికి రాగలదు. ధీమహి-అలాంటి అఖండా ద్వితీయానుభవం కలిగేదాకా దాని కాలంబనంగా దీన్ని మనం తద్రూప భావనతో ధ్యానం చేయటమొక్కటే శరణ్యమని భావం.

ఆత్మప్రకాశంతోనే అజ్ఞాన తిమిరాన్ని దూరం చేసుకోవాలనీ అదే పరతత్త్వాన్ని అందుకొనే మార్గమనీ చెప్పాము. అలా నిత్యమూ దూరం చేసుకొని కూచున్నవాడు పరమాత్మ. సదా నిరస్త కుహకమైన తత్త్వమది. పోతే అలాంటి భాగ్యానికి నోచుకోలేదీ జీవుడు. మరి వీడలాంటి అదృష్టానికి నోచుకోవాలంటే ఏమిటుపాయమని ప్రశ్న. దీనికి సమాధానమే రెండవ శ్లోకం. **"ధర్మః ప్రోజ్ఝితకైత వోత్ర పరమః"** సత్యం గమ్యమైతే ధర్మమే దానికి సాధనం. ధారణా ద్ధర్మ ఉచ్యతే. సత్యాన్ని దర్శించేదాకా సాధకుణ్ణి ధరించి ఉండేదేదో అది ధర్మం. కనుకనే ఇది వేద చోదితమైన సామాన్య ధర్మం కాదు. వేదం బోధించే ధర్మం ప్రవృత్తి రూపం. దానివల్ల కలిగే ఫలం మహా అయితే సత్యలోక ప్రాప్తి. అంతకు మించి లేదు. పోతే ఇది ప్రవృత్తిగాదు. నివృత్తి లక్షణం. భాగవత ధర్మమంటారు దీన్ని. భగవత్తత్త్వాన్ని ఉన్నదున్నట్టు పట్టుకోటానికిది ఒక్కటే ఆలంబనం. కనుకనే అది పరమయితే ఇదీ పరమమే. పరమం కనుకనే కైతవం Fraud లేదు దీనిలో. ప్రవృత్తి ధర్మంలో కావలసినంత ఉంటుందది. ఫలకామనా-కర్తృత్వ బుద్ధీ-ఇవి రెండూ దానిలోని కైతవాలు. రామాయణ భారతాలలో ఇలాటి కైతవ ధర్మం అక్కడక్కడా దర్శనమిస్తుంది మనకు. అందుకే అవి ఇతిహాసాలయింది. కాగా భాగవతం పురాణం. మోక్షైక పరాయణమిది. ఇందులో ఏ మాత్రం కల్మషమున్నా పనికిరాదు. నిష్కల్మషమయిన భాగవత ధర్మాన్నే బోధించాలి. ఎవరిదా ధర్మం. ఎవరాచరించాలి. ఆచరిస్తేనే గదా అది ధర్మమయ్యేది. ఎవరా ఆచరించేవారు. **"నిర్మత్స రాణాం సతాం"** మాత్సర్య గంధం కూడా లేని సత్పురుషులు.

వారే నిజమైన భాగవతులు. వారు రాగద్వేషాలనే ద్వంద్వాలను జయించిన వారు. ద్వంద్వాల స్పర్శ ఏ మాత్రమున్నా అది మాత్సర్యం క్రిందికే వస్తుంది. ఇలాటి మహనీయులాచరించే ధర్మాన్నే భాగవతం కథారూపంగా నిరూపిస్తుంది.

సరే కథలన్నారు మీరు. కథలన్నీ కాల్పనికాలే గదా. అవి మనకెలా ఉపకరిస్తాయి అని శంకించవచ్చు. కథ కల్పానికమైనా అది ప్రతిపాదించే వస్తువు మాత్రం కాల్పనికం కాదు. అది వాస్తవం. ఎంచేతనంటే అది శివదమ్. శ్రేయోరూపమయిన సత్యాన్ని మనకు చాటుతున్నది. అది శ్రేయస్సయినందుకేమిటి దాఖలా. **'తాపత్రయోన్మూలనమ్'** ఆధ్యాత్మికాది తాపాలు మూడూ బలాదూరు కావటమే దాఖలా. ధర్మంలాగా అదృష్ట ఫలం కూడా కాదిది. దృష్ట ఫలం. జీవితంలోనే అనుభవానికి వచ్చే విషయం. కనుకనే కథలన్నీ కల్పితమయినా వాటి తాత్పర్య రూపమైన ఈ వాస్తవాన్ని మనం గుర్తించవచ్చు. అదే మనకు వేద్యం. ఇలా భాగవతాన్ని రచించి మనకు మేలు చేశాడు మహాముని. **"కింవా పరైః"** ఇక మనకు శాస్త్రాలూ, గ్రంథాలూ, ప్రసంగాలూ దేనికి. **"కేశవః సద్యో హృద్యవరుధ్యతే ఽ త్రకృతిభిః"** ఈశ్వరుడు మన హృదయంలోనే నిలిచిపోతాడు. నిలిచే ఉన్నాడెప్పుడూ. అయితే మరిచిపోయా మా రహస్యాన్ని. దాన్ని జ్ఞాపకం చేసేదే పురాణం. అది జ్ఞప్తికి తెచ్చుకోగలవాడే కృతి. ధన్యుడని అర్థం. **"శుశ్రూషుభిస్తత్ క్షణాత్"** అయితే దానికి ముందు శుశ్రూషువులం కావాలి. అంటే పురాణాన్ని చక్కగా శ్రవణం చేయాలి. చేస్తే ఎంతో కాలం పట్టదు. మరుక్షణమే పట్టుకోగల మా మార్గాన్ని. అలా అందుకొన్నందుకు భాగవత కథా శ్రవణం చేసిన శుకుడూ పరీక్షిత్తూ శౌనకాది మహామునులే మనకు తార్కాణం.

ఇక్కడికి పురాణానికి ప్రతిపాద్యమైన సత్య ధర్మాలనే రెండు అంశాలూ మనకు తేటపడ్డాయి. ఇందులో మొదటిది చేరవలసిన స్థానమైతే రెండవది చేర్చే సాధనమని చెప్పాను. ఇవి రెండూ సాంగో పాంగంగా తెలిస్తే ఇక తెలియవలసిందేదీ లేదు. వీటిని చెప్పటానికే అవతరించిందసలీ పురాణం. దీనినే భంగ్యంతరంగా బయట పెడుతున్నది మరొక మాట. మత్స్య పురాణంలో ఒక విషయముందట. అదేమిటంటే వృత్రాసురవధా గాయత్రీ మంత్రార్థమూ ఎక్కడ ప్రస్తావించబడతాయో అదే భాగవతమని. ఈ మాట మూల భాగవతంలో లేదు గాని తద్వ్యాఖ్యాత అయిన శ్రీధరాచార్యులుదాహరించారు. దానిని పరిశీలించి పోతన తన అనువాద గ్రంథంలోనే

పేర్కొన్నాడు. ఈ వృత్రవధ గాయత్రీ మంత్రార్థాలకూ భాగవతం ప్రతిపాదించే సత్య ధర్మాలకూ ఏమిటి సంబంధం. అదే గొప్ప రహస్యం. సత్య ధర్మాలకు ప్రతీకలే అవి. ఇందులో సత్యానికి ప్రతీక వృత్ర వధ అయితే ధర్మానికి ప్రతీక గాయత్రి. అది ఎలాగో చూతాము.

"ధామ్నా స్వేన సదా నిరస్త కుహక"మని ఉన్నది సత్య ప్రతిపాదకమైన మొదటి శ్లోకంలో. నిరస్త కుహక మయిందట సత్యం. కుహకమంటే అజ్ఞాన తిమిరమని చెప్పాము. తిమిరం లాగానే అది ఆవరణ రూపమయినది. వృత్రమంటే ఆవరణమనే అర్థం. వృత్రాసురుడప్పటి కెవరో గాదు. నిత్యమూ చైతన్య తత్త్వాన్ని ఆవరించిన మహామాయ. అది పరమేశ్వరుడికి వశవర్తిని అయినా మనపాలిటికి గళ గ్రాహిణి. అసుషు రమత ఇత్యసురః నిత్యమూ తన ప్రభావం చేత మానవుణ్ణి విషయసుఖ లంపటుణ్ణి చేసి దానిలోనే ముంచి వేస్తుంది. దానికి కారణం దాని త్రిగుణాలే. సత్త్వరజస్తమస్సులనే ఆ త్రిగుణాలే త్రిశీర్షాలు. త్రిశీర్షుడంటే త్వష్ట్ర ప్రజాపతి. త్వష్ట్ర అంటే తొలిచే స్వభావమున్నవాడని అర్థం. అలాంటి స్వభావమున్నది మాయాశక్తి. దానికున్న త్రిగుణాలే ఈ త్రిశీర్షాలు. అందులో ఒకటి అన్నాదమట. ఇది తమోగుణం. మరొకటి సురాదం. ఇది రజోగుణం. ఇంకొకటి సోమాదం. ఇది సత్త్వగుణం. ఈ మూడింటి వల్లా మనకు ఆవరణమనేది ఏర్పడి స్వరూప జ్ఞానం లేకుండా పోయింది. అదే వృత్ర విజృంభణం. దానిని మనమింద్రులమై జయించాలి. ఇదమ్ద్ర అనేదే ఇంద్ర అయిందని శాస్త్రం. ఇదం అంటే మాయా జన్యమైన జగత్తు. దీనిని ద్ర చూస్తున్నాము మనం. ఇది గాదు చూడవలసింది. దీని కతీతమైన మన అసలు తత్త్వాన్ని చూడాలంటే దానికీ వృత్ర వధ ముఖ్యం అంతకు ముందు దానికి నిమిత్తమైన త్రిగుణాలు నశించాలి, కనుకనే మొదట త్రిశీర్షచ్ఛేదమూ తరువాత వృత్ర సంహారమూ జరిగినట్టు చూపుతుంది పురాణగాధ. దానితో కుహక నిరాసం సమాప్తమవుతుంది. ఇదంతా కుహక నిరాసమనే మాట కల్లుకొంటూ పోయిన ఆఖ్యాయిక.

పోతే ఇక రెండవ శ్లోకంలో **"ధర్మః ప్రోజ్ఝిత కైతవః"** అనే మాట. ఈ భాగవత ధర్మానికి ప్రతీకే గాయత్రీ మంత్రం.

ఓమ్ తత్సవితు ర్వరేణ్యమ్
భర్గో దేవస్య ధీమహి
ధియో యోనః ప్రచోదయాత్

ఇది గదా గాయత్రి అంటే. సవిత అంటే సర్వజగత్తునూ సృష్టించిన పరమాత్మ. తన పాటికి తాను సృష్టించ లేదాయన. ఆయన నాశ్రయించి ఒక శక్తి ఉన్నది. అదే భర్గః తేజోరూపిణి. మహామాయ. తేజో ఽబన్నాత్మకంగా గదా సృష్టి జరిగింది. తేజస్సే సృష్టికి మూలం. సవితకు చెందింది కాబట్టి దానికి సావిత్రి అని పేరు. ఇది సృష్టిలో మరి ఎక్కడా అభివ్యక్తం కాలేదు. ఒక్క మానవుడి బుద్ధిలోనే అయిందది. కనుక ఈ బుద్ధి ద్వారా ఎప్పటికైనా దానినే మనం పట్టుకొని పోవాలి. అదే మనకు వరణీయం లేదా వరేణ్యం. అంటే భజించవలసినదని అర్థం. అలా భజిస్తే అది మన బుద్ధులను అధోముఖంగా ఈ అనాత్మ జగత్తు వైపు ప్రసరించకుండా ఊర్ధ్వముఖంగా ఆత్మస్వరూపమైన ఆ తత్పదార్థమైన పరమాత్మ వైపే మళ్లించి మనకు సాయుజ్యాన్ని ప్రసాదిస్తుంది. ఇదే **"ధియో యోనః ప్రచోద యాత్త"**నే దాని అర్థం. దీనితో మొదట జగత్సృష్టికి హేతుభూత అయిన సావిత్రి – మరలా జగత్ప్ర విలాపనం merger ద్వారా బ్రహ్మ సాయుజ్యానికి దారితీస్తూ గాయత్రిగా పరిణమించింది. గానాత్త్రాయత ఇతి గాయత్రీ. తన్ను గానం చేస్తూ భజించే వారిని క్రమంగా తన మూల స్థానాన్ని చేర్చి కాపాడుతుంది. కాబట్టి గాయత్రి అనే మాట సార్థకమవుతున్నది. ఒకటి బంధావస్థకైతే మరొకటి మోక్షావస్థకు. ఇవే తిరోధాన అనుగ్రహముఖాలు మాయాశక్తికి.

సరిగా ఈ శక్తి ద్వయ గర్భిణి అయిన గాయత్రికి సంకేతమే ధర్మమనే మాట. అది కైతవంతో కూడినదైతే తిరోధానం. సంసార బంధానికే దారితీస్తుంది. అలాకాక ప్రోజ్ఝిత కైతవమైతే అనుగ్రహం. భగవత్సాయుజ్యానికే చేయూత నిస్తుంది. ఇలాటి మోక్షధర్మాన్నే భాగవతం నిరూపిస్తుంది. భగవద్భక్తులందరూ పాటించిన, పాలించిన ధర్మమదే. భర్గోదేవస్య ధీమహి అని యావజ్జీవమూ వారు ఎలాంటి ఆపదలు సంభవించినా విడవకుండా దానినే అంటి పట్టుకొని జీవితం గడిపారు. కనుకనే వారి బుద్ధులనీ సంసార బంధం నుంచి తప్పించి అది క్రమంగా వారి నా పరమ పదాన్ని చేర్చేందుకే తోడ్పడింది.

ఈ ప్రకారంగా సత్య ధర్మ ప్రతిపాదన కోసమే ఈ రెండు వృత్తాంతాలూ భాగవతంలో ప్రస్తావించబడ్డాయని తోస్తుంది. ఇందులో వృత్రవధ భాగవతం సాక్షాత్తుగానే వర్ణిస్తుంది. గాయత్రిని మాత్రం అలా వర్ణించినట్టెక్కడా కనిపించదు. సాక్షాత్తుగా లేకపోయినా పరం పరయా దానిని కూడా పరామర్శించటం మాత్రం జరిగింది. అది కొంచెం సూక్ష్మదృష్టితో చూస్తేగాని తెలియదు. కృష్ణావతారానికి ముందు యోగమయ ఆవిర్భావం జరిగింది. ఆవిడను కంసుడు పైకి ఎగురవేయగానే అలాగే ఆకాశంలో నిలిచిపోయింది. అంతేగాక అష్ట బాహువులతో భయంకరంగా సాక్షాత్కరించింది. ఆయోగమాయే గాయత్రి. గాయత్రి దేవికి సరిగా అష్ట బాహువులే. **"ఉత్తమే శిఖరే జాతే-ప్రచోదయంతీ పవనే ద్విజాతా"** ఇలాంటి గాయత్రీ వర్ణన చూస్తే ఆవిడ ఆకాశంలో సంచరిస్తున్న దివ్య సుందరమూర్తి మనకు ప్రత్యక్షమవుతుంది. ఆ యోగమాయనే దుర్గ, కాళి, భద్ర అని అనేక నామాధేయాలతో లోకులు పూజిస్తారని భాగవతం పేర్కొనటం కూడా చూస్తే ఆ దేవత ఎవరో గాదు - సకల జనారాధ్య అయిన గాయత్రీ మంత్రాధి దేవతేనని స్పష్టంగా తెలిసిపోతుంది. ఇలా మంత్ర స్వరూపాన్ని వాచ్యంగా కాక భంగ్యంత రంగా ధ్వనింపజేస్తున్నది భాగవతం.

కనుక వృత్ర వధ గాయత్రీ మంత్రార్థమెక్కడ ప్రస్తావించబడితే అది భాగవత మనటంలో ఇదీ అంతరార్థం. దీనికింకా ఉపోద్బలకమైనవి మనకు భాగవతారంభం లోనే రెండు వృత్తాంతాలు కనిపిస్తాయి. ఒకటి శుకుడిది. మరొకటి వ్యాసుడిది. వీరిరువురే భాగవత కథా సౌధ నిర్మాణానికంతటికీ మూలస్తంభాలు. వీరు లేకుంటే భాగవతమే లేదు. ఇందులో నారదుడు వ్యాసుణ్ణి భాగవత రచనకు ప్రేరణ చేస్తే శుకుడా వ్యాసరచితమైన భాగవతాన్ని ప్రచారం చేశాడు. వీరిలో శుకుడు వైరాగ్యమనే భావానికి సంకేతమైతే నారదుడు అభ్యాసానికి ప్రతీక. అభ్యాస వైరాగ్యాలే మోక్షవిద్య కాలంబనాలు. మానవుడి మనస్సు కొకటి అనులోమంగా మరొకటి ప్రతిలోమంగా చక్కని శిక్షణ ఇచ్చి చివరకు మోక్షఫలాన్ని తప్పకుండా ప్రసాదిస్తాయి. **"అభ్యాసేనతు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే"** అని గీత బోధించటంలో ఇదే తాత్పర్యం. **"అభ్యాస వైరాగ్యాభ్యామ్ తన్నిరోధః"** అనే పాతంజల సూత్రానికి కూడా ఇదే ధ్యేయం. పోతే ఈ అభ్యాస వైరాగ్యాలేవో కావు మరలా. మనమింతకు ముందు నుంచీ చెప్పుకొనే సత్య ధర్మాలకు మారు పేర్లే. సత్యమే వైరాగ్యం ధర్మమే అభ్యాసం. సత్యమనేది

నిరస్త కుహకం. నిరస్త కుహక మన్నప్పుడది వైరాగ్యమే. అనాత్మ జగత్తు మీద విరక్తి చెందటమే గదా కుహక నిరాసం. ఇది శుకుడి వ్యవహారంలో అక్షరాలా సాక్షాత్కరిస్తుంది. **"శుకుడు గోచియు లేక"** గోచిపెట్టటం దగ్గరి నుంచీ విరక్తుడతడు. గోదోహన మాత్ర కాలం కూడా ఒకచోట నిలిచేవాడు కాడు. పుత్రా పుత్రా అని తండ్రి వెంటబడ్డా తిరిగి చూడని మమకార దూరుడు. దారిలో స్త్రీలో పురుషులో కూడా ఎవరో కన్నెత్తి చూడని ముక్తసంగుడు. సర్వసముడు. తన్ను పిలిచిన వారికి తనకు మారుగా సమస్త ప్రకృతి చేతనే సమాధాన మిప్పించగల సర్వాత్మభావ సంపన్నుడు. వైరాగ్యానికింత కన్నా పరమావధి ఏముంది. సత్యంతో తాదాత్మ్యం చెందిన వాడికే అది దక్కుతుంది.

కాగా నారద మహర్షి అభ్యాసానికి ప్రతీక అని పేర్కొన్నాము. **నారమ్ దృతీతి నారదః** నర సంబంధి అయిన అజ్ఞానాంధకారాన్ని చీల్చి పారేసినవాడు నారదుడు. తాను పారవేయటమే గాదు. నారమ్ దదాతి. నారమంటే నరులకు కావలసిన బ్రహ్మజ్ఞానం. దాన్ని ప్రసాదించే వాడు కూడ నారదుడే. స్వయం తీర్ణః పరాంస్తారయతి అన్నారు. తాను తరించి ఇతరులను తరింపజేయాలి. అభ్యాస శీలుడైన వాడు చేయవలసిన పని అదే. కేవల విరక్తుడైతే వాడాత్మారాముడు. అభ్యాసి లోక సంగ్రహ పరాయణుడు కూడా. శుకుడు ఆత్మారాముడైతే – నారదుడు లోక సంగ్రహ తత్పరుడు. అయితే ఆత్మారాముడు లోకులకెంత మాత్రమూ ఉపయోగపడడని కాదు మరలా. అలాగైతే శుకుడు పరీక్షిత్తు వద్దకు వచ్చేవాడే కాదు. భాగవత ప్రవచనం చేసి ఉండేవాడే కాదు. రావచ్చు. చేయవచ్చు. కాని అది కాదాచిత్కం వాడికి. **"యొంతస్సు ఖోంతరారామ"** అన్నట్టు ఆత్మారామం తప్ప బాహ్యారామమంతగా పట్టదలాంటి వాడికి. వాడే శుకుడు. పోతే నారదాదులలాంటి కేవలాత్మారాములు కారు. ఆత్మ జ్ఞాన నిష్ఠే లేదని కాదు వారికి. అది ఉంటూనే దానితో పాటు లోకోద్ధరణ దృష్టి కూడా ఉంటుంది. అందుకే శుకుడు లోకానికి చాలావరకు దూరదూరంగా ఉండిపోతే నారదుడు సదా లోకంతో సంసర్గం పెట్టుకొని మూడు లోకాలూ సంచరిస్తుంటాడు. దేవతలూ, మానవులూ, దానవులూ మూడు జాతులతోనూ సంబంధమే ఆయనకు. అంటే త్రిగుణాతీతుడయి మరలా త్రిగుణాత్మకమైన సృష్టితో వ్యవహరిస్తూ ఉంటాడని భావం. అలా వ్యవహరిస్తూ కూడా వాని స్పర్శ ఏ మాత్రమూ సోకని వాడాయన.

ఇది బ్రహ్మాభ్యాస శీలుడైన వాడి లక్షణం. **"తచ్చింతనమ్ తత్కథనమ్ అన్యోన్యం తత్ప్రబోధనమ్ - ఏతదేక పరత్వంచ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః"** అన్నారు పెద్దలు. ఇదే నారదుని జీవితంలో మనకు కనిపించే వ్యవహారం. భాగవత ధర్మానికి ప్రతీక అని చెప్పాము. తద్ధర్మ సంకీర్తనమే గాయత్రి. నారదుని వీణా గానమదే. బ్రహ్మాకార వృత్తి అని అర్థం. అది నిరంతర మాలపిస్తున్నాడంటే గాయత్రీ మంత్రాన్నే కీర్తిస్తూ తిరుగుతున్నాడని భావం. **"పరో రజసిసావ దోమ్"** అనే నాలుగవ పాదంతో కలిసి గాయత్రికి ముప్పది రెండక్షరాలు. అవి సరిగ్గా వీణకుండే ముప్పది రెండు మెట్లకూ చక్కగా సరిపోతాయి. **"దేవదత్తా మిమామ్ వీణామ్ గాయ మానశ్చరామ్యహమ్"** దేవదత్తమైన ఈ వీణ పట్టుకొని గానం చేస్తూ చరిస్తున్నానని స్వయంగానే చెప్పుకొంటాడు. అంతేగాదు. **ప్రగాయతః స్వవీర్యాణి ఆహూత ఇవ మే శీఘ్రం దర్శనం యాతి చేతసి.** అలా భగవద్గుణ గానం చేస్తూ క్రుమ్మరుతుంటే ఆ భగవానుడెప్పుడూ నా మనోనేత్రానికి దర్శనమిస్తుంటాడని కూడా చాటుతాడు. ఇలా గానం చేయటమే గాయత్రీ మంత్ర పఠనం. తద్ద్వారా బ్రహ్మాభ్యాసం నిరంతరమూ తాను చేయటమే గాక ముముక్షులోకానికంతటికీ అందిస్తున్నాడు నారదుడు. ఆయన ఈ వ్యవహారం గాయత్రీ మంత్రార్థ సంకేతం. అదే భాగవత ధర్మం.

మొత్తానికిలా మానవ జీవిత సర్వస్వమైన సత్యధర్మాలను రెంటినీ సూటిగానూ వృత్రాసురాది వృత్తాంతాలతో చాటుగానూ వేనోళ్ళ చాటుతున్నదీ భాగవత మహాపురాణం మనకు. భాగవత కథా ప్రవర్తకులైన శుక నారదులు కూడా ఆ రెండు ఆదర్శాల కోసం నడుముకట్టి నిలిచిన వారేనని తేటపడుతున్నది. ఇలాటి మహోదాత్తమైన మోక్షైక ప్రయోజనమైన సర్వజన మనోజ్ఞమైన - భాగవత మహత్త్వాన్ని ఏమని వర్ణించటం. **"నిగమ కల్ప తరోర్గళితమ్ ఫలమ్"** వేదమనే కల్పవృక్షానికి పండిన ఒకానొక అద్భుతమైన ఫలమది. అది కూడా పతితం కాదు. గళితమట. ఒక్కసారిగా చెట్టునుంచి పడితే అది క్రిందబడి పగిలిపోతుంది. రసం చిందర వందరై దానిని మన మాస్వాదించలేము. అంచేత దానిని నెమ్మదిగా చిక్కంపెట్టి క్రిందికి జారేలాగా జార్చుకోవాలి. అలాంటి చిక్కమేదో గాదు. శుకముఖా దమృత ద్రవ సమ్మితమ్. శుక ముఖమే ఆ చిక్కం. శుకమంటే చిలుక. చిలుక కొరికన పండు చాలా మధురంగా ఉంటుందని లోకంలో వాడుక. అమృత సమానమది.

ప్రస్తుత మీ భాగవతమనే ఫలం కూడా శుకముఖ దష్టమే. శుకమహర్షి వదనం నుంచే గదా ఊడి పడ్డదది. ఇది కూడా అమృతోపమానమే. అమృతోపమానం గాదు. అమృతమే. అమృతత్వాన్నే మనకు ప్రసాదించే ఫలమది. ఇంకా గొప్పది. పిబత భాగవతం రసమాలయం. ఇలాంటి భాగవత రసాన్ని పానం చేయాలి మనం. ఫలమన్నారు. రసమన్నారు. ఇంతకూ ఫలాన్నా మనం పానం చేయవలసింది రసాన్నా. ఫలమని చెబుదామా దాన్ని భక్షించవలసిందే గాని పానం చేయటానికి లేదు. పోనీ రసమనుకొందామా ఫలమనే ఆశ్రయం లేకుండా నిరాధారంగా ఎక్కడా లేదది మనం పానం చేయటానికి. మరేమిటి గతి. అందుకే ఫలమనీ రసమనీ కూడా పేర్కొనటం. ఏది ఫలమో అది రసమే. ఏది రసమో అది ఫలమే. రెంటికీ ఇలా సామానాధికరణ్యం Identity చెప్పటం వల్ల ఫలమని పేరేగాని అదంతా రసమయమే నని తేట పడుతున్నది. లోకంలో ఫలం లాంటిది కాదప్పటికి. లౌకికమైన ఫలంలో రసం కానిదెంతో ఉంటుంది. పనికి రానిది. తొక్క టెంకె గింజ పీచు ఇలాంటి దెంతైనా ఉంటుంది. దానిని వర్జించి గాని మనమా ఫలాన్ని భక్షించటానికి లేదు. ఇక్కడ అలా కాదు. ఫలమంతా రసమే. అంటే హేయమైన అంశమందులో ఏ మాత్రమూ కానరాదు. అంతా మన కుపాదేయమే. అలాటిది ఈ భాగవత ఫలమని భావం.

అందుకే పిబత – ఆస్వాదించండని ప్రబోధిస్తున్నాడు మహర్షి. ఎంత కాలం. ఇంత కాలమని ప్రశ్నేలేదు. ఆలయమ్ – లయమయ్యేదాకా ఆస్వాదించవలసిందే. అంటే మన మనసు దానిలో లయమయి అమనస్కయోగం సిద్ధించే దాకా నైనకావచ్చు. లేదా **"ఆ సుప్తేరామృతేశ్చైవ నయే ద్వేదాంతచింతయా"** అన్నట్టు ఆ మరణాంతమూ అయినా కావచ్చు. లేదా అసలీ జీవభావమే లయమై మనకా బ్రహ్మ భావం సిద్ధించేదాకా ఎన్ని జన్మలకైనా కావచ్చు. మొత్తంమీద జీవేశ్వరుల మధ్య ఉండే ఉపాధి భేదం పూర్తిగా నశించిపోవాలి. అంతదాకా ఎన్ని జన్మలు పట్టినా పరవాలేదు. సేవిస్తూనే పోవచ్చు ఈ భాగవతామృత రసాన్ని మానవుడు. అదీ రోజుకొక మారు లాంఛనార్థంగా చేసి కూచోటం కాదు. దీర్ఘకాల నైరంతర్య సత్కార సేవితః అన్నట్టు నిర్విరామంగా ప్రతిక్షణమూ సేవిస్తూనే పోవాలి. అప్పుడే అది ఫలకారి మనకు. అందుకే **"ముహు రహో రసికా భువి భావుకాః"** అని హెచ్చరిక. అయితే ఇలా ముహుర్ముహు రుపసేవనా శీలురం కావాలంటే మనం రసికులమూ, భావుకులమూ

అయి ఉండాలి. రసగ్రహణ సమర్థుడే రసికుడు. రసోవైసః అని పరమాత్మ అసలు రస స్వరూపుడు. ఆ రసాన్ని భజించాలంటే ఈ భజించే మానవుడిలో కూడా ఆ గుణముండి తీరాలి. నిసర్గ సిద్ధంగా అలాటి గుణమొకటి ఉంటే అది క్రమంగా భావన చేసే కొద్దీ పరిపక్వమయి చివరకు తానూ పూర్ణరస స్వరూపుడే అవుతాడు జీవుడు. కనుకనే భావుకుడు కూడా కావాలని చెప్పటం. ఇందులో రసికత్వమనే గుణం నైసర్గికమైతే భావుకత్వం సాంస్కారికం. రెండూ ఒనగూడితేనే ఫలసిద్ధి.

ఇంతటి మహోఫలాన్ని ప్రసాదిస్తున్నదీ మహాపురాణం. ఈ పురాణ స్వరూపాన్నంతటినీ ఒక కల్ప వృక్షంతో పోల్చి ఎంతో మనోహరంగా వర్ణించాడు పోతన మహాకవి. అభీష్ట ఫలప్రదాయి గనుక నిజంగా అది కల్పకమే. సందేహం లేదు. అందుకే ఈ రూప కల్పన.

లలిత స్కంధము కృష్ణ మూలము - శుకాలా పాభిరామంబు - మం
జాలతా శోభితమున్ - సువర్ణ సుమన స్సుజ్ఞేయమున్ - సుందరో
జ్జ్వల వృత్తంబు - మహోఫలంబు - విమల వ్యాసాల వా లంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్వీన్ సద్విజ శ్రేయమై

ఈ పద్యం పోతన స్వతంత్రం రచన. దీనికి మూల భూతమైన శ్లోకం మాతృకలో కానరాదు. కాని నన్నయ భారతంలో దీని కనురూపమైన పద్యమొకటి కనిపిస్తుంది.

అమితా ఖ్యానక శాఖ లం బొలిచి వేదార్థ మలచ్ఛాయమై
సుమహా వర్గ చతుష్క పుష్ప వితతిన్ శోభిల్లి - కృష్ణార్జునో
త్తమ నానాగుణ కీర్తనార్థఫలమై - ద్వైపాయనో ద్యానజా
త మహాభారత పారిజాత మమరున్ - ధాత్రీసుర ప్రార్థ్యమై

భారతమనేది ఒక పారిజాతమనుకొంటే దాని కాశ్రయమైన ఉద్యానవనం ద్వైపాయనుడైన వ్యాసమహర్షి. ఆ పారిజాతానికి శాఖలనేవి ఏవో కావు. అసంఖ్యాకమైన ఉపాఖ్యానాలు. చతుర్వేదార్థసారమే దాని పుష్పగుచ్ఛాలు. నర నారాయణుల గుణ సంకీర్తనమే అది మన కందించే ఫలం. ఇలాంటి వృక్షాన్ని ఆశ్రయించే మహాపురుషులు దేవలోకంలో అయితే సురలు. భూలోకంలో ధాత్రీ సురులు. సరిగా ఈ భారత పారిజాత వర్ణన కనుగుణంగా సాగింది భాగవత

పారిజాత వర్ణన. ఇందులో మరొక విశేషమేమంటే అందులో లేని శ్లేష ఒకటి చోటు చేసుకొన్నది. కాబట్టి ఇంకా మనోహర మీవర్ణన. సప్రయోజనం కూడా. ఈ భాగవతమనే కల్పవృక్షానికి స్కంధాలు చాలా లలితమైనవి. అంటే పటిష్ఠమైనవని అర్థం. స్కంధాలు వృక్షానికెలాగో గ్రంథానికి అలాగే ఉన్నాయి. పోతే కృష్ణమూలం. వృక్షానికి మూలమనేది ఉండి తీరాలి. అది కృష్ణం అంటే కృష్ణ సర్ప పరివేష్టితమైనా కావచ్చు. లేదా నీలవర్ణ శోభితమైనా కావచ్చు. అలాగే భాగవతానికి కూడా కృష్ణతత్త్వమే మూలాధారం. శుకాలా పాభిరామంబు. శుకపికాదులు కొమ్మలమీద చేరి మధుర గానం చేసినప్పుడే వృక్షానికందం. అలాగే భాగవతం కూడా శుకమహర్షి ఆలపించినప్పుడే శ్రవణ యోగ్యమయింది లోకానికి. మంజులతా శోభితమున్ – మృదువైన లతలెన్నో అల్లుకొని ఉంటాయి వృక్షాన్ని. అలాగే లతల లాంటి ఉపాఖ్యానాలెన్నో ఓతప్రోతంగా కనిపిస్తాయి భాగవతంలో. ఆ మంజులతలే దానికీ దీనికీ కూడా మంజులత నావహిస్తున్నాయి. పోతే సువర్ణ సుమనస్సులను బట్టి అది సుజ్ఞేయమట. మంచి వన్నె చిన్నెల పుష్పాలెన్నో ఉంటాయి వృక్షానికి. వాటి మూలంగా అది ఫలానా అని తెలిసిపోతుంది పాంథులకు. అలాగే మోక్ష పాంథులకీ భాగవత తత్త్వం కూడా సువర్ణ సుమనస్సులనే లక్షణాలున్నపుడే బోధ పడుతుందని భావం. సుందరోజ్జ్వల వృత్తంబు. అందమైన భాస్వరమైన వర్తులత్వమున్న వృక్షమెంతో బాగుంటుంది. మరి ఇలాంటి వృత్తమే భాగవతానికి కూడా కద్దు. వృత్తమంటే వర్తులత్వమే గాదు. ఇతివృత్తం కూడా. భగవచ్చరిత్రను మించిన సుందరోజ్జ్వలమైన ఇతివృత్తం మరే ముంటుంది. కనుకనే అది మహా ఫలంబు అయింది. గొప్ప గొప్ప ఫలాలు మనకు కల్పకం ప్రసాదిస్తే ఒకే ఒక ఫలమందిస్తుంది భాగవతం. అదే మోక్షం. ఈ మహాఫలమనే మాట ఇక్కడే గాదు. మరొక్క చోట కూడా కనిపిస్తుంది మనకు భాగవతంలో **"చెలియై మేన మఱందియై సచివుడై చిత్త ప్రియుండై – మహాఫల సంధాయకుడై ... నీ భాగ్యంబు రాజోత్తమా"** అని నారదుడు ధర్మజుని సంబోధించి చెప్పిన పద్యంలో కూడా ఈ మాట మరలా ప్రతిధ్వనిస్తుంది. అక్కడా ఇదే అర్థం. ఇంతకూ ఇంతటి ప్రభావంగల ఈ కల్పతరువెక్కడ నుంచి ఆవిర్భవించింది విమల వ్యాసాల వాలంబునై–వ్యాసమహర్షి అనే పాదునుంచి పైకి వచ్చింది. ఆయన విజ్ఞాన సంపద కల్పించిందే ఈ కల్పకం. కనుకనే మోక్షమనే మహాఫలాన్ని అర్థించిన

ప్రతి ఒక్కరూ దాన్ని భజించవలసిందే. శ్రేయమంటే ఆశ్రయించవలసింది లేదా భజించవలసిందని అర్థం. ఎవరా భజించవలసినవారు. సద్విజులు. ద్విజమంటే పక్షి అనీ అర్థమే. ద్విజన్ములైన జ్ఞానులనీ అర్థమే. సత్తంటే ఆకాశమని కూడా అర్థం. ఆకాశచరములైన పక్షులు వృక్షాన్ని ఆశ్రయిస్తే ఈ భాగవత వృక్షాన్ని ఉత్తములైన జిజ్ఞాసువులూ, ముముక్షువులూ ఆశ్రయించవలసి ఉంది.

ఏవంవిధ విశేషణ విశిష్టులైన ఉత్తమాధికారులకు తప్ప ఎవరికంటే వారి కంతుపట్టేది కూడా కాదీ భాగవత తత్త్వమసలు. ఇంతకుముందే వర్ణించా మీ విషయం. భాగవతము తెలిసి పలుకుట కష్టంబు. ఊరక చిలుక పలుకుగా పలుక వచ్చునే గాని దాని ఆంతర్యం తెలుసుకొని పలకాలంటే మాత్రమది సామాన్యం కాదు. చాలా అసాధ్యం. ఎవరికీ అసాధ్యం. శూలికైన తమ్మిచూలికైన – శివుడికీ బ్రహ్మకూ కూడా అసాధ్యమేనట. మరి వారిరువురికీ అసాధ్యమైతే పోతనకెలా సాధ్యమయింది. పోతనకు బోధించిన విబుధజనులకెలా సాధ్యమయింది. అంచేత అదిగాదు దాని అర్థం. శివుడంటే శివుడు కాదు. బ్రహ్మ అంటే బ్రహ్మ కాదు. వారిరువురికీ బదులుగా వారి గుణాలను తీసుకోవాలి మనమిక్కడ. రజస్తమో గుణాలకు ప్రతీకలే చతుర్ముఖ శివతత్త్వాలు. కాబట్టి వారిద్దరికీ బోధపడ లేదంటే ఆ దేవతలకనిగాదు. ఆ గుణాలు గల మానవులకని అర్థం. అంటే ఏమన్న మాట. రజస్తమో గుణ దూషితాంతఃకరణుల కది ఏ మాత్రమూ గ్రహణ గోచరం కాదు. రజస్సు చిత్త విక్షేపానికీ – తమస్సు చిత్తావరణానికీ మూలం. అందులో విక్షేపం అనాత్మ జగత్తు మీదికి పరుగెడుతుంటే ఆవరణం ఆత్మ చైతన్యాన్ని ఎప్పుడూ కప్పి పుచ్చుతుంటుంది. అలాంటప్పుడిక ఆ మనస్సుకు వికాసమేమిటి. వివేచన ఏమిటి. అవి లేకపోతే పరమార్థ స్ఫురణమేమిటి. కనుకనే ఈ మాట.

అయితే మరి ఎవరికి స్ఫురిస్తుందా పరమార్థం. చెప్పాము గదా ఉత్తమాధికారులకే నని, ఎవరు వారు. ఎవరు రజస్తమో దోషదూషితులు కారో వారు. అంటే శుద్ధ సత్త్వ గుణ సంపన్నులన్న మాట. సత్త్వా త్సంజాయతే జ్ఞానమన్నారు. సత్త్వం విశుద్ధమైతేనే పారమార్థికమైన జ్ఞానముదయించేది. వారే సాత్త్వతులైన భాగవతులు. వారినే మరొక భాషలో విబుధులని వ్యవహరిస్తారు. **"బుధాభావ సమన్వితాః"** అని విబుధ శబ్దానికింతకు ముందే అర్థం చెప్పుకొన్నాము. పరమార్థ జ్ఞాన సంపన్నులే

విబుధులంటే. అలాంటి ఆచార్య పురుషుల ఉపదేశం మూలంగా గ్రహించాలి ఎవరైనా. ఎలా గ్రహించాలది. విన్నంత. కన్నంత. తెలియవచ్చినంత. మూడు భూమికలివి. శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్య అని శాస్త్ర వాక్యం. మొదట శ్రవణం చేయాలి. అదే వినటం. దానితో గ్రంథ తాత్పర్యమేమిటో దాని జ్ఞానముదయించి అజ్ఞానమనే తమస్సు విరిసిపోతుంది. పోతే తరువాత మననం చేయాలి. ఇదే కనటం. దీనితో సాధకుడికి కలిగే అసంఖ్యాకమైన సంశయాలన్నీ పటాపంచెలయి నిశ్చయ జ్ఞానమేర్పడుతుంది. ఆ పిమ్మట మూడవది నిది ధ్యాసన. అదే తెలిసి రావటం. దీనివల్ల ఆత్మకు విజాతీయమైన చరాచర పదార్థాలన్నీ వట్టివే సుమా సర్వత్రా సర్వదా ఉన్న దొకే ఒక పరమాత్మ తత్త్వమని బాహ్యాభ్యంతర వ్యవహారంలో నిత్యమూ అదే మరేదీ లేదని తెలిసిపోతుంది.

ఇలాటి సిద్ధ పురుషులే నారద బాదరాయణ శుక శౌనకాదులు. తన్ముఖంగా వెలువడిందే ఈ భాగవత మహాపురాణం. వారి అడుగుజాడలలో పయనించి దాని సారాన్ని తామాస్వాదించి లోకానికి దాని మాధుర్యాన్ని పంచి పెట్టినవారు శ్రీధరాదులైన ఆచార్యులు. వారినందరినీ ఆకళించుకొని అతిలోకమైన ఆ భావాన్ని స్వానుభవానికి తెచ్చుకొని ఒక రసాయనంగా మనకు ప్రసాదించిన మహాపురుషుడు బమ్మెర పోతనామాత్యుడు. ఈ గురు పరంపర అంతా కీర్తించిన ఆ మహాపురాణ ప్రాశస్త్యమింతదని వర్ణించటానికి మనమెంత వారం. అయినా కొంతకు కొంత చవి చూడగలిగాము, చెప్పగలిగామంటే ఇది కూడా ఆ విబుధ జన వచో విభూతి సంపర్క ప్రభావమే. మరేదీ గాదు.



Yallamilli Srinivasa Rao
www.advaitavedanta.in

3. సంకేతవాదము

పురాణములూ, అందులో భాగవతమూ, దాని ప్రాశస్త్యమూ వీటిని గూర్చి ఇంతవరకు చర్చించాము. పైగా బాహ్యస్వరూపంగాదు – దాని ఆంతర్యమేమిటో – తడవి చూడాలని కూడా పేర్కొన్నాము. అయితే ఆంతర్యమనేది ఉత్తమాధికారులే కొందరికో గాని మిగతా మంద మధ్యముల కది సహజంగా అంతు పట్టేదికాదు. వారు పురాణ ప్రాసాదానికి చుట్టూ కట్టిన ప్రాకారం దాకా వెళ్లగలరు. దాని చుట్టూరా తిరగగలరు. అంతేగాని గర్భాగారంలోకి చొచ్చుకొని పోలేరు. దానికి కారణమొక ప్రక్కవారికి సహజంగా ఉన్న అశక్తత అయితే మరొక ప్రక్క వాటిలో చోటు చేసుకొన్న సంకేత వాదం Allegory. సంకేతమన్నా, ప్రతీకమన్నా, అర్థవాదమన్నా ఒక్కటే. ఇతిహాస పురాణాలన్నీ అర్థవాదాత్మకాలని గదా ఇంతకు ముందు పేర్కొన్నాము. అర్థవాదమంటే చెప్పవలసిన విషయం సూటిగా నగ్నంగా చెప్పక దానికొక కవచం తొడిగి చాటుమాటుగా సూచన చేయటం. దీనినే ఆధునికులు ప్రతీకమనీ, సంకేతమనీ, Symbolism వ్యవహరిస్తారు. రహస్య వాద చ్ఛాయా వాదాలని కూడా కొందరు నిర్దేశిస్తున్నారు. ఇలాంటి ప్రతీకవాద మెంతైనా ఉంది భాగవతంలో. కథల దగ్గరి నుంచీ పాత్రలదగ్గరి నుంచీ వారి పేర్ల దగ్గర నుంచీ ప్రతి ఒక్కటీ ఒక ప్రతీకమే. ఒక సంకేతమే.

అసలు భాగవతావతరణాన్ని పరిశీలిస్తేనే మనకిది చక్కగా తార్కాణమవుతుంది. భాగవతమంతా మోక్షైక ప్రతిపాదకమని గదా పేర్కొన్నాము. అంచేత ఆ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని దాని కనుగుణమైన మార్గంలోనే ప్రతి ఒక్క అంశమూ మలచుకొన్నట్టు కనిపిస్తుంది. దేశకాల పాత్రలు మూడూ ఆ భావానికి దోహదం చేసేవే. దాన్ని స్ఫురింపజేసేవే. పురాణ ప్రవచనం జరిగిన ప్రదేశం విష్ణు క్షేత్రమని పేరు గాంచిన నైమిశారణ్యం. జరిగిన కాలం కలియుగారంభం. ప్రవక్త రోమహర్షణ కుమారుడైన సూత మహర్షి. మరి పురాణ శ్రోతలెవరో గారు. శౌనకాదులైన మహర్షులు. వీరు సహస్ర వర్ష పర్యంతమైన దీర్ఘసత్రమనే యాగాన్ని సంకల్పించి చేస్తుంటారు. ఆ సమయంలో సూతుడక్కడికి యాదృచ్ఛికంగా వస్తాడు. ఆయన

గొప్ప పౌరాణికుడు – బహుశ్రుతుడు, బ్రహ్మవేత్త అని తెలుసు వారికి. ఆయన వల్ల భగవత్కథా శ్రవణం చేసి ధన్యులమవుదామని అభిలషించారు వారు. భాగవత శ్రవణం చేయటంలో వారి ఏకైక లక్ష్యం సంసార తరణమే. మరేదీ గాదు. కలికాల మానవులకది అసాధ్యమని వారికి తెలుసు. అది వారి మాటలలోనే తేట పడుతుంది మనకు.

అలసులు మందబుద్ధి బలు లల్పతరాయువు లుగ్రరోగ సం
కలితులు మంద భాగ్యులు – సుకర్మము లెవ్వియు చేయ జాలరీ
కలియుగ మందు మానవులు – కావున నెయ్యది సౌఖ్య హేతువై
యలవడు – నేమిటం గలుగు నాత్మకు శాంతి మునీంద్ర చెప్పవే

ఇదీ వారికి పట్టుకొన్న సమస్య. కలియుగ మానవులంతా అన్ని విధాలా అదృష్టహీనులు అసమర్థులు. జీవితంలో శాంతికీ, సౌఖ్యానికీ రెంటికీ దూరమయి సంసార యాతన లనుభవిస్తున్నారు. ఇలాంటి వారికీ సాంసారికమైన సకల క్లేశాల నుంచీ విముక్తి ఎలా లభిస్తుందని వారి ప్రశ్న. దీనికి జవాబు సూతుని భాగవత ప్రవచనం.

అసలీ సూతుడెవరు. శౌనకాదులెవరు. నైమిశారణ్యమేమిటి. అక్కడ వారంత దీర్ఘకాలం యాగం చేయటమేమిటి. నేమి ఎక్కడ శీర్ణమయిందో అది నేమిశం. నేమిశమే నైమిశం. నేమి అంటే చక్రమని అర్థం. మానవుడి మనస్సే ఆ చక్రం. మనోమయమనే వర్ణించిందా చక్రాన్ని భాగవతం. చక్రంలాగా నిరంతరమూ భ్రమించే స్వభావమున్నది గనుక మనస్సును చక్రంతో పోల్చారు. అది మొదట ఏ దివ్య సీమలలోనో విహరిస్తుండేది. అది కృతయుగం. కాలక్రమేణ దానికి పతనమేర్పడింది. ఆకాశంబున నుండి శంభుని శిరంబన్నట్లు అంతకంత కది దొర్లుతూ వచ్చి ఈ కర్మ భూమిని స్పృశించేసరి కక్కడ శీర్ణమయింది. అంటే తన పూర్వ వైభవాన్ని కోలుపోయి స్తబ్ధంగా నిలిచిపోయిందని భావం. అదే ఈ కర్మ భూమి. సంసారం. నైమిశమంటే సంసారమే. ఇది ఒక అరణ్యం మన పాలిటికి. దిక్కు తెలియక తిరుగుతున్నాము దీనిలో. మనకు ఇష్టమున్నా లేకున్నా ఏదో ఒక కర్మ ననుక్షణమూ ఆచరిస్తూ పోవలసిందే. తప్పదు.

అయితే ఆచరించటంలో మంచీ ఉంది. చెడ్డా ఉంది. చెడ్డను పరిహరిస్తూ మంచి నాచరిస్తూ పోతే మరలా మానవుడు పైకి లేవగలుగుతాడు. ఊర్ధ్వముఖంగా పయనిస్తాడు. అప్పుడీ నైమిశమే వాడి పాలిటికి విష్ణు క్షేత్రమవుతుంది. అలాటి మోక్షసాధకులే శౌనకాదులు. **శునకస్యా పత్యమ్ పుమాన్ శౌనకః** అని అర్థం చెప్పుకోవాలి. శునక స్వభావం లాంటి స్వభావమున్నవాడు. శునక స్వభావమేమిటి. శ్రద్ధ, విశ్వాసం. ఇలాటి విశ్వాసమూ, ఆస్తిక్య బుద్ధీ - శుశ్రూషా ఎవరిలో ఉంటే వారంతా శౌనకులే. వారు జీవితమంతా సత్కర్మా చరణమే చేస్తుంటారు. అదే దీర్ఘ సత్రయాగం. సహస్ర మాసాలంటే జీవితకాలమే. సహస్ర మాస జీవి అనే మాట ఇప్పటికీ వ్యవహారంలో వినిపిస్తుంది. చాలాకాలం జీవించే పెద్దలనలా పేర్కొంటాము మనం. అప్పటికి జీవితాంతమూ ఈశ్వరార్పణ బుద్ధితో ఈ భూమిమీద పుణ్య కర్మానుష్ఠానం చేస్తూ పోవటమే వారనుష్ఠించారని చెప్పే సత్రయాగం.

అయితే ఈ కేవల కర్మానుష్ఠానం వల్ల మానవుడు సాధించే ప్రయోజనమేదీ లేదు. మనకు కావలసిన పరమ ప్రయోజనం మోక్షం. దానికి నోచని నాడిక ఎంత గొప్ప సత్కర్మ లాచరించినా అది నిష్ఫలమే. అది సిద్ధించాలంటే ఒక్క భగవత్తత్త్వాను సంధానం వల్లనే. అది తత్కథా శ్రవణంమూలాన్నే. కాని అది వట్టి గొంతెమ్మ కోరిక అయితే ఏమి సుఖం. దానికి తగిన గురువు దొరకాలి. వాడే సూతుడు. సద్గురువు కుండవలసిన లక్షణాలన్నీ ఉన్నా యాయనకు. సూతుడి కుగ్రశ్రవుడని మరొక పేరు. శ్రవస్సంటే శ్రుతమూ లేదా విజ్ఞానం. ఉగ్రమంటే తీక్ష్ణం. తీక్ష్ణమైన ప్రజ్ఞాపాటవం కలవాడని అర్థం. అలాంటివాడు సూతుడయ్యాడు. అంటే జన్మించాడు. ఎవరికి, రోమహర్షణుడనే మహర్షికి. రోమహర్షణుడెవరు. రోమహర్షం, రోమాంచం అంటే శరీరానికి గగుర్పాటు. వ్యాసమహర్షి అంతే వాసులలో ఒకడయి ఆయన పురాణేతి హాసాలు ప్రవచనం చేస్తుంటే భక్తి పారవశ్యంతో పులకితుడయ్యే మహా భాగవతుడాయన. కనుకనే ఆ పేరు సార్థకమాయనకు. వ్యాసుడు వేదాలను నాలుగుగా విభజించి వాటిని తన నలుగురు శిష్యులకూ బోధించాడట.

తత్రర్గ్వేద ధరః పైలః సామగో జైమినిః కవిః
వైశం పాయన ఏ వైకో - నిష్ణాతో యజు షాం గణే
అథర్వాం గిరసా మాసీ - త్సు మంతు ర్ధారుణో మునిః

ఋగ్వేదం పైలుడూ, సామవేదం జైమినీ, యజస్సు వైశం పాయనుడూ – అధర్వణం సుమంతుడూ అభ్యసించి తమ తమ విద్యలలో నిష్ణాతులు కావటమే గాక శిష్య ప్రశిష్యుల ద్వారా ఆయా వేదశాఖలను ప్రచారం చేశారట. పోతే **"ఇతిహాసః పురాణంచ పంచమో వేద ఉచ్యతే"** ఇతిహాస పురాణాలకు పంచమ వేదమని పేరు వీటికి మా తండ్రి రోమహర్షణుడే ప్రచారకుడంటాడు సూతుడు. అందులోనూ అన్నీ ఒక ఎత్తు – ఈ భాగవతమొక ఎత్తు. **"ఇదమ్ భాగవతం నామ పురాణం బ్రహ్మ సమ్మితమ్"** ఇది వేదంతో తులతూగే పంచమ వేదం **"సర్వ వేదేతి హాసానామ్ సారం సారం సముద్ధృతమ్"** సకల వేద పురాణ సారమది. ఏమి కారణం. ఉత్తమశ్లోక చరితమన్నారు. ఉత్తమః పురుషస్త్వన్యః – పరమాత్మే త్యుదా హృతః – అన్నట్టు పరమాత్మ చరిత్రమిది.

ఇలాంటి పవిత్రమైన చరిత్రను రోమహర్షణుడు వ్యాస ప్రసాదానికి పాత్రుడయి గ్రహించి లోకంలో పౌరాణిక సంప్రదాయాన్ని వెలయించాడు. అందులో మొదటి పౌరాణికుడు ఆయన సుతుడైన సూతుడు. విజ్ఞాన ఫలిత నిగమ పురాణ వ్రాతుడు. నిఖిల పురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుడు. తెలియవలసినదంతా తెలిసినవాడు, తెలిసినదంతా తెలుపగలవాడు. మరి శౌనకాదులో తెలిపితే తెలుసుకొనుట కన్ని విధములా ఉద్యుక్తులయిన వారు. దేశకాల పరిస్థితులూ పూర్తిగా దెబ్బతిని మోక్ష సామ్రాజ్యానికి దూరమై సంసార కాలుష్యానికి బాగా చేరువైనవి. కాబట్టి మరలా భాగవత ధర్మాన్ని లోకంలో ప్రచారం చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దానికి నిమిత్త మాత్రులీ సూతశౌనకులు.

అసలీ శౌనకాదులకు కలిగిన విషాదం వారికే గాదు. అది మొదట భాగవతకారుడైన వ్యాస భట్టారకుడికే కలిగింది. చతుర్వేదాలూ వ్యాసం చేసి పంచమ వేదమని వాసికెక్కిన భారతమనే ఇతిహాసం రచించి కూడా ఆయనకు శాంతి లభించలేదు. సరస్వతీ తీరంబున ఒంటరిగా కూచుని దానికి హేతువేమై యుండునా అని వితర్కిస్తుంటాడు. ఇంతలో **"తన చేతి పల్లకీ తంత్రీ చయం బున సతత నారాయణ శబ్ద మొప్ప – ఆరూఢ నయ విశారదుడు నారదుడు"** సాక్షాత్కరిస్తాడు. వ్యాసుడు చెప్పకుండానే ఆయన మనోవైకల్యాన్ని గుర్తించి నారదుడు ఏమయ్యా నీవు భారత శ్రుతి విధాతవు – వేదపదార్థ జాల విజ్ఞాతవు బ్రహ్మ తత్త్వ నిర్ణేతవు

గదా మరి ఏమిటిలా కాతరుకైవడి వగవు చెందావని నవ్వుతూ మందలిస్తాడు. దానికి వ్యాసమహర్షి సమాధానమిస్తూ అయ్యా నీవు మహా ప్రబోధమున తుదముట్టిన వాడవు. నీకెరుగరాని ధర్మము లేదు. నాకేర్పడిన ఈ కొఱత ఎట్టిదో నీవే కనిపెట్టమని అడుగుతాడు. అందుకు నారదుడిలా అంటాడు.

అంచితమైన ధర్మచయమంతయు జెప్పితి వందులోన నిం
చించుక గాని విష్ణుకథ లేర్పడ జెప్పవు - ధర్ములన్ ప్రవం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నిన గాక - నీకు నీ
కొంచెము వచ్చు టెల్ల హరి గోరి నుతిం పమి

మరేమీ గాదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. హరిగుణ సంకీర్తన రత్నాకరమైన భాగవతాన్ని రచించి కృతకృత్యుడవు కమ్మని హెచ్చరిస్తాడు. ఇది కేవలం సిద్ధాంతంగా గాక తన జీవితాన్నే దృష్టాంతంగా అతని కేకరువు పెడతాడు. మూడు జన్మల తన భాగవత వృత్తాంతాన్ని బయటపెడతాడు. దానితో తన దీర్ఘ విషాదానికి స్వస్తి చెప్పి వ్యాస భగవానుడు భాగవత నిర్మాణం చేసి మనః ప్రసాదాన్ని పొందుతాడు.

ఏమిటీ వృత్తాంతంలోని అంతరార్థం. వ్యాసుని అంతవాడు విషాదం పాలు కావటమేమిటి. నారదుడు వచ్చి ఉపదేశిస్తే గాని తేరుకోలేక పోవటమేమిటి. మరి నారదుడంత స్థితప్రజ్ఞుడే అయితే ద్వంద్వాతీతుడే అయితే ఆయన విషాదమెలా అనుభవించాడు. ఒకప్పుడీ నారదుడే విషణ్ణుడై సనత్కుమారుడి దగ్గరికి పరుగెత్తి వెళ్లుతాడు. ఏమయ్యా ఎందుకు బాధపడుతున్నావని అడిగితే అయ్యా **"సోహమ్ మంత్రవిదే వాస్మి నాత్మ విత్"** స్వామీ నాకు విద్యలన్నీ తెలుసునే గాని ఆత్మ విద్య మాత్రం తెలియదని మొరపెడతాడు. ఏమా ఒక్క విద్య తెలియకపోతే నని అడిగితే **"శ్రుతమ్ హ్యేవ మయా భగవద్దృశేభ్యః తరతి శోకమాత్మ విదితి - తన్మా శోకస్య పారమ్ తారయతు భగవా నితి"** తమ బోటి పెద్దలు చెప్పగా విన్నాను ఆత్మ వేత్త అయితేనే గాని సంసార దుఃఖాన్ని దాటిపోలేడని. అంచేత ఎలాగైనా తామనుగ్రహించి ఆత్మవిద్య ప్రదానం చేసి నన్ను తరింపజేయమని ప్రాధేయపడతాడు. ఇది ఛాందోగ్యోపనిషత్తులో కథ. మరి అక్కడ అంతదీనంగా వర్ణించబడ్డ నారదుడిక్కడ ఇంతటి ధీరుడెలా కాగలిగాడు.

ఇందుకే మనమీ కథలన్నీ అర్థవాదాలని గ్రహించవలసింది. నారదుడొకప్పుడు దీనుడు కాలేదు. మరొకప్పుడు ధీరుడు కాలేదు. నారదుడి కథ గాదిది. మనబోటి లోకుల కథ. నారదుడి మీద నెపం పెట్టి శాస్త్రం మన విషయమే మనకు భంగ్యంతరంగా బోధిస్తున్నది. మనలో నారదుడిలాగా సర్వశాస్త్రాలూ, సకల కళలూ సాంగోపాంగంగా అభ్యసించిన పెద్దలుంటారు. లోకంలో ఎక్కడ లేని పేరు ప్రఖ్యాతులార్జించి ప్రతివాది భయంకరులని ప్రసిద్ధులయి ఉంటారు. అయితే ఎంత పాండిత్యమున్నా **"నిత్య రూప నీ యెదుట నెవరి పాండిత్యమేమి నడచురా"** అని త్యాగయ్య చెప్పినట్టు అదంతా అసలు విద్య తెలియనంతవరకూ వ్యర్థమే. **"యేన విజ్ఞాతేన సర్వమిదం విజ్ఞాతం భవతి"** అనే విద్య అది. అది లభిస్తే గాని శాంతికీ, సౌఖ్యానికీ నోచుకోలేదు మానవుడు. నోచుకోని వాడు ఎంత పండితుడైనా పామరుడే. నిజమైన పాండిత్య మాత్మజ్ఞాన సంపత్తి. అలాటి వాడి సాంగత్యంలోనే ఇనుము బంగారమయినట్టు మన పాండిత్యం పాండిత్యమవుతుంది. అంతవరకూ విషాదమే మానవుడికి. అది నారదుడి కెలాగో వ్యాసుడికీ అలాగే. వ్యాసుడంటే అన్నీ తెలిసిన మహామేధావి. వేద పదార్థ జాల విజ్ఞాతే కాకుండా బ్రహ్మతత్త్వ నిర్ణేత కూడా. అంటే బ్రహ్మాండమైన శాస్త్ర పాండిత్యముందే గాని ఆయన కనుభవం లేదు శాస్త్రజ్ఞానం కేవలం జ్ఞానమే గాని విజ్ఞానం కాదు. విజ్ఞానమంటే ఆత్మానుభవం. అందుకే శ్రోత్రియం బ్రహ్మ నిష్ఠమన్న దుపనిషత్తు. శ్రుతి జ్ఞానమే కాదు. శ్రుత్యర్థ భూత పరమాత్మ స్వరూప నిష్ఠ ఉండాలి. సర్వకాల సర్వావస్థలలో మనోవాక్కాయాలతో ఏది ఎప్పుడు జరుగుతున్నా అదంతా బ్రహ్మాకారంగానే ఆత్మాకారంగానే దర్శిస్తూ, అనుభవిస్తూ ఉండాలి. ఇది ఆత్మేతరమంతా కేవల మిథ్యాభూతమని విరాగభావంతో చూస్తేనే గాని అలవడదు. అప్పటికి జ్ఞానానికి కాకపోయినా జ్ఞాన నిష్ఠకు వైరాగ్యమనేది నాంతరీయక మని inevitable చెప్పినట్లయింది.

ఇందులో జ్ఞానముందేగాని వ్యాసుడికి వైరాగ్యం లేదు. నారదుడికీ లేదు మొదట. అందులో పరిపాకాన్ని గడించటాని కాయనకు మూడు జన్మలు పట్టింది. అనేక **జన్మ సంసిద్ధః తతో యాతి పరాంగతిమ్.** ఎవడే గాని ఒక్కసారిగా జీవిత పరమార్థాన్ని గంతువేసి అందుకోలేడు. అనేక జన్మల అభ్యాస ఫలమది. అది నారదుడి వృత్తాంతం ద్వారా గ్రహించవలసిన సత్యం. వ్యాసుడు కూడా అలాగే ఎంత జ్ఞానవంతుడైనా

వైరాగ్యం లేక అది పరిపాకానికి రాలేదు. వైరాగ్యం లేదనేందుకంత జ్ఞాని అయి కూడా సరస్వతీ తటంలో విషణ్ణుడయి కూచోటమే మనకు దాఖలా. అంతేకాదు.

యమ్ ప్రవ్ర జంత మనుపేత మపేత కృత్యమ్
ద్వైపా యనో విరహ కాతర ఆ జుహావ

"సముడై యెవ్వడు ముక్త సంగచయుడై సన్యాసియై యొంటి బోవ మహాభీతి నోహో కుమార" యని కుమారుడు వెళ్లిపోతుంటే అతని వియోగం భరించలేక భీతుడై అతని వెంట పరుగెత్తాడు. అలా పరుగెత్తుతూంటే దారిలో అప్సరస లొక సరోవరంలో జలకాలాడుతుంటారు. వారాయనను చూడగానే ఒడ్డుకు వచ్చి గుడ్డలు కట్టుకొని నిలుచున్నారు. అది చూచి వ్యాసుడు వారితో మీరు తరుణ వయసులో ఉన్న నా కుమారుణ్ణి చూచి పొందని లజ్జా సంభ్రమాలు ముసలివాడనైన నన్ను జూచి పొందటం నాకు తలవంపుగా ఉందంటాడు. దానికి వారు జవాబిస్తూ అయ్యా మీరెంత వృద్ధులైనా మీకింకా స్త్రీ పురుష భేదదృష్టి పోలేదు. మీ కుమారుడన్ననో అలాంటి భావమణుమాత్రం కూడా లేని మహావిరాగి అని చాటుతారు.

దీనిని బట్టి మనమర్థం చేసుకోవలసిన రహస్యమేమిటి. శాస్త్రజ్ఞానం కాదు ముఖ్యం. ఆచరణ. ఎంత శాస్త్రజ్ఞుడైనా ఆచరణ లేనంత వరకూ దాని వలన ఫలసిద్ధి లేదు. మరి ఆత్మజ్ఞాన మాచరణలోకి రావాలంటే దానికి వైరాగ్యమనేది విడరాని చుట్టం. అలాంటి పరిపూర్ణ వైరాగ్యభావానికి సంకేతమే శుకుని పాత్ర. శుకుడు గోచియులేక ముక్త సంగచయుడైన అవధూత. సర్వసముడు. సర్వభూతమయుడు. గోదోహన కాలం కూడా గృహస్థుల ఇండ్ల దగ్గర నిలవనివాడు. అతడు సంచరించిన స్థలమొక తీర్థం. ఇలాటి విరక్తి మరి ఆయన జనకుడే అయిన వ్యాసుడికి లేదు. వైరాగ్య భావమంత బాగా అలవడని వేద వేదాంగ విజ్ఞానానికంతటికీ చిహ్న మా వ్యాసుడు. ఇది ఆ ఇరువురి పేర్లను పరిశీలిస్తేనే మనకు తేట పడుతుంది. ఎంత గొప్ప శాస్త్రార్థమైనా విప్పి చెప్పగల వాడెవడో వాడికి వ్యాసుడని పేరు. కాగా అది బాగా ఒంటబట్టి దాన్ని తన జీవితంలోనే ప్రదర్శిస్తూ లోకతంత్రాన్ని అంటి ముట్టకుండా పైపైన తిరిగే స్వభావమున్న వాడే శుకుడు. శుకమంటే చిలుక అని గదా అర్థం. చిలుకలాగా ఉపరిచరుడే గాని నలుగురి మధ్యా తిరిగేవాడు కాడు. ఇది జన్మతః వచ్చింది శుకుడికి. **"బహూనామ్ జన్మనా మంతే జ్ఞాన వాన్"** అన్న దానికి నిదర్శన మా వ్యక్తి.

ఇలాంటి వాడే గురుస్థానంలో ఉండదగినవాడెప్పటికైనా. కనుకనే ఆయనే గురువయ్యాడు పరీక్షిత్తుకు. నారదుడు కాలేదు. వ్యాసుడు కాలేదు. వ్యాసుడాయనకు తండ్రి అయి కూడా సకల విద్యా పారంగతుడయి కూడా ఆచార్య స్థానమలంకరించ లేకపోయాడు. నారదుడా వ్యాసునికి భాగవత రచన చేయమని ప్రోత్సహించిన మహాభాగవతుడూ నిరంతర హరినామ సంకీర్తన పరాయణుడూ మహాజ్ఞాన సంపన్నుడూ అయి కూడా అతడూ చేయలేకపోయాడా పని. వీరంతా పరీక్షిత్తు గంగా తీరంలో ప్రాయోపవేశం చేస్తుంటే చుట్టూ పరివేష్టించి ఉన్నవారే. మోక్షమార్గం నాకుపదేశించమని ఆయన ప్రార్థించినా బదులు మాటాడక మౌనంగా కూచున్న వారే. మరి ఇంతవారై కూడా ఎందుకలా బెల్లం కొట్టిన రాళ్లలాగా ఊరకున్నారని మన మాశ్చర్యపడవచ్చు. కేవల శాస్త్రపాండిత్యమెంత ఉన్నా వైరాగ్య భావం లేనంత వరకూ బ్రహ్మానుభవం పరిపూర్ణం కాదనేందుకు వ్యాసుడి మౌనం నిదర్శనం. అలాగే జ్ఞానమే కాక వైరాగ్యం కూడా అలవడినా ఇంకా త్రిలోకాలూ సంచరిస్తూ త్రిగుణాత్మకమైన సృష్టితో ఇంకా లావాదేవీ పెట్టుకొంటూ మధ్య మధ్య విక్షేపానికి చాపల్యానికి గురి అయినా లాభం లేదని చెప్పేందుకు నారదుడి తూష్ణీం భావం మనకు తార్కాణం.

పోతే ఇలాంటి లొసగులేవీ లేని పరిపూర్ణ జ్ఞానవైరాగ్య సంపన్నుడు గనుకనే శుక మహర్షి ఒక్కడే ఆచార్య పీఠమెక్కగలిగాడు. మోక్ష విద్యోప దేశానికి అర్హుడనిపించుకొన్నాడు. అందుకే అందరితో పాటు వ్యాస నారదులు కూడా ఆయనను చూడగానే ప్రత్యుత్థానాదులు చేయవలసివచ్చింది.అయితే ఆత్మారాముడు గదా ఆయన. అలాంటి వాడికి మరలా లోకంతో సంగమెలా ఏర్పడిందని అడగవచ్చు. ఆత్మారాములన్న మాత్రాన లోక సంగ్రహ మసలే చేయరనుకోరాదు. ఆత్మారాములు లోకసంగ్రహపరులూ కావచ్చు. లోక సంగ్రహపరులాత్మా రాములూ కావచ్చు. అయితే వీరిలాగా వారెప్పుడూ లోకంతో సంబంధం పెట్టుకోరు. కాదాచిత్కమైనది వారి సంబంధం. అదీ ఆ పరమాత్మ ప్రేరణవల్లనో లేక వారి వల్ల శ్రవణం చేసి తరించే మహాభాగ్యం శ్రోతల కుండటం వల్లనో,దేనివల్లనైనా కావచ్చు. అదే మహాత్ముల కలాంటి బుద్ధి పుట్టించి వారిచేతనే అలాంటి మహోపదేశం చేయిస్తుంది. సాధారణంగా **"ఉత్తిష్ఠత-జాగ్రత - ప్రాప్యవరాన్ - నిబోధత"** అనే శాస్త్ర ప్రామాణ్యాన్ని

బట్టి జిజ్ఞాసువులైన శిష్యులే గురువులను వెతుకుకొంటూ వెళ్లవలసినట్టున్నా ఒకప్పుడు జిజ్ఞాస మరీ తీవ్రంగా ఉండి దానికితోడు ముముక్ష గూడా ప్రబలంగా ఉంటే అలాటి యోగ్యులైన శిష్యులవద్దకు సద్గురువులు స్వయంగా రావటం కూడా కద్దు. దానికి ఉదాహరణమే శుకుని రాక.

మరి పరిపూర్ణుడయిన ఆ మహర్షి కేవలమూ బ్రహ్మభూతుడు గదా. అలాటి బ్రహ్మిష్ఠుడికి మరలా భగవద్గుణ కీర్తన చేయవలసిన ఆవశ్యకత ఏమిటని కూడా ఒకప్రశ్నే. దీనికి సమాధానం భగవానుడే చెప్పాడు. **"నాన వాప్తమవాప్తవ్యమ్ - వర్త ఏవచ కర్మణి"** నేను క్రొత్తగా పొందవలసిందేదీ లేదు. అయినా కర్మ చేస్తూనే ఉంటాను అని. నిత్య ముక్తుడైన పరమాత్మే చేస్తున్నప్పుడిక ముక్తులైన ఆచార్య పురుషుల మాట చెప్పేదేముంది. వీరంతా జీవన్ముక్తులు కాబట్టి స్వప్రయోజన మంటూ లేకపోయినా ముముక్షు జనోద్ధరణ కోసం భగవద్గుణ కీర్తన చేయటం దూషణం కాదు. మీదు మిక్కిలి భూషణమే.

ధీరులు నిరపేక్షులు నా త్మారాములు నైన మునులు
హరి భజనము నిష్కారణమ చేయుచుందురు

ఆత్మారాములైనా హరి భజన చేయవచ్చు. అయితే వారు చేసే ఆ భజన నిష్కారణం. అంటే దానివల్ల వారు సాధించే ఫలమేదీ లేదు. ఫలమనేది ముక్తే గదా. అది ఎప్పుడో పొందారు వారు. మరి ఇక చేయటానికి కారణమేమి, తన కోసమని కాదు. ముముక్షువులైన వారి నుద్ధరించటం కోసం.

ఇందులో ఉన్న ధర్మ సూక్ష్మమేమంటే ముముక్షువులు, ముక్తులూ ఇరు తెగలవారూ భజిస్తుంటారా భగవత్తత్త్వాన్ని. ఇందులో ముముక్షువు లొకందుకైతే ముక్తులు మరి ఒకందుకు. రెంటికీ రెండు మాటలు చెప్పింది భాగవతం.

గురు మతులు తపసు లంతఃకరణం బులు శుద్ధి సేయ
ఘనత తర భక్తిన్ హరియందు సమర్పింతురు

ముముక్షువుల నుద్దేశించి చెప్పిన మాట ఇది. రజస్తమో గుణ సంపర్కంతో మలీమసమైన మానసాన్ని నిర్మలం చేసుకోటానికే ముముక్షువులు భజించటం. పోతే ముక్తులు దేనికి భజించటమంటే చెప్పిన మాట. **"ధీరులు నిరపేక్షులు"** అనే మాట.

వారి కంతఃకరణాలు ఎలాగూ శుద్ధి అయి ఉన్నాయి. శుద్ధసత్త్వులు గనుకనే **"జ్ఞాన ప్రసాదేన విశుద్ధ సత్త్వాః తతస్తు తం పశ్యతే నిష్కలం ధ్యాయమానః"** అన్నట్టు నిష్కల బ్రహ్మాత్మ భావంలో పరినిష్ఠితులై ఉన్న జీవన్ముక్తులు వారు. అయినా **"చేయుచుందురు హరి గుణ చింతనములు మానసంబులనే ప్రొద్దు."** ఎందుకని. బ్రహ్మతత్త్వం తెలియనివారా. కాదు. **"అరసి నిర్గుణ బ్రహ్మంబు నాశ్రయించి విధి నిషేధ నివృత్త సద్విమల మతులు"** వారు. తమకు నిర్గుణమే తత్త్వమని తెలిసినా ముముక్షువులైన లోకులకు లేదా పరిపాకం. వారింకా సగుణమే తత్త్వమని భ్రాంతి పడుతుంటారు. వారి నా భ్రాంతి నుంచి తొలగించి క్రమంగా నిర్గుణ తత్త్వాన్ని అందుకొనేటట్లు చేయాలి. కనుక తమ స్థాయి నుంచి కొంత క్రిందికి దిగి వచ్చి మొదట భగవద్గుణ చేష్టాదులు వర్ణిస్తూ తద్ద్వారా వారికి ప్రరోచన కలిగించి క్రమంగా వీటి కధిష్ఠానమైన ఆ మూలతత్త్వానికి విభూతే ఇది – దాని కనతి రిక్తమే ననిఏకైకమైన నిర్గుణాత్మ స్వరూపాన్ని నిరూపించాలి చివరకు. ఇందుకోసమే ఈ గుణ సంకీర్తనం.

సరిగా శుకపరీక్షిద్వ్యాహారంలో మనకు కనిపించే రహస్యమిదే. పరీక్షిత్తు కోరిందసలు మోక్షం తప్ప మరేదీ గాదు. అందుకోసమే అతడు ప్రాయోపవేశం చేసింది. కాని విష్ణుభక్తుడతడు. విష్ణు రాతుడని అతని పేరే వెల్లడి చేస్తున్నదా విషయం. విష్ణురాతుడంటే విష్ణు ప్రాప్తుడని అర్థం. శంఖ చక్రగదాధారి అయిన భగవంతుని సగుణ రూపాన్నే దర్శించాడతడు. అదీ ఎప్పుడో గాదు. తల్లి గర్భంలో పిండరూపంగా ఉన్ననాడే. అశ్వత్థామ కోపంతో బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తే అది ఉత్తర గర్భంలో ప్రవేశించింది. ఒక్క క్షణకాల మటూ ఇటూ అయితే అది ఆ శిశువును నామరూపాలు లేకుండా భస్మం చేసిపోయేది. ఇంతలోనే కృష్ణభగవానుడది గ్రహించి వెంటనే సూక్ష్మరూపంతో ఆవిడ గర్భంలో ప్రవేశించి గర్భస్థుడైన శిశువుకా అస్త్ర జ్వాలలు సోకకుండా గదా దండాన్ని గిరగిర త్రిప్పుతూ దాన్ని నిర్మూలించి కాపాడుతాడు. అతడెవరా ఈ మహాత్ముడని చూచే లోపల అదృశ్యుడవుతాడు. ఆ తత్త్వమేమిటా అని పరీక్ష చేశాడు గనుకనే ఆ శిశువుకు తరువాత పరీక్షిత్తని పేరు సార్థకమయింది. విష్ణురక్షితుడు కాబట్టి విష్ణురాతుడని కూడా పేరు వచ్చింది. అయితే సగుణరూపమే దర్శించాడు గనుక అదే స్మరణకు వస్తున్నది గాని ఆయనకు నిర్గుణమై సర్వవ్యాపకమై సర్వాత్మకమైన తత్త్వమేదో అది అనుభవానికి రావటం లేదు. అది

రానంతవరకూ మోక్షం లేదు. కనుకనే అలాంటి నిర్గుణ తత్త్వోపదేశం చేసి అతడికి మోక్షాన్ని ప్రసాదించటానికి జీవన్ముక్తుడైన శుకుడే కావలసి వచ్చింది. శుకుడికి బ్రహ్మరాతుడని మరొక నామధేయముంది. పరీక్షిత్తు విష్ణురాతుడైతే అతడు బ్రహ్మరాతుడు. ఒకటి సగుణ భక్తికీ మరొకటి నిర్గుణ జ్ఞానానికీ సంకేతాలు. సగుణ భక్తుడింకా నిర్గుణ స్థితికి రాలేదు గనుక వాడు శిష్యుడు. నిర్గుణుడా స్థితినందుకొన్నాడు గనుక గురువు. గురువిక్కడ బ్రహ్మరాతుడయిన శుకుడైతే శిష్యుడు విష్ణురాతుడైన పరీక్షిత్తు కావటంలో ఇదీ అంతరార్థం. సగుణస్థితిలో ఇంకా పరీక్షిత్తే మానవుడు. అంటే పరీక్షించటం లేదా అన్వేషించే స్వభావమింకా పూర్తి కాలేదని భావం. అదే గురూప దేశం ద్వారా నిర్గుణ తత్త్వాన్ని ఆకళించుకొంటే ముక్తుడయి గురువులాగా తానూ బ్రహ్మరాతుడే అవుతాడు. శుకుడే అవుతాడు.

అసలీ పరీక్షిత్తు కథ ఏదో గాదు. మనకథే. మనలో సాధకుడైన మానవుడి కథ. మనకూ మాతృగర్భంలో ఉండగానే భగవద్దర్శనమయి ఉంటుంది. సందేహం లేదు. ఉత్తమాధికారులమైతే ఆ సంస్కారం పుట్టిన తరువాత కూడా మనల నంటిపట్టుకొని వర్తిస్తుంది. ఇహంలో బ్రతుకుతున్నా పరచింతన వదలకుండా బ్రతుకు సాగిస్తాము. ధర్మ మార్గంలో మనం నడుస్తూ మనతో సాంగత్యమున్న వారంతా అలాగే నడవాలని అభిలషిస్తాము. పరీక్షిత్తు జీవిత మిదే. తండ్రిలాగా అభిమన్యుడు కాదతడు. పరీక్షిత్తు. దేహా ద్యభిమానమున్న వాడెవడో వాడభిమన్యుడు. అంటే పామరంగా బ్రతికే మానవుడు. వాడెప్పుడూ భగవత్తత్త్వానికి దూరుడే. అది లేని పరీక్షా శీలుడే భగవదను గ్రహానికి పాత్రుడవుతాడు. ఆసంస్కారంతోనే జన్మిస్తాడు. జీవిస్తాడు. ధర్మ మార్గ పరిపాలనమే అతడి ధ్యేయం.

అప్పటికి ద్వాపరయుగం పోయింది. కలియుగం ప్రారంభమయింది.

ఏ దినమున వైకుంఠుడు – మేదినిపై దాల్చినట్టి మేను విడిచినా డా దినమున నశుభ ప్రతిపాదకమగు కలియుగంబు ప్రాప్తంబయ్యెన్. కృష్ణ నిర్యాణంతోనే కలి ప్రారంభం. సత్య శౌచ దయాది దైవగుణాలు కూడా ఆయనతోనే అస్తమించాయి. అంటే దైవ సంపదకు దూరమైన కాలమే కలియుగమని అర్థం. అసలా మాటకు వస్తే ఈ యుగాలు కూడా ఏవో కావు ఎక్కడో లేవు. కాలానుగుణంగా ఏర్పడేవి కావవి భావానుగుణంగా నని తోస్తుంది నాకు. యుగధర్మాలు నాలుగని పరిగణించారు

పురాణంలో. సత్యం, శౌచం, దయా, దానం. నాలుగూ పరిపూర్ణంగా ఉన్న కాలం కృతయుగం. వీటిలో సత్యం పోయి శౌచాదులు మిగిలితే అది త్రేత. అవి రెండూ కూడా తొలగిపోయి మిగతా దయాదానాలు రెండే మిగిలితే ద్వాపరం. దయ కూడా రూపు మాసి ఒక్క దానగుణమే దక్కితే అది కలి. వాటికా పేర్లు పెట్టటంలో కూడా ఈ అభిప్రాయమే సూచితమవుతున్నది. కృతమంటే అంతా ముందే సిద్ధమయి ఉన్నదిక క్రొత్తగా కర్తవ్యమంటూ లేనిదని అర్థం. సత్యయుగమని కూడా దానికి నామాంతరముంది. పోతే త్రేతా అనే మాటకు మూడనేఅర్థం. ఒక గుణం కుంటుపడి మూడే ఉన్నాయని అర్థం. ద్వాపరమంటే రెండు మాత్రమే ఉన్నదని భావం. పోతే ఆ రెంటిలో కూడాఒకటి పోతే అది కలి. కలి అంటే కలహం. దైవగుణాలు చాలా వరకు పోయి అసురత్వమే చోటు చేసుకొంటే పరస్పర కలహాలు గాక మానవుల కిక ఏమి మిగులుతుందని.

కనుకనే ఈ కలియుగానికి నాలుగు పాదాలున్నాయని కూడా భావించనక్కర లేదు. మనం పాదాలనేవి యుగాలకు కాదు. ధర్మదేవతకు. దాన్ని ఒక వృషభంతో పోల్చారు మనవారు. వృషభానికి నాల్గు పాదాలున్నట్టే ధర్మానికి కూడా ఉన్నాయి. నాలుగూ ఉంటేనే అది సక్రమంగా నడుస్తుంది. మూడైతే కొంచెం కుంటు పడుతుంది. రెండైతే ఇంకా కుంఠితమవుతుంది. ఒక్కటే అయితే ఇక చెప్పనక్కరలేదు. అలాంటి ఏక పాదంలో ఉన్నాము మనమిప్పుడు. ఈ పాదమంతమైతే ఇక రెండవ పాదమంటూ లేదు. దీని తరువాత మరలాకృత యుగారంభమే. బాగా క్రింద పడ్డ తరువాత ఇక పడేదేముంది. ఇక పడటమంటే పైకి లేవటమే. అందుకే పతనమూ ఉత్పతనమూ అన్నారు భాషలో. ఉత్పతన మంటే పైకి పడటం. అంటే లేవటమే. ఇదీ దీని విషయం.

ఇలాంటి కలికాలాని కారంభంలో ఉన్నాడు పరీక్షిత్తు. అప్పటికి కృష్ణ నిర్యాణ వార్త విన్నారాయన పితామహులు పాండవులు. యాదువులూ, యాదవ నాయకుడూ, ఇద్దరూ కాలవాహినిలో కలిసి పోవటం చూస్తే ఏదీ శాశ్వతం కాదని పించింది వారికి. తుదకు భగవదవతారం కూడా నశ్వరమేననే భావం దృఢపడింది. అలాంటప్పుడిక మానవ మాత్రులమైన మన బ్రతుకు లేమిటనుకొన్నారు. అంతకుముందే తమ తల్లి కుంతి **"భగవత్పద చింతా తత్పరయై - ముద మున సంసారమార్గమునకు"** పాసి శరీర త్యాగం చేసింది. అప్పటికే కలికాల ప్రభావం

కనిపిస్తూ వచ్చింది వారికి. క్రౌర్య హింసా ఽసత్యదంభ కౌటిల్యాది దుర్గుణాలు పట్టణాలలో, పల్లెలో గృహస్థుల ఇండ్లలో మనస్సులలో యథేచ్ఛగా వ్యాపించసాగాయి. అవి తమ అంతరంగాలలో కూడా ప్రవేశిస్తున్నట్టు తోచి భయం వేసింది వారికి. వెంటనే ఇక జాగు చేయరాదని కులానికంతా అంకురంలాగా మిగిలిపోయిన మనుమడు పరీక్షిత్తుకు పట్టం కట్టి పరిపూర్ణ వైరాగ్య భావంతో ఉత్తర దిశాభిముఖులై పోయి నిరంతర నారాయణ స్వరూప చింతనతో ఆ నారాయణ పదాన్నే అందుకొన్నారు. విదురాదులైన పెద్దలు కూడా వచ్చిన మార్గాన్నే వెళ్లిపోయారు.

పోతే ఇక మిగిలింది పరీక్షిత్తొకడు. తన కొప్పజెప్పిన రాజ్యభారాన్ని అంత దారుణమైన కాలంలో కూడా గురి తప్పక నిర్వహిస్తూ మూడశ్వమేధ యాగాలు చేసి దక్షిణలిచ్చి అంతా అనవద్యంగా ఉందని భావిస్తుంటే అతనికి నమ్మశక్యంగాని ఒక దృశ్యం కంటబడింది. పుర బహిఃప్రదేశంలో ఒక వృషభమూ ఒక గోవూ రెండూ ఒకదానితో ఒకటి సంభాషిస్తున్నాయి. ఆ ధేనువు తేజో విహీనయై ధారాపాతంగా కన్నీరు కారుస్తుంటే ఆ వృషభం దానికి కారణమడుగుతుంది. అది గోరూపధారిణి అయిన భూమే గాని మరేదో గాదు. ఈ వృషభం కూడా మామూలు వృషభం కాదు. ధర్మదేవతే ఆ రూపంలో ఉన్నది. దానితో గోరూపంలో ఉన్న భూమాత ఇలా అంటుంది.

గణనా తీతము లగు స
ద్గుణములు గల శౌరిసనిన - ఘోరకలి ప్రే
రణమున - పాప సమూహ
వ్రణయుతులగు జనుల జూచి వగచెద తండ్రీ

ఇదీ ఆ గోవిచ్చిన సమాధానం. అది ఇలా మొరపెడుతున్నదో లేదో వెంటనే ఎక్కడి నుంచి వచ్చి పడ్డాడో ఒక దుర్మార్గుడు. రాజలాంఛనాలతో ఉన్న శూద్రుడు వాడు. ఆ వృషభాన్ని నేలగూలే లాగా నిష్కరంగా తనకాలితో తంతాడు. అంతేకాదు. అంభా అని అరుస్తున్నా లెక్క చేయకుండా ఆ గోవును కూడా నిర్దాక్షిణ్యంగా కూలదన్నాడు.

ఏమిటీ సంఘటన. ఏమిటి దీని తాత్పర్యం. భూమి నిజంగా గోవయిందా. ధర్మం నిజంగానే వృషభమయిందా, కాదు. అది ఒక కల్పన. పురాణకర్త చేసే

కల్పనల పరంపరలో ఇది ఒకటి. ఎంతో అభిప్రాయమిమిడి ఉంది ఈ కల్పనలో. భూమికి ధాత్రి అనీ భూత ధాత్రి అనీ పేరు. మనబోటి ప్రాణికోటినంతా ధరిస్తున్నదిది. భరిస్తున్నది. జరాయుజాండ జాదికమైన చతుర్విధ భూత జాతమూ దీని చలువతోనే బ్రతుకుతున్నది. ఇది ఎప్పుడూ సస్యశ్యామలంగా ఉండి మనకు కావలసిన వన్నీ ఫలిస్తూంటేనే మనకు బ్రతుకు లేకుంటే మన బ్రతుకు బండలే. అయితే అది ఎప్పుడు ఫలిస్తుందీభూమి. ధర్మం నాలుగు పాదాలతో నడచినప్పుడే. అది ఎప్పుడు కుంటుపడిందో అప్పుడిది నిష్ఫలం. ఏ ప్రాణీ సుఖ నివాసానికి నోచుకోలేదు. కనుక ఈ భూమండలం ఎప్పుడూ కల కల లాడుతూ మనబోటి సమస్త ప్రాణులకూ వాసయోగ్యం కావాలంటే ప్రాణులందరూ తన్మూల కారణమైన ధర్మాన్ని ఎవరికి వారు పాటించి తీరాలి. **ధర్మో రక్షతి రక్షితః** ధర్మాన్ని మనం కాపాడితే అది మనలను కాపాడుతుంది. మనం కాపాడటం దాన్ని యథావిధిగా ఆచరించటం. అది కాపాడటమంటే జీవితం ఎలాటి ఒడుదుడుకులు లేకుండా సుఖంగా సాగటం.

ఈ భావాన్నే ప్రతీయమానం చేస్తున్నదీ సన్నివేశం. ధర్మానికీ ధరణికీ ఉండే సంబంధం ఒక వృషభానికీ గోవుకూ ఉండే సంబంధం లాంటిది. గో వృషభాలకుండే సంబంధ మేమిటో మనకు తెలుసు. వృషభ సాంగత్యం లేనిదే గోవు ఫలించదు. సంతతి కాస్కారం లేదు సరికదా పాలు పెరుగు నేయి ఇలాటి భోజ్య పదార్థాలు కూడా మనకు దుర్లభమే.అది ఉంటే ఈ సమస్త ఫలాలకూ నోచుకొంటాము మనం. అలాగే ప్రస్తుత మీ భూమండలం కూడా ధర్మాన్ని ఎడబాయనంత వరకూ యథాకాలంగా వర్షాలు కురిసి రసౌషధి వర్గాలు ఫలించి మన జీవితాలిందులో సుఖంగా కొనసాగుతాయి. మన సంతతి కూడా అవిచ్ఛిన్నంగా సాగుతూ పోతుంది. వృషభమని పేరు పెట్టటంలో వర్షించే స్వభావమున్నదని కూడా అర్థమవుతుంది. వర్షించేదేదో అది వృషభం. వృషభం వర్షిస్తేనే గోవు గర్భాన్ని ధరిస్తుంది. ప్రసవిస్తుంది. ధర్మం కూడా సక్రమంగా పాలిస్తే అది భూమి మీద మన సుఖ నివాసానికి కావలసిన సమస్తమూ వర్షిస్తుంది. మన కోరికలూ ఫలిస్తాయి. లేకపోతే ఒక గొడ్డు టావులాగా అయిపోయి ఈ ధాత్రి మన పాలిటికి సకలానర్థ దాత్రిగా మారుతుంది. తరువాత వేనుడి చరిత్రలో వస్తుందిదే విషయం. భూ ధర్మాలకుండే అవినాభావాన్నే చాటుతున్నది గోవృషభాల అవినాభావం.

మరి ఇప్పుడా శూద్ర రాజ ముద్రితుడైన చండాలుడా రెండింటినీ తన్నాడంటే వాడెవడో గాదు. వాడే కలి పురుషుడు. కలికాలమే పురుషరూపంలో ప్రత్యక్షమయింది. వాడు కూడా శూద్రుడు. శూద్రుడంటే శూద్ర స్వభావుడు. ఏమిటి శూద్రుడి స్వభావం. ఏకజాతిత్వం. ఒకే ఒక జన్మ గలవాడు శూద్రుడు. ఒకే జన్మ అంటే కేవల భౌతిక జన్మ. అది పశుపక్ష్యాదులకూ మానవుడికీ సాధారణమైనది. వైజ్ఞానికమైన మరొక జన్మ ఎత్తితేనే మనం ద్విజులమనిపించుకొనేది. అంతదాకా అందరమూ శూద్రులమే. అంటే సంస్కార శూన్యులమే. కేవలమూ మృగాలలాగా కామ క్రోధాధి వాసనలతో తామస వృత్తితోనే జీవిస్తుంటాము. ఇదే శూద్ర అనే మాటకర్థం. ఇలాంటి శూద్రతత్త్వం కలితో ఆరంభమయింది మనకు. కనుకనే కలిశూద్ర రాజ లక్షణాలతో బయలుదేరి వచ్చాడు. గో వృషభాలను రెంటినీ తన్నాడు. అందులోనూ మొదట వృషభాన్నీ ఆ మీదట గోవునూ తన్నాడు వాడు. అంటే ఏమని అర్థం. మొదట ధర్మం దెబ్బ తింటేనే భూమి దెబ్బ తింటుంది. ఫలించకుండా పోతుంది. ధర్మం కాపాడుతున్నంత వరకూ ఏ ఉపద్రవమూ రాబోదు. కనుక ధర్మాన్ని కూలదోసింది మొదట ఈ కలికాలం. ఆ తరువాత భూమికే ముప్పు తెచ్చిపెట్టింది. ఈ ధర్మం వ్యక్తి ధర్మమే గాదు జాతి ధర్మమే గాదు. లోకధర్మమే గాదు. విశ్వ ధర్మమని Cosmic Law చెప్పినా చెప్పవచ్చు. విశ్వమంతా ఒక సూత్రం మీద నడుస్తూంది. అందులో మనముండే ఈ భూమండలం సముద్రంలో ఒక బిందువు. **"సూత్రే మణి గణా ఇవ"** అన్నట్టు అన్నీ ఆ సూత్రంలో పూసలు. ఆ ధర్మ సూత్రం తెగిందో ఇవన్నీ పూసలలాగా ఎక్కడివక్కడ చెల్లాచెదరు కావలసిందే. అలాంటి వైపరీత్యమే ఇప్పుడు మన మీ కాలంలో చూస్తున్నది. అనుభవిస్తున్నది.

ఇలాంటి దశే దృష్టి గోచరమయింది పరీక్షిత్తుకు. పరీక్షిత్తు గనుకనే అతడు నేటి మానవుడి లాగా ఊరక కూచోలేదు. మనకెందుకు లెమ్మని ఉపేక్షించలేదు. పైగా అతడు దేశమేలే రాజు. అధార్మికుడైన రాజు దుండగం చేస్తుంటే ధార్మికుడైన ప్రభువుపేక్షించరాదు. అది మహాపాపం. అది ఎప్పటికైనా శాపమై పరిణమిస్తుంది. ఈనాటి ప్రపంచంలోని పాలకవర్గాలకు కూడా ఇది ఒక పెద్ద హెచ్చరిక. అది కంట పడగానే పరీక్షిత్తు సహించలేకపోయాడు. తన కాలంలోనే తన రాజ్యంలోనే ఇంత అన్యాయమూ – అందులోనూ నోరు లేని జీవాలమీద ఇంతటి దారుణమా.

వెంటనే చంద్రహాసం దూసి వాడిమీదికి లంఘించాడు. అధర్మాన్ని శిక్షించి ధర్మాన్ని రక్షించాలి రాజు. ఇంతకంటే రాజుకు కర్తవ్యమేముంది. అలాటి పవిత్రమైన కార్యాన్నే పాటించాడు. దానికి హడలిపోయి వాడు కాళ్లమీద పడ్డాడు. శరణా గతుణ్ణి రక్షించమని మొరపెట్టాడు. అందితే జుట్టు అందకుంటే కాళ్లనే వ్యవహారమిదే. శిక్షించేవాడు లేనంతవరకూ విచ్చలవిడిగా విహరిస్తుంది అధర్మం. శిక్షకుడుంటే ప్రక్క వంచుతుంది. భయపడుతుంది. అలాగే జరిగిందిక్కడా.

అయితే ఇక్కడ ఒక మోసం జరిగిపోయింది. దుండగాన్ని శిక్షించాలి శాసకుడు. రక్షించరాదు. రక్షిస్తే అది అలాగే దాగి ఉండి ఎప్పుడో సమయం చూచి మరలా చెలరేగుతుంది. అప్పుడది మొదటికే మోసం తెచ్చే ప్రమాదముంది. పరీక్షిత్తు చేసిన తెలివితక్కువ అదే ఇప్పుడు. శరణాగత రక్షణమనే నెపంతో వాణ్ణి ఉపేక్షించాడు. పైగా వాడి కల్లబొల్లి ఏడుపులకు కరగిపోయి ప్రాణివధ స్త్రీ ద్యూత పానాదులు – అసత్యమద కామాదులూ – ఇలాటి ప్రదేశాలలో యథేచ్ఛగా విహరించటానికి వాడి కనుమతి ఇస్తాడు. పైగా ఇలా తన మనసులో అనుకొంటూ ఇంటికి వెళ్లుతాడు.

చేసిన గాని పాపములు చెందవు చేయదలంచి నంతటన్
చేసెద నన్న మాత్రమున జెందు గదా కలివేళ పుణ్యముల్
మోసము లేదటంచు నృప ముఖ్యుడు కాచె కలిన్ – మరందము
ల్లాసము తోడ గ్రోలి విరులం దెగ జూడని తే టికైవడిన్

కలికాలంలో మానవులకొక గొప్ప నలీసున్నదట. పాపమనేది చేస్తానని మనసులో అనుకొన్న మాత్రాన ప్రమాదం లేదు. చేస్తేనే అది ఫలితమిచ్చేది. పోతే పుణ్యమనేది అలా కాదు. అది చేయనక్కరలేదు. చేస్తామని ఊరక మనసులో ఒక సంకల్పం కలిగితే చాలు. తగిన ఫలితమిస్తుంది. అంచేత మనకు ఇప్పుడు వచ్చిన మేసమేముంది. ప్రమత్తులైన అధీరుల విషయంలో నైతే కలిపొంచి ఉండి సాధిస్తాడు గాని నాబోటి అప్రమత్తులూ ధీరులూ అయిన వారి కేమి బాధ అని బరవసా పడతాడు.

ఈ బరవసాయే మొత్తానికతని ప్రాణం తీసింది. కొన్నాళ్ల తరువాత మృగయా వ్యాసంగంతో అరణ్యానికి వెళ్లుతాడు పరీక్షిత్తు. నానావిధ మృగ సంతతులను వధించి తీవ్రమైన దాహమేర్పడి జలం కోసమని శమీక మహర్షిని జలమిమ్మని ప్రార్థిస్తాడు.

మౌనవ్రతధారి అయిన ఆ మహర్షి పలకకపోతే ఊరకపోక అక్కడ పడి ఉన్న ఒక మృత సర్ప కళేబరాన్ని అతని మెడలో వైచి వెళ్లిపోతాడు. ఏమిటీ చర్య. ఈ పనికి మాలిన చేష్ట. పరీక్షిత్తులాటి వాడు చేయవలసిన కార్యమా ఇది. పరీక్షిత్తు చేశాడని గాదు. చెందాడని గాదు. ఎంత పరీక్షా దక్షుడైనా ఎంత విచక్షణ జ్ఞానమున్నవాడైనా ఒక్కొక్కప్పుడు బుద్ధి పెడతల పడుతుంది. అప్పుడేమి చేసేదీ వాడికే తెలియదు. అందుకే ఎంత ధార్మికుడైనా బహు జాగ్రత్తగా ఉండాలి మానవుడు. ఋణశేషం శత్రు శేషమన్నట్టు అధర్మాన్ని ఎప్పుడూ ఉపేక్షించరాదు. ఉపేక్షిస్తే విస్ఫులింగ మాత్రంగా కనిపించే అదే కాలాంతరంలో మహాజ్వాలగా మారి మనలను కాటు వేస్తుంది. అది మనం కొనితెచ్చుకొన్న మహాపరాధమవుతుంది.

ప్రస్తుతం పరీక్షిత్తు కొని తెచ్చుకొన్న దిదే. చేసిన గాని పాపములు చెందవని గదా కలిని ఉపేక్షించాడు. అది తాను చేయనే చేశాడు. అక్కడా ఇక్కడా ఉండవచ్చు నని అనుజ్ఞ ఇచ్చేసరికి ఎక్కడో గాదు వాడు. శివుడికి శని పట్టినట్టు తనలోనే వచ్చి ప్రవేశించాడు. వేటాడటాని కడవికి తీసుకువచ్చాడు. అపరిమితమైన దాహం పుట్టించాడు. నీళ్లకోసం శమీకుడి దగ్గరికే తెచ్చాడు. లేకుంటే అంత పెద్ద చక్రవర్తి కెక్కడా నీరు లభించకపోవటమేమిటి. కర్మం చాలక ఆయన సమయానికి మౌనవ్రతుడే అయి కూచున్నాడు. లేకుంటే మాటాడి కావలసినది ఇచ్చి పంపేవాడు గదా. అప్పటికీ ఊరకపోయి ఉంటే బాగుండేది. కలిప్రేరణ ఎలా పోనిస్తుంది. సర్ప కళేబరాన్ని ఆయన కంఠానికి తగిలించేట్టే చేసింది. సమయానికక్కడే ఉండాలా అది. ఉన్నా దానినాయన మెడలో వేయాలని బుద్ధి పుట్టాలా ఆ రాజుకు. అదంతా కలి ప్రభావమే. ఏ కలి తన్ను ఏమీ చేయడని నిర్లక్ష్యం చేశాడో ఆ కలే చాప క్రింద నీళ్లలాగా ఆయన కొంప తీశాడు. ఎక్కడో లేదు కలి అనేది. మన బుద్ధులలోనే ఉంది. అదే మన చేష్టలలో తొంగి చూస్తుంది. అన్ని అనర్థాలూ తెచ్చి పెడుతుంది.

అంతేకాదు. ఆయన శమ ప్రధానుడే ఆ శమీకుడు. శమీ వృక్షంలాగా పవిత్ర చరిత్రుడు. శమ దమాది సంపన్నుడు. అందుకే ఆయనను శమీకుడన్నారేమో. స్వభావానికి తగినట్టు ఆయన ఊరకే ఉన్నాడు. ఆ చర్య జరగక ముందెలా ఉన్నాడో జరిగినప్పుడూ అలాగే ఉన్నాడు. భావ వికార మేమాత్రమూ కనపరచలేదు. ఆరూఢుడైన వాడి లక్షణమది. **"ఆ రూఢస్యచ తస్యైవ శమః కారణ ముచ్యతే"** అని

గదా భగవద్వచనం. కనుక శమాన్వితుడే. మాటాడకుండా ఉంటాడని కాదు మౌనమంటే. పాండిత్యమ్ బాల్యం నిర్విద్య మౌనేన తిష్ఠాసేత్తనే శాస్త్ర సిద్ధాంతానికి కేవలం దృష్టాంత మాయన ఆమౌనముద్ర, **"అనాత్మ ప్రత్యయ తిరస్కరణస్య పర్యవసాన భూమికా మౌన"** మని భగవత్పాదులు సెలవిచ్చిన అర్థం. అలాంటి వాడికిది ఇష్టమిది అనిష్టమనే ద్వైత దృష్టి ఉండరాదు. అందుకే రాజు చేసిన చర్య నతడు గర్హించలేదు. ఆమోదించనూ లేదు. ఉపేక్షించాడు.

కాని ఉపేక్షించలేకపోయింది ఆయన కుమారుడు శృంగి. శృంగమంటే కొమ్ము. కొమ్ములున్న మృగాలన్నీ శృంగులే. అవి తమ కిష్టం లేనిదేది ఎదురయినా ఇక ఇటూ అటూ చూడవు. తలవాల్చి నేరుగా వచ్చి కొమ్ములతో కుమ్మవలసిందే. అదే ఈ శృంగి స్వభావం కూడా. శాపమిచ్చే సామర్థ్యం తనకుంది గదా అని ముందు వెనకలు చూడకుండా శపించాడు పరీక్షిత్తును. అవమానం జరిగింది తండ్రికి గదా. దానికి ప్రతీకారం తలపెట్టినా మానినా అది ఆయన చూడవలసిన విషయం. తనకెందుకా పెద్దరికం. అదీ కేవలమూ కలి ప్రబోధమే. తక్షక విషాగ్ని చేత దగ్ధమై పోవాలని శాపమిస్తాడు. ఎలాటి కర్మ చేస్తే మానవుడలాటి కర్మ ఫలమే అనుభవించాలి. సర్పాన్ని కంఠంలో వేశాడు కాబట్టి సర్పమే అతణ్ణి కాటు వేస్తుందని భావం. అయితే అది మృతసర్పం. కాటు వేయలేదు. వేసినా బాధ లేదు శమీకుడికి. పోతే ఇది అలా కాదు. జీవత్సర్పం. భీషణమైన దాని విషాగ్నులకు శరీర ప్రాణాలు ప్రోషితంకాక తప్పలేదు పరీక్షిత్తుకు. కారణం సర్పమని వర్ణించింది ఇక్కడ సర్పం కాదు. కాలమే సర్పం. సర్పతీతి సర్పః ఏ మాత్రమూ అంతుపట్టకుండా చెట్టుక్రింది నీడ మాదిరి ప్రాకుతూ వచ్చి ఎప్పుడో పైన బడి ప్రాణం తీస్తుంది కాబట్టి కాలాన్ని సర్పంతో పోల్చారు. అదే తక్షకుడు. తక్షణమంటే తొలవటమని అర్థం. లోపల చేరి మన తను మనః ప్రాణాదులనన్నిటినీ క్రమంగా తొలిచి మనలను నిర్మూలించేదని భావం. అయితే శమీకుడిపాలిటికది తక్షకుడు కాదు. ఆ రూఢుడైన సిద్ధపురుషుణ్ణి అది ఏమీ చేయలేదు. మృతమై పడి ఉంటుంది. అంటే ముక్తుడికి కాలం కేవలం మృత ప్రాయమన్న మాట. పోతే ఇంకా ఆరు రుక్షుడూ లౌకికుడూ అయిన మానవుడికే అది తక్షకుడు. కాటు వేసి తీరుతుంది. అందు కీశాపమొక నిమిత్త మాత్రం. జీవి ప్రారబ్ధమే అలా శాపరూపంగా పరిణమిస్తుంది.

ప్రతి శాపమివ్వాలనే చూచాడు పరీక్షిత్తు. ఇవ్వగలడు కూడా. అయితే అనవసరమూ అనుచితమూ అని తోచిందాయనకు. ఏమి కారణం. ఆ పాటికి ఆత్మ పరీక్ష చేసుకొని నిజమైన పరీక్షిత్తుగా మారాడు. **"ఏటికి వేట వోయితి - ఏటికి తద్ముజాగ్రమున నేసితి సర్ప శవంబు - నేనేటికి పాప సాహసము లీక్రియ జేసితి"** ఇంతకూ **"దైవ యోగమున్ దాటగ రాదు గదా"** మరి **"రాజ ననుచు బోయి రాజ్య గర్వంబున - దంద శూక శవము తండ్రిపై వైచిన - పొలియ దిట్టకేల పోవు సుతుడు"** అని ఇలా విచారణ చేసి సామర్థ్యము కలిగి కూడా భూమీశు డలుగడయ్యె నట. స్వయం కృతాప రాధానికి వగచి ఏమి ప్రయోజనం. ఒకరి నని ఏమి ప్రయోజనం. అయితే దానికి కూడా ఎంతో వివేచనా బుద్ధి ఉండాలి మానవుడికి అది తాత్కాలికంగా మరుగుపడినా తరువాత ఉదయిస్తుంది. పశ్చాత్తాప మొదవిస్తుంది. అది వైరాగ్యానికి దారి తీస్తుంది. **"పరీక్ష్యలోకాన్ కర్మ చితాన్ బ్రాహ్మణో నిర్వేద మాయాత్ - నాస్త్యకృతః కృతేన"** అన్న దుపనిషత్తు. నిరంతర పరిణామ శీలమైన ఈ ప్రపంచ వ్యవహారంలోని ఒడుదుడుకులు బాగా పరీక్షించి చూచినప్పుడు గాని మానవుడికి నిర్వేదం కలిగి ఆత్మజ్ఞానాని కభిముఖుడు కాడు. ఇదుగో ప్రస్తుతం పరీక్షిత్తుకు కూడా అలాటి ఆభిముఖ్యమే కలిగిందీ శాపం వల్ల. అంతేకాదు.

తస్యైపమే ఽఘస్య పరా వరేశో
వ్యాసక్త చిత్తస్య గృహేష్వభీక్ష్ణమ్
నిర్వేద మూలో ద్విజశాప రూపః

యావజ్జీవమూ ఈ సంసార సాగరంలో పడి మునగానాం తేలానాం కాకుండా నాకొక గమ్యం చూపటాని కాపరమేశ్వరుడే ఈ బ్రాహ్మణ శాపరూపంలో నాకు ప్రత్యక్షమయి ఉంటాడు. సందేహం లేదని శాపాన్ని కూడా తనకొక వర ప్రసాదంగా భావించాడు మహానుభావుడు. జీవితంలో ఒకటి మనకు ప్రతికూలంగా జరిగినా అందులో కూడా ఏదో మనకు తెలియని సత్ఫలితముంటుందని గ్రహించటమే గొప్ప వివేకం.

అదే భాగవత శ్రవణానికి దారి తీసింది పరీక్షిత్తుకు. ఈ శ్రవణం ఏడు రోజులు చేయటంలో కూడా అంతరార్థమున్నది. ఏడు రోజులకు తక్షక విషాగ్నిచేత మరణించే

లాగా శాపమిచ్చాడు కాబట్టి ఏడు రోజులనే కాదు మన మనుకోవలసింది. అది కేవలం బాహ్యార్థమే. కాకపోయినా కోపం వచ్చిన వాడు ఏడు రోజులని గడువు పెట్టటమేమిటి. అలా ఎప్పటికీ జరగదు. ఏడనే సంఖ్య కిక్కడ ఒక అంతరార్థముంది.

అండకోశే శరీరే స్మిన్ - సప్తావరణ సంయుతే

సప్తావరణలున్నాయి మన శరీరంలో. ఇవే విరాట్శరీరంలో కూడా ఉన్నాయి. అవే పృథివ్యప్తేజో వాయ్వాకాశా హంకార మహత్తత్వాలు. వీటిని ముముక్షువైన వాడు ఒకదానిలో ఒకటి లయం చేసుకొంటూ పోతే సోపాన క్రమంలో అన్నింటినీ దాటిపోయి చివరకు మహత్తనే ఏడవ ఆవరణాన్ని కూడా అతిక్రమించి నిరావరణమైన ఆత్మరూపమైన చైతన్య జ్యోతిని దర్శించి మృత్యువును జయించగలడని తాత్పర్యం. అందుకే ఈ సప్త సంఖ్యా పరిగణనం. ఒక్కొక్క దిన మొక్కొక్క భూమికను దాటి పోయేందుకు కల్పించిన సంకేతం. 12 స్కంధాల భాగవత శ్రవణం సమాప్తమయ్యే సరికి సప్తమ భూమికను కూడా దాటి పరీక్షిత్తు మృత్యుంజయుడవుతాడు. అంటే తక్షకుడు రాలేదనా, కాటు వేయలేదనా అర్థం. లేదు. తక్షకుడు వస్తాడు కాటు వేస్తాడు. విషమెక్కుతుంది. చస్తాడు. అయినా చిత్రమేమంటే రాలేదు. వేయలేదు. ఎక్కలేదు. చావలేదు. భాగవతమే చెబుతున్నదీ మాట.

దశంతం తక్షకం పాదే - లేలిహానం విషాననైః
న ద్రక్ష్యసి శరీరం చ - విశ్వంచ పృథ గాత్మనః

తక్షకుడు వచ్చినా కఱచినా పరీక్షిత్తు చావడు. ఎందువల్ల. ఆ తక్షకుణ్ణిగాని, శరీరాన్ని గాని, తుదకీ బాహ్యంగా కనిపించే జగత్తునుగాని ఆత్మకు భిన్నంగా చూడడు పరీక్షిత్తు. అది ఎలా గని **"అహమ్ బ్రహ్మ పరంధామ బ్రహ్మాహం పరమం పదం" - ఏవం సమీక్ష న్నాత్మా నమాత్మ న్యాధాయ నిష్కలే. "నేనే ఆ బ్రహ్మాన్ని - ఆ బ్రహ్మమెక్కడో లేదు మరలా నా స్వరూపమే"** అని సోపాధికమైన జీవభావాన్ని నిరుపాధికమైన బ్రహ్మభావంలో లయం చేసుకొని చూడటమే. అప్పుడు మృత్యువు కూడా స్వరూపమే అయి మృత్యుంజయుడవుతాడు మానవుడు. అదే మోక్షం.

ఏతాదృశ మోక్షఫలాన్ని ప్రసాదించటానికే భాగవత మవతరించింది. పరీక్షిచ్ఛుక సంవాదమనే వ్యాజంతో సాగింది. భగవద్గీత సిద్ధాంత గ్రంథమైతే ఈ భాగవతమనేది

దృష్టాంత గ్రంథం. అది భగవంతుడి మాట. ఇది ఆ భగవంతుడి చేష్ట. అది కృష్ణార్జున సంవాద మిది శుక పరీక్షిత్సం వాదం. అక్కడ తాతా తాతా చెప్పుకొన్నదైతే – ఇక్కడ మనవడూ మనవడూ చెప్పుకొన్న కథ. అర్జునుడి మనవడే గదా పరీక్షిత్తు. పోతే శుకుడు కృష్ణుడి మనవడెలాగా అని అడగవచ్చు. **"మహర్షయ స్సప్త పూర్వే చత్వారో మనవస్తథా మదీయా మానసా జాతాః"** అంటాడు గీతాచార్యుడు. సప్త మహర్షులూ భగవంతుడి మానస పుత్రులేనట. వ్యాసుడు మాత్రం కాకపోతాడా. అంతా భగవంతుడి సంతానమే. ఆవ్యాస పుత్రుడైన శుకుడు కృష్ణుడికి మనవడే అవుతాడు. వీరిరువురూ నిమిత్తంగా సాగినదీ భాగవత పురాణం. అయితే ఇది దృష్టాంత గ్రంథమని గదా చెప్పాము. కాబట్టి శాస్త్రానికిది అర్థవాద రూపంగా అవతరించింది. అర్థవాదమంటే కల్పనే గదా. ఎందుకీ కల్పన అంటే ముందే చెప్పాము విజ్ఞాన వైరాగ్య వివక్షయా అని. కాబట్టి ఈ పురాణేతి వృత్తమంతా మానవులకు విజ్ఞాన వైరాగ్య ప్రబోధం కోసమేర్పడిన ఒక మహాసంకేతంగా భావించాలి మనం. విజ్ఞానాదులు గురుముఖంగా సంక్రమించాలి శిష్యుడికి. అందుకే నారదుడి ద్వారా వ్యాసుడికీ వ్యాసుడిద్వారా శుకుడికీ శుకుడిద్వారా పరీక్షిత్తుకూ లభించినట్టు వర్ణించటం.

చివరికీ గురుశిష్య సంప్రదాయం ఇంతటితో ఆగక నైమిశారణ్య పుణ్యక్షేత్రంలో సూత శౌనకుల దాకా ప్రసరించింది. అది కూడా కలియుగారంభంలో జరిగినట్టు వర్ణించబడింది. అసలు పరీక్షిత్తు కూడా కలియుగ ప్రారంభంలోనే శ్రవణం చేసింది. కలియుగారంభంతో ఆరంభమై కలియుగాంత వర్ణనతో అంతమై పోతున్నది భాగవత కథ. ఇందులో కూడా ఎంతో అంతరార్థం గోచరిస్తున్నది. ఈ పురాణ మప్పుడెప్పుడో జరిగింది కాదు. ఎవరికో ఉద్దిష్టమయింది కాదు. ఇప్పుడీకాలంలో బ్రతుకుతున్న ఈ కలియుగ ప్రజానీకానికే – మనమే సుమా దీన్ని శ్రవణం చేసి తరించాలని బోధపడుతున్నది. కృష్ణావతారంతో గ్రంథం సమాప్తం కావటం కూడా ఇందుకొక నిదర్శనమే. ఆ తరువాత ఇక రాబోయేది కల్క్యవతారమే. దానితో కలియుగమనేది సమాప్తమయి మరలా కృతయుగ ధర్మం ప్రవర్తిస్తుంది. ధర్మ దేవత నాలుగు పాదాలతో నడుస్తుంది. అలా రావాలని నడవాలని కోరుకోవాలి నేటి మానవులు.

నేటి మానవుడికి ప్రతీకలే నాటి సూత శౌనకులు. ఉగ్రశ్రవుడైన ఒక గురువుకు ప్రతీక సూతుడైతే భక్తులతో శ్రవణం చేయగోరే మనబోటి ఆస్తిక మహాశయులందరికీ

ప్రతినిధులా శౌనకాది మహర్షులు. నేమి శీర్ణమైనట్టుగా మన మనోనేమి కూడా శీర్ణమైన రోజులివి. వచ్చి పడ్డా మీ కర్మ భూమిలో. మరలా సాధన చేయకపోతే మనపాలిటికిది అరణ్యమే. సాధకులమనిపించుకొంటే పుణ్యక్షేత్రమూ విష్ణు క్షేత్రమే అవుతుంది. అందుకోసం యావజ్జీవమూ యజ్ఞదీక్షతుల మయి బ్రతకాలి. జీవితమే ఒక మహాయజ్ఞం. దీర్ఘసత్రమిదే. వాసనా పశువును అధ్యవసాయమనే యూపానికి బంధించి ఆత్మజ్ఞానాగ్నిలో ఆహుతి చేయాలి. విషయ సుఖాలనే సమిధలందులోనే పడవేసి కాల్చి భస్మం చేయాలి. శరీరాలన్నీ ఆ పవిత్ర భస్మ విభూతితో ఉద్ధూళనం చేసుకొని పరమాత్మ తత్త్వ జిజ్ఞాసువులమై కూచోవాలి.అలాంటి వ్యవసాయాత్మకమైన బుద్ధే ఉంటే ఉగ్రశ్రవుడైన సద్గురువు మనకు తనపాటికి తానే లభిస్తాడు. అలా లభించిన వాడే సూత మహర్షి. ఆయనవల్ల భాగవత కథా శ్రవణం చేస్తున్నంత వరకూ అంతకుడు కూడా ఏమీ చేయలేకపోయాడట.

ఇహో పహూతో భగవాన్ మృత్యు శ్శామిత్ర కర్మణి
న కశ్చిన్మ్రి యతే తావ - ద్యావదాస్త ఇహాంతకః

శామిత్ర కర్మ అంటే పశు విశనం. అందుకోసం మృత్యువు వచ్చి కూచున్నదట అక్కడ. అయినా దండ ధరుడైన కాలుడు తాను కూడ కథా శ్రవణాసక్తుడయిన కారణంవల్ల ఏ ప్రాణికీ మరణ భయం లేకుండా పోయిందంటాడు మహర్షి.ఏమిటి దీని బావం. బ్రహ్మాభ్యాస తత్పరులై తదేక నిష్ఠతో ఉన్న మానవులకు బాహ్య స్మృతి ఉండదు. కాలజ్ఞానం నశిస్తుంది. విద్యాలోలమ్ విగళిత కాలమని గదా పెద్దలమాట. విద్యలో మనచిత్తం రమిస్తే కాలమనేది నిలిచిపోతుంది. అంటే మనోలయమవు తుందని భావం. మనసే కాలం. దాని నలాగే పొడిగించుకొని తత్త్వంతో తాదాత్మ్యమే చెందగలిగితే ఇక మరణం కూడా లేదు మానవుడికి. **"స్థిత్వాఽస్యా మంత కాలేఽ పి బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతి"** అనే శాస్త్ర వాక్యానికిది అర్థవాద రూపమైన సంకేతం.

ఈ విధంగా ఈ పురాణం ఆద్యంతాలూ సంకేతార్థంతోనే నిండి నిబిడీకృతమయి ఉంది. పరీక్షిత్తు నిర్వేదంతో ఆరంభమై ఆయనగారి మోక్ష సామ్రాజ్య ప్రాప్తితో గదా అంతమవుతుంది భాగవతం. శుకుడూ పరీక్షిత్తనే రెండు మాటలూ సాంకేతికమే నని నిరూపించాము. సంజ్ఞా వాచకాలుగా Proper Nouns కనిపించేవన్నీ సామాన్య వాచకాలే Common Nouns భాగవతంలో. స్వయంకృతంగానీ, దైవికంగానీ, ఒక

తీరని విషాద వలయంలో తగులుకొని దానివలన బయటపడే మార్గానికి నోచుకోని మానవుడి కందులో నుంచి విముక్తి పడయటాని కుపాయమే భాగవత కథ అంతా. ఇందులో విషాదమాది అయితే తద్విమోచనం దానికంతం. అదే పరీక్షత్తు నెపంగా మహర్షి సాగించిన ప్రధాన కథా వస్తువు. పోతే ఈ కథలో అంతర్వాహినిగా ప్రవహించే ఆధ్యాత్మిక విద్యా సంప్రదాయాన్ని బలపరచటానికే మధ్యలో ఏకరువు పెడుతూ వచ్చిన ప్రాసంగిక కథలన్నీ. కథలూ, పాత్రలూ, సన్నివేశాలూ అనేవి వాటికోసం చెప్పినవి కావు. అవన్నీ కేవలం సంకేతాలు మాత్రమే. ఆధ్యాత్మికమైన ఒకే ఒక సత్యాన్ని చెప్పటానికి ఆధిభౌతికమైన స్థాయిలో అల్లుకొన్న అనేక సంకేతాలవి. ఒక ప్రహ్లాదుడి కథ వర్ణించినా అందుకే. ధ్రువుడి కథ అయినా అందుకే. అంబరీషుడిదైనా అందుకే. పృథువుదైనా అందుకే. కుచేలుడిదైనా అందుకే. గజేంద్రుడిదైనా అందుకే. చివరకు గోప గోపిక లేమిటి – కాల యవనాది రాక్షసులేమిటి – అనుకూల ప్రతికూల మార్గాలలో నడచిన ప్రతి ఒక్క పాత్రకు చెందినకథా అందుకే. అనాత్మ జగత్తు మీద వైముఖ్యం కలిగించి చివరకు ఆత్మతత్త్వం మీద ఆభిముఖ్యం కలిగించేటందుకే మరెందుకూ కాదు. ఇదే భాగవత పురాణ శరీరమంతా అణువణువూ వ్యాపించి ఉన్న అంతరార్థం. ఇదే పురాణ హృదయమన్నట్లు పురంజనోపాఖ్యానాదులలో బయటపడి బాహాటంగానే చాటాడు మహర్షి. అది ఒక నమూనాగా భావించి మిగతా గ్రంథమంతా ఆ పంథాలోనే సమీక్షించమని బహుశా ఆయన మౌనంగా మనకందజేసే సందేశమయి ఉండవచ్చు.



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in
Brahmasri

4. రచనా ప్రణాళిక

భాగవత సంకేతాన్ని ఇంతవరకూ మనం చర్చిస్తూ వచ్చాము. ఆద్యంతాలూ దానితోనే నిండి ఉన్నాయని - అందులోని ప్రతికథా కూడా పురాణ ముద్దేశించిన మోక్ష పురుషార్థాని కొక చక్కని సంకేతమేనని పేర్కొన్నాము. పోతే ఆ వివక్షితమైన లక్ష్యాని కనుగుణంగా సాగిన ఈ కథా నిర్మాణమేమిటో దాని రచనా ప్రణాళిక ఏమిటో సాంగోపాంగంగా మనం పరిశీలించవలసి ఉంది. కథలంటే భాగవతానికే గాదు. హరివంశ విష్ణు పురాణాలకు కూడా అదే కథా వస్తువు. అయితే భాగవతంలో లేని కథలు కొన్ని హరి వంశాదులలో అదనంగా కనిపిస్తాయి. హరివంశమనేది విష్ణు పర్వమనీ, హరివంశ పర్వమనీ, భవిష్య పర్వమనీ మూడు భాగాలున్నాయి. విష్ణు పర్వంలో పారిజాత వృత్తాంతమూ, వజ్రనాభ వృత్తాంతమూ వస్తాయి. ఇవి రెండూ భాగవతంలో లేవు. అలాగే భవిష్య పర్వంలో కృష్ణుడి కైలాస యాత్రా - ఘంటాకర్ణుడి చరిత్రా - పౌండ్రక వాసుదేవుడి వృత్తాంతము - హంస డిభకో పాఖ్యానమూ వస్తాయి. ఇవన్నీ భాగవతంలో కనిపించవు. అలాగే విష్ణు పురాణంలో ఖాండిక్య కేశి ధ్వజో పాఖ్యానమొకటి అదనంగా ఉంది. అది భాగవతంలో లేదు. పోతే భాగవతంలో వచ్చే దక్ష యజ్ఞ వృత్తాంతం హరి వంశాదులలో కనిపించదు. అయినా పరవాలేదు. అన్నీ భగవత్కథలే అయినప్పుడు కొన్ని తక్కువైతేనేమి కొన్ని ఎక్కువైతే నేమి అన్నీ కలిసి మన పాలిటికి భాగవతమే. భగవంతుడికి సంబంధించింది గదా భాగవతమని చెప్పాము. పైగా మోక్ష పురుషార్థ ప్రతిపాదకమైనది. మోక్షప్రదాత మనకు భగవంతుడే, మరి ఆ భగవంతుడి కథ గాకపోతే మరేదవుతుంది ప్రతిపాద్యమైన అంశం.

అయితే భగవంతుడి కథ అన్నారే. అదేమిటా కథ. భగవంతుడంటే సోపాధికమూ కావచ్చు నిరుపాధికమూ కావచ్చు. నిరుపాధికం స్వరూపమైతే సోపాధికం నామరూప చేష్టాదికమైన విభూతి అని చెప్పాము. ఈ రెండింటినీ వర్ణిస్తే అదీ ఆయన కథ. ఇందులో స్వరూపం కంటే విభూతి వర్ణనే నూటికి తొంబది

పాళ్లు కనిపిస్తుంది. నామరూప చేష్టలే గదా విభూతి అంటే, బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులు నామాలు. మత్స్య కూర్మాద్యవతారాలు రూపాలు. పోతే ఆయా అవతారాలెత్తినప్పుడు ఆయన చేసే దుష్ట శిక్షణ శిష్ట రక్షణాది కార్యాలు చేష్టలు. ఇవన్నీ కలసి ఆయన చరిత్ర. అదే ఈ పురాణమంతా కొనా మొదలు పన గలిసి ఉంది.

భాగవతమంటే భగవంతుడి చరిత్ర అనే గాక భాగవతుల చరిత్ర అని కూడా ఒక మాట చెప్పి ఉన్నాము. భగవంతుడి నాశ్రయించినమానవుడే భాగవతుడు. మానవుడికి రెండింటితోనే సంబంధం. ఒకటి ఈ లోకంతో. మరొకటి లోకాతీతమైన తత్త్వంతో. అందులో ఈ లోకంతోనే ముడిపడిన జీవితాలు సామాన్య జీవితాలు. అలా కాక తత్త్వంతో ముడిపడ్డవి భాగవత జీవితాలు. అలాంటి భాగవతుల జీవిత కథలు కూడా భగవత్కథతో పాటు నడుస్తూ వస్తాయి ఈ పురాణంలో. శుక శౌనక నారద ప్రహ్లాదాంబరీష పృథుధ్రువ కుచేల గజేంద్ర గోప గోపికాదుల చరిత్రలన్నీ అవే. ఇవి కూడా భగవత్కథలే వాస్త వానికంతకన్నా వేరు గావు. దుష్ట నిగ్రహ శిష్ట పాలనాదులే గదా ఆయన చేష్టలు. ఆశిష్ట పాలన ఏలాటిదో చూపటమే గదా ఈ భాగవతుల కథలన్నీ. అంచేత నిజానికంతా భగవత్కథే. భక్తుల కథలైనా అది భగవత్కథే. భక్తుణ్ణీ భగవంతుణ్ణీ వేరు చేయలేము. వేరయితే వాడు విభక్తుడవుతాడే గాని భక్తుడు కాడు. కాబట్టి భాగవతమంతా ఇంతకూ భగవంతుడి కథా వర్ణనమే.

అందుకే ఈ పురాణాన్ని హరికథా మృతమని కొని యాడారు. **"ఏ కథల యందు పుణ్య శ్లోకుడు హరి చెప్పబడును – ఆ కథలు పుణ్య కథలని ఆకర్ణింపుదురు."** హరి అంటే పాపాలు హరించేవాడు, విష్ణువు, ఆ విష్ణువెవరో గాదు కృష్ణుడే. **"ఆ హరి కృష్ణుండు బలానుజన్ము డెడలే దావిష్ణువౌ నేర్పడన్"** భగవంతుడి దశావతారాలలోనూ పరిపూర్ణమైన అవతారం కృష్ణావతారం. అందుకే **"కృష్ణస్తు భగవాన్ స్వయమ్"** కృష్ణుడే సాక్షాత్తు భగవంతుడన్నారు. అంటే సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే నన్నమాట. దీన్ని గూర్చి ఇంకా ముందు ముందు విపులంగా చర్చించబోతాము. మొత్తానికి విష్ణు కథ లేదా కృష్ణ కథ అనుకోవచ్చు భాగవతమంతా. అనుకోవచ్చునని పురాణామే మనకు సాక్ష్యమిస్తున్నది. **"లలిత స్కంధము కృష్ణమూలము"** కృష్ణుడే దీనికి మూలాధారం. అంటే పురాణమంతా కృష్ణ తత్త్వాన్ని ఆశ్రయించి దానిచుట్టూ నడుస్తూ ఉందని భావం. ఇది గమనించే మహాకవి పోతనా

మాత్యుడు దీన్ని కృష్ణ కథామృతమని నిర్దేశించాడు. రామ భక్తుడయి కూడా కృష్ణస్తుతితో గ్రంథాన్ని ప్రారంభించి షష్యంతాలలో కూడా కృష్ణుణ్ణే స్మరించాడాయన.

మొత్తానికి భాగవత కథ అంతా విష్ణుమయమే కృష్ణమయమే. అందుకే అసలు కృష్ణుడితో ఆరంభమై కృష్ణుడితో అంతమవుతున్నది పురాణం. ఆద్యంతాలలో ఏది ప్రస్తావిస్తే అది ప్రధానమని ఆర్యులమాట. ప్రథమ స్కంధంలో నారదుని వృత్తాంతంలోనే అసలు కృష్ణ కథ వస్తూంది. పరీక్షిత్తు జననమే తదనుగ్రహంతో జరిగింది. ఆ తరువాత అర్జునుడు వచ్చి ధర్మరాజుకు కృష్ణ నిర్యాణ వార్త వినిపించిన వృత్తాంతం వస్తుంది. పోతే మొదటి మూడు నాలుగు స్కంధాల వరకూ కృష్ణ చరిత్ర నడుస్తూనే ఉంటుంది. సప్తమ స్కంధంలో శిశుపాల వధ వృత్తాంతం దగ్గర మళ్లీ కనిపిస్తుంది. పోతే ఇక దశమ స్కంధంలో ఆయన జన్మ వృత్తాంతం దగ్గరి నుంచీ పూర్వోత్తర భాగాలలో అతివిపులంగా కృష్ణ చరిత్ర అంతా సాక్షాత్కరిస్తుంది. ఏకాదశ స్కంధాంతం దాకా ఆ చరిత్రే. అక్కడ మరలా కృష్ణ నిర్యాణ గాథ. పోతే ద్వాదశంలో భవిష్య వృత్తాంతమూ దాని కనుబంధమైన కల్క్యవతారమూ తప్ప మరేదీ చెప్పుకోదగ్గ కథలేదు. ఇలా ఆది మధ్యావసానాలలో పురాణంలో ఎక్కడ చూచినా కృష్ణతత్త్వమే సాక్షాత్కరించటం మూలాన ఇది కృష్ణచరిత్ర అని చెప్పటంలో ఆశ్చర్యం లేదు.

అయితే ఇక్కడ ఒక చమత్కారం. ప్రథమ స్కంధం ఆదిలో కృష్ణ నిర్యాణమూ, దశమ స్కంధంలో ఎక్కడో కృష్ణ జననమూ వర్ణించటం వింతగా కనిపిస్తున్నది మనకు. మరలా ఏకాదశాంతంలో నిర్యాణం వర్ణించటం కూడా చిత్రమే. నిర్యాణమూ, జననమూ, నిర్యాణమూ, ఏమిటీ వరస. మహర్షి ఇలా కథా వర్ణన చేయటంలో ఆయన ఉద్దేశించిన మర్మమేమిటని ప్రశ్న. దీనిలో చాలా ఉంది మనం తెలుసు కోవలసిన మర్మం. కృష్ణ నిర్యాణమైన తరువాతనే భాగవత రచన ఆరంభమయింది. అప్పటికి ద్వాపరమయిపోయి కలియుగం మొదలవుతుంది. కలియుగం మొదలయి నప్పుడే పరీక్షిత్తు పరిపాలన. అప్పుడే ధర్మమనేది క్షీణించటం చూచాడాయన. అది క్రమంగా క్షీణిస్తూ చివరకు కలియుగాంతంలో అసలే లేకుండా అంతరిస్తుంది. దానితో మరలా కృతయుగారంభం కావలసి ఉంది. ఈ ధర్మ విప్లవం కృష్ణ నిర్యాణంతో ఆరంభమై మరలా కల్క్యవతారంతో పునరుద్ధరణ కావలసి ఉందని సూచించటానికే కృష్ణ నిర్యాణమాదిలో వర్ణించవలసి వచ్చింది. నిర్యాణం జరగనిదే కలియుగం రాదు.

కలి వస్తేనేగాని ధర్మానికి పతనమేర్పడదు. అది పరాకాష్ఠ నందుకొంటే గానీ మరలా యుగాంతంలో కల్కి అవతరించి ధర్మోద్ధరణచేసి కృతయుగాన్ని ప్రవర్తింపజేయడు. ఇలా తొమ్మిదవదైన కృష్ణావతారం పరిసమాప్తమై పదియవదైన కల్క్యవతారం ప్రారంభమయ్యే మధ్య కాలంలోనే భాగవత మవతరించింది. ధర్మవిప్లవం ఏర్పడినప్పుడే గదా భగవత్కథా శ్రవణం చేసి తరించాలి మానవుడు. అలా తరించినవాడే పరీక్షిత్తు. వారే శౌనకాది మహర్షులు. వారేమిటి. ఆ పురాణ పాత్రలను నిమిత్తం చేసుకొని మనబోటి కలికాల మానవులు కూడా. ఇదంతా దృష్టిలో పెట్టుకొనే మహర్షి ఆదిలోనే కృష్ణ నిర్యాణాన్ని నిబంధించాడు.

అంతేకాదు ఇది దేశకాలాదులను బట్టి చెప్పిన మాట. పోతే పాత్ర విశేషాన్ని బట్టి చూచినా అదే సబబని తోస్తుంది. పాండవులు వారి బంధు మిత్రాదులూ ఇక్కడ పాత్రలు. వారు కృష్ణుని అనంతరం కూడా బ్రతికి ఉన్నారు. అప్పటికే తమ సహోదరులైన ధార్త రాష్ట్రులంతా మరణించారు. ఎందరో బంధువులూ, మిత్రులూ అస్తమించారు. యాదవులు కూడా కాలధర్మం చెందారు. ఇక మిగిలి ఉన్న జీవచ్ఛవాలు తాము మాత్రమే. వారికింకా ఈ ప్రాపంచిక వాసనలు వదలలేదు. అవి పూర్తిగా వదలి పోవాలంటే ఎన్ని గీతోపదేశాలు చేసినా లాభం లేదు. ఎంతగా తాను వారికి సహాయం చేసినా మహిమలు చూపినా సుఖం లేదు. తాను బ్రతికి ఉన్నంతవరకూ ఇంకా కొండలాగా ఇతడు మనకండగా ఉన్నాడులే మనకేమని బరవసా పడతారు వారు. అది వారికి తొలగాలంటే తానసలు లోకంలోనే లేకుండా పోవాలి భగవానుడు. ఇక మరలా కంటికి కనపడగూడదు. అలాగే జరిగింది చివరకు. అర్జునుడా నలుసంత వార్త తెలుసుకొని వచ్చాడు. అన్నగారి చెవిలో వేశాడు. అందరూ ఎంతగానో ఆక్రందన చేసి అంతవాడే పోయాడిక మనమనగా ఎంత వాళ్లమని పూర్ణ వైరాగ్య భావంతో పరీక్షిత్తుకు పట్టాభిషేకం చేసి మహాప్రస్థానాని కుద్యుక్తులవుతారు. అంతకు ముందే వారి తల్లి కుంతీ, గాంధారీ ధృతరాష్ట్రులూ అంతా సెలవు తీసుకొంటారు. ఇలా ఆయా పాత్రల ప్రవృత్తిని బట్టి చూచినా తత్ప్ర బోధకమైన కృష్ణ నిర్యాణమే మొదట చెప్పవలసిన ఆవశ్యకత కనిపిస్తుంది. అసలు భాగవతా కథా శ్రోత అయిన పరీక్షిత్తు జీవితం పాండవ ప్రస్థానమైతే కాని ఆరంభం కాదు. మరి పాండవుల ప్రస్థానం కృష్ణ నిర్యాణానంతరం గాని జరగదు. అంచేత కృష్ణ నిర్యాణ కథ భాగవతా రంభంలోనే ఉండి తీరాలి.

పోతే కృష్ణ జననం మరలా దశమ స్కంధంలో వర్ణించటమేమిటని గదా ప్రశ్న. అలాగే వర్ణించాలి తప్పదు. ఎందుకంటే భగవంతుడి అవతారకథలు వర్ణిస్తూ పోతుంది భాగవతం. ఆ అవతారాలలో కృష్ణావతార మనేది తొమ్మిదవది. మొదటి నుంచీ మత్స్యకూర్మాద్యవతారాలన్నీ వర్ణిస్తూ కృష్ణావతారాన్ని వర్ణించవలసి వచ్చేసరికి దశమ స్కంధంలో గాని వర్ణించటానికి లేకపోయింది. దశమ పూర్వోత్తర భాగాలంతా ఆయన చరిత్రే. తరువాత ఏకాదశంలో ఉద్ధవోపదేశమూ దాని అంతంలో నిర్యాణమూ వర్ణించబడ్డాయి. ఆ పిమ్మట ద్వాదశంలో పదియవదైన కల్క్యవతార ప్రస్తావన వస్తుంది. దానితో పురాణం సహజంగానే సమాప్తమవుతున్నది. కాబట్టి కృష్ణ నిర్యాణం ప్రథమ స్కంధంలో కృష్ణజననం దశమంలో – మరలా నిర్యాణం ఏకాదశాంతంలో జరిగినట్టు వర్ణించటం పైకి విడ్డూరంగా కనిపించినా భాగవత తాత్పర్యాన్ని బట్టి చూస్తే అందులో ఎంతో గాంభీర్యం కనిపిస్తుంది మనకు.

ఆ మాటకు వస్తే మరొక విడ్డూరం గూడ మనమిక్కడ గమనించవచ్చు. అది భాగవతం భారతకథతో ఆరంభం కావటం. పరీక్షిత్తునీ పాండవులనీ, గాంధారీ ధృతరాష్ట్రులనీ, భీష్మ విదురులనీ వీరంతా భారత కాలం నాటి పాత్రలు. వీరికి భాగవతంలో ప్రవేశమేమిటి. భారతానికీ, భాగవతానికీ ఏమిటి సంబంధం. అది ఇతిహాసం – ఇది పురాణం. అది ద్వాపర యుగచరిత్ర. ఇది కలియుగ వృత్తాంతం. రెంటికీ ఏమిటీ బాదరాయణ సంబంధం. బాదరాయణుడే కల్పించాడీ సంబంధం. ఆయన భారతానికే గాదు. ఇంకా మాటాడితే రామాయణానికి కూడా ముడి పెట్టాడు. భారతం ద్వాపరందయితే రామాయణం త్రేతాయుగం నాటిది గదా. అలాటి రామాయణ కథ కూడా పట్టుకు వస్తాడు భాగవతంలో. అందులో భారత కథ ప్రథమ స్కంధంలో అయితే రామాయణ గాధ నవమ స్కంధంలో వస్తుంది.

ఇది ఎందుకిలా జరిగిందని మనకు విడ్డూరంగా తోచవచ్చు. కాని లోతుకు దిగి చూస్తే ఇందులో కూడా ఎంతో మర్మముంది. భారత రామయణాలనేవి ఇతిహాసాలు. ఇతిహాసమనేది ధర్మప్రధానమని చెప్పాము. అది మోక్ష ప్రధానమైన పురాణంలో గతార్థం Implied కాక తప్పదు. ధర్మంకన్నా గొప్పది గదా మోక్షం. అందుకే భారత రామాయణాలు భాగవతంలో అంతర్భవించినట్టు వర్ణించటం. అంతేకాదు. భారతం ద్వాపర వృత్తాంతం – రామాయణం త్రేతా వృత్తాంతమని

ఎప్పుడన్నామో అవి కలియుగ చరిత్రలో కలిసి ఉన్నట్టు ప్రస్తావించటం కూడా ఒక సబబే. కనుకనే రామాయణం భారతంలో కనిపిస్తే భారత రామాయణ వృత్తాంతాలు రెండూ కలిసి భాగవతంలో దర్శనమిస్తాయి. యుగక్రమాన్ని బట్టి చూస్తే ఇది సమంజసమే గదా. ఇందులో కూడా మరి ఒక ధర్మ సూక్ష్మమున్నది. దశావతారాలను వర్ణించేటపుడు రామావతార వర్ణన కూడా రాక తప్పదు. కనుక రామాయణ ప్రస్తావన భాగవతంలో రావటంలో అనౌచిత్యం లేదు సరి గదా ఎంతైనా అవసరం.

పోతే ఇక భారత వృత్తాంత ప్రస్తావన అంతకన్నా ఆవశ్యకం. కృష్ణుడు లేనిదే భారతకథే లేదసలు. పాండవులని పేరే గాని కథ నడిచిందంతా కృష్ణుడి చేతి మీదనే. అదంతా ఒక్క పద్యంలో గుప్పించి చాలా గొప్పగా చెప్పాడు పోతనామాత్యుడు.

పాంచాలీ కబరీ వికర్షణ మహాపాప క్షతాయుష్కు లం
జంచద్గర్వుల ధార్త రాష్ట్రుల ననిం జంపించి గోవిందు డి
ప్పించెన్ రాజ్యము పాండవేయులకు గల్పించెన్ మహాఖ్యాతి - చే
యించెన్ మూడు తురంగ మేధములు దేవేంద్ర ప్రభా వోన్నతిన్

ఇంత హృద్యమైన పద్యం మరొకటి కానరాదు. ఎంతో విసురుగా సహజంగా, సుందరంగా, గంభీరంగా సాగిన పద్యమిది. కౌరవులను చంపింది పాండవులు కాదు. చంపించింది కృష్ణుడేనట. అసలు కృష్ణుడు కూడా అక్కరలేదు. వాళ్లు చేసిన మహాపాపమే వారి ఆయుస్సును హరించింది. అది పాంచాలీ కబరీ వికర్షణమే. దానితో వారి కాయుష్కాలం తీరితే అది తెలిసిన భగవానుడు ప్రేరణ చేస్తే దాని నందుకొని తత్సంహారానికి నిమిత్త మాత్రులయ్యారు పాండవులు. వారు రాజ్యం సాధించలేదు. సాధించి పెట్టాడు భగవానుడు. ఆయనే వారికెక్కడ లేని ఖ్యాతి నార్జించి పెట్టాడు. తుదకు ఒకటి గాదు రెండు గాదు. మూడు అశ్వమేధ యాగాలు చేయించాడు ధర్మరాజు చేత. చేయటం వరకే ధర్మరాజు. వెనకాల ఉండి చేయించిన వాడు కృష్ణుడే. అంతేకాదు. చివర కశ్వత్థామ కోపాగ్ని జ్వాలలో పడి భస్మమై పోకుండా పసికందును కాపాడి పాండవ వంశాన్ని నిలబెట్టింది కూడా ఆ మహాత్ముడే. ఆ పసి బాలుడే గదా పెరిగి పెద్ద వాడయి భాగవత కథావతరణానికి మూల కారణమయింది. కాబట్టి భారత కథా వృత్తాంతం భాగవతారంభంలో రావటమెంతైనా అవసరం.

ఆ రావటంలో కూడా పాండవుల పూర్వజీవితం కాకుండా ఉత్తర జీవితం రావటంలో ఇంకా అందముంది. జ్ఞానవైరాగ్యాలు మానవుడికి వార్ధక్యంలోనే సహజంగా ఉదయిస్తాయి. అంతకుముందు జీవితంలో ఎన్నో ధక్కా మొక్కీలు తిని ఉంటాడు. వాటన్నిటి ఫలితంగా పలితకేశుడైన తరువాతనే పరిపాకమనేది ఏర్పడుతుంది. శాస్త్రదృష్టితో మాటాడితే దీనినొక విధంగా త్వం పదార్థ శోధనమని పేర్కొనవచ్చు. అలాటి శోధన జరిగితే గాని తత్పదార్థమైన భగవత్సాయుజ్యానికి సోచుకోలేడు మానవుడు. అది లోకానికి బోధించటమే గదా భాగవతోద్దేశం. పాండవుల వృత్తాంత వ్యాజంతో అలాటి బోధే చేస్తున్నదిప్పుడు. కనుకనే భారతంలో కనిపించిన పాండవులు గారీ పాండవులు. అక్కడ ప్రతి ఒక్కరూ అంతో ఇంతో రాగద్వేషాదులైన ద్వంద్వాల సంఘర్షణతో బ్రతుకు సాగించినవారు. వారే ఇక్కడా తారసిల్లినా ఆ దుర్బలభావాలు కనిపించ వికడ. ద్రౌపదిగాని భీమార్జునులు గాని చివరకు కుంతిగాని, ధృతరాష్ట్రుడుగాని ప్రతి పాత్రా ఎంతో నిగ్రహాన్ని – నిర్లిప్తతనూ ప్రదర్శించటం చూస్తామిందులో. ఈ ఈ పాత్రలను చిత్రించటం ద్వారా ఇలాటి జ్ఞాన వైరాగ్యాల నలవరచుకొని బాగుపడండని మనందరినీ హెచ్చరిస్తున్నాడు మహర్షి. అదే గదా భాగవత సందేశమసలు. ఇదీ భారత వృత్తాంతంతో భాగవత పురాణ మారంభం కావటంలో స్వారస్యం.

పోతే భగవచ్చరిత్ర గదా భాగవతమంటే. భగవచ్చరిత్ర అంటే అది ఆయన అవతార చరిత్రే. ఈ అవతారాలు ప్రసిద్ధంగా చెప్పుకొనేవి పది అవతారాలు. మత్స్యావతారం మొదలుకొని కల్క్యవతారంతో సమాప్తమవుతాయి ఈ దశావతారాలు. ఈ అవతారాలూ వీటి వృత్తాంతమూ పండ్రెండు స్కంధాలలోనూ పరిచినట్టుగా కనిపిస్తున్నది మనకు భాగవతంలో. భాగవతం తృతీయ స్కంధంలో వరాహావతార కథ. సప్తమ స్కంధంలో నృసింహావతారం – అష్టమంలో కూర్మవామన మత్స్యావతారాలు. నవమంలో రామావతారం, పరశు రామావతారం రెండూ వస్తాయి. పోతే దశమంలో బలరామ కృష్ణావతారాలు రెండూ, ఇక ద్వాదశంలో చివరిదైన కల్క్యవతార ప్రస్తావన వస్తుంది. ఇలా పన్నెండు స్కంధాలూ అయ్యేసరికి భగవంతుడి పది అవతారాల చరిత్రా పరిపూర్ణంగా వర్ణించబడుతుంది. అందులోనూ ప్రథమంలో కృష్ణావతారంతో ఆరంభమై ద్వాదశంలో కల్క్యవతారంతో మరలా సమాప్తం కావటం ఎంతో సాభిప్రాయంగా Intentional జరిగింది.

అయితే ఈ అవతార కథా నిబంధనలో ఒక వ్యత్యాసం దొరలినట్టు భాసిస్తుంది మనకు. మత్స్య కూర్మ వరాహాది క్రమంగా వర్ణించవలసిన అవతారాలను కొంత వ్యతి క్రమం చేసి వర్ణించింది భాగవతం. మొదట వరాహావతార వర్ణన, తరువాత ఎక్కడో మత్స్యావతారమూ దానికి ముందు మరలా కూర్మావతారమూ. అలాగే రామావతారమూ తరువాత పరశు రామావతారమూ ఇలాటి వ్యుత్క్రమం మనకు గోచరిస్తున్నది. ఇలా ఎందుకు జరిగిందని జిజ్ఞాసువులకు సందేహమేర్పడటం సహజమే. దీన్ని నివారించుకోవాలంటే కొంత లోతుకు దిగి పూర్వాపర విచారణ చేయుట ఆవశ్యకం.

"మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః" అని ఒక క్రమాన్ని లోకులనూచానంగా Traditional చెప్పుకొంటున్నారు. భాగవతమిలాటి లౌకికమైన క్రమాన్ని గాదు పాటించింది. అది ఆయా మనువుల కాలక్రమాన్ని బట్టి అవతార చరిత్రను చిత్రిస్తూ వచ్చింది. భాగవతమంటే మనుచరిత్ర కూడా కదా. అందులో ఒక్కొక్క మన్వంతరం గడిచాక ఇంద్ర దేవ ఋషి గణాలు మారుతూ పోతాయి. వాటితో పాటు భగవంతుని అవతారాలు కూడా మారుతుంటాయి. ఈ మనువుల సంఖ్య మొత్తం పద్నాలుగని మన పురాణాల పరిగణన. వారు వరుసగా స్వాయంభువుడూ, స్వారోచిషుడూ, ఉత్తముడూ, అతని తమ్ముడు తామసుడూ, ఆ తామసుని తమ్ముడు రైవతుడూ, చాక్షుషుడూ, పోతే శ్రాద్ధదేవుడనే పేరు గల వైవస్వతుడూ, తరువాత క్రమంగా సూర్యదక్ష బ్రహ్మ ధర్మ భద్ర దేవ - ఇంద్ర సావర్ణులూ ఇలా పదునలుగురు.

వీరిలో మొదటివాడైన స్వాయంభువ మనువు కాలం వరాహ కల్పంలో వస్తుంది. అప్పటికి బ్రాహ్మం పాద్మమని రెండు కల్పాలు జరిగిపోయాయి. పోతే మూడవది వరాహ కల్పం. శ్రీ మహావిష్ణువు వరాహావతార మెత్తి రావడం మూలాన్నే దీనికి వరాహ కల్పమని సంజ్ఞ ఏర్పడి ఉండవచ్చు. ఇది మొట్టమొదటి మనువు కాలంలో జరిగిన వృత్తాంతం కాబట్టి మన్వంతర క్రమాన్ని బట్టి దశావతారాల్లో వరాహావతార కథే ముందుగా వర్ణించవలసి వచ్చింది. ఇది చాలా చిత్రమైన గాథ. స్వయంభువంటే బ్రహ్మదేవుడు. ఆయన మానస పుత్రుడే ఈ స్వాయంభువ మనువు. మిథున రూపంగా జన్మించాడాయన. ఆయన భార్య పేరు శతరూప. వీరిరువురూ కలిసి ప్రజాభివృద్ధి

చేయాలి. ఎలాగ. అప్పుడెక్కడ చూచినా జలం తప్ప మరేమీ లేదు సృష్టిలో. భూమి అనేది దానిలో దిగబడి ఎక్కడో అడుగున బడిపోయింది. దాని నుద్ధరిస్తే గాని వారికుండటానికి నివాసమనేది దొరకదు. దానికేమి టుపాయమని దిక్కుతోచక చతుర్ముఖు డాలోచిస్తుంటాడు. వెంటనే ఆయనకు తెలియకుండానే ఆయన ముకుజెరమల నుంచి భగవానుడు శ్వేత వరాహరూపంగా అవతరిస్తాడు. దీర్ఘ నిశాత దంష్ట్రలతో ఆ రసాతల మగ్నమైన భూమండలాన్ని పైకి లేపి మను దంపతులకు నివాసాన్ని కల్పిస్తాడు.

ఏమిటి దీని అంతరార్థం. మను సంతతి మానవులు. వారు కేవల జలార్ణవంలో జీవించలేరు. జలావృతమైన భూమి ఒక్కటే వారికి నివాస యోగ్యం. అది మానవ యత్నంతో ఒనగూడేది గాదు. దైవికమైన సంకల్పం వల్లనే ఫలిస్తుంది. అలాగే ఫలించిందిప్పుడీ భూలోక నివాసం మనబోటి మానవులకని భావం. పైగా యజ్ఞ వరాహమనేది ఋగ్యజురాదులైన నాలుగు వేదాలూ, తత్ప్రచోదితమైన ధర్మ కలాపమే దాని స్వరూపం. మానవుడు పుట్టిన తరువాత శాస్త్ర చోదితమైన సత్కర్మ లాచరించాలి. తద్ద్వారా తన జీవిత గమ్యాన్ని సాధించాలి. అందుకే ఈ మానవ సృష్టి అసలు. దాని కనురూపమైన కర్మభూమిని సృష్టించిన ఈ యజ్ఞరూపుడైన పరమాత్మ ఒక గొప్ప సంకేతం. అంతేకాదు. హిరణ్యాక్ష వధ కూడా ఇప్పుడే జరిగింది. ఇదికూడా ఒక సంకేతమే. హిరణ్యమంటే బంగారం లేదా ధనం. అక్షి అంటే దృష్టి లేదా చూపు. మానవుడి చూపు యావజ్జీవమూ ఐహికమైన భోగభాగ్యాల మీద కాదుండవలసింది. **"మాగృధః కస్యస్వి ద్ధనమ్"** అని శాస్త్రం. అయితే దేని మీద. కర్మ ఫల రూపమైన ఆముష్మికం మీద అని చెప్పటమే హిరణ్యాక్ష వధలోని అంతరార్థం.

పోతే ఇక రెండవదిగా మనం చెప్పుకొనే కూర్మావతార వృత్తాంతం. ఆరవ మనువైన చాక్షుషుడి కాలంలో జరిగింది. వరాహావతారం మొదటివాడైన స్వాయంభువ మనువు కాలంలో అయితే ఇది ఆరవవాడైన చాక్షుష మనువు కాలంలో. అంచేత వరాహావతార కథ మొదటా కూర్మావతార కథ తరువాతా వర్ణించబడ్డాయి. అది భాగవతం తృతీయ స్కంధంలో అయితే ఇది అష్టమ స్కంధంలో వస్తుంది. మరలా ఈ చాక్షుష మన్వంతరంలో దేవ ఋషి గణాదులన్నీ మారిపోతాయి. మహావిష్ణువిక్కడ సంభూతి వైరాజులనే దంపతులకు అజితుడనే పేరుతో అవతరిస్తాడు.

ఈ అజితుడే కూర్మరూపాన్ని ధరించి మందర పర్వతాన్ని మోసింది. అందులోనూ తాత్పర్యమేమంటే సముద్ర మథనమనేది చరాచర సృష్టి ప్రయత్నాని కొక సంకేతం. అందులో రాళ్లూ, రప్పలూ, చెట్లూచేమలూ, పశువులూ, పక్షులూ, స్త్రీ పురుషులూ, విషామృతాది ద్వంద్వాలూ, అన్నీ ఆవిర్భవిస్తాయి. దైవాసుర శక్తులు రెండూ కలిసి మథిస్తాయి. ఆ రెండింటి సంఘర్షణ ఫలమే ఈ సృష్టి. దీనికంతటికీ ఈశ్వర శక్తి ఆధారం కాకపోతే ఏదీ లేదు. అంతా హుళుక్కే. ఆ భావాన్ని సూచించేదే ఈ కూర్మావతార వృత్తాంతం.

పోతే సప్తమ మనువయిన వైవస్వతుడి కాలంలో వస్తుంది వామనావతారం. అదితి కశ్యపుల కిక్కడ విష్ణువు వామనుడనే సంజ్ఞతో జన్మిస్తాడు. వామనావతార కథ మనకు తెలిసిందే. అందులోనూ ఉంది ఒక రహస్యం. ఈ మన్వంతరంలో బలి అనేదానవు డింద్రుడు. దానవులకు దైవసంపద దక్కటం పరమాత్మ కిష్టం లేదు. కనుక ఊర్ధ్వాభిముఖంగా అతడు పయనిస్తుంటే అతణ్ణి అధోముఖంగా అణగద్రొక్కాడు. అందుకోసం త్రివిక్రముడయ్యాడు. త్రివిక్రమాలూ త్రిగుణాలే. ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః అన్నట్టు సత్త్వగుణ మూర్ధ్వగామి. మధ్యే తిష్ఠంతి రాజసాః రజోగుణం మధ్యవర్తి. ఇవి రెండూ దేవమానవ సర్గాలు. పోతే జఘన్య గుణమైన తమస్సు కిక్కడ చోటు లేదు. కనుక మూడవ పాదంతో తత్ప్రతినిధి రూపమైన బలిని అధోలోక నివాసిని గావించాడు. ఇది వామనావతార కథ.

పోతే ఇక మత్స్యావతారం. ఇది సత్యవ్రతుడనే రాజు కథతో ముడిబడి ఉంది. అతడంతకు ముందటి కల్పాంతంలో ద్రవిడ దేశాధిపతి. సాధుశీలుడు. పరమ భాగవతుడు. హరితర్పణంబుగా జలతర్పణం చేస్తుంటే దోసిటిలోకి ఒక చేప పిల్ల వచ్చి పడుతుంది. దానినెక్కడ తీసుకుపోయి చేరిస్తే అక్కడి కిను మిక్కిలిగా పెరిగిపోతుంది. ఇలా ఒక దినానికి శతయోజన మాత్రంగా విస్తరించే సరి కారాజాశ్చర్యపడి నీవు మత్స్య మాత్రుడవు కావు నన్నుద్ధరింప వచ్చిన నారాయణుడవని వర్ణించి మత్స్యమూర్తి ధరించటానికి కారణమడుగుతాడు. దానికి సమాధానమిస్తూ ఆ పరమాత్మ ఈనాటి నుంచి ఏడవ నాటికి బ్రహ్మదేవుడి కొక పరార్ధం Half నిండి ప్రళయమాసన్న మవుతుంది. అప్పుడా ప్రళయ పయోరాశిలో మీ బోటి పుణ్యపురుషులు మునుగకుండా నేను మీనరూప ధరుడనై మిమ్మందర నొక నావలో

జేర్చి కాపాడుతానని చెప్పి అంతర్ధానమవుతాడు. ఆ తరువాత ఆయన చెప్పినట్టే జరుగుతుంది. ఆ కాళరాత్రిలో బ్రహ్మ మయి మరచి గుఱ్ఱుపెట్టి నిదురిస్తుంటే హయగ్రీవుడనే దానవుడు ఆయన చేతిలోని వేదాల నపహరిస్తాడు. హరి మీనావతారుడై వాని నన్వేషిస్తూ ఉండగా ఈ సత్యవ్రతుడు సప్తర్షులతో ఓడనెక్కి కూర్చుండి ఆ దేవుని చూచి ఆసక్తితో సన్నుతిస్తాడు. దాని కాయన సంతోషించి సాంఖ్య యోగ విద్యా సమన్వితమైన పురాణ సంహిత నుపదేశిస్తాడు. ఆ సత్యవ్రతుడే తరువాతి కల్పంలో వివస్వంతుని కుమారుడైన వైవస్వత మనవుగా జన్మిస్తాడు. ఆ మనువు కాలంలో జరిగిందే వామనావతార గాథ. ఇది దానికి ముందే జరిగిందని వర్ణించటంవల్ల మత్స్యావతారం వామనావతారానికి నృసింహావతారానికీ మధ్యస్థమైనదిగా భావించవలసి ఉంటుంది.

పోతే ఈ వైవస్వతుడనే సప్తమ మనువుకు పదిమంది సంతానం. వారిలో పెద్దవాడిక్ష్వాకువు. వివస్వంతుడంటే సూర్యుడు కాబట్టి ఈ వంశమంతా సూర్యవంశం క్రిందికి వస్తుంది. ఈ సూర్యవంశంలో క్రమానుగతంగా అనేకమంది రాజులు రాజ్యమేలిపోయిన తరువాత వరుసగా రఘువూ, అజుడూ, దశరథుడూ అయి ఆ దశరథుడికి విష్ణుమూర్తి రాముడనే పేరుతో జన్మిస్తాడు. కనుక రామావతార ఘట్టం అంబరీష నగరాది రాజన్యుల తరువాత నవమ స్కంధంలో వర్ణించబడింది. రామావతారమైన తరువాత పరశురామ వృత్తాంతం వర్ణితమయింది పురాణంలో. కారణమేమంటే రాముడు సూర్య వంశీయుడైతే పరశురాముడు చంద్ర వంశ్యుడు. మొదట సూర్యవంశాన్ని వంశానుచరితాన్ని వర్ణించిన తరువాత చంద్ర వంశ వర్ణన కుపక్రమించింది పురాణం. దానిని బట్టి పరశురాముని కథ రాముని అనంతరం ప్రస్తావించటమయింది. పైగా ఈ పరశురాముడు తరువాత మనువు కాలంలో సప్తర్షులలో ఒకడుకాబోతాడు. అంతదాకా మహేంద్ర పర్వతం మీద తపస్సు చేస్తూ కూచుంటాడాయన. ఇక్కడికి నవమ స్కంధం సమాప్తమవుతుంది.

పోతే ఇక దశమ స్కంధంలో బలరామ కృష్ణావతారాల వృత్తాంతం సవిస్తరంగా వర్ణితమవుతుంది. ఏకాదశ స్కంధం వారి నిర్యాణంతో ముగుస్తుంది. ఆ తరువాత ద్వాదశంలో చివరిదైన కల్క్యవతార గాథ. మొత్తానికి నాలుగైదారులు తప్ప విడిస్తే మిగతా తొమ్మిది స్కంధాలలోనూ ఆ భగవానుడి పది అవతారాల వర్ణనా

ఉపనిబద్ధమయింది. మూడులో వరాహకథా, ఏడులో నృసింహ కథా, ఎనిమిదిలో కూర్మ మత్స్య వామనుల వృత్తాంతమూ, తొమ్మిదిలో రామ పరశురాముల చరిత్రా, పది పదకొండులలో రామకృష్ణుల ఉదంతమూ, కాగా పన్నెండులో కల్కి పరాక్రమమూ, ఇదీ వరస. ఇది కూడా ఏదో ఊరక యాదృచ్ఛికంగా ఏకరువు పెట్టిన వరుసగా కనిపించదు. దశావతారాలనీ క్రమంలోనే భాగవతం వర్ణించటంలో చాలా అంతరార్థమున్నది.

అవతారమనేది మానవుడి కోసమే మానవజాతి ఉద్ధరణ కోసమే. అందులో మొదట మానవుడి కొక స్థిర నివాసం కల్పించటం కోసమెత్తినదే వరాహావతారం. అది భగవత్కృతం కాదు. తన ప్రమేయమేనని భావించేవాడి కోసం నృసింహావతారం. అలా కాక తన్ను సర్వాత్మనా నమ్మినవారి కమృతత్వాన్నే ప్రసాదించటానికి కూర్మావతారం. అది రేపు ప్రళయంలో కూడ మానవుణ్ణి కాపాడుతుందని చెప్పటానికే మత్స్యావతారం. దానివల్ల అంతకంత కూర్ధ్వ లోకాలకు పయనించి పరంధామాన్నే చేరుతాడని సూచించేది వామనం. అలాటి పరమపద ప్రాప్తి నందుకోవాలంటే త్రిగుణాల వాగురలో తగులుకొన్నంత వరకూ ప్రయోజనం లేదని చాటటానికే రామ పరశురామ బలరామావతారాలు. ఇవి మూడూ వరుసగా సత్త్వరజస్తమో గుణాలకూ ప్రతీకలు. వాటి నతిక్రమించటమంటే వాటిలో ఉంటూనే వాటి నధీనం చేసుకొని తన మాయతో తానే క్రీడించటమనే పరావర సామరస్యాన్ని నిరూపణ చేస్తుంది కృష్ణావతారం. దానితో చివరకు మానవుడు కాలానికి కూడా అతీతుడై తన ఇచ్ఛానుసారం కాల దేశ వస్తు ధర్మాలను నడుపుతూ విశ్వ ధర్మ సూత్రాన్ని అవిచ్ఛిన్నంగా సాగిస్తూ పోతాడని చెబుతుంది కల్కి. ఇదీ భాగవత పురాణమంతా పనగలిసి ఉన్న దశావతార వృత్తాంత రహస్యవాదం.

అసలు దశావతారాలు కూడా కావు. ఏకవింశ త్యవతారాలు వర్ణించింది భాగవతం. కుమారస్వామి, నారదుడు, నరనారాయణులు, కపిలుడు, దత్తాత్రేయుడు, యజ్ఞుడు, ఉపక్రముడు, పృథుచక్రవర్తి, ధన్వంతరి, వేదవ్యాసుడు, కడపటికి బుద్ధుడితో కూడా దశావతారాలలో చేరి ఇరువది ఒక్క అవతారాలయినాయి. అసలా మాటకు వస్తే పది ఏమిటి ఇరువది ఒకటేమిటి. పరశ్శతాలూ పరస్సహస్రాలని చెప్పినా చెప్పవచ్చు అవతారాల సంఖ్య. సర్వమూ భగవద్వ్యూహమేనని భగవత్పాదులు

సెలవిచ్చినట్టు భగవంతుడి అవతారం కానిది సృష్టిలో ఏదీలేదు. అందుకే భాగవతమిలా ఘోషిస్తున్నది.

సరసిం బాసిన వేయి కాలువల యోజన్ విష్ణునందైన శ్రీ
కర నానా ప్రకటావతారము లసంఖ్యాతంబు - లుర్వీశులున్
సురలున్ బ్రాహ్మణసంయ మీంద్రులు మహర్షుల్ విష్ణు నంశాంశజుల్

ఒక మహానది ప్రవహిస్తూంటే దానిలో నుంచి కొన్ని వందల కాలువలు త్రవ్వుతాము. వాటిని పంట పొలాలవైపు మళ్లిస్తే పంటలు ఏకధాటిగా పండుతాయి. అలాగే ఆ పరమాత్మ చైతన్యం నుంచి కూడా అనేకానేక చైతన్యశాఖ లవతరిస్తున్నాయి. భూమండలాన్ని పాలించే క్షత్రియులూ, బ్రాహ్మణులూ, దేవతలూ, మహర్షులూ, యోగీశ్వరులూ, ఒకరేమిటి, సమస్త ప్రజానీకమూ, ఆ చైతన్య విభూతే. దాని అంశలూ, అంశాంశలే. అంతకన్నా ఇతరమైనదేదీ కానరాదు.

ఇందులో ఒక రహస్యమున్నదిలా చెప్పటంలో. మనువులనే వారీ క్షత్రియ జాతికి చెందినవారే. పోతే అత్రికశ్యపాదులైన ప్రజాపతులంతా బ్రాహ్మణజాతి క్రిందికి వస్తారు. వీరే తరువాత ప్రపంచ సృష్టికంతా మూల పురుషులు. నారాయణ నాభి కమలం నుంచి బ్రహ్మ జన్మిస్తే ఆ బ్రహ్మ సృష్టించిన వారీ మనువులూ, ప్రజాపతులూ, వీరా తరువాత కన్న సంతానమే భూత జాతమంతా. వీరిలో వైవస్వతాది మనువులందరూ క్షత్రియులూ, కశ్యపాదులైన ప్రజాపతులు బ్రాహ్మణులని గదా చెప్పాము. ఒకరు రజోగుణ ప్రధానులైతే మరొకరు సత్త్వగుణ ప్రధానులు. సత్త్వరజ స్సంపర్కముంటేనే జ్ఞానక్రియా దోహదకారి. అందుకే మనువులు ప్రజాపతుల బిడ్డలను పెండ్లాడితే ప్రజాపతుల సంతతిని మనువులు వివాహమాడినట్టు వర్ణిస్తుంది పురాణం. పోతే వీరికిటు భూలోకంలో తోడ్పడటానికి నారదాది మహర్షులూ, కపిలాది సంయములూ, అటు దేవలోకంలో అగ్ని వరుణ కుబేరవాయ్వాది దేవతానీకమూ. వారు తమ తపః ప్రభావం చేతనూ, సహజమైన దివ్యానుభావం చేతనూ మానవ జీవితాలను పరిపుష్టం చేయగలరు.

ఇలా భావన చేస్తూ పోతే ప్రతి ఒక్కటీ మానవాభ్యుదయం కోసమే భగవంతుడి ప్రయత్నమంతా తదేకోన్ముఖమే. దేవ ఋషి మను ప్రజాపతి ప్రభృతి సృష్టి అంతా

ఆ భగవానుడి విభూతేనని వర్ణించటం వల్ల ఇక పురాణంలో ఎక్కడ ఏ కథ వచ్చినా ఎవరి విషయం ప్రస్తావించినా – అది ఆ పాత్రలద్వారా పరిస్థితుల ద్వారా భగవద్గుణ లీలాగానం చేయటమే – దాని అపదేశంతో Pretext మానవులందరికీ జీవిత గమ్యమైన పరమ పురుషార్థ మహాఫలాన్ని సాక్షాత్తుగానో పరం పరంగానో ప్రసాదించటమే. అంతకుమించి మరేమీ గాదని మనం స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

ఈ ఉదాత్త విశాలమైన దృష్టితో ప్రస్తుత మీ భాగవత కథా నిర్మాణాన్నంతటినీ స్థాలీ పులాకన్యాయంగా ఒక్కసారి పరిశీలించి చూతాము. అసలు ప్రథమ స్కంధంలో భాగవతావ తరణానికి హేతుభూతుడైన పరీక్షిత్తు విష్ణ్వంశ సంభూతుడే. మరి సంయమీంద్రుడైన శుకయోగిని చెప్పనక్కరలేదు. శౌనకాదులందరూ మహర్షులే. తన్ముఖంగా జరిగిన భాగవత కథా విర్భావమంతా భగవన్ముఖోద్గతమే సందేహం లేదు. పైగా బహుజన్మ సుకృత పరిపాకముంటే గాని మానవుడు తరించడని చెప్పటానికి నారదుని జన్మాంతర వృత్తాంతం. ముందు ముందు జీవితమెలా గడచినా రాను రాను శమదమాదులార్జించి భగవద్భక్తి నలవరుచుకోవాలని ప్రబోధించటానికి కుంతీ పాండవ భీష్మ ధృతరాష్ట్రాదుల చరిత్రా – కడకు మహాపురుషుల రాకపోకలు చూచి అయినా నేర్చుకోమని చెప్పటానికి కృష్ణ నిర్యాణమూ, ఇందులో పొందు పరిచాడు మహర్షి. పోతే ద్వితీయస్కంధంలో శుకమహర్షి ఖట్వాంగుడనే రాజర్షి చరిత్రతో ప్రారంభిస్తాడు భాగవత కథ. ఏడు రోజులలో మరణిస్తానని బాధపడుతుంటే పరీక్షిత్తు అలా పడనక్కరలేదు. ముముక్షువైన వాడి కేడు రోజులెందుకు. ఏడు గడియలు చాలు. ఆ మాటకు వస్తే ఒక్క ముహూర్త కాలంలో ఇక ఆయువు ముగుస్తుందన్నపుడు కూడా నిజమైన పరమార్థ నిష్ఠ ఉన్నవాడు తరించటంలో అభ్యంతరం లేదని చెప్పటానికీకథ చెప్పాడు శుకుడు. ఖట్వాంగుడనేది నెపం. ఇది మనకోసం చేసిన హెచ్చరికే మరేదీ గాదు. ఈ ఖట్వాంగుడెవరో గాదు మరలా. సూర్యవంశ ప్రవర్తకులలో ఒకడు. రఘు మహారాజుకు పితామహుడు. నవమ స్కంధంలో భగీరథుని తరువాత శ్రీరామ జననానికి ముందు ఇతని ప్రస్తావన వస్తుంది. దేవతల కార్యం నిర్వర్తించిన తరువాత వారు ప్రీతులై వరమిస్తామంటే నా ఆయుష్కాలం చెప్పమని అడుగుతాడు. వారొక ముహూర్తకాలమే ఉందని చెబితే వెంటనే భూలోకానికి వచ్చి తపస్సు చేసి తరిస్తాడు. ఇదే జీవితానికంతటికీ కోరదగిన

మహాఫలం. తరువాత దాని కనుబంధంగా ప్రపంచ సృష్ట్యాదికమూ, భగవదవతార వర్ణనమూ చేయబడ్డాయి. సర్గశ్చ ప్రతి సర్గశ్చ అని సృష్టి లయ వర్ణన పురాణంలో అవశ్యంగా ఉండి తీరుతుంది. పోతే మనువంశం – వంశానుచరితం – ఆ రెండింటికీ మధ్య స్థితి కాలంలో జరిగే వ్యవహారం. ఇందులో దాగి ఉన్న సూచన ఏమంటే మానవుడా రెండు దశలలో ఏదీ చేయటానికి సమర్థుడు కాడు. ఏదైనా చేసినా చెందినా మధ్య దశలోనే. అది మహాపురుషులెలా సాధించారో వారి జీవితాలు వర్ణిస్తే తెలుసుకొని మనమూ బాగుపడతాము. ఇదీ ఇక్కడ ఉన్న రహస్యం.

పోతే తృతీయ స్కంధంలో విదుర మైత్రేయ సంవాద మొకటీ – కపిలదేవ హూతి సంవాదమొకటీ – చాలా ప్రధానమైన అంశాలు. రెండూ ధర్మ మోక్ష ప్రతిపాదకాలే. ఎన్నో ధర్మ రహస్యాలన్నీ ఇందులో ప్రవచింపబడతాయి. **"ఆచార్య వాన్ పురుషోవేద"** అనే గురు శిష్య సంప్రదాయానికివి రెండూ నిదర్శనాలు. భారతంలో విదురపాత్రకూ, ఇక్కడి పాత్రకూ సంబంధం లేదు. కథా గమనంలో కూడా ఎంతో మార్పు కనిపిస్తుంది. భారత యుద్ధానికి పూర్వమే విదురుడు హస్తిన నుంచి నిష్క్రమించటం. పారివ్రాజ్యాన్ని అవలంబించి చివరకు కృష్ణ నిర్యాణ వార్త కూడా విని ఆయా గురువుల వల్ల పరమాత్మ తత్త్వోపదేశం పడసి తరించటమిక్కడ విశేషం. దీనిని బట్టే చెప్పవచ్చు కథలనేవి యథార్థం కావు అవన్నీ కేవలమొక సత్యాన్ని మనకు సూచించే అర్థవాదాలేనని. జయ విజయుల శాపవృత్తాంతం – హిరణ్యాక్ష వధ – ఇక్కడే వర్ణించబడ్డాయి. జయ విజయుల వృత్తాంతం మరలా సప్తమ స్కంధా రంభంలో వస్తుంది. ఇక్కడ హిరణ్యాక్ష వధకు ముందైతే అక్కడ హిరణ్య కశిపు సంహారానికి ముందు, వీరిరువురూ జయ విజయుల మొదటి జన్మ. ఇది కృతయుగంలో, పోతే నవమ స్కంధంలో రామావతార చరిత్రలో వారి రెండవ జన్మ రావణ కుంభ కర్ణులు, కాగా మూడవది దశమ స్కంధంలో కృష్ణావతార చరిత్రలో వస్తుంది. అదే శిశుపాల దంత వక్త్రుల జన్మ. మొత్తానికీ మూడు జన్మలెత్తి ముక్తులవుతారా జయ విజయులు. వారెవరో కాదు. వైకుంఠ ద్వారపాలకులే. స్వామిదర్శనా పేక్షులై వచ్చిన సనకాదుల నడ్డగించి వారి శాపకారణంగా పరమాత్మకు దూరమయ్యారు. మరలా ఆయన అనుగ్రహం కారణంగా వైర వ్యాజంతో దగ్గర పడ్డారు.

వీరిదొక పెద్ద సంకేతం. ద్వారపాలకులంటే రజస్తమోగుణాలే. అవి మోక్షద్వారాన్ని పాలిస్తున్నాయి. ఎంత వాళ్లనూ లోపలికి వెళ్లనీయవు. పరమాత్మ దర్శనానికి నోచనీయవు. అయితే శుద్ధ సత్త్వసంపన్నులయి బ్రహ్మ జ్ఞాన నిష్ఠులైన పెద్దల నవి ఏమీ చేయలేవు. వాటి కబంధ హస్తాల కందని ప్రదేశంలో ఉన్నారు వారు. అలవాటు కొద్దీ ఎప్పుడైనా వారి మీద దాడి చేశాయో ఇవి బ్రతకలేవు. అంటే ఏమని అర్థం. జ్ఞానక్షేత్రంలో అడుగు పెడితే రజస్తమో గుణాత్మకమైన అవిద్య నశించవలసిందే తప్పదు. అప్పుడది పరమాత్మకు దూరమై పోతుంది. అయితే అది ఆయన మాయాశక్తే కాబట్టి ఎప్పటికీ దూరం కావటమాయన కిష్టం లేదసలు. మరలా ఏదో ఒక నెపంతో తన దగ్గరికి రావలసిందే. అజ్ఞానులను తదాశ్రయ బలంతో అవి పట్టి చూడవలసిందే. కాబట్టి జయ విజయులంటే రజస్తమస్సులే. కనుకనే వారు తమ శాపఫలంగా ఎత్తిన మూడు జన్మలలోనూ ఆ గుణప్రభావాన్ని చూపుతూనే వచ్చారు. హిరణ్యకశిపుడు రజోగుణానికైతే హిరణ్యాక్షుడు తమోగుణానికి ప్రతీక. అలాగే రావణుడు రాజసుడైతే కుంభకర్ణుడు తామస స్వభావుడు. శిశుపాలుడిది రాజస ప్రకృతి అయితే దంత వక్త్రుడిది మరలా తామసతత్త్వం. ఇలా వారి జన్మలలోనే మనకా గుణభేదం కనిపిస్తుంది.

విదుర మైత్రేయ సంవాదం తరువాతదీ స్కంధంలో కపిల దేవహూతి సంవాదం. కర్ధము డొక ప్రజాపతి. అతడు పెండ్లి ఆడింది స్వాయంభువ మనువు కుమార్తె అయిన దేవహూతిని. మనువులకూ ప్రజాపతులకూ వైవాహికాది సంబంధాలుండటం గమనించదగిన విషయం. ఒకరు బ్రాహ్మణులూ మరొకరు క్షత్రియులు. జ్ఞాన క్రియాశక్తులు రెంటికీ రెండూ సంకేతాలు. వారి కలయిక జగత్సృష్టికీ స్థితికీ ఆవశ్యకమని పురాణ హృదయం. వారిరువురి సాంగత్య ఫలమే కపిలావతారం. తదుపదేశం వల్ల తరించింది దేవహూతి. స్త్రీలకు కూడా విద్యాధికారముందని సూచిస్తుందీ కథ. ప్రపంచ సృష్ట్యాదికమంతా వర్ణించబడింది ఇందులో. జీవుడి సంసార మోక్షగతి వృత్తాంతం కూడా ఎంతో విస్తారంగా ప్రతిపాదించబడింది.

పోతే చతుర్థ స్కంధంలో ముఖ్యమైనది దక్షప్రజాపతి. ధ్రువుడు, పృథువు, ప్రాచీనబర్హి వీరి చరిత్ర. దక్షుడు కర్దముడి లాగే ప్రజాపతుల కోవలోని వాడు. కర్ధముడికి సాక్షాత్తూ తోడల్లుడు. అయితే అతనికుండే శమదమాదులితనికి లేవు.

పరమేశ్వరుడి అంతవాడికి బిడ్డనిచ్చి కూడా అనవసరంగా ఆయనతో గిల్లి జగడం తెచ్చుకొన్న అవివేకి. ఆయననాహ్వానించకుండానే యజ్ఞాన్ని తలపెట్టాడు. కడకు కన్న కూతురు సమక్షంలో దగ్ధమవుతున్నా ఏమీ పట్టనట్టు చూస్తూ కూచున్నాడు. ఇలాటి మహాపచారంతో తానే చివర కాపరమేశుని కోపానలాని కాహుతయ్యాడు. ఇది ఉన్నతపదంలో ఉండి కూడా ఆ పదవీ గౌరవాన్ని నిలబెట్టుకోలేని ఒక అనాత్మజ్ఞాని చరిత్ర. జ్ఞానవిరహితమైన కేవల కర్మకాండ మానవుని ఉద్ధరించలేదని కూడా ఒక సూచనే. ఇది దక్షుడి పశ్చాత్తాప వాక్యాలలోనే విదితమవుతుంది మనకు.

న బ్రహ్మ బంధుషుచ వామ్ భగవ న్నవజ్ఞా
యోసౌ మయా ఽవిధత తత్త్వ దృశా సభాయాం
క్షిప్తో దురుక్తి విశిఖై రగణయ్య తన్మామ్
అర్వా క్పతంత మర్హత్తమ నింద యా పాత్

నేను ద్విజబంధుణ్ణే కాని నిజమైన ద్విజన్ముణ్ణి కాను. నీతత్త్వం తెలియక నిందించాను. అయినా నీవది గణింపక పతితుడనైన నన్ను గ్రహించావదే చాలునని మొరపెడతాడు.

ధ్రువుడి చరిత్ర ఇంకా చిత్రమయింది. మనువుకు సాక్షాత్తు మనుమడే ఇతడు. సవతి తల్లి చేసిన అవజ్ఞ భరించలేక అడవికి వెళ్ళి తపస్సు చేస్తాడు. విష్ణువును ప్రత్యక్షం చేసుకొంటాడు. అనన్య దుర్లభమైన పదవిని సాధిస్తాడు. పరమపద సాధనలో శ్రద్ధా తాత్పర్యాలనేవి ఎలా ఉండాలో అవి ఎప్పుడో వార్ధక్యంలో కాక బాల్యంలోనే ఎలా పాదు చేసుకోవాలో తెలుపుతుందీ కథ. పైగా గురూపదేశ ప్రభావాన్ని కూడా నిరూపిస్తుంది. ధ్రువుణ్ణి గూర్చి చెప్పవలసింది చాలా ఉంది. అది ఉత్తరత్రా మనవి చేస్తాను. ధ్రువుడి తరువాత పృథుచక్రవర్తి. ఇతడు ధ్రువుడి కెన్నో తరాలు తరువాతి వాడైన వేనుడి కుమారుడు. వేను డాజన్మ దుర్జనుడు. **"యద్దౌశ్శీల్యాత్స రాజర్షి - ర్నిర్విణ్ణో నిరగాత్పురాత్"** అతడి దుశ్చేష్టలకు విసిగి కన్నతండ్రే సన్యసించి వెళ్లిపోయాడు. తరువాత అతణ్ణి మహర్షులు రోషకషాయితమైన దృష్టులతో చూచి దగ్ధం చేస్తారు. అతడి ఊరువు మథిస్తే దానిలో నుంచి జన్మిస్తాడు పృథువు. అతడెంత దుశ్శీలుడో ఇతడంతటి సాధుశీలుడు. **"నావిష్ణుః పృథివీపతిః"** అన్నట్టు సాక్షాద్విష్ణ్వంశ

సంభూతుడు. గోరూపధారిణి అయి పరుగెత్తే ధారిణిని నిలిపి మరలా సస్యశ్యామలం చేసినవాడు. ప్రజానురంజనం చేసి రాజశబ్దాన్ని సార్థకం చేసుకొన్నాడు. చివరకు విష్ణుదర్శనం చేసి తత్సాయుజ్యాన్ని పొందాడు. ఇది ఉత్తమ రాజలక్షణాలూ, ధార్మికమైన పరిపాలనా, ఎలా ఉండాలో తెలిపే గాథ. ఈ పృథువును గూర్చి చర్చించవలసినది ఎంతో ఉంది. తరువాత మనవి చేస్తాను. పోతే చివరది ప్రాచీన బర్హి వృత్తాంతం. ఇది అంతా ఒక పెద్ద అర్థవాదం Allegory. ఇది కూడా తరువాత ప్రవచింపబడుతుంది.

ఇక పంచమ స్కంధంలో మనుపుత్రుడైన ప్రియవ్రతుడూ, ఋషభుడూ, జడభరతుడూ, వీరి ఉపాఖ్యానాలు వస్తాయి. ఋషభుడు భగవదవతారమే. మహాయోగి. అంతకన్నా గొప్పవాడు భరతుడు. భారత వర్షమనే సంజ్ఞ మనదేశానికా మహాపురుషుడి మూలాన్నే ఏర్పడింది. భరత రహూ గణ సంవాదమంతా వేదాంత వాక్యరత్నాల కాకరం. భోగత్యాగాలను రెంటినీ సమానంగా అనుభవించి జీవితంలో పరిపూర్ణత అంటే ఏమిటో లోకానికి నిరూపించే రాజర్షుల ఉదంతాలివి.

షష్ఠ స్కంధంలో అజామిళ వృత్తాంతమూ, వృత్రాసుర సంహారమూ, చిత్రకేతు వృత్తాంతమూ ముఖ్యమైనవి. ఒకటి విష్ణు నంకీర్తన ఫలాన్నీ, మరొకటి జ్ఞానార్జనోపాయాన్నీ, వేరొకటి దంభ దర్పాది దుష్పరిపాకాన్నీ మనకు బోధిస్తాయి. ఇక సప్తమ స్కంధంలో అతిముఖ్యమైనది ప్రహ్లాద చరిత్ర. దీని విషయం తరువాత ఎలాగూ మనవి చేయబోతాను. కాబట్టి ప్రస్తుతానికి విరమిస్తాను. పోతే ఇక అష్టమ స్కంధం. ఇందులో గజేంద్ర మోక్షం, సముద్రమథనం, వామనచరిత్రా ముఖ్యమైనవి. సముద్రమంటే సంసారమే మానవుడి మనసే మందరం. దైవాసుర సంపదలతో నిరంతరమూ మథిస్తుంటాడు దాన్ని. అందులో ఎన్నో భోగ్యపదార్థాలు లభిస్తుంటాయి మనకు. అయినా తృప్తిలేదు. ఇంకా ఏదో సాధించాలనే మన ఆశ. చివరకలా ఆరాటపడుతుండగానే హాలాహలం లాంటి మృత్యువాసన్నమవుతుంది. అప్పటికైనా సద్గురూపదేశం వల్ల ఆత్మజ్ఞానాన్ని ఆర్జిస్తే మంచిదే. అమృతత్వాన్ని పొందగలడు. పరమేశ్వరుడంటే అలాంటి ఆచార్యుడే. అతడు సర్వజ్ఞుడూ, మృత్యుంజయుడూ. మనము ఆయనను శరణువేడితే అలాగే సర్వజ్ఞులమై మృత్యువును జయిస్తాము. లేదా జగన్మోహిని అయిన యోగమాయకు లోబడి మహామృతువు వాతనే

పడిపోతాము. ఇదే ఈ కథ మనకిచ్చే అమృత సందేశం. తొమ్మిదవ స్కంధమంతా అంబరీష సగర – భగీరథ రామాదులైన సూర్యవంశ రాజులచరిత్రా – యయాతి భరత రంతి దేవ యదు రాజాదులైన చంద్ర వంశ రాజులచరిత్రా – రెండింటితో నిండి ఉంటుంది. ఎంత జ్ఞాన విజ్ఞాన సంపత్తి ఉన్నా శమదమాది సంపత్తి లేకపోతే ఆ మానవుడు విపత్తి పాలు కావలసిందే నని అది ఉన్నవాడికి భగవంతుడి రక్ష ఎప్పటికైనా పని చేస్తుందని చెప్పటమే అంబరీషుడి కథ ద్వారా మనమర్థం చేసుకోవలసింది. మరి ఎంత శ్రీమంతుడైనా కాలప్రభావాన్ని తప్పించుకోలేడని – ఆత్మౌపమ్య దృష్టితో సమస్త భూతాలనూ ఉచ్చనీచాది భేదం లేకుండా దర్శించే మహాత్ముడే తత్ప్రభావాన్ని దాటిపోగలడని చెబుతుంది రంతి దేవుడి చరిత్ర. పోతే రాముని వల్ల పితృవాక్య పరిపాలనా యయాతి వల్ల స్వాత్మ పరిశీలనా – దుష్యంతుని వల్ల స్వాపరాధ పరిమార్జనమూ ఇలాటి సదుపదేశాలెన్నో గ్రహించవచ్చు.

పోతే దశమ స్కంధం చాలా పెద్దది. పూర్వోత్తరాలని రెండు భాగాలున్నాయి. ఇందులో వర్ణించబడినదంతా కృష్ణావతార చరిత్రే. దాని కనుబంధమైనవే మిగతా కుచేలోద్ధవాదుల కథలన్నీ. ఈ కృష్ణ చరితామృత వాహిని పూర్వోత్తర తటాలను రెండింటినీ ఒరుసుకొని ఏకాదశం దాకా ప్రవహించింది. మహర్షి శాప ప్రారంభమూ, ఉద్ధవోపదేశ మధ్యమమూ, కృష్ణ నిర్యాణ పర్యవసానమూ, ఈ ఏకాదశ స్కంధమనేది. పోతే ఇక ఆఖరిది ద్వాదశ స్కంధం. ఇది భాగవత మహానాటకానికొక భరతవాక్యం లాటిది. యుగధర్మాలూ, విశేషించి కలియుగ లక్షణాలూ మార్కండేయుడు నెపంగా అనంతకాలంలో జరిగే ప్రపంచ సృష్టి ప్రళయాది వర్ణనా – తదభి వర్ణనైక ప్రయోజనమైన పురాణ సంహితా ప్రశంసనా ఇలాటి విషయజాతమంతా ఇందులో చక్కగా పొందుపడి ఉంది. మార్కండేయుడంటే అది ఒక సంకేతం. అనంత కాలానికీ, దేశానికీ – సృష్టి స్థితిలయాలకూ ఈ మహానాటకానికంతా ద్రష్ట అయిన ముక్తజీవుడు. జగన్నాటక స్రష్ట పరమేశ్వరుడైతే దానికి ద్రష్ట పరమ భాగవతుడైన నారదుడొకడు – మార్కండేయుడొకడు. వీరు చిరంజీవులు. జీవన్ముక్తులు. మానవులందరూ అలాటి పూర్ణ పురుషులు కావాలనే చివరకు సందేశం.

మొత్తం మీద భాగవత ద్వాదశ స్కంధ వృత్తాంతాన్నీ ఆద్యంతాలూ తడవి చూచాము. ఏది చూచినా, ఎక్కడ చూచినా, అది ఏ దేవతలో, ఋషులో,

ప్రజాపతులో, మనువులో, వారి సంతానమో, తద్గుణ సాజాత్యమున్న మానవులో, వీరి గుణ చేష్టాదులే తప్ప మరేదీ లేదు. మరి వీరంతా ఎవరో కాదు. ఆ భగవంతుని విభూతి విశేషాలేనని చాటుతున్నది భాగవతం. అప్పటికా భగవంతుడి చరిత్రే నన్న మాట ఇదంతా. ఎక్కడ ఏది వర్ణించినా అది ఒక వ్యాజం మాత్రమే. ఆ నేపథ్యంలో Back-ground చేస్తున్నదీ, చూస్తున్నదీ, మాటాడుతున్నదీ, సుఖదుఃఖాదులను భవిస్తున్నదీ, అనుభవిస్తున్నట్టు అభినయిస్తున్నదీ, ఆ భగవానుడే. భాగవతమే చాటుతున్నదీ మాట.

ఇహతు పునర్భగవా నశేషమూర్తిః
పరిపఠి తోఽను పదం కథా ప్రసంగైః

అని. స్వరూపంతో తాను కనిపిస్తూ విభూతి బలంతో ఆయా పాత్రలుగా భాసిస్తున్నదా ఒకే ఒక తత్త్వం. అది ఒకటే పాత్ర. చిత్ర విచిత్రమైన దాని నడవడిక ఒక్కటే కథ. తద్ద్వారా ఏది ఆవిష్కరించినా అది ఒక్కటే మానవుడి కందించే సందేశం. వివిధ రూపాలుగా సాగిన ఈ పాత్రలూ, కథలూ అన్నీ దానికొక ఆలంబనమే. ప్రణాళిక Medium మాత్రమే. కాబట్టి ఎంత వైవిధ్యమున్నా ఎంత శాఖోప శాఖలుగా విస్తరించినా మూలమొక్కటే ప్రయోజనమొక్కటే కాబట్టి వస్తైక్యానికి గానీ, పాత్రైక్యానికి గానీ, ప్రయోజనైక్యానికి గానీ, వెతుకుకోనక్కరలేదు. అయత్న సిద్ధమైక్యమనేది. ఏకమైన పరమాత్మ తత్త్వమే అనేక రూపాలుగా వ్యాపించి మరలా ఆ ఏకైకమైన తత్త్వంలోనే లయమై చివర కేకరూపంగా మానవుడి అనుభూతికి రావాలనే భాగవత రచనా ప్రణాళికలో దాగి ఉన్న ప్రహేళిక (Irony)



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

5. విష్ణు పారమ్యము

భాగవత కథా వస్తువంతా భగవన్మయమే భగవన్మహి మాభి వర్ణనమే అని నిరూపించాము. అది భగవంతుడైనా కావచ్చు. భాగవతులైనా కావచ్చు. అంతా భగవదాశ్రితమైనదే. ఆదిలోనూ అదే – మధ్యలోనూ అదే – అంతంలోనూ అదే. అందుకే దానికి భాగవతమనే నామమేర్పడిందసలు. సరే బాగానే ఉంది. అంతా భగవత్తత్త్వ ప్రఖ్యాపనమే అనేంతవరకూ మనకెలాటి ప్రశ్నా లేదు. కాని భగవంతుడు భగవంతుడంటున్నామే – ఈ భగవంతుడెవరని మాత్రం ప్రశ్నించవలసి వస్తుంది. భగవంతుడంటే త్రిమూర్తులలో ఎవరైనా కావచ్చు. బ్రహ్మ అయినా కావచ్చు. విష్ణువైనా కావచ్చు. ఈశ్వరుడైనా కావచ్చు. అందులో వైష్ణవులు విష్ణువే భగవంతుడంటే శైవులు శివుడే నని చాటుతారు. అలాంటప్పుడు భాగవతంలో ప్రబోధించిన భగవత్తత్త్వ మేమిటి. అది శివతత్త్వమా, విష్ణుతత్త్వమా లేక రెంటికీ అతీతమైన పరతత్త్వమా అని ప్రశ్న రావటం సహజమే.

ఈ ప్రశ్న నిర్ణయించటానికి మనమెంతో దూరం విచారించనక్కరలేదనిపిస్తుంది. ఎందుకంటే భాగవత మామూలాగ్రం పరిశీలించిన వారికెవరికైనా తెలుస్తుందీ పురాణమంతా విష్ణు పారమ్యాన్ని లోకానికి చాటటానికే అవతరించిందని. అవతార లీలలతో నిండి నిబిడీ కృతమయింది గదా భాగవతం. ఎక్కడ చూచినా భగవంతుడి ఏదో ఒక అవతార చరిత్రే. కాగా ఈ అవతారాలనేవన్నీ విష్ణుదేవుడివే. మత్స్యం మొదలుకొని కల్కి దాకా దశావతారాలెత్తి క్రీడించిన దేవుడు త్రిమూర్తులలో విష్ణువొక్కడే. శివుడికి లేదు బ్రహ్మకు లేదీ అవతార ప్రసక్తి. అంతేకాదు. నారద కపిల పృథు ఋషభాదులైన ఏక వింశత్యవ తారాలు దాల్చిన వాడు కూడా విష్ణువే. మరి ఏ దేవతా కాదు. అసలు భాగవతమే ఘోషిస్తున్నది విష్ణునందైన శ్రీకర నానా ప్రకటావతారములని. ఆ విష్ణు అంశలూ అంశాంశలే దేవ ఋషి రాజన్యమను ప్రజాపతి ప్రభృతులంతా. భగవానుడూ విష్ణువే. భగవానుడి భక్తులందరూ కూడా వైష్ణవులే. అంబరీషుడేమి, ధ్రువుడేమి, పృథువేమి, ప్రహ్లాద కుచేలాదులేమి, అంతా

విష్ణుభక్తులే. విష్ణువింతియకాని వేరొండు లేదని చాటుతాడు ప్రహ్లాదుడు. అసలీ భాగవత కథా ప్రవర్తకుడైన నారదుడే విష్ణుభక్తుడు. శ్రోత అయిన పరీక్షిత్తు కసలు విష్ణురాతుడనే పేరు. కడుపులో ఉండగానే విష్ణు సందర్శనం చేసి విష్ణువు చేత రక్షింపబడ్డాడు. ఆ విష్ణుదేవునే సర్వాత్మనా ప్రపత్తి చెందాడు. అందుకే విష్ణురాతుడాయన. మరి భాగవత పురాణ నిర్మాత వేదవ్యాసుడికి కృష్ణద్వైపాయనుడని నామధేయం. కృష్ణుడి లాగే ప్రాంశుపయోద నీలతను భాసితుడాయన. కృష్ణుడంటే మరి విష్ణు నిర్విశేషుడే గదా. భాగవతాన్ని కృష్ణ చరితమే నని వర్ణించారసలు. లలిత స్కంధము కృష్ణమూలము. భాగవత పారిజాతానికి మూలాధారం కృష్ణతత్త్వమే నని బాహాటంగానే చాటుతున్నాడు మహాకవి. భాగవతమనే గాక విష్ణుభాగవతమని కూడా భాగవతానికి మరొక వ్యవహారమున్నది. పోతే ఈ భాగవత శ్రవణం చేసిన శౌనకాది మహర్షులెక్కడివారు. వారు నివసించిన ప్రదేశం నైమిశారణ్యం. దానికి విష్ణుక్షేత్రమని పేరు.

అసలు సర్గాది పంచ లక్షణం గదా ఏ పురాణమైనా. ఇందులో సర్గం సృష్టి, ప్రతి సర్గం ప్రళయమూ, పోతే మధ్యవి మూడూ స్థితి క్రిందికి వస్తాయి. ఈ సృష్టి స్థితి లయాలనే త్రివిధ వ్యాపారాలూ విష్ణు మూలకాలేనని భాగవతం చేసే ప్రబోధం.

వాసుదేవ పరోధర్మో - వాసుదేవ పరాగతిః
స ఏ వేదమ్ ససర్జాగ్రే - భగవా నాత్మ మాయయా
భావయ త్యేష సత్త్వేన - లోకాన్ వై లోక భావనః
యస్యాంభసి శయానస్య - యోగ నిద్రాం వితన్వతః
నాభిహ్ర దాంబు జాదాసీ - ద్బ్రహ్మా విశ్వ సృజాంపతిః

సృష్టి కర్త అని ప్రసిద్ధి గాంచిన బ్రహ్మదేవుడు కూడా మొదట ఆయన నాభి కమలం నుంచి జన్మించిన వాడేనట. పోతే ఈ సృష్టినంతా ఉపసంహరించి తనలో లయం చేసుకొని జలార్ణవంలో యోగ నిద్రాముద్రితుడై శయనించే వాడూ ఆ నారాయణుడే. మరి స్థితి కాలంలో శిక్షించి ధర్మరక్షణ చేయటాని కాయా సమయాల్లో అవతరిస్తున్నవాడూ ఆ దేవుడే. ఈవిధంగా పురాణ ప్రక్రియానుసారంగా చూచామంటే సర్వమ్ విష్ణుమయమ్ జగత్తన్నట్టు అంతా విష్ణుపరంగానే భాసిస్తున్నది.

అంతేకాదు. మరొక విశేషం కూడా గమనించవచ్చు. సృష్టి స్థితి సంహారాలు మూడు వాస్తవానికి విష్ణువే నిర్వహిస్తున్నందువల్ల త్రిమూర్తులలో మిగతా ఇద్దరూ కేవలం నామమాత్రులే. ఇంద్రాది దేవతల మాదిరి వారూ ఆయన కనుసన్నలలో మెలగుతూ ఆయనకు కైంకర్య మాచరించేవారే. వారే మహాకార్యాన్ని నిర్వహించినా అది ఆయన కటాక్ష వీక్షణ బలంతో చేయవలసిన వారేగాని స్వతంత్రంగా ఏ మాత్రమూ నిర్వర్తించలేరు. భాగవత కథా గమనాన్ని బట్టి చూస్తే ఈ రహస్యం కూడా మనం గమనించవచ్చు. గజేంద్రుడు గ్రాహంపట్టు వదలించుకోలేక మొరపెట్టే సందర్భంలో ఆ గజేంద్రుడి మొర బ్రహ్మాదులందరూ ఆలంకించిన వారే. కాని **"విశ్వమయత లేమి వినియు నూరక యుండి రబ్జసంభవాదులైన సురలు"** బ్రహ్మాదులకు విశ్వ వ్యాపకత్వమనే గుణం లేదు.కాబట్టి గజేంద్రుడి మొర ఆలకించి కూడా వారతణ్ణి కాపాడలేక పోయారట. కాగా **"విశ్వమయుడు గాన విష్ణుండు జిష్ణుండు భక్తవరుని కడ్డ పడదలంచె"** అలాంటి అనన్యా దృశమైన ఐశ్వర్యమున్న వాడొక విష్ణువే. కాబట్టి ఆయనే శరణ్యమయ్యాడట చివరకు.

ఇలాగే త్రిపురాసుర సంహార కథలో కూడా ఒక విశేషం కనిపిస్తుంది. నిజానికి త్రిపురాసురులను సంహరించిన వాడీశ్వరుడే. ఎవరి ప్రమేయమూ లేకుండానే చేశాడా పని. కానీ భాగవతమలా చెప్పదు. ఈ కథలో చాలా మార్పు తెచ్చిపెట్టింది. మయుడనే రాక్షస శిల్పి త్రిపురాలను కల్పించి రాక్షసుల కిస్తాడు. వారా పట్టణాలతో పాటు ఎగిరిపోయి త్రిలోకాలనూ ఆ కులం చేస్తుంటే దేవతలంతా పోయి మహాదేవుణ్ణి శరణు వేడుతారు. ఆయన వారి కభయమిచ్చి వింట బాణం సంధించి త్రిపురాసురుల మీద ప్రయోగిస్తాడు. వారా బాణానలంలో పడి భస్మమవుతారు. అది చూచి మాయావి అయిన మయుడొక అమృతకూపంలో వారిని పడదోస్తాడు. సిద్ధ రస స్పర్శతో వారు పునరుజ్జీవితులై వజ్ర కర్కశమైన శరీరాలతో పైకి లేస్తారు. దానికి ప్రతీకారం చేయలేక పరమేశ్వరుడు తన సంకల్పం ఫలించలేదని విమనస్కుడవుతాడు. అప్పుడాయన వై మనస్యం చూచి విష్ణు దేవుడొక ఉపాయం పన్నుతాడు. బ్రహ్మదేవుణ్ణి దూడగా తయారుచేసి తానొక ధేనువుగా మారి ఆ అమృతకూపంలో ఉండే అమృతరసాన్ని ఊచముట్ట త్రాగివేస్తాడు అది అసురులు చూచి కూడా విష్ణు మాయా మోహితులై అడ్డలేకపోతారు. అప్పుడు **'భగవత్తేజసా గుప్తో దదాహ త్రిపురం శివః'** విష్ణు ప్రభావంతో శివుడు త్రిపురాసురులను దహించాడట.

ఏమిటీ కథ. ఎంత చిత్రంగా ఉందో చూడండి మయుడి మాయా బలానికి కూడా శివుడు జవాబు చెప్పలేక పోతే విష్ణుమాయ ఆ రాక్షస మాయను నిర్మూలించటమే గాక ఈశ్వరుణ్ణి కూడా కాపాడిందట, మరి ఈ కథ స్కాంద పురాణాదులలో ఇలా లేదు. ఆ మాటకు వస్తే మహాభారతంలో కూడా దీనికి విలక్షణంగా కనిపిస్తుంది. అక్కడ ఈశ్వరుడు కోరితే ఈ భూమండలమంతా ఆయనకు రథమై సూర్యచంద్రులా రథచక్రాలయి-నాలుగు వేదాలూ నాలుగు గుఱ్ఱాలయి - బ్రహ్మదేవుడు సారథి అయి - మేరుపర్వతం ధనుస్సూ వాసుకి ఆ ధనుర్గుణంగా మారితే - ఆ ధనుస్సులో సంధించిన బాణమవుతాడు విష్ణువు. ఆ బాణమీశ్వరుడు ప్రయోగించగానే పోయి త్రిపురాలతో సహా ఆ రాక్షసులను భస్మీ భూతులను గావించినట్టు నడిచిందికథ. హరివంశంలో కూడా ఇలాగే నడుస్తుందికథ. మహా అయితే శివరథం భూమిలో క్రుంగిపోతే కేశవుడు దాన్ని పైకి లేవనెత్తుతాడు. అంతేగాని అమృతకూపాది ప్రసంగం లేదు. ఇందులో ఏది నిజమేది అబద్ధం. భాగవతాన్ని బట్టి ఇదే నిజమనుకోవలసి వస్తుంది.

భాగవతంలో ఎక్కడ త్రిమూర్తుల ప్రస్తావన వచ్చినా విష్ణువుకంటే మిగతా ఇద్దరినీ తక్కువ చేసి వర్ణిస్తున్నట్టే కనిపిస్తుంది. విష్ణువే దేవాది దేవుడైతే మిగతా దేవతల మాదిరి బ్రహ్మ ఈశ్వరుడూ కూడా ఆ దేవుడికి భృత్యానుభృత్యులై కైంకర్యం చేస్తుంటారు. ఆయన గుణగణాలను సంకీర్తన చేస్తూ చేతులు కట్టుకుని నిలుచుంటారు. నరసింహస్వామి ఆవిర్భవించి హిరణ్య సంహారం చేసి తన వేషాన్ని ఇంకా ఉపసంహరించక అలా ఉగ్రుడై చూస్తుంటే ఆయనను ప్రసన్నుణ్ణి కమ్మని దేవతలంతా ప్రార్థిస్తుంటారు. అప్పుడు బ్రహ్మ **"నతోస్మ్యనంతాయ దురంత శక్తయే"** అని ప్రణామం చేస్తే రుద్రుడు **"కోపకాలో యుగాంతస్తే హతోయ మసు రోల్వకః"** అని మనవి చేస్తాడు. నారయణుడికి కోపం రావలసింది యుగాంతంలో నట. అంటే లయకారుడాయనే గాని తాను కాడని విష్ణువుకే పట్టం కడతాడు. సహస్ర బాహుడైన బాణాసురుణ్ణి శ్రీకృష్ణుడు కర చతుష్ట యావశిష్టునిగా తునుమాడే సమయంలో శివుడు పురుష సూక్త పురస్సరంగా కృష్ణుని స్తోత్రం చేస్తాడు. ఇలా ఎన్నో ఉన్నాయి ఘట్టాలు. చివరకు బ్రహ్మదేవుడయినా మిగతా దేవతలతో పాటు ఈశ్వరునికి ప్రణామం చేసినట్టుంది గాని విష్ణువాయనకు నమస్కరించినట్టెక్కడా లేదు. శివ

మహత్త్వాన్ని తెలిపే సన్నివేశాలలో కూడా విష్ణు వుదాసీనంగానే కూచున్నట్టు వర్ణించింది భాగవతం. ముఖ్యంగా దక్షుని వృత్తాంతమూ, హాలాహల భక్షణ వృత్తాంతమూ, ఇవి రెండూ మనకు మంచి నిదర్శనాలు. దక్ష ప్రజాపతి మొదట వచ్చినపుడు సభలో విష్ణుమూర్తి లేడట. బ్రహ్మ మహేశ్వరులే ఉన్నట్టు చెబుతుంది భాగవతం. వారు కూడా లేవలేదు. నిలబడలేదు. మరి ఒక విశేషమేమంటే వీరభద్రుడు దక్షాధ్వర ధ్వంసం చేసే సందర్భంలో కూడా విష్ణువక్కడ లేడట. విశ్వాత్మకుడు కాబట్టి ఇదంతా ముందుగా పసి కట్టి రాలేదట ఆయన. అలాంటి వాడు చివర మళ్లీ పశ్చాత్తప్తుడై దక్షుడు చేసిన యజ్ఞానికి హాజరవుతాడు. ఆ వచ్చినవిష్ణువును బ్రహ్మతో కలిసి రుద్రుడు కూడా ప్రశంసిస్తాడు. అంతకుముందు బ్రహ్మదేవుడు మాత్రం దక్షుని కరుణించమంటూ శివుణ్ణి ప్రార్థన చేసినట్టుంది. అలాగే హాలాహల పానం చేయటానికాహ్వానించేటప్పుడు కూడా ముక్కోటి దేవతలతో బ్రహ్మకూడా ఈశ్వరుణ్ణి స్తుతిస్తాడు. అంతేగాని నారాయణుడు మాత్రమెక్కడా మరచి కూడా ఆయనను స్తుతించినట్టు కానరాదు భాగవతంలో.

అంతేకాదు. అంతమాత్రమే అయితే పరవాలేదు. శివుణ్ణి సాక్షాత్తుగా కించపరచిన సందర్భాలు కూడా కొన్ని కనిపిస్తాయి అక్కడక్కడా. ఒకటి రెండుదాహరిస్తాను. సముద్ర మథనం జరిగిపోయిన తరువాత విష్ణువు మోహినీ రూపాన్ని మరలా ఒకసారి తిలకించి ధన్యుణ్ణి కావాలనుకొన్నాడట పరమశివుడు. వెంటనే వైకుంఠానికి వెళ్లి ఆయనను స్తోత్రం చేసి ఆ రూపాన్ని దర్శించటమే వరంగా కోరుతాడు. అందుకు దరహాసం చేసి ఆ దేవుడున్నట్టుండి అంతర్ధానుడవుతాడు. అతడెక్కడికి వెళ్లాడో ఏమయ్యాడో అర్థం కాక శివుడు దిక్కు తెలియక చూస్తుంటే తన ఎదుట ఒక పూలతోట – ఆ తోటలో ఒయ్యారంగా నడచిపోయే ఒక ఎల నాగను తిలకిస్తాడు. చిత్తం మొత్తబడి చెఱకు విలుకాని బారికి చిక్కి ఆ వాలుగంటి వెంటబడి పోయి పోయి కళ్లు మూసుకొని గట్టిగా కౌగలించుకొంటాడు. తరువాత వీత రేతస్కుడై మరలా స్పృహ వచ్చి అదంతా విష్ణు మాయా విలాసమని ఎరిగి నివ్వెర చెందుతాడు.

ఇలాగే మరొక సన్నివేశం. వృకుడనే రాక్షసుడు మహర్షుల నడిగి త్రిమూర్తులలో పరమేశ్వరుడే సులభ ప్రసన్నుడని తెలిసి ఆయన కోసం తపస్సు చేస్తాడు. ప్రసన్నుడైన

హరుడు నీకేమి కావాలని ప్రశ్నిస్తే ఎవరి నెత్తిన చేయి పెడితేవాడు భస్మం కావాలని వరం కోరుతాడు. సరే అలాగే అవుతుంది పొమ్మని ఆ దేవుడనుగ్రహిస్తాడు. అది ఎలా ఉంటుందో పరీక్షించి చూస్తానని వాడాయన మీదనే చేయి పెట్టబోతాడు. దానికాయన భీతుడై సకల లోకాలకూ పరుగెత్తి పోయి ఎక్కడా తన్నుకాపాడే దిక్కు గానక చివరకు వైకుంఠంలో ప్రవేశించి నారాయణుణ్ణి శరణు వేడతాడు. నారాయణుడది ముందుగానే తెలిసి ఆ దానవుడి దగ్గరికొక బ్రహ్మచారి రూపంలో ఎదురుగా పోయి పరమేశ్వరుడు వట్టి కల్లరీడు. అతని మాటలునమ్మి నీవు చెడిపోకు. నెత్తిన చేయి పెడితే భస్మం కావటమేమిటి. అది నీవు పరీక్షించబోతే ఎందుకని తాను పరుగెత్తటం. అప్పటికి తానిచ్చిన వరంలో తనకే విశ్వాసం లేదు గదా. మనకేమిటిక నమ్మకం. కావలసి వస్తే నీవిది పరీక్షించి చూడు నీకే తెలుస్తుందని మాయ మాటలు చెప్పి నమ్మిస్తాడు. వాడాయన అన్నంత పనీ చేసి దగ్ధశిరస్కుడై నేల కొరుగుతాడు. ఇలాటి కథా సన్నివేశాలన్నిటిలో శివుడి కంటే విష్ణువే గొప్ప అని తార్కాణ అవుతుంది మనకు.

అలాగే బ్రహ్మను కూడా ఎంతో హీనమానంగా వర్ణించిన ఘట్టాలున్నాయి. కృష్ణుణ్ణి బేలు పుచ్చాలని గో గోపగణాలను మాయం చేస్తాడు బ్రహ్మ. అది కనిపెట్టి కృష్ణుడన్నిటికీ అన్ని రూపాలు తానే ధరించి ఆ లోటు కనపడకుండా చేస్తాడు. ఒక సంవత్సరమిలా సాగిపోతుంది. తన వంచన ఫలితం లేకుండా పోయిందని తెలుసుకొని సిగ్గుపడి స్వయంగా వచ్చి కృష్ణుడి కాళ్లమీద పడతాడు పితామహుడు. తన తప్పు క్షమించమని ప్రాధేయపడతాడు. అలాగే అసలు ప్రళయ కాలంలోనే విష్ణువు నాభికమలం నుంచి జన్మించి తానెక్కడి నుంచి వచ్చాడో తనకే తెలియక అమాయికంగా వాపోతాడు. తన చేతిలోని గ్రంథాలనే హయగ్రీవు డపహరిస్తుంటే ఒళ్ళు తెలియని మైకంలో పడిపోతాడు. విష్ణువు మత్స్యావతారుడై వచ్చి తనకా వాఙ్మయం తెచ్చి ఇచ్చేవరకూ మరపు వదలలే దతనికి.

అసలా మాటకు వస్తే వాచ్యంగానే ఈ విషయాన్ని బయటపెడుతుంది భాగవతం. సరస్వతీ నదీ తీరంలో మహామునులు తపస్సు చేస్తూ త్రిమూర్తులలో ఎవ్వరధికులో తెలుసుకొని రమ్మని భృగుమహర్షిని పంపుతారు. అతడు మొదట బ్రహ్మలోకానికి పోయి ఆయనను చూచి కూడా స్తుతి నమస్కారాదులు చేయడు.

దానికా పితామహుడు మనసులో కోపోద్రిక్తుడయి కూడా భృగువు తన మానస పుత్రుడే గదా అని ఆలోచించి మౌనం వహిస్తాడు. తరువాత భృగువక్కడ నుంచి నేరుగా కైలాసానికి వెళ్లి మహేశ్వరుణ్ణి చూస్తాడు. అతడెదురు వచ్చినా ఇతడులుకుపలుకు లేకుండా నిలబడతాడు. శివుడికి కోపం వచ్చి ఆ భృగువు తొమ్ము పొడవటాని కుద్యుక్తుడయి పార్వతి అనునయిస్తే ఉపశమిస్తాడు. ఆ పిమ్మట వైకుంఠానికి పయనమై పోతాడా మహర్షి. అక్కడ దివ్యాంబరాభరణధరుడై రమాదేవితో దివ్యభోగాలనుభవిస్తూ ఉన్న నారాయణుణ్ణి చూచి సహించక కాలితో తంతాడు. అతడాతణ్ణి చూచి దిగి వచ్చి పాదాభివందనం చేసి అయ్యా నన్ను మన్నించండి. మీరాక ముందుగా తెలియక అపరాధం చేశాను. నన్ను కరుణించి ఇదుగో రుచిరాసనం పైన సుఖాసీనులు కండి. తమ పాదాలను నేను ప్రక్షాళిస్తే ఆ తీర్థజలం నన్నూ నా ఉదరంలో ఉన్న సమస్త లోకాలనూ పునీతం చేస్తాయని చెబుతూ భవదీయ పదాహతి మద్భుజాంతరాని కొక అపురూపమైన అలంకారమని ఎంతగానో అనునయాలా పాలు పలుకుతాడు. దాని కానందించి భృగువు మరలా మహామునుల పాలికి వచ్చి తన పోయి వచ్చిన వృత్తాంతమంతా నివేదిస్తే వారది అంతా ఆలకించి త్రిమూర్తులలో నారాయణుడే పరాయణుడని తీర్మానిస్తారు.

మొత్తానికీ విధంగా చూస్తూ పోతే ఎన్నైనా ఉన్నాయి సందర్భాలు. ఏ సందర్భం చూచినా విష్ణు పారమ్యాన్నే బయట పెడుతున్నది భాగవతం. మిగతా బ్రహ్మ మహేశ్వరులకు ఏ మాత్రమూ ఎక్కడా ప్రాధాన్యమిచ్చినట్టు కనిపించదు. మీదు మిక్కిలి వారిద్దరినీ విష్ణువు కంటే తక్కువగా భావించినట్టే తోస్తుంది. అది ఆయా అవతారాల వర్ణనను బట్టి చూచినా – భాగవతులైన ఆయా దేవ ఋషి రాజన్యాదుల చరిత్రను బట్టి చూచినా–ఆయా సన్నివేశాలలో విష్ణు ప్రభావాతిశయమూ – బ్రహ్మాదుల అప్రాగల్భ్యమూ –వర్ణించటాన్ని బట్టి చూచినా–అన్వయ వ్యతిరేక న్యాయాన్ని బట్టి చూస్తే–భాగవతపురాణ హృదయం సమస్త దేవతా నీకంలోనూ విష్ణువే సర్వోత్కృష్టుడని చెప్పటమే నని విష్ణు పారమ్యాన్ని చాటటమే ననీ – మన కవగతమవుతున్నది.

కాని ఇదంతా కేవలం ఒక అపోహే. కేవల మాయాకథలలో అలా వర్ణించినంత మాత్రాన అదే భాగవత హృదయమని భ్రమించరాదు. భ్రమిస్తే అంతకన్నా భాగవతానికి మనం చేసే అపచారం లేదు. దానికి లేని అభిప్రాయం మనం దానికి

అంటగట్టిన వాళ్లమవుతాము. అయితే ఈ కథలన్నీ ఏమిటి - ఇలా ఎందుకు వర్ణించారని అడగవచ్చు. కథలనేవి కేవల మర్థవాదాలనీ సంకేతాలనీ ముందే చెప్పాము. ఒక సత్యాన్ని మనకు బోధించవలసినప్పుడు దాన్ని చిలవలు, పలవలు పెట్టి ఎంతో గొప్పగా చెప్పటమే అర్థవాదం. ఇలాటి అర్థవాదమే పురాణం. అదే భాగవతం కూడా అనుసరిస్తున్నది. అంతెందుకు, విష్ణు పురాణాలు విష్ణువును గొప్ప చేసి చెబితే శివపురాణాలు శివుణ్ణే అందరికంటే ప్రశస్తంగా వర్ణిస్తాయి. త్రిపురాసుర సంహారమింతకు ముందే ఉదాహరించి ఉన్నాము. అది శివపురాణాల్లో ఒక తీరుగా ఉంటే వైష్ణవ పురాణాల్లో మరొక తీరుగా నడుస్తున్నది. అక్కడ విష్ణువే శివుడికి బాణమైనాడు. ఇక్కడ అలా కాదు. బాణమయ్యాడని చెబితే విష్ణు గౌరవానికి లోపం. అంచేత ఆ వృత్తాంతం తీసి వేయబడింది. తీసి వేయటమే గాక మహా మాయను భేదించలేక కింకర్తవ్యతా మూఢుడైన శివుణ్ణి విష్ణువే తన వైష్ణవ మాయతో కాపాడినట్టు వర్ణించింది పురాణం.

ఇలాగే దక్షయజ్ఞంలో వీరభద్రుడు వచ్చి యజ్ఞవిధ్వంసనం చేస్తుంటే మిగతా దేవతలతో పాటు విష్ణుమూర్తికూడా అతని ధాటికి నిలవలేక పరుగెత్తి పోతాడు. పైగా అంతకు ముందు తన సుదర్శనం వీరభద్రుడి మీద ప్రయోగిస్తే అతడది వామహస్తంతో అందుకొని చక్కిలం మాదిరి బొక్కాడని ఉంది శివపురాణాల్లో. ఇది మరి వైష్ణవ పురాణాల్లో ఇలాలేదు. ఇక్కడ అసలు విష్ణువు ప్రసక్తే తీసుకురాడు కవి. అంతేకాదు. ప్రద్యుమ్నుడి జన్మ వృత్తాంతంలో కూడా రెండింటికీ తేడా కనిపిస్తుంది. మన్మథుణ్ణి ఈశ్వరుడు దగ్ధం చేసిన తరువాత అతడనంగుడయిపోతాడు. కృష్ణావతారంలో రుక్మిణి తనకు సంతానాన్ని ప్రసాదించమని భర్తను ప్రార్థేయ పడుతుంది. ఆయన వెంటనే తన పూర్వపుత్రుడు మన్మథుణ్ణి జ్ఞప్తి చేసుకొని అతణ్ణే మరలా పుత్తుడుగా పొందాలని బదరికాశ్రమానికి పోయి ఈశ్వరుణ్ణి గూర్చి తపస్సు చేస్తాడు. ఈశ్వరుడు ప్రత్యక్షమయి ఆయనకా వరాన్ని ప్రస్తాదిస్తాడు. ఇది హరివంశాదులలో ఉన్న ఉదంతం. దీన్ని భాగవతాదులు మార్చి మనకు బోధిస్తాయి. అసలిక్కడ కృష్ణుడు తపస్సుకు వెళ్లటమూ లేదు. శివుడు సాక్షాత్కరించటమూ లేదు. కేవలం లవణ సాగర గర్భంలో పడి మరలా బయటపడిన తన పెనిమిటిని శంబర మాయ నుంచి రక్షించి రతీదేవి స్వయంగా కొని తెచ్చి రుక్మిణీ కృష్ణులకు సమర్పిస్తుంది.

ఇలాటివెన్నో వైషమ్యాలు కనిపిస్తాయి కథలలో. విష్ణు మాహాత్మ్యాన్ని చాటటానికి వైష్ణవ పురాణాలు ప్రయత్నిస్తే – శివపారమ్యాన్ని నిరూపిస్తాయి శైవ పురాణాలు. ప్రత్యక్షంగానే విష్ణువూ బ్రహ్మా ఇద్దరూ శివతత్త్వాన్ని కనుక్కోలేక ప్రాకృత జనుల మాదిరి బేలలయిపోయిన ఒకానొక వృత్తాంతాన్ని స్కాందలైంగాదు లెంతగానో చాటుతాయి. అదేమిటంటే శివలింగం పెరిగిపోయి బ్రహ్మాండంగా వ్యాపిస్తుందీ బ్రహ్మాండాన్నంతటినీ, దాని కొనా మొదలేదో తెలుసుకొని వస్తామని దేవతలకు హామీ ఇచ్చి బయలుదేరుతారు బ్రహ్మవిష్ణులు. ఒకరు పైకి ఒకరు క్రిందికీ ప్రయాణం చేసి పోయి పోయి ఎంత దూరమలాపోయినా దాని అంతూ ఆకాశం చూడలేక పోయారు. బిక్కమొగం వేసుకొని వెళ్లిన దారినే మళ్ళీ తిరిగి వచ్చారు. దేవతలేమి చేసి వచ్చారని ఆత్రంగా ప్రశ్నిస్తారు. నాకేమి అర్థం కాలేదని నిజాయితీగా చెప్పి ఊరుకొంటాడు నారాయణుడు. బ్రహ్మ అందులో కూడా కొంత తిరకాసు చేసి శాపం ఒకటి నెత్తికి తెచ్చుకొంటాడు. చూడండి. మరి ఈ సన్నివేశానికేమి చెబుతారు జవాబు.

కాబట్టి పురాణాలూ అవి చెప్పే కథలూ మాత్రమే ఆలకిస్తూ పోతే ఏదీ నిర్ణయించలేము. అటెంతో ఇటూ అంతగానే మొగ్గు చూపవలసి వస్తుంది. కొన్ని శివుణ్ణి తక్కువ చేసి చూపితే మరికొన్ని విష్ణువును కించపరిచి వర్ణిస్తాయి. బ్రహ్మను కొంచెం తగ్గించి మాటాడినా అది కొంత అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే బ్రహ్మ విష్ణు దేవుని నాభికమలంలో నుంచి జన్మించినట్టు అన్ని పురాణాలూ అంగీకరించాయి. ఆయన అనుగ్రహంవల్లనే ప్రపంచ సృష్ట్యాదికం చేయగలిగాడని కూడా ఉంది. కాబట్టి ఆయనతో సమానమైన ప్రతిపత్తిలేదని వర్ణించినా అందులో అంత ఆశ్చర్యం లేదు. కాని శివుణ్ణి కూడా తగ్గించి చూపటంలో ఏ మాత్రమూ సబబు కనిపించలేదు. అయితే ఎందుకిలాటి పరస్పర ద్వేష కారణాలైన వర్ణనలని అడగవచ్చు. పరస్పర ద్వేషానికి కాదిది. ఉపాసకుల సౌకర్యానికని చెబుతారు శాస్త్రజ్ఞులు. జ్ఞానం వేరు, ఉపాసన వేరు. జ్ఞానమంటే భగవత్తత్త్వాన్ని ఉన్నదున్నట్టు తెలుసుకోవటం. ఎలా ఉన్న దాతత్త్వం. ఏ నామమూ, ఏ రూపమూ లేని ఎలాటి భేదమూ కానరాని సర్వవ్యాపకమై సర్వానన్యమై సర్వాత్మకమైన శుద్ధ చైతన్యం. అది ఇక విష్ణువా శివుడా చతుర్ముఖుడా అని ప్రశ్న లేదు. ఏదీ కాదది. ఏదీ కానిదదే. అన్నీ అయినదదే. దాని నలాగే పట్టుకొని అనుభవానికి తెచ్చుకొంటే అది జ్ఞానం. అయితే ఎందరికుంటుందీ

జ్ఞానం. కోటి కొకడి కుంటే ఎక్కువ. మిగతా వారంతా దాని కెదగలేరు. ఎదగలేక తమ బుద్ధుల పరిధిలోకి తత్త్వాన్ని దించుకొని చూస్తారు. అదీ తమ అభిరుచులకూ, సంస్కారాలకూ అనుగుణంగానే చూస్తూ పోతారు. దానితో నామరూపాది విశేషాలు వచ్చి పడతాయా తత్త్వానికి. అవి కూడా వారి దృష్టికనురూపంగానే ఏర్పడతాయి. నారాయణో పాసకులైతే చతుర్బాహువులతో శంఖ చక్రాద్యాయుధాలతో శ్రీవత్సాంకంతో పీతాంబరంతో – ఇలా దర్శిస్తే ఆ రూపాన్ని – శైవోపాసకులు దానినే గజాజినంతో గంగా లంకృత జటాజూటంతో అర్ధనారీశ్వరంతో త్రిశూలాది ధారణంతో తిలకిస్తూ కూచుంటారు.

ఇలా ఉపాసకుల ఉపాసనా సౌకర్యం కోసమేర్పడిందే ఈ విభేదం. ఉపాసన అంటే విజాతీయ భావ మేమాత్రమూ మనసుకు రాగూడదు. ఉపాస్యమైన ఆకృతి ఏదుందో దాని కనుగుణమైన సజాతీయ భావమే తైలధారావత్తుగా ప్రసరిస్తూ పోవాలి. అలా జరిగితే గాని దాని మీద మనసు ఏకాగ్రం కాదు. అపేక్షిత ఫలం చేకూరదు. మరి ఇలా జరగాలంటే తన ఇష్టదైవతం తప్ప మరొక దైవాన్ని స్మరించరాదు గదా. కనుకనే దాన్ని దీనికంటే తక్కువగా చేసి చూపటం. అన్యనిందా అన్యస్తుతయే అని ఒక మాట ఉన్నది. ఒక దానిని నిందించటం మరొక దానిని స్తుతించటానికే నట. అంటే దాన్ని దూషించినట్టు పైకి కనిపించినా దూషించటంలో లేదు తాత్పర్యం. తాను కోరిన రూపం మీదనే ఉంది. ఆ రూపం మీద భక్తి తాత్పర్యాలు గట్టిగా ఏర్పడటానికి దేవతాంతర నింద అనేది ఒక వ్యాజం. అంత మాత్రమే. మనం కూడా చూడండి. లోకంలో ఏదైనా ఒక పని శ్రద్ధగా చేసి అది సాధించాలంటే ఆ సమయంలో మరొకపని ఎంత మంచిదైనా పెట్టుకోము. దానిని పట్టించుకోము. ఇతరులకు కూడా పట్టించుకోవద్దని బోధిస్తాము. అయినా అటువైపు మొగ్గు చూపుతారేమో అది అంత మంచిది కాదని కూడా త్రోపు మాటలాడుతాము. లేకుంటే అదీగాదు ఇదీ గాదు. రెంటికీ చెడిన రేవళ్లం కావలసి వస్తుంది. ఇదుగో ఇదే ఇక్కడ ఉన్న సూత్రం కూడా. వైష్ణవ పురాణాల్లో శివ దూషణగాని – శైవ పురాణాల్లో విష్ణు దూషణగాని ఈ దృష్టితోనే చేయవలసి వచ్చింది. ఇంతకు మించి వేరొక నికృష్టమైన దృష్టి పురాణ ప్రవర్తకులైన మహర్షుల కుండటానికి లేదు. ఉంటే వారు మహర్షులే కారు.

ఇంతెందుకు ఋషితుల్యుడైన మహాకవులకే లేదీ భేద దృష్టి. ఇక సాక్షాత్తూ తపస్సంపన్నులైన ఋషులకెలా ఉండగలదు. కాళిదాస మహాకవి కుమార సంభవం వ్రాశాడు. రఘు వంశం వ్రాశాడు. కుమార సంభవంలో తారకాసురుని బాధలు పడలేక దేవతలు బ్రహ్మదేవుడితో వచ్చి మొర పెట్టుకొంటారు. అప్పుడాయన బ్రహ్మదేవుణ్ణి వారు స్తోత్రం చేసిన సన్నివేశాన్ని వర్ణిస్తాడు. అలాగే పరమశివుడు తపస్సు చేసిన ఘట్టంలో. అలాగే రావణో పద్రవ పీడితులై క్షీరసాగరశాయి అయిన నారాయణుణ్ణి దర్శించి దేవతలు ఆయనను కీర్తించటం వర్ణిస్తాడు. ఈ మూడు సందర్భాలలో మహాకవి త్రిమూర్తులను ముగ్గురిని వర్ణిస్తాడు గదా. ఏ సందర్భంలో ఎవరిని వర్ణించినప్పుడా దేవుడే పరమాత్మ – అంతకన్నా పరతత్త్వమిక ఏదీ లేదనే చాటుతాడాయన. అదేమిటని అడిగితే మనకు సమాధానమిస్తున్నాడాయన. **"ఏకైవ మూర్తి ర్బిభిదే త్రిధాసా"** అయ్యా ఉన్నదసలు ఒకే ఒక పదార్థమండీ. అదే మూడు రూపాలుగా భిన్నమై మనకు కనిపిస్తున్నది. **"సామాన్య మేత త్పృథమా పరత్వం"** ఆ మూడింటిలో ఏది హెచ్చు ఏది లొచ్చు అని ప్రశ్న లేదు. హెచ్చుతగ్గులు ఉంటే మూడింటికీ ఉన్నాయి. లేకుంటే దేనికీ లేదు. విష్ణోర్హ రస్తస్య హరిః కదాచిత్ – ఒకప్పుడు విష్ణువుకు శివుడు తగ్గి ఉంటే మరొకప్పుడు శివుడికి విష్ణువు తగ్గి చేతులొగ్గి ఉంటాడు. పోతే వీరిద్దరూ బ్రహ్మదేవుడికి చేతులొగ్గితే – ఆ బ్రహ్మ వీరిద్దరికీ భృత్యాను భృత్యుడయినట్టు కనిపిస్తాడు – అని ఉన్న నిజాన్ని బయట పెడతాడు.

మహాకవులిలా వ్రాశారంటే అది ప్రాచీనులైన మహర్షుల వాణి ననువదించటమే గాని మరొకటి గాదు. వ్యాస భట్టారకులు విష్ణు పురాణంలో వర్ణించిన త్రిమూర్తుల తత్త్వాన్ని చూడండి.

సృష్టి స్థిత్యంత కరణీమ్ బ్రహ్మ విష్ణు శివాత్మికామ్
ససంజ్ఞామ్ యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః

ఈ జనార్థనుడంటే జనానుగ్రహకారి అయిన పరమేశ్వరుడే. ఆ ఈశ్వరుడే బ్రహ్మ విష్ణు మహేశ్వరులుగా భాసిస్తున్నాడు. **"శక్త యోయస్య దేవస్య – బ్రహ్మ విష్ణు శివాత్మికాః"** అని వర్ణిస్తాడు మరొకచోట. అంతేకాదు.

స ఏవ సృజ్య స్సచ సర్గ కర్తా
స ఏవ పాత్యత్తి చ పాల్యతే చ
బ్రహ్మా ద్యవస్థాభి రశేష మూర్తిః

బ్రహ్మాదిమూర్తి త్రయంగా ప్రకాశించటమే గాక ఈ సృజ్య మానమైన సమస్త ప్రపంచం కూడా ఆ పరమాత్మేనట. సృజ్యమూ ఆయనే-సష్ట్రా ఆయనే. పాలించే వాడాయనే - పాలించబడేదీ ఆయనే. ఇది సరిగా పుడికి పుచ్చుకొనే అన్నాడేమో కాళిదాసు -

త్వమేవ హవ్యం హోతాచ - భోజ్యం భోక్తాచ శాశ్వతః
వేద్యంచ వేదితా చాసి - ధ్యాతా ధ్యేయంచ యత్పరమ్

అని తన కుమార సంభవంలో

దీనిని బట్టి వాస్తవంలో ఎవరికీ ఎవరూ తక్కువగాదు. ఎక్కువగాదు. అందరూ సరిసమానమే. అందరూ ఒకే తత్త్వం నుంచి వచ్చినప్పుడందులో వైషమ్యానికి తావే ముంది. సృష్టి స్థితిలయాలనే మూడు వ్యాపారాలు చేయటానికీ ముగ్గురు తయారయినారు. అందులో ఒకరు చేసే పని మరొకరు చేసేది గాదు. అలాంటప్పుడెవరెక్కువని ఎవరు తక్కువని. అయినా ఎక్కువ తక్కువలుగా పురాణాలు వర్ణించాయంటే దాని ఉద్దేశం వేరు. అది కేవల మాయా దేవతా మూర్తుల ఉపాసనార్థమే నని మనవి చేశాను. అందులో విష్ణువు నుపాసించమని వైష్ణవ పురాణాలు చెబితే శివోపాసన చేయమని స్కాందాది శైవ పురాణాలు చాటితే బ్రహ్మదేవుడి మహిమను బ్రాహ్మాది పురాణాలు ఘోషిస్తే వీరందరినీ త్రోసి రాజని కేవలమా దేవుడి మాయాశక్తి మాహాత్మ్యాన్ని బయట పెడుతాయి దేవీ భాగవతాదులు.

అయితే ప్రస్తుతం నేను చెప్పదలచింది ఇది కూడా కాదు. భాగవతమిలాటి ఒక వైష్ణవ పురాణంగా భావించి దాన్ని సమర్థించబూనటం లేదు నేను. ఉపాసనా ప్రయోజనాన్ని ఉద్దేశించి వెలువడిందే అయితే అలా సమర్థించినా ఒక సబబే. కాని ఉపాసన కోసం కాదది. కేవలం తత్త్వజిజ్ఞాసువులైన మానవులకు జ్ఞాన మార్గాన్ని ఉపదేశించటమే దాని ఏకైక ప్రయోజనం. అందుకోసమే అసలది అవతరించింది. జ్ఞానం ప్రధానమైతే ఉపాసనాదులానుషంగికం దానికి. మన దురదృష్టం కొద్దీ కొందరు

వైష్ణవులు తమ మతప్రచారానికి దీన్ని సాధనం చేసుకోవాలని దీనిలో ఉన్నదంతా విష్ణుతత్త్వమే-అదే పరాయణమని - అనవసరంగా లోకానికి చాటుతున్నారు. ఎంత చాటినా అది చెల్లేది గాదు. అది వారి పాక్షికమైన దృష్టే గాని అసలు పురాణ తాత్పర్యం గాదు. పురాణ నిర్మాత అయిన బాదరాయణుని వివక్షితమంతకన్నా కాదు. ఇది మనకు నిస్సంశయంగా బోధపడాలంటే భాగవత రచనా స్వరూపాన్ని పైపైన గాక ఆమూలాగ్రమూ మరలా లోతుకు దిగి పరిశీలించాలి మనం. అలా పరిశీలించాలంటే కేవల పురాణ దృష్టి మాత్రమే అయితే పనికి రాదు. శాస్త్ర దృష్టి కావాలి. ఎందుకంటే పురాణాలనేవి స్వతంత్రమైన రచనలు కావు. అవి ఉపనిషదాదికమైన శాస్త్రానికి శేష భూతమైన Supplementary అర్థవాదాలు. శాస్త్రం చెప్పినదే అవి చెప్పాలి గాని దానికి భిన్నమైన మాట చెబితే అది సత్యం కానేరదు. సత్యం కాకుంటే అది పాక్షికమే గాని పరిపూర్ణమెలా అవుతుంది.

ప్రస్తుతం భాగవత పురాణం మనకు పరిపూర్ణమైన తత్త్వాన్నే బోధిస్తున్నది గాని పాక్షికమైన తత్త్వాన్ని కాదు. అసలు భాగవతమని పేరు పెట్టటంలోనే ఇమిడి ఉన్నదా రహస్యం. భాగవతమంటే భగవత్తత్త్వానికి చెందిందని గదా పేర్కొన్నాము. భగవంతుడంటే ఏమి టర్థము. శివుడనా - విష్ణువనా - చతుర్ముఖుడనా. ఏదీ గాదు. అదంతా సగుణం. ప్రకృతి గుణాలైన సత్త్వరజస్తమస్సులనే ఉపాధులతో కూడినది. ఎంత విశుద్ధమని చెప్పినా ఉపాధి ఉపాధే. ఆ మేరకది పరిపూర్ణం కాదు. పరిచ్ఛిన్నమే. ఇలాంటి పరిచ్ఛిన్నమైన తత్త్వం కాదు భాగవత ముద్దేశించిన భగవత్తత్త్వం. అది పరిపూర్ణం. అంటే నిరుపాధికమైన నిర్గుణమైన తత్త్వం. భాగవతా రంభ శ్లోకమే దీనికి తార్కణం. **"సత్యమ్ పరమ్ ధీమహి"** అని గదా అక్కడ ఉన్న మాట. పరమమైన సత్యమట మానవుడికి ధ్యేయం. అది ఎలాంటిదా సత్యం. ఈ త్రిగుణాత్మకమైన సృష్టి అంతా మృషాభూతమైనది. అంటే పరిశుద్ధమైన తత్త్వం. అది మన ఆత్మ స్వరూపమే Subjective అందులో శివ విష్ణ్వాది భేదమే మున్నదిక. పోతే దాని తరువాత శ్లోకమిలా చాటుతున్నది. **"వేద్యం వాస్తవ మత్ర వస్తు శివదమ్ తాపత్ర యోన్మూలనమ్"** అధ్యాత్మికాది తాపాల నన్నింటినీ సమూలంగా ఉన్మూలనం చేసి శివమైన మోక్ష పదవిని మనకు ప్రసాదించేదట ఆ తత్త్వం. అదే ఇక్కడ ప్రతిపాదితమైన వస్తువంటాడు మహర్షి. అది విష్ణువెలా అవుతుంది. విష్ణువైతే శివదమెలా కాగలదు. విష్ణుదమే కావాలది.

శివ విష్ణు అనే మాటలు చూచి మన మనవసరంగా బెదరి పోతున్నాము. భాగవతంలో విష్ణు, మాధవ, నారాయణ, వాసుదేవ అనే మాటలు తరుచుగా వినిపించవచ్చు. తత్సంబంధమైన వ్యవహారమూ వర్ణించవచ్చు. అంత మాత్రాన అది శివేతరమైనదని భ్రాంతి పడరాదు. అలాగే శివ ఈశ్వర అనే శబ్దాలు చూచి అవి కేవలమా కైలాస వాసిని చెబుతున్నట్టు భావించరాదు. ఇక్కడే మనం పురాణ హృదయం జాగ్రత్తగా చూచి పట్టుకోవలసింది. పురాణం శాస్త్రార్థానుసారి అని పేర్కొన్నాము. వేదాంత శాస్త్రం మనకు ప్రతిపాదించే భగవత్తత్త్వం రెండే రెండు విధాలు. ఒకటి నిరుపాధికం. మరొకటి సోపాధికం. ఇందులో నిరుపాధికానికి నామ రూపాదులైన ప్రకృతి గుణాలేవీ ఉండబోవు. అవన్నీ దాని కపృథ గ్భూతం Not different అంటే అవి కూడా దాని స్వరూపంలో చేరిపోయి దానికే మాత్రమూ వ్యతిరిక్తంగా కనిపించబోవు. అంచేత అది ఏకమేవా ద్వితీయమ్. దానికే బ్రహ్మమనీ, శివమనీ కూడా నామాంతరాలు. **"ఏక మేవా ద్వితీయమ్ బ్రహ్మ"** అని ఉపనిషద్వాక్యం. అలాగే **"చతుర్థమ్ శివ మద్వైతమ్ మన్యంతే"** అనే చోట శివమని వర్ణించింది మాండూక్యోపనిషత్తు. ఇక్కడ బ్రహ్మమనేది బ్రహ్మదేవుడూ కాదు. శివమనేది పార్వతీ వల్లభుడైన శివుడూ కాదు. పేర్లు చూచి మన ములికిపడితే ఎలాగా. నిర్గుణమైన బ్రహ్మతత్త్వానికి పర్యాయాలవి. శివమన్నా బ్రహ్మ మన్నా పరమాత్మ తత్త్వమే. అంతేగాదు. నారాయణ అని కూడా నిర్దేశించారు దాన్ని. **"అంతర్బహిశ్చ తత్సర్వమ్ వ్యాప్య నారాయణః స్థితః"** అన్నది నారాయణానువాకం. అక్కడ నారాయణ శబ్దానికి మన మనుకొనే విష్ణువని కాదు అర్థం. పరబ్రహ్మమే. దీనిని బట్టే **నారాయణః పరో ఽవ్యక్తాత్తని అవ్యాకృతానికి** అతీతమైన తత్త్వంగా వర్ణిస్తుంది విష్ణు పురాణం. వాసుదేవ అనే మాటకు కూడా అదే అర్థం. వాసుదేవ స్సర్వమితి – అని భగవద్గీత చాటిందంటే ఏమిటి భావం. **సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ** అనే శాస్త్ర వాక్యానికది ప్రతిధ్వని గదా. **వసతి దీవ్యతి ఇతి వాసుదేవః** అని దాని వ్యుత్పత్తి అస్తి భాతి అని అర్థం. అంటే సచ్చిదాత్మకమైన తత్త్వమే వాసుదేవ. అంతేగాని వసుదేవుని కుమారుడయిన కృష్ణుడని కాదు అనుకోవలసింది. ఆఖరుకు విష్ణు అనే మాట కూడా నిర్గుణమైన తత్త్వాన్ని సూచిస్తుందే గాని సగుణమైన తత్త్వాన్ని కాదు. **"తద్విష్ణోః పరమమ్ పద"**మని ఉపనిషత్తన్నదంటే అది విష్ణులోకమైన వైకుంఠం కాదు. పరంధామం లేదా కైవల్యమని భావం.

ఈ విధంగా చూస్తూ పోతే బ్రహ్మ విష్ణు శివ శబ్దాలు మూడూ మన కుపనిషత్తులలోనే సాక్షాత్కరిస్తాయి. మూడూ ఈ త్రిమూర్తులను గాక అమూర్తమైన పరమాత్మ స్వరూపాన్నే మనకు బోధిస్తున్నాయి. అది కేవలం నిర్గుణమూ, నిరుపాధికమూ. అదే ఈ ప్రపంచ సృష్ట్యాదికాన్ని చేయవలసి వచ్చినప్పుడు ప్రకృతి గుణాలతో చేరి సోపాధికంగా మారుతుంది. ఈ ప్రకృతి ఎక్కడిదనే ప్రశ్న లేదు. ఇది ఆ పరమాత్మ నోతప్రోతంగా పెనవేసుకొని ఉన్న ఆయన మాయాశక్తే. సత్త్వరజస్తమో గుణత్రయాత్మక మది. **"దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా"** అని గదా భగవద్వచనం. ఇదుగో ఈ త్రిగుణాలతో చేరి ఎప్పుడు సోపాధికమయిందో ఆ తత్త్వం – అప్పుడు దానికి ఈశ్వరుడని పేరు వచ్చింది. ఈశ్వరుడంటే ఇక్కడ త్రిమూర్తులలో శివుడని కాదు అర్థం. సగుణమైన తత్త్వానికీశ్వరుడని శాస్త్రం పెట్టిన పేరు. అది శివుడైనా కావచ్చు. విష్ణువైనా కావచ్చు. బ్రహ్మ అయినా కావచ్చు. ఏమని పిలిచినా పిలవవచ్చు దాన్ని. **"త్వమ్ బ్రహ్మా త్వమ్ విష్ణుః త్వమ్ రుద్రస్త్వమ్ ప్రజాపతిః"** నీవే బ్రహ్మ విష్ణు మహేశ్వరులని చెప్పి **"అంతశ్చరతి భూతేషు గుహాయాం విశ్వమూర్తిషు"** అని చెప్పి దాన్ని అంతర్యామిగా వర్ణిస్తున్నది వేదం. అంతర్యామి అన్నా ఈశ్వరుడన్నా ఒక్కటే. అవ్యాకృతమైన మాయాశక్తే దాని కుపాధి. ఇంకా త్రిగుణాలు బాగా విడిబడలేదు. కాబట్టి అది సోపాధికమైన విశుద్ధోపాధి. విశుద్ధమంటే మాలిన్యలేశం కూడా లేని గుణం. అదే శుద్ధ సత్త్వం. అందులో రజస్తమస్సులనే మాలిన్యానికి చోటులేదు. అన్నీ ప్రకృతిగుణాలే అయినా సత్త్వం శుద్ధమైనది. రజస్సు తమస్సు అంత శుద్ధమయినవి కావు. కారణం అవి ఒకటి విక్షేపానికీ మరొకటి ఆవరణానికీ దారి తీస్తాయి. ఆవరణ విక్షేపాలే అవిద్యా మయమైన సంసారం. కాబట్టి అవి రెండూ బాగా తగ్గిపోయిన సత్త్వమే శుద్ధ సత్త్వం. ఇలాంటి శుద్ధసత్త్వం ఈశ్వరుడి కుపాధి. అంచేత ఉపాధి అయినా అది ఆయన నేమీ చేయలేదు. మీదు మిక్కిలి ఆయనకే అది వశవర్తిని అయి చెప్పినట్లు చేస్తూ పోతుంది.

ఇదుగో ఈ ఈశ్వర లేదా అంతర్యామి అనే సగుణ బ్రహ్మమేదుందో అదే సృష్టి స్థితి లయాలనే మూడు కార్యాలు నిర్వర్తించటానికి తన మాయాశక్తిని మూడు మార్గాలలో ఉపయోగించింది. అందులో రజోగుణం వల్ల సృష్టి చేస్తుంది. అప్పుడది బ్రహ్మ. సత్త్వగుణంవల్ల పరిపాలిస్తుంది. అప్పుడది విష్ణువు. పోతే తమో గుణం

మూలంగా సంహరిస్తుంది. అప్పుడదే శివుడు. అదే ఆయా వ్యాపారాల రీత్యా మూడు రూపాలు ధరించింది. కాబట్టి ఈ మూడింటిలో తేడాలేదు. మూడూ కూడా సగుణమే. సోపాధికమే. నిరుపాధిక మీ మూడింటికీ కూడా అతీతమయింది. దానిని భాగవత మిలా వర్ణిస్తుంది.

నయత్ర సత్త్వమ్ నరజ స్తమశ్చ
నవై వికారో నమహాన్ ప్రధానమ్
పరమ్ పదమ్‌వైష్ణవ మామ నంతి
సత్త్వం రజ స్తమ ఇతి
గుణా బుద్ధే ర్నచాత్మనః

ఇవి బుద్ధి కల్పితమే గాని ఆత్మకు లేవట. **వదంతి యత్తత్త్వ విదః - తత్త్వం యద్ జ్ఞాన మవ్యయం - బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి కథ్యతే** - బ్రహ్మమూ పరమాత్మ భగవంతుడంటే అదే.

ఈ భగవంతుండే భాగవత కథానాయకుడు. ఆయన మన మనుకొనే విష్ణుమూర్తి కాదు. ఆ విష్ణువు త్రిమూర్తులలో ఒకడు. సత్త్వగుణోపహితుడైన ఈశ్వరుడు. పోతే ఇది అగుణమైన తత్త్వం. **"స వేదమ్ ససర్జాగ్రే భగవానాత్మ మాయయా సదస ద్రూపయా చాపి గుణమయ్యా ఽగుణో విభుః"** అగుణుడైనా సద సదాత్మిక అయిన తన మాయచేత సగుణుడైన ఈశ్వరుడుగా మారి ఈ ప్రపంచాన్ని ఆయనే సృష్టించాడు. అంతేకాదు. మనం విష్ణువు ధరించాడని భావించే మత్స్య కూర్మాద్యవతారాలు నిజంలో ధరించింది ఈ విష్ణువు కాదు. ఆ విష్ణువు. **"యథా మత్స్యాది రూపాణి ధత్తే - జహ్యాద్యథా నటః - భూ భారః క్షపితో యేన జహేత్త చ్చ కళేబరమ్"** ఆ ఆదినారాయణుడైన ఈశ్వరుడే ఈ అవతారాలన్నీ ఒక వేషధారిలాగా ధరించి తత్ప్రయోజనం తీరగానే మరలా విసర్జించి వెళ్లుతున్నాడు. కాబట్టి ఇంతకూ మనంగ్రహించవలసిన శాస్త్ర రహస్యమేమంటే స్వరూపతః భాగవతం వర్ణించే భగవత్తత్త్వం కేవల నిరుపాధికమైన బ్రహ్మమే పరమాత్మే. దానినే మరలా ఈ ప్రపంచ సృష్ట్యాదికాన్ని చేస్తున్నట్టు నిర్దేశించిందంటే అదే ఈశ్వరుడు. ఆ ఈశ్వరుడే రజోగుణోపాధి అయి సృష్టి-సత్త్వోపాధి అయి స్థితీ - తమ ఉపాధి అయి లయమూ

Brahmasri Yallamaraju Srinivasa Rao www.advaitavedanta.in

చేస్తున్నాడని అర్థం. ఇలాటి ఈశ్వరుడే భాగవతం వర్ణించే ఈశ్వరుడు. భగవంతుడు. అది విష్ణువని పేరు పెట్టినా ఈశ్వరుడని పెట్టినా ఈ ఈశ్వరుడే. ఇంతకు ముందు దాహరించిన శ్లోకాలే ఇందుకు తార్కాణం. ఆ మార్గాన్నే అనుసరిస్తూ మహాకవి పోతన కూడా భాగవత హృదయాన్ని ఇలా బయటపెడతాడు.

"ఈశుండు హరి విష్ణు డీ విశ్వ మేరీతి పుట్టించు రక్షించు పొలియ జూచు - బహుశక్తి యుతుడగు భగవంతుడవ్యయు డాదినే శక్తుల నాశ్రయించి బ్రహ్మ శక్రాది రూపముల వినోదించె ఏకత్వమున నుండు నీశ్వరుండు భిన్నమూర్తి యగుచు పెక్కు విధంబుల నేల యుండు" అని పరీక్షిత్తు అడిగితే శుకుడిలా వివరిస్తాడు.

పరుడై యీశ్వరుడై - మహా మహిముడై - ప్రాదుర్భవ స్థాన సం
హరణ క్రీడనుడై - త్రిశక్తి యుతుడై - యంతర్గత జ్యోతియై
పరమేష్ఠి ప్రముఖామ రాధిపులకుం - బ్రాపింప రా కుండు దు
స్తర మార్గంబున - తేజరిల్లు హరికిం - దత్పార్థినై మ్రొక్కెదన్

త్రిశక్తి యుతుడై సృష్ట్యాది త్రివిధ వ్యాపారాలనూ చేసే హరి అట. ఈ హరి విష్ణువెలా అవుతాడు. విష్ణువు చేసేది ఒక వ్యాపారమే కదా. మరి భాగవతమిలాటి హరి మాహాత్మ్యాన్ని చెబుతూ ఉంది. **"ఏ కథల యందు పుణ్యశ్లోకుడు హరి చెప్పబడును"** భాగవతమంతా హరి కథ. ఆ హరి ఇలాటివాడు. ఆయన త్రిమూర్తుల కోవకు చెందిన విష్ణువు కాదు. బ్రహ్మ కాదు. శివుడు కాదు. మూడింటినీ ముద్ద చేసిన రూపం.

అయితే ఇప్పుడున్నట్టుండి ఒక పెద్ద సమస్యకు మనం సమాధానం చెప్పవలసి వస్తుంది. భాగవత నాయకుడు మన మనుకొనే త్రిమూర్తులలోని విష్ణువు కాదు. మంచిదే. అలాంటప్పుడు దాన్ని త్రిమూర్తులతో ప్రమేయం లేకుండా వాటి కతీతమైన తత్త్వంగానే వర్ణిస్తూ పోవాలి గదా భాగవతం. అలా పోవటం లేదే. మధ్యే మధ్యే పానీయమన్నట్టు ఎక్కడ బడితే అక్కడ త్రిమూర్తులలో ఒకడైన విష్ణువునే గొప్ప చేసి కీర్తిస్తున్నదే. దాన్ని అలా కీర్తించటమే గాక మిగతా ఇద్దరినీ దానికన్నా నికృష్ట శ్రేణికి చెందినవారుగా నిరూపిస్తున్నది గదా. మరి దీనికేమిటి సమాధానం - ఇది ఎందుకిలా జరిగిందని ప్రశ్న వస్తుంది.

నిజమే అలా నిరూపించి ఉండకూడదు నిజానికి. కాని ఇక్కడ మనమంతా చాలా జాగరూకతతో గ్రహించవలసిన ధర్మ సూక్ష్మమొకటున్నది. అదేమిటంటే భాగవతమనేది అసలు రచించటంలో మహర్షి ఉద్దేశించిన పరమ ప్రయోజన మేమిటని ఆలోచించాలి మనం. దాని ఏకైక లక్ష్యం సంసార సాగరంలో పడి తల మునకలవుతున్న మనబోటి మనుష్య కీటకాలను మోక్షమనే తీరాన్ని చేర్చి కాపాడటమే. మనకందరికీ ప్రతినిధి పరీక్షిత్తు. శాపమనే నెపంతో మరణ మతని కాసన్నమయింది. నేడో రేపో మృత్యు ముఖంలో ప్రవేశించబోతున్నాడు. ఆ లోపలనే ఆ మృత్యు రహస్యమేమిటో భేదించి తెలుసుకోవాలి. తెలుసుకొని మృత్యుంజయుడై మరలా ఈ సంసార సముద్రంలో పడే ప్రమాదం నుంచి తప్పించుకోవాలి. బుద్ధి జీవుడైనందుకూ దాని బలంతో మంచి చెడ్డలను పరీక్షించే స్వభావమున్నందుకూ మానవుడు కోరవలసిన పరమ పురుషార్థమిది. సరిగా ఇదే కోరాడు పరీక్షిత్తు.

అయితే అంతవరకూ అతడు విష్ణురాతుడే. బ్రహ్మరాతుడు కాడు. అంటే సగుణమైన రూపాన్నే మనసుకు తెచ్చుకొని అదే భగవత్తత్త్వమనే భావనలో ఉన్నాడు. అలాటి భావన ఏ వైకుంఠానికో కైలాసానికో కొనిపోవలసిందే గాని పునరావృత్తి రహితమైన మోక్షాన్ని ప్రసాదించలేదు. మోక్షమే కావాలంటే అందుకు నిర్గుణమైన తత్త్వాన్ని పట్టుకోవాలి. పట్టుకోవాలంటే అది ఎవరికి వారు యత్నిస్తే సాధ్యమయ్యేది కాదు. **"ఆచార్య వాన్ పురుషోవేద"** అన్నట్టు ఆచార్యుడి సహాయం కావాలి. అతడు కూడా మరలా విష్ణు రాతుడే అయి కూచుంటే లాభం లేదు. బ్రహ్మరాతుడయి ఉండాలి. అంటే సగుణంగా సోపాధికంగా కాక నిర్గుణంగా నిరుపాధికంగా ఆత్మరూపంగా దర్శించి ఉండాలి తత్త్వాన్ని. అందులో పరినిష్ఠితుడై ఉండాలి. **"శ్రోత్రియమ్ బ్రహ్మ నిష్ఠమ్"**అన్నదుపనిషత్తు. అలాంటి వాడే శుక మహర్షి. ఆయనకు బ్రహ్మరాతుడని పేరు. శిష్యుడు విష్ణురాతుడైతే గురువు బ్రహ్మరాతుడు. తదుపదేశ బలంతో విష్ణురాతుడు బ్రహ్మరాతుడవుతాడు. **"బ్రహ్మవేద-బ్రహ్మైవ భవతి"** అన్నట్టు బ్రహ్మ స్వరూపాన్ని అధిగమిస్తే బ్రహ్మమే అవుతాడు మానవుడు. మరి బ్రహ్మమనేది ఏకమేవాద్వితీయమని గదా వచనం. అంటే తనకంటే విలక్షణంగా ఏభావమూ లేని ఏకాత్మ భావాన్ని అందుకొంటాడు. అది నిష్ప్రపంచమూ నిరీశ్వరమూ అయిన అద్వైత స్థితి కాబట్టి అసలైన సిసలైన మోక్షమదే. అందులో వైకుంఠమనీ, కైలాసమనీ

ఇలాంటి లోకాంతర ప్రసక్తిగాని, శివుడనీ, విష్ణువనీ ఇలాటి దేవతా ప్రసక్తిగాని, ధ్యానమనీ యోగమనీ ఇలాటి అనుష్ఠాన ప్రసక్తిగాని, ఏ ఒక్కటీ లేదు. కేవల శ్రవణ మననాదుల వల్లనే సాధించవలసిన ఫలితమది.

పరీక్షిత్తు కోరిందిదే చివరకు సాధించింది ఇదే. భాగవత మాద్యంతాలు పరామర్శిస్తే ఈ సత్యమే మనకు ఋజువవుతుంది. ఆదిలో పరీక్షిత్తు ప్రశ్న వేసింది నాకు మోక్షమెలా ప్రాప్తిస్తుందో ఆ మార్గాన్ని బోధించమని. దాని కనుగుణంగానే సాగుతుంది శుకుడి భాగవత ప్రవచనమంతా. ఖట్వాంగుడి చరిత్ర నుదాహరించి గట్టిగా శ్రద్ధాభక్తులతో శ్రవణం చేయాలే గాని అదెంత అని మొదలుపెట్టాడు తన బోధ. 12 స్కంధాల కథా వస్తువూ ఆ గమ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చేసిన బోధే. చివరకన్నీ ముగిసిన తరువాత తన ఉపదేశ గీతానికంతటికీ ముక్తాయింపు ఇస్తూ **"ఏవ మాత్మాన మాత్మస్థ మాత్మనైవామృశ ప్రభో - బుద్ధ్యానుమాన గర్భిణ్యా వాసుదేవాను చింతయా"** అని సలహా ఇస్తాడు. బుద్ధి అంటే శ్రవణం - అనుమానమంటే మననం - అను చింతనమంటే నిది ధ్యాసనం. ఈ భూమికాత్రయ రూపమైన జ్ఞానమే సాధనం తత్త్వాన్ని పట్టుకోటానికి. అది ఎక్కడో వైకుంఠాదులలో లేదు. ఏ విష్ణువో కాదు. శివుడో కాదు. అది నీ ఆత్మస్వరూపమే దాన్ని నీ ఆత్మతోనే అంటే ఈ అఖండాకార వృత్తితోనే ఆమృశ అను క్షణమూ పరామర్శించుకొంటూ పొమ్మంటాడు. దానితో ఏమవుతుంది.

అహమేవ పరం బ్రహ్మ - బ్రహ్మాహం పరమమ్ మతమ్
ఏవం సమీక్ష న్నాత్మాన - మాత్మన్యాధాయ నిష్కలే
దశంతం తక్షకం పాదే లేలి హానం విషాననైః
నద్రక్ష్యసి శరీరంచ విశ్వంచ పృథ గాత్మనః

ఈ విధంగా సకలమైన ఆత్మతత్త్వాన్ని నిష్కలమైన తత్త్వంలో ప్రవిలయం చేసుకొని అంతా నిరుపాధికంగా దర్శించావంటే ఇక తక్షకుడూ లేదు. కరవటమూ లేదు. నీకు విషమెక్కటమూ లేదు. చావటమూ లేదు. అంతా నీ స్వరూపంగానే మారి కనిపిస్తుంది. కాబట్టి చావు కూడా స్వరూపమే అయి **"మృత్యూ నామ్ మృత్యు"** వన్నట్టు నీవు మృత్యువుకే మృత్యువయి కూచుంటావని యమ ధైర్యమిస్తాడు. దానికి

పరీక్షిత్తిచ్చిన సమాధానం వినండి. **"భగవం స్తక్ష కాదిభ్యో మృత్యుభ్యో నబిభే మ్యహం – ప్రవిష్టో బ్రహ్మ నిర్వాణమ్ అభయం దర్శితం త్వయా"** స్వామీ నేను మృత్యువంటే ఇక భయపడను. ఎందుకంటే తాము నాకు జనకుడికి యాజ్ఞవల్క్యుడిలాగా అభయ ముద్ర ఇచ్చారు. దానితో నేను బ్రహ్మ నిర్వాణాన్నే పొందాను. అని తన తృప్తిని ప్రకటిస్తాడు. బ్రహ్మ నిర్వాణ మభయమనే అంటాడు గాని వైకుంఠాదుల ప్రసక్తి తీసుకురాడిక్కడ.

ఇదంతా ఇక్కడ ఏ కరువు పెట్టటమెందుకంటే భాగవతం ఉద్దేశించిన మానవ జీవిత గమ్యమసలేమిటని. అది పరమ పురుషార్థమైన మోక్షమనే మహాఫలం. ఆ ఫలాన్ని చవిచూడాలంటే సగుణతత్వాన్ని పట్టుకొంటే సుఖంలేదు. బ్రహ్మ విష్ణు శివాదులెవరైనా ఇట్లాంటి సగుణ రూపాలే. అంచేత భాగవత ప్రతిపాద్యమైన భగవత్స్వరూపం విష్ణువని వాదించటానికి లేదు. దానికి కూడా మూలభూతమైన నిర్గుణ తత్వమే కావాలది. అయితే ఇక్కడ విష్ణువుకే ప్రాధాన్య మిచ్చినట్టు కనిపిస్తున్నది ఏ కథ చూచినా. దానికి కారణమేమంటే త్రిగుణాలలో విష్ణువుది సత్వగుణం. సత్తన్నా సత్యమన్నా సత్వమన్నా శాబ్దికంగా ఒక్కటే. సత్తంటే ఎప్పుడూ ఉన్నదేదో అది. దానికి పుట్టటం, గిట్టటమంటూ ఉండవు. అనపాయోపజనమన్నారు దాన్ని. అపాయమంటే గిట్టటమూ, ఉపజనమంటే పుట్టటమూ. శుద్ధమైన చైతన్యమెప్పుడూ ఉండేది కాబట్టి దానికి సృష్టిలయాలనే భావాలుండరాదు. అప్పుడది శుద్ధమైన సత్వం. ఇలాంటి సత్వానికి ప్రతీకే విష్ణువు. కనుక అసలు తత్వానికిది చాలా సన్నిహితమైన మూర్తి. పోతే మిగతా బ్రహ్మశివుడనే మూర్తిద్వయం సృష్టి లయాల యాజమాన్యం వహించేది. సృష్టికి రజస్సు మూలమైతే లయానికి తమస్సు. రజస్త మస్సులు రెండూ స్థితికి ఆద్యంతాలు. అవి దాన్ని పరిమితం చేసి చూపే గుణాలు. కనుకనే వీటిని ఆవరణ విక్షేపాలని పేర్కొనటం. ఆవరణం స్థితిని కప్పి పుచ్చితే విక్షేపం దాన్ని చెదరగొడుతుంది. అలాగైతే అది ఇక సత్తు కాదు అసత్తు. అంచేత సత్వం పరిశుద్ధంగా నిలవాలంటే ఈ రెండూ దాని కధీనమై దాని కనుసన్నలలో మెలగుతుండాలి. అదే బ్రహ్మ మహేశ్వరులు విష్ణు తత్వానికి లోబడి ఉన్నట్టు, ఆయన అనుగ్రహానికి పాత్రులయినట్టు భాగవతం మనకు నిరూపించటంలో ఆంతర్యం.

ఇది కేవలం సాంకేతికం. **సత్యమ్ జ్ఞాన మనంతమ్ బ్రహ్మ** అని తత్త్వాన్ని విధి ముఖంగా నిర్దేశిస్తాయి ఉపనిషత్తులు. ఇందులో సత్యమ్ సత్త్వం. దాన్ని ప్రధానంగా తీసుకొని మాటాడితే త్రిమూర్తులలో విష్ణువుకు ప్రాధాన్యం లభిస్తుంది. పోతే అనంతమనేది లయ పర్యాయం. అంతం లేనిది కదా అనంతమంటే. అంతమంటే ఏమిటి. విజాతీయమైన పదార్థమొకటి తల ఎత్తటం. అలాంటి విజాతీయమేదీ లేకుండా మాసిపోయి అంతా ఒకే ఒక సజాతీయ వస్తువే ఉన్నప్పుడది అనంతం. అంటే లయమనే అర్థం. సర్వమైన అనాత్మ ప్రపంచమూ లయమై ఆత్మ ఒక్కటే మిగిలిన దశ. అదే శివం. దాన్ని వివక్షిస్తే శివుడే విష్ణువు కంటే ప్రధానుడవుతాడు. ఈ దృష్టితోనే శివపురాణాలన్నీ శివుడికి ప్రాధాన్యమివ్వటం. కాగా జ్ఞానమని మరొక లక్షణముంది. అసలీ అనాత్మ జగత్తొకటి ఎక్కడా లేదు. నాలోనే ఉంది. నాలో నుంచి దాన్ని నేనే సృష్టించి బయటపెట్టగలను. అలా సృష్టించే శక్తి నాకున్నదని తెలుసుకోటమే జ్ఞానం. దీనికి ప్రాధాన్యమిస్తే అది బ్రహ్మ. కనుకనే బ్రహ్మ చతుర్ముఖుడు. సర్వతోముఖ జ్ఞానసంపన్నుడని భావం. పితామహుడు. దేవతా జ్యేష్ఠుడు. అందరికన్నా మిన్న సృష్టి తరువాతనే గదా స్థితిలయాలు. కనుకనే జ్యేష్ఠత్వం. బ్రహ్మను గొప్పచేసి వ్రాసిన కథలన్నీ ఈ దృష్టితో సమన్వయించుకొని చూడాలి మనం. శివుడికీ విష్ణువుకూ వివాద మేర్పడితే బ్రహ్మ ఒక్కడే వచ్చి తీర్పు చెప్పినట్టు కథలెన్నో ఉన్నాయి పురాణాలలో.

మొత్తాని కేగుణాన్ని వివక్షించినప్పుడా గుణానికి ప్రతీక అయిన భగవద్రూపానికి ప్రాథమ్యం లభిస్తుంటుంది. పురాణకర్త వివక్షను బట్టి నడుస్తుంది ఇదంతా. ప్రస్తుతం భాగవతకారుడు చెప్పదలచింది సత్త్వగుణం. దాన్నే శుద్ధమైన చైతన్యానికి ప్రతీకగా భావించి మిగతా సృష్టి లయాలను దాన్ని నిరోధించే ప్రతిలోమ గుణాలుగా చూపదలచాడు. ప్రతిలోమ గుణాలెప్పుడవుతాయో అప్పుడది ఆ సత్త్వాని కావరణ విక్షేపాలుగా పనిచేస్తాయి. దానితో మానవుడికి కలగవలసిన జ్ఞానం కలగకపోవటమే గాక దాని బదులు అజ్ఞానమే అంతకంతకూ విజృంభిస్తుంది. వాటిని దూరం చేసుకొంటేనే గాని సత్త్వం నిర్మలమై జ్ఞానమనేది ఉదయించదు. **"తత్ర సత్త్వం నిర్మలత్వాత్ప్రకాశక మనామయమ్"** సత్త్వం నిర్మలమూ, ప్రకాశకమూ అయిన గుణం. సత్త్వాత్సంజాయతే జ్ఞానమన్నారు. అలాంటి నిర్మలమైన సత్త్వంవల్లనే పరమార్థ

జ్ఞానమవతరిస్తుంది. భాగవతం మోక్షఫలాన్ని ఎప్పుడందివ్వాలనుకొన్నదో అప్పుడు దానికి కావలసిన శ్రవణ మననాది రూపమైన జ్ఞానాన్ని ఉపదేశించి తీరాలి. ఇలాంటి జ్ఞానం రజస్తమో దూషితంగాని సత్త్వంవల్లగాని లభించదు. మరి ఆ సత్త్వానికి ప్రతీకమైన మూర్తి విష్ణువే. కనుకనే త్రిమూర్తులు ముగ్గురూ సగుణులే అయినా విశుద్ధ సత్త్వగుణోపాధి అయిన విష్ణువుకే ప్రాధాన్యమిచ్చి వర్ణించవలసి వచ్చింది భాగవతం.

ఈ రహస్యం భాగవతమే విప్పి చెప్పింది మనకు. **"పరమపూరుషుడొక్కడాద్యుడు పాలనోద్భవ నాశముల్ - సొరది జేయ ముకుంద పద్మజ శూలి సంజ్ఞల బ్రాకృత - స్ఫురిత సత్త్వరజస్తమంబుల బొందు - నందు శుభ స్థితుల్ - హరిచరాచరకోటి కిచ్చు ననంత సత్త్వనిరూఢుడై"** బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురూ ఈశ్వర స్వరూపులే. అయినా అందులో చరాచరాలకు శుభస్థితిని ప్రసాదించేది విష్ణువే నట. ఏమి కారణమంటే ఇస్తున్నాడు సమాధానం అనంత సత్త్వనిరూఢుడని. సత్త్వమంటే స్థితి. స్థితే లోకానికి కావలసింది. ఆద్యంతాలైన సృష్టి లయాలుకావు. లయమంటే చావు. సృష్టి అంటే చచ్చిన తరువాత మరలా జన్మ. ఈ రెండూ లేని దశే ఇక్కడ స్థితి అంటే. దీనికే బ్రాహ్మీస్థితి అని పేరు. దీన్ని సాధించటమే ముక్తి. దానికి సాధనం ఆత్మజ్ఞానం. అది సత్త్వం బాగా పరిశుద్ధమైనపుడే మానవుడికి లభిస్తుంది. అది ప్రసాదించేవాడు సత్త్వగుణోపాధి అయిన విష్ణువు. అలాంటి సత్త్వాన్ని ప్రతిపాదిస్తున్నది గనుకనే భాగవతానికి సాత్వత పురాణమని అసలు పేరు వచ్చింది. జ్ఞానప్రదాత అయిన విష్ణువు సాత్వతుడయితే తత్ప్రసాదంవల్ల జ్ఞానమార్జించి పరమపదాన్ని చేరవలసిన భక్తులు కూడా సాత్వతులే కాబట్టి ఇరువురికీ సంబంధించిన ఈ పురాణాన్ని సాత్వతమని పేర్కొన్నారు. పారమహంస్య సంహిత అని కూడా దీనికిందుకే పేరు వచ్చింది. పరమహంసలంటే జ్ఞానులే గదా. ఆ జ్ఞానం సత్త్వగుణ మూలకమే.

ఇదీ భాగవత పురాణం త్రిమూర్తులలో విష్ణుమూర్తికి ప్రాధాన్యమిచ్చి వర్ణించటంలో ఉన్న అంతరార్థం. రజస్తమో దూషితంగాని శుద్ధ సత్త్వాన్ని అలవరుచుకొని తన్మూలంగా జ్ఞానం సంపాదించి సంసార సాగరాన్ని పరీక్షిత్తులాగా మీరూ తరించండని మానవజాతికంతా చేసే ఉద్బోధ ఇది. అంతేగాని శివుడు

తక్కువ, విష్ణువే ఎక్కువని లేనిపోని విభేదాలు సృష్టించి జీవిత పరమార్థానికి మనలను దూరం చేయటానికి కాదు. ఒకవేళ అర్థం చేసుకోటంలో పొరబడి అలా అవుతారేమో ననే అక్కడక్కడా ఈ మూర్తిత్రయాని కతీతమైన తురీయ చైతన్యతత్వాన్ని ప్రస్తావించి మరలా మనకు జ్ఞాపకం చేస్తూ పోతుంది భాగవతం. ఆద్యంతాలలో దీన్ని అమూర్తమైన పరబ్రహ్మంగానే నిర్దేశిస్తుంది. ఇంత అయినా ఇంకా పూర్వాపర పరామర్శ చేసుకోలేక కొందరు దురాగ్రహంతో ఇది ఎక్కువ అది తక్కువ అని ప్రలాపాలు చేస్తూనే ఉంటారు. ముఖ్యంగా శివకేశవ భేదం బాగా వేర్లు పాతుకుపోయింది దేశంలో.

అది ఉన్నంతవరకూ మానవుడికి పురోగతి లేదు. దానిని కూకటి వేళ్లతో సహా పెళ్లగించినప్పుడే అభేద దృష్టి నలవరుచుకొని పురోగమిస్తాడు మానవుడు. ఆ నిర్మూలించే ప్రయత్నం ఇప్పుడుగాదు. పురాణకాలం నుంచీ జరుగుతూనే వస్తున్నది. భాగవత వివక్షితం వేరు కాబట్టి అందులో అంత బాహాటంగా మనకు కపడక పోవచ్చు. కాని హరి వంశాదులలో చూస్తే ఎంతగానో కనిపిస్తున్నది. శివ కేశవా భేదాన్ని ఎన్నో సన్నివేశాలలో ఎంతగానో గొంతెత్తి చాటాడు బాదరాయణుడు. అందుకోసమే కొన్ని భాగవతంలో లేని సన్నివేశాలు కూడా కల్పించాడు. అవి కూడా భాగవతమే గదా ఆ మాటకు వస్తే, చూడండి. మార్కండేయుడనే మహర్షి నోట ఇలా కొన్ని మాటలు పలికిస్తాడు హరివంశంలో.

రుద్ర స్యపరమో విష్ణు – ర్విష్ణోశ్చ పరమః శివః
ఏక ఏవద్విధాభూతో – లోకే చరతి నిత్యశః
నవినా శంకరం విష్ణు – ర్న వినా కేశవమ్ శివః

శివుడు లేని విష్ణువు లేడు. విష్ణువు లేని శివుడు లేడు. రెండూ ఒకే తత్త్వమట. అంతేకాదు.

యథాం తరం నపశ్యామి – తేనతౌ దిశతః శివమ్

రెంటికీ భేదం చూడనివారికే అది శుభకరమట. మరి ఈ శివుడెవరు, విష్ణువెవరు – ఇద్దరికీ ఉన్న సంబంధమేమిటంటే బయటపెడుతున్నాడొక గొప్ప రహస్యం.

రుద్రమగ్నిమయమ్ విద్యా - ద్విష్ణు స్సోమాత్మకః స్మృతః
అగ్నీషోమాత్మకం చైవ - జగత్స్థావర జంగమమ్

శివుడంటే అది అగ్నితత్త్వం - విష్ణువంటే సోముడు. ఈ రెండూ కలిసిందే అగ్నీషోమయాగం. అదే ఈ చరాచర రూపమైన సృష్టి అంతా. ఎంత మాటో చూడండి. ఏమిటి దీని అంతరార్థం. అగ్నీషోమమని ఒక యాగముంది. అది ఏదో బాహ్యంగా జరిగే కర్మగాదు. అంతర్యాగమది. అగ్ని అంటే అన్నింటినీ భక్షించేది మన ప్రాణం. బాహ్యంగా చెబితే వాయువు. ఈ ప్రాణంలో ఆహుతి అయ్యే అన్నమే సోముడంటే. అన్నాన్ని భక్షించేది ప్రాణమే గదా. అది అన్నమైతే ఇది అన్నాదం. ఈ అన్నాన్నాద మయమే ప్రపంచమంతా. అది ఎలాగ నామరూపాలే గదా ప్రపంచం. అదంతా మన జ్ఞానాగ్నిలో ఆహుతి అయి అందులోనే లయమవుతూంది. జ్ఞానం విషయి అయితే ఈ జ్ఞేయ ప్రపంచమంతా దానికి విషయం. విషయి విషయమయమే సమస్త సృష్టీ. ఈ విషయి విషయాలనే శివ కేశవులని భావించారు మహర్షులు. ఆ భావానికి రూపకల్పనే శివ కేశవ తత్త్వాలు. శివుడు సర్వజ్ఞుడనీ లయకారుడనీ చెప్పటం అన్నాద రూపమైన జ్ఞానాన్ని చెబుతుంది. అలాగే విష్ణువు స్థితికారుడనీ అనంత నామాలతో రూపాలతో అవతరిస్తాడని చెప్పటం అన్నరూపమైన నామ రూపాత్మ ప్రపంచాన్ని సూచిస్తుంది. జ్ఞేయజ్ఞానాలు రెండూ అవినాభావాలు. శక్తయో స్యజగత్కృత్స్నం - శక్తిమాంస్తు మహేశ్వరః - అన్నట్టు జ్ఞేయ ప్రపంచం శక్తి అయితే జ్ఞాన స్వరూపుడైన పరమాత్మ శివం. ఇంతకూ శివశక్తి సంయోగమే శివ కేశవ తత్త్వాలు. శివశక్తులకు భేదం లేదు కనుకనే శివ కేశవులకు కూడా భేదం చూడరాదని భావం. ఈ చూపే అగ్నీషోమ యాగానుష్ఠానం.

ఈ ఆధ్యాత్మిక రహస్య మెఱిగిన మహనీయులు గనుకనే కైలాసవాసులైన మహర్షులందరూ ఏక కంఠంతో ఇలా అంటారు.

జయ కౌస్తుభ దీప్తాంగ జయ భస్మ విరాజిత
జయ చక్రగదా పాణే జయ శూలిం స్త్రిలోచన

మార్కండేయుడిలా ఘోషిస్తాడు.

నమః పింగళ నేత్రాయ - పద్మనేత్రాయ వై నమః

నమః ప్రళయ కర్త్రేచ - నమస్త్రైలోక్యధారిణే

చూడబోతే అసలైన అర్థనారీశ్వర రూపమిదేననిపిస్తుంది. కృష్ణుడే అంటాడసలు శంకరుణ్ణి చూచి

త్వయా యదభయం దత్తం - తద్దత్త మఖిలం మయా

అవిద్యా మోహి తాత్మానః - పురుషాభిన్న దర్శినః

వదంతి భేదం పశ్యంతి - చావయో రంతరం హర

పనికి మాలిన వాళ్లు మనలో భేదం చూస్తారు. జ్ఞానులెప్పుడూ చూడబోరు. ఇది విష్ణు పురాణంలో బాణాసుర ఘట్టంలో కృష్ణుడి చేత బాదరాయణర్షి చెప్పించిన మాట. అంతేకాదు.

తమో ద్రేకీచ కల్పాంతే-రుద్ర రూపీ జనార్ధనః అని కూడా అంటాడు. ప్రళయ కాలంలో తమోగుణంతో విష్ణువే రుద్రరూపాన్ని ధరించి సృష్టినంతం చేస్తున్నాడట.

ఇలా పురాణాలన్నీ పెద్దపెట్టున ఘోషిస్తుంటే ఇంకా భేద దృష్టి పెట్టుకోటం ఎంత అవివేకం. ఈ పురాణ హృదయాన్ని మహాకవి పోతన కూడా ఎంతగా గమనించాలో అంతగా గమనించినట్టే కనిపిస్తుంది. కనుకనే నేమో సమయం వచ్చినప్పుడల్లా ఆ భేద దృష్టిని నిర్మూలించే ప్రయత్నమే చేస్తూ పోతాడాయన. భాగవతా రంభంలోనే **"చేతులారంగ శివుని పూజింపడేని నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని"** అని శివ కేశవుల నిద్దరినీ ఒకవేదిక మీద నిలిపి స్మరిస్తాడు. ఏకాంతంగా నదీ తీరంలో కూచొని ఈశ్వర ధ్యాన నిమీలిత లోచనుడయి ఉంటే హఠాత్తుగా ఆయన మనోనేత్రానికి శ్రీరాముడు కనిపిస్తాడు. ఆ రాజశేఖరుడెవరా అని ఆలోచిస్తున్నాడట ఆ మహాభాగవతుడు. ఈశ్వరుణ్ణి ధ్యానిస్తే శ్రీరాముడు కనిపించట మేమిటి. దానికి జవాబాయన మాటలోనేఉంది. ఇద్దరూ రాజశేఖరులే కాబట్టి. ఎంత సుకుమారమైన శ్లేషలో ఎంత గంభీరమైన భావాన్ని ఇమిడ్చాడా మహాకవి. పోతే అన్నిటికన్నా చిత్రమేమంటే శ్రీకృష్ణుడిలో కూడా శివస్వరూపాన్నే దర్శించాడా మహాత్ముడు.

తనువున నంటినధరణీ పరాగంబు – పూసిన వెలిభూతి పూతగాగ
ముందల వెలుగొందు ముక్తాలలామంబు–తొగల సంగడి కాని తునుక గాగ
ఫాలభాగంబుపై బరగు కావిరిబొట్టు కాముని గెల్చిన కన్నుగాగ
కంఠమాలికలోని ఘననీల రత్నంబు కమనీయమగు మెడకప్పుగాగ
హారవల్లులురగ హారవల్లులు గాగ – బాలలీల ప్రౌఢ బాలకుండు
శివుని పగిది నొప్పె – శివునికి దనకును వేఱులేమి దెల్ప వెలసినట్లు

బాల్యచేష్టా విభూషితుడైన కృష్ణ పరమాత్మను చూస్తుంటే ఆ వేషం శివుని వేషాన్నే జ్ఞప్తికి తెస్తున్నది. అసలు శివుడికీ తనకూ కించిత్తు కూడా భేదం లేదని చాటటానికే అలా కనిపిస్తున్నాడట పరమాత్మ. ఇది శివ కేశవాభేదాన్ని అద్దంలో చూపినట్టు చూపే పద్యం. మూలంలో దీనికి మాతృక కానరాదు. ఇది పోతన స్వకపోల కల్పితం. ఆయన జీవించిన కాలం శైవమత విజృంభణ బాగా ఉన్న కాలం. ఆయన కుటుంబీకులంతా వచ్చీ పోయి శైవులే. ఆ ప్రభావంతోనే వీరభద్ర విజయం లాటి కావ్యాలు ముందుగా వ్రాసి ఉంటాడు. రాను రాను జీవితంలో పరిపాక మేర్పడి తత్త్వజ్ఞాని అయ్యాడు పోతన. సకల సృష్టికి మూల భూతమైన తత్త్వమేదో దానిమీదనే ఆయన దృష్టి. తద్వారా మోక్షమే ఆయన ఆసించిన మహాఫలం. అందుకే అసలు ఎత్తుగడలోనే **"శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్"** అని ఎత్తుకొంటాడు. **"నా జననంబున్ సఫలంబు జేసెద పునర్జన్మంబు లేకుండగన్"** అని ఈ బృహత్ప్రయత్నానికంతటికీ ప్రయోజనం తనకిక ఈ కర్మ భూమిపై జన్మ లేకుండా పోవటమేనని చాటుతాడు. మరి ఇలాటి జన్మ రాహిత్యం సిద్ధించాలంటే అది శివుడనీ, కేశవుడనీ ఇలా స్వల్పమైన ద్వైత దృష్టితో సతమతమయితే ఎలా సిద్ధిస్తుంది. ఈ భూమికలనన్నీ అధిగమించిన మనస్తత్త్వమున్నవాడే అది అందుకోగలడు. అదే రజస్తమోగుణమలీమసమైతే అది మరలా సుఖం లేదు. మలినమైన దర్పణం లాగానే అది యథాస్థితమైన తత్త్వాన్ని ప్రతిఫలించదు. తదీయ స్పర్శలేశ మాత్రం కూడా లేని శుద్ధ సత్త్వం కావాలది.

సత్త్వమ్ విశుద్ధమ్ క్షేమాయ – సత్త్వమ్ యద్బ్రహ్మ దర్శనమ్

అని భాగవతం చాటి చెప్పింది ఇందుకోసమే. పార్థివమైన దారువుకన్నా, ధూమం కన్నా దాని నుంచి వచ్చే అగ్నిజ్వాల ఎలా ప్రకాశాత్మకమో. అలాగే రజస్తమస్సుల కన్నాసత్త్వమే ప్రకాశాత్మకం అంటుంది భాగవతం. అలాంటి శుద్ధ సత్త్వోపాధికమైన ఈశ్వర చైతన్యమే విష్ణువు. అది ఇక విష్ణువా, శివుడా అని వాదించరాదు. **"యే చైవ సాత్త్వికా భావా రాజసా స్తామసాశ్చయే మత్త ఏవేతి తాన్విద్ధి నత్వహం తేషు తేమయి"** ఇది మనం విష్ణువని భావించే కృష్ణుని వాక్యం. ఏమంటున్నాడాయన. ప్రపంచంలో సత్త్వరజస్తమో గుణాత్మకమైన ఏయే భావాలున్నవో అవంతా ఎక్కడివో కావు. నాలోనివే. నాలో నుంచే అవి బహిర్గతమై ఆయా రూపాలుగా భాసిస్తున్నాయి. అయితే చిత్రమేమంటే అవి నాలో ఉన్నవే గాని నేను మాత్రం వాటిలో లేనంటాడు. అంటే అర్థం. త్రిగుణాత్మకమైన సృష్టి చేసినట్టు కనిపించినా తాను త్రిగుణాతీతుడే. ఇలాటి త్రిగుణాతీతమైన ఈశ్వరుడే భాగవత కథానాయకుడు. మనమనుకొనే శివుడూ కాదు, విష్ణువూ కాదు. ఆ ఈశ్వరుడే శుద్ధ సత్త్వోపాధికుడై సృష్ట్యాదికాన్ని కావించటం మూలాన ఆ గుణాధిక్యాన్ని పురస్కరించుకొని దాన్నే మనం విష్ణువనే సంజ్ఞతో వ్యవహరించవచ్చు. ఇలాటి వ్యవహారమే ఇపుడు భాగవతం కూడా అనుసరిస్తూ వచ్చింది. ఈ దృష్టితో మాటాడితే భాగవతం విష్ణు పరమైనదే. సందేహం లేదు.



Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

6. అవతారములు - కృష్ణతత్త్వము

మనమింతవరకూ భాగవతానికి విష్ణువే పరముడని విష్ణు పారమ్యాన్ని నిరూపించాము. ఆ విష్ణువు కూడా ఎవడో కాదు. విశుద్ధ సత్త్వోపాధి అయిన ఈశ్వరుడేనని కూడా ప్రతిపాదించాము. ఆ ఈశ్వరుడు విశుద్ధమైన తన మాయాశక్తి సహాయంతో ఈ లోకంలో ఎలా అవతరించాడో దాని ప్రయోజనమేమో అందులో కృష్ణావతారానికున్న ప్రకర్ష ఏమిటో చర్చించవలసి ఉన్నది. అవతారమంటే దిగి రావటమని అక్షరార్థం. ఏమిటా దిగి వచ్చేది. ఈశ్వర చైతన్యం. ఎలా రాగలదది. రావాలంటే అది సర్వవ్యాపకమూ సర్వాత్మకమైన నిర్గుణతత్త్వం కాబట్టి స్వయంగా రాలేదు. త్రిగుణాత్మకమైన తన మాయాశక్తిని వశీకరించుకొని దాని బలంతోనే రాగలదు. **"సంభవా మ్యాత్మ మాయయా"** అనే భగవద్వచనానికిదే అర్థం.

సరే బాగానే ఉంది. కాని భగవానుడిలా అవతరించటానికేమిటి ప్రయోజనమని ప్రశ్న. **"ప్రయోజన మనుద్దిశ్య న మందోసి ప్రవర్తతే"** అన్నారు. అలాంటప్పుడు సర్వజ్ఞుడెలా ప్రవర్తిస్తాడు. స్వప్రయోజనమంటూ ఏదీ లేకపోయినా ఈ జగత్తు కోసమూ మనబోటి జీవుల కోసమూ అవతరిస్తున్నాడాయన. జగత్తనేది ఆయన సృష్టించిందే. ఆయన వివర్తమే. పోతే జీవకోటి అంతా ఆయన ఈ అండపిండాంతర్గతమై ప్రకాశించే మరొక రూపమే. వీటి రెంటినీ వినాశం పాలు కాకుండా వీటి స్థితిని కాపాడవలసి ఉంది. స్థితి కర్త విష్ణువని పేర్కొన్నాము. కాబట్టి ఆ విష్ణువే నిర్వహించాలది. ఎలాగ. ధర్మాన్ని రక్షిస్తే జగజ్జీవ స్థితులు రెండూ రక్షింపబడతాయి. జగత్తుకూ ధర్మమే మూలం. జీవుడికీ మూలం ధర్మమే. ఒకానొక సూత్రం మీద ఆధారపడి ఉంది ఈ లోకయాత్ర అంతా. అది ఉన్నంతవరకూ విశ్వం ఒడుదుడుకులు లేకుండా నడుస్తుంది. దెబ్బ తిన్నదో తల్లక్రిందులయి చేతికి చిక్కకుండా పోతుంది. దీనికే ధర్మ విప్లవమని పేరు. అలాటి ఉపద్రవం కలగకుండా ఎప్పటికప్పుడు ధర్మ సంస్థాపన చేయటమే అవతారానికొక ప్రయోజనం.

పోతే రెండవ ప్రయోజనం జీవధర్మ సంస్థాపన. జీవులకు కూడా ధర్మమనేదే మూలం. జీవుడంటే శరీరబద్ధమై బ్రతికే ఈశ్వర చైతన్యమే గదా. అది అవిద్యా

కామ కర్మలవల్లనే ఈ స్థితికి వచ్చింది. మరలా తన నిజస్థితినందుకొనే వరకూ దానికి శాంతి లేదు. అది ధర్మంవల్లనే సిద్ధించాలి. అందులో ప్రవృత్తి ధర్మమొకటైతే నివృత్తి ధర్మం మరొకటి. ఒకటి సత్కర్మాచరణ మూలంగా ఉత్తమ జన్మాదికమైన అభ్యుదయ ఫలాన్నిస్తుంది. మరొకటి సర్వకర్మో పరమ లక్షణమైన ఈశ్వర జ్ఞానం వల్ల నిశ్రేయస రూపమైన మోక్షమనే మహాఫలాన్నే ప్రసాదిస్తుంది. ఈ రెండింటినీ యథాశక్తిగా మానవుడాచరించి అపేక్షితమైన ఫలితాన్ని సాధించాలంటే దానికి ధర్మ సంస్థాపన అనే పేరు. ఈ ద్వివిధమైన ధర్మసంస్థాపన చేయటానికే భగవదవతారం. అందులో జగద్ధర్మాన్ని స్థాపించాలంటే దాన్ని విచ్ఛిన్నం చేయటానికి యత్నించే అసుర శక్తులను శిక్షించాలి. అవి రజస్తమో గుణాత్మకమైనవి. వాటివల్ల సత్త్వగుణోపేతమైన దేవసంపద పీడించబడుతున్నది. ఆ అసుర సంపద ఎప్పుడు శిక్షితమవుతుందో ఈ దైవసంపద అప్పుడు రక్షితమవుతుంది. ఇదే దుష్ట శిక్షణా శిష్ట రక్షణా అనేవి. తన్మూలంగా అధర్మం పూర్తిగా బలాదూరయి ధర్మం లోకంలో సుప్రతిష్ఠితమవుతుంది. నిజమే. కాని ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. దేవ మానవ దానవుల నందరినీ సృష్టించింది ఆ పరమేశ్వరుడే గదా. ఆయనే చెప్పాడు గదా **"యే చైవసాత్త్వికా భావా - రాజసాస్తామసాశ్చ యే - మత్త ఏవేతి తాన్విద్ధి"** సాత్త్విక రాజసాది గుణాలన్నీ నా వల్లనే ఏర్పడుతున్నాయని. అలాంటప్పుడు జీవుల తప్పేమున్నదని. ఏ గుణంతో ఎవడు పుట్టినా ఏ పనిచేసినా అది వాడి దోషం కాదు. తనదేకావలసి ఉంటుంది. మరి అలాంటప్పుడు దేవతలను దానవులు బాధిస్తున్నారని చెప్పి మరలా తానొక అవతారమెత్తి వారిని శిక్షించటమేమిటి-తన్మూలంగా వీరిని రక్షించటమేమిటి. తనకీ ప్రయాస దేనికసలు. అందరికీ ఒకే గుణమిచ్చి సమానంగానే సృష్టిస్తే సరిపోయేదిగదా.

ఈ ప్రశ్న మనమీనాడు గాదు. ఆనాడు పరీక్షిత్తే వేశాడు శుకుణ్ణి. కాదు కాదు. వారిద్దరూ నెపంగా ఎప్పటికైనా మనబోటివారు ప్రశ్నించవచ్చునని పురాణకర్తే ప్రశ్నించుకొని సమాధానమిస్తున్నాడు శుకుడిద్వారా. శుకుడిచ్చిన సమాధానమేమంటే అయ్యా - అసలీ ప్రశ్న ఎవడు వేస్తున్నాడు. దేనితో వేస్తున్నాడు. మనబోటి తెలిసీ తెలియని మానవుడు అజ్ఞానంతో వేస్తున్నాడు. ప్రశ్న ఎప్పుడూ అజ్ఞానంతోనే గదా వేస్తావు. జ్ఞానంతో ఐతే ప్రశ్నేముంది. జ్ఞానమంటే ఏమిటిక్కడ. **సర్వమ్ ఖల్విదం బ్రహ్మ** - అన్నట్టు అంతా భగవత్స్వరూపమని గ్రహించటమే. మనతో కలుపుకొని

ఈ సృష్టి అంతా ఒకే ఒక తత్త్వమయినప్పుడిక దేవతలేమిటి – దానవులేమిటి. ఒకరినొకరు బాధించటమేమిటి – అసలు భగవంతుడవతరించట మేమిటి. అంతా అబద్ధమే. అప్పుడిక ప్రశ్న లేదు. సమాధానం లేదు. అనవసరం. అలా కాక దేవతలు, దానవులు, సృష్టి అవతారమనే దృష్టి పెట్టుకొని ప్రశ్నించావా. అప్పుడంతా స్వరూపమనే జ్ఞానం నీకు లేదన్నమాట. అలాంటప్పుడు కూడా ప్రశ్న లేదు. ఎందుకంటే వస్తుతత్త్వ మొకవిధంగా ఉంటే నీవు మరొక విధంగా దాన్ని భావించి ఇది ఏమిటి – ఎందుకని అడుగుతున్నావు. ఇది ఎలాటి దంటే స్వప్నంలో ఈ దొంగలెవరు – నన్నెందుకిలా తరుముకొని వచ్చారు ఎందుకలా బాధించారనే ప్రశ్న లాంటిది. దానికి జవాబేమిటో దీనికే అదే జవాబు. అంటే అడిగినా చెప్పినా సుఖం లేదని భావం. అంచేత సారాంశమేమంటే ఒక దీర్ఘ స్వప్నంలాగా ఈ సమస్త సృష్టి ఒకటి ఉందని తాత్కాలికంగా ఒప్పుకొని చేసిన వర్ణనలే ఈ అవతారాది వర్ణనలన్నీ. ఈ దృష్టితో అవతారాలూ, తన్మూలంగా పరమాత్మ చేసే ధర్మసంస్థాపనా సమర్థనీయమే అవుతుంది. ఇలాగే చేశాడాయన జగద్ధర్మ సంస్థాపన.

పోతే ఇక జీవ ధర్మాన్ని కూడా స్థాపించాడని చెప్పాము. అలా స్థాపించాలంటే కేవలం శిష్ట రక్షణ మాత్రమే చేస్తే సరిపోదు. ఆ శిష్టులైన వారికి వారి వారి తాహతు ననుసరించి కర్మోపాసనా రూపమైన ప్రవృత్తి ధర్మాన్ని కొందరికీ జ్ఞాన వైరాగ్య రూపమైన నివృత్తి ధర్మాన్ని కొందరికి ఉపదేశించి వారి ఆముష్మిక జీవితానికి పనికి వచ్చే అభ్యుదయ నిశ్రేయస ఫలాలను కూడా అందివ్వాలి. అదే అసలు పరమాత్మ చేయగల అసలైన ధర్మ స్థాపన. దీనితో జీవధర్మం కూడా సమగ్రంగా స్థాపించిన వాడవుతాడా పరమేశ్వరుడు. ఇదీ అవతార ప్రయోజనం.

ఇలాంటి అవతారాల నెన్నింటినో పరిగణిస్తుంది భాగవతం. ముందు చెప్పినట్టు **"ఉర్వీశులున్ సురలున్ బ్రాహ్మణ సంయమీంద్రులు మహర్షుల్"** అందరూ భగవదంశలే. **"యద్య ద్విభూతి మ త్సత్త్వమ్ శ్రీమ దూర్జిత మేవవా"** అని భగవానుడే వాక్రుచ్చాడు. అంతా భగవద్విభూతే. భగవదంశే. దాని అంశాంశలే. అందులో ఆయన విభూతి బాగా అభివ్యక్తమైనవి నాలుగు విధాలు. అవి కొన్ని లీలావతారాలు. కొన్ని వ్యూహావతారాలు. కొన్ని అర్చావతారాలు మరికొన్ని విభవావతారాలు. అర్చావతారాలు శిలా తరుతీర్థాదులు. అది బాహ్యమైన జడ ప్రకృతిలో అభివ్యక్తమైన

భగవత్స్వరూపం. పోతే వాసుదేవ సంకర్షణా నిరుద్ధ ప్రద్యుమ్నాదులాయన వ్యూహావతారాలు. అంతః ప్రకృతిలో అభివ్యక్తమైన అంశాలివి. పోతే ఇక పరిశేష న్యాయంగా రెండుజాతులే ఉన్నాయి. అందులో ఒకటి లీల. మరొకటి విభవం. దశావతారాలలో మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన పరశురామ బలరామ కల్క్యవతారాలనే ఎనిమిది లీలావతారం క్రిందికి వస్తాయి. లీల అంటే ఏమిటి. ఏదో ఒక మహత్తరమైన కార్యాన్ని సాధించటాని కవతరించి ఆ ప్రయోజనం తీరిపోగానే అంతర్హితమై పోవటం. అలాంటివే మత్స్యాద్యవ తారాలు. అయితే పరశురామ బలరాములలా తొలగిపోలేదు గదా అని అడగవచ్చు. అవి కూడా వాస్తవంగా మాటాడితే తొలగినట్టే. పరశురాముడు రాజస గుణ దూషితమైన క్షత్రియ జాతినంతా నిర్మూలించి ప్రయోజనం తీరగానే తరువాత వచ్చిన శ్రీరాముడికి అధికార మప్పగించి తాను మహేంద్రగిరికి పయనమై పోతాడు. చిరకాల జీవి అని పేరు వడసినా మరుగుపడి ఉన్నవాడే ఆయన. అలాగే బలరాముడు చివరిదాకా జీవించి ఉన్నా కృష్ణుని అంటి పట్టుకొని ఆయన ననుసరించి ప్రవర్తిస్తూ స్వప్రభావం బయట పడకుండా అణిగి మణిగి ఉన్నవాడే. అంచేత అవి ఎనిమిదీ లీలావతారాలలో లెక్కే.

పోతే ఇక రెండే రెండు మిగిలి ఉన్నాయి. ఒకటి రామావతారం మరొకటి కృష్ణావతారం. ఇవి రెండూ విభవావతారాలు. విభవమన్నా విభూతి అన్నా, ఐశ్వర్యమన్నా ఈశ్వరప్రభావమని అర్థం. **"పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ"** అని శ్వేతాశ్వతరం చాటుతున్నది. ఆ ఈశ్వరుడికి స్వభావ సిద్ధంగానే ఒక శక్తి ఉంది. అది పరా. అంటే అన్ని శక్తుల కన్నా అతీతమైన శక్తి అది. ఆ శక్తే వివిధైవ అనేక విధాల చిత్ర విచిత్రంగా భాసిస్తూ పోతుంది. దీనికే విభవమని పేరు. ఇలాటి విభవావతారాలే రామకృష్ణులు. వారిలో విశేషమేమంటే మనుష్యరూపంలో మనుష్యుల మధ్యకు వచ్చి మనుష్యులతో సంబంధం పెట్టుకొని బ్రతికినంత కాలమూ మనుష్యోద్ధరణకే పాటుపడ్డారు.

ఆ ఇరువురిలో కూడా మరలా ఒక పెద్ద తేడా కనిపిస్తుంది. రాముడు మాయా మానుషుడైతే కృష్ణుడు లీలా మానుషుడు. మానవత్వాన్నే ఎక్కువగా ప్రదర్శిస్తూ భగవత్తత్త్వాన్ని మరుగుపరచిన వాడు శ్రీరాముడు. శ్రీకృష్ణుడలాకాదు. మానవుడి రూపంలో కనిపిస్తున్నా అడుగడుగునా తన భగవత్తత్త్వాన్నే చాటుతుంటాడు. ఇది

వారి వేషభాషల దగ్గరి నుంచీ ప్రవర్తన దగ్గర నుంచీ మనకు తార్కాణమయ్యే వ్యవహారం. రాముడు కేవలం ధనుర్బాణాలూ రాజోచితమైన వస్త్రాలంకారాలూ, కిరీటాదులూ ధరించి తిరిగితే కృష్ణుడు పీతాంబరమూ వనమాలా కిరీటమూ, కౌస్తుభమూ ఇలాటి చిహ్నాలన్నీ ధరించేవాడు. మయూర పింఛమూ, వేణువూ ఇవి రెండు కూడా విశేషం. ఇంకొక విశేష మేమంటే రాముడికి చతుర్బాహువులు లేవు. అతడు మనలాగా ద్విబాహుడే. కాని కృష్ణుడు ద్విభుజుడుకాదు. చతుర్భుజుడు. ఇలాటి రూపం అది విష్ణువుకు తప్ప ఆయన అవతారాలలో దేనికీ లేదు. అది కృష్ణావతారానికే సంక్రమించింది. అంతేకాక గరుత్మంతుడు రాముడి కెప్పుడో నాగపాశచ్ఛేదన చేయటానికి యుద్ధరంగంలో మాత్రమే దర్శనమిచ్చాడు. మరలా మాయమై పోయాడు. కృష్ణుడితో జీవితాంతమూ ఎప్పుడు పడితే అప్పుడు పిలిస్తే పలుకుతాడు. ఎక్కడికి బయలుదేరాలన్నా గరుత్మంతుడి మీదనే ప్రయాణం. సముద్రం దాటటానికి రాముడు బ్రహ్మ ప్రయత్నం చేయవలసి వచ్చింది. అతడు దారి ఇవ్వలేదు సేతువు కట్టి వెళ్లారు వానరులు. మరి కృష్ణుడికైతే అడుగులకు మడుగు లొత్తుతూ ఆయన పోయినంత దూరం శిలారూపంగా మారిపోతాడు. రాముడి రథం భూమిమీద పోవటమే దుర్లభమైతే కృష్ణుని రథం దారుకుడి ప్రమేయం కూడా లేకుండా సప్తకుల పర్వతాలమీద కూడా ఎగిరిపోతుంది. రాముడొకే ఒక రూపంలో కనపడితే కృష్ణుడొక్కొక్కరి కొక్కొక్క రూపంలో ఏక కాలంలో దర్శనమివ్వగలడు. విశ్వాన్ని తాను చూడవలసిందే గాని విశ్వరూపం చూపే ప్రసక్తే లేదు రాముడికి. కృష్ణుడు తన జీవితంలో నాలుగుసార్లు చూపాడు విశ్వరూపాన్ని. ఇలా ఎన్నుతూ పోతే ఎన్నైనా చెప్పవచ్చు. చివరకు రాముడొకరి కుపదేశం చేసిన సందర్భమంతగా లేదు. చాలా తక్కువ. అదీ ధర్మోపదేశమే గాని మోక్షోపదేశం చేయలేదెక్కడా. కృష్ణుడలా కాక తన ఆశ్రితులకూ, బంధువులకూ, స్నేహితులకూ, ఆచార్యులకూ, తల్లిదండ్రులకూ, వీరు వారని లేదు. ఎవరికైనా సరే తత్త్వోపదేశం ఎంతగానో చేస్తూ పోయాడు. అసలు జననం, మరణం, ఈ రెంటిలో కూడా తేడా ఉందిరువురికీ. జీవితంలో ఇక సరే సరి. కృష్ణుడు ప్రతి ఒక్కటీ ముందుగా తెలిసి చేస్తే-రాముడు తరువాత ఏమి జరుగుతుందో తెలియకనే మెలగుతాడు. కడపటి కొకరు ఏక పత్నీ వియోగమే సహించలేక విషాదమనుభవిస్తే మరొకరు బహుపత్నీ వియోగాన్ని కూడా వినోదంగానే తిలకిస్తారు.

ఇలా వర్ణించాము గదా అని రాముడు కేవలం మానవమాత్రుడే నని గాదు మనం భావించవలసింది. భగవదవతారమైనప్పుడేది కానీ దివ్యం కావలసిందే కాని మానుషమెలా అవుతుంది. ఆ మాటకు వస్తే రాముడు కూడా పరిపూర్ణుడే. కృష్ణుడిలాగా అదీ విభవావతారమనే గదా పేర్కొన్నాము. విభవ మన్నప్పుడు పరిపూర్ణం కాక అది అపరిపూర్ణమెలా అవుతుంది. అయితే ఎటు వచ్చీ ఆ వైభవం ప్రదర్శించ లేదా అవతారంలో పరమాత్మ **"ఆత్మానమ్ మానుషమ్ మన్యే"** అని స్పష్టంగా చెప్పుకొన్నాడు తన మనుష్య భావాన్ని. అంటే తన వైభవాన్నంతటినీ కావాలని కప్పి పుచ్చుకొని తనది కాని మానవత్వాన్ని తనకు సహజమైనట్టు లోకానికి చూపుతూ వచ్చాడన్న మాట. ఇలా ఎందుకు చేయవలసి వచ్చింది. ఆ అవతారంలో ఈశ్వరుడు చేయదలచిన మానవోద్ధరణ ధర్మోపదేశంతో, మోక్షపదేశంతో కాదు. కనుక మహిమ చూపవలసిన అవసరం లేదు. ఒక ఉత్తమ మానవుడెలా ఉండాలో ఎలా ప్రవర్తించాలో చూపితే చాలు. అలాగే భావించాడు. చెప్పాడు. చూపాడు రాముడు. ఎక్కడా తాను భగవానుడనని ఆచూకీ ఇవ్వలేదు. అది లోకుల కవసరం కూడా లేదు. ఇదీ రాముడు చేసిన పని. కనుకనే వాల్మీకి ఆయన కెక్కడా భగవాన్ అనేమాట వాడలేదు. పురుషోత్తమః రాజపుత్రః, దాశరథిః కౌసల్యానందవర్ధనః, రఘునందనః అని మాత్రమే వ్యవహరించాడు. కాని మనం గ్రహించవలసిందేమంటే కవి అయిన వాల్మీకికీ తెలుసు కథా నాయకుడైన రామచంద్రుడికీ తెలుసు ఒక విషయం. రాముడు భగవంతుడే నని వాల్మీకికీ తెలుసు. తాను భగవంతుడే నని రాముడికీ తెలుసు. తెలిసే ఆయన తెలియనట్టు ప్రవర్తిస్తే - ఆ ప్రవర్తనలో దాగి ఉన్న తెలివిని తెలియనట్టే బయటపెట్టాడు వాల్మీకి. అది రామాయణం పైపైన చూచిన వారికెవరికీ అంతుపట్టేది కాదు. లోతుకు దిగి ప్రతిమాటా ప్రతిచేతా తడవి చూచి ముందు వెనుకలు బాగా అనుసంధించుకోగల మేధావంతుడి కాకథలో అంతర్వాహినిగా ప్రవహించే మర్మమేదో స్ఫురిస్తుంది. దానితో అడుగడుగునా భాగవతంలో మాదిరి రామాయణంలో కూడా భగవద్విభూతే మన మనోనేత్రానికి సాక్షాత్కరిస్తుంది. ఇది నేను దీని తరువాత వ్రాయబోయే రామాయణ రామణీయక మనే గ్రంథంలో సవిస్తరంగా మనవి చేస్తాను సహృదయ లోకానికి. అలమిహ బహు ప్రపంచనేన.

కాబట్టి రాముడింతకూ లోకులకు ధర్మోపదేశం మాత్రం చేయవలసిన వాడు గనుక ఆయన జీవితం తావన్మాత్రంగానే సాగింది. పోతే కృష్ణుడు ధర్మోపదేశం కోసం కాదవతరించింది. ఆయన లోకులకు పరమ పురుషార్థమైన మోక్షఫలాన్నే అందివ్వాలని వచ్చాడు. కనుకనే రామాయణ మితిహాసమైతే భాగవతం పురాణమయిందని ఇంతకుముందే మనవి చేసి ఉన్నాను. మోక్షపురుషార్థమే భాగవతానికి వివక్షితమైతే తత్ప్రదాత శ్రీకృష్ణుడే దానికి కథానాయకుడయ్యాడు. కృష్ణ చరితమనే భాగవతానికి నామధేయం. కృష్ణతత్త్వమే ఈ పురాణ పారిజాతానికి మూలం. తత్తత్త్వవేత్త తదంశ సంభవుడూ అయిన కృష్ణ ద్వైపాయనుడే ఆ మహత్త్వాన్ని లోకుల కందివ్వగలిగాడు. అది శుకముఖంగా ఆకర్ణించి తరించినవాడూ కృష్ణ రక్షితుడై కృష్ణ స్మరణైక పరాయణుడైన పరీక్షిత్తే. మొత్తం మీద అంతా కృష్ణమయ మీ పురాణం. ఇది గుర్తించే పైకి రామభక్తుడని పేరు వడసిన పోతన కూడా కలంచేత బట్టి వ్రాత కుపక్రమించినప్పుడే కృష్ణ గుణ సంకీర్తనతో ఉపక్రమించాడు.

శ్రీకైవల్యపదంబు జేరుటకునై చింతించెదన్ - లోకర
క్షైకారంభకు - భక్తపాలన కళా సంరంభ కున్ - దానవో
ద్రేకస్తంభకు - కేళిలోల విలస ద్భృగ్జాల సంభూత నా
నాకంజాత భవాండ కుంభకు - మహానందాంగనా డింభకున్

శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించిం దాయన ఎవరినో గాదు. కృష్ణ పరమాత్మనే. ఆయన నందాంగనా డింభకుడు. డింభకుడని పేరేగాని మహాడింభకుడు. మహాడింభకుడేమిటి - పెద్ద కుర్రవాడన్నట్టు. పెద్దవాడా కుర్రవాడా ఇంతకూ. కుర్రవాడుగా మనకంటికి కనిపిస్తున్నాడే గాని నిజానికి కుర్రగాదు. పెద్దే. పెద్దంటే మామూలు పెద్దగాదు. అణోరణీయాన్ మహతో మహీయాన్ అనే ఉపనిషద్వాక్యానికిది ప్రతిధ్వని. అణువుకన్నా అణువూ మహత్తుకన్నా మహత్తు కూడా అది. అదే మహాడింభకుడని చమత్కారంగా అన్నాడు మహాకవి.

పోతే ఇక ఈ పద్యంలో చేసిన వర్ణన అంతా కృష్ణావతార వర్ణనే. లోక రక్షైకారంభకు డాయన. లోక రక్ష ఎలా ఏర్పడుతుంది. అధర్మ విజృంభణా ధర్మ విప్లవమూ సాగినంతవరకూ అది సంభవం కాదు. అధర్మానికి ప్రతీక దానవులైతే

ధర్మానికి ప్రహ్లాదులైన భాగవతులు. కనుక దానవోద్రేకస్తంభకుడై తద్ద్వారా భక్తపాలన కళా సంరంభాన్ని చూపవలసిన వాడయ్యాడు. నిజానికది సంరంభమే గాదు. ఆయన పాలిటికది ఒక లీల. మనకోసం ప్రదర్శించే ఒక కళ. ఎందుకంటే అసలీ దుష్టులూ లేరు శిష్టులూ లేరు – ఆయన శిక్షించటానికీ, రక్షించటానికీ. అధర్మమూ లేదు, ధర్మమూ లేదు ఆయన లోకస్థితిని కాపాడటానికి. అంతా మిథ్యా – మాయ. ఇదంతా ఒక నాటకం. యత్ర త్రిసర్గోమృషా అని మొదటనే ఘోషించింది భాగవతం. సృష్టే మృష అయినప్పుడా సృష్టిలోని దేవ దానవ జాతులూ, వారి మంచి చెడ్డలూ, వాటి కోసం భగవదవతార సంరంభమూ ఇదంతా సత్యమెలా కాగలదు. అది మృష అయితే ఇది ఒక మిష అనే అనుకోవాలి మనం. అదే వ్యంగ్యంగా బయట పెడుతున్నాడు మహాకవి కేళిలోల విలసద్భృగ్జాల సంభూత నానాకంజాత భవాండ కుంభకుడనే మాటలో. ఈ బ్రహ్మాండ భాండాలన్నీ ఆయన ఒక కుమ్మరిలాగా దండమూ, చక్రమూ, సూత్రమూ పెట్టుకొని సృష్టించలేదు. ఈ సృష్టి ఆయన భృగ్జాల సంభూతమట. భృగ్జాల మేమిటి. భృక్కే జాలం. భృక్కంటే దృష్టి. జాలమంటే మాయ – ఇంద్రజాలమనే మాటలో తెలుస్తుంది మనకు. జాలమంటే కేవలం మాయ. తనచైతన్య రూపమైన భృక్కును నిరంతరమూ ఆశ్రయించి ఉన్న ఏ మాయాశక్తి ఉందో తద్ద్వారా ఆవిర్భవించిందీ సృష్టి అంతా. అంతేగాని వాస్తవం కాదిది. అద్వైతులు చెప్పే దృష్టి సృష్టి వాదమిది. తన సృష్టే ఇలా అయథార్థ మయినప్పుడు తాను జన్మించటం మాత్రమిక యథార్థమెలా కాగలదు. కనుకనే నందాంగనకు డింభకుడుగా కనిపిస్తున్నా అది **"మహాంతం విభు మాత్మాన"** మన్నట్టు మహద్రూపమే విభూతే. అయినా అసత్యమైన ఈ సృష్టి సత్యంగా భాసింపజేస్తున్నాడు. అజాతుడైనా తానొక నంద యశోదలకు జన్మించినట్టు భాసిస్తూ వచ్చాడు. ఇదొక కేళి ఆయన పాలిటికి. ఆ కేళిలో లోలుడయి దాని ఫలితంగా ఇంత పెద్ద నాటకం మనకొక ఇంద్రజాలంలాగా చూపుతున్నాడు.

ఇదీ కృష్ణావతార తత్త్వాన్ని గూర్చి మహాకవి అర్థం చేసుకొని మనకు చేసిన బోధ. మనం కూడా అలాగే అర్థం చేసుకోవాలాతత్త్వాన్ని. అసలు భాగవత ముద్దేశించింది కూడా అదే. **"సర్వే పృంశ కలా విష్ణోః కృష్ణస్తు భగవాన్ స్వయమ్"** అని మొదటనే చాటుతున్నది భాగవతం. మిగతా మత్స్యకూర్మాదులన్నీ అంశ కళలేనట

పరమాత్మకు. ఒక్క కృష్ణావతారమే పరిపూర్ణమైనది. ఇది విష్ణువుకు అంశ కాదు. సాక్షాద్విష్ణువే. ఆ హరి కృష్ణుండు బలాను జన్మ-డెడలే-దావిష్ణుడౌ నేర్పడన్. శుద్ధ సత్వోపాధి అయన విష్ణుదేవుడే కృష్ణుడనే మరొక రూపంలో భాసిస్తున్నాడంత మాత్రమే. దీనికి ప్రబలమైన తార్కాణం మనకు భాగవతంలోనే ఒక చోట కనిపిస్తుంది. కృష్ణుడు కుశస్థలిలో ఉండగా ఒకనాడు ద్వారకలో హఠాత్తుగా ఒకబ్రాహ్మణుడు మృతుడైన తన శిశువును రాజద్వారం దగ్గర పెట్టి గట్టిగా విలపిస్తాడు. అప్పటికది ఆయన భార్యకు తొమ్మిదవ కానుపు. పుట్టగానే ఎప్పటికప్పుడు కాలుడా బిడ్డలను పొట్టన పెట్టుకొంటున్నాడట. రాజులు ధార్మికులయి సక్రమంగా దేశాన్ని పాలిస్తుంటే ఇలాంటి అత్యాహితమెలా జరుగుతుంది - దీనికంతటికీ దేశపాలకుడే కారణమని నిష్ఠురాలాడతాడా బ్రాహ్మణుడు. అప్పుడక్కడ సన్నిహితుడయి ఉన్న అర్జునుడా మాటలు విని నేను వచ్చి ఆ శిశుహంతలను పట్టి శిక్షిస్తానని అభయమిస్తాడు. బలరామ కృష్ణాది యాదవ వీరులవల్లనే కాని నీవల్ల కాదంటా డావిప్రుడు. వారిని మించిన బలపరాక్రమ శాలినని భీకరాలు పలుకుతా డర్జునుడు. ఇష్టం లేకపోయినా సరేనని చెప్పి వెంట బెట్టుకొని వెళ్లుతాడు బ్రాహ్మణుడు. శతవిధాల పోరి కూడా అర్జునుడు తన ప్రయత్నంలో విఫలుడవుతాడు. ఆ బ్రాహ్మణుడతణ్ణి పడదిట్టి మరలా శ్రీకృష్ణుడి దగ్గరికి పరుగెత్తుకొనిపోయి మొరపెడితే ఆయన శైబ్యసుగ్రీవ మేఘ పుష్ప వలాహకాలనే గుఱ్ఱాలను పూన్చిన రథమెక్కి అర్జునుడితో సహా బయలుదేరి సప్త సముద్రాలూ సప్తకుల పర్వతాలూ దాటి అన్ని దిక్కులూ గడచిపోయి చివరకు క్షీరసాగరంలో ప్రవేశించి మహాంధ తమసాన్ని ఛేదించుకొంటూ పోగా పోగా శేషశాయి అయిన ఆదినారాయణుడు దర్శనమిస్తాడు. **"న నంద ఆత్మాన మనంత మచ్యుతో - విష్ణుశ్చ తద్దర్శన జాత సాధ్వసః"** తన ఆత్మస్వరూపుడే అయిన ఆ నారాయణ మూర్తికి నమస్కరిస్తాడు కృష్ణుడు. ఆయన మందస్మితం చేస్తూ నరనారాయణులైన మిమ్ము ఒకసారి చూడాలని ఇక్కడి మహామునులు కోరితే విప్రబాలకుల నపహరించవలసి వచ్చింది. అంతేగాని మరేమీ కాదని చెబుతూ వారికా బిడ్డలనందరినీ ఇచ్చి వీడ్కొలుపుతాడు.

ఈ కథ ఒక్కటే చాలు మనకు శ్రీకృష్ణుడు సాక్షాత్తు నారాయణుడేనని చెప్పటానికి. మూలవిరాట్టు దగ్గరికి మరలా పోయి రావటమనేది మరి ఏ అవతార చరిత్రలోనూ

జరగలేదు. రాముడు దేవేంద్రుని సందర్శనానికే నోచుకోలేకపోయాడు. మిగతా వారి సంగతి అసలు చెప్పనక్కరలేదు. ఒక్క కృష్ణావతారంలోనే ఇలాంటి మహిమలన్నీ. అందుకే తక్కిన అవతారాలన్నీ భగవదంశలైతే ఇది భగవానుడే స్వయంగా. భగవచ్ఛబ్దం కృష్ణుడికి మాత్రమే వర్తిస్తుంది. భగవద్గీత అన్నారు. భాగవతమన్నారు. రెండు చోట్ల కృష్ణుడే ఆ భగవానుడు. ఆయన చెప్పిన మాట ఒకటైతే చేసిన చేష్ట మరొకటి. ఒకటి సిద్ధాంతం మరొకటి దాన్ని బలపరిచే దృష్టాంతం. లోకానికీ రెండువిధాలా ఇచ్చాడాయన పరమ పురుషార్థ సందేశం. భగవానుడు కనుకనే అలా చేయగలిగాడు. జ్ఞానైశ్వర్య బల వీర్యశక్తి తేజస్సులనే షడ్గుణాలకూ భగమని పేరు. భగోస్యాస్తీతి భగవాన్. అవి కలవాడే భగవానుడు. ఈషాడ్గుణ్య మాయన జననం దగ్గరినుంచీ నిర్యాణం దాకానే కాక నిర్యాణానంతరం కూడా మనకవగత మవుతుంది.

కృష్ణ నిర్యాణంతో భాగవత మారంభమవుతుంది. ఇది ఒక చమత్కారం. ఏదో యాదృచ్ఛికంగా దొరలింది కాదిది. సాభిప్రాయంగానే వర్ణించాడు మహర్షి. కృష్ణుడు బ్రతికి ఉన్నంతవరకూ లోకంలో ధర్మ ప్రతిష్ఠ అనేది ఎవరికీ అర్థం కాలేదు. పాండవులు తమవల్లనే అంతా జరుగుతున్నదని భావించారు. యాదవులంతకంటే. రాజర్షులు, బ్రహ్మర్షులూ అంతా కూడా తమ ప్రభావమే ననుకొని ఉండవచ్చు. ఇది మీరెవరివల్లా కాదు మీరంతా నిమిత్త మాత్రం నేనుంటేనే మీరు సుమా అని అందరినీ మౌనంగా హెచ్చరించటానికే ఆయన మరణం. కృష్ణుడి ఈ మరణ వృత్తాంతం హరివంశంలో కానరాదు. అది ఆయన విజయ పరంపరను వర్ణించటంతోనే ముగుస్తుంది. సత్యమేవ జయతే అని నిత్య సత్యమైన భగవత్తత్త్వాన్ని నిరూపించటమే దాని ఉద్దేశం. ఇక్కడ అలా కాదు. ఆయన మరణం కూడా ఒక ప్రబోధమేనని చెప్పటం ముని హృదయం. మరణానికి ముందే పోయారు యాదవులంతా. ఇంకా మృతశేషులు కొందరుంటే వారిని తానే హతమార్చాడు. మరణవార్త విన్నారో లేదో పాండవులిక నిలవలేక మహాప్రస్థానానికి బయలుదేరారు. రాజ వంశానికంతా పరీక్షిత్తొకడు మిగిలాడు. దేశమేలే బాధ్యత అంతా ఆయన మీద పడింది అయితే అప్పటికీ కలియుగ మారంభమవుతుంది. ఒకనాడు వేటకు వెళ్లితే గో వృషభాల సంభాషణ వినిపించింది. అవి గో వృషభ రూపంలో దాగి ఉన్న ధరణీ ధర్మదేవతలే. కృష్ణ భగవానుడు అస్తమించేసరికి లోకంలో సమస్త

ధర్మాలూ, అస్తమించాయి గదా దీన్ని కాపాడే నాథుడే లేడా అని వాపోతాయవి. ఆ తరువాతనే కలిపురుషుడు వాటిని తన్నటమూ పరీక్షిత్తు వాడి మీద చేయి చేసుకోవటమూ జరుగుతుంది.

ఏమిటీ ఉదంతంలోని ఆంతర్యం. ఇది ధర్మ భూదేవతల సంవాదం కాదు. తదప దేశంతో సాగిన పరమాత్మ మౌన సందేశం. ఎవరికా సందేశం. ఎవరు దేశానికంతా పాలన భారం వహిస్తే వారికి. వాడు ప్రస్తుతం పరీక్షిత్తే. **"నా విష్ణుః పృథివీ పతిః"** అన్నారు. విష్ణ్వంశ లేనివాడు ప్రజాపాలకుడు కాలేడు. సృష్టి స్థితి లయాలలో స్థితి కర్త విష్ణువు గదా. ఆ స్థితిని చూడవలసిన వాడే క్షత్రియుడు కూడా. అది నేను లోకంలో అవతరించి చూడవలసినంతగా చూచాను. నలుగురిచేతా చేయించాను. యుగాంతమై నేనిప్పుడు నిష్క్రమిస్తున్నాను. మరి నాతోపాటు ధర్మం కూడా నిష్క్రమించకుండా చూడవలసిన బాధ్యత మీ బోటి క్షత్రియులమీద ఉన్నది. నేనున్నా లేకున్నా చూడాలి మీరు. అలా పరీక్షించి చూచేవాడవు కనుకనే నీ తండ్రి నుపేక్షించినా నేను గర్భంలోనే అంతరించకుండా నిన్ను రక్షించాను. విష్ణురాతుడవైన నీవు విష్ణువులాగా లోకస్థితినెలా కాపాడగలవో మరి – సకల ధర్మ నిర్మూలకమైన కలికాలం వచ్చి పడింది. దీనికేమిటి నీ సమాధానమని పరీక్షిత్తుకు చేసిన పెద్ద హెచ్చరిక ఇది. అందుకే జన్మ వృత్తాంతమింకా ప్రస్తావన చేయకముందే పురాణా రంభంలోనే కృష్ణ నిర్యాణ వార్త వినిపిస్తున్నాడు బాదరాయణుడు. ఈ విషమమైన కలికాలంలో బ్రతికే రాజు లేమిటి. ప్రజలేమిటి. ప్రతి ఒక్కరికీ ప్రపంచ పరిస్థితులను జ్ఞాపకం చేస్తూ అందులో ఎవరి బాధ్యతలు వారెలా నిర్వర్తించాలో తద్వారా విశ్వ ధర్మ ప్రతిష్ఠాపనకెలా సహకరించాలో చేసే బ్రహ్మాండమైన ప్రబోధమిది. నిర్యాణానంతరం పరమాత్మ చేస్తున్నాడిది మనకు మౌనభాషతో.

పోతే ఇక ఆయన జన్మ వృత్తాంతమెక్కడో దశమ స్కంధంలోగాని రాదు. నిర్యాణమెంతో కృష్ణుడి జననం కూడా అంత పరమాద్భుతమైన విషయం. అక్కడ కూడా ఆయన సాక్షాన్నారాయణ తత్త్వం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. భూదేవి దుర్మార్గుల పాపభారం మోయలేనని బ్రహ్మతో పోయి మొరపెడితే ఆయన దేవతలతో సహా క్షీరసాగరానికి వెళ్లి నారాయణమూర్తికి వినకారు చేస్తే ఆకాశంలో ఆయన కొక వాణి వినిపిస్తుంది. అది విని బ్రహ్మ వారితో ఇలా అంటాడు.

వసుదేవ గృహేసాక్షాద్భగవాన్ పురుషః పరః
జనిష్యతే - తత్పూజార్థమ్ సంభవంతు సురస్త్రియః
వాసుదేవ కళానంత స్సహస్ర వదనః స్వరాట్
అగ్రజో భవితా దేవో హరేః ప్రియ చికీర్షయా
విష్ణోర్మాయా భగవతీ యయా సమ్మోహితం జగత్
ఆ దిష్టా ప్రభుణా తేన కార్యార్థమ్ సంభ విష్యతి

సాక్షాత్తూ భగవానుడే వసుదేవ గృహంలో జన్మిస్తాడు. ఆయన కళాంశమైన అనంతుడు బలరాముడుగా అవతరిస్తాడు. యోగమాయ ఆయన కార్యం నెరవేర్చటానికి యశోద కుదయిస్తుంది. దేవతా స్త్రీలంతా స్వామివారి సేవకోసం భూమి మీద గోపికలుగా జన్మించబోతారు.

తరువాత కొంత కాలానికి కంసుడికి ఆకాశవాణి హెచ్చరిక చేయటం వాడు భయపడి దేవకిని వధించబోవటం - వసుదేవుడి ఒప్పందంతో విరమించుకోవటం జరుగుతుంది. అష్టమగర్భం గదా తన వినాశానికి కారణమని బరవసాతో వసుదేవుడు తెచ్చి ఇచ్చిన బిడ్డను గూడా వద్దని పంపుతాడు. కాని నారదుడు సందు చేసుకొని వచ్చి ఒకనాడతనితో వెట్టివాడా వ్రేపల్లెలో ఉండే నందాది గోపకులూ, మధురలో ఉండే వృష్ణి వీరులూ అందరూ భగవత్కార్యార్థ మవతరించిన దేవతలే సుమా - నిన్ననుసరించి ఉన్న జ్ఞాతులంతా అసురాంశలు - నీ వధ కోసమే విష్ణువు స్వయంగా దేవకికి జన్మించబోతున్నాడు. ఆ దేవకీ వసుదేవులను నీవుపేక్షించకుండా బందిఖానాలో పడవేయమని చెప్పి వెళ్లిపోతాడు. వాడికి వెంటనే ఒకటి జ్ఞప్తికి వస్తుంది. **"ఆత్మాన మిహ సంజాతం జానన్ ప్రాగ్విష్ణునా హతం మహాసురం కాలనేమిమ్"** ఇంతకు ముందు విష్ణువుచేత నిహతుడైన కాలనేమి అనే రాక్షసుణ్ణే నేనని గ్రహిస్తాడు వాడు. కాలనేమి అంటే కాలచక్రమే. అదే కంసాకారం. కంస శీలం. ధర్మాధర్మాలు పరివర్తన చెందుతుంటాయి దీనితో. తన్నిమిత్తంగా భగవంతు డవతరిస్తుంటాడు. కాబట్టి కాలనేమి - కంసుడనే పేర్లు కూడా సాభిప్రాయమే.

చూడబోతే ఇదంతా ముందుగానే పరమాత్మ వేసిన పథకంగా కనిపిస్తుంది. లేకుంటే నారదుడు రావటమేమిటి - ఈ దేవ రహస్యాలన్నీ వాడికి చెప్పటమేమిటి.

అంతా భగవల్లీల. భగవానుడొకనాడు వైకుంఠంలో కూచొని తన యోగమాయ నిలా ఆజ్ఞాపిస్తాడు.

దేవక్యా జఠరే గర్భమ్ శేషాఖ్యం ధామ మామకం
తత్సన్ని కృష్య రోహిణ్యా ఉదరే సన్నివేశయ

నా అంశ ఒకటి శేషాఖ్యమైనది దేవకి సప్తమ గర్భంగా ఏర్పడుతుంది. దానిని నీవు సంకర్షణ చేసి నందగోవ్రజంలో దలదాచుకొంటున్న రోహిణి గర్భంలో ప్రవేశపెట్టు. **"అథాహ మంశ భాగేన దేవక్యాః పుత్రతామ్ శుభే ప్రాప్స్యామి"** నేను మిగతా అంశతో దేవకికి అష్టమ గర్భంగా అవతరిస్తాను త్వం యశో దాయాం నంద పత్న్యాం భవిష్యసి నీవు మాత్రం యశోదకు బిడ్డగా జన్మిస్తావు. నిన్ను లోకులు

దుర్గేతి భద్ర కాళీతి - విజయా వైష్ణ వీతిచ
కుముదా చండికా కృష్ణా - మాధవీ కన్యకేతిచ
మాయా నారాయణీ శానా
శారదేత్యం బికేతిచ భజి ష్యంతి

ఈ ఈ సంజ్ఞలతో నిత్యమూ పూజిస్తూ పోతారు.

ఇక్కడ రెండు రహస్యాలు మనం గ్రహించవలసి ఉంది. దేవకి అష్టమ గర్భమే కంసవధకు కారణం. అంతవరకూ కంసుడికి భయంలేదు దానికోసం ప్రతీక్షిస్తున్నాడు వాడు. ఆరు గర్భాలనప్పటికే హతమార్చాడు. ఇక ఏడవ దానికోసం చూస్తుండగా అది యోగమాయ మూలంగా దేవకి నుంచి రోహిణికి రవాణా అయిపోయింది. ఇది తెలియక లోకులంతా ఆవిడ గర్భం దిగజారిపోయందనుకొంటే కంసుడు కూడా అలాగే అనుకున్నాడు. ఇక వచ్చేది భగవదవతారమే కదా అని వెయ్యి కళ్లతో చూస్తుంటే తరువాత అది కూడా తారుమారవుతుంది. ఆ విజ్ఞోడు పడిన బిడ్డనే చూచి వాడష్టమ గర్భమదేనని భ్రమించి విఫల ప్రయత్నుడవుతాడు. ఇదే వైష్ణవ మాయ. ఇంతకన్నా పెద్ద మాయేమంటే రోహిణికి గర్భమెలా వచ్చిందో ఎవరికీ అంతు పట్టకపోవటం. వసుదేవుడికి దూరంగా ఎక్కడో నంద గోకులంలో ఉన్న రోహిణి గర్భం తాల్చట మేమిటి. లోకులను మానించకపోవటమేమిటి. దానికి కూడా ఈ యోగమాయా ప్రభావమే సమాధానం. ఎక్కడికక్కడ భగవన్మాయ పని చేస్తూనే ఉందని భాగవతమే

మనకు సమాధానమిస్తున్నది. యుక్త వయసు వచ్చిన తరువాత దేవకీ వసుదేవుల నొకసారి చూడటానికి వెళ్లి వారు తన మాహాత్మ్యాన్ని ప్రశంసించబోతే వారెక్కడ తాను దేవుడని భావిస్తారో అని **"మాభూదితి నిజామ్ మాయామ్ తతాన జన మోహినీమ్"** సకల జన సమ్మోహిని అయిన తన మాయ వారిమీద ప్రయోగించాడట. దానితో వారు మామూలు కుర్రవాడేనని భావించి మురిసిపోయారట. ఇదుగో ఇలాటి సమ్మోహినీ మంత్రాన్నే వ్రేపల్లెలోని ప్రజలమీద కూడా ప్రయోగించి ఉంటాడు పరమాత్మ. అసలు యోగమాయ జరిపిన కార్యమన్నప్పుడే అది మాయామయం. అది ఈ లోకుల లౌకిక ప్రజ్ఞకంతు చిక్కే వ్యవహారం కాదు. కనుకనే రోహిణీ గర్భ వృత్తాంతాన్ని మామూలు విషయంగానే భావించారు గాని ఎవరు గాని ఇది ఎలాగబ్బా అని లేశమాత్రం కూడా ఆవిడ శీలాన్ని శంకించిన వారు కారు.

ఇది ఒకటి రహస్యం. ఇది అయిన తరువాత మరొక రహస్యమేమంటే కాళి, భద్ర, కామేశ్వరి, దుర్గ, అంబిక అని యోగమాయ కెప్పుడు పేర్లు పెట్టారో అప్పుడావిడ విష్ణుమాయే గాక శివమాయ కూడా అనుకోవలసి వస్తుంది. దుర్గ, అంబిక, కాళి అన్నప్పుడు అవి పార్వతీ పర్యాయాలే గదా. పార్వతి శివశక్తి. ఆవిడ విష్ణుశక్తిది ఎలా అయింది. దీనిని బట్టే చెప్పవచ్చు మనం శివ కేశవులకు భేదం లేదని.

శివాయ విష్ణు రూపాయ - శివ రూపాయ విష్ణవే
యథా శివ మయో విష్ణు - రేవం విష్ణు మయ శ్శివః

అంతేకాదు. **"యథాంతరం నవశ్యామి - తథామే స్వస్తి రాయుషి"** వారిరువురికీ అంతరం చూడరాదంటున్నది వేదవాక్యం. ఇలా శివ కేశవులిరువురూ ఒక్కటే తత్త్వం గనుకనే వారి శక్తులు కూడా భిన్నం కావు. అవీ ఒక్కటే. అందుకే యోగమాయకు వైష్ణవ నామాలు శైవనామాలూ రెండూ చెల్లుబడి అయినాయి. దుర్గ కాళి అంబిక ఇత్యాదులు శైవనామాలైతే, వైష్ణవి నారాయణి, కృష్ణా, మాధవీ ఇలాటివన్నీ వైష్ణవ సంజ్ఞలు. ఒకే శక్తి కలిగిన ఒకే ఒక తత్త్వం గనుకనే బాలకృష్ణునిలోనే శివమూర్తి దర్శించగలిగాడు మహాకవి పోతన. ఆ మాయాశక్తే ప్రస్తుతం కృష్ణ సహోదరిగా జన్మించటం మూలాన్నే పరమ భాగవతులావిడను **"సరసి జనాభ సోదరీ"** అని కూడా సంబోధించి గానం చేశారు. తుదకు శివ పార్వతుల నామం కలలో కూడా

స్మరించటానికిష్టపడని వైష్ణవోత్తములు కూడా వైష్ణవ దుర్గ అనే ఒక కొత్త పేరు పెట్టి ఆ పరాశక్తిని తమ వైష్ణవాలయాల్లో ప్రతిష్ఠించి ఆరాధిస్తూ వచ్చారంటే ఇంతకన్నా ఉభయ మత సామరస్యానికి నిదర్శనమేముంది.

అసలా మాటకు వస్తే ఈ శక్తి ఎవరోగాదు. సాక్షాత్తూ గాయత్రీ మంత్రాధి దేవత. మంత్రార్థమంతా ఆవిడ వ్యవహారంలోనే మనకు స్పష్టంగా బోధ పడుతుంది. సవిత యొక్క వరేణ్యమైన తేజస్సది. సవిత అంటే ప్రపంచ సృష్టికీ తన అవతార సృష్టికీ కర్త అయిన పరమేశ్వరుడే. జ్ఞానాత్మిక కాబట్టి ఆయన శక్తి తేజోరూపిణి, జీవులశక్తిలాగా తమోరూపిణి గాదు. మనబోటి జీవులంతా అజ్ఞాన తిమిరాంధులు కాబట్టి వీరి శక్తికూడా తమోరూపిణే. తమోరూపిణి గనుకనే ఇది మనకు వరణీయ కాదు. వరణీయ ఎప్పటికైనా తేజోరూపిణి అయిన పరమాత్మ శక్తే. అదే భర్గమంటే. దానినెప్పుడో ఏ జన్మలోనో కోలుపోయాము మనం. మరలా దాన్ని పొందే ప్రయత్నం సాగించాలి. అందుకోసం నిరంతరం దాన్ని భక్తి తాత్పర్యాలతో ధ్యానించటం తప్ప మరొక మార్గం లేదు. అలా ధ్యానిస్తే అది మరలా మన బుద్ధులన్నీ తమస్సు నుంచి తప్పించి ఆ తేజస్సువైపుకే తీసుకెళ్లుతుంది. సందేహంలేదు. ఈ గాయత్రీ రహస్యమంతా ప్రస్తుత మీ యోగమాయ ఆవిర్భవించటంలోనూ అంతర్ధానం చెందటంలోనూ గుప్తమయి ఉంది. పరమాత్మ అవతరించటానికి ముందే అవతరించిందాయన తేజోరూపిణి అయిన ఈ మాయ. ఆయన రాకను ముందుగా సూచించింది లోకానికి. దేవకీ గర్భాన్ని సంకర్షణ చేసి రోహిణీ గర్భంలో ప్రవేశ పెట్టటం జీవుణ్ణి ప్రాపించికమైన స్థాయి నుంచి పారమార్థికమైన భూమికకు ప్రచోదన చేయటమే. అది నిత్యమూ మన దగ్గరే ఉన్నా దాని ప్రభవాన్ని మన అజ్ఞానవశాత్తు గుర్తించలేము. దీనికి చిహ్నమే యశోదా నందాదులకు దాని అస్తిత్వాన్ని గుర్తించే స్మృతి లేకపోవటం. పోతే చూచి కూడా తెలుసుకోలేని మూఢులు కొందరుంటారు కంసుడి లాంటివాళ్లు. వాళ్లకది ఎప్పుడూ చిక్కదు. అతీతంగా విహరిస్తుంటుంది. ప్రచోదయంతీ పవనేద్విజాతా అన్నట్టు అంతరిక్షంలోనే సంచరిస్తుంటుందా గాయత్రి. అష్ట భుజాలతో కనపడటం గాయత్రీ లక్షణమే. తుద కావిడ మహత్వాన్ని తెలుసుకొని నిత్యమూ భక్తి శ్రద్ధలతో జపించే వారికి సర్వకామ ప్రదాత్రి అని వర్ణించటంలో కూడా **"ఆయుః**

పృథివ్యాం ద్రవిణం బ్రహ్మ వర్చసమ్ మహ్యమ్ దత్వా" అనే మంత్రోపాసకుల శుభకామన మనకు బాగా వ్యక్తమవుతుంది.

ఈ విధంగా ఈ యోగమాయా వృత్తాంతం గాయత్రీ వృత్తాంతానికి అద్దం పట్టినట్టుగా కనిపిస్తున్నది. భాగవతారంభంలో మనమొక మాట చెప్పుకొన్నాము. వృత్రా సుర వధ - గాయత్రీ మంత్రార్థ వివరణ ఎక్కడ వర్ణించబడతాయో అది భాగవతమని. రెండింటి విషయమూ మొదటి రెండు శ్లోకాలలోనే భంగ్యంతరంగా స్ఫురింపజేశారని కూడా పేర్కొన్నాము. అందులో వృత్రాసుర వధ వృత్తాంతం భాగవత మారవస్కంధంలో నూటిగానే వర్ణించబడింది. పోతే రెండవదైన గాయత్రీ వృత్తాంతమలా సూటిగా ఎక్కడా వర్ణించినట్టు కనిపించదు భాగవతంలో. ఇదుగో ఇక్కడ మనకది భాగవతం ఈ యోగమాయా వ్యాజంతో చాటుగా నిర్దేశిస్తున్నది. నన్ను విరోధం చేసుకొని ప్రయోజనం లేదు. నిజంగా నీకు పరమాత్మ తత్త్వం గ్రహించాలని కోరికే ఉంటే నన్నా లంబనంగా చేసుకో - పరమాత్మ ఎక్కడ ఉన్నాడో నివేదిస్తాను. అలా కాక దూరం చేసుకొన్నావంటే నాకూ పరమాత్మకూ కూడా దూరమవుతావని కంసుడు నెపంగా మనబోటి జిజ్ఞాసు లోకానికంతా చేసే నిగూఢ ప్రబోధమిది.

మొత్తం మీద యోగమాయ హెచ్చరించినట్టుగానే జరిగింది కృష్ణజన్మ. కంసుడి కేమాత్రమూ అంతు పట్టలేదు. అష్టమ గర్భమని తెలియక కాదు కంసుడికి. తెలిసి కూడా ఆ అష్టమమైన గర్భం కృష్ణుడుగా గాక యోగమాయగా దర్శనమిచ్చింది వాడి దృష్టికి. అంతే మరి, రాజస తామసమైన దృష్టితో చూస్తే భగవత్తత్త్వమెలా గోచరిస్తుంది. దానికి మారుగా తదాభాస అయిన మాయే మనకు గోచరమయ్యేది. అలాగే గోచరమయింది కంసుడికి. మాయ కనిపించి మరలా మాయమయింది. పోతే తదా ధారమైన అసలు పదార్థమెక్కడ ఉన్నట్టు. అది ఆ పాటికే దేవకికి జన్మించనూ జన్మించింది. రాత్రికి రాత్రి యశోద వద్దకు చేరనూ చేరింది. అసలది జన్మ అయితే గదా. జన్మ అనుకొంటే జన్మ. కాకుంటే కాదు. నవమాసాలూ దేవకీ దేవి మోసింది ఖాయం. నవమాసాలూ నిండి శిశువు జన్మించిందీ నిజం. కాని పుట్టాడో లేదో వెంటనే పెరిగి పెద్దవాడైన ప్రౌఢ వయస్కుడి లాగా కనిపించాడు తల్లిదండ్రులకు. అది కూడా ఎలాటి రూపంలో కనిపించాడు వారికి.

తమ ద్భుతమ్ బాలక మంబు జేక్షణం
చతుర్భుజం శంఖ గదా ద్యుదాయుధమ్
శ్రీవత్స లక్ష్మం గళశోభి కౌస్తుభం
పీతాంబరం సాంద్ర పయోద సౌభగం

మహార్హవైడూర్య కిరీట కుండల – త్విషా పరిష్వక్త సహస్ర కుంతలమ్
ఉద్దామ కాంచ్యంగద కంకణాదిభి – ర్విరోచ మానమ్ వసుదేవ ఐక్షత

ఇలాటివాణ్ణి దర్శించాడట వసుదేవుడు. అలోక సాధారణమైన ఈ అద్భుత వేషాన్ని వర్ణించటంలోనే తెలుస్తూంది మనకది సాక్షాత్తూ నారాయణ మూర్తేనని. కనుకనే అది చూడగానే వసుదేవుడు **"విది తోసిభవాన్ సాక్షాత్పురుషః పరః"** అని ఆ మూర్తిని పరమపురుషుడుగానే గుర్తించి కీర్తిస్తాడు. తల్లి దేవకి కూడా స్తుతిస్తుంది. అసలంతకు ముందు గర్భంలో ఉండగానే వచ్చి బ్రహ్మేంద్రాది దేవతలంతా గర్భస్థుడైన స్వామినే ఎన్నో విధాలుగా స్తోత్రం చేసిపోతారు. ఇదంతా కృష్ణుడు సాక్షాత్తూ నారాయణుడేనని చెప్పకుండానే చెబుతున్నది లోకానికి.

దేవకీ వసుదేవుల స్తోత్ర పాఠమంతా విని స్వామి దేవకిని చూచి నీవు పూర్వ జన్మలో పృశ్నివి. ఇతడు సుతవుడనే ప్రజాపతి. ప్రజాసర్గం చేయమని మిమ్ములను బ్రహ్మ ఆదేశిస్తే మీరు ద్వాదశ దివ్యవర్ష సహస్రాలు నన్ను గూర్చి తపస్సు చేశారు. నేను ప్రత్యక్షమై వరం కోరమంటే నాలాంటి కొడుకు కావాలని కోరుకొన్నారు. జగన్మోహిని అయిన నామాయ పని చేసి మీరు అపవర్గం కోరలేక పోయారు. దాని ఫలితంగా నేను మీకు మొదటి జన్మలో వృశ్నిగర్భుడనే పేర జన్మించాను. రెండవ జన్మలో అదితి కశ్యపులైన మీకు వామనుడుగా అవతరించాను. ఇప్పుడు దేవకీ వసుదేవులైన మీకు నేను మూడవ జన్మలో ఈ రూపంతో ఆవిర్భవించాను. మీకీ జన్మాంతర స్మృతి కలగటానికే నేనీ అప్రాకృతమైన రూపం మీకు చూపవలసి వచ్చింది. మీరిక మీదట నన్ను పుత్రభావంతోనూ బ్రహ్మభావంతోనూ చూస్తూ తరించండి అని బోధిస్తాడు. చూడండి. భగవదుపదేశం ఇక్కడి నుంచే ఆరంభమయింది. **"వేదాహం సమ తీతాని"** అన్న భగవదుక్తి కిది నిదర్శనం. అతీతా నాగతవర్తమానాలు తెలిసినవాడే సర్వజ్ఞుడు. వాడే భగవంతుడు. పైగా సంసారంలో ఉంటూనే గృహస్థులు తరించే

ఉపాయం కూడా సెలవిచ్చాడు. పుత్ర మిత్ర కళత్రాదుల నందరినీ తత్త్వద్విశేష రూపాలుగా గాక బ్రహ్మరూపంగా దర్శించటమే ముక్తికి త్రోవ - అది నిరూపించటానికే తాను జన్మించటమని కూడా చెప్పినట్టయింది.

తరువాత జరగవలసిన పనులు కూడా వసుదేవుడికి అప్పగించి వారు చూస్తుండ గానే పసిబిడ్డలాగా మారిపోతాడు. ఆయన ఆదేశించినట్టే కారాగృహ ద్వారాలు తెరుచుకొంటాయి. సుదుస్తర అయిన యమున కూడా దారి ఇస్తుంది. యోగమాయా వశీకృతులై దౌవారికులూ, పౌరులూ అంతా గాఢనిద్రలో మునిగి ఉంటారు.

ద్వారస్తు సర్వాః పిహితా దురత్యయా
బృహత్కవాటా ఽయసశృంఖలైః కిల

వసుదేవుడు బయటికి రాగానే ద్వారాలన్నీ యథాపూర్వంగా మూసుకొంటాయి. **"శేషో న్వగాద్ధారి నివారయన్ ఫణైః"** శిశువుకు శీతవాతాది దోషాలు తగలకుండా ఆదిశేషుడు ఫణా మండలం విప్పి గొడుగు పడతాడట. ఇదంతా భగవదను భావ విశేషం గాక మరేమిటి. మరే అవతారంలో ఇలాంటి సంరంభం చూడగలం. వసుదేవుడెప్పుడా యశోద వద్ద బాలుణ్ణి దించిందీ - ఆవిడ నుంచి మాయా కన్య నెప్పుడు కొని తెచ్చిందీ ఇక్కడా అక్కడా ఎవరికీ అంతు పట్టలేదు. రాత్రికి రాత్రి అంతా జరిగిపోయింది. తెల్లవారుజామున బిడ్డ ఏడుపు విని ఉలికిపడి లేస్తారు కావలివారు. అంతకు ముందేడవని బిడ్డ బొట్టు పెట్టినట్టప్పుడే ఏడవటం దేనికి. కంసుడికి వార్త తెలియటమెలా మరి. అందుకే ఆ ఏడుపు. అంత పనీ జరిగింది. కావలి వారు పోయి చెప్పటమూ కంసుడు రావటమూ క్షణాలమీద జరిగింది. అల్లుడు గాడిది మేనగోడలు-నీకు భయం లేదని చెల్లెలెంత మొత్తుకొంటున్నా లెక్క చేయక ఆవిడ చేతిలో నుంచి లాక్కొని పైకెగరేశాడు బిడ్డను. క్రింద కత్తి పట్టాడు దానికి సూటిగా నేలమీద. అది బిడ్డ అయితే గదా క్రింద పడటానికి. భగవన్మాయ ఆమె. **"అదృశ్య తాను జావిష్టో స్సాయుధాష్ట మహా భుజా దివ్యస్ర గంబరా - ధనుశ్మా లేషు చర్మాసి శంఖ చక్ర గదా ధరా"** అష్ట భుజాలతో ధనుశ్చక్రాది దివ్యాయుధాలతో సాక్షాత్కరిస్తుంది - అంతరిక్షంలో. సరిగా ఇది ముక్తావిద్రు మహేమ నీల ధవళ చ్ఛాయైర్ముఖైః అని వర్ణించిన గాయత్రీ మంత్రాధిదేవతే మరేదీ గాదు.

"కిమ్మయా హతయా మంద" ఒరే నన్ను చంపి ఏమి ప్రయోజనంరా మూఢుడా, **"జాతః ఖలు తవాంత కృత్"** నిన్ను చంపే మహానుభావుడొక డీపాటికే జన్మించి ఉన్నాడు. తెలుసుకో అని కంసుణ్ణి హెచ్చరించి మాయమవుతుంది. చూడండి. జన్మించాడని చెబుతుంది గాని ఎక్కడ జన్మించాడో ఎవడో చెప్పదు. ఇదే మాయ అంటే. తెలిసీ తెలియనిదే మాయ. అసలు తెలియక పోలేదిప్పుడు కంసుడికి - కొంత తెలిసిందా మాటలవల్ల. కాని పూర్తిగా తెలియలేదు. వాడికి మనోవ్యథ అయింది. అది భేదించే వరకూ వాడికిక నిద్రాహారాలు లేవు. ఇదే మనగతి కూడా. మృత్యు రహస్యాన్ని భేదించేదాకా మనకూ మథన తప్పదు.

అయితే చిత్రమేమంటే తనకు మృత్యువుందని తెలియక తానే మృత్యువునని భ్రమపడ్డాడు కంసుడు. కాలనేమి గదా కంసుడు.కాలనేమి కాలచక్రమే. కాలమే చక్రాకారంగా తిరుగుతూ ప్రాణులందరినీ పొట్టన పెట్టుకొంటున్నది. అదే కంసుడు చేసిన పని. కనపడ్డ బిడ్డలనందరినీ వధించమని ఆజ్ఞాపించటమదే. తిరుగులేని తన ఆయుధాన్ని భగవంతుడి మీద కూడా చివరకు ప్రయోగింపచూచాడు. ఇదే తెలివితక్కువ. కాలాతీతమైన తత్వాన్ని కాలమేమి చేయగలదు. అయినా తన ప్రయత్నం మానదది. గిర్రుమని తిరుగుతూ తిరుగుతూ ఎప్పుడూ ఏదో ఒకటి భయంకరమైన అనర్థం మన మీద విసురుతూనే పోతుంది. కంసుడు కూడా విసిరాడలాటి ఉపద్రవాలు. ఆ విసురులే పూతనా శకట తృణా వర్తాదులు. పూతన వచ్చి చేతన కోలుపోయింది. తృణావర్తుడు గాలి కెగిరిపోయాడు. శకటాసురుడు నడుములు విరిగి నేలకొరిగాడు. బకాసురా ఘాసురులు గతాసువులయ్యారు. వృషభాసురుడు నోరు తెరచి బావురుమన్నాడు. జితాకాశి అయిన కేశి దానవుడు హతకాశి అయిపోయాడు. వ్యోమాసురుడి ప్రాణాలు వ్యోమమార్గాని కెగిరిపోయాయి. ఇలా కాలనేమి తనపై విసిరిన అసుర శక్తులన్నింటినీ కాలగర్భంలోనే కలిపి వేశాడు పరమాత్మ. ఆ కాలం ధరించిన మరొక రూపమే కాళియుడు. అది ఒక సర్పం. కాలసర్పం. కాలమే సర్పరూపంగా దాగిఉంది. ఎక్కడ కాళింది మడుగులో. మడుగు కాదది సంసారమనే మహాహ్రదమే. ఇందులో తెలియక పడ్డ ఎవరినైనా కాలమనేది అంతమొందించేదే. అయితే సర్వమూ తెలిసిన పరమాత్మనది ఏమి చేయగలదు. అప్పటికీ అవివేకంతో చుట్టుకొన్నది. సహస్ర ఫణాలు విప్పి విషం గ్రక్కింది. కాని

విషాని క విషయమైన తత్త్వమని తెలియదు దానికి. వెంటనే మేనుపెంచాడు కృష్ణుడు. పాదాలు పైకెత్తాడు. నర్తనక్రియ కుపక్రమించాడు. అయోఘనాలవంటి ఆ పాదాల అవఘాతానికది నుగ్గు నూచమయింది. ఇలా కాల కళలన్నిటినీ శిక్షించి చివరకు కాలాన్నే శిక్షించదలచాడు భగవానుడు. దాని మొదటి పరివారం చాణూర ముష్టికులు. ఒకటి ఊరుబలం. మరొకటి ముష్టి బలం. కామక్రోధాలే ఇవి. మొదటిది కామానికైతే రెండవది క్రోధానికి సంకేతం. ఈ ద్వంద్వాలను జయిస్తే రెండవ పరివార మొకటున్నది. కువల యాపీడం. కువలయమంటే భూవలయం. భూవలయాన్నంతా ఎలా పడితే అలా పీడించేది. కుత్సితంగా వలయం అంటే చుట్ట చుట్టు కొంటూ పోయేది. అదే అన్ని అనర్థాలకూ మూలమైన అవిద్యా పిశాచి. పెంజీకటి లాటి నల్లని రూపం దానిది. వచ్చి మీద పడటమే తప్ప మరేమీ తెలియదు దానికి. పట్టి పాలార్చాడు దాన్ని కృష్ణ పరమాత్మ.పోతే ఇక మూడవది ఆఖరిది ఒక్కటి. అదే కాలచక్రం. కంసుడి రూపంలో ఎదట కనిపిస్తున్నది. అంతవరకూ మారు లేక మసలుతున్నది. ఒక్క దెబ్బతో దాన్ని జుట్టు పట్టి తమగం మీదినుంచి క్రింది కీడ్చి అంతమొందించాడు కృష్ణుడు. అంటే కాలానికే కాలుడయ్యాడన్న మాట. **కాలోస్మి లోక క్షయకృత్ప్రవృద్ధః** అని గదా భగవద్వాక్యం.

ఇలా దుష్టులనే గాదు భగవానుడు శిష్టులను కూడా ఒక విధంగా శిక్షిస్తూ వచ్చాడు. శిక్షించటమంటే ఇక్కడ దండించటం కాదు. బోధించటం కావచ్చు. అనుగ్రహించటం కావచ్చు. కృష్ణుడు మన్ను దిన్నాడని పిల్లలంతా వచ్చి చాడీలు చెప్పారు తల్లి యశోదకు. అన్నా మన్నేల మరి పదార్థము లేదే అని తల్లి మందలించింది. అమ్మా మన్ను దినంగ నేశిశువునో ఆకొంటినో వెఱ్ఱినో అంటాడు కుమారుడు. నిజమే. ఆయన శిశువు కాదు. ఆకలి దప్పులున్న వాడూ కాదు. జీవులలాగా వెఱ్ఱివాడూ కాదు. సర్వజ్ఞుడైన భగవానుడు వెఱ్ఱివాడెలా అవుతాడు. ఆకలి దప్పులేమి టాయనకు. అయితే ఎందుకు తిన్నాడు మన్ను. యశోద కోసమే. తింటే గాని పిల్లలు వెళ్ళి చెప్పరు. చెబితే గాని ఆవిడ పిలిచి చీవాట్లు పెట్టదు. పెడితే చెబుదామనుకొన్నాడు. ఏమిటి. **"కాదేనిన్ మదీయాస్య గంధ మ్మాఘ్రాణము చేసి నా వచనముల్ తప్పైన"** దండించమని. అంటూనే నోరు తెరిచాడు. ఏముంది ఆ నోటిలో. మన్నూకాదు మశాన్యమూ కాదు. జలధి పర్వతవన భూగోళ శిఖితరణి

శశి దిక్పాలాది కరండమైన బ్రహ్మాండం కనిపించింది. అది కలో వైష్ణవ మాయో తెలియక ఉన్నట్టుండి జ్ఞానోదయమై **"ఏ మఱితిమి గాని ఈశుడీతడు మాకున్"** అని అర్భకుని ఈశ్వరత్వాన్ని గ్రహిస్తుందాతల్లి. ఇలా సుకుమారంగా యశోదకు బోధిస్తాడు తన మహత్త్వాన్ని. మరొకమారు తల్లి తన అల్లరి భరించలేక ఉలూఖలానికి కట్టి పడవేస్తే దాన్ని ఈడ్చుకొంటూ రెండు మద్ది చెట్ల మధ్యనుంచి ప్రాకిపోతాడు. అవి రెండూ విరిగిపడి నలకూబర మణిగ్రీవులనే గంధర్వుల రూపంలో కనిపించి ఆయనకు నమస్కరించి వెళ్లిపోతారు. శాపగ్రస్తులైన దేవతల నానెపంగా అనుగ్రహిస్తాడు పరమాత్మ.

పోతే బ్రహ్మేంద్రాది దేవతలనూ నారదాది మహర్షులను కూడా ఎంతో సౌమ్యంగా శిక్షిస్తాడు పరమాత్మ. అఘాసురుడి బారి నుండి గోగోప బాలురను కాపాడగలిగాడని మహత్త్వమెట్టిదో పరీక్షించి చూడాలని బ్రహ్మ ఎవరికీ తెలియకుండా వచ్చి వారందరినీ తీసుకుపోయి రహస్యంగా ఎక్కడో దాచాడు. తరువాత కృష్ణుడు వెతికి చూస్తే ఎక్కడా కనిపించలేదు. అదంతా విధివంచన అని తెలుసుకొని కృష్ణుడు. **"ఉభ యాయిత మాత్మానమ్ చక్రే విశ్వ దృగీశ్వరః"** విశ్వ రహస్యమంతా ఎఱిగిన ప్రోడ కాబట్టి గోగోపకుల ఉభయరూపాలూ తానే తన మాయాబలంతో ధరించి ఎవరికీ ఏ మాత్రమూ అనుమానం తగలకుండా సంచరిస్తూ వచ్చాడు. ఈ రీతిగా ఒక సంవత్సరం కాలం గడచిపోయింది.

ఏవమ్ విమోహయన్ విష్ణుమ్ విమోహం విశ్వమోహనం
స్వయైవ మాయ యా ఒజోపి స్వయమేవ విమోహితః

విశ్వమోహనుడైన పరమాత్మనే మోహితుణ్ణి కావింపబోయి తానే తదీయ మాయచేత మోహితుడయ్యాడు పితామహుడు.

ఉత్థాయోత్థాయ కృష్ణస్య చిరస్య పదయోః పతన్
ఆస్తే మహత్త్వం ప్రాగ్దృష్టం - స్మృత్వా స్మృత్వా పునః పునః

వెంటనే వచ్చి కాళ్లమీద పడి అంతకు ముందు యుగాంత కాలంలో తాను చూచిన భగవద్విభూతినంతా జ్ఞాపకం చేసుకొని పునః ప్రణామం చేసి క్షమాపణ చెప్పుకొని వెళ్ళిపోతాడు. ఏమిటీ సన్నివేశం. ఏమి చెబుతుంది మనకు. బ్రహ్మకు

తాను సకల జగత్కర్త నని అహంకారమున్నది. తానే విష్ణు నాభి కమలం నుంచి సృష్టి అయిన వాడు తనకన్నా సృష్టి కర్త లేడని అహంకరించటమేమిటి. నీ సృష్టి ఎంత నీవెంత నేనిచ్చినదే గదా నీకాశక్తి - నీతో సహా ఈ చరాచర జగత్తునంతా సృష్టించినవాడను నేను-కావలసి వస్తే చూడు నా మహిమ అని తన అఘటన ఘటనా పటీయసి అయిన ఐశ్వర్యశక్తిని తార్కాణ చేయటమిది. దీనితో చతుర్ముఖుడికి సహజంగా ఉన్న రజోమాలిన్యం పోయి సత్త్వగుణ మలవడాలని కూడా ఇది ఒక ప్రబోధమే.

పోతే దేవేంద్రుడి దింకా రాజసమైన ప్రవృత్తి. బ్రహ్మకు సృష్టి కర్తననే అభిమాన ముంటే ఇతడికి సృష్టి అయిన ఈ త్రిలోకాలనూ పాలించే అధికారం నాదే గదా అనే దురభిమానముంది. దానిని కూడా వదలించాలనుకొన్నాడు భగవానుడు. నందాదులు ఏటేటా చేసే ఇంద్రోత్సవం అక్కరలేదని వారించాడు. **"తస్మాద్గవాం బ్రాహ్మణానా - మద్రేశ్చా రభ్యతామ్ మఘుః"** దాని బదులు గోవులకు, బ్రాహ్మణులకూ గోవర్ధనాద్రికీ ఉత్సవం జరపమని బోధించాడు. **"ఏతన్మ మ మతం తాత క్రియ తాం యది రోచతే"** ఇది నా అభిప్రాయం మీ కిష్టమైతే చేయండి అని చెబుతాడు. సరేనని వారాయన చెప్పినట్టుగానే చేస్తారు. ఇంద్రుడి కెక్కడ లేని ఆగ్రహం వచ్చి ఆగమేఘాలుగా వర్షం కురిపిస్తాడు. వవృషుర్జల శర్కరాః ఏకధారగా శిలావర్షం కురుస్తాయి మేఘాలు. దానికి భయకంపితులైన వ్రజనివాసి ప్రజలనందరినీ చూచి కృష్ణుడు గోవర్ధనాద్రిని ఒంటి వ్రేలితో పైకెత్తి

బాలుండీతడు కొండ దొడ్డది మహాభారంబు సైరింపగా
జాలం డోయని దీని క్రింద నిలువన్ శంకింపగా బోకు-డీ
శైలాం భోనిధి జంతు సంయుత ధరాచక్రంబుపై బడ్డనా
కేలల్లాడదు బంధులార నిలుడీ క్రిందన్ ప్రమోదంబునన్

అని ఆహ్వానిస్తాడు. వెంటనే వారంతా దానిక్రింద తల దాచుకొని ఆ జల ప్రళయాన్ని దాటి సుఖిస్తారు. అది చూచి విస్మితుడైన దేవేంద్రుడు **"నిస్తంభో భ్రష్ట సంకల్పః స్వయం మేఘాన వారయత్"** గర్వభంగం చెంది మేఘమండలాన్ని ఉపసంహరించి వెళ్లుతాడు. దేవగణాలన్నీ ఆకాశం నుంచి స్తోత్ర పాఠాలు చేస్తూ

స్వామి వారి మీద పుష్పవర్ణం కురిపిస్తారు. దీనిని బట్టి గ్రహించవలసిన సత్యమేమంటే సృష్టించటానికి గాని, రక్షించటానికిగాని సకల శక్తి సంపన్నుడైన పరమాత్మకు తప్ప మరెవ్వరికీ ఆ అధికారం లేదు. ఇంద్రాది దేవతలు ఆయా అధికారాలలో ఉన్నా వారి అధికారాలు పరిమితమే. అది తెలిసి మెలగితే వారు వివేకవంతులు, లేకుంటే వారికైనా గర్వభంగం కాక తప్పదు. తమ కార్యం కోసమే పరమాత్మ అవతరించాడని తెలిసి దేవకీ గర్భంలో ఉండగానే వచ్చి ఆయనను స్తుతించిన వారయికూడా బ్రహ్మాదులహంకరించారంటే అది ఎంతటి అవివేకమో గదా. అలాటి అహంకారం మానవులకెలా పనికిరాదో దేవతలకూ పనికిరాదు. కేనోపనిషత్తులో ఇలాటిదే ఒక ఆఖ్యాయిక వస్తుంది. పరమాత్మ అనుగ్రహంవల్ల కలిగిన విజయం తమ విజయంగా భావించి గర్వించారు దేవేంద్రాదులు. అప్పుడు వారికంతు పట్టని ఒక అద్భుతాకారం సాక్షాత్కరించి అగ్ని వాయ్వాది దేవతలకు గర్వభంగం చేసి వారికి కనువిప్పు కలిగిస్తుంది. అలాటి నేత్రోన్మీలనమే ఇక్కడా జరిగింది బ్రహ్మాదుల విషయంలో

పోతే నారదాది మహర్షులను కూడా పట్టి చూస్తాడు భగవానుడు. పదహారువేల రాజ కన్యలతో ఎలా విహరిస్తాడో ఆయన వైభవాన్ని పరీక్షించి చూడాలనే కుతూహలంతో బయలుదేరిపోతాడు నారదుడు ద్వారకా నగరానికి. వెళ్లి చూస్తే ఒక్కొక్క చోట ఒక్కొక్క తీరులో సాక్షాత్కరిస్తాడు శ్రీకృష్ణుడు. **"తత్రాస్యా చష్ట గోవిందం - లాలయంతం శిశూన్ సుతాన్"** ఒకచోట పిల్లల నాడిస్తుంటాడు. **తతోఽన్యస్మిన్ గృహే ఽపశ్య న్మజ్జనాయ కృతోద్యమమ్** - ఒకచోట స్నానానికి లేవబోతుంటాడు. క్వాపి సంధ్యా ముపాసీనమ్ జపంతం బ్రహ్మ వాగ్యతం - ఒకచోట గాయత్రి జపిస్తూ సంధ్యా వందనం చేస్తుంటాడు. **మంత్ర యంతంచ కస్మింశ్చి న్మంత్రి భిశ్చోద్ధ వాదిభిః** మరొకచోట ఉద్ధవాదులైన మంత్రులతో మంత్రాంగం నడుపుతుంటాడు ఇలా ఒకటని లేదు. ఒక్కొక్క ఇంట్లో ఒక్కొక్క కృష్ణవిగ్రహం సాక్షాత్కరించే సరికి మతిపోతుంది నారదుడికి. పైగా ఆయన కెదురువచ్చి భగవానుడు తాము పూర్ణకాములై అపూర్ణకాముడనైన నన్ను దర్శింపవచ్చారా అని ప్రశ్నిస్తాడు. ఈ ప్రశ్నలోనే ఉన్నదెంతో మర్మం. పూర్ణకాముడు పరమాత్మ. ఆయన కుండగూడదిక ఏ కోరికా. అయినా అన్నీ అనుభవిస్తూ కనిపిస్తున్నాడు తాను. అపూర్ణ కాముడు నారదుడు. అయినా పూర్ణకాముడిలాగా పైకి కనపడుతున్నాడు. పైకలా కనపడుతున్నా కుతూహలం

ఎక్కడికి పోతుంది. కనుకనే పూర్ణకాముడైన పరమాత్మనే పరీక్షించాలని వచ్చాడు. ఎంత గంభీరమైన మాటో ఇది.

ఇలా శిష్టులను కూడా శిక్షిస్తూ వచ్చాడు భగవానుడు. అది వారి కప్పుడప్పుడు కలిగే అహంకారాన్ని అభిమానాన్ని చాపల్యాన్ని పోగొట్టి పరిశుద్ధమైన సత్త్వగుణాన్ని వారికి ప్రసాదించి తత్త్వప్రబోధం చేయటమే తప్ప మరేదీగాదు అందులో కూడా ఒక చమత్కారముంది. సహజంగా పామర స్వభావులైన వారికందరికీ అలౌకికమైన మహిమలు ప్రదర్శిస్తాడు. మరి వివేక విజ్ఞానవంతులైన పెద్దలకు అలాటి లీలలేవి ప్రదర్శించకుండా మామూలుగానే వ్యవహరిస్తాడు. యశోదాదులకు విశ్వరూపాది లీలలు చూపటమూ, భీష్మవిదురాదుల కవి ఏమీ చూపక సహజంగా కనిపించటమూ గమనిస్తే తెలుస్తుంది. అది ఒక లీలా భేదం. తెలిసినవారికి నిదర్శనమక్కరలేదు. తెలియని వారికే కావాలది. ఏదో అలౌకికమైన దృశ్యం చూపితే గాని వారికి విశ్వాస మేర్పడదు. అందుకే ఈ ప్రదర్శన. ఒకప్పుడు తెలిసినవారు కూడా వ్యామోహంలో పడవచ్చు. అప్పుడు వారికి మరలా జ్ఞానోదయం కలిగించటానికి కూడా పనికి వస్తుంది ప్రదర్శన.

మరొకప్పుడు తనకన్నీ తెలిసి కూడా ఏమీ తెలియనట్టు కేవల మానవ మాత్రుడుగా వ్యవహరించడం కూడా కద్దు. అది కూడా ఒక లీలా భేదమే. మనకెంత శక్తి సామర్థ్యాలున్నా ప్రయోజనం లేదు. అది ఫలించటానికి కూడా ఒక కాలమంటూ ఉంది. ఏది ఎప్పుడెలా జరగాలో దానికెవరు నిమిత్తం కావాలో అది విశ్వ నియామకమైన ఒకానొక శక్తివల్లనే ఏర్పడుతుందా ప్రణాళిక. ఎంతవాడైనా దాని ననుసరించి పోవలసిందేనని మాటలతో గాక చేతలద్వారా తన జీవితానికే అన్వయించి లోకులకు చూపటమెంత చమత్కారం. లేకుంటే జరాసంధుణ్ణి తాను వధించలేనివాడా. అతడు తరుముతూ పోతే ఇరువది మార్లు పరుగెత్తి పోవటమేమిటి. అందుకోస మన్నివైపులా ద్వారాలూ, కవాటాలూ గల ఒక పట్టణాన్ని నిర్మించుకొని కాపురముండటమేమిటి. అది ఒక నటన. కాలాంతరంలో భీముడిచేత చంపించి పాండవుల కా ప్రతిష్ఠ దక్కించాలనే ఈ ఉపేక్ష. కాలయవనుడనే రాక్షసుడిరువది ఒక్క దినాలు తన కోట ముందు పాగావేశాడు తాను బయటికి వస్తే పట్టుకోవాలని. వాడి ధాటికి భయపడినట్టుగా లోపల దాగి ఉండి సమయం రాగానే మెల్లగా

అడుగులో అడుగు వేసుకొంటూ కోట దాటి వెళ్లి పోతుంటాడు. వారు గమనించి వెంటబడి తరిమితే వాణ్ణి ఎలయించుకొంటూ పోయి ఒక కొండ గుహలోకి జొరబడుతాడు. వాడూ జొరబడి చూడబోతే ఎక్కడా ఐపులేడు. ఇంతలో వాడి ఎదుట ఒక ఆజానుబాహుడైన పురుషుడు పడుకొని గురకపెట్టి నిద్రపోతుండటం చూస్తాడు. వాడే కృష్ణుడనుకొని కాలితో తన్నుతాడు. అతడెవరో కాదు. ముచికుందుడు. కోపంతో అతడు కండ్లు తెరచి చూడగానే వీడు నిలువునా భస్మమై నేల రాలుతాడు. ఏమిటీ సన్నివేశం. కాలయవనుడు వాడు. కాలం తీరితేగాని చావడు. తీరిందప్పటికి. దానికి నిమిత్తమయ్యాడు తన భక్తుడు ముచికుందుడు.

మరొక కథ శ్యమంతకోపాఖ్యానం. సూర్యోపాసన చేసి సత్రాజిత్తు సంపాదించిందా శ్యమంతకం. అపురూపమైనదే గాక అది ఎన్నో బారువుల బంగారాన్ని ప్రసవిస్తుంది ప్రతిదినమూ, దానిని వద్దంటున్నా మెడలో ధరించి సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనజిత్తు వేటకు పోతాడు. అడవిలో వేటాడుతుంటే ఒక సింహం వచ్చి వాణ్ణి వధిస్తుంది. దాన్ని వధించి భల్లూకరాజు జాంబవంతు డామణిని తీసుకొని తన నివాసానికి పోయి కూతురు జాంబవతికిస్తాడు. ఇది ఇలా జరిగిందని తెలియక సత్రాజిత్తు కృష్ణుడే తన తమ్ముని చంపి మణి నపహరించాడని పుకారు పుట్టిస్తాడు. అది పాపుకోటానికి కృష్ణుడు స్వయంగా అడవికి పోయి జాంబవంతుని అడుగు జాడలను బట్టి అతని గుహలో ప్రవేశించి అతనితో యుద్ధం చేసి ఓడిస్తాడు. జాంబవంతుడాయన తన ఇష్టదైవమే నని గ్రహించి కన్యారత్నాన్నీ ఇచ్చి పంపుతాడు. అది తెచ్చి సత్రాజిత్తు కిస్తే అతడు సిగ్గపడి క్షమాపణ చెప్పుకొని తానూ తన కన్యనూ శ్యమంతకాన్నీ రెండింటినీ అప్పగించి బహుమానంగా సాగనంపుతాడు. చూడండి ఎలాంటి మనోహరమైన సన్నివేశమో ఇది. ఎంతవారికైనా అపవాదు తప్పదని – మనమింతవారం కదా అని తామసించక నెమ్మదిగా దాన్ని తొలగించుకొనే యత్నం చేయాలని చేస్తే వచ్చిన అపవాదు పోవటమే గాక అనేక విధాల లోకుల మెప్పుకూడా పడయవచ్చుననీ ఎంత గొప్ప సందేశమో ఉంది. ఇలా మానవోచితంగా ప్రవర్తించటంలో కూడా తన దివ్య సందేశంతో లోకుల ఉద్ధరణకే బద్ధకంకణుడవుతాడు పరమాత్మ.

ఇంతకన్నా అతీతమైన దివ్యసందేశ మందించాడాయన గోపికలతో చేసిన విహారంలో. దీనిలో ఎంత దివ్యత్వముందో దానికి భిన్నంగా అంత దుర్విమర్శకు

గురి అయింది లోకంలో. ఇది భాగవతం – భగవంతుడి చరిత్ర అని కూడా చూడకుండా ఎవరికి తోచినట్టు వారు చాలా తేలికగా మాటాడుతున్నారు. మరి నాస్తికులనూ హేతువాదులనైతే అసలు మనం పట్టనేలేము. ఇంత గాలి దుమారం దీనిమీద లేచినట్టు మరి దేనిమీదా లేవలేదు. సకల కల్యాణ గుణసంపన్నుడూ సర్వలోకా దర్శభూతుడూ అయిన భగవంతుడేమిటి – పరస్త్రీ లోలుడయి అహోరాత్రాలూ వారితో యధేచ్ఛగా క్రీడించటమేమిటి. అది మనమెంతో పవిత్రమైన కథా వస్తువుగా కనుల కద్దు కోవటమేమిటని వీరి ఆక్షేపణ. ఆ మాటకు వస్తే ఈ ఆక్షేపణ ఇప్పుడీ రోజుల్లో మనబోటి పాఠకులం గాదు. భాగవత కథా శ్రవణం చేస్తున్న పరమ భాగవతుడు పరీక్షిత్తే లేవనెత్తాడు. దానికి సమాధానమిస్తూ శుకమహర్షి

"నృణాం నిశ్రేయసార్థాయ – వ్యక్తిర్భగవతో భువి
అవ్యయస్యా ప్రమేయస్య – నిర్గుణస్య గుణాత్మనః
నచైవమ్ విస్మయః కార్యోభవతా భగవత్యజే"

నీ విందులో ఆశ్చర్యపడనక్కరలేదు. అగుణుడయి కూడా భగవానుడు సగుణుడుగా భాసిస్తున్నాడంటే అది మనబోటి జీవుల ననుగ్రహించటానికే. యోగీశ్వరేశ్వరుడాయన. ఏది చేసినా ఆయనకు దాని గుణదోషాలేవీ అంటవు.

అసలిది నీవుగాదు. కృష్ణుడే వేశా డీప్రశ్న గోపికలను. **"ప్రతి యాత వ్రజమ్ నేహ స్థేయం స్త్రీ భిస్సు మధ్యమాః"** మీరిక్కడ ఉండరాదు. వెళ్లిపోండి. **మాతరః పితరః పుత్రా భ్రాతరః పతయశ్చవః** మీకు తల్లీ దండ్రీ భర్తా బిడ్డలూ ఉన్నారు గదా. **"భర్తృ శుశ్రూషణం స్త్రీణాం పరోధర్మో హ్యమాయయా"** భర్త పరిచర్యే కులస్త్రీలకు సనాతనమైన ధర్మం. **"దుశ్శీలో దుర్భగో వృద్ధో"** ఏలాటివాడైనా సరే కట్టుకొన్న నాథుణ్ణి కాదనరాదు. **"జుగుప్సితం చ సర్వత్రహ్యౌప పత్యం కులస్త్రియః"** కులస్త్రీ అయిన దానికి మిండతిక మనేది మహాపాతకం. అని మందలిస్తే కర్ణకఠోరమైన ఆ మాటలు విని గోపికలు.

"మైవం విభోర్హతి భవాన్ గదితుమ్ నృ శంసం
సంత్యజ్య సర్వ విషయాం స్తవ పాద మూలం
భక్తా – భజస్వ దురవగ్రహ – మా త్యజాస్మాన్
దేవో యథాది పురుషో భజతో ముముక్షూన్"

స్వామీ మీరిలాంటి మాటలనకండి. మేము వినలేము. ప్రాపంచికమైన సర్వ విషయాలూ పరిత్యజించి మీ పాద మూలాన్ని సేవించటానికి వచ్చాము. మీరు మమ్ములను విడిచి పెట్టకండి. ఆది పురుషుడు తన్నాశ్రయించిన ముముక్షువులను రక్షించినట్టు మమ్ము రక్షించండి. **"పతులన్ బిడ్డల బంధులన్ సతులకున్ పాటించుటే ధర్మ పద్ధతి యౌ నంటివి దేహ ధారిణులకున్ ధర్మజ్ఞ చింతింపుమా పతిపుత్రాదిక నామమూర్తి వగుచున్ భాసిల్లు నీయందు - తత్పతి పుత్రాదిక వాంఛలం జలిపి సంభావించుట న్యాయమే"** అని జవాబిస్తారు. అప్పుడు యోగీశ్వరేశ్వరుడైన కృష్ణుం డాత్మా రాముండై వారలతో రమించాడట.

ఈ ప్రశ్నోత్తరాలను మనం బాగా పరిశీలించి చూస్తే భాగవత హృదయమేదో చక్కగా తేటపడుతుంది. అసలీ ప్రశ్నలూ లేవు. ఉత్తరాలూ లేవు. ఇది భాగవత కథలో వేసినవి కావు. కథ వినే మనలాటి పాఠకులు వేసే ప్రశ్నలివి. మనబోటి వారికి పురాణ ఋషి ఇచ్చుకొనే సమాధానాలవి. ఋషి అంటే క్రాంతదర్శి అని గదా చెప్పాము. క్రాంతదర్శి గనుకనే భూత భవిష్యద్వర్తమానాలలో ఏ కాలంలో మానవుడి కెలాటి సంశయం రావచ్చునో ముందుగా ఊహించి తానే సమాధాన మిస్తాడు. అలాగైతేనే దానిమీద మానవులకు విశ్వాస మేర్పడుతుంది. పరిపూర్ణమైన విశ్వాసం కుదిరితేనే గాని సాధన మార్గంలో పయనించలేడు మానవుడు. కనుకనే ఆయా కథా సన్నివేశాలు కల్పించి మనకు కలిగే ఆశంకలన్నింటినీ పరిహరిస్తూ పోతాడు మహర్షి. ఇక్కడ జరిగిన పరిహారమేమిటని అడగవచ్చు. గోపికలు కృష్ణుడని మనం బాహ్యార్థం తీసుకొని బాధపడుతున్నాము. ఆంతర్యాన్ని పరిశీలిస్తే అసలు గోపికలూ లేరు. కృష్ణుడూ లేడు. పురాణ కథలన్నీసంకేతాలనే విషయం మనం మరచిపోరాదు. సత్యాని కల్లుకున్న సంకేతమే కథ. సత్యమేమిటిక్కడ. గోపికా కృష్ణులంటే జీవేశ్వరులు. వారి రాసక్రీడాదులు జీవేశ్వరుల తాదాత్మ్యమే. గోపికా విరహమనేది ఈశ్వర సాయుజ్యం కోసం జీవుడు పడే వేదన. మరి కృష్ణుడు వారిని నిష్కారంగా మాటాడటం ఉన్నట్టుండి తిరోహితుడయి పోవటం మరలా సాక్షాత్కరించటం ఇవన్నీ జీవుల కీశ్వరుడు పెట్టే పరీక్షలే. దానికి తట్టుకొని నిలిచామన్నప్పుడే వారికా ఈశ్వరానుగ్రహ లాభం. ఈ రహస్య భావమే శుకుడి మాటలలో చివరకిలా చాటుతాడు మహర్షి. **"గోప జనములందు గోపిక లందును**

– సకల జంతులందు సంచరించు నా మహాత్మునకు – పరాంగన లెవ్వరు – సర్వమయుడు గాన సలిపె లీల" ఇది అన్నిటికీ కలిపి ఇచ్చే సమాధానం.

మొదటి నుంచీ శ్రీకృష్ణ లీలలన్నీ ఈ ఆధ్యాత్మిక రహస్య భావనతోనే సాగుతూ వచ్చాయి. వాటి నలాగే సమర్థిస్తూ వచ్చాడు పురాణ ముని. గోపికా వస్త్రాపహరణ మేమిటి లేకుంటే. సర్వేశ్వరుడు చేశాడు కాబట్టి సరిపోయింది గాని మరొకడైతే అది ఒక రౌడీ చేష్ట అనవలసిందే గదా. తన సర్వేశ్వరత్వాన్ని వారికి తెలపటానికే చేశాడా పని కృష్ణుడు. కృష్ణుడంటే కర్షించేవాడు – లాగివేశేవాడని అర్థం. ఏమిటా లాగవలసింది. మానవులకున్న దేహాత్మాభిమానం. అది ఉన్నంత వరకూ మనం గోపికలమే. గోపాయితు మిచ్ఛతీతి గోపికా అని శబ్ద వ్యుత్పత్తి. తన్ను దాచుకోవాలని ప్రయత్నించటమే గోపనం. అలా గోపనం చేసుకొనేది గోపిక. అంటే దేహాభిమానమున్న జీవుడు. వాడికి దేహమే ఆత్మ అనే భావముంది. కనుక దానికి బాహ్యమైనదంతా వాడికి వ్యతిరిక్తమే. వ్యతిరిక్త మెప్పుడయిందో అప్పుడది తన్ను చూస్తుందేమోనని భయం. **"యావద్ధి భయ మధ్యస్థో ఽనిత్యమాత్మానమ్ మన్యతే – తావద్గోపాయితు మిచ్ఛత్యా త్మానమ్"** ఎంతదాకా ఈ అనిత్యమైన ఆత్మనే చూస్తూ భయ మధ్యస్థుడై ఉంటాడో అంతదాకా తన రూపాన్ని కప్పి పుచ్చుకోవాలనే చూస్తాడు జీవుడు. **"యదాతు నిత్య మద్వైత మాత్మానమ్ విజానాతి"** నిత్యమైన అద్వయాత్మ స్వరూపాన్ని ఎప్పుడర్థం చేసుకొంటాడో **"తదాకః కిమ్ కుతోవా గోపాయితు మిచ్ఛేత్"** అప్పుడెవడు దేన్ని దేని నుంచి దాచుకోవాలని కోరుతాడు. అని ఈ ఆధ్యాత్మిక భావాన్ని అద్భుతంగా వివరించారు భగవత్పాదులు.

ఇదుగో గోపికల వ్యవహారం కూడా ఇదే. వారి వస్త్రాల నపహరించాడు కృష్ణుడంటే అవి వస్త్రాలు కావు. వారి దేహాత్మాభిమానాలే. అవే వస్త్రాల మాదిరి వారిని కప్పి ఉన్నాయి. దానితో వారు తాము వేరు పరమాత్మ వేరనే భావంతో ఆయా దేవతల పూజలూ, వ్రతాలూ చేసి ఏదో సాధిద్దామని యత్నిస్తున్నారు. అది వృథా ప్రయాస దానిలో సిద్ధిలేదని తెలపటానికే వస్త్రాపకర్షణం చేశాడు కృష్ణుడు. వారు బయటికి వచ్చి ప్రాధేయపడితే గాని ఇవ్వనంటాడు. అంటే దేహాభిమానం వదులుకొని సర్వమూ నేననే అద్వైతాత్మ భావంతో చూచినప్పుడే ఇస్తాను – అప్పుడీ వస్త్రాలు ధరించినా వాటితో తాదాత్మ్యముండదు కాబట్టి ఫరవాలేదని భావం. కనుకనే

వారు రావటానికి సంకోచిస్తుంటే కృష్ణుడు వారిని చూచి అనే వాక్యాలు వినండి – ఎలాంటి అర్థమిస్తున్నవో.

"శృంగార వతులార సిగ్గేల మిముగూడి పిన్న నాటను గోలె పెరిగినాడ
ఎఱుగనే మీలోన నెప్పుడు నుండుదు – నేనెఱుంగని మర్మమేమి గలదు"

పైకి చూస్తే ఇది పరమబూతు. కాని లోతుకు దిగి చూస్తే అంతా తాత్త్విక రహస్యమే. **"ఈశ్వర స్సర్వభూతానా"** మన్నట్టు అందరి హృదయాలలోనూ ఉన్నదా తత్త్వం. అది మనం పుట్టినప్పటి నుంచీ మనలో చోటు చేసుకొనే ఉంది. నిజంలో దానికి తెలియని మర్మం మనలో ఏమున్నదని. ఇక అది మన స్వరూపాన్ని చూచిందని సిగ్గు పడటమెందుకు. మన స్వరూపమే అది గదా ఎంత వేదాంతార్థమో చూడండి.

ఈ గోపికలు నగ్నంగా జలకాలాడటమూ – గట్టున వారి చీరలుంచటమూ అవి కృష్ణుడెత్తుకొని పోవటమూ, ఈ సన్నివేశం ఒక ప్రతిబింబమైతే దీనికి బింబభూతమైన సన్నివేశం మనకు భాగవతారంభంలోనే కనిపిస్తుంది. శుకమహర్షి ముందు పోతుంటే వ్యాసుడతని వెంటబడి పోతున్నపు డప్సరసలు దారిలో ఒక సరోవరంలో ఇలాగే జలకమాడుతుంటారు. నీళ్లమీద నగ్నంగా ఈదుతున్నారో, తేలుతున్నారో శుకుడు పట్టించుకోలేదు. అటు చూడను కూడా లేదా యోగీశ్వరుడు. అదే వ్యాసుడటు బయలుదేరి వచ్చేసరికి వారు హడావుడిగా వచ్చి వస్త్రాలు ధరిస్తారు. వ్యాసుడది తనకవమానంగా భావించి అడిగితే వారాయన కిచ్చిన సమాధానమేమిటి. మనకు తెలుసును గదా. సరిగా అలాంటిదే ఇక్కడ కూడా సమాధానం. యోగేశ్వరుడైన శుకుణ్ణి చూచే అప్సరసలు భయపడకుంటే యోగేశ్వరేశ్వరుడైన కృష్ణుణ్ణి చూచి మాత్రం భయపడటం దేనికి గోపికలు. ఈ గోపికలా అప్సరసలే గదా వాస్తవంలో. వారే గదా ఈ రూపాలతో జన్మించారు భగవత్సంకర్యం కోసమని.

అంచేత గోపికా వస్త్రాపహరణమూ కాదు. వారితో రాసక్రీడాదులూ కావవి. జీవుల అభిమాన ధనాన్ని అపహరించటమే వస్త్రాపహరణం. విశుద్ధ సత్త్వులైన ఆ జీవులకు తన సాయుజ్యాన్ని ప్రసాదించటమే రాసక్రీడ. **"రసోవైసః"** రస స్వరూపుడు పరమాత్మ. జీవుడూ రసస్వరూపుడే. వారి అన్యోన్యాత్మ భావమే రాసక్రీడ. గోపిక లెప్పుడో గ్రహించా రీరహస్యాన్ని. గోపికలు గ్రహించారో లేదో గాని పోతన

దానినెంతగానో శోధించి పట్టుకొని మనకొక పద్యంలో బయటపెట్టాడు. ఉన్నట్టుండి అంతర్ధితుడైన కృష్ణుడెటు వెళ్లాడో ఎక్కడ దాగాడో దిక్కు తెలియక ఓపికలు కోలుపోయిన గోపికలీచెట్టూ ఆ పుట్టా పట్టుకొని మొరపెట్టే పద్యమది.

"నల్లనివాడు - పద్మ నయనంబుల వాడు - కృపారసంబుపై
జల్లెడు వాడు మౌళి పరిసర్పిత పింఛము వాడు - నవ్వు రా
జిల్లెడు మోము వాడొకడు - చెల్వల మానధనంబు దెచ్చె - నో
మల్లియలార ! మీ పొదల మాటున లేడు గదమ్మ చెప్పరే"

ఇది ఒక దొంగను వర్ణిస్తున్నదో పరమాత్మను వర్ణిస్తున్నదో ఏమైనదీ తెలియని చాలా చిత్రమైన పద్యం. నల్లని వాడన్నప్పుడు దొంగే వాడు. దొంగ మొగం నలుపని కూడా అంటారు లోకులు. కాకపోయినా నల్లని ముసుగు వేసుకొని తిరుగుతాడు గదా దొంగ. రాత్రి అంతా మేలుకొని ఉంటాడు కాబట్టి వాడి నయనాలు పద్మాల లాగానే ఎఱ్ఱబారి ఉండటంలో ఆశ్చర్యం లేదు. ఎవరైనా మేలుకొంటే ప్రమాదమని వారు మత్తుగా పడిపోవటానికి ఏదో రసచూర్ణం వారిపైన చల్లటం కూడా సహజమే. అంతేగాక గారడీ వాడిలాగా ఒక నెమలి పింఛం కూడా కళ్లమీద అటూ ఇటూ తిప్పి కనుకట్టు చేసే దొంగలు కూడా కొందరుంటారు. మరి దొంగతీకం చేసి కూడా ఏమీ చేయనట్టు తెల్లవారి నలుగురిలో నవ్వుముగం పెట్టి నిర్భయంగా తిరిగినా ఆశ్చర్యం లేదు. లేదా దొంగిలించిన ధనం ఎక్కడో దాచి ఏ పొద మాటునో దాక్కొని కూచున్నా కూచోవచ్చు. పైగా ఒకడట వాడు. ఒకడంటే ఎవడో ఒకడు. వాడు ఫలానా అని గుర్తించలేని వ్యక్తి. దొంగ మనకు నేను ఫలానా అని చెప్పి చేస్తాడా దొంగతనం. ఎప్పుడూ వాడు మనకంతుపట్టనివాడే. ఇవన్నీ దొంగ లక్షణాలే. ఒకటి కూడా దొర లక్షణాలు లేవిందులో. అందుకే తమ ధనం యావత్తూ కోల్పోయిన ఆ యువతులు బాధపడుతున్నారు. మీరైనా చూచి ఉంటే వాడి జాడ తెలిపి మమ్మల్ను కాపాడమని ఓ మల్లియలారా అని వాపోతున్నారు.

ఇది గోపికల వాపోవటం కాదు. భగవత్తత్త్వాన్వేషణ పరాయణుడైన ఒక సాధకుడి ఆక్రందన. ఆధ్యాత్మికమైన భావాన్ని అధిభౌతికమైన భూమికలో మరుగుపరిచి చెప్పాడు మహాకవి. అది భేదించగలిగితే దొంగ లక్షణాలుగా భాసించేవన్నీ నిజంలో

దొర లక్షణాలే ననిపిస్తాయి. కాకపోయినా దొంగ ఎవడో గాదు. కృష్ణుడే గదా. గోపికల దృష్టిలో ఆయన దొరేగాని దొంగ కాదు. కృష్ణుడంటే నల్లనివాడే మరి. నీలమేఘశ్యాముడు గదా. పద్మ నయనంబుల వాడు. కమలాక్షుడు పుండరీకాక్షుడని గదా ప్రసిద్ధి. మరి శిరసుపైన మయూర పింఛమూ ముఖంలో మందహాసమూ, ఆశ్రితుల మీద దయారసాన్ని చిందించటమూ, కృష్ణుడికి సహజ లక్షణాలే. చెల్వల మాన ధనాన్ని చూఱలాడటమూ వారి నేడిపించటానికి మాయమై పోవటమూ కూడా సహజమే ఆ రసికా వతంసుడికి.

పోతే అది కూడా కాదు కవి వివక్షితం. ఈ కృష్ణ వర్ణనలో కూడా దాగి ఉన్న ధ్వనిస్తున్న ఒకానొక పరతత్త్వ భావన. అదీ మనం పరిశోధించి పట్టుకోవలసిన ఆధ్యాత్మిక రహస్యం. ఏమిటది. నల్లనివాడు. గగనంలాగా నల్లని దాతత్త్వం. గగనం దూరానికి నల్లగానే కనిపిస్తుంది. కాని దగ్గరికి వెళ్లి చూస్తే ఆ నలుపక్కడ లేదు. అది ఒక దృగ్భ్రమ. వస్తువులో లేని గుణం మన దృష్టి ఆరోపిస్తున్నది. అలాగే పరమాత్మకు వాస్తవంగా ఏ గుణమూ లేదు. ఏ రూపమూ లేదు. ఆయన నొక కృష్ణుడని రాముడని మన మూహిస్తున్నా మొక రూపంలో. మరి పద్మ నయనంబుల వాడు. నిర్గుణడైనా నిరాకారుడైనా ఆయన తన మాయాశక్తిచేత ఈ సృష్టినంతా తయారుచేసి దీన్నిలా నడుపుతున్నాడు. నయనమంటే నడపటమే. పద్మాలీ బ్రహ్మాండ భాండాలు. మండలాకారంగా ఉన్నాయివి. ఆది మధ్యాంతాలు మూడు ఒక్కటే. వేటికవి తానే. తన స్వరూపమే అది. పైపైన మనకందని సీమలో ఉండే ఆ రసాన్ని మనపైన చల్లుతున్నాడు. మనకందిస్తున్నాడు. అయితే మనమందుకోలేకపోతున్నాము. కారణం మౌళి పరిసర్పిత పింఛము వాడు. ఆయన మౌళిగాదిది మన మౌళి. మన బుద్ధులచుట్టూ తిప్పుతున్నాడు తన మయూర పింఛాన్ని. అది రంగు రంగుల పింఛం. **"అజామేకామ్ లోహిత శుక్ల కృష్ణామ్"** త్రివర్ణాలంటే త్రిగుణాలే. త్రిగుణాత్మక అయిన మాయే అది. అది త్రిప్పితే తిరుగుతున్నాయి మన బుద్ధులు. ఈ పరిభ్రమించే బుద్ధుల కా శుద్ధ బుద్ధ ముక్త స్వభావమైన తత్త్వమెలా బోధ పడుతుంది. అందుకే నవ్వురాజిల్లెడు మోమువాడు. అది మీ స్వరూపమై కూడా మీరు గ్రహించలేకపోయారే పైగా ఎక్కడో దూరంగా దాగి ఉందని వెతుకుతున్నారే ఏమిటి మీ అవివేకమని పరిహసించట మది. అదేమిటి పరమాత్మ ఈ జీవాత్మ ఎలా అవుతాడని అడిగితే

సమాధానమిస్తున్నాడొకడు అని. ఒకే ఒక చైతన్యమయినప్పుడది ఇక జీవుడేమిటి దేవుడేమిటి. జీవేశ్వరులనేది మన భ్రాంతి. ఈ భ్రాంతికి మూలం మనదగ్గరే ఉంది. అది మాన ధనం. దేహాత్మాభిమానమని అర్థం. అది ఒక ధనంలాగా దాచుకొని ఉన్నాము మనం జీవితాంతమూ. అందుకే మనం గోపికలం. అది మనం వదులుకోనంత దనుకా ఆ తత్త్వమిక్కడే ఉన్నా ఎక్కడో దాగి ఉన్నట్టే మన కదృశ్యం. అది మరలా దృశ్యం కావాలంటే ఈ సృష్టిలో కనిపించే ప్రతి పదార్థాన్నీ అడుగుతూ పోవాలి మానవుడు. అడిగితే ఈ నామరూపాత్మకమైన పదార్థాలన్నీ వాడి సృష్టే కాబట్టి ఫలానా అని వాడి స్వరూపాన్ని మనకు మౌనభాషలో సూచిస్తాయి. అయితే ఈ భాషను భేదించి తెలుసుకోగలిగి ఉండాలా తత్త్వ రహస్యాన్ని. లేకుంటే అది అక్కడే ఉన్నా మనకు తెర మరుగే.

చూడండి. ఎంత గంభీరమైన భావమో. పైకి ఆధిభౌతికంగా కనిపిస్తున్నా లోపల ఆధ్యాత్మికమైన తత్త్వమెలా ప్రవహిస్తున్నదో. ఇంకా చమత్కార మేమంటే మహాకవి కలం నుంచి ఇలాంటి పద్యమే మరొకటి వెలువడింది. పదజాలంతో సహా ఎత్తుగడతో సహా ఇలాగే నడుస్తుంది చాలా వరకది. ఇది కృష్ణవర్ణన అయితే అది రామవర్ణన. రామకృష్ణుల కుండే తేడా తెలిసేలాగా సాగిన వర్ణన అది. నల్లనివాడు పద్మ నయనంబుల వాడు. రాముడూ నల్లనివాడే. పద్మ నయనముల వాడే. నల్లని వాడంటే రూపంలోనే కాదు. గుణంలో కూడా. నల్ల అంటే మంచి అని కూడా అర్థముంది. చాలా మంచి గుణాలున్నవాడు. మానవోత్తముడని గదా రామున్ణి వర్ణించారు పెద్దలు. పద్మనయనుడు కూడా ఆయన. పద్మ నయనుడంటే సూర్యుడని కూడా అనుకోవచ్చు. ఉజ్జ్వలమైన సూర్యవంశంలో జన్మించాడు రాముడు. మహా శుగంబులున్ విల్లును దాల్చువాడు. తన ఆభిజాత్యానికి తన గుణగణాలకూ తగినట్టు ధనుర్బాణాలు ధరించాడు. క్షాత్రధర్మాన్ని సూచిస్తుందీ మాట. దుష్టనిగ్రహం చేసి ప్రజలకు క్షేమకరంగా పరిపాలన సాగించటమే గదా ఉత్తమ క్షత్రియులు పాటించవలసిన కర్తవ్యం. కడు విప్పగు వక్షము వాడు. అయితే దానికి తగిన బలపరాక్రమాలు కూడా ఉండాలి క్షత్రియుడికి. "వ్యూఢోరస్కో వృషస్కంధః" అన్నట్టు అలాంటి శరీర సౌష్ఠవం కూడా అలవడిన వాడని భావం. నిక్కిన భుజంబుల వాడని చెప్పటం కూడా దీనికి సూచకమే. మేలుపై జల్లెడు వాడనటంలో శిష్ట

రక్షణం గోచరిస్తుంది. పోతే యశంబు దిక్కులం జల్లెడువాడు నైన రఘు సత్తముడిచ్చుత మాక భీష్టముల్. ఇలాటి గుణసంపద ఉన్నవాడికే యశస్సంపద. వాడే లోకుల కభీష్ట ఫలప్రదాత కాగలడు. ఉత్తమ మానవ మానవేంద్రోచితమైన వర్ణన ఇది. మానవాతీతమైన వర్ణన ఇంతకు ముందరిది. అది నివృత్తి ధర్మ స్వరూపాన్ని - ఇది ప్రవృత్తి ధర్మస్వరూపాన్ని లోకులకు సూచించటానికి మహాకవి చేసిన చిత్రరచన.

మొత్తంమీద భగవత్తత్త్వాని కెక్కడి కక్కడ అద్దం పట్టినట్టే కనిపిస్తుంది గోపికలు చేసే ప్రతి ఆలాపనలో. ఇలాటి భగవల్లీలనే అక్రూరుడు కూడా దర్శించి ఎంతగానో కీర్తిస్తాడు.

"కలలం బోలెడి పుత్ర మిత్ర వనితా గారాది సంయోగముల్
జల వాంఛారతి నెండ మావులకు కాంక్షల్ సేయు చందంబునన్
తలతున్ సత్యములంచు మూఢుడ - వృథా తత్త్వజ్ఞుడన్ నాకునీ
విల సత్పాద యుగంబు జూపి కరుణన్ వీక్షింపు లక్ష్మీపతీ"

అక్రూరుడు యాదవుల కులపెద్దలలో ఒకడు. విభీషణుడి లాంటి స్వభావ మతనిది. భీషణుడు కానివాడు విభీషణుడైతే క్రూరుడే మాత్రమూ కాని వాడక్రూరుడు. అలాంటి వాడి నతిక్రూరుడైన కంసుడొక క్రూరమైన పనికి నియోగించాడు. ధనుర్యాగమనే నెపంతో రామకృష్ణులను తీసుకురా వారి పని నేను చూచుకొంటానని పంపుతాడు. అతడు కాదని చెప్పలేదు.ఇదీ ఒక దైవ చేష్టితమే నని నిర్లిప్తతతో బయలుదేరి బృందావనం చేరుతాడు. రామకృష్ణులను దర్శించి రాజాదేశమందిస్తే మందహాసం చేస్తూ వారతని వెంట బయలుదేరుతారు. దారిలో యమునా నదిలో దిగి స్నానం చేసి అతడు లేచి నిలబడగానే ఆ నీళ్లలో కనిపిస్తారు రామకృష్ణులు. ఇదే మా రథంలో కదా ఉన్నది వారీ నీళ్లలోకి ఎప్పుడు వచ్చారా అని చూస్తే మరలా రథంలోనే కనిపిస్తారు. ఇలా మార్చి మార్చి అక్కడా ఇక్కడా కనిపించటం చూడగా అప్పుడర్థమవుతుందాయన కెక్కడా ఉన్నది పరమాత్మే మరేదీ లేదని. అప్పుడు చేసిన స్తోత్రమిది. అద్వైత భావమంతా పుణికి పుచ్చుకొన్న పద్యమిది. మానవుడి శరీర మనః ప్రాణాదులతో సహా మనదీ అనుకొన్న సర్వమూ నిజంలో మనది కాదు. అవన్నీ కలలో చూచిన వస్తువుల లాంటివే. ఒక్కటీ నిజంగాదు. అనవసరంగా

అవి యథార్థమని నమ్మి ఎండవమావుల కోసం పరిగెత్తే లేడి కూనలలాగా పరుగెత్తుతున్నారు మానవులు. అంతకన్నా మౌఢ్యం లేదు. తత్త్వమేదో తెలియక తత్త్వాభాస కోసం పెనగులాడటం మౌఢ్యం కాక ప్రౌఢి ఎలా అవుతుంది. మరి తత్త్వమేమిటి. అది ఎలా దొరకుతుంది. అదే లక్ష్మీపతి. నామ రూపాత్మకమైన జగత్తంతా లక్ష్మి అయితే దీనికి మూలమైన పదార్థం కాబట్టి అది ఈ లక్ష్మికి పతి. ఇది నామరూపాత్మకమైతే అది అనామం. అరూపం. అంటే అవిషయమైన మన ఆత్మచైతన్యమే. ఇలాటి చైతన్యమే నని పట్టుకోవాలి దాన్ని. పట్టుకోటానికేమిటి ఆలంబనం. ఆయనగారి పాదయుగమే. అంటే ఈ నామరూపాలే. **"పద్యతే ఆభ్యామితి పదమ్ - పదమేవ పాదమ్"** దేని ద్వారా తత్త్వాన్ని చేరగలమో అది పాదం. అది ఈ నామరూపాలు రెండే. అవి ఎక్కడో అందరానిచోట లేవు. విలసత్ - వివిధ పదార్థాలలో మనచుట్టూ ఎక్కడ పడితే అక్కడ లసత్ - ప్రకాశిస్తూనే ఉన్నాయి. వీటిని పలకరిస్తే చాలు. దాని గుట్టు మనకు బయటపెడుతాయి. అయితే ఎంతో చిత్త సంస్కారముండాలి దానికి. అది లేకుంటే దాన్ని ఎలాగైనా ప్రసాదించమని ఆ తత్త్వాన్ని వేడుకోవాలి మనం. అదే లక్ష్మీపతీ నాకు నీ విలసత్పాద యుగంబు చూపమని వాపోతున్నాడు అక్రూరుడు. మనమూ అక్రూర చేతస్కులమై ప్రార్థిస్తేనే మనకది ప్రసాదిస్తాడు పరమాత్మ.

ఇలా చూస్తూ పోతే కృష్ణుడు పుట్టి పెరిగి చేసిన చేష్టలన్నీ మానవోచితం కావు. అవి మానవాతీతమైనవి. జన్మలేని ఈశ్వరుడే లోకంలో జన్మించి ఏ వ్యవహారమూ లేని ఈశ్వరుడే నలుగురితో వ్యవహరిస్తే ఎలా ఉంటుందో చూడాలంటే దానికి కృష్ణజననం దగ్గరి నుంచీ ప్రతిఒక్కటీ నిదర్శనమే. ప్రతి ఒక్కటీ ధర్మ సంస్థాపన కోసమే. అదే గదా అవతార ప్రయోజనం. దుష్టనిగ్రహ మొకవైపయితే శిష్టానుగ్రహం మరొకవైపు. ఎవరెవరిని ఎప్పుడంతమొందించాలో ఒక ప్రక్క ఆలోచన. మరొక ప్రక్క ఎవరి నెప్పుడెలా ఉద్ధరించాలో విచారణ. ఉద్ధవుడికాయన చేసిన ఉపదేశ మాయన శిష్ట జనానుగ్రహంలో ఆఖరిది. చివర ఇక నిర్యాణమయి పోయే క్షణంలో జరిగిందది. ఆ నిర్యాణం కూడా ఎంత పరమాద్భుతంగా సాగిన వ్యవహారమో మనకర్థం కాదు. అసలాయన బంధు మిత్రాదులకే గాదు. భార్యా పుత్త్రులకే గాదు. ఏ ఒక్కరికీ అంతుపట్టలేదు. పట్టనీయలేదాయన. అదీ ఒక లీలే. లేకుంటే

మహర్షులెవరో తన్ను దర్శించటానికి రావటమేమిటి. ఎవరో యాదవ కుమారులు చేసిన ఆగడానికి వారా వంశాన్నంతా శపించటమేమిటి. ఆ వంశమెవరిది. తనదే గదా. తన దర్శనార్థం వచ్చినవారు తన వంశానికే ఎసరు పెట్టటమేమిటి. పెట్టినవారు వారైతే గదా. వారినెపంతో తానే పెట్టాడా ఎసరు. దానితో యాదవులంతా ఒక నలుసు మిగలకుండా తన కళ్ల ఎదుటనే చెల్లిపోయారు. ఇంకా ఒకరిద్దరు శేషించారని తెలిసి తానే వారిని నిశ్శేషం చేశాడు కూడా. తల్లిదండ్రులకు తానెక్కడికి వెళ్లేదీ చెప్పలేదు. అదేమంటే అర్జునుడికి కబురంపాను. వాడువచ్చి అన్నీ చూస్తాడని చెబుతాడు వారికి. షోడశ సహస్రాంతఃపుర కాంతలున్నారు. ఒక్కరికీ చెప్పలేదు. చివరకంత ప్రాణపదంగా భావించిన రుక్మిణికి గాని సత్యభామకు గాని ఒకరికీ తెలియదాయన ఎక్కడికి వెళ్లాడో. ఎక్కడికో ఏమో. మార్గమధ్యంలో బలరాముడనుజ్ఞ తీసుకొని వెళ్లిపోతాడు. యోగమార్గంలో శరీర త్యాగం చేసి ముందుగా పోయి ఆయనకు పానుపు సవరిస్తుంటాడు. దారుకుడు వచ్చి రథం తెస్తాను స్వామీ అంటే ఇంకా రథమేమిటి వెళ్లి పొమ్మంటే ఆ రథమూ దాని పరికరాలూ ఆకాశంలోకి ఎగిరిపోయి అంతర్ధానమవుతాయి. ఇంకా ముందు సాగిపోతుంటే అప్పుడెదురవుతాడు ఉద్ధవుడు. ఎన్నాళ్ల నుంచి కనిపెట్టుకొని ఉన్నాడో ఏమో స్వామి ఏకాంతం కోసం. అది అయాచితంగా ఇప్పుడు లభించిందా మహానుభావుడికి. అడగవలసిందంతా అడిగాడాయనను. చెప్పవలసినదంతా చెప్పాడాయన. సెలవు తీసుకొని వెళ్లిపోయాడు.

ఇక జరగవలసిందేమిటి. ఒక్కటే. అది నిర్యాణం. ఇంతవరకూ అందరి నిర్యాణమూ జరిపాడు. ఇక తన నిర్యాణం తానే చూచుకోవలసి ఉంది. నిందలేనిది బొంది పోదని దానికొక బోయ నిమిత్తమయ్యాడు. సరిగా గురిచూచి ఆయన బొటనవ్రేలినే కొట్టాడు. దానికే వచ్చి తగిలింది బాణం. మహాపచారం మన్నించమని కాళ్లావేళ్లా పడ్డాడు. ఏది అపచారం ఏది ఉపచారం భగవానుడికి. ఆయన ప్రణాళికలో అది లేకపోతేగా వాణ్ణి తప్పు పట్టవలసింది. తెలియక వాడు కంగారు పడ్డాడంత మాత్రమే. స్వామివారి కది ఎప్పుడో తెలుసు. తెలిసే అది నిమిత్తంగా శరీరం వదిలేశాడు. తెలిసి వచ్చాడు. మరలా తెలిసి పోయాడు. ప్రతి ఒక్కటీ తెలియక చేయటానికి జీవుడు కాదు గదా. దేవుడాయె. దేవుడు గనుకనే జన్మ మొదలుకొని

మరణం దాకా అన్నీ తెలిసే జరిపాడు. తానే అన్నాడు గదా అర్జునుడితో **"వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున -భవిష్యాణిచ భూతాని మాంతు వేద నకశ్చన"** అర్జునా ఆది మధ్యాంతాలు మూడూ కరతలామలకంగా నాకు తెలుసుగాని నన్నెవడూ తెలియడు సుమా.

దీనికి తగినట్టే ఆయన జీవించి తమ మధ్య తిరుగుతున్నంతవరకూ తెలియలేదు పాండవులకు. ఆయనా తమ బంధుకోటిలో ఒకడని భావించారు. మహా అయితే ఆపద్రక్షకుడైన ఒక మహానుభావుడని మాత్రమే వారాయన నర్థం చేసుకొన్నది. అంతకు మించి పరమాత్మ అనే జ్ఞానం వారికి కలగలేదు. అడపా దడపా కలిగినా అది అప్పటికప్పుడే మరలా మంచు పొరలాగే విరిసిపోతూ వచ్చింది. పోతే ఆయన జీవించి ఉండగా గ్రహించలేని రహస్యం వారాయన మరణానంతరం గ్రహించ గలిగారు. అర్జునుడు ద్వారకకు వచ్చి స్వామి వారిని వెతుక్కుంటూ పోతాడు. పోగా పోగా ఎక్కడో సాగర తీరాన దర్శనమిస్తుందాయన మృత కళేబరం. కృష్ణుని కళేబరం చూస్తానని కలలో కూడా అనుకొని ఉండ డర్జునుడు. దానిమీద పడి ఎంతగానో విలపిస్తాడు. ఎంత విలపిస్తే ఏముంది. అయిందేదో అయిపోయింది. ఇక జాగు చేస్తే సముద్రం ముంచి వేస్తుంది పట్టణాన్ని. దారుణమైన ఈ వార్త చెప్పకుండానే మభ్యపెట్టి అవరోధ జనాన్నంతా హస్తినకు తరలిస్తాడు. అడవి దారిలో దొంగలు వచ్చి మీద పడితే గాండీవముండి బాణాలుండి కూడా వారికి జవాబు చెప్పలేకపోతాడు. అప్పుడే గ్రహిస్తాడు మొదటినుంచీ తన గొప్ప ఏమీ లేదంతా ఆ ఈశ్వరుడిదే నని. నెమ్మదిగా అందరినీ రాజభవనం దగ్గరికి పట్టుకువచ్చి అక్కడ బయటపెట్టాడు మెల్లగా స్వామి వారి చావు కబురు. దుఃఖాక్రాంతలైన కాంతలంతా చితానలంలో దూకి పతి ననుగమిస్తారు. ఇదంతా ఏమిటీ ఘోరమని విస్తుపోయి చూస్తున్న ధర్మజునికి శ్రవశ్శూలాయ మానమైన వార్త చెవిన వేస్తాడు. **"మన సారథి మనసచివుడు - మన వియ్యము మన సఖుండు మన బాంధవుడున్ మన విభుడు గురుడు దేవర - మనలను దిగనాడి చనియె"** నని వాపోతాడు. మన మన అని మన మనుకోవలసిందే. ఆయన అనుకోలేదింతకూ. ఆయనకు మనలేదు. తనలేదు. అసలు తనువే లేదాయనకు రావటానికి. వచ్చినట్టు పోయినట్టు నటన. ఎందుకా నటన. **"బలహీనాంగులకున్ బలాధికులకున్ ప్రత్యర్థి భావోద్యమంబులు కల్పించి**

వినాశము న్నెఱిపి ఈ భూభారముం బాపి నిశ్చల వృత్తింగృతకార్యుడై చనియె" ఆయన తాను చేయవలసిన కార్యమొకటే ఒకటున్నది. అది ఈ భూభారాన్ని పాపటం. భారమేమిటి. పాపటమేమిటి. భార మధర్మ విజృంభణ. దాన్ని పాపటమంటే ధర్మ ప్రతిష్ఠాపనమే. అది దుష్టశక్తులను శిక్షించటమూ, శిష్టులను రక్షించటం ద్వారానే జరగవలసి ఉంది. అలాగే జరిపాడు వెళ్ళాడా సర్వేశ్వరుండచ్యుతుండలఘుం డేమిని చెప్పుదున్ అంతా భగవదా యత్తమే మన ప్రజ్ఞ ఏమీలేదని ఆక్రందన చేస్తాడు.

నిజంగా పాండవుల ప్రమేయమేమీ లేదు. **'కర్తా కారాయితా చైవ'** అన్నట్టు అంతా ఆ పరమేశ్వరుడే. ఊరక వారు నిమిత్తమాత్రులే. అందుకే **"చంచద్గర్వుల ధార్త రాష్ట్రుల ననిం జంపించి గోవిందు డిప్పించెన్ రాజ్య"**మని చెప్పటం. చంపించిందీ ఇప్పించిందీ ఆయనే. చివరకు మూడశ్వమేధ యాగాలు చేయించి పాండవుల కఖండమైన కీర్తిని కల్పించింది కూడా ఆయనే. ఇప్పించె, కల్పించె అనే క్రియాపదాలే చెబుతున్నాయి అంతా కృష్ణగారడే, పాండవుల పరాక్రమమేమీ లేదని. పాండవుల పరాక్రమమే అయితే అభిమన్యుడి ప్రాణాలు పోకుండా కాపాడుకోలేరా. పరీక్షిత్తు పిండాన్ని రక్షించలేరా. భగవంతుడుపేక్షించిన వాణ్ణి ఎవరు గానీ రక్షించలేరు. రక్షించదలచిన వాణ్ణి ఎవరు గానీ శిక్షించలేరు. ఇవి రెండూ ఈ రెండు ఘట్టాలలో చూడనే చూచారు పాండవులు. చివర కవసానంలో అన్నిటికి దాఖలా చూడగలిగారు. ఇక చేయవలసినదేముంది జీవితంలో. **"సంసార మేవం నిస్సారమ్ దృష్ట్వాసార దిదృక్షయా ప్రవ్రజంతః"** అన్న అభియుక్తోక్తి ననుసరించి మహావైరాగ్యంతో ఇక మహాప్రస్థానం చేయటమొక్కటే మిగిలి ఉంది. అంతకుముందే యదువంశ విధ్వంసమూ కృష్ణ నిర్యాణమూ రెండూ విని వారి తల్లి కుంతి మార్గాన్ని అవలంబించి కృష్ణ ధ్యానం చేస్తూ తనువు చాలించింది. మహాభక్తుడు విదురుడు తీర్థ యాత్రాగతుడైన వాడా వార్త మైత్రేయుని వల్ల ఆలించి యోగమార్గంతో తనువు చాలించాడు. ఇందరికి నేర్పిన వైరాగ్యం పాండవులకు మాత్రం నేర్పక పోతుందా భగవన్నిర్యాణ వార్త. వారూ ద్వాపర నిర్గ మనమూ కలియుగాగ మనమూ అప్పుడే చూసి మనసులో రోసి దారి తీశారు ప్రస్థానానికి. ఎవరికి వారు **'యచ్ఛేద్వాఙ్మనసీ'** అన్న రీతిలో యోగ సమాధిగతులై ప్రాణత్యాగం చేశారు. ఇంతకూ జీవిత కాలంలోనే కాక పరమాత్మ నిర్యాణానంతరం కూడా తన ఆశ్రితులకు జ్ఞానవైరాగ్యాల నుపదేశిస్తూనే

వచ్చాడు జీవితంలో వాగ్రూపంగా నైతే జీవితానంతరం మౌనరూపంగా. నిర్యాణం జీవితం కంటే ఇంకా బలంగా ప్రభావం చూపింది ఆశ్రితుల స్వభావం మీద.

అయితే ఇదంతా మన వ్యామోహమే గాని అసలు పరమాత్మ జీవించటమేమిటి. మరణించటమేమిటి. ఆ మాటకు వస్తే అసలాయన జన్మించనే లేదు. జన్మ లేనపుడిక జీవితమూ నిర్యాణమనే మాటలకర్థమే లేదు. అజుడు, అచ్యుతుడూ అయిన వాడెలా జన్మిస్తాడని. జన్మించకనే పోతే దుష్ట శిక్షణాది కర్మమెలా చేస్తాడని. రెండూ అబద్ధమే. కనుకనే భాగవతావ తరణంలోనే ఇలా వ్రాస్తున్నాడు వ్యాస భగవానుడు.

ఏవం జన్మాని కర్మాణి - హ్యకర్తు రజన స్యచ
వర్ణ యంతిస్మ కవయో - వేదగుహ్యాని హృత్పతేః

జననము లేక కర్మముల జాడల బోక సమస్త చిత్తవ
ర్తనుడగు చక్రికిం గవు లుదార పదంబుల జన్మ కర్మము
ల్వినుతులు సేయుచుండుదురు - వేద రహస్యములందు నెందు జూ
చిన మతి లేవు జీవునకు జెప్పిన కైవడి జన్మ కర్మముల్

జన్మ కర్మ అనేవి భగవానుడి కెప్పుడూ లేవు. ఉండటానికి వీలు లేదు. ఆయన అజుడూ, అవ్యయుడూ పైగా సమస్త చిత్తవర్తనుడైన చక్రి ఆయన. **"యః పృథివ్యామ్ తిష్ఠన్"** అని చాటుతుంది అంతర్యామి బ్రాహ్మణం. గీత కూడా చెబుతుంది. **"ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే ఽర్జున తిష్ఠతి"** అని అన్నింటిలోనూ ఉండి అన్నింటి లోపలా వెలపలా వ్యాపించి వాటన్నిటినీ త్రిప్పుతూ ఉన్నదదే అయె. చక్రి అనే మాట ఎంతో సార్థకంగా ప్రయోగించాడు మహాకవి. భ్రామయన్ సర్వభూతాని అన్నప్పుడు చక్రంలాగా త్రిప్పేవాడనే గదా అర్థం. అలాంటి సర్వవ్యాపకుడూ సర్వాత్మకుడూ అయిన వాడెలా జన్మిస్తాడని. అయితే రామకృష్ణా ద్యవతారా లెత్తాడని చెప్పటమేమిటి. ఎత్తాడని చెబుతున్నదెవరు. వేదవ్యాసాదులైన కవులు. కవీశ్వరులు కాబట్టి గొప్ప గొప్ప వర్ణనలు చేస్తూ వచ్చారు పుట్టాడని చేశాడని. అవి వారి పొగడ్తలే గాని నిజంలో పరమాత్మ పుట్టాలేదు, చేయాలేదు. శాస్త్రంలో ఎక్కడ ఏ వాక్యం తడవి చూచినా జీవుడికి లాగే దేవుడికి జన్మాదులు లేవనే మనకు చాటుతుంది. జీవుడికే లేనప్పుడిక నిత్యముక్తుడైన ఈశ్వరుడికి చెప్పటం హాస్యాస్పదం.

అలాంటప్పుడు కృష్ణుడిక దేవకీ వసుదేవులకు జన్మించటమూ వట్టిదే. ఆయన చేసిన కంసవధాది కార్యాలూ వట్టిదే.

అంతా వట్టిదే అయితే మరి ఈ లోకాలన్నిటినీ ఎవడు సృష్టించాడు. ఈ జీవుల నెవడు సృష్టించాడు. ధర్మసంస్థాపన కోసమని ఈ అవతారాలన్నీ ఎవడు ధరించాడు. అంతా వట్టిదని కొట్టివేస్తే మరివన్నీ కొన్ని గాకపోయినా కొన్నైనా కనిపిస్తున్నాయి గదా. అనుభవాన్ని ఎలా కాదనగలం. అని ప్రశ్న వస్తుంది. దానికి సమాధానమిస్తున్నాడు.

"సవా ఇదం విశ్వ మమోఘ లీలః సృజత్యవ త్యత్తి - న సజ్జతే ఽస్మిన్
భూతేషు చాంతర్హిత ఆత్మ తంత్రః షాడ్వర్గికం జిఘ్రతి షడ్గుణేశః"

భువన శ్రేణి నమోఘ లీలు డగుచుం బుట్టించు రక్షించు - నం
త విధించేయు - మునుంగడందు - బహుభూతవ్రా త మం దాత్మతం
త్ర విహార స్థితుడై - షడింద్రియ సమస్త ప్రీతియున్ దవ్వులన్
దివి భంగిం గొను - చిక్కడింద్రియములం ద్రిప్పున్ నిబంధించుచున్

ఈ లోకాలన్నీ సృష్టించిన మాట వాస్తవమే. అయితే ఎలా సృష్టించాడని మీరను కోవటం. ఒక కుమ్మరి కుండలు సృష్టించినట్టనా. కాదు. కుమ్మరి కంటే ఒక మట్టి అనే ఉపాదానం కావాలి. దండ చక్రాదులనే సహకారులు కావాలి. తనకు కరచరణా ద్యవయవాలూ పని చేయాలి. ఇలాటి కలాపమేదీలేదా ఈశ్వరుడికి. ఉన్న వాడాయన ఒక్కడే. ఉపాదానమయినా తానే సహకారి అయినా తానే. మరి సర్వవ్యాపకుడూ జ్ఞానైకరూపుడూ కాబట్టి తనకొక శరీరమంటూ లేదు. అలాంటివాడు ఎలా సృష్టిస్తాడీ బ్రహ్మాండ భాండాలను. అదే వింత. ఏదీ లేకపోయినా ఒకటున్న దాయనకు. అదే ఆయనతో ఏకీభూతమై ఉన్న మాయాశక్తి. **"పరాస్యశక్తి ర్వివిధైవ శ్రూయతే"** అది ఆయన ఇచ్ఛను బట్టి ఎలా కావలిస్తే అలా మారిపోగలదు. అలాటి మాయాశక్తి విలాసమే ఈ భువన శ్రేణినంతా పుట్టిస్తున్నది. పెంచుతున్నది. త్రుంచుతున్నది. పెంచుతున్నా, త్రుంచుతున్నా అది వాస్తవంలో మరలా పెంచటమూ కాదు, త్రుంచటమూ కాదు. అది ఒక లీల. అమోఘమైన లీల. ఐంద్రజాలికుడి లీలలాటిది. ఉన్నట్టుండి ఆకాశంలో గంధర్వనగరం లాంటిది కల్పిస్తాడొక ఐంద్రజాలికుడు.

అది అక్కడ ఉందనా చేసిందనా. ఏదీ లేదు. అది ఒక కనుకట్టు. అలాటి కనుకట్టే మనకీ జగత్సృష్టి.

పోతే మనమీదనే ఈ కనుకట్టు పనిచేసేది. సృష్టించిన ఆయననంటదది. కనుకనే ఆయన దానిలో మునగడు. మనలను ముంచుతుంటాడు. మరి ఆయన పరిస్థితేమిటి. ఎక్కడ ఉన్నాడు. ఎక్కడో లేడు మరలా. ఈ సృష్టి అయిన చరాచర భూతాలలోనే నిండి ఉన్నాడు. అలా ఉన్నా మనలాగా అస్వతంత్రుడు కాదు. సర్వ స్వతంత్రుడు. తానేమి చేసేదీ తనకు తెలుసు. అచ్చమైన ఆ తెలివితోనే పంచేంద్రియాలకూ, మనసుకూ చెందిన అన్ని సుఖాలూ అనుభవించగలడాయన. మనమూ అలాగే అనుభవిస్తున్నాము గదా అని ప్రశ్నించరాదు మరలా. మనం మన స్వరూపమే మరచి అనుభవిస్తాము. ఆయన శుద్ధ చైతన్యరూపుడు కాబట్టి ఆకాశంలాగా దూరదూరంగానే ఉండి అనుభవిస్తాడు. ఆకాశమిప్పుడంతటా ఉంది. అన్నింటి లోపలా వెలపలా వ్యాపించి కూడా అమూర్తం కాబట్టి అది దేనినీ అంటదు. దానినేదీ అంటదు. అలాగే అమూర్తమైన ఆత్మతత్త్వం కూడా సుఖదుఃఖాది భోగాల మధ్యే మెలగుతున్నా అదీ వాటినంటి ముట్టదు. అలాంటప్పుడిక బంధమేముంది. ఇంద్రియాలకు చిక్కదది. పైగా ఆ ఇంద్రియాలనే బంధించి తన ఇచ్ఛానుసారంగా త్రిప్పుతూ పోతుంది. అధోక్షజుడూ హృషీకేశుడని పరమాత్మకు పేరు వచ్చింది ఇందుకే. అక్షములంటే ఇంద్రియాలు. హృషీకమన్నా ఇంద్రియమే. వాటి జ్ఞానాన్ని అధఃకరించిన వాడూ వాటిని వశీకరించుకొన్నవాడూ గనుక ఆయన అధోక్షజుడూ, హృషీకేశుడూ అయ్యాడు. దీని మూలంగా మనం గ్రహించవలసిన రహస్యమేమిటి. కృష్ణుడవతరించి నప్పటినుంచీ నిర్యాణమయ్యేదాకా కనిపించిన ఆ నీలమేఘ శ్యామలమైన ఆకార మసలు వాస్తవంలో అక్కడ లేనేలేదు. అమూర్తమైన తత్త్వం మూర్తమెలా అయింది. అయిందంటే అది మాయామయమే యథార్థం కాదన్నమాట. కనుకనే **"మాయై షాహి మయా సృష్టా యన్మాం పశ్యసి నారద"** నారదా ! నీవు చూస్తున్నది నా నిజస్వరూపం కాదు. అది మాయ. అని చెప్పగలిగాడు నారదుడి కాయన. కాగా ఇక శరీరధారణమే మాయ అయినప్పుడాయన ఆ శరీరంతో చేసిన అనుభవించిన ఇంద్రియ భోగాలు మాత్రం సత్యమెలా అవుతాయి. అవీ మాయే. అంటే అప్పటికి గోపికలతోడి రాసక్రీడాదులూ, పదహారు వేలమందిని పరిణయమాడటాలూ, ఇవన్నీ

కేవలమొక మాయా విలాసమేనని అర్థం చేసుకోవాలి మనం. దీనితో ఆయన కంటగట్టిన జారత్వాది దోషాలెగిరిపోతాయి. అంతేకాదు. ఇంద్రియానుభవాలన్నప్పుడు సుఖమే కాదు. దుఃఖం కూడా. కనుక చివరకాయనకు కలిగిన బాణప్రహారమూ, ప్రాణప్రహాణమూ ఇవి కూడా ఒక నటనేనని గ్రహించవలసి ఉంటుంది.

అయితే అంతా నటనే అంతా మాయామయమేనని తీర్మానించటానికేమిటి సబబు. అది కేవలం మన స్వకపోల కల్పనేమో. కాదని చెప్పటాని కాధారమేమిటి మనకని ఒక ఆశంక చేయవచ్చు. దానికి పరిహారం చెబుతున్నాడు.

నచాస్య కశ్చిన్ని పుణేన ధాతు
రవైతి జంతుః కుమనీష ఊతీః
నామాని రూపాణి మనో వచోభిః
సంతన్వ తోనట చర్యామి వాఙ్ఞః
జగదధి నాథుడైన హరి సంతత లీలలు నామరూపముల్
తగిలి మనోవచో గతుల తార్కిక చాతురి యెంత గల్గియున్
మిగిలి కుతర్కవాది తగు మేరలు చేసి యెఱుంగ నేర్చునే
యగణిత నర్తనక్రమము నజ్ఞుడెఱిగి నుతింపనోవునే

ఈ జగత్తనే దున్నదంటే ఇది దానిపాటికది ఆవిర్భవించలేదు. దీని ఆవిర్భావానికి మరేదో కారణమై ఉండాలి. అది మరలా దీనిలోనిదే అయితే సుఖంలేదు. దీని లక్షణాలకు విలక్షణమై దీని కతీతమైనదయి ఉండాలి. జగదధి నాథుడంటే అదీ అర్థం. ఇది పాంచభౌతికమైతే ఈ జగత్తు. దీని కధి అభౌతికమైన శుద్ధ చైతన్య రూపమది. అలాంటి ఆ హరితత్త్వమేదో అది మనకు గ్రహణ గోచరం కాదు. కారణమది ఈ జగత్తు కతీతమైన భూమికలో ఉంది. పోతే మనబోటి జీవుల మీ జగత్తు కధీనమైన స్థితిలో ఉన్నాము. మనమున్నది దేశకాల వస్తువులనే త్రిపరిచ్ఛేదాల కధీనమయిన దశ. మరి ఆ తత్త్వమో తురీయమైన దశ. అంచేత దాని అసలు రూపమేమిటో మనకు తెలియదు. అది మనకెప్పుడూ మరుగుపడే ఉంటుంది. పోతే మనకు కనిపించేవి కేవలం దాని లీలలే. అవీ కంటికి నామరూపాత్మకంగానే కనిపిస్తాయి గాని భగవద్విభూతిగా అనుభవానికి రావు. ఎంచేత. మన మనస్సులు

నామరూపాలనే ఎప్పుడూ తగిలి వర్తిస్తుంటాయి. వాటి కతీతమైన తత్త్వాన్ని అవి ఎలా భావించగలవు. పట్టుకోగలవు. ఇది ఎలాటిదంటే ఆకాశంలో ఒక పక్షి ఎగిరిపోతుంటే దాని నీడ క్రింద నేలమీద కనిపిస్తుంది మనకు. ఈ నీడ పక్షికాదు. అసలు పక్షి నేలమీద లేదు అది ఎక్కడో దీనికతీతంగా నింగిలో ఎగురుతుంది. దాని నీడ మాత్రమే ఈ నేలపైనకనిపిస్తుంది. దానిలాగా దీనికీ ఒక ఆకారముంది. దానిలాగానే ఇదీ వేగంగా పోతూంది. అయినా ఇదే వాస్తవమైన పక్షి అనుకొంటే పొరబాటు. వాస్తవమైన దాని ఛాయ. ఆభాస మాత్రమే ఇది. అలాగే వాస్తవమైన తత్త్వం త్రిగుణాత్మకమైన జగత్తు కతీతంగా ఉంటే దాని లీల లేదా నీడ మాత్రమే లోకంలో అది ప్రదర్శించే చేష్టలన్నీ. వాటిద్వారా అసలు దాన్ని పట్టుకోవాలేగాని మానవుడా చేష్టలమేరకే చూచి అవే నిజమని భావించరాదు.

అయినా మనమలా భావిస్తున్నామంటే దానికి కారణం మన మనస్సే. అది నామరూపాలనే వలలో తగులుకొన్న చిలక. దానికి తోడు పోయినదే వచస్సు. మాట. మనస్సును బట్టే వచస్సు. ఒకదానితో ఆలోచిస్తాము. మరొక దానితో ఆవిష్కరిస్తాము. అయితే ఎంత ఆలోచించినా ఆవిష్కరించినా ఇదంతా మన తార్కిక చాతుర్యం మాత్రమే. ఎంతో గొప్పగానే ఉండవచ్చు మన హేతువాదం. దానికెన్నో దృష్టాంతాలు తోడు చేసుకొని చూపవచ్చు. అయినా అది కుతర్కమే గాని సుతర్కం కాదు. కారణమేమంటే నామరూపాల సరిహద్దులు దాటిపోవటం లేదది. దేశ కాలాదులైన మేరలను దాటి అనంతంగా వ్యాపించి ఉన్న తత్త్వాన్ని దేశ కాలాదుల మేరలోకి దించి చూపటానికే ప్రయత్నిస్తుంది. అది శుష్కతర్కం గాక శుద్ధతర్కమెలా అవుతుంది. శుద్ధమైన తర్కమే కావాలంటే మానవుడు తన బుద్ధి బలంతో సాగించేది కారాదది. శ్రుత్యనుగృహీత మయినది Supported by Intution కావాలి. ఏమిటది. **సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ - అయమాత్మా బ్రహ్మ - నేహ నానాస్తి కించన - అనే నిష్ప్రపంచ బ్రహ్మాత్మ తత్త్వాని** కనుగుణంగా సాగే ఆలోచన. అలాటి ఆలోచనాపరుడే ప్రాజ్ఞుడు. మిగతా వారందరూ అజ్ఞులే. అజ్ఞుడంటే అద్వితీయాత్మ తత్త్వం తెలియనివాడు. వాడెప్పటికీ ఆ భగవత్తత్త్వాన్ని అర్థం చేసుకోలేడు. **"అజ్ఞశ్చా శ్రద్ధ ధానశ్చ సంశయాత్మా వినశ్యతి"** అన్నారు. చేసుకోనంతవరకూ వాడు లోకంలో ఉన్నా లేనివాడే. వాడి జీవితమంతా నిరర్థకమే. తత్త్వాన్ని దానిస్థాయి కెదిగి

చూడలేకపోతే వాడేమి మానవుడు. వాడిదేమి జ్ఞానం. ఇది ఎలాటిదంటే ఒక గొప్ప నర్తకుడుంటాడు. వాడెన్నో భంగిమలలో ఎన్నో నాట్యరీతులు ప్రదర్శిస్తుంటాడు. అలా ప్రదర్శిస్తుంటే వాటిలో ప్రతి ఒక్కటీ చూచి ఆహా ఎంత బాగా చేస్తున్నాడని అభినందించే శక్తి ఉండాలి ప్రేక్షకుడికి. అలాటి యోగ్యతలేని పల్లెటూరి మొద్దుకేమనిపిస్తుంది. అవన్నీ శివమెత్తి ఆడే చిందులుగానూ, గంతులుగానూ భాసిస్తాయి. ఆ నర్తనమెంత చిత్ర విచిత్రంగా ఉన్నా అందులో ఎంత గొప్ప క్రమమున్నా వాడి బుద్ధికది అంతా అలికినట్టు ఒకటిగానే ఎంతో అవకతవకగానే కనిపిస్తుంది. అలాగే ఆ ఈశ్వరుడొక గొప్ప నర్తకుడు. ఆయన నర్తన మగణితమూ, సక్రమమూ అయిన నర్తన. అదే ఈ సృష్టి స్థితి లయాత్మకంగా సాగుతూన్న భువన వ్యవహారం. ఆ ఈశ్వరుడి భూమిక కెదిగి చూచి ప్రాజ్ఞుడైతే గ్రహించగలడు దీని ఆంతర్యం. అలా కాని మూఢుడికిది ఎలా బోధ పడుతుంది. మీదు మిక్కిలి ఇదంతా ఒక అర్థం లేని హంగామాగా కనిపించి ఆక్షేపిస్తాడు. అలా ఆక్షేపించిన వారే రుక్మి శిశుపాల జరాసంధాదులు. దుర్యోధనాదులాయన విశ్వరూపం చూచి కూడా అది ఒక గారడీ పొమ్మన్నారు. వారెవరికీ బోధ పడలేదా తత్త్వం. విభూతి చూచి కూడా గ్రహించ లేకపోయాడు. అదే భీష్మవిదురాదులైన భాగవతులైతే ఆ జగన్నాటక సూత్రధారి నటించిన ప్రతి లీలా విశేషంలోనూ ఆయన విశ్వాతిగమైన సచ్చిత్స్వరూపాన్నే దర్శిస్తూ పోయారు.

అయితే ఎప్పుడో వారెవరో దర్శించారని చెబితే ఏమి ప్రయోజనం. అది అప్పుడూ, ఇప్పుడూ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ దర్శించగలిగి ఉండాలి. దర్శించగలిగితే ఇందరు నాస్తికులూ ఇందరు హేతువాదులూ ఎలా ఏర్పడగలిగారు. ఇప్పుడే గాదీ నాస్తికులు. అప్పుడూ ఆ రోజులలో కూడా ఉన్నట్టే చాటుతున్నది పురాణం. వారే గదా ఆయన ఈశ్వరత్వాన్ని అనుక్షణమూ అధిక్షేపిస్తూ వచ్చిన శిశుపాలాదులు. మరి ఇలాటి పరిస్థితిలో ఆ ఈశ్వరతత్త్వాన్ని అందుకొనే మార్గమేమిటి. అది మనకెలా లభిస్తుందని ప్రశ్న. చెబుతున్నాడు దానికి సమాధానం.

సవేద ధాతుః పదవీమ్ పరస్య
దురంత వీర్యస్య రథాంగ పాణేః
యో ఽమాయయా సంతతయా నువృత్త్యా
భజేత తత్పాద సరోజ గంధమ్

ఇంచుక మాయలేక మదినెప్పుడు బాయని భక్తితోడవ
ర్తించుచు నెవ్వడేని హరి దివ్య పదాంబుజ గంధ రాశిసే
వించు - నత ండు గాంచు నర విందభ వాదులకైన దుర్లభో
దంచితమైన యా హరి యుదార మహాద్భుత కర్మ మార్గముల్

మాయ అంటే అజ్ఞానం. అజ్ఞానమనేది ఏ కొంచెమూ ఉండకూడదు. అంతా ఈశ్వరుడేనని సర్వాత్మభావం పూర్తిగా ఉండాలి. అది ఎప్పుడో మెరుపులాగా తళుక్కుమని మెరిసిపోయేదైతే లాభం లేదు మరలా. ఎప్పుడూ పాయకుండా ఉండాలి. ఇలాంటి జ్ఞాననిష్ఠకే భక్తి అని పేరు. అది కేవలం మదిలోనేగాక బాహ్య జీవితంలో కూడా ప్రతిఫలించాలి. అభ్యంతరంగా కలిగిన నిశ్చయజ్ఞానం బాహ్యంగా మనం నడుచుకొనే ప్రతినడతలోనూ కనిపించాలి. లోపలా, వెలపలా మనోవాక్కాయ వ్యాపారాలన్నీ తదాకారంగానే మారిపోవాలి. ఇదే వర్తించటమంటే. అలా వర్తించేవాడెవడైనా సరే. జాతి వర్ణ వయో లింగాది భేదం లేదిక. భగవత్తత్త్వాన్ని నిరంతరమూ అనుభవిస్తూనే ఉంటాడు. ఉంటాడంటే సన్న్యసించి ఎక్కడో ఏ అడవులకో కొండలకో పారిపోయి అక్కడ కూచుంటాడని కాదు. అక్కడికి పోయినా అదీ ఇలాటి సంసారమే. నామరూపాలెక్కడికి పోయినా కనిపిస్తూ ఉంటాయి. ఎటువచ్చీ అలా కనిపిస్తున్నా వాటినలా కనిపించే తీరులో చూడడు జ్ఞాని. మరెలా చూస్తాడు. ప్రతి ఒక్కటీ లోకంలో - పెండ్లాం బిడ్డలూ - ఇల్లూ వాకిలీ - అడవులూ కొండలూ - పట్టణాలూ ప్రజలూ-వ్యాపారాలూ వ్యవహారాలూ ఏది చూచినా అది ఆ ఈశ్వర విభూతిగానే అనుసంధించుకొంటాడు. ఆ హరి పదాంబుజ గంధ రాశే ఈ నామరూపాది కలాపమంతా. **"పాదోస్య విశ్వాభూతాని"** అని గదా శ్రుతి చెబుతున్నది. విశ్వమంతా దాని పాదం. అది ఒక అంబుజమే."అప ఏవ ససర్జాదౌ" అని మొట్టమొదట సృష్టి అయిన పదార్థ మంబువులే. పంచభూతాలకూ అది ఉపలక్షణం. పోతే ఈ భూత పంచకం నుంచి జన్మించినవే ఈ చరాచర పదార్థాలు. ఇవన్నీ ఆ పంచభూతాల గంధం లేదా వాసనలతో కూడినవే. ఇలాంటి భూతరాశినే నిరంతరమూ సేవిస్తుంటాడు జ్ఞాని. అంటే నామరూపాదులతోనే వ్యవహరిస్తుంటాడు. వ్యవహరిస్తున్నా అదంతా భగవద్విభూతిగానే భావిస్తూ దానితోనే ముడిపెట్టి తదాకారంగానే దర్శిస్తుంటాడు.

అలాంటి ఏకాత్మ భావనతో జీవించేవాడే ఎప్పటికైనా ఆ ఈశ్వరుడి కర్మ మార్గాలేమిటో వాటిలో దాగి ఉన్న రహస్యమేమిటో తాను గ్రహించగలడు. మరొకరికి వ్యాఖ్యానించి చెప్పగలడు. ఎలాటి కర్మ మార్గాలవి. అరవింద భవాదులు – బ్రహ్మేంద్రాదులకు కూడా తలమించిపోయినవి. వారికి కూడా దుర్లభమే. అందరానంత ఎత్తులో ఉన్నాయి. ఉదంచితం. ఎంతో మించిపోయి ఉన్నాయి. బ్రహ్మేంద్రాదులకు మించి ఉన్నాయనే విషయం కృష్ణుణ్ణి వంచించబోయి వారే ఆయా సందర్భాలలో పరాభూతులు కావటమే మనకు నిదర్శనం. కాబట్టి హేయోపాదేయ భేదం లేకుండా సకల సృష్టినీ ఈశ్వర లీలగా విభూతిగా దర్శించిన వాడికే ఆయన తనజీవితంలో చేసిన చేష్టలు బోధపడతాయి. లేకుంటే వాటిలోని ఆంతర్యం గ్రహించలేక ఇది రంకు అది బొంకు అని శిశుపాలాదుల మాదిరి మనం కూడా ఈశ్వర దూషణ చేయటానికే ఉద్యుక్తులమవుతాము. ఇంతకూ **"యేయథా మాం ప్రపద్యంతే తాంస్త థైవ భజా మ్యహ"** మన్నాడు భగవానుడే. ఎవరే దృష్టితో చూస్తే వారికాయన అలాగే దర్శనమిస్తాడు. **"అస న్నేవ స భవతి అసద్బ్రహ్మేతి వేదచేత్"** లేదు లేదని వాదిస్తే వాడికాయన లేనేలేడు. అంతేకాదు. ఉన్న తత్త్వానికేమీ హాని లేదు. వీడు లేదన్నా అది ఉండనే ఉంటుంది. కాని హాని వీడికే. ఎందుకంటే ఉన్న దాన్ని వదిలేసి లేని ప్రపంచాన్ని పట్టుకొన్నాడు వీడు. ఇది ఎప్పుడూ లేనిదే కాబట్టి దీన్నిపట్టుకొని ఊగులాడిన నేరానికి వీడూ లేకుండానే పోతాడు. అలా కాక **"అస్తి బ్రహ్మేతి చేద్వేద సంత మేనం తతో విదుః"** ఎవడా బ్రహ్మతత్త్వాన్ని విడవకుండా పట్టుకొన్నాడో వాడు దాని లాగానే ఎప్పటికీ ఉంటాడు. **"తస్యాహం నప్రణశ్యామి – సచమే నప్రణ శ్యతి"** అని గదా భగవానుడి హామీ. ఆయన వీడి దృష్టికి లేకుండా పోడు. కాబట్టి వీడూ ఆయన దృష్టికి లేకపోడు. అంటే జనన మరణాలు లేని నిత్యస్థితిని పొందుతాడని భావం. ఇలాంటి బ్రాహ్మీ స్థితిని సోదాహరణంగా కీర్తిస్తున్నాడు ప్రస్తుతమీ అయిదవ పద్యంలో.

అథేహ ధన్యా భగవంత ఇత్థమ్
యద్వాసు దేవే ఽఖిల లోకనాథే
కుర్వంతి సర్వాత్మక మాత్మ భావమ్
నయత్ర భూయః పరివర్త ఉగ్రః

హరిపాద ద్వయభక్తి మీ వలన నిట్లా రూఢమై యొప్పునే
తిరుగం బాఱదు చిత్తవృత్తి హరిపై దీపించి మీలోపలన్
ధరణీ దేవతలార మీరలు మహాధన్యుల్ సమస్తజ్ఞులున్
హరిచింతన్ మిముచెంద వెన్నడును జన్మాంత వ్యథా యోగముల్

ధరణీ దేవతలిక్కడ శౌనకాది మహర్షులే. వారినే సంబోధించి చెబుతున్నాడు భాగవత ప్రచారకుడు సూతుడు. వారిద్వారా మనకందరికీ చేసే బోధ ఇది. భగవత్పాద ద్వయభక్తి ఉండాలి మొదట మనకు. హరిపాద ద్వయ మీ కనిపించే నామరూపాలే. **"పద్యతే గమ్యతే ఇతిపాదః"** అని పాద శబ్దానికి వ్యుత్పత్తి చెప్పారు భగవత్పాదులు. ఏది పరతత్త్వాన్ని చేరుస్తుదో అది పాదం. అవి ఈ నామరూపాలే. ఇవి ఆ పరమాత్మ సృష్టించినవే గనుక ఈ సృష్టిని పట్టుకొంటే ఆ స్రష్ట గుట్టు మనకు పట్టి ఇస్తాయి. అందుకే నేమో త్యాగ బ్రహ్మ **"పవమాన సుతుడు పట్టు పాదారవిందములకు - నీ నామరూపములకు నిత్య జయ మంగళ"**మని గానం చేశాడు. పవమానసుతుడు పట్టిన పాదాలేవో కావు. నిజానికవి ఈ నామరూపాలే త్యాగయ్య దృష్టిలో. ఇదే జ్ఞానదృష్టి. ఈ దృష్టి ఆరూఢమై ఉండాలి. ఆ రూఢమైనందు కేమిటి దాఖలా. ఏది చూస్తున్నా, చేస్తున్నా నామరూపాత్మకంగా కాక భగవద్రూపంగా ప్రతి ఒక్కటీ దర్శనమివ్వాలి. అంటే ఇది ఫలానా, అది ఫలానా అని గాక ప్రతి ఒక్కటీ కేవలం అస్తిభాతి అని మాత్రమేచూడగలగాలి. అప్పుడిక చిత్తవృత్తులిన్ని లేవు. ఒకే ఒక అఖండాకార వృత్తిగా మారి ఎప్పటికీ అది ఇక చలించదు. మరొక విజాతీయ భావముంటే గదా చలించటానికంతా హరిమయమే అయిపోయింది. అలా అయిపోయిన జీవులే ధన్యులు. వారి జీవితమే ధన్యజీవితం. అంతేకాదు. నిరంతర హరిచింతన మూలంగా వారికిక జనన మరణాలనే ప్రసక్తే లేదు. నిత్యముక్తుడైన పరమాత్మలాగా వారు కూడా ముక్తులే అవుతారు. ఇదే భాగవత సందేశమసలు.

ఉదాత్తమైన ఈ దివ్య సందేశమే అందిస్తున్నది మనకు కృష్ణావతార చరిత్ర. అర్థమైన వాడికది అమృతం. కాని వాడికది హాలాహలం. కనుకనే భాగవతము తెలిసి పలుకట కష్టంబని చాటింది. భాగవతమంటే భగవత్తత్త్వమే. అది కృష్ణావతారంలో వ్యక్తమైనంతగా మరే అవతారంలోనూ కాలేదు. దాని నున్న దున్నట్టు

పట్టుకోవాలంటే సామాన్యం కాదు. లోకసామాన్యమైన బుద్ధులతో లోకాతిశాయి అయిన ఆ తత్త్వాన్ని గ్రహించలేము. అది ఏమిటో దానినెలా గ్రహించాలో లోకానికి బోధించటానికే మహర్షి భాగవతారంభంలోనే ఈ పద్య పంచకాన్ని రచించాడు. భాగవత సౌధాంతఃప్రవేశానికిది ముఖద్వారం లాంటిది. దీనిద్వారా పోతేనే భగవత్స్వరూపాన్ని మనం దర్శించగలం. భాగవత పురాణ రహస్యమంతా అసలీ అయిదు పద్యాలలోనే గుంభితమయి ఉంది. భగవదవతార తత్త్వమంతా ఇందులోనే గర్భితమయి ఉంది. దీని నర్థం చేసుకొని ఇదే ఒక కరదీపికగా చేత పట్టుకొని లోపల ప్రవేశించినవాడు పురాణ ప్రాసాదంలో ఆయా కక్ష్యాంతరాలు గడచిపోయి క్షేమంగా వచ్చి బయటపడగలడు. లేదా వాడి పాలిటికది ఒక మయసభలాగా మారిపోయి ఉన్నది లేనట్టూ లేనిదున్నట్టూ దృగ్భ్రమ గొలిపి దిగ్భ్రమకే దారి తీస్తుంది. దానితో అసలు భాగవతమూ అర్థం కాదు. భగవదవతారాలూ అర్థంకావు. అన్నిటికన్నా కృష్ణావతారమూ దాని లీలలూ అసలే అంతుపట్టే వ్యవహారం కాదు. ఎప్పటికైనా విబుధులైన జనులవలన వినికని తెలుసుకొన్నవాడే అన్నిటినీ భేదించి తెలుసుకోగలడు. తెలుసుకొని తరించగలడు.



Brahmasri Yallamraju Srinivasa Rao www.vaitavedanta.in

7. అనన్యభక్తి

మన మింతవరకూ భగవదవతారములూ, వాటి ప్రయోజనమూ విశేషించి కృష్ణావతార తత్త్వమూ, ఈ విషయాలను గూర్చి చర్చించాము. కర్షణశీలుడే కృష్ణుడు. జీవుల నుద్ధరించటమే ఆకర్షణం. మన ఉత్తరణకే భగవంతు డసలవతరించింది. లేకుంటే ఆప్తకాముడైన భగవానుడికీ లోకంలోకి రావలసిన పని ఏముంది. **'నానవాప్తమ వాప్తవ్యమ్ - వర్త ఏవచ కర్మణి'** అని గదా ఆయన సెలవిచ్చింది. నేను కోరవలసింది ఏదీ లేకపోయినా రాకపోకలు సాగిస్తూనే ఉన్నాను. పనులు చేస్తూనే ఉన్నానంటాడు. ఏమిటా పని. ముముక్షు జనోద్ధరణమే. అది రెండు విధాలని పేర్కొన్నాము. ఒకటి ప్రతిలోమం. మరొకటి అనులోమం. దుష్టనిగ్రహం ద్వారా జరిగేది ప్రతిలోమం. పోతే శిష్టానుగ్రహ రూపమైనది అనులోమం. ఏమిటది. వారికి ముక్తిమార్గాన్ని బోధించటం. భగవానుడు బోధించే ఆ ముక్తి మార్గమే భక్తి. అనన్యభక్తి. మోక్షకాముడైన పరీక్షిత్తుకు శుకమహర్షి ఉపదేశించిన మార్గమదే.

అయితే ఏమిటీ భక్తి అంటే. భజించటమే భక్తి. భజన, విభజన అని రెండు మాటలున్నాయి. భాషలో విభజన అంటే ఏమిటో తెలుసు మనకు విడిపోవటమని. విడిపోయిన వాడెవడో వాడు విభక్తుడు. మనమంతా ఆ భగవత్తత్త్వం నుంచి ఎప్పుడు విభక్తులమయి పోయామో మనకే తెలియదు. అలా విభక్తులం కావటం మూలాన్నే ఈ సంసార జంబాలంలో కంఠదఘ్నంగా మునిగి ఉక్కిరి బిక్కిరయి పోతున్నాము. మరలా ఏ జన్మకైనా దీనిలో నుంచి మనం బ్రతికి బయటపడాలంటే ఆ తత్త్వాన్ని మనం భజించాలి. భజిస్తే భక్తులమవుతాము. అంటే విడవకుండా ఆ పరమాత్మ నంటి పట్టుకొంటాము ఇదే భక్తి అనే మాటకర్థం. అంటి పట్టుకోటమాశ్రయించటం. అలా నిరంతరమూ దాన్నే పట్టుకొని కూచుంటే భ్రమర కీటన్యాయంగా అదే అవుతా డీజీవుడు. **"బ్రహ్మవేద - బ్రహ్మైవ భవతి"** అన్న దుపనిషత్తు. ఎందుకని. క్రొత్తగా కావటమయితే ఇది సందేహించవచ్చు - అవుతామా లేదా అని. అలా కాదిక్కడ వ్యవహారం. మొదటినుంచీ మనమా స్వరూపమే. మనపేరు మనం మరచిపోయినట్టు మన స్వరూపమైన ఆ తత్త్వానికే మనం దూరమయ్యాము. ఇప్పుడా జరిగిన పొరబాటు

సరిదిద్దుకొని మరలా దగ్గర పడతాము. అది అజ్ఞానంవల్లనైతే ఇదిజ్ఞానం వల్ల సాధించవలసి ఉంది. ఈ సాధనకే భక్తి అని పేరు.

భాగవతుడికీ భగవంతుడికీ మధ్య ఒక పెద్ద వంతెన లాంటిదీ భక్తి. వంతెన ఇద్దరినీ అద్దరినీ కలిపి నట్టిక్కడ భగవద్భాగవతుల నిద్దరినీ కలుపుతుంది ఈ భక్తి అనే వంతెన. అయితే ఇందులో నాలుగంతుస్తులున్నాయి ఈ మార్గంలో. భజించటమనేది అంతా ఒకటిగాదు. భజించటమంటే పట్టుకోటమని గదా అర్థం చెప్పాము. అది ఒకటిగాదు. నాలుగు. తెలియక పట్టుకోటమొకటి. తెలిసీ తెలియక పట్టుకోవటమొకటి. తెలిసి అంతగా పట్టకపోవటమొకటి. తెలిసి బాగా పట్టుకోవటమొకటి. వీటిలో మొదటిది కర్మయోగం. రెండవది భక్తియోగం. మూడవది జ్ఞానయోగం. నాలుగవది పూర్ణజ్ఞాన యోగం లేదా అనన్య భక్తి యోగం. మొదటి రెండింటిలో భజించటమైతే ఉందిగాని దానికి కావలసిన జ్ఞానం లేదు. కొంత జ్ఞానమున్నా అది సమ్యగ్ జ్ఞానం కాదు. మూడవదానిలో సమ్యగ్ జ్ఞానమనేది ఉంది. కాని ఆ జ్ఞానంలో నిలకడలేదు. శాస్త్ర శ్రవణాదుల వల్ల మనసులో ఒక నిశ్చయ జ్ఞానం కలిగింది. అది కేవలం మానసికమే. మానసికమైన ఆ జ్ఞానం బాహ్య జీవితంలో కూడా ప్రతిఫలించి ప్రతిక్షణమూ దాన్ని విడవకుండా పట్టుకోవాలి. ఇలాంటి పట్టుకే నిష్ఠ అని పేరు. ఈ నిష్ఠ అనేది మూడవదానిలో లేదు. కేవల జ్ఞానం మాత్రమే ఉంటుంది. పోతే నాలుగవదానిలో ఈ జ్ఞానం పరిపాకానికి వచ్చి నిష్ఠగా మారుతుంది. అందుకే దీని కనన్యమని పేరు. అన్యం లేనిదేదో అది అనన్యం. అన్యమేమిటి. విజాతీయమైన భావం. దేనికి విజాతీయం. ఆత్మచైతన్యానికి. మన ఆత్మకుండే విజాతీయాలు రెండే. ఒకటి ఈ కనిపించే ప్రపంచం. మరొకటి ఎక్కడో కనిపించకుండా ఉండే ఈశ్వరుడు. ఇటు జగత్తును గాని అటు ఈశ్వరుణ్ణిగాని రెండింటినీ మనకు వేరుగా భావించరాదు. రెండూ మన ఆత్మస్వరూపంగానే అనుసంధానం చేసుకోవాలి. అప్పుడిక మన చైతన్యాని కన్యమైన పదార్థమే ఉండబోదు సృష్టిలో. సర్వమూ ఆత్మే. సర్వానికీ ఆత్మే. ఇలాటి సర్వాత్మభావం నిరంతరమూ నిలిచి ఉంటే అదే జ్ఞాన నిష్ఠ లేదా అనన్యభక్తి.

ఇలాటి అనన్య భక్తేభాగవతం మనకు ప్రతిపాదిస్తూ ఉన్న భక్తి. ఒక్క భాగవతమే గాక విష్ణు పురాణాదులు కూడా దీనినే బలపరుస్తున్నాయి. **"ఏవం సర్వేషు భూతేషు - భక్తి రవ్యభి చారిణీ - కర్తవ్యా పండితైర్జ్ఞాత్వా"**

"విస్తార స్సర్వ భూతస్య - విష్ణోస్సర్వ మిదమ్ జగత్
ద్రష్టవ్య మాత్మ వత్తస్మా - దభేదేన విచక్షణైః"

అవ్యభిచారిణి అయిన భక్తి అన్నా అభేదమైన దర్శనమన్నా భాగవతం చెప్పే అనన్యభక్తికి మారుపేరే. ఇది జ్ఞాన నిష్ఠారూపమైనది. కాబట్టి మోక్షానికి సాక్షాత్సాధన మిది ఒక్కటే. మోక్షమంటే ఆత్మేతరమైన సకలోపాధుల నుంచీ బయట పడటమే గదా. అది అనన్య భక్తిలో తప్ప మరొక భూమికలో సాధ్యం కాదు. ఎందుకంటే మిగతా భూమికలలో ఆత్మకు భిన్నమైన నామరూపాలింకా కనపడుతుంటాయి. ఒకవేళ లేకపోయినా ఈశ్వరుడొక డెవడో ఉన్నాడనే భావమైనా ఉంటుంది. ఏ మాత్రమలాటి భేదభావన ఉన్నా ఆ మేరకు మోక్షం మనకు దూరమే. **ద్వితీయా ద్వైభయమ్ భవతి** అన్నారు. మనకు ద్వితీయమేది ఉన్నా అది మనకు బంధకమే. ద్వితీయమే అన్యం. ఈ అన్యదృష్టి లేశమాత్రమూ లేని దశ కాబట్టి అనన్యభక్తే మోక్ష సాధనం. పరీక్షిత్తు కోరింది శుకుడాయనకు ప్రసాదించింది కూడా ఇలాటి సాధనమే. ఇది మనకు భాగవత సమాప్తిలో వారిరువురి సంవాదంలోనే విశదమవుతుంది.

"అతః పృచ్ఛామి సంసిద్ధిమ్ - యోగినాం పరమం గురుం
పురుష స్యేహ యత్కార్యమ్ మ్రియమాణస్య సర్వధా"

మర్త్యుడయి పుట్టిన ప్రతిఒక్కడూ ఎప్పుడో ఒకప్పుడు మరణించి తీరవలసిందే. అలా మరణమనేది తప్పనిసరి అయినప్పుడీ మానవుడు చేయవలసిన ప్రయత్నమేమిటి అని ప్రశ్నిస్తాడు పరీక్షిత్తు. పరీక్షిత్తు ప్రస్తుతం త్వరలోనే మరణించబోతున్నాడు. కాబట్టి అలాటి ప్రశ్నే వస్తున్నది నోట. ఎలాగూ మరణిస్తాడు గదా. ఇక ప్రశ్న దేనికి. అందుకే ప్రశ్న. మరణించి తీరవలసిందేనా. దాన్ని తప్పించుకొనే మార్గమే లేదా. లేకుంటే సరే అడిగేదే లేదు. ఉంటే మాత్రం అది ఏమిటో తెలుసుకోవలసిన బాధ్యత ప్రతిఒక్క మరణించే వ్యక్తికీ ఉందని దీని అంతరార్థం. కాగా శుకుడిచ్చే సమాధానమిది. **"పరీయా నేషతే ప్రశ్నః కృతో లోకహితో నృప"** నాయనా నీవడిగిన ప్రశ్న చాలా గొప్పది. ఇది నీకే గాదు. లోకులందరికీ కావలసిందే. అంటే మరణ రహస్యం తెలుసుకోవలసిన బాధ్యత అందరికీ ఉంది. ఏమిటా మరణ జయోపాయం. మానవుడి జీవిత కాలంలో తెలుసుకోవలసిన విషయాలు శత సహస్రమున్నాయి.

కాని అవన్నీ మరణంతో మాసిపోయేవే. తజ్జయ సాధనాలు కావు. అలాంటి సాధనమొక్కటే. అది **"సర్వాత్మా భగవాన్ హరిరీశ్వరః శ్రోతవ్యః"** సర్వాత్మకమైన భగవత్తత్త్వాన్నే శ్రవణం చేసి అనుభవానికి తెచ్చుకోవాలి. అది సర్వాత్మకం కాబట్టి సర్వాత్మకుడివే అవుతావు నీవు. అప్పుడు నీకు మరణమే లేదంటాడు.

ఆదిలో ప్రతిజ్ఞారూపంగా చెప్పిన మాటే పన్నెండు స్కంధాల కథా భాగంలో సహేతుకంగా సోదాహరణంగా ప్రతిపాదించి మరలా భాగవతాంతంలో నిగమనం చేసి చూపుతాడు మహర్షి. **"త్వమ్ తు రాజన్ మరిష్యేతి పశు బుద్ధి మిమాంజహి"** రాజా ! నేను మరణిస్తానేమో అనేది పాశవమైన దృష్టి. అది వదలిపెట్టు. దేహవత్త్వమ్ న సంక్ష్యసి దేహం పోతుంది కాని నీవు పోవు. అహమ్ బ్రహ్మ పరంధామ బ్రహ్మాహం పరమం పదమ్ -నేనా బ్రహ్మాన్నే - ఆ బ్రహ్మం నేనే అనే పరిపూర్ణ భావంతో ఉండు - దశంతం తక్షకం నద్రక్ష్యసి - తక్షకుడూ కనిపించడు - శరీరం చ - శరీరమూ కనిపించదు. విశ్వంచ పృథగాత్మనః ఈ విశ్వమూ నీకు వేరుగా కనిపించదు. ప్రపంచ శరీర పరమాత్మలు మూడూ ఆత్మకు భిన్నంగా కనిపించవు. ఆత్మగానే సాక్షాత్కరిస్తాయి. అప్పుడిక మరణమేముంది మానవుడికి. ఈ సర్వాత్మక దృష్టి నలవరుచుకోటమే మరణ తరణోపాయం. **"ఏతత్తే కథితం తాత యదాత్మా పృష్టవాన్నృప"** ఇదే గదా నీవడిగిన ప్రశ్న. దానికిది నేనిచ్చే సమాధానమని ఉపసంహరిస్తాడాయన. ఏ ఒక్కటీ మన ఆత్మచైతన్యానికి అన్యం కాదు. అంతా మన స్వరూపమే. తుదకు మరణం కూడా మన స్వరూపమే అనుకొన్నప్పుడిక మరణమెక్కడిది. అప్పటికి మోక్ష సాధనమనేది మానవుడికి మరేదీ గాదు. అనన్యభక్తి ఒక్కటేనని కంఠోక్తిగానే చాటుతున్నది భాగవతం.

ఈ అనన్య భక్తినే భాగవతం లోకానికి మోక్షసాధనంగా బోధిస్తున్నది. మోక్షం సత్యమైతే తత్సాధన రూపమైన ఈ భక్తి ధర్మం. భాగవత ధర్మమిదే. **"ధర్మః ప్రోజ్ఝితకై తవోత్ర పరమః"** అని ఆరంభంలోనే ఈ ధర్మాన్ని ప్రస్తావించింది. ఇది పరమమూ ప్రోజ్ఝితత కైతవము నని రెండు విశేషాలు వర్ణించి చెప్పింది దీనికి. పరమమంటే మిగతా మూడింటికంటే గొప్పది. ఎందువల్ల. ప్రోజ్ఝిత కైతవం గనుక. కైతవమంటే ఛలం-మిష. ఏదో కొంత నెపంపెట్టి చెప్పటం. అసలు తత్త్వం గాక మరేది వర్ణించినా అది దానికొక నెపమయి కూచుంటుంది. అది ఉన్నంతవరకూ అనన్యం కాదది. అన్యాపదేశమే. కర్మయోగంలో గాని, భక్తియోగంలో గాని ప్రపంచ వాసనా ఈశ్వర

వాసనా-అంతో ఇంతో ఉంటుంది. అది కూడా నా స్వరూపమే ననే అనన్య భావన పూర్తిగా ఉదయించదు. అంచేత అది సకైతవమే. పోతే మూడవదైన జ్ఞానయోగమే అకైతవం. అందులో అంతా స్వరూపమేననే సమ్యగ్దర్శనం కలుగుతుంది అంతవరకూ ఫరవాలేదు. ఎటువచ్చీ అది కలుగుతూ తొలుగుతూ పోతే సుఖం లేదు. కలిగినప్పుడు కాకపోయినా తొలగినప్పుడు మరలా అన్యభావన తొంగి చూస్తుంది. అంచేత ఈ కలిగిన జ్ఞానమే నిరంతరమూ అలాగే నిలిచి ఉండాలి. దీనికే అనన్యభక్తి అని పేరు. అనన్యభక్తి అంటే ఏదోగాదు. జ్ఞాననిష్ఠకే అది ఒకమారు పేరు. ఇదే భాగవత ధర్మం కూడా. సాక్షాత్తూ అప్పటికి సాధనమైన ధర్మమిదే.

పోతే మిగతా మూడూ సాక్షాన్మోక్ష ప్రదాలు direct కావు. అవి పరంపరా సాధనాలు indirect అంటే అవి ఈ అనన్య భక్తికి యథాశక్తిగా దోహదం చేస్తే వాటిచేత పరిపుష్టమైన ఈ భక్తి ముక్తిని మనకు ప్రసాదిస్తుంది. అప్పుడన్నింటికి కలిసి ఒక ఏక వాక్యత ఏర్పడుతుంది. కర్మాదులకు అనన్యభక్తిలో వినియోగమైతే అనన్య భక్తికి మోక్షంలో పర్యవసానం. ఇదీ సమన్వయం. భాగవత మీ సమన్వయ రహస్యాన్ని కూడా మనకిలా బయట పెడుతున్నది.

"నసాధ యతి మామ్ ధర్మో - న సాంఖ్యమ్ యోగ ఉద్ధవ
నస్వాధ్యాయ స్తపస్త్యాగో యథా భక్తి ర్మమోర్జితా"

ధర్మమంటే కర్మానుష్ఠానం. సాంఖ్యమంటే కేవల శాస్త్రజ్ఞానం. యోగమనేది సమాధి లక్షణం. తపస్సు హఠయో గాదికం. ఇవి ఏవీ నన్ను పట్టుకోటానికి సాధనాలు కావంటాడు భగవాను డుద్ధవుడితో. అయితే మరేది సాధనం. యథా భక్తిర్మ మోర్జితా. ఊర్జితమైన భక్తి ఒక్కటేనట. ఊర్జితమైన భక్తి అంటే అనన్య భక్తి. **"సవై పుంసాం పరోధర్మో యతో భక్తి రధోక్షజే"** అదే భాగవతం చెప్పే పరమధర్మం. మనం చేసే కర్మానుష్ఠానాదికం కాదిక్కడ ధర్మమంటే. **"కర్మణా కర్మ నిర్హారో నహ్యత్యంతిక ఇష్యతే"** కర్మల వల్ల కర్మ నిర్మూలనమెప్పటికీ జరగబోదు. తత్కర్మ హరి తోషం యత్ -హరి సంప్రీణ నార్థం చేసిందే **కర్మ స్వనుష్ఠితస్య ధర్మస్య సంసిద్ధిర్హ రితోషణమ్ - భగవత్తోషణాని** కుపయోగపడటమే కర్మకంతా ప్రయోజనం. అలాగే జ్ఞానం కూడా సావిద్యా తన్మతి ర్యయా - భగవదీయమైన బుద్ధే జ్ఞానమంటే. **"శ్రుత మప్యా పనిషదమ్**

దూరే హరి కథా మృతాత్" ఎంతగా నీకు ఔపనిషధమైన జ్ఞానమబ్బినా ప్రయోజనం లేదు. **"నైష్కర్మ్యమ ప్యచ్యుత భావ వర్జితమ్ న శోభతే జ్ఞాన మలమ్ నిరంజనమ్"** నైష్కర్మ్య లక్షణమైన జ్ఞానమెంత అలవడినా అచ్యుతమైన స్థితికి రానంతవరకూ అది కూడా ఫలితమివ్వదు. అలాగే సమాధియోగం కూడా స్వతంత్రంగా మోక్షాన్ని సాధించలేదు. **"తస్మాదేకేన మనసా భగవాన్ సాత్వతాం పతిః శ్రోతవ్యః కీర్తి తవ్య శ్చ ధ్యేయః"** మనసు నేకాగ్రం చేయటం వరకే గాదు. ఆ ఏకాగ్రమైన సమాహితమైన మనసుతో ధ్యానించవలసిన దొకటున్నది. అది సర్వాత్మకమైన భగవత్తత్త్వమని అర్థం చేసుకోవాలి. అలాగే సగుణభక్తి కూడా దానిపాటికది ఉపయోగపడదు.

"అకామ స్సర్వ కామోవా మోక్షకామ ఉదారధీః
తీవ్రేణ భక్తి యోగేన యజేత పురుషం పరమ్"

అకామ-సకామ అనే మాటల్లో సగుణ భక్తులంతా కలిసి వస్తారు. వారికి భక్తి ఉంటే ఉండవచ్చు గాని తావన్మాత్ర పర్యవసాయి అయితే ప్రయోజనం లేదు. అది తీవ్రమైన భక్తి కావాలి. ఆ భక్తి అనన్యభక్తిగా పరిణమించాలి. అప్పుడే సగుణంగా కాక నిర్గుణంగా భావిస్తారా పరమాత్మను. పరమ్ పురుషమంటే నిర్గుణమైన పరిపూర్ణమైన తత్త్వమని భావం.

కాబట్టి కర్మ భక్తి జ్ఞానాలు మూడూ దేనిపాటికది స్వతంత్రంగా ముక్తిదాయకాలు కానేకావు. కాగా అవన్నీ యథోచితంగా అనన్యభక్తికి దారి తీసిన నాడు తద్ద్వారా ఫలితమిస్తాయి. అదే ఈ క్రింది వాక్యాలలో నిర్దేశిస్తున్నది భాగవతం.

యోగేన వివిధాంగేన - ధర్మేణోభయ భిన్నేన
ఆత్మ తత్త్వావ బోధేన- వైరాగ్యేణ దృఢేనచ
ప్రాపోచమ్ భక్తి యోగస్య స్వరూపమ్తే చతుర్విధమ్

యమనియమాదులైన అష్టాంగాలతో కూడిన సమాధి యోగమూ, ధర్మాపర పర్యాయమైన కర్మయోగమూ, సగుణ రూపమైన భక్తియోగమూ, ఆత్మావబోధ రూపమైన జ్ఞానయోగమూ, ఈ కలాపమంతా యోగభూమికలే. ఈ భూమికా క్రమాన్నే చిలవలు, పలవలు పెట్టి ఇలా వర్ణిస్తున్నాడు శ్రీధరాచార్యుడు.

"అత్రచ ప్రథమమ్ మహత్సేవా - తతస్తద్ధర్మ శ్రద్ధా - తతో భగవత్కథా శ్రవణమ్ - తతో భగవతి రతిః తయాచ దేహద్వయ వివిక్తాత్మజ్ఞానమ్ తతోదృఢ భక్తిః తతో భగవత్తత్త్వ విజ్ఞానమ్ తత స్సర్వజ్ఞ త్వాది గుణావిర్భావః" ఇందులో ధర్మ శ్రద్ధ అంటే కర్మయోగం. దాని తరువాత చెప్పింది భగవద్రతి. అంటే భక్తియోగం. ఆ తరువాత దేహద్వయ వివిక్తాత్మ జ్ఞానం. అంటే జ్ఞానయోగం. ఆ పిమ్మట దృఢాభక్తిః అన్నాడు. దృఢభక్తి అంటే జ్ఞాన నిష్ఠలేక అనన్య భక్తి. కర్మయోగం భక్తియోగంలో పర్యవసిస్తే - భక్తి జ్ఞానంలో చేరిపోతే ఆ జ్ఞానం అనన్యభక్తిలో సమాప్తమవుతుందని సోపానక్రమాన్ని చెబుతున్నాడు. పోతే ఇక అనన్యభక్తి అనేది చిట్టచివరి భూమిక. దీనివల్ల కలిగేది ఒక భగవత్తత్త్వానుభవమే. అదే మోక్షం. అందులో సర్వజ్ఞత్వ సర్వేశ్వరత్వాది గుణాలు ముక్తుడి కప్రయత్నంగా సిద్ధిస్తాయి.

అయితే ఇక్కడ ఒక ఆశంక కలగవచ్చు. మోక్షమనేది జ్ఞానం వల్ల ననిగదా వేదాంత శాస్త్రం ఘోషిస్తున్నది. అలాటి జ్ఞానాన్ని కూడా కాదని ఈ భక్తికి పట్టాభిషేకం చేయటమేమిటి. వాస్తవమే. జ్ఞానం వల్లనే ముక్తి. జ్ఞానాదేవతు కైవల్యమని శాస్త్రం చాటుతున్నది. సందేహంలేదు. కాని జ్ఞానమనేది ఒక్కసారి తళుక్కుమని మెరసినట్టు కలిగి ప్రయోజనం లేదు. దానివల్ల సర్వమూ ఆత్మేననే అనుభవముదయించినా అది అనుక్షణమూ నిలవకపోవచ్చు. నిలిస్తేగాని ముక్తిలేదు. దానికే జ్ఞాననిష్ఠ అని పేరు. ఈ జ్ఞాననిష్ఠనే భాగవతం అనన్యభక్తి అని వ్యవహరిస్తూంది. ఈ రహస్యం శ్రీధరుడే ఇలా విప్పి చెబుతున్నాడు మనకు. **"సత్యమ్ జ్ఞాన మనంత మిత్యాది శ్రుతిభి రేవంభూతస్య భగవతః ప్రతిపాదనాత్ తద్ జ్ఞానమ్ సుకర మేవతి కుతో భక్త్యా"** సత్యం జ్ఞాననమనంతం బ్రహ్మ అని వర్ణించే ఉపనిషద్వాక్యాల మూలంగా తత్తాదృశమైన భగవత్స్వరూపం ప్రతిపాదించబడి ఆ భగత్సంబంధి అయిన జ్ఞానం మనకు సులభంగా కలుగుతుంది గదా - ఇక భక్తితో మనకు నిమిత్తమేమిటి అని అడగవచ్చు. **"అత ఆహ"** దానికి సమాధానమిస్తున్నాము. **"సత్యమేవమ్ భూత మాత్మానం శ్రుతయః ప్రతిపాదయంతి"** నిజమే ఇలాంటి ఆత్మతత్త్వాన్ని శ్రుతులు ప్రతిపాదిస్తున్నాయి. కాదనటం లేదు. **"అత్రచ యద్యపి వస్తునః"** అపరోక్షం కాబట్టి అపరోక్షంగానే మనకు జ్ఞానమనేది కలిగి తీరుతుంది కూడా. **"తథాపి అసంభావనా విపరీత భావనా తిరస్కృతత్వాత్"** కలిగినప్పటికీ అసంభావన విపరీత భావన అనే

దోషాల మూలంగా ఆ కలిగిన జ్ఞానం మరుగుపడే ప్రమాదముంది. దానితో **"మలిన చిత్తేషు"** మలీ మస మనస్కులైన వారికి **"పరోక్ష మివ భవతీతి"** అది పరోక్షమే అయిపోతుంది. **"నపరోక్షం సంసార భ్రమ నివృత్తి సమర్థమ్"** అటువంటి పరోక్షజ్ఞానం సంసార భ్రాంతి నివారకం కానేరదు. అంటే మోక్షఫలాన్ని ప్రసాదించలేదని భావం. మోక్షఫలాన్నే ప్రసాదించాలంటే జ్ఞానమెప్పటికీ అలాగే నిలిచి ఉండాలి. అదే భాగవతం పేర్కొనే అనన్యభక్తి.

అనన్యభక్తి అన్నా, పరాభక్తి అన్నా, విశుద్ధభక్తి అన్నా ఒక్కటే. తీవ్రమనీ ఊర్జితమని కూడా భాగవతం దీన్ని వ్యవహరించింది. భగవద్గీత దీనిని పరాఅనన్య, విశుద్ధ అని పేర్కొన్నది. అంతేగాక ఏకభక్తి అని కూడా వర్ణించింది. చతుర్విధా భజం తేమామ్ నన్ను నాలుగు రకాలవారు భజిస్తున్నారు. ఉదారా స్సర్వ ఏవైతే – ఆర్తాదులైన ఈ నాలుగు తెగలవారూ నాకు భక్తులే. తేషాం జ్ఞానీ నిత్యయుక్త – ఏకభక్తి ర్వి శిష్యతే అయితే వారిలో జ్ఞాని అనే నాలుగవ వాడు అందరికన్నా విశిష్టుడు. ఎందుకంటే వాడు ఏకభక్తి. అంటే ఏమన్నమాట. అందరిదీ భక్తి అయినా జ్ఞానిదే నిజమైన భక్తి. దీనిని తరువాత వ్యాఖ్యానం చేస్తూ భగవత్పాదులిలా సెలవిచ్చారు. సేయమ్ జ్ఞాననిష్ఠా ఆర్తాది భక్తిత్రయా పేక్షయా చతుర్థీ పరాభక్తి రుచ్యతే – ఆర్తాదిభక్తిత్రయం కన్నా చతుర్థమైన ఈ జ్ఞాన నిష్ఠారూపమైన భక్తి పరాభక్తి. ఇదే అన్నిటికన్నా శ్రేష్ఠమని వాక్రుచ్చారు. అంతేకాదు. **"మద్భక్త ఏత ద్విజ్ఞాయ మద్భావా యోప పద్యతే"** అనే శ్లోకార్ధాన్ని వ్యాఖ్యానిస్తూ **"యత్పశ్యతి – యచ్ఛృణోతి స్పృశతివా తత్సర్వమ్ వాసుదేవ ఏవేతి ఏవం గ్రహావిష్ట బుద్ధిః మద్భక్తః"** ఏది చూచినా ఏది విన్నా ఏది స్పృశించినా, ఇంతెందుకు ఏ ఇంద్రియంతో ఏది గ్రహించినా – అదంతా పరమాత్మ స్వరూపమే మరేదీ గాదనే దృఢభావన గలవాడే మద్భక్తుడనే మాటకర్థమని చెబుతారు. మోక్షసాధన సామగ్ర్యామ్ భక్తి రేవగరీయసీ – అని చెప్పి భక్తి అంటే ఏమిటని ప్రశ్న వేసుకొని సమాధాన మిచ్చారాయన. **స్వస్వరూపాను సంధానమ్ భక్తి రత్యభి ధీయతే** – సర్వత్రా తన ఆత్మచైతన్యాన్ని దర్శించటమే భక్తి అట. ఇదే అనన్యభక్తి అంటే. ఈ అనన్యభక్తి అంటే ఏదోగాదు జ్ఞానమే. జ్ఞానమే అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తూ పోతే అదే అనన్యభక్తి.

Brahmasri Vaddiparti Srinivasa Rao www.advaitavedanta.com

అయితే ఇక్కడ వచ్చిన పెద్ద చిక్కేమంటే భక్తి అని దానికి పేరు పెట్టటం. ఆ పేరు చూచి అది జ్ఞానం కంటే విభిన్నమైనదేమోనని చాలామంది భ్రాంతి పడుతున్నారు. అంతేకాదు. భక్తియోగమనే రెండవ భూమికనూ అనన్యభక్తి అనే ఈ నాలుగవ భూమికనూ రెంటినీ ఒకటిగా భావించి భ్రమ చెందుతున్నారు. రెండు చోట్లా భక్తి అనే మాట కనపడటం వల్ల రెండూ ఒకటేనని బోల్తా పడటాని కాస్పదమయింది. ఇక్కడే అప్రమత్తంగా ఉండాలి మనం భక్తి యోగంలో చెప్పిన భక్తి – అనన్యభక్తిలో చెప్పిన భక్తి రెండూ ఒకటి కావు. అది వేరు. ఇది వేరు. అది సగుణం. ఇది నిర్గుణం. అది జ్ఞానానికి పూర్వం. ఇది జ్ఞానాని కనంతరం. జ్ఞానమింకా ఉదయించక పూర్వం జ్ఞానం కోసమవలంబించేదది. అందులో సర్వమూ ఆత్మ స్వరూపమనే జ్ఞానం లేదు. భక్తుడి స్వరూపం కంటే భగవంతుడి స్వరూపం వేరక్కడ. అది సర్వవ్యాపకమూ సర్వాత్మకమూ అయినా అనన్యంగా కనపడదు వాడికి. కేవలం సగుణంగానే భాసిస్తుంది. అది కొంత కాలమలా అభ్యసిస్తూ పోతే సర్వమూ నా స్వరూపమేననే జ్ఞానముదయిస్తుంది సాధకుడికి. అలా ఉదయించిన జ్ఞానమప్పుడే గట్టిపడదు. దీపంలాగా వెలుగుతూ ఆరుతూ ఉంటుంది. దానికి కారణమింకా పూర్వ వాసనలు సాధకుణ్ణి విడవకుండా పట్టుకొని ఉండటమైనా కావచ్చు. లేక అసంభావనాది దోషాలైన కావచ్చు. అది తొలగాలంటే ఆ కలిగిన జ్ఞానదృష్టిని అలాగే పొడిగించుకొంటూ పోవాలి జ్ఞాన సంతాన కరణమని పేరు పెట్టారు దీనికి భగవత్పాదులు. జ్ఞాన నిష్ఠ అన్నా అనన్యభక్తి అన్నా కూడా ఇదే. ఇది జ్ఞానానంతరం కలిగే దశ. కాబట్టి జ్ఞానం కన్నా కూడా గొప్పదిది. భక్తి జ్ఞానం కన్నా శ్రేష్ఠమని భాగవతం చాటిందంటే ఈ దృష్టితో. భక్తి అంటే సగుణ భక్తి ఉంది. నిర్గుణ భక్తీ ఉంది. నిర్గుణ భక్తే జ్ఞానం కంటే శ్రేష్ఠమైనది. సగుణభక్తి కాదు. సగుణభక్తి జ్ఞానానికి పూర్వరంగం. నిర్గుణభక్తి లేదా అనన్యభక్తి అనేది జ్ఞానానికి ఫలసిద్ధి. సగుణభక్తి జ్ఞానమనే పుటంలోపడి పాకానికి వస్తే అది నిర్గుణ భక్తిగా మారుతుంది. అంటే ఏమన్నమాట. భక్తీ, జ్ఞానం, భక్తి ఇదీ వరస. ఇందులో మొదటి భక్తి మామూలు భక్తి. అందులో సగుణ జ్ఞానముందే గాని నిర్గుణ జ్ఞానం లేదు. అంచేత అది జ్ఞానంకన్నా లొచ్చు. పోతే అది జ్ఞానాన్ని కలిగిస్తే ఆ జ్ఞానం నిరంతరాభ్యాసం వల్ల నిలిస్తే అది జ్ఞాననిష్ఠ–నిర్గుణభక్తి లేదా అనన్యభక్తి. ఇది జ్ఞానానికి పరిపూర్ణత కాబట్టి మామూలు జ్ఞానం కన్నా హెచ్చు. ఇదీ భక్తిని గురించి మనమర్థం చేసుకోవలసిన తీరు.

ఇప్పుడు మనకు భాగవతం భక్తితత్వాన్ని ప్రతిపాదిస్తున్నదంటే అది ఈ రెండింటిలో ఏదని. పరీక్షిత్తు కోరిందీ శుకుడాయనకు బోధించిందీ మోక్షసాధనమైన భక్తి కాబట్టి అది ఈ అనన్యభక్తే. మరొకటి కాదు. కాని భాగవత తాత్పర్యమదే అయినా సగుణభక్తి కూడా జ్ఞానోత్పత్తి ద్వారా దానికే చివరకు తోడ్పడుతుంది. కాబట్టి ఆయా భాగవతుల చరిత్రను వర్ణించినప్పుడిదీ అదీ రెండూ ఏకం చేసి ఏది ఏదయిందీ తెలియక ఆకులపడుతున్నారు. ఇలాటి అకులీ భావం పూర్వం ధర్మరాజాదులకే ఉందా అని తోస్తుంది పురాణరచనా ధోరణిని బట్టి చూస్తే. శిశుపాలుణ్ణి కృష్ణుడు సభామధ్యంలోనే సంహరిస్తాడు. అప్పుడు వాడి శరీరంలో నుంచి ఒక తేజస్సు బయటికి వచ్చి నేరుగా భగవానుడి శరీరంలో పోయి ప్రవేశిస్తుంది. ఇది సభాసదులందరూ విస్తుపోయి చూస్తుంటారు. ధర్మరాజు కూడా అది చూచి ఆశ్చర్యపడి ప్రక్కనున్న నారదుని భుజం తట్టి అయ్యా వీడు చూస్తే పరమ దుర్మార్గుడు. నిత్యమూ భగవద్దూషణమే ధ్యేయంగా పెట్టుకొని బ్రతికినవాడు. ఇలాంటివాడు ఆయన చేత వధింపబడటమేమిటి మరలా ఆయనలోనే వాడి జీవశక్తి ప్రవేశించటమేమిటి. అంతటి అదృష్టం పట్టటానికి వాడు చేసిన మహాపుణ్య మేమున్నదని అని నర్మగర్భంగా మాటాడుతున్నారు. దానికి సమాధానమిస్తూ నారదుడిలా అంటాడు.

"కామోత్కంఠత గోపికల్ భయమునన్ కంసుండు - వైరక్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులున్
ప్రేమన్ మీరలు భక్తి మేమునిదె చక్రింగంటి - మెట్లైన - ను
ద్దామ ధ్యానగరిష్ఠుడైన హరి జెందన్ వచ్చు ధాత్రీశ్వరా"

ఇది బంగారంవంటి పద్యం దీనిలో ఎంతైనా అర్థముంది. పైకి బాగా అర్థమవుతున్నట్టు కనిపించినా ఏ మాత్రమూ అర్థం కాని పద్యమిది. పైకి మనందరికీ అర్థమయ్యేదేమిటి. అందరూ ఆ పరమాత్మను భజిస్తూనే ఉన్నారు. అందులో కొందరు కామంతో, కొందరు భయంతో, కొందరు వైరంతో, కొందరు బాంధవ్యంతో, కొందరు ప్రేమతో, పోతే కొందరు భక్తితో. ఎవరెలా భజించినా సరే. ప్రగాఢమైన ధ్యానమనే గుణముంటే చాలు. ఆ భగవంతుని దర్శించనూ వచ్చు. ఆయన సాయుజ్యాన్ని పడయనూవచ్చు. కేవలం భజన మార్గంలోనే తేడా అని ఫలసిద్ధిలో ఎలాటి తేడా లేదు. అందరికీ వచ్చేది సాయుజ్యమే.

ఇది బాహ్యంగా మనకు తోచే భావం. కానీ ఇది కాదీ పద్యభావం. అందరూ భగవంతుని భజిస్తున్నారని చెప్పినా ఆ భజించటం భక్తితో గాదు. భక్తితోనే అయితే "భక్తి మేము" అని నారదుడి విషయంలో మాత్రమే భక్తితో అని ప్రయోగించనక్కర లేదు. నారదుడు భక్తితో భజిస్తున్నాడంటే అప్పటికి మిగతా వారు భజించటం భక్తితో కాదని చెప్పకుండా చెబుతున్నాడు పురాణకర్త. అయితే భక్తితోగాక వారిక దేనితో భజిస్తున్నారా పరమాత్మను దేనితో భజిస్తున్నారని ప్రశ్నేముంది. కంఠోక్తిగానే చెబుతున్నాడు దేనితోనో. కామంతో గోపికలు, భయంతో కంసుడూ, వైరంతో శిశుపాలాదులూ, బంధుత్వంతో కొందరూ, ప్రేమభావంతో కొందరూ నని. పైగా భక్తితో మేము అని నారదుడు చెప్పటం చూస్తే నారదుడి దొక్కడిదే భక్తి అని మిగతా వారిది కాదని స్పష్టంగానే తెలిసిపోతున్నది. అంటే వారంతా కామాదులతో భజిస్తున్నారే గాని నారదుడిలాగా భక్తితో గాదు. భక్తితోనే అయితే అది పరిశుద్ధమైన భావంతో భజించటమయ్యేది. మరి కామంతో వైరంతో నని ఎప్పుడు వర్ణించారో అప్పుడది పరిశుద్ధమైనది కావటానికి లేదు. కామాది వాసనలతో కూడిన సగుణభక్తి. ఆ వాసనల కనురూపమైన రూపాన్నే దర్శిస్తున్నారు వారు. వాసనా రహితంగా చూడటం లేదు. దీనిని బట్టి ఎవరిదీ కూడా పరిశుద్ధమైన అనన్యభక్తి కాదు. గోపికలది సకామ భక్తి. కంసుడిది సాధ్వసభక్తి. శిశుపాలాదులది వైరభక్తి. యాదవులది బాంధవ్యభక్తి. పాండవులది స్నేహభక్తి. పోతే ఇలాటి కామాది కాలుష్యమే కొంచెమూ లేని నిష్కల్మషమైన – నిర్గుణమైన అనన్యభక్తి ఒక్క నారదుడిదే.

అయితే ఎవరెలా భజించినా ప్రతి ఒక్కరూ ఆయనను దర్శించారనీ, చెందుతున్నారనీ వర్ణించారే దాని కేమిటర్థమని అడగవచ్చు. ఆ దర్శించటం పొందటం కూడా వారి వారి దృష్టి భేదాన్ని బట్టి. భగవానుడే సెలవిచ్చాడు. **"యే యథామామ్ ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్"** ఎవరెవరు నన్నెలా భావిస్తారో వారిని నేనలాగే భజిస్తానని. అంటే ఏమని అర్థం. కామంతో చూస్తే కాముకుడు గానే కనిపిస్తాను. భయంతో చూస్తే భయానకంగానే దర్శనమిస్తాను. వైరబుద్ధితో భావిస్తే బద్ధవైరిగానే భాసిస్తాను. ఇలా ఏ రూపంతో నన్ను పట్టుకొంటే నేను వారికా రూపంగానే దర్శనమిస్తానంటాడు. ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే–అని మహామాయుడైన ఆ భగవానుడే రూపాన్ని ధరించి కనిపించినా కనిపించవచ్చు. ఆశ్చర్యం లేదు.

అయితే ఇది మోసం గదా. మోసమాయనది గాదు. ఈ భజించే జీవులది. వీరికి కామాది వాసనలు వదలకుండా భజిస్తే దానికాయన ఎలా బాధ్యుడు. ఇంకా ఆ మేరకాయన వారిని మన్నించి ఏదో ఒక రూపంతో అనుగ్రహిస్తున్నాడని సంతోషించాలి మనం. అందుకే ఆయన అంటున్నాడు **"మమవర్త్మాను వర్తంతే మనుష్యాః పార్థ సర్వశః"** ఏ నెపమైతే నేమి ఏదో ఒక నెపంతో నా మార్గంలో నడుస్తున్నారు మానవులదే చాలు నాకు పొమ్మంటున్నాడు.

అయితే ఆ హరిని అందరూ చూడవచ్చు చెందవచ్చునని సరి సమానంగానే వర్ణిస్తున్నారే అదేమిటి. వాస్తవమే. అందరూ చూస్తారు.అయితే తమ చూపు కనుగుణంగానే చూస్తారు. తమ తాకతు కనుగుణంగనే చెందుతారు. చూడవలసినట్టు చూడరు. చెందవలసినట్టు చెందరు. అంతేగాదు. వీరాయనను చెందుతారే గాని ఆయన వీరిని చెందటం లేదు. శిశుపాలుడి జీవకళ పోయి ఆయనలో ప్రవేశిస్తే ప్రవేశించవచ్చు. అంతమాత్రాన శిశుపాలుడిలో ఆ భగవత్తత్త్వముందని గాదు. ఉండటానికక్కడ వైరమనే వ్యాజమొకటి ఉంది. అది అడ్డు పడుతోంది. అలాగే కామాదులడ్డు తగులుతున్నాయి. అలాటి ఉపాధులతో కూడి ఉన్నంతవరకూ నిరుపాధికమైన తత్త్వాని కక్కడ చోటులేదు. **"యాథా శుద్ధే శుద్ధ మాసిక్త"** మన్నట్టు సకలోపాధి వర్జితమైన భావనలోనే సంపూర్ణంగా ప్రతిఫలిస్తుందా భగవత్తత్త్వం. ఈ సత్యానికి భగవద్గీతలో మనకు చక్కని సాక్ష్యం లభిస్తుంది.

"సమోహం సర్వభూతేషు - నమే ద్వేష్యోఽస్తిన ప్రియః
యే భజంతితుమామ్ భక్త్యా - మయితే తేషు చాప్యహమ్"

ప్రాణులందరూ నాకు సమానులే. వారిలో ఒకడు నాకిష్టుడనీ ఒకడనిష్టుడనీ పక్షపాతం లేదు. అయితే వచ్చిన ఇబ్బంది ఏమంటే నాకు లేకపోయినా నన్ను భజించే జీవులకుందా భేదభావం. అందరూ ఒకలాగా భజించటం లేదు నన్ను. కొందరు కామంతో కొందరు ద్వేషంతో ఇలా ఏదో ఒక ఛలంతోనే భజిస్తుంటారు. అలాటివారు నాలో ఉండవలసిందే గాని నేను వారిలో ఉండబోను. అయితే ఎవరిలో ఉంటావు నీవని అడుగుతావేమో. ఎవరు నన్ను భక్తితో భజిస్తారో వారు నాలోనూ ఉంటారు. నేను వారిలోనూ ఉంటానంటాడు. ఇక్కడ భక్తితో భజించటమనేది

గమనించాలి మనం. భక్తితో భజించటమేమిటి. భజించటమంటేనే భక్తి గదా అనిపిస్తుంది మనకు. అలా కాదని దీనిని బట్టి అర్థమవుతూ ఉంది. భజించటమనేది భక్తితోనైనా గూడా భజించవచ్చునన్నమాట. లేకుంటే భక్తితో నని చెప్పనక్కరలేదు. ఇదే నారదుని మాటలలో కూడా అక్కడ ప్రతిధ్వనిస్తున్నది. భక్తితో భజిస్తేనే అప్పటికి వారు భగవంతుణ్ణి చెందటమూ భగవంతుడు వారిని చెందటమూ ఎడా పెడా సంభవం. అలాకాక కామాదులతో భజిస్తే ఈ భజించే వారు భగవంతుణ్ణి చెందవలసిందే గాని ఆ భగవంతుడు మరలా వీరిని చెందబోడు. చెందడన్నందుకు వారికా కామాది వాసనలు వదలకపోవటమే దాఖలా. ఏవాసనా లేనిది గదా భగవత్తత్త్వం. అది వాసనామయమైన బుద్ధిలో ఎలా ఇముడుతుంది.

దీనిని బట్టి నారదాదులది ఏ కొందరిదో అచ్చమైన నిర్గుణభక్తి అయితే మిగతా భక్తులని చెప్పుకొనే వారిదంతా నిర్గుణం కాదు. అది సగుణమైన భక్తి. నిర్గుణస్థాయికింకా రావాలంటే దానికి జ్ఞానమనే అంతస్తొకటి మధ్యలో ఉంది. జ్ఞానమంటే ఏమిటి. తాను భజించే ఈశ్వరుడూ తానూ వేరు కాదు. అది తన స్వరూపమే. దానితో పాటే ఈశ్వర సృష్టి అయిన ఈ విశ్వమంతా తన స్వరూపమే అనే ఏకాత్మ భావం ఏర్పడాలి. అలాటి ఏకాత్మభావముంటే ఇక కామమనీ, భయమనీ, వైరమనీ ఇలాటి ఉపాధులుండటానికి వీలు లేదు. ఉన్నాయంటే ఇంకా జ్ఞానముదయించలేదని అర్థం. జ్ఞానమే లేకపోతే జ్ఞాన నిష్ఠారూపమైన అనన్యభక్తి కిక ఆస్కారమేముంది. కాబట్టి కామాది వాసనా వాసితమైన ఈ భక్తి మనం మొదట చెప్పుకొన్న నాలుగు భూమికలలో ద్వితీయ భూమికకు చెందిన సగుణ భక్తి. కనుకనే వారందరినీ ఒకశ్రేణిలో వర్ణించి చివరకు నారదుడు తనది భక్తి అనే పేరుతో వేరొక శ్రేణిలో పేర్కొనవలసిన వాడయినాడు.

అయితే ఒక్కమాట. అది సగుణమిది నిర్గుణమని పేర్కొన్న మాత్రాన మొదటి శ్రేణి అసలు పనికి రానిది నికృష్టమైనదని మరలా భావించరాదు. **"మమవర్త్మానువర్తంతే మనుష్యాః"** అని భగవానుడే హామీ ఇచ్చినప్పుడు నికృష్టమనటానికి మనమెవరం. ఎటువచ్చీ జ్ఞానాత్పూర్వమైన దశ అని మాత్రమే మనం చెప్పవలసింది దాన్ని జ్ఞానాత్పూర్వం గనుకనే జ్ఞానసంపాదన కోసమది అవశ్యంగా తోడుపడుతుంది. అందుకే దాన్ని సాధకుడవశ్యంగా అభ్యసించాలి. అభ్యసిస్తూ పోతే అది వాడికి

సమ్యగ్ జ్ఞానాన్ని ప్రసాదించి ఆజ్ఞానం క్రమంగా నిర్గుణభక్తిలో పర్యవసిస్తుంది. ఇలా అభ్యసిస్తూ వచ్చిన వారే గోపికాదులంతా. ప్రతి ఒక్కరూ వారిలో ఉద్దామ ధ్యానగరిష్ములే. అంతా ఉద్దామ ధ్యానముండబట్టే సగుణమైనా అది నిర్గుణమైన స్థితి నందుకోటానికెప్పటికైనా తోడ్పడగలదు. వారి వారి ఉద్ధామ ధ్యానస్థితి నాయాఘట్టాలలో భాగవతమెంతగానో వర్ణించింది. గోపికలు కృష్ణ విరహం క్షణమాత్రం కూడా సహించలేకపోయారు. ఉన్నట్టుండి ఆయన అంతర్హితుడైతే ఆ చెట్టూ, ఈ పుట్టా పట్టుకొని వెదుకుతూ పోతారు. మరలా కనపడితే ఎక్కడ లేని ఆహ్లాదమూ పొందుతారు. ఆ పాపిష్ఠి బ్రహ్మ రాత్రి వేళ నిద్ర అనే దొకటి సృష్టించి మా కన్నులు నిన్ను చూడకుండా చేశాడిది ఎంత దుర్భరమని వాపోతారు. అక్రూరుడు వచ్చి ఆయనను మధురకు తీసుకెళ్ళుతుంటే సహించలేక అతడక్రూరుడు కాదు క్రూరుడని నానావిధాల నిందిస్తారు. తుదకు మీరిలా అర్ధరాత్రి నాతో ఒంటరిగా తిరుగుతున్నారు లోకులనుమానిస్తారని మీకు భయం లేదా అని కృష్ణుడే ప్రశ్నిస్తే అన్నింటికీ నీవుండగా మాకు భయమూ లజ్జాదేనికంటారు. ఇలాటిది గోపికల కామోత్కంఠత.

పోతే కంసుడిది భయంతో కూడిన భక్తి. ఒక విషయంలో భయమున్న వాడికిక అదే చింతన. మనసులో అదే మెదులుతుంటుంది. అది తీరేదాకా మరచి పోడా స్వరూపాన్ని. ఇది కంసుడి ప్రవర్తనలో పదహారు కళలతో సాక్షాత్కరిస్తుంది. చెల్లెలికి గర్భం వచ్చిన క్షణంనుంచీ తనకు కాలం చెల్లిందనే భయపడుతూ వచ్చాడా కాలనేమి. ఆవిడ గర్భాన్ని చూచి **"మొన్నెన్నడు నిట్లుండదు వెన్నుడు సొరనోపు గర్భ వివరములోనన్"** అని అప్పుడే అనుమానపడతాడు. అంతేకాదు. గర్భిణి చెల్లెలినాడు పేద నేనేమని చంపువాడనని కరుణదలుస్తాడు. దుర్భావముతో బ్రదుకుటొక్క బ్రదుకేనని తన దౌష్ట్యాన్ని తానే ఏవగించుకొంటాడు. వైరానుసంధానం చివర కన్యానుసంధానం మరచేలా చేసిందా మానవుడికి. దానితో

"తిరుగుచు గుడుచుచు ద్రావుచు
నరుగుచు గుర్చుండి లేచు చనవరతంబున్
హరిఁదలచి తలచి జగమా
హరి మయమని చూచె గంసుడారని యలుకన్"

హరిమీద ఆగ్రహమెక్కువయ్యే కొద్దీ ఆ హరి రూపమే కనిపిస్తూ ఉందతనికి లోపలా వెలపలా కూడా. ఏ పని చేస్తున్నా అదే చింత. ఇది సరిగా ప్రహ్లాద చరిత్రలో **"పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్"** అనే పద్యానికి ప్రతిరూపంగా కనిపిస్తుంది. అది అనన్యభక్తి కుదాహరణమైతే ఇది సాధ్వస రూపమైన సగుణ భక్తికి. రెంటిలోనూ ఉద్దామధ్యానమనే ధర్మం సమానమే. పోతే అది ఇంకా ముదిరి పాకానబడింది కంసుడికి. శ్రవణ రంధ్రముల నేశబ్దంబు వినబడె నది హరిమూర్తి గానోపునంచు జూచు – ఆఖరుకు తలపులెట్టివైన తలచి యా తలపులు హరి తలంపులనుచు నలుగదలచు. ఇదీ కూడా ప్రహ్లాదుని వ్యవహారంలో కనిపిస్తుంది మనకు. "కమలాక్షు నర్చించు కరముల కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వా జిహ్వా" త్వక్చక్షురాదులైన ఇంద్రియాలకేది గోచరమయినా అదంతా హరిమయంగా భావించటమనేది అక్కడా ఇక్కడా సమానమే. అయితే ముందు చెప్పినట్టు సగుణ నిర్గుణాలలోనే తేడా. ఒకటి జ్ఞానరహితమూ–మరొకటి జ్ఞానసహితమూ. అందుకే చివరకు మరణించే సమయంలో శిశుపాలుడి మాదిరే కంసుడు కూడా

"రోష ప్రమోద నిద్రా
భాషాశన పానగతుల బాయక చక్రిన్
దోషగతి జూచియైన – వి
శేష గతిం గంసు డతని జెందె నరేంద్రా"

పరమాత్మనే చెందాడు. సదోషంగా భజించి కూడా చెందగలిగాడు. అప్పటికి తాను పరమాత్మను చెందగలిగాడే గాని పరమాత్మ అతణ్ణి చెందలేదు.

పోతే మూడవది వైరభక్తి. శిశుపాల, జరాసంధ, కాలయవన, రుక్మి హిరణ్య కశిపు ప్రభృతులదంతా ఈ వైరభక్తే. పరమాత్మతో చివరదాకా శత్రుత్వమే సాధించారు వారు. శిశుపాలుడైతే తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. ధర్మజుడు రాజసూయ యాగం పూర్తి చేసి యాగదక్షిణ ఎవరికివ్వాలని ఆలోచిస్తూంటే శ్రీకృష్ణుడికంటే అర్హులెవరు ఆయనకే ఇవ్వమని సలహా ఇస్తాడు సహదేవుడు. సభాసదులంతా అనుమోదిస్తారు. అందరిచేతా అనుజ్ఞాతుడై ధర్మరాజులాగే ఆచరిస్తాడు. అది చూచి శిశుపాలుడే మన్నాడో చూడండి. గురుదేవ శూన్యుండు కలుగోత్ర రహితుండు –

తలిదండ్రులెవ్వరో తడవరాదు అని ఇలా పరమాత్మ నందరి ఎదుట దూషిస్తూ పోతాడు. రాక్షసులిలా పరమాత్మను దూషించటంలో ఒక చమత్కారముంది. పైకి దూషణ చేస్తున్నట్టు కనిపిస్తున్నా లోపల దిగిచూస్తే వారు పరమాత్మను దూషిస్తున్నారా లేక భూషిస్తున్నారా సందేహం కలుగుతుంది. వారి ప్రతి ఒక్క ఉపాలంభంలోనూ రెండర్థాలు ధ్వనిస్తుంటాయి. భౌతికమైన అర్థమొకటి. ఆధ్యాత్మకమైన అర్థమొకటి. ఈ శిశుపాల దూషణలోనే చూడండి. గురుదేవ శూన్యుడట. గురువూ దైవమనే భావం లేని పాపిష్ఠుడని పయి అర్థం. పరమాత్మకు గురువేమిటి దైవమేమిటని అంతరార్థం. ఇలాగే కులగోత్రాలూ, తలిదండ్రులూ లేనివాడంటే ఒక అనాథుడూ కావచ్చు. జగన్నాథుడూ కావచ్చు. వావి వర్తనములు లేనివాడట. నిజానికేకాకి అయిన దేవుడికి అవి ఎలా సంభవం. జారుడు చోరుడు ముప్పోకలాడూనట. జారుడు కాకుంటే సృష్టి లేదు. చోరుడు కాకుంటే లయం లేదు. ముప్పోకలు పోకుంటే స్థితి లేదని అర్థం.

ఇది ఒక్క శిశుపాలుడిలోనే గాదీ చమత్కారం. ప్రతి వైరభక్తుడిలోనూ కనిపిస్తుంది. రుక్మిణీదేవిని అపహరించి తీసుకెళ్ళుతున్న కృష్ణుణ్ణి అటకాయించి ఆవిడ అన్న రుక్మి ఇలా మాటాడుతాడు.

"మా సరివాడవా మా పాప గొనిపోవ
నేపాటి గలవాడ వేది వంశ
మెందు జన్మించితివెక్కడ బెరిగితి
వెయ్యది నడవడి యెవ్వ డెఱుగు
మానహీనుడ వీవు - మర్యాదలును లేవు
మాయ గైకొని కాని మలయ రావు"

ఎటువంటి మాటలివి. నింద అయినదీ తెలియదు. స్తుతి అయినదీ తెలియదు. నింద అనే వ్యాజంతో సాగిన బ్రహ్మాండమైన స్తుతి. నిజంగానే పరమాత్మ మనకు సరికాడు. మనబోటి జీవకోటి కెంతైనా విలక్షణుడు. ఏపాటి ఉందాయన కేపాటీ లేదు. నిర్గుణుడు గదా. నిర్గుణుడే గాక నిరంజనుడు కూడా. అలాంటివాడికి సంగమేమిటి ? జన్మేమిటి ? నడవడి ఏమిటి. మానం మర్యాద కూడా లేదట.

మానమంటే పరిమాణం. మర్యాద అంటే హద్దు. అవి ఉంటే అప్రమేయుడెలా అవుతాడు – అనంతుడెలా అవుతాడు. ఎంత సాభిప్రాయమైన పలుకులో చూడండి. కాలయవనుడు కూడా ఇలాగే సంబోధిస్తాడు.

"బలిమిన్ మాధవ నేడు నిన్ను భువన ప్రఖ్యాతిగా బట్టెదన్
జలముల్ సొచ్చిన భూమి క్రింద జనినన్ శైలంబుపై నెక్కినన్
బలిదండన్ విలసిల్లినన్ వికృత రూపంబున్ ప్రవేశించినన్
జలధిం దాటిన నగ్రజన్మ హలికా శ్వాటాకృతుల్ దాల్చినన్"

పైకి పంతంగా మాటాడుతున్న ఈ మాటలలో భగవానుడి దశావతార ప్రశంస చూడండి ఎలా తొంగి చూస్తున్నదో. భూమి క్రింద జనటం వరాహావతారమైతే శైలంబుపై నెక్కటం కూర్మావతారం. శైలంబుపై అంటే శైలంమీద తానని కాదిక్కడ. శైలమే తనమీద నని అర్థం. ఇలాగే హిరణ్యకశిపుడి మాటలలో కూడా భగవదవతార ప్రస్తావన వస్తుంది. **"భుజ శక్తి నాతోడ పోరాడ శంకించి మున్నీట మునిగిన మునుగు గాక"** ఇది మత్స్యం. **"అలయించి పెనగు నాయచల సంభ్రమమున కెరగి వెన్నిచ్చిన నిచ్చుగాక"** ఇది కూర్మం. ఇందులో అచల సంభ్రమమూ, వెన్నివ్వటమూ, ఎంత మధురమైన శ్లేషలో చెప్పలేము. **"జగడంబు సైపక సౌకర్య కాంక్షియై యిల క్రిందనేగిన నేగు గాక"** వరాహం. ఇంకా ప్రౌఢమైన పదప్రయోగం. **"క్రోధించి యటుగాక కొంత పౌరుషమున హరిభంగి నడరిన నడరుగాక"** కొంత పౌరుషమట హరి అట – నారసింహం.

ఇలా పగ సాధించే ఆయా దానవుల మాటలలో కూడా వారి వారి భగవద్భక్తి ఉట్టిపడుతూనే ఉంటుంది. వారి భక్తికి మెచ్చి తల ఊచినట్టు భగవంతుడు వారితో ఆడే మాటలు కూడా అంత సుకుమారంగా సాకూతంగానే కనిపిస్తాయి. బలిచక్రవర్తి అడిగిన ప్రశ్నలకు వామనుడిచ్చే సమాధానాలు చూడండి ఎంత మనోహరంగా ఉన్నవో.

"వడుగా ఎవ్వరివాడ వెవ్వడవు సంవాస స్థలం బెయ్యది
య్యెడకున్ నీవరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మమున్
కడు ధన్యాత్ముడనైతి – నీమఖము యోగ్యంబయ్యె – నా కోరికల్
గడతేఱెన్" అంటాడు బలి. నిజంగా నీవు వడుగువేనా. వడుగు

వైతే ఎవరివాడవు-ఎవడవు. నీ నివాసమేమిటి. అవన్నీ మానవుడికైతే ఉంటాయి గాని పరమాత్మకు నీకెక్కడివి. ఇలాంటి మహానుభావుడివి నీ పాటికి నీవే దయ చేశావంటే నా జన్మా వంశమూ కూడా సఫలమయినాయి. యజ్ఞపురుషుడవు నీ రాకతోనే జేసే ఈ యజ్ఞంకూడా ఫలితమిస్తుంది. ఇంతకూ నా కోరికలన్నీ కడతేరాయి. ఇక నేనున్నా లేకున్నా ఫరవాలేదు. అని రాబోయే విషయం ముందుగా తెలిసే అన్నాడా అనిపిస్తుంది. మరి దీనికి తగినట్టే ఉంది భగవానుడి సమాధానం. ఇది నాకు నెలవని ఏరీతి పలుకుదు- ఒక చోటనక యెందు నుండనేర్తు పరమాత్మ సర్వవ్యాపకత్వాన్ని సూచిస్తుందీ మాట. ఎవ్వరి వాడనం చేమని నుడువుదు - నాయంత వాడవై నడవ నేర్తు ఆయన అసంగిత్వాన్ని చెబుతుందిది. ఈ నడవడి యని యెట్లు వక్కాణింతు - పూని ముప్పోకల బోవుచుందు అగుణుడై కూడా త్రిగుణాత్మకంగా భాసించే లక్షణాన్ని చాటుతుందిది. అది నేర్తు నిది నేర్తునని యేల చెప్పంగ - నేరుపులన్నియు నేన నేర్తు - సర్వ స్వతంత్రుడని చెప్పటాని కుదాహరణ. ఒంటివాడ జుట్టమొకడు లేడు-ఏకమే వాద్వితీయమనే భావానికీ నిదర్శనం. సిరియు తొల్లిగలదు-విభూతి తనలోనే గలదనేందుకు తార్కాణం. చెప్పెద నా టెంకి సుజను లందు తఱుచు సొచ్చియుందు-సర్వగతుడనైనా సాధువులకే దర్శనమిస్తానని భావం.

భగవత్తత్వావ బోధకమైన వర్ణనలలో ఇంత చమత్కారకమూ భావ గంభీరమూ అయిన వర్ణన మరొకటి మనభాషలో ఉండబోదు. ఇంతకూ భగవంతుడి మీద వైరం సాగించే రాక్షస ప్రకృతులలో కూడా ఇంతటి భక్తి భావమిమిడి ఉందంటే ఇక మిగతా సాత్విక రాజసభక్తుల మాట చెప్పేదేముంది. రాక్షసుల ఇలాంటి అర్ధాంతర స్ఫూర్తినిచ్చే సంభాషణలు సంస్కృత భాగవతంలో చాలా తక్కువ. ఒక్క శిశుపాలుడి మాటలలోనే కొంచెం కనిపిస్తుంది. మిగతా చోట్ల కానరాదు. ఆ మాటలలోని ఆంతర్యాన్ని పట్టి చూచిన ఆంధ్ర మహాకవి పరమ భాగవతుడు గనుక ఎక్కడెక్కడ అలాటి సందర్భాలు వచ్చినా బీరు పోనీయకుండా అదే బాణిలో నడుపుతూ వచ్చాడు.

వైరభక్తి అయిన తరువాత సంబంధ భక్తి. సంబంధులై వృష్ణులందరూ భజించారట. యదు వృష్ణి భోజాంధక కుకురు అని యాదవులంతా అయిదు శాఖలు. వృష్ణి అనేది అందులో ఒకశాఖ. అయినా ఆ మాట ఇక్కడ మిగతా నాలుగిటికీ ఉపలక్షణం. అయిదూ కలిసి వస్తాయందులో. కృష్ణుడి వంశంలో పుట్టటమే ఒక

మహాభాగ్యం. అసలు దేవకీ వసుదేవులాయనకు తల్లిదండ్రులు కావాలనే గదా తపస్సు చేశారు. ఆ తపః ఫలమే ఆయన వారి గర్భవాసాన జన్మించటం. అదే చాలు వారు తరించటానికి. ఈ హామీ పరమాత్మే ఇచ్చాడు వారికి. పుట్టగానే చతుర్బాహువులు శంఖచక్రాలతో శ్రీమన్నారాయణమూర్తిగా సాక్షాత్కరించి వారితో ఇలా అంటాడు.

"నందను డనియుం బరమా
నందంబున బ్రహ్మమనియు నను దలచుచు నా
పెండెరువు నొండెదరు నా
యందుల ప్రేమనిక భవము నందరు మీరల్"

నందనుడని పరబ్రహ్మమని రెండు విధాలా దర్శిస్తారట వారు. అలాగే దర్శించారు వారు జీవితాంతమూ. ఆ దర్శనమే అక్రూరాదులు కూడా అనుసరిస్తూ వచ్చారు. అక్రూరుడు, ఉద్ధవుడూ, వీరుకూడా యదువంశోద్భవులే. వారు కూడా తమ బంధువనే గాక ఆ బంధుత్వంలో ఆయన జగద్బంధుత్వాన్నికూడా అనుసంధిస్తూ వచ్చారు. మరి బలరాముడాయనను నిత్యమూ అంటి పట్టుకొనే ఉన్నాడు. చివర కాయన నిర్యాణోద్యోగం ముందుగానే గ్రహించి ఆయన అనుమతితో యోగమార్గాన శరీర త్యాగం చేసిపోయాడు. పోతే కుంతి ఆయన గారి మేనత్తే గదా. ఆవిడ కూడా మొదట మొదట సంసార వాగురలో చిక్కినా చివర ఆయనలోని భగవత్తత్వాన్ని గుర్తించి **"యాదవులందు పాండవుల యందును నీశ్వర ! నాకు మోహవిచ్ఛేదము సేయుమయ్య"** అని ప్రార్థిస్తుంది. ఘనసింధువు జేరెడి గంగ భంగి నీ పాద సరోజ చింతనముపై ననిశంబు మదీయ బుద్ధి ఉండేలాగా అనుగ్రహించమని వేడుకొంటుంది. ఇలా బంధుత్వంతో భజించారు చాలామంది.

పోతే దీని తరువాత ప్రేమ భక్తి. దీనికి పాండవులే నిదర్శనం మనకు. మనసారథి, మన సచివుడు, మనవియ్యము, మన సఖుండని ఆయన నంత ప్రీతి పాత్రుడుగా భావించారు పాండవులు. ఆయనా వారినలాగే చెలికాడ రమ్మని చీరు నొకవేళ మన్నించు నొకవేళ మఱుది యనుచు అని అనేక విధాల సంప్రీతి నెరపుతూ వచ్చాడు. తండ్రి తరువాత తండ్రి యంత వాడవని ధర్మరాజే ఆయనను శ్లాఘిస్తాడు.

వస్త్రాపహరణాదులైన మహోపద్రవాల నెన్నిటి నుంచో వారిని కాపాడాడా మహానుభావుడు. పాంచాలీ కబరీ వికర్షణంతోనే ఆయుఃక్షయాన్ని పొందిన ధార్త రాష్ట్రులను పాండవులు కాదు వాస్తవంలో చంపింది. చంపించిన వాడు తాను. రాజసూ యాశ్వమేధాలు నిర్విఘ్నంగా చేయగలిగింది వారు కాదు. వారిచేత చేయించింది తాను. మరి లోకంలో చివరస్థాయి అయిన కీర్తి గడించింది వారు గాదు. అది వారికి తెచ్చిపెట్టింది తాను. ఇదంతా ఎంతో ప్రేమ వారిమీద ఉంటేగాని పరమాత్మ ఇలా వారికి తోడ్పడే వాడు కాదు.

కాగా ఇక అన్నీ అయిన తరువాత ఆఖరిది భక్తి. ఇది నారద మహర్షి అనన్య భక్తి. దీనికి ముందు వర్ణించినవన్నీ సగుణభక్తి విశేషాలు. ఒకటి కామ గుణం. ఒకటి భయగుణం. ఒకటి వైరగుణం. ఒకటి సంబంధ గుణం. మరొకటి ప్రేమ గుణం. ఈ గుణాలేవీ కాని నిర్గుణం నారదభక్తి. ఆ నిర్గుణ భక్తి అలవడాలంటే దానికి ముందీ సగుణభక్తి పాకానికి రావాలి. అదిపాకానికి వస్తే ఈశ్వరీయమైన జ్ఞానముదయిస్తుంది. అప్పుడు భజించేదీ భజింపబడేదీ రెండూ ఒకే ఒక తత్త్వం గదా అనే అఖండ భావన కది దారి తీస్తుంది. ఆ భావనే నిర్గుణానికి ప్రాణం. కాబట్టి నిర్గుణరూపమైన అనన్యభక్తికి జ్ఞానమైతే జ్ఞానానికి సగుణభక్తి సాధనమవుతుంది. ఈ సగుణంలో మరలా భూమికా క్రమమున్నది. సగుణంలో వైరమొక్కటీ ప్రతిలోమమైతే మిగతా కామాదులన్నీ అనులోమం. అనులోమంలో నవభూమికలు ఉన్నాయి. ఆ తొమ్మిదింటినీ ప్రహ్లాదుడి ముఖతః బయట పెడుతున్నది భాగవతం. **"శ్రవణం కీర్తనమ్ విష్ణోః స్మరణమ్ పాద సేవనమ్ అర్చనమ్ వందనమ్ దాస్యమ్ సఖ్య మాత్మ నివేదనమ్"** శ్రవణం, కీర్తనం, స్మరణం, సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనం ఇవి ఆ తొమ్మిది భూమికలూ. బాగా గమనిస్తే ఈ క్రమంలో ఉత్తరోత్తరమూ ఉత్కర్ష కనిపిస్తుంది. మొట్టమొదట భగవద్గుణాలను శ్రవణం చేస్తాడు సాధకుడు. తరువాత వాటినే వాచా కీర్తిస్తాడు. దానివల్ల మనసులో ఆ ఈశ్వరుడి తాలూకు స్మృతి ఏర్పడుతుంది. తదనుగుణంగా శరీరంతో సేవిస్తాడు. కరద్వయంతో అర్చిస్తాడు. శిరస్సుతో నమస్కరిస్తాడు. ఇదే దాస్యానికీ ఆ దాస్యం క్రమంగా సఖ్యానికీ దారి తీస్తుంది. దాస్యంలో సేవ్య సేవక భావముంటే సఖ్యంలో అలాటి భావం బాగా తగ్గిపోయి అభేద బుద్ధి ఏర్పడుతుంది. అది చివరకాత్మ

నివేదనంలో పర్యవసానమవుతుంది. ఆత్మ నివేదనమంటే ఆత్మకీ ప్రపంచాన్నంతా నివేదించటమైనా కావచ్చు. లేక ఆత్మనే ఈ ప్రపంచానికీ నివేదించటం కావచ్చు. **"సర్వభూతస్థ మాత్మానమ్ సర్వభూతాని చాత్మని."** అన్నిటిలో తన స్వరూపాన్ని చూడాలి. మరలా అన్నిటినీ తన స్వరూపంలోనే చూడాలి. ఉభయత్రా సమస్తమూ తన స్వరూపంగానే మారి కనిపిస్తుంది. అప్పుడు తానే ఈశ్వరుడు - ఆ ఈశ్వరుడిక తనకు భిన్నంగా ఉండబోడు. ఇలా కేవల ద్వైత బుద్ధితో ఆరంభమై కేవలాద్వైత బుద్ధితో సమాప్తమయ్యే ప్రక్రియ ఇది. ఇలా చేస్తే **"తన్మన్యే ఽధీత ముత్తమమ్"** అంటాడు ప్రహ్లాదుడు.

ఇదే పోతన తన అనువాదంలో కొంత వ్యుత్క్రమం చేసి వ్రాసినట్టు కనిపిస్తుంది.

"తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనార్చనముల్ సేవయు-నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనంబను నీ తొమ్మిది భక్తిమార్గముల"

అని నడుస్తుంది పద్యం. ఇందులో నవవిధ భక్తి భూమికలూ వచ్చాయి సందేహం లేదు. కాని స్మరణంతో గాక సఖ్యంతో మొదలయిందిక్కడ. అలాగే ఆత్మ నివేదనంతో గాక చింతనంతో ముగిసింది. సఖ్యం భగవద్గుణ సాంగత్యమనుకొంటే ఆత్మ నివేదన చింతన మనుకోవలసి ఉంటుంది. కాని పోతన చింతనమనేది స్మరణానికి పర్యాయంగా తీసుకొన్నాడు. అదే ఆయన దృష్టిలో ఆఖరిమెట్టు. కనుకనే సమయం వచ్చినపుడల్లా ప్రహ్లాద చరిత్రలో ఆ మాట పదే పదే ప్రయోగిస్తాడు. వైకుంఠ చింతా వివర్జిత చేష్టుడై అంబుజోదర దివ్య పాదారవింద చింతనామృత - పాదపద్మ యుగళీ చింతామృత - అడుగడ్డునకు మాధవాను చింతన - ఇలా చింతా శబ్దాన్నే ఆ ఘట్టమంతా పులిమి పుచ్చాడు. అసలాయన కాచింత ఎంతగా పట్టుకొన్నదంటే భాగవతాని కసలింకా శ్రీకారం చుట్టాడో లేదో **"శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్"** అని తాను కూడా భగవచ్చింతనతోనే తరించాలని చూచాడా మహా భాగవతుడు. ఇంతకూ మూలకారుడు పరమోత్కృష్ట దశగా భావించిన ఆత్మ నివేదన మాయన దృష్టిలో నిరంతర చింతనం. అది ఆయనకు భగవద్గీత ఇచ్చిన స్ఫూర్తి అయి ఉండవచ్చు. **"అనన్యాశ్చింతయంతో మామ్"** అని గదా భగద్వాణి. అంతేగాదు. తచ్చింతనమ్ తత్కథనమని కూడా ప్రబోధమే. పోతే ఆత్మ నివేదన చింతన స్థానమెప్పు డాక్రమించిందో ఇక ఆత్మ నివేదన కేమని అర్థం చెప్పాలా అని ఆలోచించాడు

మహాకవి. ఆత్మ – నివేదనమని సమస్తంగా గాక ఆత్మని–వేదనమ్మని వ్యస్తం చేశాడు సమాసాన్ని. ఆత్మని అంటే ఆత్మలో – వేదనమంటే ఎఱుక అని వ్యాఖ్యానించాడు. తనలో తాను తత్త్వాన్ని గ్రహించటమని అర్థం. అది పరిపాకానికి వస్తే చింతనం. ఈ చింతనమిక సగుణం కాదు. నిర్గుణమే. సగుణాన్ని నిర్గుణం చేసే పరుసవేది మహాకవి దృష్టిలో.

పోతే ఈ నవ విధ భక్తి భూమికలలో ఒక్కొక్కరి కొక్కక్కటీ అభిమాన పాత్రం. వారి వారి చిత్త సంస్కారాన్ని బట్టి వారికదే సర్వస్వంగా భాసిస్తుంది. భాగవత పాత్రలందరూ ఈ తొమ్మిదింటిలో ఏదో ఒక దానికి చెందిన వారే. ఇందులో పాండవులది సఖ్యభక్తి. శ్రవణం పరీక్షిత్తుది. ఉద్ధవుడిది – గోపగోపికలది దాస్యభక్తి. బ్రహ్మేంద్రాదులది వందనం. అర్చన అంబరీషాదులది. రుక్మిణ్యాదులది సేవనం. సంకీర్తన నారదాదులది. భీష్మ విదురాదులది ఆత్మలో ఎఱుక. పోతే చింతన అనేది ప్రహ్లాద కుచేలులది. మొత్తం మీద సగుణం నుంచి నిర్గుణాన్ని అధిరోహించే సోపాన పరంపర ఈ తొమ్మిది. ఈ సగుణ నిర్గుణాల మధ్య జ్ఞానమున్నది. అది సగుణాన్ని నిర్గుణంలో కలిపే సేతువని పేర్కొన్నాము. సగుణం పాకానికి వచ్చి జ్ఞానముదయిస్తే ఆ జ్ఞానం నిరంతర చింతనతో నిర్గుణం లేదా అనన్యభక్తిగా పరిణమిస్తుంది.

అయితే ఆ సగుణభక్తి కూడా కలగాలంటే దానిపాటికది ఉట్రవడియంగా కలగదు. దానికి దగిన సత్త్వశుద్ధి, ఏకాగ్రత అలవడాలి సాధకుడికి. ఇవి రెండూ సరఫరా చేసే సాధనం కర్మయోగం. ఇది అన్నింటికన్నా మొట్టమొదటి మజిలీ మోక్షమార్గంలో. భాగవతానికి సాత్వత పురాణమని పేరు. సత్త్వం శుద్ధి అయినవాడే సాత్వతుడు శుద్ధసత్త్వమే భగవల్లక్షణం. అలాంటి లక్షణం భాగవతుడికి కూడా అలవడితేగాని ఆ తత్త్వాన్ని పట్టుకోలేడు. అది ఎలా అలవడుతుంది. కర్మయోగం వల్ల. కర్మయోగమంటే తను హృద్భాషలతో చేసే ప్రతి కర్మా కృష్ణార్పణ మంటూ చేయాలి. అంటే కేవలం నోటితోనే గాదు. మనసా వపుషా. త్రికరణాలతో. అది కర్తృత్వ భోక్తృత్వాలకు రెంటికీ మనలను దూరం చేస్తుంది. ఇది నేను చేస్తున్నా ననేది కర్తృత్వ బుద్ధి అయితే ఇందుకోసం చేస్తున్నా ననేది భోక్తృత్వ బుద్ధి. ఇవి రెండూ పట్టుకారులలాగా గట్టిగా పట్టుకొని ఉంటాయి మన బుద్ధులను. వీటి పట్టు వదలాలంటే నేను గాదిది ఈశ్వరుడే చేయిస్తున్నాడు. నా కోసం గాదిది ఆయన

ప్రీత్యర్థమే నని భావిస్తూ పోవాలి. పోతే ఏ పని చేసినా ఇక మనకు దాని ప్రభావం సోకదు. విక్షేపావరణ రూపమైన రజసతమస్సులు రెండూ దూరమై సత్త్వం బాగా శుద్ధమవుతుంది. దానితో మన ప్రతి కదలికలో ఆ ఈశ్వరుడే గోచరిస్తూ ఆ ఈశ్వర భావన మన ప్రతి అణువులో చోటు చేసుకొంటుంది. నాటుకొని పోతుంది. ఇది బాహ్యం కావచ్చు ఈ కర్మయోగం అభ్యంతరం కావచ్చు. బాహ్యం కేవల కర్మ యోగమైతే ఆంతరం సమాధి యోగం. రెండూ నిష్కామమే కాబట్టి సగుణమైన భక్తికి దారి తీస్తాయి. అది జ్ఞానాన్ని ప్రసాదిస్తే ఆ జ్ఞానం నిష్ఠగా సాగి అనన్య భక్తిలో పర్యవసాన మవుతుంది.

ఏతావతా తేలిందేమిటి ఇంతకూ. కర్మయోగం, భక్తియోగం, జ్ఞానయోగం. మరలా భక్తియోగం. ఈ నాలుగూ మోక్షమార్గంలో నాలుగు మజిలీలు. మొదటి మూడూ పరంపరయా అయితే నాలుగవది సాక్షాత్సాధనం మోక్షానికి. అది జ్ఞానానంతరం కలిగేదైతే రెండవది జ్ఞానానికి పూర్వమేర్పడేది భక్తి. భాగవతమీ పూర్వరూపమైన భక్తినీ చెప్పినా రెండవదాని మీదనే దానికి తాత్పర్యం. మొదటి దాన్ని కేవలం దానికి ఆలంబనంగా పేర్కొన్నదని మాత్రమే మనం గ్రహించవలసి ఉంది. **"అనర్థోపశమం సాక్షాద్భక్తి యోగమధోక్షజే"** అనే మాట ఈ దృష్టితో చెప్పిన మాటే. అంతేకాదు. **"ఇంచుక మాయ లేక మది నెప్పుడు బాయని భక్తితోడ వర్తించుచు"** అన్నప్పుడు కూడ భక్తి అనే మాట అనన్యభక్తి అనే దృష్టితో వాడినదే. ఇంచుక మాయలేక అంటే అజ్ఞానమే మాత్రమూ లేనిది. అంటే సమ్యగ్జ్ఞానంతో కూడుకొన్నది. పైగా మదినెప్పుడూ పాయనిది. అంటే అనన్యమైనది. జ్ఞానానంతరం అనన్యంగా కలిగేది అనన్యభక్తి గాక మరేమిటి. సగుణమైతే ఇంచుక మాయలేక – ఎప్పుడూపాయని అనే మాటల కర్థంలేదు. అంచేత ఇలాటి అనన్యభక్తినే మోక్షసాధనంగా భాగవతం లోకానికి ప్రతిపాదిస్తున్నది. అది శాస్త్రం చెప్పే జ్ఞాననిష్ఠా రూపమే గాని మరేదీ గాదు. దానికి పరంపరగా తోడ్పడే సాధనాలే కర్మయోగ భక్తియోగాలనే మొదటి రెండు భూమికలూ, ఇదీ వీటన్నిటినీ కలుపుతున్న ఏకైక సూత్రం. భాగవత మయా సందర్భాలలో ఆయా భూమికల నన్నిటినీ వర్ణిస్తూ పోతుంది. కాబట్టి ఈ సూత్రాన్ని పట్టుకొని పరామర్శిస్తే మనకది సగుణమో, నిర్గుణమో యోగమో, జ్ఞానమో, ఏ భాగవతుడి జీవితమే భూమికలో ఉందో ఎలా సాగిందో చక్కగా అవగాహనకు రాగలదు.

8. కర్మయోగులు - దక్షాదులు

మోక్ష సాధన మార్గంలో మన మింతవరకూ నాలుగు భూమికలను గూర్చి చర్చించాము. ఒకటి కర్మ, రెండు సమాధి, మూడు భక్తి, నాలుగు జ్ఞానం లేదా అనన్యభక్తి. ఇవి నాలుగూ సాక్షాత్తుగా మోక్షాన్ని ప్రసాదించవు. వీటిలో నాలుగవదైన జ్ఞానమే సాక్షాన్మోక్ష ప్రదం. అదే భాగవత పురాణ తాత్పర్యం. పరీక్షిత్తు కోరింది అదే శుకుడు బోధించింది అదే. కాబట్టి ప్రధానంగా భాగవతం ప్రతిపాదిస్తున్న మోక్షసాధనమదే. అయితే అదే ప్రధానమైనా దానికిమిగతా మూడూ ఆనుషంగికాలు Accessories అవి లేనిదే ఇది పరిపాకానికి రాదు. కాబట్టి జ్ఞాన పరిపాక హేతువులైన కారణంగా వాటినికూడా ఆయా సందర్భాలలో భాగవతం ప్రతిపాదిస్తూనే వచ్చింది. పురాణమనేది అర్థవాదమని చెప్పాము. అర్థవాదమెప్పుడయిందో అప్పుడు చెప్పవలసిన సత్యాన్ని నగ్నంగా చెప్పటానికి లేదు. అది శాస్త్ర మర్యాద. పురాణ ప్రక్రియ గాదు. కథలు పాత్రలు వారి ప్రవృత్తులు - ఇలాంటి ప్రణాళిక ద్వారా బోధించటమే పురాణ మార్గం. అందులో కర్మయోగానికి సంబంధించిన పాత్రలు వారి చరిత్రలు కొన్ని అయితే సమాధి యోగుల కథలు కొన్ని అయితే సగుణ భక్తుల వ్యవహారాలు కొన్ని అయితే నిర్గుణ భక్తులైన జ్ఞానుల గాథలు కొన్ని. ఇలా విభజించి చూస్తే భాగవత కథలు పాత్రలు వారి వ్యవహారంలోని తరతమ భావమూ మనకు బాగా బోధపడుతుంది. దీనిని బట్టి ప్రస్తుతం అన్నిటికంటే మొదటి మెట్టయినకర్మ యోగమూ దానికి సంబంధించిన భాగవత పాత్రల చరిత్ర ఎలాంటిదో పరిశీలించి చూతాము.

అందులో కూడా కర్మయోగం వేరు. కర్మానుష్ఠానం వేరు. కేవలమిది మనకు విహితమని అనుష్ఠించేది కర్మానుష్ఠానం. అందులో ఈశ్వర భావన అంతగా లేదు. పోతే ఇది ఒకానొక ఈశ్వరుడు మనచేత చేయిస్తున్నాడు. దీని ఫలితమాయనకే అని నిర్లప్తంగా నిష్కామంగా ఆచరిస్తే అది కర్మయోగం. దీనిలో ఈశ దృష్టి ఎక్కువ. కర్మయోగంగా పరిణమించటమే గొప్ప అసలు. అంతవరకూ మానవుడు సాధకుడు కాడు. కేవల కర్మజడుడు మాత్రమే. అలాటివాడు మోక్షమార్గంలో ఉన్నా లేనివాడే.

ఇలాటి కర్మిష్ఠుల కోవలో కొందరు కనిపిస్తారు మనకు భాగవతంలో. వారిలో మొదటివాడు దక్షప్రజాపతి. ప్రజాపతి అంటేనే అసలు కర్మమార్గ ప్రవర్తకుడు. అయితే ఈ దక్షుడందులో కూడా తగ్గు స్థాయిలో ఉన్నవాడు. దక్ష అనే మాట సంకేతంగా తీసుకొంటే కర్మాచరణ దక్షుడని అర్థం చెప్పుకోవచ్చు. కర్మ తప్ప జ్ఞానమనే వాసన లేని వారంతా దక్షులే. జ్ఞానవాసన లేకనే అతడు కర్మ ఫలదాత అయిన ఈశ్వరుణ్ణే బహిష్కరించి యజ్ఞాని కుపక్రమించాడు. శివుడు సర్వేశ్వరుడని తెలియక తన అల్లుడని భ్రమించి నలుగురిలో శివదూషణ చేయటానికి కూడ వెనుదీయలేదు. శివుణ్ణి వెలివేసి చేసిన యజ్ఞం ఫలితమీయదని ఎందరు చెప్పినా వినలేదు. తుదకు జగన్మాత తన కళ్ల ఎదుట దగ్ధమవుతున్నా తనకేమీ పట్టనట్టు చూస్తూ మిన్నకున్నాడు. తన నిర్లక్ష్యానికి ఫలితంగా ఈశ్వరుని ఆగ్రహానికి గురి అయ్యాడు. అపర రుద్రుడైన వీరభద్రుడు యజ్ఞ విధ్వంసనం చేసి అతని శిరస్సు ఛేదించి **"జుహావై తచ్ఛిరస్తస్మిన్ - దక్షిణాగ్నావ మర్షితః"** దక్షిణాగ్నిలో దాన్ని హోమం చేసి వెళ్లిపోయాడు.

తరువాత ఈ వృత్తాంతం తెలిసి దక్షుని తండ్రి చతుర్ముఖుడు పోయి రుద్రుని ప్రార్థిస్తే ఆయన మేషశీర్షం తెచ్చి అతికించమని అనుగ్రహిస్తే ప్రత్యుజ్జీవితుడై దక్షుడు తన అపచారం మన్నించమని వేడుకొంటూ ఇలా వాపోతాడు.

"యో ఽసౌ మాయా విదిత తత్త్వ దృశా సభాయామ్
క్షిప్తో దురుక్తి విశిఖై రగణయ్య తన్మామ్
అర్వా కృతంత మర్హత్తమ నిందయా పాత్
దృష్ట్యా ర్ద్రయా సభగవాన్ స్వకృతేన తుష్యేత్"

అసలు తత్త్వమేదో అది గ్రహించలేక నేను నా మార్గమే గొప్పదని నమ్మి మిమ్ములను దూషించాను. అయినా మీరు నన్ను చివరకు మన్నించారు. నేనెంత ధన్యుడనంటాడు. ఆ తరువాత ఆయన చేత అనుజ్ఞాతుడై మరలా యథావిధిగా యజ్ఞం చేసి పవిత్రుడవుతాడు దక్షుడు. ఇది యజ్ఞమూ గాదు. దక్షుడూ కాదు. జీవితమే ఒక దీర్ఘమైన యజ్ఞం. బాల్యాదులైన మూడు దశలూ అందులో మూడు సవనాలు. అది పరమేశ్వర ప్రీత్యర్థమని తద్భావన సడలకుండా నిష్కామంగా నిరహంకారంగా ఆచరిస్తే ఫలితమిస్తుంది. అంటే సమ్యగ్ జ్ఞానానికి దోహదం చేస్తుంది. అలాంటి

భావన దూరం చేసుకొని నేను కర్మాచరణ దక్షుడను గదా అని అహంకరించి ముందుకు పోతే ఫలితం లేకపోగా పరాభవం పాలవుతాడు మానవుడు. ఇదీ దీని తాత్పర్యం.

ఈ దక్షుడింతటితో ఆగలేదు. ఇంకా ఒక ఘనకార్యం చేశాడు జీవితంలో. నారద మహర్షిలాంటివాడికి శాపమిచ్చాడీ మహానుభావుడు. కేవల ప్రవృత్తి మార్గంలో చిక్కి దిక్కు తెలియక చెడిపోయే ప్రాణికోటికి మోక్షమార్గం చెప్పి ఉద్ధరించటమే ఆయన వ్రతం. దక్షుడీశ్వరానుగ్రహంతో బ్రతికిన తరువాత అయుత సంఖ్యాకులైన పుత్రులను కన్నాడు. ప్రజాసృష్టి చేయవలసిందని వారిని నియోగించాడు. వారికెందుకో పారమ హంస్యమైన ధర్మంలోనే మనసులు ప్రసరించసాగాయి. అది కనిపెట్టి నారదుడు వచ్చి వారికి నివృత్తి ధర్మాన్ని నూతిపోశాడు. వారది బాగా ఒంట బట్టి **"ప్రయయు స్తంపరి క్రమ్యపంథాన మని వర్తకమ్"** పునరావృత్తి రహితమైన పరమ పదాన్ని పోయి చేరారు. అది తెలిసి దక్షుడు చాలా బాధపడి మరలా ఒక వేయిమంది కుమారులను శబలాశ్వులనే వారి నుత్పాదించాడు. వారిని కూడా నారదుడలాగే బోధించి నివృత్తి మార్గానికి పంపుతాడు. దానికి దక్షుడు ఆగ్రహోదగ్రుడై

అహో అసాధో సాధూనాం - సాధు లింగేన నస్త్వయా
అసాధ్వకా ర్యర్భకాణాం - భిక్షో ర్మార్గః ప్రదర్శితః

ఓరి దుర్మార్గుడా - సాధువేషంతో వచ్చి అసాధువులైన మాటలు చెప్పి అర్భకులకు సన్యాస ధర్మాన్ని బోధించి నన్ను బాధిస్తావా

ఋణైస్త్రిభి రముక్తానా మ మీమాంసిత కర్మణాం
విఘాతః శ్రేయసః పాప-లోక యోరుభయోః కృతః

గృహస్థులుగా ఉండి ఋణత్రయం తీర్చకుండానే వారిని పరివ్రాజకులుగా మార్చి ఇహ పరాలకు దూరం చేశావు. **"తస్మాల్లోకేషు తే మూఢ నభ వేద్భ్రమతః పదమ్"** నీకీ పదునాలుగు లోకాలలో ఎక్కడా నిలకడ ఉండబోదు. కాలు గాలిన పిల్లిలాగా తిరుగుతూ పోతావు పొమ్మని శాపమిస్తాడు. దానికి నారదుడు కించిత్తు కూడా చలించలేదు.

ప్రతి జగ్రాహతమ్ బాఢమ్ నారద స్సాధు సత్తమః
ఏతావాన్ సాధువాదోయ త్తితిక్షే తేశ్వరః స్వయమ్

దక్షుడిచ్చిన శాపం మహాప్రసాదమంటూ స్వీకరించాడు. అలాటి సహనబుద్ధి నిత్యమూ కలిగి ఉండటమే భగవత్స్వరూపులైన జ్ఞానుల లక్షణమంటాడు శుకమహర్షి.

దీనిని బట్టి దక్షుడికి కర్మ జడత్వమెంత ఉందో తేట పడుతుంది. తానే గాక తన సంతతి కూడా తరించటమతని కిష్టం లేదు. ప్రవృత్తి మాత్ర సంతృప్తులైన మానవుల దృక్పథానికి నిదర్శనమే ఈ కథ. వారు తాము బాగుపడరు. మరొకరిని పడనీయరు. తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లని కూచుంటారు. తమ కర్మమార్గం తప్ప దాని కతీతమైన మార్గమొకటి ఉంది దాన్ని పట్టుకొంటే గాని ముక్తి లేదనే సత్యం వారి మనసుకు పట్టదు. ఎవరైనా దాన్ని బయట పెట్టినా అర్థం చేసుకోలేరు సరిగదా కర్మభ్రష్టులని వారిని పడదిడతారు. ఇంతకూ తామే సర్వవిధాలా దక్షులని తమ మార్గమే అన్నిటికన్నా పరమోత్కృష్టమైన మార్గమంతకన్నా అనుసరణీయమైన మార్గమంటూ వేరొకటి లేనేలేదని – తమ మూఢత్వాన్నే ప్రౌఢత్వంగా భావించే మేధావులు వారు. అలాంటి వారి స్వభావానికి చిహ్నంగా చెప్పిందే ఈ కథా సందర్భం.

పోతే ఈ దక్షుడికంటే కొంత మెరుగైన వాడు ప్రాచీన బర్హి. అతడొక క్షత్రియవంశజుడు. నిరంతర కర్మాసక్త చేతస్కుడు. యజ్ఞమనే నెపంతో నోరులేని ప్రాణులను కొన్ని వేల సంఖ్యలను వధించి హోమం చేశాడు. దానివలన మనకు స్వర్గభోగం ఖరారు గదా అని కలలు గంటుంటాడు. ఉన్నట్టుండి ఈ నారదుడే బయలుదేరి వస్తాడా రాజు దగ్గరికి. ప్రత్యుత్థానాదులతో సత్కరించి అయ్యా ఎక్కడ నుంచి రాక అని ప్రశ్నిస్తాడు. సరాసరి యమలోకం నుంచి అంటాడు. అక్కడ ఏమిటి వార్త అని అడుగుతాడు. అంతా నీవార్తే చెప్పుకొంటున్నారంటాడు. నా వార్త అక్కడ దేనికి వచ్చిందని ఆశ్చర్యపోతూ ప్రశ్నిస్తాడు. ఇందులో ఆశ్చర్యమేముంది. కొన్ని వేల పశువులను విశసనం చేశావు గదా. **"ఏతే త్వామ్ సంప్రతీక్షంతే స్మరంతో వైశసమ్ తవ"** అవన్నీ నీ రాకకోసం ప్రతీక్షిస్తున్నాయి. **"సంపరేత మయఃకూటై శ్ఛిందంత్యుత్థిత మన్యవః"** చచ్చి అక్కడికి వెళ్లావంటే ఇనుప గుదియలలాంటి కొమ్ములతో నీ కడుపులో కుమ్మి నిన్ను చిందరవందర చేయటం ఖాయం. అని

ఘాటుగా సమాధానమిస్తాడు. అయితే కర్మిష్ఠుడైనా ప్రాచీనబర్హి దక్షుడిలాగా కోపపడలేదు. మీదు మిక్కిలి పశ్చాత్తాపపడ్డాడు. అయ్యో ఎంత బాలిశమైన కర్మ మాచరించాను. దీనికేమిటి నిష్కృతి **'నజానామి మహాభాగ-పరం కర్మాప విద్ధధీః'** కర్మాప విద్ధ బుద్ధినై అంతకన్నా పరమమైన జ్ఞానాన్ని ఆర్జించలేక పోయాను. **"బ్రూహిమే విమలమ్ జ్ఞానమ్ యేన ముచ్యేయ కర్మభిః"** అమలినమైన జ్ఞానాన్ని నాకు ప్రసాదించు. అది ఈ కర్మ నిర్మూలనం చేసి నాకు ముక్తిని ప్రసాదిస్తుంది. **"గృహేషు కూట ధర్మేషు"** కూటధర్మమైన గృహస్థాశ్రమంలో **పుత్ర దార ధనార్థధీః** భార్య, పుత్రులూ, ధనధాన్యాలని ప్రాకులాడుతూ **"నపరం విందతే మూఢో భ్రామ్యన్ సంసార వర్త్మసు"** అంతకు మించిన తత్త్వమేదో దాన్ని మరచి ఈ సంసార వలయం లోనే దిమ్మ దిరుగుతున్నారీ మానవులు. నాకిప్పుడు మీరు కన్నులు తెరిపించారు. ప్రవృత్తే సర్వశ్రేష్ఠమనుకొన్న నాకు నివృత్తి మార్గముపదేశించి కృతార్థుణ్ణి చేయమని ప్రార్థేయపడతాడు. చూడండి. ఇద్దరూ కర్మిష్ఠులే అయినా చెప్పినా పెడచెవిన బెట్టాడు దక్షుడు. చెప్పమని వేడుకొంటున్నాడు ప్రాచీనబర్హి. అతడికీ నారదుడే ఇతడికీ ఆ నారదుడే ఉపదేష్ట. ఒకడు కర్మమూఢుడై గురువునే ధిక్కరిస్తే మరొకడు కర్మతత్త్వ జిజ్ఞాసువై గురువు నాశ్రయిస్తాడు. లోకంలో ఉన్న అధికార తారతమ్యాన్నే ఆఖ్యాయిక మనకు నిరూపిస్తున్నది.

ఆ తరువాత నారదుడారాజు ప్రశ్నకు సమాధానంగా పురంజనోపాఖ్యానమని ఒక చక్కని ఉపాఖ్యాన మేకరువు పెడతాడు. ఇది భాగవతానికంతా మకుటాయ మానమైన కథ. కథా అనే వ్యాజంతో బ్రహ్మాండమైన ఒకసత్యాన్ని మనకు బోధించే ఒకానొక గొప్ప సంకేతం Allegory లేదా అర్థవాదం. పురాణమంతా అర్థవాదమే ననే మాట ఇక్కడ పూరా మనకు తార్కణమవుతుంది. ఎక్కడా జరిగింది చేసింది కాదిది. అప్పటిక కప్పుడా రాజుకు జ్ఞానోదయం కోసం నారదమహర్షి అల్లిన అద్భుతమైన అల్లకం. ఇది నిజంగానే జరిగిందని ఎక్కడ బోల్తాపడుతారో పడి దాని అసలైన అంతరార్థమెక్కడ విస్మరిస్తారో నని అతడే మరలా ఈ కథా సంకేతాన్నంతటినీ ఎక్కడి కక్కడ విప్పి చెప్పాడు కూడా. నిజంలో పురంజనుడూ లేడు. వాడు తనస్నేహితుడితో కలిసి రావటమూ లేదు. వాడు రాజ్యంచేసింది లేదు. బ్రతికింది లేదు. చచ్చింది లేదు. చచ్చి మరలా బ్రతికిందీ లేదు. అంతా సాంకేతికం. పురమంటే

మన శరీరమే. ఈ శరీరంలో వచ్చి ప్రవేశించిన చిదాభాసుడు జీవుడే పురంజనుడు. ఈ ఆభాసకు వెనకాల ఉండి దీన్ని కనిపెట్టి చూచే అసలు చైతన్యం ఈశ్వరుడు. రెండూ రెండు హంసలివి. ఒకటి శరీరమనే పంజరంలో ప్రవేశించింది. మరొకటి దేనిలో ప్రవేశించక అంతటా వీర విహారం చేస్తున్నది. ప్రవేశించిన చైతన్య మీ శరీరాద్యుపాధులమేరకే చిక్కి ఇదే తానని భావించి తన అసలు స్వరూపాన్ని విస్మరించింది. ఇదే ఈ హంస ఆ హంసకు దూరమై పోయిందని చెప్పటం.

దూరం కావటానికేమిటి కారణం. **"సోన్వేషమాణ శ్శరణమ్ బభ్రామ పృథివీ మిమామ్"** తనకు తానే శరణమని తెలుసుకోలేక ఒక శరణ్యం కోసమని ఈ భూమికిదిగిరావటమే. నిరుపాధికమైన తత్త్వం సోపాధికంలో వచ్చి పడటం. పృథివ్యాది భూతమాత్రా సంసర్గమే ప్రమాద కారణమైనది. అందులోనూ **"దదర్శ నవభిర్ద్వార్భిః పురమ్ లక్షిత లక్షణామ్"** నవద్వారాలు గల పురాన్ని దర్శించాడట పురంజనుడు. ఆ పురం నవద్వారాత్మకమైన ఈ శరీరంగాక మరేముంటుంది. నవద్వారేపురేదేహే అని చాటుతుంది భగవద్గీత. అంతెందుకు. ఉపనిషత్తులే చాటాయసలు.

పురశ్చక్రే ద్విపదః పురశ్చక్రే చతుష్పదః
పురస్స పక్షీ భూత్వా పురః పురుష ఆవిశత్

రెండు కాళ్ల పట్టణాలు కొన్ని, నాలుగు కాళ్లవి కొన్ని సృష్టించుకొని వాటిలో తానొక పక్షిలాగా అయి ప్రవేశించాడట పరమాత్మ. **"యదృచ్ఛయా గతామ్ తత్ర దదర్శ ప్రమదోత్త మామ్"** ఎవరీ ప్రమదోత్తమ. **భృత్యైర్ద శభిరాయాంతీమ్** – పైగా పదిమంది సేవకులట ఆవిడ కిరువైపులా. **పంచశీర్షాహినా గుప్తామ్** అయిదు తలకాయల సర్పమొకటి ఆవిడకురక్షణకల్పిస్తుందట. **"అన్వేష మాణా మృషభమ్"** ఆబోతులాంటి ఒక మగవాడి పొందు కోసమట్టులు సాచి వస్తుందట – ఏమిటిదంతా. ఆ ప్రమదారత్నమెవరో గాదు. మానవుడి బుద్ధి. దానికిరువైపులా ఉన్న సేవకులు పదిమందీ పది ఇంద్రియాలు. పంచశీర్షమైన పన్నగం ప్రాణాపానాది పంచవృత్తులు గల ప్రాణవాయువే. ప్రాణ సహితమైన బుద్ధి వృత్తే ఉపాధి జీవుడికి. దాని నభిమానించటం మూలాన్నే శరీరంలో బందీ అయి కూచున్నాడు.

"త్వయోప సృష్టో భగవా న్మనోభవః
ప్రబాధతే ఽథాను గృహాణ శోభనే"

కామ బాధకు తట్టుకోలేను నన్ను నీవాణ్ణి చేసుకోమంటాడు. అంటే **"అభ్యనందత తం వీరం హసంతీ వీరమోహితా"** అలాగే కానీయమని అతని కోరిక అభినందిస్తుందట. అన్యోన్య తాదాత్మ్యమంటే ఇదే. దీనివల్లనే సంసారం. అదే ఇక్కడ పురంజనుడి పురప్రవేశం.

ప్రవేశంతో సరిపోయిందా. **"ఏవంకర్మసు సంయుక్తః కామాత్మా వంచితో బుధః"** కామం కర్మకు దారి తీసింది. **"మహిషీయ ద్యదీహేత-తత్త దేవాన్వ వర్తత"** ఆవిడ ఏది కోరితే అది. సంకల్పాన్ని బట్టే గదా మన సకల వ్యావృత్తులూ. ఇలా ఉండగా ఒకనాడు రథారూఢుడై అరణ్యానికి వెళ్లాడట పురంజనుడు. అక్కడ మృగ సంతానాన్ని వేటాడాడట. చాలా అలసిపోయి మరలా కొంప చేరుతాడు. తన ప్రేయసి ఎక్కడా కంటబడలేదు. ఎంతో పరితపిస్తాడు. ఏమయిందని వారి వారి నడుగుతాడు. లోపలికి వెళ్లి చూస్తే నేలమీద పడి దొర్లుతుంటుంది. ఏమిటి విషయమని ప్రశ్నిస్తే ఒంటరిగా ఆవిడను వదలిపోవటమే ఆవిడ దైన్యానికి నిమిత్తమని గ్రహిస్తాడు. బ్రతిమాలుకొని మరలా ఆవిడతో భోగిస్తాడు. ఏమిటిందులో రహస్యం. బుద్ధిని విడిచి ఒక్క క్షణముండలేడు జీవుడు. ఒకవేళ సుషుప్త్యాది దశలలో ఉన్నా మరలా జాగ్రదాదులలో దానితో కలిసి ఉండవలసిందే. ఎప్పటికీ దూరమై పోవటమంటూ ఉండబోదు.

యుక్తేష్వేవం ప్రమత్తస్య - కుటుంబా సక్త చేతసః
ఆ ససాద సవైకాలః - చండవేగ ఇతిఖ్యాతః

ఇలా కుటుంబ జంబాలంలో కూరుకుపోయి పరాకు చెందిన ఆ పురంజనుడి మీదికి దండెత్తి వచ్చాడు చండవేగుడనే వాడు. చండవేగం గలది కాలమే మరేదీ గాదు. దానికొక కన్యక. అది యవనేశ్వరుణ్ణి ఆశ్రయిస్తుంది. వాడికి ప్రజ్వారుడనే సోదరుడు. వీరంతా వచ్చి పురంజనుడి పురంమీద విరుచుకుపడతారట. ఇదంతా సాంకేతికమే. జరావ్యాధులే కాల కన్యాది పరివారం. **"దదాహ తాం పురీం కృత్స్నామ్"** ప్రజ్వారుడా పురాన్నంతా కాల్చివేశాడట. అంటే శరీరం జరావ్యాధి జర్జరితమయింది. అయ్యేసరికి న శశాకోషితుం తత్ర అందులో ఉండలేకపోతాడు పురంజనుడు.

విక్రుష్యమాణః ప్రసభం - యవనేన బలీయసా
తామేవ మనసాగృహ్ణన్ బభూవ ప్రమ దోత్తమా

అనంతరం విదర్భరాజ సింహస్యవేశ్మని కాల కబళితుడై తన ఇల్లాలి రూపాన్నే స్మరిస్తూ తరువాత జన్మలో విదర్భరాజు కుమార్తెయై జన్మిస్తాడు.

"యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరం తంతమే వైతి"

అని భగవదను శాసనం. ఏది భావిస్తూ పోతే పురుషడదే అవుతాడు. పూర్ణమైన తత్వాన్ని భావిస్తే పురుషోత్తమడవుతాడు. అలాకాక అపూర్ణమైన సంసార భావాలనే భావిస్తూ పోతే అపూర్ణమైన స్త్రీ జన్మే వస్తుంది. తప్పేదేముంది.

అదైనా దక్కిందా చివరకు. ఆ జన్మలో కూడా ఒక రాజకుమారుణ్ణి వివాహమాడి **"పతిం పర్యచరద్ధిత్వా భోగాన్ సాపతి దేవతా"** ఆయన తపస్సు చేస్తుంటే తానూ ఆయనకు పరిచర్య చేస్తూ పోతుంది. చివరకాయన బ్రహ్మ నిర్వాణం పొందినా ఇంకా బ్రతికి ఉన్నాడనే భ్రాంతి పడుతుంది. చివర కాయన ఉపరతుడయ్యాడని తెలుసుకొని ఎంతగానో విలపిస్తుంది. చితి పేర్చుకొని పతి ననుగ మించాలని ఉద్యుక్తురాలవుతుంది. **"తత్ర పూర్వతరః కశ్చిత్సఖా బ్రాహ్మణ ఆత్మవాన్"** అప్పుడు ప్రత్యక్షమవుతాడొక బ్రాహ్మణుడు. **"జానాసి కిం సఖాయాం మాం"** పూర్వ సఖుణ్ణి నన్ను గుర్తించావా అని అడుగుతాడు. **"హంసా వహం చ త్వం చార్యే - సఖాయౌ మానసాయనౌ"** మనమిద్దరమూ ఒకప్పుడు మానస సర స్సంచారులమైన రాజహంసలం. **"సత్వం విహాయ మా బంధోగతో గ్రామ్యమతి ర్మహీమ్"** నన్ను వదిలేసి హఠాత్తుగా నీవీ భూమి మీద వాలాలని దుర్బుద్ధి పుట్టి వాలిపోయావు. వాలి అంత కంతకీ సాంసార వాగురలో చిక్కి సోలిపోయావు. ఒక్కసారి జరిగినదంతా జ్ఞాపకం చేసుకోమంటాడు.

ఏవం సమాననో హంసో - హంసేన ప్రతిబోధితః
స్వస్థస్త ద్వ్యభిచారేణ - నష్టా మావపునః స్మృతిమ్

అనే సరి కాహంస మాటలతో అంత కాలం నుంచీ తన్నలము కొన్న మైకం దిగిపోయి స్వస్థత చెంది సంసార వ్యాసంగంతో కోలుపోయిన పూర్వస్మృతిని మరలా పొంద గలిగాడట పురంజనుడు. ఇదే గురూపదేశమంటే. ఆ వచ్చిన హంస ఒక

గురువు. దాని మాట తత్త్వమసి లాంటి మహావాక్యం. తన్మూలంగా నేనీ స్త్రీ పుంస రూపుణ్ణి కాను. నాకీ బంధు మిత్రాది సంబంధమేదీ లేదు. నేనా పరమాత్మ స్వరూపుణ్ణి అని స్వస్థుడవుతాడుజీవుడు. **స్మస్మింస్తిష్ఠ తీతి స్వస్థః స్వేమహిమ్ని ప్రతిష్ఠితః** అన్నట్టు తన స్వరూపంలో తానుండటమే స్వస్థత. అలా లేకపోతే అది వ్యభిచారం. దానివల్ల ఆత్మ స్థితి కోలుపోయి అనాత్మ ప్రపంచంలో పడిపోతాడు మానవుడు. అదేగదా పురంజనుడి సంసార యాత్ర. అది ఇప్పుడీ గురూపదేశం వల్ల తొలగిపోయి పూర్వ వైభవం మరలా అనుభవానికి వచ్చింది.

ఇంత పెద్ద సంకేతముంది ఈ కథలో. జీవుడి అవిద్యా కామకర్మలూ వాటివల్ల కలిగే అనర్ధమూ దాన్ని పోగొట్టుకొని మరలా పురుషార్ధాన్ని సాధించవలసిన అవశ్యకతా ఎలాంటిదో నిరూపించటానికే ఈ కథా కథనమంతా. ఇంతకూ కామమే కర్మకు మూలం. కామానికి మూలం అవిద్య. అవిద్యఅంటే అజ్ఞానం. అజ్ఞానం వల్లనే తనకేదో స్వర్గాది భోగాలు లభిస్తాయని చెప్పి దానిమీది కామంతో నోరులేని పశువుల నెన్నింటినో వధించటానికి పాలుపడతారు కర్మిష్ఠులు. జ్ఞానం లేకపోవటం వల్లనే ఇలాంటి కామ్యకర్మలలో నిమగ్నులు కావటం. దీనివల్ల ముక్తి లేదు సరిగదా చివరకు నరకపాతం తప్పదు వీరికి. కాబట్టి ఆత్మజ్ఞానం సంపాదించి ఇలాంటి కామ్యకర్మలన్నిటికి స్వస్తి చెప్పమని చెప్పటానికే నారదుడీ పురంజనకథ ఒకటి కల్పించి ప్రాచీన బర్హికి బోధించాడు. దక్షుడిలాగా అతడు మందాధికారి కాడుకాబట్టి కోపతాపాలకు గురిగాక ఆ బోధలోని పరమార్ధాన్ని గ్రహించి బాగుపడతాడు. మొదట మొదట అవివేకంతో పొరబాటు పడి కర్మమయ జీవితం కొనసాగించినా క్రమంగా పెద్దల సాహచర్యంతో వారి బోధలు విని అందులోని ప్రమాదాన్ని గుర్తించి జీవిత కర్తవ్యమేదో దాన్ని పాటిస్తూ పోవాలని దీనికంతటికీ తాత్పర్యార్ధం.

ప్రాచీన బర్హి వృత్తాంతం కన్నా ఇంకా కొంత సున్నితమైనది విప్రజనుల వృత్తాంతం. పశు వధ పాతకమైనా ఉన్నదందులో. వీరి విషయంలో అలాటి హింసాకార్యాదులు కూడా లేవు. అయితే కామ్యమనేది మాత్రమక్కడా ఇక్కడా సమానమే. స్వర్గ సుఖ కామంతోనే ద్వాపరయుగంలో కొందరు విప్రులు బృందావన సమీపంలో ఆంగిరసమనే పేరు గల సత్రయాగం తలపెట్టి సలుపుతుంటారు. కృష్ణుడు తన తోడి గోపబాలురతో గూడి పసుల కదుపులను వెంట బెట్టుకొని చాలా దూరం

నడచి వస్తాడు. దూర గమన క్లేశ ఖిన్నులైన గోపకులా కటికి తట్టుకోలేక అన్నం పెట్టించమని కృష్ణుని ప్రార్థేయపడతారు. ఆయనవారితో ఆ బ్రాహ్మణులు దేవయజనం చేస్తున్నారు – వారిని వెళ్లి అడగండి – పెడతారని చెబుతాడు. వారు వెళ్లి

హే భూమి దేవాః శృణుత – కృష్ణస్యా దేశకారిణః
ప్రాప్తాన్ జానీత – భద్రంవో గోపాన్నో – రామ చోదితాన్
గాశ్చారయంతా వవి దూర ఓదనమ్
రామాచ్యుతౌ యల్లషతో బుభుక్షితౌ
తయోర్ద్విజా ఓదన మర్థినో ర్యది
శ్రద్ధాళవో యచ్ఛత ధర్మవిత్తమాః

రామకృష్ణులు పంపితే తమ దగ్గరికి వచ్చాము. వారీ అరణ్యంలో ధేనువులను మేపుకొంటూ వచ్చి చాలా ఆకలిగొని ఉన్నారు. మీరు సకల ధర్మములూ తెలిసినవారు. శ్రద్ధాళువులే అయితే మీరు అన్నార్తులయి ఉన్న వారికన్న భిక్ష పెట్టగోరుతున్నామని యాచిస్తారు. కాని వారా మాటలు వినిపించుకోరు. దేశకాల ద్రవ్యమంత్ర తంత్రాదులన్నీ భగవన్మయమని ఆ భగవంతుడు సాక్షాత్తూ ఈ కృష్ణ పరమాత్మేనని తెలుసుకోలేక **"మనుష్య దృష్ట్యా దుష్ప్ర జ్ఞామర్త్యాత్మానోన తేవిదుః"** మనుష్యమాత్రుడని భావిస్తారు లేదు పొమ్మని కసరికొడతారు. వారు మరలా వచ్చి మొరపెడితే

"తదుపాకర్ణ్య భగవాన్ ప్రహస్య జగదీశ్వరః
వ్యాజహార పునర్గోపాన్ దర్శయన్ లౌకికీమ్ గతిమ్
మామ్ జ్ఞాపయత పత్నీభ్యః ససంకర్షణ మాగతమ్
దాస్యంతి కామ మన్నమ్వః"

ఆయన నవ్వి వారి దగ్గరికి వెళ్లకండి. ఈ సారి వారి భార్యల దగ్గరికి వెళ్ళి అడగండి. మేము వచ్చామని చెప్పారంటే తప్పకుండా వారు మిమ్ముల నాదరిస్తారని చెబుతాడు.

అలాగే నని గోపకులా విప్రభార్యల వద్దకు వెళ్ళి చెప్పేసరికి కృష్ణాగమనవార్త తమ చెవుల కమృతవర్షంలాగా అయి వారు **"బిడ్డలు మగలును భ్రాతలునడ్డము**

సనివలద నంగ-నటుదలడని - మాఱొడ్డుచు జగదీశ్వరునకు జడ్డన నన్నంబు గొనుచు జని రాసుదతుల్" మగలు, బిడ్డలు, తోబుట్టువులూ ఎవరు వచ్చి అడ్డు పెట్టినా లెక్క చేయక భక్ష్య భోజ్యాదులైనచతుర్విధాహారాలూ తీసుకొని సముద్రమువ నిమ్నగా సముద్రాని కెదురు నడిచే గంగాది నదులలాగా మహాసంభ్రమంతో నడిచి వెళ్లేరట. వారిని చూడగానే భగవానుడు. **"స్వాగతమ్ వో మహాభాగా - ఆస్యతామ్-కరవామకిమ్"** మీ కందిరికి స్వాగతం. ఇలా వచ్చికూచోండి. మీకు నేనేమి చేయాలి చెప్పండి. **"మమ్ము నిచటన్ వీక్షింప నేతించినారెంతో వేడుకతో - నన్ను ధీమంతుల్ మీవలె జేరికందురు గదా మత్సేవలన్ సర్వమున్"**

తద్యాత దేవ యజనమ్ పతయోవో ద్విజాతయః
స్వసత్రమ్ పారయిష్యంతి యుష్మాభి ర్గృహ మేధినః

ఇక వెళ్లండి. మీ పతులు యజ్ఞం చేస్తున్నారు. అది మీరు లేకుంటే సఫలం కాదని బోధిస్తాడు. ఆ మాటలు విని వారు

తగునే మాధవ యిట్టివాడి పలుకుల్ - ధర్మంబులే మాయెడన్
మగలున్ బిడ్డలు సోదరుల్ జనకులున్ మమ్మున్ నివారింప - మ
చ్చిగ నీయం ఘ్రులుసేరి నారమటవో cజేకొందురే వారలా
పగిదే మొల్లము కింకరీ జనులుగా భావించి రక్షింపవే

మళ్లీ వెళ్లితే మమ్మువారు రానీయరు. వెళ్లే తలంపు కాడా మాకు లేదు. నీ పాదమూలమే మాకు శరణ్యం. దాసీజనులుగా పాటించి మమ్ము గైకొమ్మని ప్రార్థిస్తారు.

పరమాత్మ అనుగ్రహానికి తమ సతులు పాత్రత వహించారని తెలిసి అనంతరం వారి పతులైన ఆ విప్రజనులు తమ అవివేకాన్ని గుర్తించి ఎంతో పశ్చాత్తాపపడి ఇలా వాపోతారు.

కట కట మోసపోయితిమి కాంతల పాటియు బుద్ధి లేదు - నే
డిట హరిగాన బోనెఱుగ - మేము దురాత్ముల - మేము కల్మషో
ద్భటులము - విష్ణు దూరగుల ప్రాజ్ఞత లేల - తపంబు లేల - ప
ర్యటనము లేల - శీలములు యాగములున్ మతియేల కాల్పనే

జప హోమాధ్యయనంబులు
తపములు వ్రతములును లేని తరుణులు హరిస
తృపఁబడసి - రన్ని గలిగియుఁ
జపలతఁబొందితిమి భక్తి సలుపమి నకటా

హరి మాయ మనలను మోహింపజేసినదని ఆక్రందనం చేసి కూడా కంసుని వలన భయంతో ఆ హరిని దర్శించటానికి మోమోడి ఊరకునాట.

దీనివల్ల మనకు తేటపడిన రహస్యమేమిటింతకూ. ఎన్ని యాగాలు చేసినా, జపహోమాదులు గావించినా, ఇదంతా కేవల కర్మానుష్ఠానమే. ఫలితమవి ఇవ్వలేవు. కారణమందులో సకామమైన భోగదృష్టి తప్ప నిష్కామమైన ఈశ్వరదృష్టి లేదు. ఈశ్వరుడే అసలు యజ్ఞపురుషుడు. యజ్ఞోవై విష్ణుః యజ్ఞస్వరూపుడాయన. యజ్ఞ ఫలదాత కూడా ఆయనే. అలాంటి ఈశ్వరుణ్ణి విస్మరించి ఏ యజ్ఞాది కర్మలు చేసి ఏమి ప్రయోజనం. అయితే ప్రయోజనమే లేదా అంటే ఉంది. అది స్వర్గాదుల మేరకే. దాని కతీతమైన మోక్షప్రాప్తికది తోడ్పడనేరదు. అలా తోడ్పాలంటే అది ఏ కామనాలేని భగవద్భక్తి భావన ఒక్కడే ఉండాలి. వారికిక ఏమి లేకపోయిన నిష్కామమైన భక్తి తాత్పర్యాలు మిన్ను ముట్టి ఉన్నాయి. కనుకనే వారాయనకు యజ్ఞదీక్ష అని కూడా చూడక సకల విధములైన పదార్థాలూ నివేదించారు. ఆయన ప్రసాదానికి పాత్రులయ్యారు. ఇక్కడ నివేదించింది తమ జీవిత సర్వస్వాన్ని. **"సర్వ ధర్మాన్ పరిత్యజ్య"** అన్నట్టు అంతా భగవదంకితం చేసినప్పుడే మానవుడు తదనుగ్రహానికి నోచుకొంటాడు. లేకుంటే ఆ ముని జనుల మాదిరే ఎలాంటి ఆత్మార్పణమూ చేసుకోలేడు. చివరకు తన తప్పు గ్రహించినా ఏదో ఒక భయంతో ఆ తత్త్వాన్ని భజించటానికి కూడా నోచుకోలేడు. సంకోచంతో వెనక్కే తగ్గుతాడు. కంసుడి భయంతో వారు వెనక్కు తగ్గారని వర్ణించటంలో అభిప్రాయమిదే. ఇదీ ఈ కథవల్ల మనం తెలుసుకోవలసిన ధర్మ సూక్ష్మం.

పోతే ఇక ఇలాటి జంకు కొంకు ఏ కోశాన లేక తాను ధ్యానించే ఈశ్వరుడికే చివరదాకా తన జీవితాన్ని అంకితం చేసిన వృత్తాంతం రంతి దేవుని వృత్తాంతం. కర్మయోగానికి గొప్ప ఉదాహరణ మాయన జీవితం. రంతి అన్నా రతి అన్నా ఒక్కడే. భగవద్రతి ఎక్కువగా గలవాడని భావం. తక్కువ వాడు కాడాయన. ఒక

దేశమేలే రాజు. దుష్యంతుని కుమారుడు భరతుడైతే భరతుడి కుమారుడు మన్యువైతే మన్యువుకు నరుడైతే – నరుడి కుమారులు గురు సంకృతులైతే – అందులో సంకృతి అనే రాజకుమారుడీ రంతి. బహుకాలం రాజ్యపాలన చేశాడు. రాచరికం చేస్తూ కూడా జనకుడిలాగా కర్మయోగి. వియద్విత్తుడని పేరాయనకు. స్వప్రయత్నం లేక మాత్రం కూడా లేకుండా ఆకాశం నుంచి ఊడిపడ్డట్టు దైవికంగా ఎంత విత్తం లభిస్తే అంతటితో తృప్తిజెందేవాడు. సంచితమైన ధన కనక వస్తు వాహనాదులన్నీ బధిర పంగ్వంధాదులైన దీన మానవులకు పంచి ఇచ్చి ఐచ్ఛికంగానే అకించనుడయి పోతాడు. అలాటి దయనీయమైన దశ ననుభవిస్తూ కూడా ధైర్యం సడలక సకుటుంబంగా అక్కడక్కడా సంచరిస్తూ నలభయి ఎనిమిది రోజులు క్షుత్పిపాసలతో అలసి సొలసి చివరకొక ఏకాంత ప్రదేశంలో దైవికంగా ఘృతపాయసాది సంపన్నమైన ఆహారం పడయగలుగుతాడు.

అది తానూ తన కుటుంబ సభ్యులూ భుజిద్దామని ఉద్యుక్తులవుతూ ఉండగా **"అతిథిర్బ్రాహ్మణః కాలే భోక్తుకామస్య చాగమత్"** ఒక బ్రాహ్మణుడాకలి గొని వచ్చి అన్నం పెట్టమని అడుగుతాడు. **"తస్మై సంవ్యభజత్ సో న్న మాదృత్య శ్రద్ధయా న్వితః హరిమ్ సర్వత్ర సంపశ్యన్"** అతడూ తానారాధించే దైవమే నని తనదైవాన్నే అతనిలో చూచినవాడై తన ఆహారంలో కొంత అతిధికిచ్చి పంపుతాడు. **"అథాన్యో భోక్తు కామస్య"** మరొక వృషలుడు వచ్చి యాచిస్తాడతణ్ణి అలాగే. యాచిస్తే **"వ్యభజత్తస్మై వృషలాయ హరిమ్ స్మరన్"** ఆ శూద్రుడికి కూడా అలాగే కొంచెమన్నం పెట్టి పంపుతాడు. **"యాతే శూద్రే తమన్యోగా దతిథిః శ్వభి రావృతః"** వాడు వెళ్లగానే మరొక మాలవాడు కుక్కలను వెంటబెట్టుకొని ఎక్కడి నుంచో బయలుదేరి వస్తాడు.

హీనుడ జండాలుండను
మానవ కులనాథ – డప్పి మానదు – నవలం
బోనేర నీకు జిక్కిన
పానీయము నాకు బోసి బ్రతికింప గదే

అని అతిదీనంగా వేడుకొంటాడు. దానికి రంతిదేవుడి హృదయం కరుణతో ద్రవించి ఇలా అంటాడు. నాయనా !

అన్నము లేదు - కొన్ని మధురాంబువులున్నవి త్రావుమన్న-రా
వన్న శరీర ధారులకు నాపద వచ్చిన వారి యాపదవ్
గ్రన్నన మాన్చివారికి సుఖంబులు సేయుట కన్న నొండు మే
లున్నదె - నాకు దిక్కు పురుషోత్తము డొక్కడ సుమ్ము పుల్కసా

మానవసేవ చేస్తే చాలు అదే మాధవసేవ అనే సూక్తినెలా చాటాడో చూడండి. అంతేకాదు. అంత నిస్వార్థమైన సేవా పరత్వముండాలే గాని భౌతికమైన క్షుత్పిపాసాదులు కూడా వాడినేమీ బాధించవు. రంతిదేవుని మాటలలోనే దాఖలా అవుతుంది మనకు.

క్షుత్తృట్భ్రమో గాత్ర పరిభ్రమశ్చ
దైన్యం క్లమః శోక విషాద మోహాః
సర్వే నివృత్తాః కృపణస్య జంతోః
జిజీ విషోర్ణీవ జలార్పణాన్మే

క్షుత్తృభ్రమ క్లమశోక విషాదాది దోషాలన్నీ నాకు తొలగి పోయాయంటాడు. దానికి కారణ మాయన సర్వత్రా భగవత్తత్త్వాన్ని చూడటమే. బ్రాహ్మణుడేమిటి. శూద్రుడేమిటి. చండాలుడేమిటి. అంతా భగవత్స్వరూపమే. సర్వమూ భగవత్సృష్టి అయినప్పుడందులో ఇక తేడా ఏముంది. పండితాస్సమ దర్శినః అని భగవానుడే చాటాడు గదా గీతలో. ఆ గీతా శ్లోకాని కుదాహరణమే ఈ రంతిదేవుడి వ్యవహారం.

అయితే ఎటువచ్చీ అలా చూడగలగాలి. చూస్తే సర్వత్రా సామ్యమే. వైషమ్యమణు మాత్రం కూడా గోచరంకాదు. వైషమ్యమే సంసారం. అదే తాపత్రయానికి మూలం. పోతే సామ్యం భగవత్స్వరూపం. దానినే దర్శించే కర్మయోగికంతా తద్రూపంగానే మారి కనిపిస్తుంది. అప్పుడు సంసారం కాదది సాయుజ్యం. ఆ దశలో ప్రాకృతమైన తాపత్రయాని కాస్కారమేముంది. ఒకటి భౌతికంగా ఉన్నా లేకపోయినా దిగులు లేదు. కొఱత లేదు. పరిపూర్ణమైన స్వరూపాన్నే దర్శిస్తున్నాడు కాబట్టి సర్వమూ పరిపూర్ణంగానే అనుభవానికి వస్తుంది. భౌతికంగా అనుభవించి సంతృప్తినీ నిర్వృతినీ ప్రసాదిస్తుంది. అయితే ఇది మాటలు గాదు. మనోవాక్కాయాలు మూడింటిలో ఏక రూపంగా వర్తించాలి మానవుడు. అప్పుడే అది ఫలితమిచ్చేది. అలా వర్తించగలిగాడు రంతిదేవుడు. కనుకనే బ్రహ్మాది దేవతలాయనకు చివర ప్రత్యక్షమవుతారు. ఏమి

కావాలో కోరుకోమని అడుగుతారు. అప్పుడు కూడా అతడు ప్రలోభానికి తావివ్వడు. గురికాడు.

సవై తేభ్యో నమస్కృత్య నిస్సంగో విగతస్పృహః
వాసుదేవే భగవతి భక్త్యా చక్రే మనః పరమ్

ఏమీ అక్కరలేదని చెప్పి తనకు భగవద్భక్తి స్థిరంగా ఉంటే చాలు. అదే పదివేల వరాలని భావిస్తాడు. నిండు మనసుతో నీవొకటి త్యాగం చేయగలిగినా కనీసం చేయాలనే బుద్ధి ఉన్నా చాలు. అంతకంతకది నీకు ఇను మిక్కిలిగా ఫలితమిస్తుంది. **"త్యక్తేన భుం జీథాః త్యజతైన హి భోక్తవ్యమ్"** అని గదా శాస్త్రవాక్యం. అంతకు ముందు తన విషయంలో జరిగిందంతా తన పరీక్షార్థం జరిగిన విష్ణుమాయా విలాసమని గ్రహిస్తాడు.

ఈశ్వరాలంబనమ్ చిత్తమ్ కుర్వతో నన్య రాధనః
మాయా గుణ మయీ రాజన్ స్వప్నవ త్ప్రత్యలీయత

చివర కతడలా తన మనసు భగదాలంబనం చేసి బ్రతుకు సాగిస్తూ పోతే భగవన్మాయ నవలీలగా దాటిపోగలిగాడట. అంటే ఏమన్నమాట. యావజ్జీవమూ మానవుడు తనకు ధ్యేయమైన ఈశ్వరతత్త్వాన్నే మనసా వచసా కర్మణా పట్టుకొని పోతే మధ్యలో ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని ఒడుదుడుకులేర్పడినా ఆ ఈశ్వర భావనా బలంతోనే దాటిపోగలడు. ఆ భావనే సాత్త్వతమైన భక్తిని ప్రసాదించి చివరకా ఐశ్వరమైన మాయాశక్తిని కూడ దాటిపోయే శక్తిని సమకూరుస్తుంది. ఇదే రంతిదేవుని చరిత్రలో మనకు తార్కాణమవుతున్న సత్యం.

రంతిదేవుడి జీవితంకన్నా పెద్ద పరీక్ష అంబరీషుడి జీవితం. కర్మ యోగాని కిది పరాకాష్ఠ. భగవద్రతి గలవాడు రంతిదేవుడైతే అది తన అణువణువూ వ్యాపించినవా డంబరీషుడు. అంబరీషమన్నా ఋజీషమన్నా బాణలి అని అర్థం. బాణలి ఎప్పుడూ గనగనమని మండే నిప్పులమీద ఉంటుంది. వేలు పెడితే కాలుతుంది. దానిమీద ఏది వేసినా మాడ్చి పారవేస్తుంది. అలాగే కర్మవాసనలనన్నిటినీ మాడ్చి మసి చేసినవాడని అర్థం. దానికి మూల కారణం భక్తి. ఈ భక్తి రంతిదేవుడి భక్తిలాంటిది కాదు. అతడు తనకున్నదంతా దానం చేసి రాజ్యాన్నీ ప్రజలనూ వదిలేసి

అడవులలో కొండలలో కాలం గడిపాడు. ఇతడలా కాదు. రాజ్యం చేస్తూనే ఉన్నాడు. ప్రజల మధ్యనే ఉన్నాడు. తన విద్యుక్తధర్మం తాను పాటిస్తూనే ఉన్నాడు. అయినా ఏదీ అంటి ముట్టకుండా బ్రతుకుతుంటాడు. మహావిభవ సంపచ్చాతురి గలిగి కూడా మొదటినుంచీ వైష్ణవార్చనల మేరకే కాలం గడుపుతూ వస్తాడు. అనుక్షణం తన సర్వస్వమూ ఆ శ్రీమహావిష్ణువేనని భావించాడు. దర్శించాడు. రంతిదేవుడంత స్పష్టంగా భగవత్స్వరూపాన్ని పట్టుకొన్నవాడు కాడు. సగుణంలో అది కొంత తగ్గుస్థాయి. ఈ అంబరీషుడిది చాలా హెచ్చుస్థాయి.కనుకనే అతనికి చివరనెప్పుడో గాని సాక్షాత్కారం కాలేదు. అదీ బ్రహ్మాది దేవతలే అతనికి సాక్షాత్కరించింది. అంబరీషుడికలా గాదు. నిత్యమూ శ్రీ మహావిష్ణువు సన్నిధి చేస్తూనే ఉన్నాడు. దర్శనమిస్తూనే ఉన్నాడు.

అందుకు కారణం. అనుక్షణమూ సర్వాత్మనా తదాకారాంకిత చిత్తవృత్తియే.

చిత్తంబు మధు రిపు శ్రీపాదముల యంద
పలుకులు హరిగుణ పఠన మంద
కరములు విష్ణు మందిర మార్జనము లంద
చెవులు మాధవ కథా శ్రవణ మంద
చూపులు గోవింద రూప వీక్షణ మంద
శిరము కేశవ నమస్కృతుల యంద
పదము లీశ్వర గేహ పరిసర్పణము లంద
కామంబు చక్రి కైంకర్య మంద

ఇలా తన తను ధన మనః ప్రాణాలన్నీ భగవదర్పితం చేస్తూ వచ్చాడు. అయితే మనోవాక్కాయాలు మూడూ పరాయత్తమైతే ఇక స్వాయత్తమేముంది. ఏదీ లేకపోతే **"సప్త ద్వీప విశాల భూభరము దోస్తం భంబునం బూన్చె"** నన్నారే. ఎలా పూనగలిగాడా చక్రవర్తి. ఇదే చిత్రం. సప్త ద్వీప పరీతమైన ధరాతలాన్ని పరిపాలిస్తున్నా దానితో పాటీ భక్తి సామ్రాజ్యాన్నికూడా పాలిస్తూనే ఉన్నాడు సుప్తిం బొందక యొప్పెనట. ఈ మాటలో ఉన్నది మర్మమంతా. భక్తి అనేది కత్తిమీది సాము. నడుస్తూనే పోవాలి. మరలా పాదం తెగకుండా చూచుకోవాలి. అంటే అర్థం. ప్రాపంచికం వదులు కోకుండానే పారమార్థికం నిలుపుకో గలగాలి. వాడే ధీరుడు. **"విష్ణువు మీద మనసు**

లంకెపెట్టి విహిత రాజ్యవృత్తి విడువని వాడునై" రెండింటినీ సమన్వయించుకొని బ్రతుకు సాగించటం మూలాన్నే అతడు రాచతపసి అనిపించుకొన్నాడు.

కానీ ఇది ఎంతోకాలం సాగదీ ద్వైరాజ్యపాలన. ఒకటి సంసారం. మరొకటి సాయుజ్యం. ఒకటి విషయ ప్రపంచం. మరొకటి అవిషయమైన ఆత్మ స్వరూపం. ఒకటి అనేకత్వం. మరొకటి ఏకత్వం. ఒకటి అంతకంతకు బంధాపాదకం. మరొకటి మోక్షదాయకం. ఒకటి హెచ్చే కొద్దీ మరొకటి లొచ్చుగాక తప్పదు. అందులో ఏది హెచ్చాలి. ఏది తగ్గాలి. దేనికి బలమెక్కువైతే అది నిలుస్తుంది. ఏది దుర్బలమైతే అది లయిస్తుంది. నిత్యమైనది భగవత్తత్త్వం. మనం కన్నా కనకున్నా అది ఉన్నది. తదాభాస అయిన ఈ విషయ ప్రపంచమనిత్యం. కంటే ఉంటుంది. కనకుంటే లేదు. కాబట్టి అది గట్టిగా నిలిస్తే ఇది దానిలోనే కలుస్తుంది. అప్పుడిది విశేష రూపంగా ఎక్కడా కనిపించదు. కాబట్టి దీన్ని పట్టుకొని దాన్ని సేవించటమంటూ ఉండబోదు. ఇది పూర్తిగా వదలిపోతుంది భాగవతుణ్ణి. అయితే అది క్రమంగా గాని పరిపాకానికి రాదా భావం.

అంబరీషుడి కిలాంటి పరిపాకమే వచ్చింది జీవితంలో. దానితో

అతని కీహ మానె హరులందు గరులందు
ధనములందు గేళి వనములందు
బుత్రులందు బంధుమిత్రుల యందును
బురము నందు నంతిపురము నందు

ధన కనక వస్తు వాహన బంధు మిత్రాది చరాచర జగత్తుమీదనే విరక్తి కలిగింది. అలా కలిగిన నాడిక యథాపూర్వంగా దాన్ని అంటి పట్టుకొని ఉండటం కల్ల. అంచేతనే కొంత కాలంబున కమ్మేదినీ కాంతుండు సంసారంబు వలని తగులంబువిడిచిన వాడయినాడు. విడవటమే గాదు. విడిచి నిర్మలుడయినాడు. విడిచిన తరువాత గాని నిర్మలుడు కాలేడు మానవుడు. ఎంత మహాభాగవతుడైనా ఎంత అసిధారావ్రతంగా బ్రతికేవాడైనా సరే. సంసార పంకంలో దిగబడి ఉన్నంత వరకూ దాని కళంకం కొంచెమైనా అంటకపోదు. అంటితే నిర్మలుడెలా కాగలడు. మలినుడే అవుతాడు. నిర్మలత్వం బాగా అలవడాలంటే పూరా వదలిపోవాలీ సంసార

జంబాలం. అది ఆ భగవద్భక్తి అనేది కరావలంబమిస్తే గాని జరగదు. **"తేషామహం సముద్ధర్తా మృత్యు సంసార సాగరాత్"** అని గదా భగవంతుడి హామీ. అది బాగా పైకి లాగితే గాని ఈ మాలిన్యం పూర్తిగా వదలిపోదు. అలా వదలిపోయిన మహాత్ముడు నూటికి కోటికే ఒక్కడో. ఆ అంబరీషుడలాంటి మహనీయుడు గనుకనే ఇక రాజ్యం భోజ్యమనుకోలేదు. సంసార చింతకు దూరుడై ఏకాంతంబున భక్తి పరవశుడయి కూచున్నాడు.

ఇలాటి పరిపాకం భాగవతుడికి ఎప్పుడు వస్తుందా అని చూస్తుంటాడు ఆ ఈశ్వరుడు కూడా. **"యే యథా మామ్ ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్"** అని గదా చాటాడు. ఎవడెలా తన్ను సేవిస్తే వాడినలాగే చూస్తాడు. ఆర్తుడయి సేవిస్తే ఆర్తినే పోగొడుతాడు. కామ్యంతో సేవిస్తే కామితార్థమే ఇస్తాడు. అలాకాక **"అనన్యాశ్చింతయం తోమా"** మన్నట్టు మరే ప్రాపంచిక దృష్టి లేక తనమీదనే దృష్టి పెట్టుకొని బ్రతికితే అలాంటి ఏకాంత భక్తులకు తన అభయముద్రనే ప్రసాదిస్తాడు. వారికిక ఎవరివల్లా భయంలేదు. **'యోగక్షేమం వహామ్యహ'**మన్నట్టు వారి యోగక్షేమాలన్నింటినీ అదే చూస్తూ పోతుంది. వాటి కోసమిక ఆ భాగవతుడు వెతుక్కోనక్కరలేదు. అలా వెతికాడంటే అది అనన్య దృష్టి కాదు. అన్యదృష్టి మరలా చోటు చేసుకొని కూచుంటుంది. ఈ సంసార విషయ వాసన లొక పెంజీకటి లాంటిది. భక్తి భావమనే చండమార్తాండుడు సహస్ర ముఖాలతో ప్రకాశిస్తున్నంత వరకూ ఇది పక్క వంచి ఉంటుంది. ఎప్పుడా వెలుగు కొంచెం మందగిస్తుందో కనిపెట్టి చూస్తుంటుంది. మందగిస్తుందో ఆ మేరకు మరలా వచ్చి నెత్తిన పడుతుంది. భాగవతుని జీవితం అంధకార బంధురం చేస్తుంది. అంటే పరమార్థానికి దూరం చేస్తుందని అర్థం. అంచేత దానికెడమివ్వకుండా ఎవడు నిరంతరా నన్య చింతనతో కాలం గడుపుతుంటాడో వాడి జీవితమిక భగవదంకిత జీవితం కాబట్టి భగవంతుడే చూచుకొంటాడిక వాడి యోగక్షేమాలు. భగవంతుడి లాగా వాడికీ ఈ సాంసారిక భయం లేదు.

అలా భయం లేదని చెప్పటాని కొక సంకేతమే అంబరీషుడికి సుదర్శన చక్రాన్ని విష్ణువు ప్రసాదించి పోవటం. చక్రమనేది కాలచక్రమే. చక్రం చేతికి వచ్చిందంటే కాలమే మనకధీనమయిందని భావం. కాలంలోనే కదా మనకే సుఖమైనా దుఃఖమైనా ప్రాప్తించేది. ఏ భావం మనకెప్పుడు కలిగినా అది ఏదో ఒక కాలంలోనే. అది

కాలానికి మన మధీనమయి ఉన్నంత కాలమూ చాలా భయంకరంగా వచ్చి నెత్తిన పడుతుంది దాని ప్రభావం. అలా కాక కాలాన్నే మన మధీనం చేసుకోగలిగామంటే అప్పుడు దాని ప్రభావమే మాత్రమూ మనమీద పనిచేయదు. ఒకవేళ ప్రారబ్ధవశాత్తూ సుఖదుఃఖాది భావాలు ప్రాప్తిస్తున్నా అవి తత్త్వాను సంధాన బలంతో దగ్ధపటంలాగా బలహీనమై ఊరక నామమాత్రంగానే దర్శనమిస్తాయి. మాత్రా స్పర్శల మూలంగా వాడికెలాంటి మోదమూ లేదు. ఖేదమూ లేదు. నిత్యముక్తుడైన పరమేశ్వరుడికైతే ఈ కాలమెప్పుడూ అధీనమే. అది ఆయనకు వశవర్తి అయి మెలగుతుంటుంది. ఈ భావానికి సంకేతమే మహావిష్ణువు చేతిలోని సుదర్శనాయుధం. అది భక్తుల పాలిటికి సుదర్శనం. భగవద్రూపాన్నే నిరంతరం దర్శించేవారు కాబట్టి వారికీ కాలచక్రమూ దాని పరివర్తనమూ కూడా సుదర్శనంగానే భాసిస్తుందని భావం. అంతేకాదు. పరమేశ్వరుడి కది ఎలా వశవర్తి అయి పనులు చేస్తుందో ఈ భక్తుడికీ అలాగే వశం వదమై అతడి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు నిర్వర్తిస్తూ ఉంటుంది కూడా. విష్ణువు స్వయంగా తెచ్చి అంబరీషుడికి చక్రమిచ్చి పోవటంలో ఇంత అంతరార్థముంది.

పైగా ప్రతిభట శిక్షణమూ, నిజజన రక్షణమట ఆ చక్రం. **"కాలోస్మి లోక క్షయ కృత్ ప్రవృద్ధః"** అన్నట్టు లోక ధర్మాన్ని కాపాడాలన్నా అధర్మాన్ని నిర్మూలించాలన్నా కాలమే దానికి మూలకారణం. తన్మూలంగానే ఆ పరమాత్మ ఆ రెండు కార్యాలూ నిర్వహిస్తూంటాడు. దానికిక తిరుగులేదు. నిఖిల జగదవక్రమైన చక్రమది. ఎక్కడికి వెళ్లినా ఏదేశ కాలాల్లోనైనా దాని గమనాని కడ్డులేదు. **"యద్భావి తద్భవతి"** అన్నట్టు జరిగేది జరిగి తీరవలసిందే. అది దాని పాటికది ఎలాగూ జరుగుతుంది. అలా కాక మన కధీనమైనప్పుడు మన ఇచ్ఛానుసారంగా జరుగుతుంది. ఈశ్వరేచ్ఛ ధర్మ సంస్థాపనమే కాబట్టి తదనుగుణంగానే ప్రవర్తిస్తుందది. అది భాగవత జనులు సురక్షితంగా మనుగడ సాగించినప్పుడే గనుక వారి మనుగడకు కూడా భంగం కలగకుండా చూడాలది. అది ఎలా సంభవం. వారి కుపద్రవం కలిగించే పరిస్థితులేర్పడరాదు. అలాంటి వారిని తగినట్టు శిక్షించాలది. వారే లోకాలలో ఎక్కడికి పరుగిడిపోయినా వదలరాదు. వారిని వెంబడించి తరిమి కొట్టాలి.

ఏవంవిధ విశేషణ విశిష్టమైన చక్రం అంబరీషుడికి ఆ భగవానుడు ప్రసాదించాడంటే ఇది రాబోయే దుర్వాసో వృత్తాంతానికెంతగా నాందీ పలుకుతున్నదో

మన మవలీలగా అర్థం చేసుకోవచ్చు. అనుకోకుండా దుర్వాసుని వంటి మహర్షి వల్లనే వచ్చి పడ్డ దుపద్రవం. దుష్టుల వల్లనే కాదు. శిష్టులవల్ల కూడా రావచ్చు ఒక కష్టమనేది. దుష్టులు ప్రతికూలురైతే శిష్టులనేవా రనుకూల శత్రువులు. అది జీవుడి ప్రారబ్ధం కొద్దీ ఏర్పడినా ఏర్పడుతుంది. లేదా ఆ ఈశ్వరుడు వినోదం కొద్దీ చేసే పరీక్షవల్లనైనా ఏర్పడుతుంది. అలాగే ఏర్పడిం దంబరీషుడికి కూడా. దానికి నిదర్శనమే దుర్వాసుడి వృత్తాంతం. ద్వాదశీ వ్రతం చేయాలనే బుద్ధి పుట్టిందంబరీషుడికి. ఒక్క సంవత్సర కాలమా వ్రతం సాగించి వ్రతాంతంలో మూడు రాత్రులు పత్నీ సమేతంగా ఉపవాసం చేసి యమునా నదిలో స్నానం చేసి మధువనంలో మధుసూదనుని కభిషేకం చేస్తాడు. అర్బుదన్యర్బుదాలైన గోవులను అపరిమేయమైన హిరణ్యంతో సహా భూసురులకు దానమిస్తాడు. ఎంతోమంది బ్రాహ్మణుల కన్నార్థులై వచ్చిన వారికి కడుపునిండా భోజనం పెడతాడు. ఇక తానూ పారణ చేద్దామని తయారవుతుండగా ప్రత్యక్షమయ్యాడు దుర్వాసుడు. అసలే ముక్కోపి ఆ మహర్షి అలాంటి వాణ్ణి భక్తి పూర్వకంగా పూజించి భోజనం చేసి పొమ్మని ప్రార్థిస్తాడా రాజు. సరేనంటాడీ మునిరాజు. యమునా నదికి స్నానానికని వెళ్లి ఎంతకూ లేచిరాడు. ఇక అర్ధ ముహూర్త కాలమే వ్యవధి ఉంది ద్వాదశీపారణకు, చేసి తీరాలాలోపల. ఎలాగా ఎంతకూ రాడే ఈ మహర్షి అని సభ్యుల నడిగితే సలిల పానం చేయండి సరిపోతుందని సలహా ఇస్తారు అలాగే చేసి కూచుంటాడు. అప్పుడు వచ్చాడా మహానుభావుడెవడో చెప్పి పంపినట్టు. వచ్చీ రాగానే విషయం తెలుసుకొని ఉగ్రుడయి తన జటామండలంలో ఒక జట పెఱికి వేల్వగానే అది ఒక కృత్యగా మారి ఆ రాజు మీదికి లంఘిస్తుంది. అణుమాత్రం చలించలేదా రాజు. తన్ను కాపాడమని కనీసం తన దగ్గర ఉన్న సుదర్శనాయుధాన్ని కూడా ప్రార్థించలేదు.

ఇదే ఇందులో గమనించవలసిన విశేషం. ఒక భక్తుడు అనన్య భావనతో భగవంతు నారాధిస్తూ ఉంటే చాలు. తన్ను తాను కాచుకోవలసిన పనిలేదు. ఆ భావనే కాపాడుతుంది. **"యోగక్షేమం వహామ్యహ"** మని గదా చెప్పాడు. యోగక్షేమా లాయన చూచుకొంటాడు. ఆయనకే వదలేయవలసిందది భక్తుడు చూచుకోవలసింది కాదు. భక్తుడే చూచుకోవలసి వస్తే అది అనన్యమైన భక్తి కాదు. అన్యం కూడా అందులో చోటు చేసుకొంటుంది. అన్యం తన విషయం తాను చూచుకొనే ప్రయత్నమే.

అలాటి ప్రయత్నమున్నంత వరకూ పరమేశ్వరుడు పూర్తిగా సహకరించడు. నీవు చేస్తున్నావు గదా నీవే చూచుకోమని మనలను మన ప్రయత్నానికే వదిలివేస్తాడు. వదిలితే అది కేవలం మానుష యత్నమే అవుతుంది. అయితే అది మనకు ఫలించినా ఫలించవచ్చు. లేదా నిష్ఫలమైనా కావచ్చు. తప్పకుండా ఫలిస్తుందని చెప్పలేము. మనకన్నా ప్రబలమైన శక్తి ఎదురైతే ఎలా ఫలిస్తుంది. దుర్బలమై దానికి లోబడి పోవలసి వస్తుంది.

అందుకే అంబరీషుడు తనకధీనంలో ఒక ఆయుధమున్నా అది దివ్యాయుధమని తెలిసినా ఆత్మరక్షణార్థమని చెప్పి ప్రయోగించలేదు. ఆత్మ రక్షణ భగవానుడికే వదలివేశాడు. తదీయ ధ్యానంలోనే లీనమయినాడు. వెంటనే అది భగవచ్ఛక్తిని ప్రేరణ చేసింది. దానిఫలితంగా సుదర్శనచక్రం కృత్యమీదికి స్వయంగా లంఘించింది.

ప్రదిష్టమ్ భృత్య రక్షాయాం – పురుషేణ మహాత్మనా
దదాహ కృత్యాం తాం చక్రం – క్రుద్ధాహిమివ పావకః

భగవత్ప్రచోదితమైన ఆ చక్రం దుర్వాసుడు పంపిన కృత్య నొక్క క్షణంలో దగ్ధం చేస్తే అది ఒక మహోరగం మంటలో బడి భస్మమయినట్టు భస్మీపటలమయి పోయింది. అంతటితో నిలవ లేదా చక్రం. **"తమ భ్యధావ ద్భగవ ద్రథాంగమ్"** ఆ దుర్వాసుడి వెంట బడింది. ఎందుకు. పని అయిపోయింది గదా. ఇక వదలి వేయకుండా ఆయన వెంట పడటం దేనికి మొదటనే చెప్పాడు దానికి సమాధానం. నిజ జన రక్షణం – ప్రతిభట శిక్షణమని. ఇప్పుడు నిజజన రక్షణమయింది. ఇక ప్రతిభట శిక్షణం కావలసి ఉంది. అందులో ఒక ప్రతిభటం కృత్య. అది తీరిపోయింది. పోతే మరొక ప్రతిభటం దుర్వాసుడి కోపం. అది భక్తుడి మీద పని చేయదని నిరూపించవలసి ఉంది. అంచేత ఆ కోపం కూడా ఒక వడ్డీలాగా తీరేవరకూ దాన్ని శిక్షించవలసిందే తప్పదు. అప్పుడే అది నిఖిల జగదవక్రమనీ తదీయ రక్షణలో ఉన్న భాగవతుని జీవితం కూడా అలాగే అవక్ర పరాక్రమమైనదనీ మనకు బోధ పడేది. అందుకోసమే దుర్వాసోను ధావనం. ఎలాంటి అనుధావన మది. ఏదో కొంత దూరం వెళ్లి రావటం కాదు. **"భువి దూఅన్ భువి దూఅు – నభ్ధి జొర నబ్దుల్సొచ్చు"** అయితే అలా తరుముతూ పోతే ఆయన దాని జ్వాలకాహుతి కాలేదా. కాలేదు కాడు. ఎంచేత. తపస్సంపన్నుడైన మహర్షి ఆయన. బాధించవలసిందే

గాని వధించటం ధర్మం కాదు. అది భగవదుద్దేశమూ కాదు. కనుకనే నిల్వ నిలుచున్ అని వర్ణించటం. నిలిచినప్పుడు దొరికాడని చెప్పి కాల్చివేయవచ్చుగదా. కాని కాల్చలేదంటే ఏమిటర్థం. ఏడిపించటమే గాని అంతకు మించి అపకారం చేయటం కాదని అర్థమవుతున్నది.

సరే. దాని ధాకకు తట్టుకోలేక ఆ ఋషీశ్వరుడెన్నెన్నో లోకాలు తిరుగుతాడు. ఎందరెందరినో శరణు వేడుతాడు. ఎవరూ కాపాడలేకపోయారు. కడకు బ్రహ్మ ఈశ్వరుడే కాదు. విష్ణువు కూడా నేను నీకభయ మివ్వలేనంటాడు అయితే ఒక ఉపాయం చెబుతాడు.

సాధవో హృదయం మహ్యం - సాధూనాం హృదయం హ్యహమ్
మదన్యం తేన జానంతి - నాహ తేభ్యో మనాగపి
అతో హ్యాత్మాభిచారస్తే - యతస్తం యాతు వైభవాన్

భక్తులు నా హృదయంలాంటివారు. వారికీ నేను హృదయ భూతుణ్ణి. వారిని కాదని పోయే శక్తి నాకు లేదు. కాబట్టి నీకీ ఉపద్రవం ఎవరివల్ల వచ్చిందో వారినే పోయి ఆశ్రయించమని సలహా ఇస్తాడు. చేసేది లేక చస్తూ పడుతూ వచ్చి దుర్వాసుడు మరలా ఆ రాజోత్తముడి కాళ్లమీద పడి పాహిమా మని మొరబెడతాడు. అంతవాడి శిరస్సు తన పాదాలమీద వాలటం కూడా సహించ లేకపోయాడా మహాభాగవతుడు. మరొకడైతే తనకలాటి అపకారం చేసినందుకెంతగానైనా ప్రతీకారం చేయాలని చూచేవాడు. శమదమాది సంపన్నుడైన భాగవతుడంబరీషుడు. అలా చేయకపోగా మహర్షి శిరస్స్పర్శకు కూడా సిగ్గు పడతాడు. వెంటనే తన పాదాలు వెనక్కు తీసుకొంటాడు. ఋషి తన్ను రక్షించమని మొరపెడితే తగుదునమ్మా అని ఒక దేవతలాగా చేయెత్తి ఆయన కభయమిచ్చిన వాడూ కాదు. అది కూడా లేని పెద్దఱికాన్ని పైన వేసుకోటమనే ఆ భక్తుడి తలంపు. అంచేత ఆ సుదర్శన చక్రాన్నే ఉపశమించమని చెప్పి పరిపరివిధాల స్తోత్రం చేస్తాడు.

చూడండి. అది కేవలమొక ఆయుధం. దేవుడు కాదు. దేవుడి చేతిలోనిది. దేవుడే తన చేతిలోని వాడంబరీషుడికి. ఇక దాని సంగతి ఏమిటి కావలసి వస్తే దాన్ని ఆజ్ఞాపించవచ్చు. మొదటనే ఆజ్ఞాపించలే దాయన ఆత్మ రక్షణార్థమని. దాని

పాటికదే విజృంభించింది. అలాటి వాడిప్పుడు దాన్ని ఆదేశించటమా. అలా ఎన్నటికీ జరగదు. అట్టి స్వభావమూ కాదాయనది. అందుకే కళ్లు మూసుకొని ప్రార్థించాడు. అంతమాత్రమే. ఆ మహనీయుడి భక్తి శ్రద్ధా తాత్పర్య భూతానుకంపాది గుణసంపత్తికి పరవశమైన ఆ చక్రం ఎంత నిర్వక్రమైనా నిజ పరాక్రమం చూపక ఉపశమనం చెందుతుంది. బ్రతుకు జీవుడా అని నిట్టూర్పు విడిచి దుర్వాసుడాయనను వీడ్కొని వెళ్లబోతాడు. కాని పోనీయ డంబరీషుడు. బ్రాహ్మణుడతిథిగా వస్తే పారణ కాహ్వానించి కూడా ఆయన నిరాహారిగానే వెళ్లిపోవటం సహించగలడా. వెంటనే ఆయనకు షడ్రషోపేతంగా భోజనం పెట్టి గాని పంపడు. ఇలాంటిదీ అంబరీషుడి ప్రవర్తన. విశుద్ధమైన ఒక కర్మయోగి జీవితమాయనది. ఈశ్వరార్పిత చిత్తవృత్తి అయినా ఏదీ కొఱత వడగూడదేదీ జరగకుండా పోగూడదు.

పోతే ఇక ఈ మార్గంలో ఆఖరివాడు పృథుచక్రవర్తి ఉన్నాడు. ఆయనా ఈయన లాగా ఒక మహారాజే. ఈయన చంద్ర వంశీయుడైతే ఈయన సూర్యవంశీయుడు. అలాగే సక్రమంగా పరిపాలన చేసినవాడే. అయితే ఆయన జీవితమిలా ఒకే మార్గంలో నడిచింది గాదు. ఆయన కేవలం కర్మయోగి అయితే ఆయన గారిది కర్మయోగంతో ఆరంభమయి సమాధి యోగతో సమాప్తమైన జీవితం. కర్మ సమాధి యోగాలకు రెంటికీ ఒకసేతువులాగా భక్తి యోగం కూడా చోటుచేసుకొన్నది. అసలు పృథువు జన్మే చాలా చిత్రమైనది. మహర్షుల కోపాగ్ని జ్వాలల కాహుతి అయిన వేనుడి బాహువు మథిస్తే జనించిన వాడా పృథువు. అందులో దక్షిణ బాహువు మథిస్తే పృథువూ వామబాహువు మథిస్తే అర్చి అనే కన్యా జన్మిస్తారు. ఆవిడ లక్ష్మి అంశ కాబట్టి విష్ణ్వంశజుడైన ఆయన్నే పెండ్లాడింది. బాహువు మథిస్తే జన్మించిన వాడని చెప్పటం సాభిప్రాయం. బాహుబలి గదా క్షత్రియజాతి. పుట్టగానే సద్యోయౌవనుడయి శంఖచక్రాదులైన దివ్యలాంఛనాలతో దర్శనమిస్తాడు. విష్ణుదేవుని అపరావతారమని పది మందీ కీర్తిస్తారు. అలా భావించటంలో తప్పేముంది. **నా విష్ణుః పృథివీ పతిః** అని గదా శాస్త్రం. విష్ణువు లక్షణం ప్రజాపాలనమే గదా. అదే ఉత్తమ క్షత్రియుడి ధర్మం కూడా. కనుక అలాటి ఆదర్శప్రాయుడైన రాజు సాక్షాద్విష్ణు స్వరూపడన్నా తప్పులేదు.

అప్పటికే వేనుడి దౌర్జన్యంవల్ల భూమి అంతా దుర్భిక్ష పీడితయై గొడ్డుబోయింది. పాడి పంటా అనేవి కలలోని వార్తలయినాయి. ప్రాణులంతా హాహాకారాలు చేస్తుంటారు. తట్టుకోలేక వచ్చి పృథువును ప్రార్థిస్తారు. కర్తవ్య దీక్షాధురంధరుడైన ఆ రాజు ధనుర్ధారుడై భూమి ఎక్కడ ఉందా అని వెతుకుతూ బయలుదేరుతాడు. అది గోరూపాన్ని ధరించి తప్పించుకుపోతుంటుంది. శరసంధానం చేసి నిన్ను చంపుతానని బెదిరిస్తాడు. అయ్యా ఆగ్రహించకండి – దుర్మార్గుల పాలనలో ఉండలేక పరుగెడుతున్నాను. నీ విప్పుడుత్తముడవు వచ్చావు కాబట్టి నీ అభిమతం తీరుస్తాను. నా పాలు పితుకుకోండి. రత్నౌషధి రస లోహాది వస్తు జాతమంతా మీ చేతికి వస్తుందని సలహా ఇస్తుంది. అలాగే చేస్తాడా చక్రవర్తి. మరలా సస్యశ్యామల మవుతుంది మహీమండలం. ఎంత సాభిప్రాయమైన ఉదంతమో చూడండి ఇది. మానవులకు కరువు కాటకాలు వస్తున్నాయంటే అది ప్రకృతి వైపరీత్యం. దానికి కారణం మానవులు. అందులోనూ ముఖ్యంగా పాలకులైన వారి బుద్ధి వైపరీత్యం. మన బుద్ధులను బట్టే బాహ్య ప్రకృతి. ఇవి బాగుపడితే అదీ బాగుపడుతుంది. మంచి ఫలితమే ఇస్తుంది. లేకుంటే ధర్మ విప్లవం తప్పదు.

పరిపాలన చక్కపడ్డ తరువాత పృథువు నిరంతరమూ ఉత్తమ కర్మానుష్ఠానంతోనే కాలం గడుపుతాడు. విష్ణువు నిష్టదైవతంగా భావించి ఆ దేవునికే తన జీవితమంకితం గావిస్తాడు. కొన్నాళ్లకు వీరోచితమైన అశ్వమధం చేయ తలపెడతాడు. తొంభయి తొమ్మిది చేస్తాడు. నూఅవది చేయబోయే సరికి మత్సరగ్రస్తుడైన మహేంద్రుడు మేధ్యాశ్వాన్ని అపహరిస్తాడు. కోపోద్రిక్తుడయి పృథువు ఋత్విక్కుల సహాయంతో మహేంద్రుణ్ణి నాశనం చేయాలని అభిచారహో మాని కుద్యుక్తుడవుతాడు. అయితే అది సాగదు. ఆ పాటికి బ్రహ్మాదులు వచ్చి అడ్డు పడతారు. కడకు శ్రీ మహావిష్ణువు కూడ ప్రత్యక్షమై మందలిస్తాడారాజును.

సుధి యస్సా ధవో లోకే నరదేవ నరోత్తమాః
నాభి ద్రుహ్యంతి భూతే భ్యో – యర్హినాత్మా కళేబరమ్
పురుషాయది ముహ్యంతి – త్వాదృశా దేవమాయయా
శ్రమ ఏవ పరం జాతో దీర్ఘ యా వృద్ధ త్సవయా

నీవు మానవోత్తముడవయి కూడా ద్రోహచింత పెడుతున్నావు. ఆత్మ అంటే కళేబరమని భ్రమిస్తున్నావు నీవు. నీబోటివారు కూడా దేవమాయను గుర్తించలేక పామరచర్యలకు పాల్పడితే ఇక నీవు చిరకాలం చేసిన వృద్ధ సేవకు ఫలమేమున్నది.

ఇలా మందలిస్తూనే అతని మీద ఉండే అమందమైన వాత్సల్యంతో వరం కోరుకోమని అడుగుతాడు. అప్పటికే భగవద్భక్తి భరితాంత రంగుడూ బాష్ప పరిప్లు తలోచనాపాంగుడూ అయిన పృథుచక్రవర్తి కొన్ని క్షణాలు మాట రాక నిలిచిపోయి తరువాత ఇలా భాషిస్తాడు.

నకామయే నాథ తదప్య హం క్వచి
న్నయత్ర యుష్మ చ్చరణాంబు జాసవః

స్వామీ నాకు నీ చరణాంబుజ మరంద గంధం లేని పదవి ఏదైనా సరే అక్కరలేదు. దాని నెడబాయకుండటమే నా పాలిటి కొక పెద్ద వరం.

అథా భజంత్వాఖిల పూరుషోత్తమం – గుణాలయం పద్మక రేవలాల సః
పద్మాలయ అయిన ఈ జగన్మాత మాదిరి గుణాలయుడైన నిన్ను నిరంతరం సేవించాలని నా చింత.

అప్యావయో రేక పతిస్పృధోః కలి
ర్నస్యాత్కృతత్వ చ్చరణైక తానయోః

మా ఇద్దరికీ ఏకైక శరణమైన నీ చరణాన్ని పట్టుకోటంలో పరస్పరం కలహమనేది కలగకుండు గాక "జగజ్జనన్యాం జగీశ వైశసం స్యాదేవ" అంతేకాదు. ఒకవేళ కలహమేర్పడినా పరవాలేదు. సద్విషయంలో ఏర్పడే స్పర్ధవల్ల నష్టమేముంది. కాబట్టి **"యథా చరే ద్బాల హితం పితా స్వయం తథాత్వమే వార్హసి నస్సమీహితుమ్"** తెలిసీ తెలియని కుర్రవాడికి కావలసింది తండ్రే ఎలా తెలుసుకొని చేస్తాడో అలాగే అజ్ఞుడనైన నా అభిమతమేదో నీవే తెలిసి ప్రసాదించమని ప్రార్థిస్తాడు.

ప్రార్థిస్తే అనభిమతమైన రోషాన్ని త్యజించావదే చాలు. నీవు నా ఆజ్ఞ పాలించే వాడవైతే దీర్ఘకాల మీ భూమండలాన్ని ధర్మమార్గం తప్పక పాలించమని చెప్పి అంతర్ధాన మవుతాడు. అంటే ఏమిటప్పటి కర్థం. పృథువింకా పరిపక్వం కాలేదు. ఎంత భక్తుడైనా ఆ భక్తి పరిపూర్ణత నందుకోలేదు. కారణం కర్మానుష్ఠాన బుద్ధి

వదలకపోవటమే. సర్వాత్మనా భగవచ్చింతన ఉన్నప్పుడే కర్మలకు స్వస్తి చెప్పగలడు మానవుడు. చెప్పలేకపోయాడంటే భక్తిలో దౌర్బల్యముందని అర్థం. అందుకే పృథువు కాయన ప్రత్యక్షమైనా వరం కోరమని చెప్పినా లక్ష్మిలాగా నీ సేవ నాకు నిత్యమూ దయచేయమని ఆ భక్తుడాసించినా దానిని భగవానుడు వెంటనే ప్రసాదించలేదు. మీదు మిక్కిలి ప్రజాపాలన కర్మమే విధించి వెళ్లాడు. అలా నిష్కామ కర్మ చేస్తూ పోతే కొంత కాలానికి గాని అది పూర్ణభక్తి యోగంగా పరిణమించదని అప్పుడు గాని అతడనుగ్రహపాత్రుడు కాడని భగవదభిప్రాయం.

చూడండి. దానికి తగినట్టుగానే అన్ని మాటలు చెప్పి ఆ రాజు మరలా అవివేకంలోనే పడ్డాడు. భగవత్సాక్షాత్కారమైనా భక్తి యోగమతనికి పట్టుబడలేదు. సాక్షాజ్జగన్మాతతోనే పోటీపడి సేవిస్తానన్న పెద్ద మనిషి తలమునకలుగా మరలా కర్మానుష్ఠానంలో మునిగిపోయాడు. అవి యజ్ఞాలే గావు. యాగాలే గావు. క్రతువులే గావు. తుదకు దీర్ఘసత్రమనే యాగానికి దీక్ష వహించాడు. పైగా అక్కడి సభాసదులతో ఇలా అంటాడు. నేనీ లోకస్థితి మర్యాదలు తప్పిపోకుండా కాపాడటం కోసమా కమలాసనుని చేత నియోగింపబడ్డవాడను. కామదుఘములు నైన లోకములు నాకు సరవి గలుగు ననుష్ఠానపరుడగాన. మీరు నాకు పరంలో ఎంతో గొప్ప ఫలానుభవం కలిగే ఉత్తమ కర్మమేదో దాని నుపదేశించమని ప్రార్థేయపడతాడు. వారతని చిత్తశుద్ధిని పరీక్షించటానికి మొదట నాస్తికత్వాన్ని ప్రదర్శించి తరువాత అతని అచంచలమైన ఈశ్వరార్పిత బుద్ధికి సంతసించి కీర్తిస్తారు. ఆ పిమ్మట సనకాది దివ్యమునీంద్రులు వచ్చి ఆయన కధ్యాత్మ తత్త్వోపదేశం కూడా చేసి పోతారు.

అయితే చిత్రమేమంటే అప్పటికీ జ్ఞానమంటలేదాయనకు. భక్తిఅంటితే గదా జ్ఞానమంటటానికి. ఆ భక్తి అంటకపోవటానికేమి కారణం. కర్మవాసనలు. ఆ వాసనలు క్షాళితమైతే గాని ఏదీ మనసుకు హత్తుకోదు. అంతవరకూ దాని నడపా దడపా భావించటమూ, భాషించటమూ తప్ప తదేక పరాయణుడు కాలేడు మానవుడు. అన్ని అనర్థాలకూ మూలం కర్మవాసనలే. చివరకా దోషాన్ని గుర్తిస్తాడు పృథుచక్రవర్తి. కర్మవాసనలను నిర్మూలన చేయాలంటే దానికి భక్తి కాదు. జ్ఞానం కాదు. బాగా ప్రబలంగా నాటుకొని ఉంటే వాటిని పెరికి వేయటానికివి ఏవీ చాలవు. సమాధి యోగమే వాటికి తగిన భేషజం. దాన్ని సాధించటానికి నడుము కట్టి అడవులకు

బయలుదేరాడు. ఉగ్రమైన తపశ్చర్యకు దిగాడు. మొదట కందమూలాలు తరువాత తృణపర్ణాదులు ఆ మీదట కేవల జలపానం – ఆ వలన వట్టి మారుతమే ఆహారంగా జీవించాడు.

మెండుగా మిట మిట మండు వేసవి యందు
తప్త పంచాగ్ని మధ్యమున నిలిచి
మానకజడి గొన్న వానకాలమునందు
బైఁగోక వేయక బయట నిలిచి

ఇలా శరీరాన్ని ప్రకృతి కొప్పజెప్పి కూడ తపస్సు సాగించాడు. ఇలా యోగ మార్గంలో ఎప్పుడు ప్రవేశించాడో అది సిద్ధించే సరికి నారాయణభక్తి అనన్య విషయమై ప్రవృద్ధమయిందట ఆ చక్రవర్తికి. అంటే యోగంవల్లనే భక్తి నిలిచిందన్న మాట. అంతేకాదు.

పరిపూర్ణంబగు భక్తిని
కర మనిశము సంశయాత్మ కంబయి చాలన్
వరలిన హృదయ గ్రంథిని
నిరసించు విరక్తి యుత మనీష జనించెన్

ఆ భక్తి బలంతో హృదయ గ్రంథి విచ్ఛేదనం చేసుకోవాలనే సంకల్పం కూడా కలిగిందట ఆయనకు. కాని కేవల భక్తి కాగ్రంథి భేదనం.

చేసే శక్తి చాలదని గ్రహించాడు. గ్రహించి సమస్త యోగసిద్ధుల యందు నిఃస్పృహుడయి బ్రహ్మభూతుండయి నిజ కళేబరంబు విడువ నిశ్చయించాడట.

మరి బ్రహ్మభూతుడు కావాలంటే ఏమిటి మార్గం. కేవల యోగం కాదు. కేవల భక్తిగాదు. అవి రెండూ ఆలంబనాలుగా చేసుకోవాలి సాధకుడు. చేసుకొంటే అవి క్రమంగా జ్ఞానాన్నీ వైరాగ్యాన్నీ ప్రసాదిస్తాయి. ఆ జ్ఞాన వైరాగ్యాలే సాక్షాన్ముక్తి హేతువులు. అందుకే

జ్ఞాన వైరాగ్య వీర్యేణ స్వరూపస్థో ఽజహాత్ప్రభుః

శరీరాన్ని విడవాలనుకొన్నా విడవలేకపోయాడు పృథువు. బ్రహ్మ భూతుడయి కదా విడువవలసింది. ఊరక విడిస్తే ఏమవుతుంది. అది **"యేగేనాం తే తను త్యజా"**మని యోగంతో వదలటం మాత్రమే. యోగంతో వదిలితే మరలా తగులుకొంటుంది ఎప్పుడో ఒకప్పుడు. పునరావృత్తి రాహిత్యం కలగదు. అలా కలిగేది పూర్ణజ్ఞాన మేర్పడినప్పుడే. అదే ఇప్పు డేర్పడింది పృథు చక్రవర్తికి. దీర్ఘకాల యోగాభ్యాస మూలంగా మనోవాసనలన్నీ క్షాళితం కాగా తత్ఫలితంగా నారాయణుడి మీద భక్తి అచంచలం కాగా-ఆ రెండింటి పరిపాకంతో జ్ఞాన వైరాగ్యాలు పరిపాకానికి రాగా, తత్పరిపాక ఫలంగా శరీరత్యాగం చేసి ముక్తి పొందాడట ఆ మహా భాగవతుడు. ఇలా కర్మయోగ కర్మ సమాధి యోగాల ప్రభావమేమిటో నిరూపించటానికీ పృథు చక్రవర్తి జీవితం తోడుపడుతున్నది. ఆనుషంగికంగా సాక్షాన్మోక్ష సాధనమైన జ్ఞానవైరాగ్య స్వరూపంకూడా నిరూపితమయింది ఇందులో. మొత్తానికి దక్షాదుల వృత్తాంతం దగ్గరి నుంచీ పృథ్వాదుల వృత్తాంతందాకా, ఇవన్నీ మానవుడి కర్మానుష్ఠాన తత్పరత్వమూ, కర్మయోగమూ, అందలి ఉత్తరోత్తరోత్కర్ష రూపమైన భూమికా క్రమమూ, చివరకది ఎక్కడ పర్యవసానం కావలసిందీ - సవిస్తరంగా వర్ణించబడ్డాయి. దాన్ని బయట పెట్టటానికి కేవల ముదాహరణ ప్రాయములే ఈ దక్షాదుల ఆఖ్యాయికలన్నీ. ఈ ఆఖ్యాయికలన్నీ భాగవతంలోనే. హరివంశాదులలో కనిపించవు మనకు. పృథుచక్రవర్తి వృత్తాంతం మాత్రం కనిపిస్తుంది హరి వంశంలో.



Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitaveda.in

9. సమాధి యోగులు - భీష్మాదులు

కడచిన అధ్యాయంలో కర్మయోగమూ దాని నవలంబించి పయనించిన సాధకుల జీవితమూ సవిస్తరంగా నిరూపించబడ్డాయి. ఈ కర్మయోగమనేది మోక్షసాధన మార్గంలోఅన్నింటికన్నా మొట్టమొదటి మెట్టు. మనోవాక్కాయాలతో ఏది చేసినా సర్వమూ ఈశ్వరార్పణమంటూ చేయటమే దీని సారభూతమైన తత్త్వం. ఇది జ్ఞానానికి కేవలం బహిరంగమ గాని అంతరంగం కాదు. పోతే అంతరంగ యోగం వేరే ఉన్నది. అది సమాధియోగం. కేవల మీశ్వరార్పణమని చేయటం కాదిది. చేయకపోవటం. అది ప్రవృత్తి రూపమైతే ఇది నివృత్తి రూపం. చిత్తవృత్తి నిరోధకమైనదిది. సకల విధములైన మనోవాసనలనూ క్షాళితం చేసి లక్ష్యం మీద అచంచలమైన ఏకాగ్రతను సాధించటమే దీని ప్రధాన లక్ష్యం. మనసుమీద ఆధారపడిఉంది సర్వసిద్ధి. అది స్వాధీనమైతే చాలు సర్వం స్వాధీనమైనట్టే. కనుకనే ఈ సమాధి అంతరంగమయింది. ఈశావాస్యాది ఉపనిషత్తులలో ఈ యోగ స్వరూపమెంతగానో వర్ణించబడింది. భగవద్గీతలో ఆత్మ సంయమ అక్షర పరబ్రహ్మ యోగాలు రెండూ ఇదే. మరి పాతంజలా యోగ శాస్త్రాలిక చెప్పనే అక్కరలేదు. సాంగోపాంగంగా వర్ణించాయి ఈ యోగాన్ని. ఇది ఒకటిగా దీయోగం. ఇందులో హఠయోగముంది. మంత్రయోగముంది. లయయోగముంది. తారకయోగముంది.

ఈ నాలుగింటినీ భాగవతంలో ఆయా సాధకులు తమకు నచ్చిన మార్గాలలో యథోచితంగా అనుసరిస్తూ పోయినట్లు వారి జీవితాల వల్ల మనకు తేటపడుతూంది. అసలు పృథుచక్రవర్తి జీవితంలోనే చూచామాయన చివరికీ యోగాన్ని ఎలా అభ్యసిస్తూ వచ్చాడో.

కోరి మడమలచేత గుదపీడనము చేసి - పూని యుక్తా సనాసీనుడగుచు
తనరమూలాధారమున నుండి వాయువు నొయ్యననెగ యించి యెనరనాభి
కలితంబు గావించి క్రమమున హృద్వత్స కంఠశిరః కోష్ఠకముల జేర్చి
కైకొనిమూర్ధ భాగమునకు నెగయించి ప్రాణముల్విడిచియాపవను - బవను

నందు నాకాశ - మాకాశమందు దేజ

మందు తేజంబు - నుదకంబు నందు నుదక

మర్ధి గాయంబు మేదిని యందు గలిసె

పూని వాని యథోచిత స్థానములుగ

ఇలాటి వర్ణన చూస్తే హఠలయాది యోగాలలో అతడెంత నిష్ణాతుడో మనకర్థ మవుతుంది. అయితే ఇది ఎంత అభ్యసించినా చివరకు జ్ఞాన వైరాగ్యాలతోనే తప్ప దీనివల్ల తరించటమనేది వట్టిమాట. కాని ఆ జ్ఞాన వైరాగ్యాలు గట్టి పడాలంటే వాటికిది ఒక పూర్వ రంగం. ఇది ఒక్క పృథువే గాదు. భీష్మాదులైన మిగతా భాగవత పాత్రలెందరో ఈ మార్గంలో పయనించిన వారు కనిపిస్తారు మనకు.

మొదట భీష్ముణ్ణే తీసుకొని చూతాము. కృష్ణభక్తుడని పేరేగాని మిగతా అక్రూరాదులలాగా ఆ కృష్ణుణ్ణి ఈయన నిత్యమూ అంటిపట్టుకొన్నట్టు ఎక్కడా కనిపించదు. అంటి ముట్టకుండానే కాలం గడుపుతుంటాడు. ఎన్ని ఉన్నా జీవిత ధ్యేయమితనికి సమాధి రూపమైన యోగమార్గమే. దాని కనురూపమైనదే ఆయన జీవితం కూడా. అసలు భీష్ముడంటేనే భీషణమైన వ్రతం పట్టినవాడు, పట్టు సడలని వాడని అర్థం. తండ్రి కోసం పెండ్లి మానేశాడు. రాజ్యం వదలుకొన్నాడు. మధ్యలో తల్లి బ్రతిమాలినా అపద్ధర్మంగానైనా తన వ్రతదీక్ష వదలలేదు. ఆ జన్మ నైష్ఠిక బ్రహ్మచారిగానే చివరిదాకా జీవితం సాగించాడు. తండ్రి శంతనుడు తన శీలానికి సంతసించి స్వచ్ఛంద మరణాన్ని ప్రసాదిస్తే యుద్ధరంగంలో పడిపోయి కూడా వెంటనే ప్రాణాలు విడువలేదు. ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేదాకా అంపశయ్య మీద ప్రాణాలుగ్గబట్టే పడి ఉన్నాడు.

ఇదంతా బాగా పరిశీలిస్తే యోగుల లక్షణమే గాని జ్ఞానులది గాదు. జ్ఞాని ఆయన అన్నపారాశర్యుడు. తపస్సంపన్నుడూ జితేంద్రియుడయి కూడా తల్లి ఆజ్ఞాపించగానే మరదండ్రతో సంగమించి కురుసంతతి నిలబెట్టాడు. భీష్ముడిలాగా పెడమొగం పెట్టలేదు. అది పరిపూర్ణుడైన జ్ఞాని వ్యవహారం. అలాంటిది కాదిక్కడ. ఈయన యోగి. యమ నియమాదులను కర్కశంగా అనుష్ఠించే సమాధి యోగి. భీష్ముని కఠోర బ్రహ్మచర్యమూ, అపరిగ్రహమూ, ఇవన్నీ అష్టాంగ యోగ లక్షణాలలో

చేరినవే. ఉత్తరాయణం, **'ఏకయా యాత్యనా వృత్తిమ్'** అనే గీతా వాక్యం జ్ఞాపకం వస్తుంది. ఉత్తరాయణంలో ప్రాణోత్క్రమణ చెందితే అర్చిరాది మార్గంలో దేవయానం చేసి దేవతా సాయుజ్యం పొందుతాడు యోగి. అలాగే చేశాడు భీష్ముడు.

ధర్మా న్ప్రవదతస్త స్య సకాలః ప్రత్యుపస్థితః
యో యోగినశ్ఛంద మృత్యో ర్వాంఛితస్తూత్తరాయణః

యోగులందరూ స్వచ్ఛంద మరణులే అసలు. భీష్ముడు కూడా స్వచ్ఛంద మరణుడయ్యాడంటే యోగి గనుకనే. అలాంటి యోగులు మరణించటానికి దేశకాలాది నియమాలున్నాయి. అలాటి నియమమే పాటించాడు భీష్ముడు.

అంతేగాదు. ఉత్క్రమణ చెందటం కూడా ధారణా ధ్యానాదులతోనే చెందటం కనిపిస్తుంది మనకు.

విశుద్ధయా ధారణయా హతాశుభః
తదీక్షయైవాశు గతాయుధ వ్యథః
నివృత్త సర్వేంద్రియ వృత్తి విభ్రమ
స్తుష్టావ జన్యమ్ విసృజన్ జనార్దనమ్

"దేశబంధ శ్చిత్తస్య ధారణా" అన్నాడు పతంజలి. ఒకానొక లక్ష్యం మీదనే మనసును కట్టి వేయటం ధారణ. అలాటి ధారణా బలంతో హతాశుభః కర్మాశయాన్నంతటినీ ఖాళీ చేసుకొన్నాడా మహాయోగి. అంతేకాదు. ధ్యాన సమాధి బలంతో శరీరాన్ని త్యజించటానికి సంసిద్ధుడవుతాడు. శరీర త్యాగం ప్రయత్న పూర్వకంగా చేయటమనేది యోగమే గాని జ్ఞానం గాదు. జ్ఞాని ప్రారబ్ధానికి వదిలేస్తాడు శరీరాన్ని. అహినిర్వ్వయని లాగా అది ఉన్నన్ని నాళ్లుండి పోయే నాటికి పోతుంది. వాడికిక పరమంటూ లేదు గద. యోగికలా కాక తాను చేరవలసిన పరలోకమంటూ ఒకటున్నది. అందుకోసం అవసానంలో ప్రాణాన్ని ఎలాగంటే అలా పోనీయకుండా హృదయస్థానం నుంచి సుషుమ్న ద్వారా భ్రూమధ్యానికీ అక్కడినుంచి సహస్రారానికీ చేర్చి ఆ తరువాత కపాలభేదం చేసుకొని ఆ బ్రహ్మరంధ్రంలోనుంచి దాన్ని సూర్యరశ్మిలో సంక్రమింపజేసి ఊర్ధ్వముఖంగా పయనించి ఆదిత్యమండలాన్ని కూడా దాటి తన కభిమతమైన లోకానికి పోయి చేరవలసి ఉంటుంది. అందుకే ఈ కలాపమంతా.

అయితే ఇక్కడ ఒక విశేషమేమంటే తన ప్రయత్నమెంత ఉన్నా భగవదనుగ్రహం కూడా ఉండాలి యోగసాధకుడికి. మన ప్రయత్నం మాత్రమే సరిపోదు. **"ఓ మిత్యేకాక్షరమ్ బ్రహ్మ వ్యావహరన్ మామను స్మరన్"** నన్ను స్మరిస్తూ కూడా ఉండాలన్నాడు భగవానుడు. ఈశ్వర ప్రణిధానమని పతంజలి పేర్కొన్నదిదే. అలాగైతేనే యోగం ఫలిస్తుంది. **"ఫలమత ఉపపత్తేః"** అనిగదా శాస్త్రవచనం. ఈ యోగరహస్యాన్ని బాగా గ్రహించినవాడు కాబట్టి భీష్ముడు కృష్ణుణ్ణి స్తోత్రం చేస్తూ ఆయన మూర్తినే దర్శిస్తూ ప్రాణాలు వదులుతాడు. త్రిజగన్మోహన నీలకాంతి అంటూ ఎంతో మనోహరంగా చేసిన ఆ ఈశ్వరస్తవమంతా యోగసిద్ధికొక ఆలంబనం. ఈశ్వరానుగ్రహం కోసం చేసే అభ్యర్థనం. తదనుగ్రహ బలంతో భీష్ముడు చివరకు తన కభిమతమైన స్థానాన్నే పోయి చేరుతాడు. గీతలో చెప్పినట్టు **"సతం పరం పురుషముపైతి దివ్యమ్"** దివ్యమంటే సూర్యమండలాం తర్గతుడైన ద్యోతనాత్మకుడైన పురుషుడని అర్థం చెప్పారు భాష్యకారులు. సగుణ బ్రహ్మతత్త్వమిది. నిర్గుణం కాదు. ప్రస్తుత మీభీష్ముడొక వసువు. అష్టవసువులలో అష్టమ వసువు. శాపగ్రస్తుడయి ఇలా జన్మించాడు. అతడు తన అభ్యాస బలంతో మరలా వసుపదాన్నే పొందాడే గాని మోక్షాన్ని గాదు. **"సయాతి పరమాం గతిమ్"** అంటే ప్రకృష్టమైన పదం లేదా స్థానమని అర్థం. అదే యోగులు కోరేది వారిక లభించేది. అంతకన్నా ఎక్కువది రాదు. తక్కువది రాదు. ఇదీ భీష్ముడి వృత్తాంతం.

పోతే ఇక విదురుడు. భీష్ముడూ విదురుడూ వీరిరువురూ భాగవత పాత్రలు కారసలు. భారత పాత్రలు. వారే మరలా మనకు భాగవతంలో దర్శనమిస్తున్నారు. ఇలా వీరిరువురే కాదు. కుంతీ గాంధారీ, ధృతరాష్ట్రుడూ, పాండవులూ, వీరంతా భారతంలోనే వారే. భాగవతంలోనూ కనిపిస్తున్నారు. ఇతిహాసంలో వారు పురాణంలోకి రావలసిన అవసరమేమి. దీనికింతకు ముందే ఇచ్చాము సమాధానం. పురాణ పాత్రలు కేవలం కల్పితాలే. వారొక సత్యాన్ని నిరూపించటం కోసం కల్పించబడుతారు. అందులో ఇతిహాస సత్యం ధర్మమైతే పురాణ సత్యం మోక్షమని గదా వర్ణించాము. ధర్మం ఆపేక్షికం గనుక దానిలో ప్రాపంచిక వాసనలు కూడా ప్రబలంగా ఉంటాయి. పోతే మోక్షమలాంటిది కాదది నిరపేక్షం. ప్రోజ్ఝిత కైతవమని గదా మొదటనే పేర్కొన్నాడు భాగవతకారుడు. కాబట్టి దానిలో కాలుష్యానికి తావులేదు.

అకలుషమైన ఈ మోక్ష సాధన మార్గంలో పయనించే పాత్రల స్వరూపాలు కూడా తదనుగుణంగానే ఉండాలి. అందుకే వ్యక్తులు వారే అయినా భారతంలో లాగా కనిపించరు భాగవతంలో. వీరి తరహాయే వేరు. అది భీష్ముడి విషయంలో కొంత చూచాము. పోతే ఈ విదురుడి విషయంలో ఇంకా ఎక్కువ మార్పు కనిపిస్తుంది. అక్కడ చివరదాకా హస్తినలోనే కాలం గడపి చివరకు గాంధారీ ధృతరాష్ట్రులతో అడవులకు పోయి అక్కడే వారితో కన్ను మూస్తాడు విదురుడు. ఇక్కడ అలాకాక తీర్థయాత్రలతోనే ముప్పాతిక జీవితం వెళ్లబుచ్చి ఉద్ధవమైత్రేయాది మహనీయుల సాంగత్యంతో అనేక అధ్యాత్మిక రహస్యాలు శ్రవణం చేసి చివర కవధూత అయి ఎవరికీ చిక్కకుండా ఎక్కడికో వెళ్లిపోతాడు.

అసలు విదురుడంటేనే అన్నీ తెలిసినవాడని అర్థం. మాండవ్యశాప ఫలంగా కాలుడే ఆ రూపంలో అవతరించాడు. శూద్రయోని సంభవుడైనా అయోనిజులైన ద్రోణాదులకు లేదా జ్ఞానం. సనత్సుజాతుని వంటి వాడాయనకు గురువంటే ఇక చెప్పేదేముంది. ఇంత జ్ఞానమున్నా కర్మవాసన లింకా ఆయనను వదలలేదు. అదే చిత్రం. దుర్యోధనాదుల కెంతో చెప్పి చూచాడు. తన మాట అతడే గాక అతని తండ్రి ధృతరాష్ట్రుడు కూడా పెడచెవిని బెట్టాడు. తన ఉనికే వారికి కంటక ప్రాయంగా ఉండటం గ్రహించాడు. తనకంతకంటేకంటక ప్రాయంగా ఉంది వారి సాంగత్యం. చిత్తశాంతి కోసం తీర్థయాత్ర బయలుదేరాడు. ఇది పూర్ణజ్ఞాని లక్షణంకాదు. జ్ఞానికెక్కడ ఉన్నా భయంలేదు. తన మాట వింటే వింటారు. లేకుంటే లేదు. తనపాటికి తానుంటాడు నిర్లిప్తంగా. విదురుడలా ఉండలేకపోవటం కర్మవాసనా ప్రాబల్యాన్ని సూచిస్తుంది.

దేశమంతా తిరిగి మళ్లీ వచ్చాడు హస్తినాపురానికి. పాండవులప్పటికి కౌరవ సంహారం చేసి రాజ్యపాలన చేస్తుంటారు. వారు విదురుని చూడగానే ప్రాణాలు లేచి వచ్చినట్టయి ఆయనకు యథోచిత సత్కారాదులు చేసి తమ దగ్గరే ఉండమని బ్రతిమాలుతారు. అతడు ధృతరాష్ట్రుడూ గాంధారీ అరణ్యానికి వెళ్లుతుంటే వారితో పాటు తానూ బయలుదేరుతాడు. అక్కడ ఆ వృద్ధ దంపతులిద్దరూ యోగానల దగ్ధులయి పోవటం కన్నార చూచి మనసులో కలవరపడతాడు. న్యాయమైతే అంత కలత చెందనక్కరలేదు. తానూ ఆ పాటికి వృద్ధుడే. తాను చేయవలసింది కూడా

జీవితంలో ఇక ఏమీ లేదు. **"కని యెదవో బిడ్డలనిక మనియెదవో తొంటే కంటె"** అని అన్నకు చెప్పిన హితం తనకూ వర్తిస్తుంది. **"దేహము నిత్యము గాదని మోహము దెగ గోసి సిద్ధమని వర్తనుడై దేహము వెలువడు నరుడని"** తానాయనకు చేసిన బోధ తనకూ అన్వయిస్తుంది. యోగమార్గంతో నిశ్చింతగా తానూ కన్ను మూయవచ్చు. కాని కలతచెందాడు విదురుడు. అంటే ఇంకా జ్ఞానవైరాగ్యాలు బాగా గట్టిపడలేదు. అందుకు పురాకృత కర్మవాసన లడ్డు తగులుతున్నాయి. అందుకే వారల మరణము వింత యగుచు జూడబడిన చింతా క్రాంతుడయి మనశ్శాంతి కోసం మరలా తీర్థాటనానికి బయలుదేరాడు.

మత్స్యకురు జాంగలా లతిక్రమించి వెళ్లుతూ ఒకచోట ఎదురుగా వస్తున్న ఉద్ధవుణ్ణి చూస్తాడు. చూడగానే ఆయనను గాఢాలింగనం చేసుకొని కుశల ప్రశ్న లడిగి తన ఇష్టదైవతమైన కృష్ణుని యోగక్షేమాలు కూడా ప్రసంగవశాత్తూ ప్రశ్నిస్తాడు. ఎందుకయ్యా నీవు మీ వారినందరినీ వదలి ఇలా దేశాంతరాలు తిరుగుతున్నావని అడిగితే

అనుజుడు వీడన కయ తన
తనయులు నను వెడల నడువ తానూరక యుం
డిన ధృతరాష్ట్రుడు నరకం
బున బడు .... నని శాపనార్ధాలు.

పెడుతూ ఏమి చేయమంటావు. **"నరలోక విడంబనమున హరి పరమపరుండు మానవాకృతితో నిద్ధర బుట్టి"** మనలనందరినీ తన మాయాబలంతో మోహింప జేస్తున్నాడని బుజాలు తడువుకొంటూ సమాధానమిస్తాడు. ఇదంతా తగినంత మనోదార్ఢ్యం లేని లోపం. ఉద్ధవుడాయన కేమని బదులు చెప్పాలో దిక్కుతోచక బాష్పవారి పూరిత లోచనుడయి క్రమంగా యదుకుల నాశమూ శ్రీకృష్ణ నిర్యాణమూ బయట పెడతాడు. అదంతా విని అపార దుఃఖ పరవశుడయి నిజయోగ సత్త్వమున దరియించగలిగాడు. కృష్ణుడు నిర్యాణం చెందే సమయంలో నీకే తత్త్వ రహస్యం బోధించి పోయాడో అది నాకు చెప్పమని ప్రాధేయపడతాడు అది నీకు మైత్రేయుడనే బ్రహ్మవేత్త నా కన్నా బాగా చెప్పగలడు. నిరంతర కృష్ణపదారవింద ధ్యానశీలుడతడు. అతణ్ణి పోయి ప్రార్థించమని వెళ్లిపోతాడు.

ఆ తరువాత విదురుడు మైత్రేయ మహర్షిని కలుసుకొని వారిరువురూ చేసిన సంవాదమంతా ఇంతా కాదు. మొత్తం తృతీయ చతుర్థ స్కంధాలు రెండూ విదుర మైత్రేయ సంవాదమే. అందులో ఎన్ని విషయాలెన్ని, రహస్యాలు, ఎన్ని వృత్తాంతాలు. కపిలుడు దేవహూతికి చేసిన బోధ, దక్షప్రజాపతి చరిత్ర, ధ్రువోపాఖ్యానం, పృథు చక్రవర్తి చరిత్ర, పురంజనోపాఖ్యానం ఇలాంటి గొప్ప గొప్ప ఘట్టాలెన్నో వస్తాయిందులో. ప్రతి ఒక్కటీ విదురుడు ప్రశ్నించటమూ మైత్రేయుడు ప్రవచించటమూ. మొత్తానికి కర్మభక్తి సమాధి జ్ఞానాలనే నాలుగింటినీ ఆయా పాత్రల మీదా వారి చరిత్రల మీదా నెపం పెట్టి మైత్రేయు డేకరువు పెడతాడు. విదురుడన్ని రహస్యాలూ ఏక చిత్తంతో ఆలకిస్తాడు. అయితే వచ్చిన చిత్రమేమంటే అన్ని గొప్ప విషయాలు శ్రవణం చేసిన ఆ మహాత్ముడు మరలా ఆయనను వీడ్కొని బంధు సందర్శనాభిలాషియై హస్తినకు బయలుదేరుతాడట. ఎవరున్నారని అక్కడ. ఉన్నా తనకెవరేమి ఒరిగిస్తారని. కృష్ణునిలాంటి అవతార పురుషుడే నిష్క్రమించిన వార్త విన్నాడు తాను. విని నిర్వేదంతో వచ్చి మైత్రేయుణ్ణి దర్శించినవాడు. ఆయన వల్ల ఒకటి గాదు. రెండు గాదు. సవాలక్ష జీవిత రహస్యాలు తెలుసుకొన్నాడు. ఇన్ని తెలుసుకొన్నా ఇంకా బంధు వాత్సల్యమనే చాపల్యం వదలలేదా వ్యక్తికి. ఇదే వాసన అంటే. ఈ వాసన ప్రాబల్యం పని చేస్తున్నంత వరకూ ఎన్ని విను, ఎన్ని చేయి, మనిషి దారికి రాడు. అవి బావిలో పూడులాంటివి. పయినీళ్లు వృత్తులైతే లోపలి పూడు వాసనలు. వృత్తులు శ్రవణాదుల చేత తాత్కాలికంగా నశించినా సంస్కారాలు నశించవు. పయినీళ్లు తోడి పోసినా లోపలి పూడు తీయనంత వరకూ ఫలమేముంది. శుద్ధమైన గంగపైకి పొంగదు.

అలాగే విదురుడెంత జ్ఞాని అయినా ఎంత యాత్రా శీలి అయినా ఎందరెందరు మహాత్ముల సందర్శనం చేసినా ఎన్ని తత్త్వ రహస్యాలు గ్రహించినా వాటి పరిపాకమైన శమదమాదు లబ్బలేదు. కనుకనే అంతా విని మరలా హస్తినకే దారి తీస్తాడు. ఆ తరువాత విదురుడెక్కడికి వెళ్లాడో ఏమయ్యాడో మనకు తెలియదు. భాగవత కర్త అది మన ఊహకే వదలి వేశాడు. బహుశః ఒక్కటే జరిగి ఉంటుంది. సందేహం లేదు. హస్తినకు వచ్చి పాండవుల మహాప్రస్థాన వార్త కూడా విని తన పామరత్వానికి తానే సిగ్గుపడి ఏపర్వత గుహలకో ఏ మహారణ్యాలకో పోయి అక్కడ ఏకాంతంగా ఒక అవధూత రూపంతో సంచరిస్తూ తన మనసుకు పట్టిన వాసనామయ మహా

మాలిన్యాన్నంతటినీ ధారణా ధ్యాన సమాధి రూపమైన యోగాభ్యాస బలంతో క్షాళితం చేసుకొని ఎక్కడో అడుగున బడి అణగారిపోయిన ఆత్మజ్ఞాన గంగ పైకుబుకగా దానిలో మజ్జనోన్మజ్జనం చేసి పరిశుద్ధుడయి చివరకు పరమపదాన్ని భజించి ఉంటాడు. అసలు జరగటం కూడా అలాగే జరిగింది. చివరకు ప్రభాసమనే తీర్థానికి వెళ్లి అక్కడే శరీర త్యాగం చేశాడు విదురుడు. ఇలా విదురుడి జీవితం కూడా సమాధి యోగాని కుదాహరణ ప్రాయమే.

పోతే దీని తరువాత ధ్రువుడి జీవితం. విదురాదుల యోగం వేరు. ధ్రువుని యోగం వేరు సమాధి యోగంలోనే ఇతనిది మంత్రయోగం. స్వాయంభువ మనువు పుత్రుడైన ఉత్తానపాదునకు జన్మించిన వాడితడు. ఉత్తానపాదుడి కిద్దరు భార్యలు. సురుచి ఒకతి. సునీతి ఒకతి. సునీతి కొడుకు ధ్రువుడు. సురుచి కొడుకుత్తముడు. ఉత్తముణ్ణి ఒకరోజు ఒడిలో కూచోబెట్టుకొని తండ్రి ముద్దాడుతుంటే చూచాడీ కుర్రవాడు. తానూ ఒడిలో కూచోబోయాడు. కూచోనీయలేదు సురుచి. నా కడుపున బుడితే గాని నీవా భాగ్యానికి నోచుకోలేవు. కావాలంటే పోయి విష్ణువును గూర్చి తపస్సు చేయి. దేవుడు కరుణిస్తే నిన్ను నా గర్భవాసంలోనే జన్మింపజేస్తాడని మాట సామెతగా అంటుంది. ఏడుస్తూ వచ్చి ఆ మాటలు తల్లికి చెబుతాడు. సునీతి అతణ్ణి ఓదార్చి నాయనా "నిను నాడిన యా సురుచి వచనములు సత్యంబులగును. సర్వ శరణ్యుండనగల హరి చరణంబులు గను జనకుని యంక మెక్కగా దలతేనిన్" అని తానూ ఆ సురుచి మాటలే సమర్థించి పంపుతుంది.

పట్టుదల ఆ కుర్రవాడికి జన్మంతో వచ్చింది. అది హఠయోగుల కుండే హఠం లాంటిది. అది సహజంగా ఉండటంవల్లనే ఇటూ అటూ చూడక తల్లి మాటను పాటించి ఒంటరిగా అరణ్యానికి బయలుదేరాడు. దారిలో నారద మహర్షి తారసిల్లి అతనికి హస్తమస్తక సంయోగం చేస్తాడు. ఇది ఒక విధమైన యోగదీక్షా ప్రదానం. పినతల్లి ఆడిన నిష్ఠురోక్తులకు బాధ చెంది ఇంత దూరం ఒంటిగా పరుగెత్తి రావలెనా – ఏమిటినీ చికీర్షితమని ప్రశ్నిస్తాడు. సాధకుడి చిత్తశుద్ధినీ యోగ్యతనూ పరీక్షించి గదా గురువైన వాడతని కేదైనా మార్గాన్ని చూపవలసింది. అలాంటి ధోరణిలోనే ప్రశ్నించాడు నారదుడు. **"సపత్నీ మాతృవాగిషు క్షతంబను వ్రణంబు భగవద్ధ్యాన యోగరసాయ నంబున బాపి కొందు"** నని సమాధానమిస్తాడు ధ్రువుడు. అప్పటికి

ధ్రువుడి తపశ్చర్య జ్ఞానం కోసం కాదు. మోక్షం కోసం గాదు. సకామమది. సవతి కొడుకుకు లభించిన పదవి అతనికి దుస్సహమయింది. అంతకన్నా పెద్ద పదవి నార్జించాలని ఆకాంక్ష తప్ప మరేదీ లేదతని మనసులో.

నారదుడది గమనించి మరలా పరీక్ష పెట్టాడు. నీవు తల్లి చెప్పిన యోగమార్గమే అనుసరించి సర్వేశ్వరానుగ్రహం పొందాలని చూస్తున్నావు. అది అనేక జన్మలు నిస్సంగులయి సమాధి నిష్ఠాగరిష్ఠులైన పెద్దలకే అంతుపట్టదు. ఫలితమీయదు. నీవనగా నెంత. పోనీ సకామంగా గాక నిష్కామంగా భజిస్తున్నావా. ఆయా కాలాల్లో కర్మానుసారిగా మనకేయే సుఖదుఃఖాదులు ప్రాప్తిస్తే వాటిని జ్ఞాని అయిన వాడు నిర్వికారమైన చిత్తంతో స్వీకరిస్తాడు. ఇలా యోగానికీ జ్ఞానానికీ రెంటికీ తప్పిన చిత్తవృత్తి ఏమిటో నాకంతు చిక్కటం లేదిది దేనికి. దీనిని వదలుకోమని ప్రబోధిస్తాడు. దానికా బాలుడు సమాధానమిస్తూ అయ్యా మీరు చెప్పింది వాస్తవమే నాకు యోగులకుండవలసిన శమదమాదులు లేవు. తీవ్ర రోష కషాయితమైన నాచిత్తంలో శాంతికి చోటు లేదు. త్రిభువనోత్కృష్టమూ అనన్యాధిష్ఠితమూ అయిన స్థానం కావాలి నాకు. అదే నా అభీష్టం. వీలైతే అలాటి పదాన్ని అందుకొనే మార్గమేదైనా ఉంటే అనుగ్రహించమని ప్రార్థేయపడతాడు.

ఇది ఆ వాసుదేవ ప్రేరణేనని గ్రహించిన నారదుడా కుమారుడికి వాసుదేవ మంత్రాన్ని అప్పటికప్పుడుపదేశించి యమునా తీరంలో మధువనంలో కూచుని నిష్ఠతో ఈ మంత్రం జపిస్తూ పో – భగవదనుగ్రహ పాత్రుడవవుతావని దీవించి పంపుతాడు. అలాగే పోయి ధ్రువుడా వనంలో త్రివృత్ప్రాణాయామాదులూ, ప్రత్యాహారాదులూ అయిన యోగాభ్యాస క్రియల నవలంబించి ఏకాగ్రచిత్తంతో పురుషోత్తముణ్ణి ధ్యానిస్తూ కూచుంటాడు. **"ధృత చిత్తుడు శాంతుడు, నియత పరిభాషణుడు, సుమహితాచారుడు, వర్ణిత హరి మంగళ గుణుడును, మితవన్యా శనుడునయి"** మెలగుతూ వచ్చాడా బాలుడు. అంతేకాదు. ఒక్కొక్క మాసంలో ఒక్కొక్క కఠోరమైన యోగదీక్షతో కాలక్షేపం చేయసాగాడు. చివరకు నేలమీద ఏకపాదంతో నిలుచొని ఘోరవీర తపమాచరిస్తాడు. ఇదంతా సమాధి యోగానకి పరాకాష్ఠ. భగవన్మూర్తి ధ్యానమనేది దాని కానుషంగికం.

దానితో లోకాలన్నీ వ్యాకులమయిపోయి ఆ పరమాత్మ ప్రత్యక్ష్యంగాక తప్పింది గాదు. అయినాడు ప్రత్యక్షం. యోగవిపాక తీవ్రమైన ధ్రువుని బుద్ధిలో తటిత్ప్రభాయితంగా ఉన్న తన మూర్తి బాహ్యంగా చూసేసరికి తక్షణం కళ్లు తెరచి ఆ బాలుడు పులకితుడై దండ నమస్కృతులాచరించి భగవత్ప్రసాద లబ్ధమైన వాక్కులతో ఆ భగవానుని పరిపరి విధాల స్తోత్రం చేస్తాడు. నిష్కాములకు నీ పాద పద్మభజనమే సర్వస్వమయినా సకాములయిన మాబోంట్లకు కూడా నీవు కామితార్థప్రదుడవు కాబట్టి నీ దర్శనం నాకు వృధాపోదని సాభిప్రాయంగా కీర్తిస్తాడు. అది కనిపెట్టి ఆ పరమేశ్వరుడు నాయనా నీ హృదయమందు మసలిన కార్యంబారూఢిగా నెఱుంగుదు. అది వొందరానిదైనా ఇస్తానని హామీ ఇస్తాడు. నీవు కోరినట్టే అనన్యాధిష్ఠితమయి ప్రళయ కాలంలో కూడా నశ్వరం కాని ప్రకాశమానమైన ధ్రువక్షితి అనే పదం నీకు ప్రసాదించాను. అయితే అది ఇప్పుడే నీకు పాకానికి రాదు. ఇరవయి ఆరు వేల సంవత్సరాలు రాజ్యమేలి ఆ తరువాత దేహపాతమైతే నీకది లభిస్తుంది పొమ్మని అంతర్ధానమవుతాడు.

చూచారా. ఇదీ అతడింత దారుణమైన తపస్సు చేసి చివరకు గడించిన ఫలం. సమాధి యోగంవల్ల మానవుడు సాధించే భూమిక ఇంతవరకే. దీనివల్ల అంతకంత కున్నతమైన యోగసిద్ధులు లభించవలసిందే గాని అన్నిటికన్నా అతీతమైన పరమపదం చేతికి రాదు. కనుకనే ధ్రువుడు తనకోరిక తీరి కూడా మనోవ్యధతో ఇంటికి మరలిపోయాడు. **"అహో బత మమా నాత్మ్యమ్ మంద భాగస్య పశ్యత"** నేనెంత మూఢుడనో దురదృష్టవంతుడనో గదా, **"భవచ్ఛిదః పాదమూలం గత్వాయాచే యదంతవత్"** జనన మరణో న్మూలనం గావించి మోక్షాన్నే ప్రసాదించే భగవంతుడు ప్రత్యక్షమయి కూడా ప్రాపంచికమైన పదవినే అర్థించాను. **"దైవీమ్ మాయా ముపాశ్రిత్య"** దేవతల మాయ నన్ను మోసపుచ్చింది. **"ప్రసుప్త ఇవ భిన్నదృక్"** దానితో ఒక స్వప్నదృక్కులాగా భేదదృష్టినే పట్టుకొని పోయాను. **"తప్యే ద్వితీయేఽ ప్యసతి భ్రాతృ భ్రాతృవ్య హృద్రుజా"** వస్తుతః పరమాత్మ తప్ప మరొక అన్య పదార్థం లేకపోయినా ఉన్నట్టు భావించి తండ్రి అని తల్లి అని తమ్ముడని వారు నాకేదో ద్రోహం చేశారని అనవసరంగా భ్రాంతి పడ్డాను. నేనెంత అజ్ఞానిని, అవివేకిని అని ఎంతగానో పరితపిస్తాడు. కేవల సమాధి నిష్ఠ అనేది పట్టుకొని పోతే దాని ఫలితమిదే

చివరకు. అది ప్రతిలోమమే గాని అనులోమ సాధన గాదు. భక్తి జ్ఞానాలు దాని కావశ్యకం. అవి తోడుపడితేనే అనుకూలమైన ఫలమిస్తుంది. తోడుపడకుంటే ప్రతికూలంగానే సమసిపోతుంది. శ్రీ మహావిష్ణువు సాక్షాత్కరించినా ధ్రువుడి కాభక్తి జ్ఞానాలు లేవు. భక్తే ఉంటే ధ్రువపదంగాదు. విష్ణుపదమే కోరేవాడు. జ్ఞానమే ఉంటే కడకు మోక్షపదమే కోరుకొనేవాడు. రెండూ కాదని ఒకానొక ఉన్నత స్థానమే అర్థించాడంటే అది సమాది యోగం వల్ల సాధించవలసిందేదో అదే సాధించగలిగాడు గాని అంతకన్నా ఏమీ లేదు.

ఈ ధ్రువుడి కథ ఇక్కడికి ముగియలేదు. ఇరువది అయిదు వేల ఏండ్లు బ్రతకవలసి ఉంటే అప్పుడే ఎలా ముగుస్తుంది. ప్రారబ్ధకర్మ ప్రాబల్యమెవరూ తప్పించలేరు. తన తమ్ముడు ఉత్తముడు పెండ్లి పేరంటం లేక తనకు బాసటగా ఉండేవాడు. ఒకనాడు వాడు వేటకు పోయి హిమాలయ సమీపంలో ఒక యక్షుడి చేత హతుడయినాడు. ఆ పుత్ర దుఃఖంలో అతని తల్లి సురుచి అరణ్యంలో ఒంటరిగా తిరుగుతూ దావానలం చుట్టుముట్టి అకస్మాత్తుగా దాని కాహుతియైపోతుంది. తల్లీ తమ్ముడూ అలా మరణించటాని కంతటికీ హేతువాయక్ష కులమే గదా అనే కక్షతో ధ్రువుడా యక్షలోకం మీదికి దండయాత్ర వెళ్లుతాడు. ఇదీ ఒక హఠమే. అంతకు ముందు బాల్యంలో ఆ సవతి తల్లి - సవతి తమ్ముడి మీద స్పర్ధతో అడవులు పట్టిపోయాడు. ఇప్పుడా ఇద్దరి మీదా ఎక్కడ లేని అభిమానం పొడుచుకు వచ్చి గుహ్యకులనే శిక్షించటానికి బయలుదేరుతాడు. ఏది పట్టినా వల్లమాలిన ఆగ్రహమే. ఇది ఒక భక్తుడికి గాని జ్ఞానికి గాని ఉండవలసిన లక్షణం కాదు కేవలం పట్టుదలతో సమాధియోగాన్ని సాధిస్తూ పోయే వ్యక్తికే కనుపట్టే స్వభావం. దీక్షతో ఏకాగ్రతతో ఆయా యోగసిద్ధులు సంపాదిస్తారే గాని వారు శమదమాది గుణాలకు నోచుకోలేరు. ఒకవేళ అలవడినా అది తాత్కాలికమే.

కుబేరుని అలకా పట్టణాన్నే ముట్టడించాడు ధ్రువుడు. అసంఖ్యాకమైన యక్ష సైన్యాన్ని శస్త్రాస్త్ర జ్వాలల కెరచేశాడు. ఇంతమంది నిరపరాధులను పొట్టన పెట్టుకోటమే మాత్రమూ సహించలేకపోయాడు ఆయన తాత స్వాయంభువ మనువు. పరుగు పరగున వచ్చి తన మనుమని చూచి ఇలా అంటాడు. **"అనఘా మనుకుల మునకిది యను చిత కర్మంబు యొకనికై పెక్కండిట్లనిమొన ద్రుంగిరి" "భూతహింస**

గావించుట హృషీకేశాను వర్తులయిన సాధువులకు దగదు - జగదుత్పత్తి స్థితి లయంబులకు దైవంబు కారణంబైయుండ నీ ధన దానుచరులు భవదీయ భ్రాతృ హంతలగుదురే అది గానరోషమడపు మహాత్మా. అర్థవిభునకు నీవపరాధి వయితివి. నతినుతులచేత నతనిని ప్రసన్నుని చేసుకొమ్మని" మందలించి పోతాడు. వెంటనే కుబేరుడు ప్రత్యక్షమవుతాడు. **"నాయనా ప్రతి ఒక్కటీ కాలాధీనం. అది పరమాత్మ లీల. నీ సోదరుని చంపిన వారీ యక్షులుగారు. యక్షుల వధించినవాడవు నీవు గావు. ఈ సూక్ష్మం తెలుసుకొంటే ఇలాంటి పనులిక ఎప్పుడూ చేయవని"** చెప్పి అతడడిగితే శ్రీహరి స్మరణ రహస్య ముపదేశించి తిరోహితుడవుతాడు.

తరువాత ధ్రువుడు పరిశుద్ధ మనస్కుడయి పట్టణానికి అప్పటి నుంచి హరి భక్తి నేమఱక తనయందు అఖిల ప్రపంచమందు ఒకే ఒక పరతత్వాన్ని దర్శిస్తూ శమదమాన్వితుడై ఇరువది యైదు వేల యేండ్లు భోగముల చేత పుణ్యక్షయమూ, అభోగముల చేత పాపక్షయమూ చేసుకొని చివరకు కొడుకులకు పట్టంగట్టి దేహాదికమైన సమస్త ప్రపంచమూ అవిద్యా రచిత స్వప్న గంధర్వనగరం లాగ భగవన్మాయా రచితమని గ్రహిస్తాడు. తరువాత అరణ్య భూములలో అసహాయుడై సంచరిస్తూ సునంద నందులనే బ్రహ్మవేత్తల సాంగత్యం కలిగి వారివల్ల హరి భక్తి రహస్యమంతా ఆకళించుకొని దివ్య విమానారూఢుడయి విష్ణు దత్తమైన ఆత్మస్థానాన్ని పోయి అలంకరిస్తాడు. ఇలా చివరదాకా సమాధియోగంతోనే కాలం గడుపుతూ వచ్చి దానితో పాటు చివరకు భక్తి యోగం కూడా ఒంటబట్టి ఆ రెండింటి బలంతో పరమ భాగవతుడయి ధ్రువుడు తనజీవితం చరితార్థం చేసుకొంటాడు.

ధ్రువాదుల తరువాత చెప్పుకోదగింది ఋషభాది యోగుల చరిత్ర. సమాధి యోగమార్గంలో వీరిది పరాకాష్ఠ. మంత్ర తారకలయ హఠాది యోగాలన్నీ అహ మహమికతో వచ్చి దాసోహమన్న మహాపురుషులు వారు. ఈ ఋషుడు దెవరోగాదు. నాభికుమారుడు. నాభి ఆగ్నీధ్రుని తొమ్మిది మంది కుమారులలో ఒకడు. ఈ ఆగ్నీధ్రుడు ప్రియవ్రతుని కుమారుడు. ఆ ప్రియవ్రతుడవెరో గాదు. సాక్షాత్తూ ధ్రువుని తండ్రి ఆ ప్రియవ్రతుడు క్రూడా యోగమార్గ విశారదుడే. పరమభాగవతుడూ ఆత్మారాముడని పేరు గన్నవాడు. ఆయన కుమారుడు ఆగ్నీధ్రుడూ మనవడు నాభి కూడ తన్మార్గానుయాయులే. అప్పటికి ధ్రువుని వంశమంతా సమాధి నిష్ఠమైనదే నని అర్థమవుతున్నది. పోతే ఈ వంశీయులందరిలో తలమానికమైన వాడు ఋషభదేవుడు.

ఋషభుడు సాక్షాత్తూ విష్ణ్వంశ సంభూతుడు. పృథుచక్రవర్తి లాగా ఇతడు కూడా ఆయనగారి అపరావతారమే. అది కూడా చాలా చమత్కారంగా జరిగింది. నాభి ఋత్విక్కుల సహాయంతో నారాయణుని గూర్చి ఒక బ్రహ్మాండమైన యజ్ఞం చేస్తాడు. యజ్ఞపురుషుడైన నారాయణుడు ప్రత్యక్షమై మీరు నాయీడు గల కుమారుని అడిగారు కాబట్టి - నాకు సమానుడైన వాడను నేనే కాబట్టి - మీకు నేనే నందనుడనయి జన్మిస్తున్నానని అనుగ్రహిస్తాడు. అదే ఋషభావతారం. నాభికిమేరు దేవియందు జన్మించాడు. పుట్టీ పుట్టగానే ఆ బిడ్డనొక మహారాజుగా గుర్తించారు ప్రజలంతా. క్రమంగా ఆయన ప్రభావం భూమండలమంతా ప్రాకసాగింది. అది చూచి మత్సర గ్రస్తుడయ్యాడు మహేంద్రుడు. అతడు పాలించే దేశాని కనా వృష్టి పీడ నావహించాడు. ఋషభదేవుడు దాన్ని తన యోగమాయా బలంతో జయిస్తాడట.

పుత్రుని దివ్య ప్రభావం గమనించి అజనాభమనే ఈ వర్షానికంతటికీ ఆయననే పట్టాభిషిక్తుణ్ణి చేసి పత్నీసహితుడై బదరి కాశ్రమానికి పోయి మహా యోగసమాధితో శరీర త్యాగం చేసి హరి సాయుజ్యం చెందుతాడు. ఆ తరువాత ఋషభుడు తాను పాలించే భూమి కర్మ భూమి అనిగ్రహించి ప్రజలందరూ తనతో సహా కర్మ తంత్రులయి ప్రవర్తించే లాగా చూస్తాడు. అతని ధర్మబుద్ధికి సంతసించి దేవేంద్రుడు జయంతి అనే కన్యనిస్తే వివాహమాడి భరతాదులైన కుమారులను నూరుగురు నుత్పాదిస్తాడు. ఆ భరతుడే జడభరతుడు. అతని పేర వెలసిందే ఈ భరత వర్షం. భారతదేశం. అంతకు ముందిది అజనాభమే. భారతమనే పేరు దుష్యంతుని కుమారుడైన భరతుని మీదుగా ఏర్పడిందని చాలా మంది అభిప్రాయం. అది వట్టి అపోహ. భారతదేశ ప్రవర్తకుడు జడ భరతుడే. అతడు ఋషభుని జ్యేష్ఠ పుత్రుడు.

ఋషభుడు బహుకాల మీ దేశాన్ని ఏలుతూ ఎన్నో క్రతువులూ, యజ్ఞాలూ అనుష్ఠించి చివర కొకనాడు తన నూరుగురు కుమారులను చేర బిలిచి వారికిలా శిక్షణ ఇస్తాడు. **"నాయం దేహో దేహ భాజాం నృలోకే కామానర్హతి విడ్భుజాంయే - తపోదివ్యం పుత్రకా యేవసత్త్వం - శుద్ధ్యేద్య స్మాద్బ్రహ్మ సుఖం హ్యనంతమ్"** దేహం శాశ్వతం కాదు. కాబట్టి శాశ్వతమైన బ్రహ్మపదం కావాలంటే తపస్సు ఒక్కటే శరణ్యం మానవులకు. దానివల్ల సత్త్వం శుద్ధి అయితే బ్రహ్మపదం సులభంగా లభిస్తుంది. **"అధ్యాత్మ యోగేన వివిక్త సేవయా - ప్రాణేంద్రియాత్మాభి జయేన సద్ర్యక్**

– సచ్ఛ్రద్ధయా బ్రహ్మచర్యేణ శశ్వ – దసంప్ర మాదేన యమేన వాచాం, కర్మాశయం, హృదయ గ్రంథిబంధ, మవిద్యయాసాదిత మప్రమత్తః అనేన యోగేన యథోపదేశమ్ సమ్యగ్వ్యపో హ్యో పరమేత యోగాత్" వివిక్త సేవా అధ్యాత్మ యోగమూ, ఇంద్రియ ప్రాణమనో నిగ్రహమూ, శ్రద్ధా బ్రహ్మచర్య యమ నియమాదులూ, వీటన్నిటి మూలంగా అవిద్యా గ్రంథి విస్రంసనం చేసుకొని సమాధి బలంతో లింగ దేహ భంగమెవడు చేసుకొని నస్ప్రుమిస్తాడో వాడే సాయుజ్య సామ్రాజ్యాని కర్హుడు. **"తస్మాద్భవంతో హృదయేన జాతా స్సర్వే మహీయాంస మముం సనాభిం – అక్లిష్ట బుద్ధ్యా భరతం భజధ్వం"** అంచేత మీరంతా నా హృదయ జాతులయి నందు కకలుషిత బుద్ధులయి సకల గుణ సంపన్నుడైన మీ అగ్రజాతుడీ భరతుణ్ణి సేవించండి అని సలహా ఇచ్చి భరతుడికి పట్టాభిషేకం చేసి కొంతకాలం రాజగృహంలోనే యోగ నిష్ఠుడయి నివసిస్తాడు.

ఆ తరువాత అవతార పురుషుడు కాబట్టి యోగప్రభావాన్ని లోకులందరికీ తన ఆచరణలోనే చాటి చూపటాని కవధూత చర్య ననుసరిస్తూ లోకంలో సంచరిస్తాడు. అది ఎలాగంటే భాగవతం మనకిలా వర్ణించి చెబుతున్నది. **"జడాంధ బధిర మూక పిశాచో న్మాద ఇవ అవధూత వేషః అభి భాష్య మాణోపి జనానాం గృహీత మౌన వ్రతః తూష్ణీం బభూవ"** ఒక జడుడు అంధుడు బధిరుడు ఉన్మత్తుడి మాదిరి నగ్నంగా తిరుగుతూ ఎవరెప్పుడు పలకరించినా వారితో ఏమీ మాటాడకమౌనంగా ఉండేవాడు. **"తత్ర తత్రపుర గ్రామాకర ఖేట వాట శిబిర వ్రజ ఘోషసార్థ గిరివనా శ్రమాదిషు అను పథమవని చరాపశుదైః పరిభూయమానో మక్షి కాదిభి రివ వనగజః తర్జన తాడనమే హనష్ఠీవన, గ్రావ శకృద్రజః ప్రక్షేపణ, పూతివాత దురుక్తై, స్తదవి గణయన్నే వాసత్సం స్థానః ఏతస్మిన్ దేహో పలక్షణే సదుపదేశే, ఉభయానుభవ స్వరూపేణ స్వమహిమావస్థానేన అసమా రోపితా హం మమా భిమానత్వా, దఖండిత మనాః పృథివీ మేక చరః పరిబభ్రామ"** పట్టణ గ్రామపర్వతా రణ్యాదులలో ఎక్కడ ఎవరివల్ల ఎలాంటి మానావమానాలు కలుగుతున్నా ఒక మదగజం లాగా లెక్క చేయక దేహాభిమానాన్ని పూర్తిగా వదిలేసి సుఖదుఃఖాదులు సమానంగా తీసుకొంటూ నిర్వికారమైన చిత్తంతో సంచరించేవాడు. అంతేకాదు. **"వ్రత మజగర మాస్థితశ్శయాన ఏవాశ్నాతి – పిబతి ఖాద – త్యథమేహతి**

– హదతేస్య తస్య హాయం పురీష సురభి సౌగంధ్యో వాయుర్దిశో దశ యోజనం సమంతాత్ సురభీచకార" అజగర వ్రతాన్ని అనుసరిస్తూ ఎక్కడ బడితే అక్కడ పడుకొనేవాడు. తాగేవాడు తినేవాడు, మూత్రించేవాడు, పురీషం విసర్జించేవాడు. దానిసౌగంధ్యంతో సురభిళమైన వాయువు దశ దిశలూ వీస్తే ఎటు చూచినా ఒక ఆమడదూరం పరిమళం వెదజల్లుతూ వచ్చేది. **"ఇతి నానాయోగ చర్యాచరణో భగవాన్, సిద్ధ సమస్తార్థ పరిపూర్ణ యోగైశ్వర్యాణి"** ఇలా అనేక విధాలైన యోగచర్యలు చరిస్తూ సమస్త యోగసిద్ధులనూ సాధించాడు. ఏమిటా సిద్ధులు. "వైహాయన, మనోజవ, అంతర్ధాన, పరకాయ ప్రవేశ, దూరగ్రహణ శ్రవణా దీని" ఆకాశ గమనమూ, మనోవేగమూ, తిరస్కరిణి, పరకాయ ప్రవేశమూ, దూదర్శన శ్రవణాదులూ.

శుకమహర్షి ఇలా వర్ణిస్తూ పోయేసరికి పరీక్షిత్తు కొక ప్రశ్న ఉదయించింది. అయ్యా మీరీ యోగశక్తులన్నీ ఇలా బ్రహ్మాండంగా వర్ణించి చెబుతున్నారు. బాగానే ఉంది. కాని కర్మవాసనలన్నీ జ్ఞానాగ్ని చేత దగ్ధం చేసుకొన్న యోగికీ మహిమలన్నీ మరలా మోక్షమార్గంలో ప్రతిబంధమే గదా. అనగానే శుకుడు "సత్య ముక్తమ్ కింత్వి హవా ఏకేతు మనసో విస్రంభ మనవ స్థానస్య శఠ కిరాత ఇవ నసంగచ్ఛంతే" అని సమాధానమిస్తాడు. దీని అర్థమేమంటే మనసనేది అనవస్థానం. అంటే అతిచంచలమైనది. దానిని చస్తే నమ్మరాదు. మనకు వశమయినట్టే అయి మరలా కొడి ఎత్తుతుంది. అంచేత ఒక తెలివిగల కిరాతుడు తాను పడగొట్టిన మృగం మృతమైనా ఎలా విశ్వసించడో, అలాగే మనసు మృతమైనదన్నా నమ్మలేడు యోగి. కనుకనే ఇలాంటి మహిమల వల్ల దాని నిదర్శనం చేసుకొంటాడు. కనుకనే ఇలాంటి మహిమలు చూపటమే జీవితానికి పరాయణమని భావించడు. ప్రస్తుతం ఋషభుడు కూడా ఎన్ని సిద్ధులు ప్రదర్శించినా అది ప్రదర్శనా దృష్టితో గాక మనోనిగ్రహం కోసమే అనుసరిస్తూ వచ్చాడు. అనుసరిస్తూ ఒకానొక సమయానికి ప్రారబ్ధ కర్మ పరిపక్వం కాగా సమీరవేగ ధూతవేణు వికల జాతోగ్ర దావానల మాయన ప్రవేశించిన వనంతో పాటు ఆ మహాత్ముని కూడా దహించి వేస్తుంది. దానితో అయత్నంగానే ఈ పాంచ భౌతిక శరీరాన్ని పరిత్యజించి ఋషభుడు బ్రహ్మభూయాన్ని పొందుతాడు. ఇదీ ఋషభుడి యోగచర్చ.

పోతే ఈ యోగమార్గంలో మనం చెప్పుకోవలసి కడపటి వ్యక్తి భరతుడు. ఆయన ఈ ఋషభుడి కుమారుడే. చూడబోతే వంశపారంపర్యంగా సంక్రమిస్తూ వచ్చిందీ యోగచర్య వీరందరికీ. భరతుడిలో అది పరిపూర్ణత నందుకొన్నది ఎందుకంటే కర్మయోగంతో ప్రారంభమై ఈయనజీవితం నడుమ సమాధి భక్తి యోగాల శిక్షణ సంపాదించి తత్పరిపాక ఫలంగా బ్రహ్మజ్ఞాన ముదయించి తద్వారా చివరకు మోక్ష సామ్రాజ్యాన్నే సాధిస్తుంది. అందుకే పరిపూర్ణమైన జీవితమిది. శాస్త్ర విహితమైన కర్మలు తానాచరిస్తూ తన పలుకుబడిలో ఉండే ప్రజలందరూ ఆచరించేలాగా చూస్తూ ధార్మికంగా పాలన సాగించాడు. **"ఈ జేచ భగవంతం"** భగవంతుడైన నారాయణుణ్ణి ఉద్దేశించి దర్శపూర్ణమాసాది యజ్ఞయాగాల సంఖ్యాకంగా అనుష్ఠించాడు. సమస్త కర్మ ఫలమూ వాసుదేవార్పణం చేసి మృదితకషాయుడై ఆయాదేవతా శక్తులను తన శరీరావయవాలలోనే భావించి ధ్యానం చేస్తూ వచ్చాడు. ఇలా విశుద్ధ సత్త్వుడయి హృదయ పుండరీక మధ్యంలో శ్రీవత్సకౌస్తుభ వనమాలాది భూషితమైన వాసుదేవ మూర్తిని ప్రతిష్ఠించుకొని వర్తించేవాడు.

ఈ ప్రకారంగా వర్షాయుత సహస్రంబుగా రాజ్యపాలన చేసి అనంతరం హరి భక్తి బాగా పాకానబడి రాజ్యగృహ బంధుమిత్ర పరివారాదులకు స్వస్తి చెప్పి పులహాశ్రమానికి వెళ్లిపోయి అక్కడ దినదినమూ భగవదారాధన గావిస్తూ తత్పరి చర్యాభక్తి భరంబున శిథిలీకృత హృదయగ్రంథి గలిగి త్రిషవణ స్నానాలు గావించి జటాధారియై పవిత్ర కృష్ణాజినం మీద కూర్చుండి ఆదిత్య మండలాంతర్గతుండయి హిరణ్య శ్మశ్రు కేశధారి అయిన నారాయణమూర్తిని సదాభావన చేస్తూ వర్తించేవాడు. ఒకనాడా సమీపంలో ఉండే నదిలో స్నానం చేసి నదీ జలమధ్యంలో నిలుచొని ఒక ముహూర్త కాలం ప్రణవ జపం చేస్తుండగా ఒక దారుణమైన దృశ్యం కంటబడుతుంది. ఒక ఆడుజింక గర్భవతి దాహం వేసి ఆ నదిలో దిగుతుండగా కొంత దూరాన సింహగర్జన వినిపిస్తుంది. దానికి బెదరిపోయి అది మింటికి లంఘించటంలో గర్భ నిర్భేదమయి అది మరణించటం గర్భస్థ శిశువు నీళ్లలో పడిపోవటం ఒక్కమారే జరిగిపోయింది. అది చూచి కరుణాళుడైన భరతుని మనసు కరగి ఆ హరిణశాబకాన్ని తెచ్చిదానికి పాలన పోషణాదులు చేయసాగాడు. క్షణ కాలమది కనపడకపోతే ఒక యుగంగా భావించేవాడు. ఒకప్పుడు కుటుంబ రాజ్యాదులు తన మార్గాని కడ్డమని

భావించి వాటినన్నిటినీ పరిత్యజించి వచ్చిన విరక్తుడిప్పుడీ హరిణ మాయలో బడి రక్తుడయినాడు. ఎంతవారికి కూడా ప్రకృతి గుణ సంపర్క ప్రభావం తప్పదనేందుకిదే నిదర్శనం.

చూస్తూ చూస్తుండగానే కాలం సమీపించింది భరతుడికి. అప్పుడు కూడా చిత్రమేమంటే ఆ హరిణ పోతాన్నే మనసులో స్మరిస్తూ ప్రాణాలు విడుస్తాడు. బహుకాలాభ్యస్తమైన హరి స్మరణ ఏమయిందో దానికి మారుగా హరిణ స్మరణే మిగిలింది చివరకు. యథా మతిస్తథా గతిః అన్నారు. దానికి తగినట్టు భరతుడు మరుజన్మలో హరిణంగా జన్మిస్తాడు. భగవానుడే చెప్పాడు గదా. "యం యం వాపి స్మరన్ భావం – త్యజత్యంతే కళేబరం, తం తమేవైతి కౌంతేయ సదా తద్భావ భావితః" తద్భావ భావమనమని ఒకటుంది మానవులకు. ఒకటి తీవ్రంగా భావిస్తూ పోతే దానితో తాదాత్మ్యం చెందటం. అంటే అదే అయిపోతాడని భావం. ఇలాంటి తాదాత్మ్య బుద్ధి దేనితో ఉంటే అదే. అది జీవితాంతమూ బయటపడదు. ఇక జీవిత మాఖరయ్యే క్షణంలో ఏది బలంగా మనసులో నిలుస్తుందో ఆ తరువాత జన్మలో ఆ రూపమే సంప్రాప్తమవుతుందట అయితే ఇక్కడ ఒకప్రశ్న. అభ్యాస బలంతో గదా ఏదైనా వస్తుందన్నారు. అభ్యాసం మొదటి నుంచీ భరతుడికి హరిస్మరణమే గదా. ఎప్పుడో మధ్యలో సంక్రమించింది గదా ఈ హరిణ వృత్తాంతం. మరి చిరాభ్యస్తమైన విష్ణు స్మరణ రాకుండా హరిణ భావన ఎలా వచ్చిందాయనకు. వాస్తవమే. చిరాభ్యస్తమైనది విష్ణు స్మరణమే సందేహం లేదు. అయినా అంత్యక్షణంలో అది నిలవాలి గదా మనసులో. దానికి బదులుగా హరిణమూర్తే నిలిచింది. అంత్య క్షణంలో నిలిచిందేదో దాన్ని బట్టి నిర్ధారణ అవుతుంది భావి జన్మ. అంతేకాని చిరాభ్యస్తమూ, అనభ్యస్తమూ అని కాదు. చిరాభ్యాసమైనా దానికి ఫలం లేకపోవచ్చు. అచిరాభ్యస్తమైన దీనికి దానికన్నా బలం ఉండవచ్చు. అయితే అది ఇక బూడిదలో బోసిన పన్నీరేనా కాదు. ఎక్కడికీ పోదది. సమయం వచ్చేదాకా వేచి ఉంటుంది. దేశ కాల నిమిత్తాదు లొనగూడిన నాటికది కూడా మనం చెప్పకుండానే ఫలితమిస్తుంది. ఇది తరువాత ఇంద్ర్యుమ్నుడి వృత్తాంతంలో సవిస్తరంగా మనవి చేస్తాను.

కాగా ప్రస్తుత మీ భరతుడెంత భాగవతుడైనా అవసానంలో దాని సంస్కారం పైకి రాలేదు. దాని బదులు తాత్కాలికమే అయినా వెంటనే పైకి వచ్చిన భావం ఆ

జింకపిల్ల మూర్తి. కనుకనే తదనుగుణమైన హరిణ జన్మ దాపురించింది. అయితే ఒక ధర్మసూక్ష్మముంది ఇందులో. ఎంత జన్మవచ్చినా అది కేవలమొక బాహ్యమైన కవచమే సాధకుడికి. లోపల బహు జన్మార్జితమైన సంస్కారమెక్కడికీ పోదు. **"తత్రతంబుద్ధి సంయోగం లభతే పౌర్వదైహిక"** మని భగవానుడు సెలవిచ్చినట్టు వెనకటి సాధనా సంస్కారమూ అప్పుడు కూడా అతణ్ణి అంటి పెట్టుకొనే ఉంటుంది. అలా కాకపోతే రెడ్డి వచ్చే మొదలెత్తుకో మన్నట్టు ఎప్పటికీ తరించే మార్గమే లేదీ జనులకు. భరతుడికి కూడా భగవదారాధన సామర్థ్యమున్నవాడు కాబట్టి తజ్జన్యమైన సంస్కార బలంతో తన పూర్వ వృత్తాంతం జ్ఞప్తికి వచ్చి **"రాజ ఋషీంద్రుడటంచు బల్కగా తేజము నొంది - యాహరిణ దేహము నందలి ప్రీతి జేసినాయోజ సెడంగనే జెడితి యోగి జనంబుల లోనబేలనై"** అని విలపిస్తాడు. యోగ విఘ్నంబు ప్రాప్తించి నేను మోక్షదూరుండనైతి నని నిర్వేదం చెందుతాడు. వెంటనే పులహాశ్రమానికి బయలుదేరిపోయి తనజాతి మృగాలతో చేరక ప్రారబ్ధమెప్పుడు తీరుతుందా అని కాలాన్ని ప్రతీక్షిస్తూ ఆత్మద్వితీయుడై పతిత శుష్క పర్ణాదులతో కడుపు నింపుకొంటూ తీర్థోదకంలో మునిగి మృగదేహాన్ని విడుస్తాడు.

అనంతరం మూడవ జన్మలో ఆ మహానుభావుడొక మహానుభావుడైన బ్రాహ్మణుడికి జన్మిస్తాడు. ఆ బ్రాహ్మణుడు శమదమ తపః స్వాధ్యాయ సంతోష తితిక్షాది సర్వలక్షణ లక్షితుడు. అలాంటి వాడికి జన్మించటం కూడా పురాకృత సుకృత ఫలమే. **"శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోభి జాయతే అధవా యోగినా మేవ కులేభవతి ధీమ తామ్"** అని కూడా సెలవిచ్చాడు. అలాంటి యోగుల ఇండ్లలో జన్మించడం పైగా దుర్లభతరమని కూడా చాటుతున్నది శాస్త్రం. భరతుడంత మహాత్ముడు గనుకనే తన కనురూపమైన వ్యక్తిని వెతుక్కొంటూ వచ్చి అక్కడే జన్మించాడు. అక్కడ కూడా జన సాంగత్యానికి దూరంగా ఉంటూ నిరంతర భగవచ్చింతన ఏమరక లోకానికి తానొక అంధుడుగా బధిరుడుగా ఉన్మత్తుడుగా కనిపిస్తుంటాడు. **"జడవ ల్లోక మాచరే"**త్తని గదా సిద్ధాంతం. దాన్ని అక్షరాలా పాటిస్తూ వచ్చాడు. జడ భరతుడని లోకంలో పేరు పొందాడు. తండ్రి అతని వాలకం కనిపెట్టి యథాకాలం ఉపనయనాది సంస్కారాలు నిర్వర్తించి చదువు సంధ్యలు యథావిధిగా నేర్పుతాడు. ఇతడా బ్రాహ్మణునికి ద్వితీయ భార్యయందు

జన్మించిన సంతానం. ఆవిడ కొక్క పురుష శిశువూ, స్త్రీ శిశువూ జన్మిస్తే అందులో పురుష శిశువీ భరతుడు. పోతే ప్రథమ భార్యయందింకొక తొమ్మిది మంది కుమారులున్నారా బ్రాహ్మణుడికి జనించిన వారు. వారందరికీ ఈ సవతి కొడుకంటే చాలా చులకన. దానికి తగినట్టితడు లోక జ్ఞానమే మాత్రమూ లేని జడుడిలాగా ప్రవర్తిస్తూ ఉన్నవాడయె. కనుక ఇంకా అవహేళన వారి కితడంటే. ఇదంతా మొదటి నుంచీ కనిపెట్టి చూస్తూనే ఉన్నాడు తండ్రి. అయినా చేసేదేమీ లేక దిగులుతోనే కొంత కాలానికి కాలం సమీపించగా దివంగతుడయినాడు. భార్య ఆయనతో పాటే సహగమనం చేస్తుంది.

తరువాత సవతి కొడుకులకు పెత్తనం వచ్చి వారీ భరతుడమాయికుడు తమ మాట కెదురు చెప్పలేడని-అతణ్ణి కేవలం పరిచారకులకంటే నీచంగా ఇంటి పనులు చేయటానికే నియోగిస్తారు. అతడు కూడా ఆ పాటి కారూఢుడైన జ్ఞాని కాబట్టి **'ఉన్మత్త జడ బధిర'** అని లోకులు పలుగాకులయి కేకలు వేస్తున్నా ఏ మాత్రమూ పట్టించుకోక వారి మాటలకు తగినట్లు మరుమాటలాడుతూ పరేచ్ఛా యదృచ్ఛలతో జీవితం సాగిస్తూ విష్టి వేతన యాచనలతో తనకు నియోగించిన కార్యాలలో ప్రవర్తించేవాడు. **"అతుల మృష్టాన్నమైన శుష్కాన్నమైన నెద్ది వెట్టిన జిహ్వకు హితవుగానే తలచి భక్షించుగా కొండుదలచి మిగుల బ్రీతి సేయడు రుచులందు బెంపుతోడ"** ద్వంద్వాతీతుడు గనుక అన్నపానాదులైన సమస్త వ్యవహారాలలోనూ ఇది హేయమిది ఉపాదేయమనే భేదదృష్టి పెట్టుకొనేవాడు కాడు.

సవతి కొడుకు లిదంతా చూచి వీడు మహామూఢుడని భావించి చివరకతనికి క్షేత్రపాలన వృత్తి నప్పగిస్తారు. అప్పగిస్తే అతడు కాదని పెడమొగం పెట్టాడా. పెట్టటాని కతడు లోకసామాన్యుడైన మానవుడయితే గదా. నిత్య నివృత్త నిమిత్త స్వసిద్ధ విశుద్ధాను భవానంద స్వాత్మాలంబాధిగముడు. ద్వంద్వ నిమితంగా కలిగే సుఖదుఃఖాదులందు దేహాభిమాన చింతలేనివాడు. శీతోష్ణవాత వర్షాదులలో కూడ ఒక గోవృషంలాగా అనావృత శరీరుడు. స్థండిల శాయియై రజఃపటలం చేత కప్పబడి దివ్యమాణిక్యంలాగా అభివ్యక్తం కాని బ్రహ్మతేజస్సు గలవాడు. మలినాంబర పరీత కటి తటుడూ, అతి మషీలిప్త యజ్ఞోపవీతుడు. నూక తవుడు పిండి పొట్టు మాడు, ద్రబ్బెడ అని తేడా చూడనివాడు. ఇదీ అతని దృష్టి, అతని వేషం, అతని వ్యవహారం. అట్టివాడు దేనికి

గాని ఎందుకెదురు చెబుతాడు. ఎందుకెడముగం పెడతాడు. సర్వమూ భగవత్స్వరూపంగా దర్శించే యోగికేదైనా ఒక్కటే. **"సుఖదుఃఖే సమేకృత్వా లాభాలాభౌజయాజయౌ" "యదృచ్ఛా లాభ సంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః అన్న శాస్త్ర వాక్యాని"** కుదాహరణ ప్రాయంగానే నడుస్తుందలాంటి వారి జీవితం.

అలాగే జీవితం సాగిస్తూ పొలానికి కావలి ఉంటున్నాడా మహాత్ముడు. ఇలా ఉంటుండగా ఒకనాడు వృషలపతి ఒకడు సంతానం లేక భద్రకాళి కొక పురుష పశువును బలి ఇవ్వాలని భటులచేత పట్టించుకొనిపోగా దైవికంగా ఆ పశువు దేవళం నుంచి తప్పించుకొని పాఱిపోతుంది. దాన్ని తరుముకొంటూ పోయి భటులా రాత్రి కటికి చీకటిలో అది ఎక్కడా కనిపించక దూరాన పొలంలో వీరాసనం వేసుకొని నిశ్చల సమాధి స్థితిలో కూచొని ఉన్న జడ భరతుణ్ణి చూచి బాగా దృఢంగా కనిపిస్తున్నాడు వీడయితే సరిపోతాడని చెప్పి మోసుకొని పోయారు. అక్కడ అభ్యంజనాదులు చేయించి నూతన వస్త్రాలు ధరింపజేసి అలంకరించి మృష్టాన్నాలు పెట్టి భద్రకాళి కెదురుగా నిలుపుతారు. తరువాత ఆ శూద్ర సామంతు డభిమంత్రించిన ఖడ్గాన్ని పయికెత్తి కాళికా ప్రీత్యర్థ మాయన శిరస్సు ఛేదించటాని కుద్యమించాడో లేదో. ఇంతలోనే **"బ్రహ్మ తేజసా అతి దుర్విషహేణ దందహ్య మానేన వపుషా సహసోచ్చచాల సైవ దేవీ భద్రకాళీ"** అతి దుస్సహమైన అతని బ్రహ్మ తేజస్సు తననే దహించి వేస్తున్నట్టు కాగా కదలిపోయిందా భద్రకాళి. వెంటనే అమర్ష రోషావేశ రభస విలసిత భ్రూకుటీ విటపకుటిల దంష్ట్రారు ణేక్షణాటో పాతిభయానక వదనంతో మహాట్టహాసం చేస్తూ ఆ ఖడ్గం వాడి చేతిలో నుంచి లాగుకొని వాడినీ వాడి పరివారాన్నీ ఒక్క పెట్టున ఛిన్నాభిన్నం చేసి అంతర్ధానమవుతుంది. మరి మన భరతుడి పరిస్థితి ఎలా ఉందప్పుడు.**"అచ్చట విప్రసూనుడు భయం బొకయించుక లేక - చంపగా వచ్చిన వారి యందు -కరవాలమునందును -కాళియందు తా-నచ్యుత"** భావముంచి చూస్తున్నాడట. అలాంటి సమదృష్టి ఉన్న వాడికిక మృత్యు భయమేముంది. మృత్యువు కూడ వాడిపాలిటి కమృత్యువే.

మరలా వచ్చి యథా ప్రకారంగా పొలం మీద కూచున్నాడు. మరికొన్ని రోజుల కింకొక విశేషం జరిగింది. రహూగణడనే రాజుఏవో కొన్ని ఆధ్యాత్మ విద్యా రహస్యాలడిగి తెలుసుకొందామని పల్లకి ఎక్కి కపిలుడనే మహర్షి వద్దకు బయలుదేరి

ఆ దారి వెంట బోతుంటాడు. పల్లకీ బోయీలు మోయటానికి కొంత బద్ధకించి దూరాన నిశ్చలంగా కూచుని ఉన్న ఈ భరతుణ్ణి చూచి బలంగా ఉన్నాడీతని చేత కొంత సేపు మోయిద్దామని దగ్గరికి పిలిచి అతనిమీద పల్లకి బొంగు మోపుతారు. అతడు నడుస్తుంటే అలవాటు లేదు గనుక అక్కడక్కడ అడుగులు తప్పబడుతుంటాయి. దానితో కొంచెమారాజు కతల కుతల మనిపించి ఎందుకిలా జరుగుతున్నదని బెస్తలనడుగుతాడు. అయ్యా మాదిగాదీ తప్పు – ఇదుగో ఈ కొత్తవాడి మూలంగా జరుగుతోందని చెబుతారు. అది విని ఆ రాజు హేళనగా ఏమయ్యా **"అలసితి వెంతయున్ ముసలి – వాకట డస్సితి – వవెన్ను మిక్కిలిం బలుచన యున్న – దీశిబిక భారము – దూరము మోసితే గతిన్ నిలిచెద వని"** తూలనాడతాడు. దానికేమాత్రమూ చలించక ఆ మానవుడలాగే మోస్తూ పోతాడు. మరీ కుదుపు ఎక్కువయ్యే సరి కారాజు కోపం పట్టజాలక **"ఓరీ జీవన్మృతుడా – నా యాజ్ఞ దప్పించి నడుస్తావా – ఈ వక్రమార్గం విడిపించి నిన్ను సన్మార్గన నడిపిస్తాను చూడ"**మని ఉపలంభిస్తాడు. దాని కేమాత్రమే చిత్త వికృతి లేని వాడయి భరతుడు చాలా నింపాదిగా నరేంద్రా నీవు చెప్పినది సత్యంబు – భారంబీ శరీరంబునకే గాని నాకుం గలుగనేరదు. ఐనను స్థౌల్య కార్శ్యంబులు – వ్యాధులు – నాధులు క్షుత్తృష్ణలు – జరామరణంబులు – అహంకారంబులు దేహంబు తోడన జనియించుం గాని నాకుం గలుగనేరవు. జీవన్మృతుండనేన కాదది యందరి యందును గలిగి యుండు. స్వామి భృత్య సంబంధంబులు విధి కృతంబులగచు – వ్యవహారంబులం జేసి శరీరంబులకు గలుగుంగాని జీవునికి లేక యుండు నని అతని మాటలకు వాతపెట్టినట్టు సమాధానమిస్తాడు. దానికి మెఱుగు పెట్టినట్టు ఇంకా ఇలా చీవాట్లు పెడతాడా రాజును. నీవు నన్నాజ్ఞాపిస్తా నంటున్నావు. అది నీపూర్వ స్వభావానికి తగినట్టే ఉందామాట. ఉన్మత్త జడ స్వభావుడైన నా విషయంలోని శిక్ష ఏమి పని చేయగలదది నిరుపయోగమే సుమా.

ఇంత నిగూఢార్థంగా మాటాడిన ఈ మాటలు చెవిన బడే సరికా రాజితడెవడో మహాపురుషి డితనికి తీరని అపచారం చేశానని పశ్చాత్తాపంతో శిబిక దిగి పాదాల మీద వాలుతాడు. అయ్యా నా తప్పు మన్నించండి. మీరెవరో మహాపురుషులు. బహుశా నేను వెతుకుతూ పోయే ఆ కపిల మహర్షివే అయి ఉంటావు. సందేహం

లేదు. మీ మహత్త్వం దెలియక ఏవేవో ప్రేలాపనలు చేశాను. నా అపరాధం క్షమించి నాకు తత్త్వోపదేశం చేయమని ప్రార్థిస్తాడు.

ఆ తరువాత రహూగణుడికీ భరతుడికీ చాలా దీర్ఘమైన సంవాదం జరుగుతుంది. అందులో ఎన్నెన్ని ధర్మ సూక్ష్మాలు దొర్లుతాయో చెప్పలేము. అమూల్యమైన వన్నీ. విష్ణు పురాణంలో కూడా ఉంది ఈ వృత్తాంతం. అందులో కూడా ఎన్నో విశేషాలు కనిపిస్తాయి మనకు. అవన్నీ ఉదాహరిస్తు పోతే గ్రంథం విస్తరిస్తుందని భాగవత గ్రంథాన్నే అనుసరించి వ్రాస్తున్నాను. **"అకోవిదః కోవిద వాద వాదాన్ వదస్యథో నాతి విదాం వరిష్ఠః నసూర యోహి వ్యవహార మేవమ్ తత్త్వావ మర్శేన సహా మనంతి"** అని అర్జునుణ్ణి కృష్ణుడిలాగా ఆదిలోనే మందలిస్తాడు. నవేదవా దేషుహి తత్త్వ వాదః వాదాలలో లేదు తత్త్వజ్ఞానం. **"నతత్యుతత్త్వ గ్రహణాయ సాక్షాద్వర్షయ సీరపివాచ స్సమీసన్-స్వప్నే నిరుక్త్యా గృహమేధి సౌఖ్యమ్ - నయస్య హేయా నుమితం స్వయం స్యాత్"** స్వప్నంలో ఒక ఆకృతి కనిపించి అంతలోనే మాయమైనట్టుగా వేదాంత వాక్యాలు కూడా మనకు తత్త్వాన్ని దూరదూరంగానేచూపి అంతర్ధాన మవుతాయి. **"గుణాను రక్తం వ్యసనాయజంతోః క్షేమాయ నైర్గుణ్య మథోమనస్స్యాత్"** అన్ని వ్యసనాలకూ గుణసంగమే మూలం. క్షేమమే కావాలంటే మనసు సదా నిర్గుణమయి ఉండాలి. ఏతా మనసో విభూతీర్జీవస్య మాయా రచితస్య నిత్యాః ఇంద్రియ గుణాలూ, వాటి వృత్తులూ, ఇవన్నీ మనో విభూతులే. ఇవి జీవుడికి నిత్యంగా భాసిస్తాయి. అసలీ జీవుడే నిత్యుడు కాడు. భగవన్మాయా కల్పితుడీ జీవుడు. **"నారాయణో భగవాన్ వాసుదేవః స్వమా యయా త్యన్యవసీయ మానః యథానిలః స్థావర జంగమానా - మాత్మ స్వరూపేణ నివిష్ట ఈశేత్"** భగవానుడైన వాసుదేవుడే ప్రాణవాయువులాగా ఈ శరీరంలో జీవరూపంగా ప్రవేశించి వ్యవహరిస్తున్నాడు. **"నయావ దేతాం తనుభృన్నరేంద్ర - విధూయ మాయామ్ వయునోదయేన - విముక్త సంగోజిత షట్సపత్నో వేదాత్మ తత్త్వం భ్రమతీహ తావత్"** ఎంతవరకీ దేహధారి అయిన జీవుడాత్మ జ్ఞాన సూర్యోదయంతో ఈ మాయాంధకారాన్ని పారదోలడో అంతవరకూ ఈ ప్రకృతి గుణసంగమూ, అరిషడ్వర్గ ప్రభావమూ తొలగదు. కాబట్టి తత్త్వజ్ఞానానికి నోచుకోడు. నోచుకోలేక తలతిక్కపట్టిన వాడిలాగా ఈ సంసార మహారణ్యంలో పరిభ్రమిస్తుంటాడు.

ఆహా ఎంత గొప్ప మాట సెలవిచ్చారు. ఇంకా బోధించమని రహూగణుడు ప్రార్థించడితే భరతుడాయనను చూచి రాజా ! మన పాదాలీ భూమిమీద ఉన్నాయి. పాదాల మీద జంఘలున్నాయి. జంఘల మీద జానువులు, జానువులపైన ఊరువులున్నాయి. ఊరువుల మీద నడుమూ, నడుము మీద ఉరస్సూ - దాని మీద కంఠం, దానిమీద మూపులూ ఉంటే ఆ మూపుల మీద ఉందొక దారుమయమైన శిబిక. ఆ శిబికలో ఉన్న ఒక శరీరాన్ని చూచి రాజనే అభిమానంతో నీవు బ్రతుకుతున్నావు. అంతేకాదు. **"శోచ్యా నిమాన్ స్వాసతికష్ట దీనాన్ విష్ట్యా నిగృహ్ణ న్నిరనుగ్రహోసి"** నీ పల్లకి మోసే ఈ బోయీలు నీకంటె తక్కువని భావించి వారికి కూలినిచ్చి సాకుతున్నాను గదా అని అహంభావంతో మెలగుతున్నావు. ఈ ఎక్కువ తక్కువలన్నీ అవిద్యా కల్పితమని తెలియదు నీకు **"జ్ఞానమ్ విశుద్ధం పరమార్థ మేకం అనంతరం త్వబహిర్బ్రహ్మ సత్యమ్"** సమస్త భూతజాలం లోపలా వెలపలా నిండి నిబిడమై యున్న దొకే ఒక బ్రహ్మమదే పరమసత్యం. తక్కినదంతా దాని ఆభాసేనని గుర్తించు. అదే సమ్యగ్దర్శనం. ఇంతకన్నా నేను నీకు బోధించవలసింది నీవు సాధించ వలసింది మరొకటి ఏదీ లేదని మౌనం వహిస్తాడు. రహూగణుడా ఉపదేశ ప్రభావం చేత పవిత్రీ కృతాంతఃకరుణడయి ఆయన చరణాలకు వందనం చేసి వెళ్లిపోతాడు. భరతుడు కూడ పరిపూర్ణ జ్ఞానార్ణవుడు కాబట్టి స్థైర విహార శీలుడయి కాలమాసన్నం కాగానే భౌతికమైన ఈ కాయాన్ని విడిచి అభౌతికమైన జ్ఞానకాయం ధరిస్తాడు.

ఇదీ జడ భరతుడి చరిత్ర. కర్మయోగంతో ప్రారంభమైన జీవితం తుదకు సమాధి భక్తియోగాల ద్వారా పరిపూర్ణ జ్ఞానాన్ని సాధించి మోక్ష సామ్రాజ్యానికే పట్టం కట్టుకొంటుంది. ఇలాటి యాదృచ్ఛిక నిరాడంబర సుందరమైన అవధూత చర్య ఎలాంటిదో ముక్తసరిగా వర్ణించిన సన్నివేశం మరొకటుంది భాగవతంలో. అది దీని తరువాతనే వస్తుంది. ప్రహ్లాదా జగర సంవాదమని దాని పేరు. అజగరమంటే కొండ చిలువ అని అర్థం. అయితే ఇక్కడ వచ్చేది కొండచిలువ గాదు. కొండచిలువ లాంటి వ్యవహారంగల మానవుడు. అజగరం ఒకచోట కదలక మెదలక పడి ఉంటుంది. ఏకాంతంగా బ్రతుకుతుంటుంది. ఎక్కడకోపోయి ఏదో సంపాదించాలనే కోరిక లేదు దానికి. తుదకు ఆహారానికి కూడా తాపత్రయ పడదది. దానినోటి దగ్గరి కేది వస్తే అదే దాని కాహారం.

ఇలాంటి వృత్తితో బ్రతికే మహాయోగి కూడా ఒక అజగరుడే. అలాంటి అజగర యోగిని దర్శించా డొకనాడు ప్రహ్లాదుడు. చూస్తే చాలా బలవంతుడిగా కనిపించాడు. దగ్గరికి పోయి నమస్కరించి అయ్యా **"బిభర్షికాయం పీవాసం - సోద్యమో భోగవాన్ యథా"** చాలా దృఢమైన శరీరం ధరించి ఉన్నాడు **"భోగినాంఖలు దేహోయంపీవా భవతి నాన్యథా"** అనుభవపరులైన లోకులకు తప్ప ఇలాంటి పీవరమైన శరీరముండటానికి లేదు. **"నతే శయానస్య నిరుద్యమస్య బ్రహ్మన్ని హార్థోయత ఏవ భోగాః"** నీవు నిరుద్యముడవూ, శయానుడవూ నీకు సుఖానుభవమెక్కడిది. అది లేకుంటే ఇంత దృఢమైన శరీర పాటవమెక్కడి నుండి వచ్చిందని ప్రశ్నిస్తాడు. ఇది ఒక నిమిత్త మాత్రమే ఈ ప్రశ్న. నిజానికి ప్రహ్లాదుడూ లేడు అజగరుడూ లేడు. అజగర చర్య ఎలాంటిదో ప్రహ్లాదుడికి తెలియనిదా. అయినా ప్రశ్నించాడంటే ఈ కథ ద్వారా మన మాపూర్ణయోగి జీవిత మెలాంటిదో లోకంలో జీవన్ముక్తుడైన వాడెలా జీవిస్తాడో తెలుసుకోటానికే. దానికొక ఉదాహరణ ప్రాయ మీ ఆఖ్యాయిక. అంతే కాదు. కేవల నివృత్తి రూపమైన సమాధి యోగమిది. కర్మయోగం లాంటిది గాదు సమాధి యోగం. అది ప్రవృత్తి రూపమైతే ఇది నివృత్తి రూపమని మొదటనే పేర్కొన్నాము. అయితే ఈ నివృత్తి భీష్మాదులలో ఋషభాదులలో అంత బాగా దాఖలా కాదు మనకు. నూటికి నూరుపాళ్లూ దాఖలా అయ్యేది అది మనకీ అజగర వృత్తాంతంలోనే. ఏ మాత్రమూ ప్రవృత్తి వాసన లేని నిత్యనివృత్తి స్వభావుడ అజగరుడు. సమాధి యోగంలోని ఈ అంశాన్ని బాగా నిరూపణ చేసి చూపటమే ఈ అజగర వృత్తాంతానికి తాత్పర్యం.

ప్రహ్లాదుడడిగిన ప్రశ్నకిలా సమాధానమిస్తాడా అజగరుడు. **"సరఘుల్ గూర్చిన తేనె మానవులకున్ సంప్రాప్తమైనట్లు - లోభరతుల్ కూర్చిన విత్తముల్ పరుల కుం బ్రాపించు - ప్రాప్తాశియై తిరుగంబోని మహోరగంబు బ్రదుకున్ దీర్ఘాంగమై యుండియున్ - చిరకాలంబుగ వాని వర్తనమునే జింతించి యేకాంతినై"** అజగరమును జుంటీగయు నిజ గురువులు గాగ దలచి నిశ్చింతుడనై - **"విజనస్థలి కర్మంబుల గజిబిజి లేకున్న వాడ గౌరవ వృత్తిన్"** అయ్యా నీకు తెలియని దేమున్నది. నీవు పరమార్థ వేదివైన ప్రహ్లాదుడవు గదా లోకహితం కోరి నన్నిలా ప్రశ్నిస్తున్నావు నీవు. పీవరత్వం శరీరానికి మనం సంపాదించి పెట్టనక్కరలేదు. భోగాలు మనం

కొని తెచ్చుకోనక్కరలేదు. అలా తెచ్చి పెట్టుకొన్నా ప్రాప్తం లేకపోతే అది బలాదూరయి పోతుంది. ప్రాప్తముంటే మన ప్రమేయం లేకుండా దానిపాటికదే మనకు ప్రాప్తిస్తుంది. ఇది నేను జుంటీగ వలనా అజగరం వలనా గ్రహించిన సత్యం. తేనెటీగ ఎంతో కష్టపడి మధువు చేకూరుస్తుంది. ఏమి ప్రయోజనం. పరుల పాలు చేసి ఊరక కూచుంటుంది. పోతే కొండ చిలువ జీవనార్థ మేమాత్రమూ పాటు పడదు. నోటి దగ్గరికి నడచి వస్తాయి జంతువులు. తిని హాయిగా పడి ఉంటుంది. ఇవి రెండే జీవితంలో నాకు గురువులు. వీటి అడుగుజాడల్లో నడుస్తుంటాను నేను. దానితో నిశ్చింతుడనైన నాకెలాటి ఒడుదుడుకులూ కానరావు. ఇన్ని మాటలెందుకు. ఒక్కమాట చెబుతాను వినమని ఇలా అంటాడు. **"లేదని యెవ్వరి నడుగను రాదని చింతింపపరులు రప్పించినచో కాదని యావల ద్రోయను - ఖేదము మోదమును లేక క్రీడింతు మదిన్"** ఒకటి లేదని రాదని బాధలేదు నాకు. అయితే ఒక సంగతి. ఎవడైనా ఇస్తే కాదని నిరాకరించను.

ఇదుగో ఇక్కడ ఉంది రహస్యమంతా. ఇది చూడబోతే యోగం కాదు. జ్ఞానం. పరిపూర్ణమైన అద్వైత జ్ఞానదృష్టికీ ప్రపంచమంతా బ్రహ్మమయమే. ఆత్మస్వరూపమే. అలాంటప్పుడిక భోగమేమిటి. త్యాగమేమిటి, రాగమేమిటి, ద్వేషమేమిటీ, హేయమేమిటి, ఉపాదేయమేమిటి. అంతా ఏకమే సమానమే. దేనినీ అవుననరాదు కాదనరాదు. నద్వేష్టి సంప్రవృత్తాని, ననివృత్తాని కాంక్షతి, అందుకే చెబుతున్నాడింకా అజగరుడు. **"అజిన వల్కల దుకూలాంబరంబులు కట్టియైన కట్టకయైన నలరుచుండు - భర్మ శయ్యలనైన బర్ణ శిలాతృణ భస్మంబు లందైన పండుచుండు. "నిందింపబరుల నెన్నడు - వందింప ననేకపీడ వచ్చిన - మది నాక్రందింప - విభవముల కానందింప - ప్రకామ వర్తనంబున నధిపా."** ఇలా ఏ కోరికా లేక ఒకప్పుడు దిగంబరుడయి పిశాచంలాగా తిరుగుతాడట. చాలా రోజు లొకప్పుడ డజగరం లాగా కళ్లు మూసుకొని పడి ఉంటాడట. అయితే ఎప్పుడెలా ఉంటున్నా ఏకాంత భావంతో విష్ణువు నందేమనసు లగ్నం చేసి వికల్పాల నన్నిటినీ భేద గ్రాహి చిత్తవృత్తులలో, చిత్తాన్ని అర్థ రూప విభ్రమం గల మనస్సులో, మనసు నహంకారంలో, అహంకారాన్ని మాయాశక్తిలో ఆ మాయా శక్తిని ఆత్మానుభవంలో లయం చేసి బహిరంతరాల్లో నిరంతరమూ సత్యాన్నే దర్శిస్తున్నానంటాడు. చూచారా ఈ వాక్యాలలో సమాధి

యోగమూ, భక్తియోగమూ రెండూ కూడా చివరకు జ్ఞానంతో పెనవేసుకొని చివరకు దానిలోనే చరితార్థమవుతున్నాయి. కాక తప్పేదేముంది. సర్వమ్ కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే అని గదా భగవద్వాణి. "జ్ఞానాగ్ని స్సర్వ కర్మాణి భస్మసా త్కురుతే ర్జున" అది ప్రజ్వలిస్తే చివరకన్ని కర్మవాసనలూ జీవుడి కదే కాల్చి పారేస్తుంది. "జ్ఞానేనాత్మని విందంతి కేచి దాత్మాన మాత్మనా" ఈ జ్ఞానమే చివరకా సర్వాత్మ భావాన్ని మనకు ప్రసాదిస్తుంది. కాబట్టి కర్మయోగంలాగా సమాధి యోగం కూడా స్వయం సంపూర్ణం కాదు. అది ఒక సాధనమే ఆ జ్ఞానానికి అందులో కర్మ యోగం బహిరంగమైతే సమాధి అంతరంగం. ఇలాటి అంతరంగ సాధన మార్గంలో పరిశుద్ధులయి తద్వారా చివరకు జ్ఞానార్జన చేసి సిద్ధులయిన యోగులచరిత్రే మనమింత వరకూ నిరూపించాము. వీరి జీవితాలన్నీ ఆ యోగ స్వరూపాన్ని మనబోటి ముముక్షువులు గ్రహించటాని కుదాహరణాలు మాత్రమే నని భావించాలి మనం.



Brahmasri Yallamraju Srinivasa Rao www.sahitavedanta.in

10. సగుణ భక్తులు - కుంతీ ప్రభృతులు

మనమింత వరకూ కర్మ సమాధియోగాలూ – తన్మార్గానుసారులైన ఆయా భాగవతుల జీవితాలూ, సవిస్తరంగా తడవి చూచాము. నేను మొదట మనవి చేసినట్టే రెండు మార్గాలలోనూ కర్మవాసనా సంపర్క మంతో ఇంతో ఉండనే ఉంటుంది. అందులోనూ కర్మయోగుల జీవితంలో అది బాహ్యంగా కూడా కనిపిస్తుంది. భగవద్భక్తి అనేది వారికి లేదని కాదు. ఎంత ఉన్నా దానితో పాటు కర్మానుష్ఠానం కూడా ఏమరబోరు వారు. అది మన కంబరీషాదుల చరిత్రలో తార్కాణమవుతూనే వచ్చింది. పోతే సమాధి యోగులైన భరతాదులు కూడా భగవద్భక్తులే. వారికి కూడా భక్తి ఎంత గాఢమో అంత గాఢంగానే యోగాభ్యాస వాసనలు పట్టుకొని ఉన్నాయి. ధారణా ధ్యాన సమాధులూ, తన్నిమిత్తంగా సిద్ధించిన అణిమాద్యైశ్వర్యాలూ, వారి జీవితంలో కొట్టవచ్చినట్టు కనిపిస్తాయి. ఇదంతా మనోవృత్తి నిగ్రహరూపమైన యోగ ప్రభావమే. అదీ ఒక కర్మే. మొదటిది బాహ్యమైతే ఇది అంతరం. అది ప్రవృత్తి రూపమైతే ఇది నివృత్తి రూపమని గదా వర్ణించాము. ఏ రూపమైనా కావచ్చు. రెండూ కర్మ పరిధిని దాటి అవతల అడుగు పెట్టినవి కావు. అంతోఇంతో దాని స్పర్శ వాటికుండనే ఉంది. **"కర్మతంత్రుడగుచు కమలాక్షు గొల్చును"** అని దక్షిణ నాయకులలాగా రెంటితోనూ కాపురం సాగిస్తూ వచ్చారా భాగవతులందరూ.

కాగా ప్రస్తుతం మనమీ కర్మానుష్ఠాన నిర్బంధమేమాత్రమూ లేని కేవల భగవద్భక్తులను గూర్చి చెప్పుకోవలసి ఉంది. భక్తులనే వ్యవహారానికి లక్ష్యభూతులైన వారు వీరే. అసలు భక్తి మార్గమనేది కూడ వీరిదే. శాస్త్ర విహితమైన కర్మ అంటూ వీరికేదీ లేదు. ఉన్నా దానికే మాత్రము ప్రాధాన్యమీయరు వీరు. వీరు పాటించే కర్మ అల్లా తమ కిష్టమైన ఆ భగవత్స్వరూపాన్ని మనసా వచసా వపుషా నిత్యమూ భజించటమే. సేవించటమే. అదే స్వధర్మంగా భావించే మనస్తత్త్వం వీరిది. అందుకు దూరమైన మరొక ధర్మమేది గానీ వీరికి పనికి రాదు. నిత్య నైమిత్తికాదులు గాని ధారణా ధ్యానాదులు గాని వీరి కక్కరలేదు. అన్నింటికీ బదులు భగవద్భక్తి ఒక్కటి

దగ్గర ఉంటే చాలు. అదే వాటన్నిటికీ జవాబు చెప్పగల గొప్ప ఆయుధమని వీరికి ప్రగాఢమైన నమ్మకం. భగవానుడు చెప్పిన **"అనన్యా శ్చింతయం తోమా"**మ్మనే వారు వీరే.

అయితే ఒక్క మాట మనం గుర్తుంచుకోవలసి ఉంటుంది. వీరంతా ఎంత భక్తులైనా సగుణభక్తులే ననేమాట మనం మరచిపోరాదు. అంటే అర్థం. భగవంతుణ్ణి సగుణంగానే భావిస్తారు. దర్శిస్తారు వీరు. అంతేగాని నిర్గుణంగా దర్శించరు. నిజానికి నిర్గుణమైన రూపమే భగవత్తత్త్వం. అది సర్వ వ్యాపకం. అద్వితీయం. ఆత్మరూపం. దానినిక భక్తుడు తనకు వేరుగా భజించటమూ దర్శించటమంటూ ఉండదు. భజించే దర్శించే ఉన్నాడెప్పుడో. అయితే అనాది సిద్ధమైన అజ్ఞాన దోషం వల్ల మరుగుపడటం మూలాన మరలా జ్ఞానోదయమైతే చాలు. సాక్షాత్కారమయినట్టే. సాయుజ్య మబ్బినట్లే. అప్పుడది భక్తి గాదు. జ్ఞానం. భక్తి అనే మాట వాడవలసి వస్తే అనన్య భక్తి, పరాభక్తి అని పేర్కొనవలసి ఉంటుంది. ఇది నిర్గుణం. సగుణం కాదు. ఈ నిర్గుణ భక్తిని గూర్చి దీని తరువాతి ప్రకరణంలో ప్రస్తావిస్తాము. పోతే ప్రస్తుతం మనమీ ప్రకరణంలో వర్ణిస్తున్నది దానికి పూర్వరంగమైన సగుణభక్తి. మామూలుగా మనం లోకంలో పేర్కొనే భక్తి అనే మాట ఈ సగుణానికి చెందిన భక్తి. ఇలాంటి సగుణ భక్తులైన భాగవతులెవరో – వారి భాగవత జీవితమెలాంటిదో పరిశీలిద్దాము.

అన్నిటికంటే మొదట కుంతీదేవి వృత్తాంతం పరిశీలిస్తే మనసుకు కొంత శాంతి నిస్తుంది. ఒక ఉత్తమ వంశంలో పుట్టి జీవితంలో కష్టసుఖాలు రెండూ చవిచూచిన ఒక భారతీయ మహిళకు ప్రతీక ఈవిడ. అన్నీ ఉండి ఏదీ లేని జీవితం. పుట్టింది యాదవ వంశంలో. పెరిగింది కుంతి భోజుని ఇంట. కన్యగా ఉండే బిడ్డను కన్న దన్న దుష్కీర్తికి పాలయింది. యౌవనంలోనే భర్తను కోలుపోయింది. తరువాత కన్న కుమారులకు దూరమై వారి కపకారులైన వారి ఇంట్లోనే చాలా కాలం తలదాచుకోవలసి వచ్చింది. చివరకు తాను ప్రచ్ఛన్నంగా కన్న కుమారునికీ మిగతా కుమారులకూ పోరాటం జరుగుతూంటే వీరు ఆ వీరుణ్ణి హతమారిస్తే తీరని మనోవేదనతో కుమిలిపోయింది. ఇంత అలజడి పాలయిన జీవిత మావిడది. కనుకనే నేమో బాగా అనుభవం పండి చివరకు దాని పరిణామంగా అన్ని భావాలకూ స్వస్తి చెప్పి భక్తి భావమొక్కటే నిండిపోయింది.

కృష్ణ పరమాత్మ ఆమెకు మేనల్లుడే. వసుదేవుని తోడ బుట్టిందావిడ. అంచేత చిన్నప్పటి నుంచీ ఎక్కడ ఉన్నా పరమాత్మ ఆమెకు సన్నిహితుడే. అయితే ఆయన పరమాత్మ అనే భావమంత గాఢంగా లేకపోవచ్చు. అలాగని కేవలం మేనల్లుడే ననే సామాన్యభావమూ లేదు. ద్రౌపదీ వస్త్రాపహరణం దగ్గరి నుంచీ రణ సంరంభం ముగిసేదాకా తన కుమారుల నాయన ఎంత కంటికి రెప్పలా కాపాడిందీ ఆమెకు తెలుసు. అందరితోపాటు ఆయన విశ్వరూపాన్ని సభాముఖంగానే తిలకించిన ఎలానగ. అలాంటి దానికాయన భగవంతుడని తెలియక పోవటమేమిటి. చక్కగా తెలుసు. అయితే స్త్రీ స్వభావం మూలంగా కొంతా జన్మాంతర సంస్కారమంతగా లేని కారణంగా కొంతా, అంత బలంగా కుదరలేదా భక్తి భావం. కేవలమొక ఆపద్బాంధవుడైన మహాపురుషుడి లాగానే చూస్తూ వచ్చింది. **"చతుర్విధా భజంతేమా"** మ్మన్నట్టు అందరికీ ఒకే విధమైన అధికార సంపత్తి ఉండదు. కొందరార్తులైతే కొందరు జిజ్ఞాసువులు. కొంద రర్థార్థులైతే కొందరు జ్ఞానులు. కుంతిది ఆర్త భక్తి. అయితే జీవితంలో ఒడుదుడుకులన్నీ తిన్న తరువాత అదే జీవితాంతంలో జిజ్ఞాసగా జ్ఞానంగా పరిణమించిందావిడకు.

ముఖ్యంగా పాండవులైదుగురు తప్ప వారి బలగాన్నంతటినీ రాత్రికి రాత్రి అంతమొందించి వారి కొడుకులను కూడా వధించి కడకు ఉత్తర గర్భానికి కూడా ఎసరు పెట్టిన అశ్వత్థామ చర్యకామె పరితపించి పోయింది. దానితో ఇక తన వంశమే విచ్ఛిన్నమవుతుందని తహతహలాడింది. అలాంటి సందర్భంలో ఎవరికీ అంతు పట్టకుండా కోడలి గర్భంలో ప్రవేశించి దారుణమైన ఆ బాణాగ్నిని రూపుమాపి గర్భస్థ శిశువును కాపాడిన కృష్ణుని చర్య తిలకిస్తే ఆయన లోకసామాన్యమైన వ్యక్తి కాదు పరమాత్మేననే భావం ఆమెకు బాగా మనసుకు నాటింది. అంతవరకూ బీజరూపంగా ఉన్న భక్తి మొలకెత్తి చిగురొత్తి పుష్పించి ఫలించి నలుదెసల పరిమళాలు గుబాళించింది. అత్తా ! వెళ్లి వస్తానని అన్నమాట మేనల్లుడి మాటగా అనిపించ లేదావిడకు. కనుమరుగైతే మరలా కనిపిస్తాడో లేదో నని దగ్గరగా వచ్చి

శ్రీకృష్ణా యదు భూషణా నరసఖా శృంగార రత్నాకరా
లోకద్రోహి నరేంద్ర వంశదహనా - లోకేశ్వరా - దేవతా

నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా – నిర్వాణ సంధాయకా
నీకున్ మొక్కెద ద్రుంపవే భవ లతల్ నిత్యాను కంపానిధీ

అని వాపోతుంది.

ఈ మాటలు బాగా గమనించండి. ఆయన యదు భూషణుడట నరసఖుడట. అంటే తన పుట్టినింటివాడు కాబట్టి తన పుత్రుడైన అర్జునుడికి అన్నిటా బాసట అయి నిలిచాడు. అంతేకాదు. శృంగార రత్నాకరుడు. ఏది చేసినా అది ఒక లీల ఆయనకు. ఏమిటది. లోక విద్రోహులైన దానవులను శిక్షించటమొకటి. లోకోత్తరులైన దేవతాదులను రక్షించటమొకటి. అంతేకాక మహాజ్ఞానులైన వారికి నిర్వాణ సుఖం కూడ ప్రసాదించగల దయామయుడు భగవానుడు. అంతటి దయాళుడవు గనుకనే నా భవలతలను కూడా త్రుంచి వేయమని బ్రతిమాలుతున్నది. భవబంధములను త్రుంచి వేసే భారం భగవంతుడి మీద పెడుతున్నదావిడ. భగవంతుడు గాదు త్రుంచి వేయవలసింది. ఎవడి బంధం వాడే త్రుంచుకోవలసి ఉంది. **"ఉద్ధరే దాత్మ నా త్మానమ్"** ఆత్మోద్ధరణకు చేయవలసిన ప్రయత్నమంతా జీవుడిదే. దేవుడిది గాదు. స్వప్రయత్నం లేకుండా ఈశ్వరుడు తానుగా ఎవ్వరికీ మోక్షాన్ని ప్రసాదించడు. ఏమిటా ప్రయత్నం. తన కనాది సిద్ధంగా ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టుకోటం జ్ఞానం వల్లగాని సంభవం కాదది. కాబట్టి ఆత్మజ్ఞానం కోసమెవరికి వారు ప్రయత్నం సాగిస్తూ పోవాలి. అలాటి ప్రయత్నం లేదు కుంతికి. అందుకు కూడ నాకు శక్తి లేదు. నీవే దాని ననుగ్రహించమని అడుగుతున్నది. **"యాదవులందు, పాండవుల యందు నధీశ్వర నాకు మోహవిచ్ఛేదము సేయుమయ్య"** మోహమంటే అజ్ఞానం. దానివల్ల కలిగే అభిమానం. దానితోనే వీరు నావారు వీరు పరాయి వారనే భావం మానవులకు. అది తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించమంటుంది. **"ఘన సింధువు జేరెడి గంగ భంగి – నీ పాదసరోజ చింతనముపై ననిశంబు మదీయ బుద్ధి నత్యాదర వృత్తితో గదియునట్లుగ జేయగదయ్య"** నీ పాదాల మీద నా మనసు నిలుస్తుందో లేదో అది నిలిచేలాగా నీవే అనుగ్రహించమంటుంది. అప్పటికి మోహవిచ్ఛేదం చేయవలసిందీ భగవంతుడే. భగవత్తత్త్వాన్ని భజించే భావాన్ని కలిగించ వలసిందీ భగవానుడే కుంతి దృష్టిలో.

ఇదే సగుణ భక్తుల దృష్టి. వారు భగవంతుణ్ణి ఎప్పుడూ సగుణంగానే భావిస్తారు. సగుణమనే సరికి ఒక నామంతో ఒక రూపంతో తమ మధ్య తిరుగుతూ చేస్తూ ఉన్న వ్యక్తిగానే చూస్తుంటారు. ఒకవేళ ఎప్పుడైనా ఆయన సామాన్యమైన వ్యక్తికాదు. విశ్వరూపుడైన పరమాత్మ అనే జ్ఞానమున్నట్టు కనిపించినా అది వారికి శ్రుతమైన జ్ఞానమే గాని ఒంటబట్టిన అనుభవ జ్ఞానం కాదు. పెద్దలు చెబుతూ వచ్చిన తాము వింటూ వచ్చిన మాటలనే ఏ కరువు పెడుతుంటారు. అలాగే ఏకరవు పెట్టింది కుంతికూడా మొదట పరీక్షిత్తును చావకుండా కాపాడిన సందర్భం చూడగానే తాత్కాలికమైన భావావేశం పట్టజాలక ఇలా కీర్తిస్తుందా పరమాత్మ నావిడ.

పురుషుండాద్యుడు ప్రకృతికి
బరుడవ్యయు డఖిల భూత బహిరంతర్భా
సురు డనవ లోకనీయుడు
పరమేశ్వరుడైన నీకు ప్రణవములు హరీ

అని కృష్ణుని నిర్గుణ తత్త్వాన్ని ఎంతో తాను గ్రహించిన దాని లాగా ప్రశంసిస్తుంది. **"జననము నైశ్వర్యంబును ధనమును విద్యయును గల మదచ్ఛన్నులకు"** నీవగోచరుడవు. అవి లేని పరిశుద్ధ మనస్కులకే సులభడవనే ధర్మసూక్ష్మాన్ని వెల్లడిస్తుంది. కొందరు నీవు దేవకీ వసుదేవుల కిచ్చిన వర ప్రకార మవతరించావంటే కొందరు భూభారాన్ని పాపటానికంటే మరి కొంద రజ్ఞాన కామ్య కర్మఠుల మూఢత్వాన్ని తొలగించి వారికి శ్రవణ చింతనాది భక్తి మార్గాన్ని బోధించటాని కవతరించావని చెబుతున్నారని భగవజ్జన్మ రహస్యాన్నీ ప్రయోజనాన్నీ బయట పెడుతుంది. **"నిను జింతించుచు బాడుచుం బొగడుచున్ నీ దివ్య చారిత్రముల్ వినుచుం"** జూచినదే నిజమైన చూపని వర్ణిస్తుంది.

ఎంత వర్ణించినా ఇదంతా శ్రుత పాండిత్యమే. అభ్యాస జన్యమైన అనుభవం కాదు. అలాటి అనుభవమే ఉంటే అది జ్ఞానం. జ్ఞానోదయమైతే మోహవిచ్ఛేదం దానిపాటికదే ఏర్పడుతుంది. విచ్ఛేదం చేయమని భగవంతుణ్ణి ప్రాధేయపడ నక్కరలేదు. మనం ప్రాధేయపడినా ఇంకా మనకు యోగ్యత లేకపోతే భగవంతుడు సర్వసమర్థుడయి కూడా మనకది ప్రసాదించబోడు. మీదు మిక్కిలి ఇంకా మనకది

బలం చేసిపోతాడు. ప్రస్తుతం కుంతి విషయంలో ఇలాగే జరిగింది. నాకు మోహవిచ్ఛేదం చేయమని ఆవిడ ప్రార్థిస్తే విచ్ఛేదం చేయకపోగా దాన్ని ద్విగుణీకృతంగా ఆవహించాడావిడకు శ్రీకృష్ణుడు.

పృథయేత్థమ్ కలపదైః - పరిణూతాఖిలోదయః
మందమ్ జహాస వైకుంఠో -మోహయన్నివ మాయయా

ఈ విధంగా మేనత్త అవీ ఇవీ వలపోస్తూ ఉంటే ఏమీ మాటాడకుండా ఒక మందహాసం చేసి వెంటనే రథమెక్కి ద్వారకకు వెళ్లిపోయాడట. ఆవిడ అన్నివిధాల ప్రాధేయపడుతూంటే దానికి మందహాసమా జవాబు. పైగా ఇంకా కొంత కాల మిక్కడనే సన్నిధి చేసి మాకు తరుణోపాయం బోధించమని ఆవిడ బ్రతిమాలుతుంటే దానికి ఏమీ బదులు చెప్పక రథారోహణం చేసి పోవటమా అంతకన్నా జవాబు.

అవును. నిజమాలోచిస్తే పరమాత్మ దృష్టిలో అదే జవాబు. జీవుడికి దేవుడిచ్చే జవాబదే. ఇచ్చట కుంతిది అనన్యమైన నిర్గుణభక్తికాదు. సగుణ భక్తి. పరమాత్మనేదో ఒక పరిచ్ఛిన్నమైన రూపంలో చూచి దాన్నే కలకాలమూ తన దగ్గర నిలుపుకోవాలని కోరుతున్నది. పైగా స్వప్రయత్నమే కొంచెమూ లేకుండా తన సంగతి అంతా చివరకు తనకు కలగవలసిన మోక్షం కూడా ఆయనే ప్రసాదించాలని ఆసిస్తున్నది. ఇది వట్టి పేరాస. భక్తి మార్గంలో దీన్ని మార్జారకిశోర న్యాయమంటారు. ఒక పిల్లి తన పిల్లలను తానే నోట గరచుకొని పోతుంది. పిల్లలకేమీ జవాబుదారీ లేదు. అంతా తల్లిదే. అలాగే భక్తుడి బాగోగులన్నీ భగవంతుడే చూచుకోవాలని సిద్ధాంతమిది. మంచిదే.కాని దానికి కూడా నూటికి నూరుపాళ్లూ చిత్తశుద్ధి ఉండాలి. ఎలాటి వ్యాజమూ పనికిరాదు. అంతా తెలిసినట్టు నటించటమూ తన జీవిత ప్రయోజనాల కోస మర్థించటమూ ఇదీ వ్యాజమంటే. ఇవి రెండూ ప్రస్తుతం కుంతీదేవికి లేకపోలేదు. కావలసినంత ఉంది. **"పురుషుండాద్యుడు ప్రకృతికి పరుడని"** భగవానుడి పరతత్వాన్ని ఎంతగానో కొనియాడింది. అంత విషయం తెలిసిన మనిషికిక మోహమెక్కడిది. లేకుంటే మరలా నాకు మోహవిచ్ఛేదము సేయమని ప్రార్థించట మేమిటి. అంతేకాదు. కృష్ణుడు తన వారినీ తన్నూ మొదటి నుంచీ ఎలా కాపాడుతూ వచ్చాడో ప్రశంసిస్తూ అలాగే ఇక మీదట కూడా మమ్ముల్ను కంటికి రెప్పలాగా కాపాడుతూ మా ఇంటనే ఉండి పొమ్మంటుంది. ఇది ఇంకా అవివేకం. ఆపదలలో

కాపాడితేనే పరమాత్మ అవసరం, లేకుంటే అక్కరలేదనే భావానికి కొంత తావున్న దీమాటలలో. పైగా తాను చేసుకోవలసిన మోహ విచ్ఛేదం పరమాత్మ కొప్పగించట మేమిటి. సర్వవ్యాపకుడైన ఆ దేవుని తన దగ్గరే కట్టి వేసుకొనే అభిలాష ఏమిటి. సగుణంలో ఇది చాలా క్రింది స్థాయికి చెందిన ఆర్తభక్తి. కనుకనే సర్వజ్ఞుడైన పరమాత్మ ఆవిడ ఎంత దీనాలాపాలు చేస్తున్నా ఒక్క నవ్వు నవ్వి వెంటనే రథమెక్కి వెళ్లిపోయాడు. మోహం వదలించమని ఆవిడ కోరితే మోహాన్ని ఆపాదించి పోయాడు. ఆయనకు తెలుసు నావిడ మనస్తత్త్వం. దానికి తగినట్టే ఉందాయన ప్రవర్తన పిండికొద్దీ రొట్టె. **"యే యథామాం ప్రపద్యంతే తాంస్త థైవ భజామ్యహ"**మని తానే గదా చెప్పాడు. మేనత్త అంతస్తుకు తగినట్టే ఉంది మేనల్లుడి వ్యవహారం.

కుంతి అయిన తరువాత పాండవులు. ఆవిడ కుమారులే వీరు. ఆవిడ మేనల్లుడని చూస్తే వీరు బావగారనే భావం వదలకుండానే చూచారాయనను. మహా అయితే ఆయా సమయాల్లో ఆర్త త్రాణ పరాయణుడుగా భావించారు. ఒక్కొక్కప్పుడు భగవంతుడనే భావం కూడా ఉంది. లేకపోలేదు. కాని అది ఈ బాంధవ్యమనే నివురు గప్పిన నిప్పులాగా ఉండిపోయింది. జాజ్వల్య మానంగా ప్రకాశించలేదు. కనుకనే నారద మహర్షి ఒక సందర్భంలో ధర్మరాజును చూచి ఇలా అంటాడు. **"ప్రేమన్ మీరలు భక్తి నేమొ నిదె చక్రింగంటిమి"** ప్రేమచేత ఆచ్ఛాదితమైన భక్తేగాని అచ్చమైన భక్తి కాదట. మరి ఆ ప్రేమ తమ కన్నివిధాలా సాయపడి నంతవరకే ఉంటుంది వ్యక్తిమీద. లేకుంటే లేదు. మరి కృష్ణుడు వారికి చేసిన ఉపకారమింతా అంతా కాదు **"చెలియై మేన మఱందియై సచివుడై చిత్తప్రియుండై మహాఫల సంధాయకుడై మెలంగుటది నీ భాగ్యంబు రాజోత్తమా"** అని ఆ నారదుడే ప్రశంసిస్తాడు. జలజాత ప్రభవాదులు కూడా చర్చించి దర్శించలేని పరమాత్మ వారికి తనకు తానే వశవర్తియై చెప్పినవీ చెప్పనివీ అన్నిపనులూ చేసి పెట్టాడు. మహాఫలాన్నే ప్రసాదించాడట వారికి. ఏమిటా మహాఫలం. మహాఫలమంటే ఇక్కడ మోక్షం గాదు. అది పరిపూర్ణ జ్ఞానంతో రావలసిందే గాని కేవల భక్తితో అదీ సవ్యాజమైన భక్తితో రాదు.

కాబట్టి మహాఫలమంటే ఇక్కడ జీవితంలో అంతకంతకు కలిగే అభ్యుదయమే. ఉపద్రవాలన్నీ దూరం చేసి ఎనలేని ఐశ్వర్యాన్ని ప్రసాదించటమే మహాఫల సంధాయకత్వం. అది ఎలాంటిదో ఇంతకు ముందే అభివర్ణించాము.

పాంచాలీ కబరీ వికర్షణ మహా పాప క్షతాయుష్కులం
జంచద్గర్వుల దార్త రాష్ట్రుల ననిం జంపించి గోవిందు డి
ప్పించెన్ రాజ్యము పాండవేయులకు గల్పించెన్ మహాఖ్యాతిఁజే
యించెన్ మూడు తురంగమేధములు దేవేంద్ర ప్రభా వోన్నతిన్

ద్రౌపదీ వస్త్రాపహరణ మనేది ఎంతటి అవమానకరమైన సన్నివేశం. అలాటి ఎన్నో క్లేశాలనుంచి తప్పించిన వాడా పరమాత్మే. చివరకు ప్రాజ్యమైన సామ్రాజ్యాన్ని ధర్మజుని చేతికందించిన వాడూ ఆయనే. మూడు అశ్వమేధ యాగాలు చేయించి దేవేంద్రునికంటే గొప్ప కీర్తి ప్రతిష్ఠలా పాండవుల కార్జించి పెట్టినవాడూ ఆ భగవానుడే.

అయితే చిత్రమేమంటే ఇంత మహోపకారాలు గావిస్తున్నా లోకోత్తరమైన చర్యలప్పుడప్పుడు ప్రదర్శిస్తున్నా విశ్వరూపాదులే చూపి తన భగవత్తత్త్వాన్ని బాహాటంగా చాటుతున్నా తెలుసుకోవలసినంత గాఢంగా తెలుసుకోలేకపోయారు పాండవులు. ఏమి కారణం. నల్లనివాడు పద్మనయనంబుల వాడని సగుణంగానే భావిస్తున్నా రాయనను వారు. ప్రేమతోనే తప్ప జ్ఞానంతో దర్శించటం లేదా తత్త్వాన్ని. కడకు ఆ మహాత్ముడి ముఖతః భగవద్గీత లాంటి మహోపదేశాన్నే విన్న అర్జునుడు కూడా నోచుకోలేదా జ్ఞానానికి. అయితే తన తల్లి కుంతిలాగానే అతడూ ఎంతగానో గ్రహించినట్టు చేసినట్టూ అభినయిస్తాడు. **"నష్టో మోహః స్మృతి ర్లబ్ధా"** నాకు అజ్ఞాన తమస్సంతా విరిసిపోయింది. జ్ఞానజ్యోతి దేదీప్యమానంగా వెలిగిపోతుందని ప్రజ్ఞలు చెప్పుకొన్నాడు. ఇంత భీకరాలు పలికినవాడు యుద్ధానంతరం కృష్ణుడు తమరి నందరినీ వీడ్కొని పోయేటపుడు అన్న మాటలేమిటో చూడండి.

యద్యద్భగవతా ప్రోక్తమ్ - పురాకేశవ సౌహృదాత్
తత్సర్వమ్ పురుష వ్యాఘ్ర - నష్టమ్ మేభ్రష్ట చేతసః
మమ కౌతూహలం త్వస్తి - తేష్వర్థేషు పునః పునః

బావా నీవింతకు ముందేదో ఒక గొప్ప విషయం చెప్పావు నాకు. అది ఇప్పుడు నా మనసులో లేదు. నేను చాలా దురదృష్టవంతుణ్ణి. అది మరలా ఒకసారి వినాలని నాకు కుతూహలంగా ఉంది. చెబుతావా అని అడుగుతాడు. చూడండి. అంతకు ముందు నా అజ్ఞానమంతా తొలగిపోయిందన్న పెద్దమనిషి ఇప్పుడా విషయమే

జ్ఞాపకం లేదంటున్నాడు. పైగా మరలా వినాలని కుతూహలంగా ఉందట. అతడన్నట్టు కుతూహలమే Curiosity అది. నిజమైన జిజ్ఞాసా ధారణా కాదు.

ఇలాంటి వ్యవహారమంటేనే సరిపడదు పరమాత్మకు. అజ్ఞుడినైనా మెచ్చుతాడు గాని జ్ఞానాన్ని అభినయించే వాణ్ణి ఏ మాత్రమూ మెచ్చడీశ్వరుడు. వెంటనే ఇలా చీవాట్లు పెడతాడు. **"శ్రావితస్త్వమ్ మయా గుహ్యమ్-జ్ఞాపితశ్చ సనాతనమ్"** నీకు నేనెంతో గొప్ప రహస్యాన్ని బోధించాను. పరమ సత్యాన్నే తెలియజెప్పాను.

అబుద్ధ్యా నాగ్ర హీర్యత్త్వమ్ - తన్మే సుమహ దప్రియమ్

అది నీ మనసుకు పట్టలేదంటే ఎంత బుద్ధిహీనుడవో నీవు. ఇలాటి వ్యవహారం నాకే మాత్రమూ పనికి రాదు. అసలు భగవద్గీతారంభంలో కూడా అర్జునుణ్ణి ఇలాగే చీవాట్లు పెట్టాడు.

అశోచ్యా నన్వ శోచస్త్వమ్ - ప్రజ్ఞా వాదాంశ్చ భాషసే

నిజమైన ప్రజ్ఞ లేకున్నా ప్రజ్ఞలు పలికితే ఒప్పుకోడు భగవానుడు. జిజ్ఞాసతో విషయం తెలుసుకోటానికి ప్రయత్నించాలి మానవుడు. అదే ఆత్మోద్ధరణకు తోడ్పడేది. అప్పుడే భగవంతుడు కూడా చేయూతనిచ్చేది. కుంతిలాగే అర్జునుడి కలాటి స్తిమితత లేదు. ఇంకా అది అంతో ఇంతో ఉన్నవాడు ధర్మరాజు. కృష్ణుడి వల్ల కాకపోయినా భీష్ముడివల్ల విన్నాడతడెన్నో ధర్మాలు. భగవద్గీత అర్జునుడు వింటే తత్తుల్యమైన మోక్షధర్మాన్నే శ్రవణం చేశాడు. చేసినందుకు తగిన పరిపాకం కూడా గణించాడు.

అయితే పామరత్వమనేది అతణ్ణి వదలలేదు. అదీ కొంచెమంటి పట్టుకొనే ఉంది. పట్టు వదలకనే

తన దేహంబునకై యనేక మృగసంతానంబు జంపించు దు
ర్జను భంగిన్ గురు బాలక ద్విజ తనూజ భ్రా తృ సంఘంబుని
ట్లని జంపించిన పాపకర్మునకు రాజ్యా కాంక్షికిన్ నాకుహా
యనల క్షావధినైన ఘోర నరక వ్యాసంగముల్ మానునే

అని వాపోతాడు. రణరంగంలో జరిగిన మారణ హోమమంతా తన వల్లనే జరిగిందని అతని భ్రాంతి. పైగా ధర్మయుద్ధంవల్ల రాజులకు పాపమంటదని శాస్త్రం చెప్పినా అది కేవలం సమర్థించటానికి చెప్పిన మాటేనని పొరబాటు పడతాడు.

అశ్వమేధాది యాగానుష్ఠానంతో పాపం నిర్మూలమై పోతుందనే మాట కూడ పాడిగాదు. అది పంకంబున పంకిల స్థలమునకూ మద్యంబున మద్య భాండంబునకూ గలిగే శుద్ధిలాంటిదేనని ఆక్షేపిస్తాడు. జీవహింసతో గూడిన యాగకర్మల చేత మానవునికి పాప బాహుళ్యమే గాని పాప నిర్ముక్తి ఎలా కలుగుతుందని ప్రశ్నిస్తాడు. వాటన్నిటికీ భీష్ముడతని కొకే ఒక సమాధానమిస్తాడు. **"ఈశ్వరుండు విష్ణు డెవ్వేళ నెవ్వని కేమి సేయు పురుషుడేమి యెఱుగు నతని మాయలకు మహాత్ములు విద్వాంసు లడగి మెలగుచుందు రంధులగుచు"** ఇవన్నీ నీ ప్రయోజకత్వమని భ్రాంతి పడుతున్నావు. నీకిందులో ఎలాటి కర్తృత్వమూ లేదు. అన్నీ ఆ మహాత్ముడి మాయా విలాసమే అని ప్రబోధిస్తాడు. ధర్మరాజు కప్పటినుంచీ జ్ఞానం కొంత ఒంటబట్టి ఈశ్వరాధీనుడై బ్రతుకు సాగిస్తూ పోతాడు.

ఇంతకూ వీరందరూ మార్జార కిశోరాలే. మర్కట కిశోరాలు గారు. మార్జార కిశోరం తల్లి ఆలనా పాలనా కోరుతుంది. మర్కట కిశోరంలాగా తాను దానినంటి పట్టుకొనే ప్రయత్నం చేయదు. పైగా నామరూపాత్మకంగానే భగవత్తత్త్వాన్ని భావించటం వల్ల ఆమూర్తి ఎప్పుడూ తమతో ఉండాలనీ తమ పనులు చేసి పెడుతుండాలని కాంక్షిస్తుంటారు. తత్త్వం తెలిసి కాదది. తమ కాతత్త్వం ఉపయోగ పడుతుందని. తన్నిమిత్తంగానే ఆ ప్రేమ భావం. ఒక నిమిత్తంగా ఏర్పడిందెప్పుడూ ఆ నిమిత్తం పోతే తొలగిపోయే ప్రమాదముంది. ఇలాంటి ప్రమాదానికే గురి కావలసి వచ్చింది పాండవులు. ఉన్నట్టుండి ఒక్కసారిగా మాయమై పోయాడు పరమాత్మ. దానితో పాటు ఆయన సహకారం కూడా కరవయి పోయింది వారికి. ఇది వారికి భగవానుడు పెట్టిన పరీక్ష. ఈ రెంటికోసమే నా మీరు నన్ను ప్రేమించటం భజించటం లేక ఇవి దూరమైనా నన్ను భజించే నేర్పున్నదా మీకని మౌనంగా ఆయన వేసిన ప్రశ్న. అదే కృష్ణ నిర్యాణం.

పాండవ నిర్యాణానికి ముందే జరిగింది కృష్ణ నిర్యాణం. వారు బ్రతికి ఉండగానే తాను పోయాడు. ఏమిటి దీనిలో అంతరార్థం. ఎప్పటికైనా వారు తెలుసుకోవాలొక రహస్యం. తానే గదా బోధించా డర్జునుడికి. **"అంత వంత ఇమే దేహా-నిత్యస్యోక్తా శ్శరీరిణః"** అని దేహి అయిన జీవుడే నిత్యంగాని అతడు ధరించిన దేహం నిత్యం గాదు. అది జీవుడి దేహమైనా సరే – ఈశ్వరుడి దేహమైనే సరేఅనిత్యమే. జీవుడిదంటే

కావచ్చు గాని ఈశ్వరుడి శరీర మనిత్యమెలా అవుతుందని అపోహలో ఉండవచ్చు పాండవులు. ఉన్నారు కూడా. లేకుంటే నిత్యమూ మాదగ్గరే మమ్ములను అంటి పెట్టుకొని ఉండమనే మాటరాదు. కుంతీ అన్న దామాట పాండవులూ అన్నారు. ఇంకా వారికి శరీర భ్రాంతి పోలేదనుకున్నాడు పరమాత్మ. అంతేకాదు. తన్నుకూడా ఈ నీలమేఘ శ్యామలమైన శరీరం మేరకే దించి చూస్తున్నారని గ్రహించాడు. ఎప్పటికైనా ఈ శరీరమే కాదాత్మ అంటే దీనికి విలక్షణమైన తత్త్వమనే భావం దృఢపడాలని ఆలోచించాడు. అలా దృఢపడాలంటే తన శరీరమింకా దృగ్గోచర మవుతున్నంత వరకూ వారికది కలిగే అవకాశం లేదు. ఇంకా ఆ మైకంలోనే ఉండిపోతారు. అంచేత వారు జీవించి ఉండగానే తాను కన్ను మూశాడు. శరీరమిక్కడే విడిచిపోయాడు. అది దైవికంగా అర్జునుడి కంటనే పడేట్టు చేశాడు. అది చూచేసరికి అంతకుముందు విన్న సాంఖ్యయోగం బాగా తలకెక్కింది అర్జునుడికి. దేహం వేరు – దేహి వేరనేది ఎంత విన్నా అది సిద్ధాంతమే. దృష్టాంతంగా చూచినప్పుడే అది బాగా ఒంట బట్టేది, అనుభవంగా మారేది. అది పరమాత్మ విషయంలోనే చూచేసరికి హడలిపోయా డర్జునుడు. ఇక కై ముతిక న్యాయంచేత తమ శరీరాల శాశ్వతమని చెప్పనే అక్కరలేదతనికి. అప్పుడర్థమయిందతనికి ఎవరి శరీరమైనా శాశ్వతం కాదని. అంతేకాదు. శరీరమే కాకపోతే తన్మూలంగా ఏర్పడిన ప్రాపంచిక భోగభాగ్యాలసలే గాదు. కనుక వాటినిక ఏ మాత్రమూ అంటిపట్టుకోరాదు. అంటిపట్టుకోవలసిన దెప్పటికైనా శాశ్వతమైన ఆ పరమాత్మ తత్త్వాన్నే. ఇదే గాక ఇంకొక రహస్యం కూడా బోధపడిం దర్జునుడికి. అంతకు ముందంతా తమ కర్తృత్వంతో ఏదో సాధించామనీ పడబొడిచామనీ అనుకొన్నదంతా వట్టి భ్రమే. అందుకు నిదర్శనం కృష్ణుడు వెళ్లిపోగానే తన అసహాయ స్థితి. అశక్తత. **"మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్త మాత్రమ్ భవ సవ్యసాచిన్"** అన్న భగవద్వాక్యం కూడా వట్టి సిద్ధాంతం కాదు దృష్టాంతమని అప్పుడర్థమయిందా మానవుడికి.

ఎంత పలవించినా ఇక ప్రయోజనం లేదని చెప్పి రామకృష్ణాదుల శరీరాల కగ్ని సంస్కారం చేసి బయలుదేరుతా డర్జునుడు హస్తినాపురానికి. పదహారు వేల మంది కృష్ణకాంతలను కూడా వెంటబెట్టుకొని వస్తాడు. వచ్చీ రావటంతోనే అన్నగారి కాళ్ల మీద బడి బోరుమని ఆక్రందనం చేస్తాడు. ఇంగితజ్ఞుడైన ధర్మజుడా ఆకృతిని

చూడగానే భయపడతాడేదో కొంప మునిగిందని. మరేదో గాదు. మాధవుని మరణమే. అందుకే ఆదుర్దాగా అడుగుతాడు.

అన్నా ఫల్గున భక్త వత్సలుడు బ్రహ్మణ్యుండు గోవిందుడా
పన్నా నీక శరణ్యుడీశుడు జగద్భద్రాను సంధాయి శ్రీ
మన్న వ్యాంబుజ పత్ర నేత్రుడు సుధర్మా మధ్య పీఠంబు నం
దున్నాడా బలభద్రుగూడి సుఖియై యుత్సాహియై ద్వారకన్

ఉత్సాహియై ఉన్న మాట వాస్తవమే గాని అది ద్వారకలో గాదు వైకుంఠంలో. ఆ మాటే చెబుతా డర్జునుడింకెక్కడి కృష్ణుడెక్కడి ద్వారక.

బలహీనాంగులకున్ బలాధికులకున్ ప్రత్యర్థి భావోద్యమం
బులు కల్పించి వినాశము న్నెఱపి ఈ భూభారముం బాపి ని
శ్చల వృత్తిం గృతకార్యుడై చనియె నా సర్వేశ్వరుండ"ని

అసలు విషయం బయటపెడతాడు. కృష్ణుడంటే సర్వేశ్వరుడని కేవలం భూభార పరిహారార్థమే అవతరించాడని పూర్తిగా గ్రహించాడర్జునుడు.

అంతేకాదు. అతడు తమ బావ అని తమనేదో ఆపత్సమయాలలో ఆదుకొంటూ వచ్చిన ఆపద్బాంధవుడనే సంకుచిత భావం కూడా అతనికి తొలగిపోయింది. అది అతనిమాటలలోనే మనకు దాఖలా అవుతుంది.

భూతముల వలన నెప్పుడు
భూతములకు జన్మ మరణ పోషణములు ని
ర్ణీతములు సేయుచుండును
భూతమయుం డీశ్వరుండు భూత శరణ్యా

సకల చరాచర సృష్టి స్థితిలయాలు ఆ పరమేశ్వరుడి చేతిలోనివి. చరాచర భూతమయుడూ ఆయనే వాటి కతీతుడూ ఆయనే. మనమంతా కేవలం నిమిత్త మాత్రులమే నని తన పరాపరా విజ్ఞానాన్ని ప్రదర్శిస్తాడు అర్జునుడు. అంతమాత్రమే గాదు. అంతకుముందు భగవత్సన్నిధిలో ఎంత గీతాశ్రవణం చేసినా ఒంటబట్టని ఆత్మ జ్ఞానమిప్పుడాయన ఆ సన్నిధిలోనే పాకానికి వచ్చింది.

"వాసుదేవాం ఘ్రయను ధ్యాన పరి బృంహిత రంహసా
భక్త్యా నిర్మధితా శేష కషాయ ధిషణో ఽర్జునః
గీతమ్ భగవతా జ్ఞానం యత్త త్సంగ్రామ మూర్ధని
కాల కర్మ తమోరుద్ధమ్- పున రధ్యగమద్విభుః"

నిరంతర భగవచ్చింతా ప్రభావం వల్ల అతనికి పట్టిన మనః కాలుష్యమంతా ప్రక్షాళితమై పోయింది. అంతకు పూర్వమెప్పుడో రణరంగంలో విన్న గీతోపదేశం కాల కర్మముల ప్రాబల్యం చేత మరుగుపడిన దంతా ఒక్కసారిగా మనసుకు స్ఫురించింది. **"విశోకో బ్రహ్మ సంపత్త్యా సంఛిన్నద్వైత సంశయః"** దానితో బ్రహ్మాకార వృత్తి నిలకడ చెందగాసంశయ శోకాలు రెండూ నశించి నిర్మల జ్ఞాన సంపన్నుడవుతా డతడు. అంతకుముందే విరక్తుడయినాడు ధర్మజుడు.

యయా హరద్భువో భారం - తాం తనుం విజహా వజః
కంటకం కంటకేనేవ - ద్వయం చాపీశితు స్సమమ్
యథా మత్స్యాది రూపాణి ధత్తే జహ్యాద్యథానటః
భూ భారః క్షపితో యేన జహా తచ్చ కళేబరమ్

మత్స్యాది శరీరాలు ధరించటం పరమాత్మ కొక లీల. భారావతారణమే వాటి ప్రయోజనం. ముల్లు ముల్లుతో తీసి తరువాత ఆ రెండు ముండ్లూ పారవైచినట్లొక శరీరమెత్తి మిగతా శరీరాలను నిర్మూలించి ఆ తరువాత రెంటినీ వదలివేసి పోయాడాయన కవి రెండూ సమానమే అని అర్జునుడనే మాటలు గాఢంగా నాటాయి ధర్మరాజుకు. ఇక ఏ మాత్రమాలసించినా అది పామరత్వమే నని భావించాడు. తాము నమ్ముకొన్న విలువైన సొమ్మే కాల ప్రవాహంలో నష్టమై పోయింది. ఇక తాముండి సాధించేదేముంది. వెంటనే తీవ్రమైన వైరాగ్య భావంతో తమ్ములూ తానూ పరీక్షిత్తును రాజ్యాభిషిక్తుణ్ణి చేసి సర్వమూ పరిత్యజించి ఉత్తరదిశగా పయనమవుతాడు. అంతకు పూర్వమే వారి తల్లి కుంతి యోగంతో శరీరత్యాగం చేసింది. తాము కూడా **"మనసా ధారయా మాసు ర్వైకుంఠ చరణాంబుజమ్"** మనసులో వైకుంఠుని మూర్తిని నిలుపుకొని **"తస్మిన్ నారాయణ పదే"** ఆ నారాయణుని మార్గంలోనే **"ఏకాంత మతయో గతి మవాపుః"** అనన్య మనస్కులై అన్య జన దుర్లభమైన ఉత్తమగతి చెందారట.

విధూత కల్మషే స్థానే విరజే నాత్మనై వహి
విదురోపి పరిత్యజ్య ప్రభాసే దేహ మాత్మవాన్
కృష్ణా దేశేన తచ్చిత్తః పితృభిః స్వక్షయమ్యయౌ

వారి పినతండ్రి విదురుడుకూడా అక్కడక్కడా తీర్థయాత్రలు చేస్తూ వచ్చి చివరకు ప్రభాసమనే తీర్థంలో మునిగి దేహత్యాగం చేస్తాడట. ఆయనను తీసుకెళ్లటానికి పితృదేవతలు వస్తారు. వారితో కలిసిపోయి యథాపూర్వంగా యమలోకంలో తన అధికార స్థానాన్ని అలంకరిస్తాడాయన.

చూడండి. ఇక్కడ మనమొక విషయం గమనించవలసి ఉంది. కుంతి మొదలుకొని వీరంతా సగుణభక్తులేగాని నిర్గుణభక్తులు కారు. అంటే పరిపూర్ణ జ్ఞానయోగులు కాదని అర్థం. అక్కడక్కడా వారికి జ్ఞానవైరాగ్యాలు కలిగినట్టు వర్ణించినా అది సగుణమైన జ్ఞానమే. తన్మూలంగా ఏర్పడిన ప్రాపంచిక విషయ పరాఙ్ముఖత్వమే. సమ్యగ్ జ్ఞానరూపమైన అద్వైత దర్శనం కాదు. అద్వైత దర్శనమే అయితే కృష్ణాదేశమనే మాట గాని వైకుంఠ చరణాంబుజమని మాట గాని రాకూడదు. **"వాసుదేవ స్సర్వమితి"** అని విషయ జగత్తుతో సహా సర్వమూ తద్రూపంగానే భావించవలసినప్పుడిక కృష్ణుడేమిటి వైకుంఠుడేమిటి. అలా అంటే అది పరిచ్ఛిన్నమైన తత్త్వం. అఖండ తత్త్వం కాదు అఖండాన్ని పట్టుకొంటేనే జ్ఞానం. దానివల్లనే ముక్తి. అంతవరకూ ముక్తికి నోచుకోలేదు మానవుడు. ఎంతటి భక్తుడైనా నోచుకోలేడు. వాడు నోచుకొనేది కేవలమా మూర్తి తోడి సాయుజ్యమే. అదీ మోక్షమని ఎక్కడైనా పేర్కొంటే అది కేవలం సాపేక్షమైన మోక్షమే గాని నిరపేక్షం గాదు. ఇలాంటి సాపేక్ష ముక్తినే పడయగలిగారు పాండవులూ, విదురుడూ. దీనికి తార్కాణమొక్కటే. వారు చివరకు ధారణా ధ్యానసమాధి రూపమైన యోగమార్గంలోనే శరీర త్యాగం చేశారు. అంతేగాదు. వారు ఉత్క్రమణ చెంది పోయి చేరింది వారి వారి పూర్వస్థానాలేవో అవేగాని సర్వాత్మ భావం కాదు. సర్వాత్మ భావమనేది పూర్వజ్ఞానం వల్లనే పొందగలిగేది. అప్పుడు వాడి కుత్క్రమణా లేదు. ఎక్కడికో పోయి చేరటమూ లేదు. **"నతస్య ప్రాణా ఉత్క్రామంతి ఇహైవ సమవనీయంతే"** అని శాస్త్రం. అంచేత **"ప్రేమన్ మీరలు"** అని నారదుడు చెప్పినట్టుగా పాండవులది కేవలం భగవత్ప్రేమ రూపమైన సగుణభక్తే.

పోతే ఇక గోప గోపికల భక్తి. ఇదికూడా సగుణమే. **"కామోత్కంఠత గోపికల్"** అని ఇది కూడా కామమనే వ్యాజంతో కూడిందే. అందులో గోపికలది కామమైతే గోపకులది సఖ్యం. దశమ స్కంధమంతా వీరి వ్యవహారంతోనే నిండి నిబిడీ కృతమయి ఉంది. కృష్ణుడు పుట్టింది మధురలోనైనా పెరిగింది వ్రేపల్లెలోనే. బాల్యమంతా అక్కడే గడచిపోయింది పరమాత్మకు. అయినా ఆయనకు బాల్యమేమిటి. పౌగండమేమిటి, కౌమారమేమిటి, వార్ధ్యమేమిటి. అదంతా ఒక నటన. ఒక క్రీడ. తన క్రీడకు మరికొందరు క్రీడాకారులను తోడు చేసుకోవలసి వచ్చింది. వారే గోపకులు. యాదవు లెవరో చెప్పింది భాగవతం. వారంతా కృష్ణ ప్రీతితో జననమందిన అమరులే నని.

యాదవ కులమున నమరులు
మేదినిపై బుట్ట ఁజనుడు మీ యంశములన్
అని బ్రహ్మదేవుడు ముందుగానే వారి నాజ్ఞాపిస్తాడు. అంతేగాదు
హరి పూజార్థము పుట్టుడు
సురకన్యలు భూమియందు సుందరతనులై

అని దేవతా స్త్రీలను కూడా ఆజ్ఞాపిస్తాడు. వారే గోపికలయి జన్మించారు. అప్సరః స్త్రీలు గోపికలైతే గోపకు లెవరప్పటికీ. వారా అప్సరః కాముకులైన గరుడ గంధర్వాది దేవతలే కావాలి. సందేహంలేదు. యాదవులే దేవతలని చెప్పినా గోపకులు ఫలానా అని చెప్పకపోయినా ఇది మన మూహించుకోవచ్చు.

అయితే ఎందుకిలా జన్మించారు వీరంతా. హరి సహాయార్థమా. పరమాత్మకు వీరు చేసే సహాయమేమిటి. అలా చేసినట్టు ఒక సందర్భం కూడా కనిపించదు వారి జీవితంలో. మీదు మిక్కిలి అడుగడుగునా కృష్ణ భగవానుడే వారి నాదుకోవలసి వచ్చింది. అలాంటప్పుడెందుకు వీరిలా జన్మించటం. ఎందుకో గోపికల విషయంలోనే బయట పెట్టాడు మహర్షి హరి పూజార్థమని. భగవదారాధన కోసమే వీరందరి ఆవిర్భావమూ భగవంతుడికి తాము చేసేదేమీ లేదు. తమ కోసమే తమ ఆత్మోద్ధరణ కోసమే తాము జన్మ ఎత్తారు లోకంలో. దేవతలకు కూడా జన్మ ఉందా అని ఆశ్చర్యపడనక్కరలేదు. జన్మరాహిత్యమయ్యే వరకూ ఎవరైనా సరే జన్మించవలసిందే. వారు దేవతలే కాదు. మానవులే కాదు దానవులే కాదు. జన్మ రాహిత్యమెప్పు

డవుతుంది. జ్ఞానోదయమైతే అది ఎప్పుడు. భక్తియోగం పరిపాకానికి వస్తే. అంటే సగుణం నిర్గుణంగా మారితే. మొదలు సగుణానికే నోచుకోలేదు దేవతలు. కారణమేమంటేవారు భోగలాలసులు. కర్మయోగులై తత్ఫలంగా స్వర్గాది లోకాలు చేజిక్కించుకొన్న వారు కొందరైతే అసలు జన్మతోనే స్వర్గవాసులుగా జన్మించిన వారు కొందరు. ఇందులో మొదటివారు కర్మదేవతలు. రెండవవారు ఆ జాన దేవతలు. ఆ జానదేవతలూ అనాదిలో ఎప్పుడో ఒకప్పుడుత్తమ కర్మాచరణ మూలంగా అలా అయినవారే. మొత్తానికిధర్మానుష్ఠాన పరిపాక ఫలమే దేవతా జన్మ. ఇది కర్మ సమాధి యోగాలు రెంటివల్ల లభించే పదవేగాని భక్తి జ్ఞానాల మూలంగా కాదు. అందుకే ఈ సుర కిన్నర గరుడ గంధర్వ సిద్ధ చారణాది దేవయోనులందరూ చాలావరకు భోగదాసులే గాని పరమాత్మ దాసులు కారు. కారు గనుకనే వారికి భక్తి భావాన్ని కరపి బాగుచేయటానికా అన్నట్టు పరమాత్మ అప్పుడప్పుడు వారికి అసుర శక్తులవల్ల వల్ల మాలిన ఉపద్రవాలు కలిగిస్తుంటాడు. దానికి హడలిపోయి వారు కూడా పరమాత్మను శరణువేడి తదనుగ్రహంతో ఆ ముప్పు తప్పించుకొని అప్పటికప్పుడు బ్రతికి బయటపడతారు. అయితే అది సహజం కాదు గనుక పబ్బం గడవగానే మరలా యథాప్రకారంగానే భోగమయమైన జీవితాలు గడుపుతుంటారు. ఇదీ వీరి వరుస.

ఇలాటి పశుప్రాయమైన జీవితాన్ని తప్పించి వారి కప్పుడప్పుడుతదతీతమైన భగవద్భక్తి నంకురింపజేసి క్రమంగా ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించటానికి వారినీ కర్మభూమిలో జన్మింపజేస్తాడా ఈశ్వరుడు. కర్మభూమిలో దేనికంటే ఇక్కడ దేవలోకాలలో ఉండే భోగభాగ్యాలూ లేవు. అణిమాద్యష్ట సిద్ధులూ లేవు. దీర్ఘ కాలికమైన జీవితం కూడా లేదు. మీదు మిక్కిలి అడుగడుగునా అధ్యాత్మకాది తాపాలూ క్లేశాలే తారసిల్లుతుంటాయి. అవి నిత్యమూ అనుభవిస్తేనే గాని జీవిత భోగాల మీద ఏవగింపు పుట్టదు వారికి. అయితే ఈ నిర్వేదమనేది ప్రతిలోమమే గాని అనులోమ మార్గం కాదు. అనులోమం భగవద్భక్తి. అది ఎలా లభిస్తుంది. ఎప్పుడో కష్టం వచ్చినప్పుడనే గాక కష్టంలో సుఖంలో అన్ని దశల్లో ప్రతి నిమిషమూ ఆ పరమాత్మతో కలిసి మెలిసికాపురం చేసినప్పుడే. అందుకే ఈ గోప గోపికల జన్మ. అది కర్మ సమాధి పరాకాష్ఠ నందుకొన్న దేవజాతి భక్తి జ్ఞానాలలో శిక్షణ పొందటానికని భూమిమీద ప్రభవించిన వ్యవహారం. దీని కనుగుణంగానే సాగింది వారి జీవిత వ్యవహారమంతా. గోపికల దొక రకంగా అయితే గోపకులది మరొక రకంగా.

మొదట గోపకుల వృత్తాంతమే తీసుకొని చూతాము. కృష్ణుడితో పాటు పుట్టారు పెరిగారు వీరు. కృష్ణుడెక్కడో పుట్టినా వచ్చి పెరిగింది వీరి మధ్యనే. పరమాత్మ వెతుక్కుంటూ వచ్చాడప్పటికి తన భక్త జనాన్ని. లేకుంటే ఆయన ఎక్కడ ఉన్నాడో అర్థం చేసుకొనే తాహతులేదు గదా వారికి. ఇలా తనసన్నిధానంవారి కనుగ్రహించటం వారి ప్రయత్నానికి చేయూతనీయటం. అది చక్కగా అందుకొన్నారా బాలురు.

గో వల్లభుడ నేను గోవులు మీరని – వడి అంకెవైచుచు వంగి యాడు

రాజనే భటులు మీరలురండు రండని ప్రాభవంబున పెక్కు పనులు పనుచు

ఇలా కృష్ణుడెలా పంచితే అలా పనులు చేస్తూ పసితనం నుంచీ ఆయనకు పరిచర్య చేస్తూ వచ్చారు అంతేకాదు.

కపులమై జలరాశిగట్టుదమా యని కట్టుదు రడ్డంబు కాలువలకు

మనులమై తపములు మొనయుదమాయ ని మౌనులై యుందురు మాటలేక

ఇలా ఆయన చేసే చేష్టలన్నింటినీ తామూ అనుసరిస్తూ వచ్చారు. మరి ప్రతిరోజు ఆల కదువులను తోలుకొంటూ పోయి ఆయనతో పాటు బంతి చలుదు లారగిస్తారు. **"ఒకనొకని చల్దికావడి నొక డొక దడకించి దాచు" "ఒక్కడు మున్నే మఱచిన నొక్కడు బలు బొబ్బవెట్టు నులికి వడంగన్"** ఇలా తమలో తామెన్ని అల్లరి చేష్టలు చేసినా **"వనజాక్షుడు మున్నరిగిన మునుపడనేనేనె యతని ముట్టెద ననుచున్"** పరమాత్మ వెంట పరుగిడేవారు. వారి చేష్టలు వర్ణించి చెబుతూ ఇలా అంటాడు శుకమహర్షి

ఎన్నడునైన యోగి విభులెవ్వని పాద పరాగమింతయుం
గన్నుల గానరట్టి హరి గౌగిట జేర్చుచు జెట్టబట్టుచున్
తన్నుచు గ్రుద్దుచున్ నగుచు తద్దయు బైపడి కూడి యాడుచున్
మన్నన సేయు వల్లవ కుమారుల భాగ్యము లింత యెప్పునే

"యచ్చావ హాసార్థ మసత్కృతోసి విహార శయ్యాసన భోజనేషు" అని ఇలాంటి పనులు చేసినందుకెంతో ఒద్దుకొంటాడొకప్పు డర్జునుడు. అతడు కేవలభక్తుడూ కాదు. కేవలజ్ఞానీ కాదు. కనుకనే అలా వాపోయాడు. మరి ఈ గోపబాలురో కేవల మూఢభక్తులు. వీరికి పరమాత్మ నిలా చేస్తున్నామే అనే భయంగాని సంకోచంగాని

లేదు. విహార శయ్యాసనాదులే గాదు. ఒకరి నొకరు తన్నుతూ గుద్దుతూ కూడా మెలగుతూ వచ్చారు. పైగా అది అపచారమనుకోలేదు వారు. ఆయన మీద చూపే ఒక గొప్ప మన్ననగా భావించారు. అది యోగుల వ్యవహారం కంటే సన్నిహితమైనదట. అంటే కర్మ సమాధి యోగాలకన్నా భక్తి భావమే గొప్పది. అది ఎంత మూఢమైనా గాఢమే. అందుకే **"మందులకు బాలుడగు హరి పొందుగని"** రని మందులైనా వారి కతి సులభుండా భగవంతుడని చాటుతాడు.

మరి మూఢభక్తి అంటే సామాన్యమని భావించరాదు. మూఢత్వంలో కూడా అనన్య భావన అది. పరిపూర్ణ విశ్వాసమది. అలాంటి వారిని పరమాత్మ ఎప్పుడూ తప్ప జూడడు. యే యథా మా మన్నట్టు వారి ప్రపత్తికి తగినట్టే వారి నాదుకొంటాడు. ఒకనాడొక రాక్షసుడు గోగోప బాలురనందరినీ మ్రింగుతానని చెప్పి అ జగరాకారుడై దారిలో పడి ఉంటాడు. గోపబాలురది చూచి కూడా

బకునిం జంపిన కృష్ణుడుండ మనకుం బామంచు చింతింపనే
టికి రా పోదము దాటి - కాకయది కౌటిల్యంబుతో మ్రింగుడున్
బకు వెంటంజను కృష్ణచేత

అని తమలో తాము సమాధానం చెప్పుకొంటూ నిర్భయంగా వెళ్లిపోతారు. పరమాత్మ అది చూచి అయ్యో వీరు. **"నిర్భయులై యెదుర్కొనిరి నే గల నంచు"** అంచేత వీరి నుపేక్షింపరాదని చెప్పి దాని కడుపులో దూరి పెరిగి దాని కడుపు చించి వారిని కాపాడుతాడు. మరొక పర్యాయం బ్రహ్మదేవుడాయన మహాత్మ్యాన్ని పరీక్షించటానికి గోవులనూ గోపబాలురనూ మాయం చేస్తాడు. కృష్ణుడది కనిపెట్టి ఒక ఏడాది కాలం ఆ గోపకుల వేషాలు తానే ధరించి ఎవరికీ అంతు పట్టకుండా వ్యవహరిస్తాడు. బ్రహ్మ తన చర్యకు తానే సిగ్గుపడి కాళ్లమీద పడి మన్నింపమని ప్రార్థేయపడతాడు. అంతేకాదు.

ఏలా బ్రహ్మ పదంబు వేదములకున్ వీక్షింపగా రాని ని
న్నీ లోకంబున నీవనాంతరము నందీ మందలో - కృష్ణయం
చాలా పాది సమస్త భావములు నీయందే సమర్పించు నీ
వ్రేలం దొక్కని పాద రేణువులు పై వేష్టించినం జాలదే

అని వాపోతాడు. దీనిని బట్టి బ్రహ్మపదంలో ఉన్నా బ్రహ్మతత్త్వం అంతు పడుతుందని నమ్మకం లేదు. అంతకన్నా ఏ ఉన్నత పదంలో లేకపోయినా సామాన్యుడికే అది సులభం కావచ్చు. దానికి కారణమొక్కటే. అది ఆలాపాది సమస్త భావములూ ఆయన కర్పించి జీవించటమే. మరేదీ గాదు.

ఇలా జీవించా రాగోపకులు. జల జాతాక్షుడు రాముడున్ నటనముల్ సల్పంగ గోపాల మూర్తులతో గొల్చు నిర్జరులు సంతోషించి వేణు స్వనంబులు గావించుచు కొమ్ములూదుచు శిరంబుల్ ద్రిప్పుచున్ బాడుచు తిరుగుతుండేవారు. మాపాలికి బలకృష్ణులు భూపాలకులంచు నెగిరి బొబ్బిలిడుచు వారిని నేలమీద నడవకుండా భుజాలమీద మోసుకొని పోయేవారు. ఆయన కేదైనా ఆపద జరిగిందంటే భరించలేక తల్లడిల్లేవారు. కాళియుడు కృష్ణుని చుట్టివేసినప్పుడా దృశ్యం చూచి ఇలా ఆక్రందన చేస్తారు.

అదె మన కృష్ణునిం గఱచి యంతట బోక భుజంగమంబు దు
ర్మదమున మేను జుట్టుకొని మానక యున్నది - యింక నేమి సే
యుద మెట జొత్తమే పురుషులోపుదు రీయహి నడ్డపెట్ట

నని పెద్ద పెట్టున గోలపెట్టారు. అంతేకాదు. తమకెలాటి ఆపదలు వచ్చినా సరే ఆయనే రక్షకుడని భావించి మరలా మొరపెడతారు. **"నీ పద పద్మంబులు గాని యొండెఱుగ మోపద్మాక్ష యోకృష్ణ మ్రొక్కెద మోరామ మహా పరాక్రమ" "నీ పాదంబులు నమ్మిన నాపద లెక్కడివి జనులకు నీ చుట్టాలకు నాపదల్గలుగునే మేమెల్ల నీవార మన్యాచారంబు లెఱుంగ మీశుడ"**వని ఈశ్వర తత్త్వమెంతో తెలిసిన వారిలాగా కూడా కనిపిస్తారు. ఇంతెందుకు. తెలుసునో - తెలియదో - ఆ పరమాత్మతత్త్వం వారికి. మొత్తానికి కృష్ణ పరమాత్మే లోకంగా ఆయనే తమ జీవిత సర్వస్వంగా బ్రతికారా గోపకులు. **"మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాంన మస్కురు మయ్యర్పిత మనోబుద్ధిః"** అన్న భగవద్వాణి కుదాహరణ ప్రాయం వారి జీవితం. అంతేకాదు. అన్యాచారంబు లెఱుంగమని వారన్నట్టు అది కూడా **"యేశాస్త్ర విధి ముత్సృజ్యయ జంతే శ్రద్ధయా న్వితాః అన్యేత్వేవ మజా వంతః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే"** అనే భగవద్వాక్యాని కనురూపమే.

పోతే ఇలాటి వ్యవహారమే గోపికలది కూడా. వారూ భగవదర్పిత సమస్త భావనలే. అయితే ఉపాధిలోనే తేడా ఇరువురికీ. వారు పురుషోపాధిలో ఉన్న దేవతలు. వీరు స్త్రీ ఉపాధులలో ఉన్న దేవ కన్యలు. కనుకనే సగుణంలో కూడా వారిది దాసభక్తి – సఖ్యభక్తి అయితే – వీరిది కామభక్తి. కామోత్కంఠత గోపికల్ అని గదా భాగవత వచనం. కామమంటే ఇక్కడ స్త్రీ పురుష సంబంధం. ఇది కేవలం లౌకికమైతే గర్హణీయం. పరమేశ్వర విషయకం కాబట్టి ప్రశంసనీయ మయింది. పరమేశ్వరు డొక్కడే వారి దృష్టిలో పురుషుడు. పూర్ణత్వమున్న వాడెవడో వాడు గదా పురుషుడంటే. అలాంటి పూర్ణత్వం భగవంతుడికి గాక మరెవరికి. కనుకనే పురుషుడైనా పురుషోత్తముడైనా వాస్తవానికా భగవానుడే. మరెవరూ కాదు. కాదు గనుకనే తమ తమ భర్తలను అత్త మామలను ఎవరినీ లెక్క చేయక ఇది లోకనింద్యమని కూడా సంకోచించక కృష్ణుని వెంటబడి పోయారా గోపికలు. పైగా ఆయనే సంకోచించి మీరేమిటిలా నామీద దాడి చేస్తున్నారు. మీకు భర్తలు లేరా, అత్తమామలులేరా, వారా గ్రహించరా, లోకులాడి పోసుకోరా, అని ప్రశ్నిస్తే కూడా భర్తలేమిటి బంధువు లేమిటి అంతా నీ స్వరూపమే గదా నీలోనే మేమీ ప్రపంచాన్నంతా చూస్తున్నప్పుడిక మాకుపాపమేమిటని సమాధానమిస్తారు. భక్తిలో ఇది పరాకాష్ఠ. దీనినే మధురభక్తి అంటారు భక్తితత్త్వ విశారదులు.

మధురభక్తి ఏమిటి. మామూలు భక్తి కాదా ఇది. కాదు. మామూలు భక్తి పురుషులకు పురుషోత్తముడి మీద అయితే ఇది స్త్రీలకా పురుషోత్తముడి మీద. వాస్తవానికి పురుషుడొక్క పరమాత్మేనని చెప్పాము. ఆ దృష్టితో చూస్తే లోకంలో ఉన్న స్త్రీ పురుషులంతా స్త్రీలే. అయినా ఆ భావం పురుషులకు కలగటం కష్టం. వారి పురుషోపాధి వారి కడ్డం వస్తుంది. స్త్రీలకైతే అలాటి చిక్కులేదు. వారి శరీరాలు స్త్రైణాలే కాబట్టి సహజంగానే మేము స్త్రీలం. ఆయన పురుషుడు, ఆయనకు మేమధీనలమనే భావమేర్పడుతుంది. ఈ అధీన భావం లోకంలో స్త్రీకి తన పురుషుడి విషయంలో స్వాభావికమే. స్త్రీ శరీర నిర్మాణమే దానికి హేతువు. అది సహజంగానే పురుషుడి కధీనమై పోతుంది. అతనికి వశవర్తి అవుతుంది. అతని ఇచ్ఛానుసారం నడుస్తుంది. ఒదుగుతుంది. కరుగుతుంది. కలిసి పోతుంది. అనిర్వచనీయమైన ఆనందమిస్తుంది. పొందుతుంది. చివరకతడూ తాననే భేదం లేకుండా అభేదాన్నే

భజిస్తుంది. లోకంలో చూచే ఈ వ్యవహారంలో ఎంత మాధుర్యముందో అదే సరిగా గోపికలకూ గోపికావల్లభుడికి మధ్య ఉన్నవ్యవహారంలో కూడా. అయితే ఇది మాధుర్యమే గాని భక్తి కాదు. అది మధురమూ భక్తీ కూడా. కారణం. ఇది కేవలం లౌకికం. అది లోకోత్తరం. ఇక్కడ కేవలం స్త్రీ పురుషులమే మనమని శరీరధర్మాలే చూస్తున్నారు. అక్కడ ఈ స్త్రీ నేనొక పరమపురుషుణ్ణి భజించే భక్తురాలననీ, ఆయనకే ఈ తనుధన మనః ప్రాణాలన్నీ సమర్పితమనే పరిపూర్ణ భక్తి భావంతో ప్రవర్తిస్తుంది. ఆ పురుషుడు కూడా అశరీరుడూ నిత్యముక్తుడూ అయిన పరమ పురుషుడు కాబట్టి ప్రత్యేకంగా నేనొక స్త్రీ శరీరంతో భోగిస్తున్నాను. దీని మూలంగా నాకెనలేని నిర్వృతి కలుగుతున్నదనే సవిషయ భావంతో ఉండడు.

ఇలాంటి అంతర్యమిందులో ఇమిడి ఉంది గనుకనే ఇది మధుర భక్తి. ఇది లౌకికం కాదు. లోకోత్తరమని చెప్పాము. లోకోత్తరం గనుకనే మనకది అర్థం కాదు. అర్థం కాకపోతే దాని మాధుర్యమెలాంటిదో చవి చూడలేము. కాబట్టి మనకోసమని పురాణ కర్త దాన్ని లౌకికమైన స్థాయిలో వర్ణించవలసి వచ్చింది. అలౌకికానికి లౌకికమనేది ప్రతిబింబమే గదా. అది బింబమైతే ఇది దానికి ప్రతిబింబం. ప్రతిబింబం వట్టిదే. మిథ్యాభూతమే. మిథ్యాభూతమైనా ఇది ఆతథ్యమైన బింబాన్ని మనకు పట్టి ఇస్తుంది. ఒక పక్షి ఆకాశంలో ఎగురుతూంటే దాని నీడ మనకు నేలమీద కనిపిస్తుంది.ఇదే ఆ పక్షి కాదు. కాని ఇది కనిపించగానే పైకి చూస్తాము మనం. ఎందుకు. ఈ నీడ ఎక్కడిదా అని. చూస్తే తప్పకుండా పైన ఎగిరే పక్షి కంటబడుతుంది. అప్పటికీ ఆ ప్రతిబింబమే గదా ఆ బింబాన్ని చూపింది మనకు. అలాగే లౌకికమైన ఈ గోపికా కృష్ణుల శృంగారమంతా లోకోత్తరమైన శృంగారానికి ఒక ఛాయ. అయితే ఏమిటా లోకోత్తరం అని అడగవచ్చు. అదే జీవేశ్వరుల పరస్పర సంబంధం. గోపికలంటే ఎవరో కాదు. జీవులే. గోపికా వల్లభుడైన కృష్ణుడా ఈశ్వరుడే. సహజంగా జీవుడు పరిపూర్ణుడు కాడు. కనుక పురుషుడు కాడతడు. స్త్రీ. ఈ స్త్రీ పరిపూర్ణత నందు కోవాలంటే పూర్ణ పురుషుణ్ణే భజించాలి. ఆ స్వరూపంతో ఏకత్వం భజించాలి. **"సతా సోమ్య తదా సంపన్నో భవతి"** అంటున్న దుపనిషత్తు. అంతేకాదు. **"యథాస్త్రియా సంపరిష్వక్తో న బహిర్వేద నాంతర"**మ్మని లోకంలో స్త్రీ పురుష వ్యవహారాన్నే జీవేశ్వరైక్యాని కుపమానంగా వర్ణిస్తుంది.

దీనిని బట్టి గోపికా కృష్ణుల వ్యవహారమెట్టిదో ఇక మనం బాగా అర్థం చేసుకోవచ్చు. పైకి భౌతికంగా అశ్లీలంగా కనిపించినా అది అభౌతికం. ఆదర్శప్రాయం. బాల్యం నుంచీ కృష్ణుడు వారిపట్ల చేసిన అల్లరి చేష్టలన్నీ భగవంతుడు భక్తులను అజ్ఞాన నిద్రనుంచి మేల్కొలపటమే. వారిని రెచ్చగొట్టటమే. తన ఉనికి నెఱిగించటమే. ఎలయించటమే. అది గమనించారా గోపికలు కొంత కాలానికి. ఆయన సాంగత్యం కోసమాసించారు. తమ సర్వస్వమూ సమర్పించారు. క్షణమాలస్యమైతే భరించలేక పోయారు. కనిపించకపోతే కలవరపడ్డారు. అయితే నిజంగానే వీరు తనకుసర్వస్వమూ అప్పగించారా లేదా అని ఆ పరమాత్మ వారిని తానుకూడా పరీక్షిస్తుంటాడు. అలాటి ఒక పరీక్షే వస్త్రాపహరణం. లోతుకు దిగకుండా పైకి చూస్తే ఇది మహాబూతు. రాడీ చేష్ట. కాని భౌతికం కాదని గదా ముందే చెప్పాము. భౌతికమైన ఈ తెరమరుగున ఎంతో ఆధ్యాత్మకమైన భావమున్నది. ఏమిటది. వస్త్రమంటే జీవులకున్న దేహాభిమానం. అది ఉన్నంత వరకూ ఈశ్వర సాయుజ్యానికి నోచుకోలేము. జీవుడు తన పాటికి తాను వదలుకోలేడది. ఈశ్వరానుగ్రహం కూడా తోడు కావాలి దానికి. అందుకే వారి నేమరించి వారి వస్త్రాలపహరించాడు కృష్ణుడు. నీళ్లలో నుంచి ఇవతలికి రమ్మన్నాడు. ఆ కొలను సంసారమే. దానిలో నుంచి ఎంతగా పరమాత్మ హెచ్చరించినా బయటపడటమిష్టం లేదు వారికి. చివరకు పడక తప్పింది కాదు. చేతులెత్తమని కూడా అంటాడు. ఇది మరీ అన్యాయంగా కనిపిస్తుంది. కాదు. చేతులతో గోప్యాంగాన్ని కప్పి పుచ్చుకొన్నారు వారు పరమార్థంలో కప్పి పుచ్చుకోవలసిందేదీ లేదు. ఎందుకంటే సర్వత్రా ఉన్నాడీశ్వరుడు. **"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః"** అలాంటప్పుడు కప్పి పుచ్చినా కనపడక పోదు గదా. ఇక ఏమిటి కప్పుకొనేది మనం. **"తేనత్యక్తేన భుంజీథాః"** అన్నట్టు మనకున్న సర్వమూ త్యజిస్తే గాని ఆ తత్త్వంతో సాయుజ్యాన్ని భజించలేము మనం. ఇదే ఈ కథలోని సారాంశం.

పోతే రాసక్రీడలు. జలక్రీడలు. ఇవన్నీ జీవేశ్వరుల సంసర్గమే. మరేదీ గాదు. అనన్యమైన సగుణభక్తికిది పరసీమ. ఇందులోని ఆంతర్యం భాగవతమే బయట పెట్టింది. పరీక్షిత్తు లౌకికంగా భావించి ప్రశ్నిస్తే శుకుడు దాని కలౌకికమైన స్థాయిలో సమాధానమిస్తాడు. సర్వభక్షకుడైన అగ్నిహోత్రుడికే దోషమూ ఎలా అంటదో పూర్ణ జ్ఞానైశ్వర్య సమన్వితుడైన పరమాత్మకే వ్యవహారమూ అంటదు పొమ్మంటాడు. అలాంటి

పరిపూర్ణత లేదు గనుకనే మనబోటి మానవులకే ఈ ధర్మా ధర్మాది విచికిత్స అని కూడా జవాబిస్తాడు. ఒకవేళ మానవుడు కూడా ఆ స్థాయి కెదగగలిగితే మరీ మంచిదే. వాడికి లేదలాటి ద్వంద్వ ప్రసక్తి అని కూడా అర్థం చేసుకోవాలి మనం. కనుకనే తమ ప్రవర్తన గూర్చి కృష్ణుడాక్షేపించినప్పుడు అన్ని ధర్మములూ తెలిసిన నీవేనా ఇలా మాటాడవలసిందని మరలా ఆయనను మందలిస్తారు గోపికలు. ఇంత ధైర్యంగా అనగలిగారంటే అది అనన్యమైన వారి మధుర భక్తికి నిదర్శనం.

ఇలాటి భక్త్యావేశంతో ఆ గోపిక లెక్కడ బడితే అక్కడే ఆ పరమాత్మను చూడగలుగుతారు. ఆయన వియోగం క్షణకాలం కూడా సహించలేరు. సర్వత్రా తన మూర్తిని దర్శించవలసిన వారలా తపన చెందటమిష్టం లేదు పరమాత్మకు. అందుకోసమున్నట్టుండి ఆయన వారి మధ్యలో నుంచి మాయమయి పోయేవాడు. అది వారి అనన్యమైన భక్తికొక పరీక్ష ఆయన దృష్టిలో. కాని వారి దృష్టిలో ప్రగాఢమైన విరహం. దానితో తపించిపోయివారు **"పున్నాగ కానవేపున్నాగ వందితు - తిలకంబ కానవే తిలక నిటలు"** అని తమ ప్రాణనాథుణ్ణి అక్కడా ఇక్కడా వెదకుతూ పోతారు. **"నల్లని వాడు పద్మనయనంబుల వాడు"** అంటూ ఆయన చిరునామా చెప్పి ఇలాటి వాడొకడు మా మానధనాన్ని దోచుకొని పోయాడు. మీ పొదల మాటున లేడు గదా చెప్పండని కనపడ్డ మల్లెల తీవలనన్నింటినీ అడుగుతూ పోతారు. ఇంకా మిరహోన్మాద మెక్కువయి **"అదె నంద నందను డంతర్హి"** తుండయ్యే పాటలీ తరులార పట్టరమ్మ **"హేలావతుల కృష్ణయేల పాసితివని యై లేయ లతలార యడుగురమ్మ"** అని నోరులేని చెట్టులనూ గుట్టలనూ ప్రార్థేయపడేవారు. అంతేగాదు.

కిటియై కౌగిట జేర్చెను
వటువై వర్ధిల్లి కొలిచె వడి కృష్ణుండై
యిట పద చిహ్నములిడె - క్రిం
దటి బామున నేమి నోచితమ్మ ధరిత్రీ

అని భూదేవి సౌభాగ్యానికి మురిసిపోతారు. ఇంకా వెళ్ళి తల కెక్కితే

పూతనయై యొక్క పొలతిచరింపంగశౌరియై యొకకాంత చన్నుగుడుచు బాలుడై యొక భామపాలకునేడ్చుచో బండినేనని లేమ పాఱదన్ను ఇలా కృష్ణుని బాల్యచేష్టలు మీద ఆపాదించుకొని తృప్తి పడతారు.

సగుణోపాసకుల వ్యవహారమే ఇంత. అందులోనూ ఉపాసకులు స్త్రీలయినప్పుడిక చెప్పనే అక్కరలేదు. చేతనా చేతన వివేచన ఉండదు వారికి. తన్మయత్వ మెక్కువయ్యే కొద్దీ చరాచర ప్రకృతి అంతా తమ ఉపాస్య దేవతా మయంగానే భాసిస్తుంది వారికి. ప్రకృతిలో ఏది చూచినా అది తమ దైవానికి ప్రతికృతే. ఆయన మూర్తిని పట్టి ఇచ్చే ప్రతీకమే. లేకుంటే.

కొమ్మకు పువ్వులు గోసినాడిక్కడ మొనసి పాదాగ్రంబు మోపినాడు
సతినెత్తుకొని వేడ్క జరిగినాడక్కడ – తృణములో లేదిదె తెఱవజాడ
ఒకయెలనాగచే యూదినాడిక్కడ సరసనున్న వినాల్గు చరణములును
ఒక నీలవేణితో నొదిగినా డిక్కడ – మగజాడలో నిదెమగువ జాడ

అంటూ ఇలా ఎక్కడ బడితే అక్కడ భగవత్పాద ముద్రలు దర్శనమీయవు వారికి. భక్తుడికీ ప్రపంచమంతా భగవద్విభూతే. తత్స్వరూప ముద్రా ముద్రితమే. ఇందులో ఏ ముద్ర చూచినా అది ఆ రూపాన్ని పట్టి ఇచ్చే గట్టి లాంఛనమే. అయితే అలా చూచే దృష్టి ఉండాలి సాధకుడికి. ఉన్ననాడిక సృష్టి అంతా స్రష్ట రూపమే మరేదీ గాదు. అలాంటి అంతర్దృష్టితోనే దర్శించగలిగారా గోపికలు.

అలా దర్శించటంలో వారి కప్పుడప్పుడాయన కేవలమూ తమ్ముమలచి వలపించే వల్లభుడే కాదు. సకల జగదంతర్యామి అయిన ఆ పరమాత్మేననే భావన కూడా ఉదయించేది. **"నీవు యశోద బిడ్డడవె – నీరజ నేత్ర సమస్త జంతుచేతో విదితాత్మ వీశుడవు – తొల్లి విరించి దలంచి లోకరక్షా విధమాచరింపుమని సన్నుతి సేయ సత్కులంబునన్ భూ వలయంబు గాన నిట పుట్టితి గాదె మనోహరా కృతిన్"** ఒక ఆకృతి అంటూ లేని పరతత్త్వమింత మనోజ్ఞమైన ఆకృతి ధరించి ఆవిర్భవించిందంటే అది భూభారావతారణార్థమే నని ఎంతో ఆర్షదృష్టి తమకున్నట్టు కనిపిస్తారు. కాని అంతలోనే **"నీ నగవులు నీ చూడ్కులు నీ నానా విహరణములు నీ ధ్యానంబుల్ నీ నర్మాలాపంబులు మానసముల నాటి నేడు మగుడవు కృష్ణా – నీ యధ రామృత సంసేవన విధి నంగజు తాపమెల్ల విడిపింపగదే"** అని సగుణ భావనలో తలమునకలుగా మునిగిపోతారు. ఆ నల్లని ముగ్ధమోహన రూపంతోనే కనిపించి తమ వియోగవహ్ని చల్లార్చమని బ్రతిమాలుతారు.

మరి ఆయన సామాన్యుడా. **"యే యధామా మన్నట్టు"** వారెంతో తానూ అంతే.

తను రావే యని చీరి యేడువ జగత్త్రాణుండు - త్రైలోక్యమో
హనుడై మన్మథ మన్మథుం డయి - మనోజ్ఞాకారియై - హారియై
ఘన పీతాంబర ధారియై పొడమె

వారు కోరిన రూపంతోనే ప్రత్యక్షమవుతాడు. వెంటనే తమ వల్లభుడు విచ్చేశాడని వికసిత ముఖులై ఆ సఖులు ఒకతి ఆయన కేలు పట్టుకొంటే ఒకతి చేయి భుజం మీద వేసుకొంటే - ఒకతె తాంబూల మాసిస్తే మరొకతె ఆయన మృదులమైన పదాలు తన పరితప్త కుచాలమీద పాదుకొల్పుతుంది. ప్రేమాతి శయంతో నిష్మరోక్తులాడుతారు. అంతేకాదు.

కొలిచిన గొలుతురు కొందఱు

కొలుతురు తము గొలువకున్న కొందఱు పతులన్ అని సాభిప్రాయంగా మాటాడుతా రాయనతో. దాని కాయన జవాబిస్తూ **"ఏనిం దెవ్వడనైనంగాను, మానస బంధుడ నిత్యధ్యానము మీకొసగవలసి తలగితి"** నని తన అంతర్ధానంలోని అసలు రహస్యాన్ని బయటపెడతాడు. ఇంకా ఒక మంచి చురకపెడతాడు వారికి.

నను సేవించుచు నున్న వారలకు నేనా రూప ముం జూప జూ
చిన భావించి మదించి వారు మఱినన్ సేవింప రోయంచు

ఇది భగవానుడి భయం. ఒక విశిష్టమైన రూపంతో కనిపిస్తే ఇదే శాశ్వతం ఇంతకన్నా మరేమి కాదు. మరి ఇదెప్పుడు మాతో తిరుగుతూ మన అధీనంలో ఉన్నదే గదా అనే సంకుచిత భావమేర్పడుతుంది భాగవతులకు. అలాకాక వారికీ విశాల విశ్వమంతా భగవద్రూపమేననే దృష్టి ఏర్పడాలంటే తాను తన రూపాన్ని ఉపసంహరించాలి. అప్పుడా రూపాన్ని చూడాలనే తహతహతో సృష్టిలో ప్రతి ఒక్కటీ అన్వేషిస్తూ పోతాడు సాధకుడు. భగవదంతర్ధానాన్ని తమ కేర్పడిన మానధనాన్ని అపహరించి తమ కసలైన తత్త్వాన్ని చాటటంగా కూడ అర్థం చేసుకొంటారు. ఇదే అప్పుడప్పుడు కృష్ణుడి అంతర్ధానంలో ఇమిడి ఉన్న ఆంతర్యం. వియోగానంత రోపనతమైనపుడే సంయోగంలోని విలువ గుర్తిస్తాడు సాధకుడు. అలాగే గుర్తించారు

గోపికలు. తనివి దీఱ ఆయనతో రాసక్రీడాదులనుభవించారు. రస సంబంధియే రాసం. రసో వైసః రసం పరమాత్మ స్వరూపమే. తత్సాహ చార్యాన్ని అనుభవించటమే రాసక్రీడ. తన్మూలంగా కలిగే నిర్వృతి ఏదుందో అదే జలక్రీడ. జలమంటే ఉపశమనం. మౌనం. భగవత్సాహచర్యానుభూతి చివరకు మౌనంతోనే పర్యవసిస్తుందని చెప్పటమే రాసక్రీడానంతర జలక్రీడా వర్ణనం.

ఇలాంటి నిర్వాణ భూమికనందుకొన్న తరువాత ఇక న్యాయమైతే వారక్కడి నుంచి తిరిగి రాకూడదు. అంటే తగ్గుస్థాయిలో కలిగే ఆలోచనలు మనసులో ప్రవేశించరాదు. అయినా ప్రవేశించాయా గోపికలకు. కారణం వారింకా సగుణ భూమికలో నుండటమే. నిర్గుణంలాగా భాసించే సగుణ భక్తి ఇది. జ్ఞానులలాగా అప్పుడప్పుడుపన్యసించినా తదాభాసేగాని తత్త్వం కాదది. దీనిని బయట పెట్టటానికే అక్రూరాగమనం. కంసుని ఆదేశాన్ని శిరసావహించి రామకృష్ణులను తోడ్కొని పోవటానికి వచ్చాడక్రూరుడు. అది మహాక్రూరమైన చర్యగా కనిపించింది వారికి. కృష్ణుడు తమకు మరలా దూరమవుతున్నాడే అని వారి బాధ. దూరం కావాలనుకొన్న వాడసలుకృష్ణుడే. తానే దూరం కావాలనుకొని దానికి కంసుణ్ణి అక్రూరుణ్ణి ఒక నిమిత్తం చేసుకొన్నాడా పరమాత్మ. అది అల్పమేధసలైన ఆ గోపికల కంతే పట్టలేదు. పైగా అక్రూరుడే కావాలని తీసుకెళ్లుతున్నాడని ఆయన నెక్కడలేని శాపనార్థాలు పెడతారు. **"అక్రూరుండని పేరు పెట్టుకొని నేడస్మన్మనో వల్ల భుం జక్రిన్మాకడం బాపి కొంచునరుగన్ చర్చించి యేతెంచినా డక్రూరుండట క్రూరుడీత"** డని తిట్టిపోస్తారు. **"హరినేలాకొని పోయె దంచు మన మాయక్రూరు బ్రార్థింతమా"** అని మరలా సామానికి దిగుతారు. అది కూడా పనిచేయక పోయేసరికి **"మము గృపం బాటింపు గోవింద మాధవ దామోదర యంచు"** సుజాతంచైన గీతంబులతో విలపిస్తారు. దానికీ లెక్కచేయక వారు వెళ్లిపోతుంటే **"అదె చనుచున్నవాడు ప్రియుడల్లదె తేరదె వైజయంతి"** అని ఒకరి కొకరు వేలు పెట్టి చూపుతూ కండ్ల కబ్బినంత దూరం చూస్తూ నిలబడి పోతారు.

ఏమిటిదంతా. సగుణచింతనలో ఉన్న దౌర్బల్యమే ఇది. కనిపిస్తే ఆహ్లాదం. కనపడకుంటే విషాదం. ఎప్పుడూ ఏకరూపంగా ఉండే స్థితి కాదది. అలాంటి స్థితే కావాలంటే అది నిర్గుణంలోనే. సగుణంలో దొరకదా నిధానం. కనుకనే పెన్నిధి

కోలుపోయిన పేదలలాగా కృష్ణుని సన్నిధి కోలుపోయిన గోపిక లోపికలు లేక చీకాకు పడసాగారు. మరలా వారి నేడిపించటానికా అన్నట్టు కృష్ణుడు వారి చెంత కుద్ధవుణ్ని పంపుతాడు. **"నాపై జిత్తము లెప్పుడున్ నిలుపుచున్ నారాక గాంక్షించుచున్ గోపాలాంగన లెంత జాలిఁబడిరో"** చూచి రమ్మని పంపుతాడు. పైగా **"సందేహము మానుండర విందా ననలార మిమ్ము విడువను వత్తున్" "నాకాశ్రిత రక్షణములు నైసర్గికముల్"** అని ఆయన ద్వారా తన హృదయాన్ని ఆవిష్కరిస్తూ వారికొక సందేశం పంపుతాడు. అయితే ఆయన వ్రేపల్లెకు వచ్చి ఆ సందేశ వచనాలు వారికి వినిపించే లోపలనే వారు సహనం కోలుపోయి వచ్చిన వాడినీ, పంపిన వాడినీ, ఎవరినైనదీ తెలియని దశలో దశ దిశలూ మారు మోగేలాగా నానావిధాలైన నిష్ఠురోక్తులూ సాగిస్తారు. దగ్గరగా తిరుగుతూన్న ఒక భ్రమరం మీద నెపం పెట్టి ఎగ్గులాడుతారు. **"భ్రమరా దుర్జన మిత్ర ముట్టకుము మా పాదాబ్జముల్"** ఎందుకని **"నాగర ప్రమదాళీ కుచకుంకు మాంకిత లసత్ఫ్రాణేశ దామ ప్రసూనమరం దారుణి తాన నుండవగుటన్"** అంతేకాదు. నిలకడ కూడా లేనిదానివి నీవు. **"ఒక పువ్వందలి తేనెద్రావి మధుపాయుత్సాహివై నీవు వేఱొకటిం బొందెడి దానవే** గదా. ఇలా నిష్ఠురంగా మదనోన్మాదులై పలుకుతుంటే ఉద్ధవుడు వారి నూరడిస్తూ **"విశ్వేశుపై మీకజ స్రటుధ్యానము లిట్లు నిల్చునే"** ఎంత చిత్రమో గదా మీ చరిత్ర" కృష్ణుడు మీకు చెప్పమన్న మాటలివి. **"కలగని లేచి మున్ను గల గన్న సమస్త విధంబు గల్లగా దలచిన భంగి"** తద్జ్ఞుడైన వాడీ ప్రపంచాన్ని చూస్తాడు. మీరూ ఆతద్జ్ఞుల మార్గంలో మెలగాలని నా ఆశ. అందుకే ఈ మార్గంలో నన్ను మీరలు చింతించుచు నుండగోరి యిటు దూరస్థత్వముం బొందితిన్" **"తలకం బోలదు నన్ను గూడెదరు నిత్య ధ్యానపారీణలై"** ఇదే ఆఖరి మాట. ఇక కృష్ణుడు వచ్చింది లేదు. వారిని చూచింది లేదు. నిత్యధ్యాన పారీణలై ఉండటమే వారు పాటించవలసిన విధి.

ఇదే చివరకే భక్తుని విధి అయినా సగుణభక్తి మానవుని తరింపజేయదు అది ఒక ఆలంబన మాత్రమే. దానిని విడవకుండా నిత్యమూ పట్టుకొని కూచున్న వాడికదే కొంతకాలానికి నిర్గుణంగా పరిణమిస్తుంది. దానికి భగవన్మూర్తి ఇక కనిపించగూడదు. అది పూర్తిగా అంతర్హితమై పోవాలి. అప్పుడే నిలకడ భక్తికి. ఇలాటి భక్తి నలవరుచుకొని జన్మ తరింపజేసుకోటానికే జన్మంచారీ గోపికలూ ఆ గోపకులు. గోపకులు దేవతలైతే

గోపికలా దేవతాస్త్రీలలైన అప్సరసలేనని పేర్కొన్నాము. అదీ ఒక సంకేతమే. వాస్తవానికీ దేవతలూ దేవకన్యలూ ఎవరో గాదు. మానవుడి ఇంద్రియ వ్యాపారాలే దేవతలు. దీవ్యతి ప్రకాశతే ప్రత్యర్థ మితి దేవః దేవతా శబ్ద స్పర్శాదులైన ప్రతి ప్రాపంచిక విషయమూ దేనివల్ల ప్రకాశిస్తున్నదో అదిదేవత. త్వక్చక్షు రాదీంద్రియ వ్యాపారాల మూలంగానే కదా అది. అవి అనంతకోటి ఆ వ్యాపారాలు. అనంతకోటి దేవతలీ వ్యాపారాలే. వీరే గోపకులు. గోపనశీలమైన ఇంద్రియ వ్యాపారాలే గోపకులు. పోతే తజ్జన్యమైన అనుభూతులేవో అవి గోపికలు. గోప గోపికలంటే ఇంద్రియ వ్యాపారాలు వాటి అనుభూతులే ఇంతకూ. ఇవి మామూలూ అయితే బాహ్య ప్రపంచాభి ముఖంగానే ప్రసరిస్తుంటాయి. అందులో సుఖాన్నే చూరగొనాలని ఆసిస్తుంటాయి. దాన్ని దాచుకొని దగ్గర పెట్టుకోవాలనే తాపత్రయ పడతాయి. అదేగోపనమంటే. కాముకులైన దేవజాతులకిది నిసర్గసిద్ధం. అది ఉన్నంత వరకూ ముక్తిలేదు. భక్తి ఉంటే గదా ముక్తి. దానికే నోచుకోలేదు మొదటవారు. అంచేత ప్రపంచాభి ముఖంగా వెళ్లే వాటిని భగవదభి ముఖంగా మళ్లించాలి మొదట. అందుకే దేవయోనులైన స్త్రీ పుంస వర్గమంతా ఇలా గోపగోపికలుగా అవతరించింది. కృష్ణ వేష ప్రతిచ్ఛన్నుడైన పరమాత్మనలా అనుక్షణమూ సేవిస్తూ వచ్చింది. పరమాత్మ నుంచి జనించిన ఈ కళలన్నీ ఎప్పటికైనా ఆ పరమాత్మనుచేరవలసిందే. అందులో లయం చెందవలసిందే. **"యథా నద్యః స్యందమానా స్సముద్రే ఽస్తం గచ్ఛంతి నామరూపే విహాయ - తథా ఇమాః కలాః పురుషాయణాః పురుషమ్ ప్రాప్య అస్తమ్ యంతి"** అనే శాస్త్ర వాక్యానికిది శేషభూతమైన అర్థవాదం. అంతకన్నా మరేమీ లేదు.

గోపగోపికా జన వృత్తాంతమైన తరువాత ముఖ్యంగా పరిగణించవలసిన పరమ భాగవతులిద్దరే ఇద్దరున్నారు. ఒకడు అక్రూరుడు. మరొకడు ఉద్ధవుడు. వీరిద్దరూ కృష్ణుని వంశంలో జన్మించినవారే. ఆయనకు సంబంధులే. **"సంబంధులై వృష్ణులున్"** అని నారదుడు చెప్పినట్టు వీరిది సంబంధభక్తి. అయితే అలా చెప్పటం కూడా అంత సరిగాదేమో. ఏమంటే సంబంధులాయన కెందరు లేరు. ఉగ్రసేన శూరసేన కంసాదులంతా సంబంధులే గదా. వారందరికీ ఆయన యెడల భక్తి ఉందా పెట్టిందా. కాబట్టి సంబంధమనేది అకించిత్కర మిక్కడ. అది ఉన్నా లేకున్నా భక్తి అనేది ఉన్నవాడి కున్నది. లేని వాడికి లేదు. అక్రూరోద్ధవులు యదువంశంలో పుట్టటమనేది

యాదృచ్ఛికం. బహుశా యోగభ్రష్టులయి ఉంటారా మహానుభావులు. పూర్వమెప్పుడో యోగాభ్యాసం చేసి చేసి అది ఫలించకుండానే మరణించి ఉంటారు. **"అథవా యోగినా మేవకులే భవతి"** అన్నట్టు దాని ఫలితంగా ఈ జన్మలో యోగీశ్వరేశ్వరుడైన కృష్ణ భగవానుడి వంశంలో వచ్చి పడి ఉంటారు.

ఇందులో ఉద్ధవుడాయన కమాత్యుడూ, ఆచార్యుడూ ప్రాణ స్నేహితుడూ అయితే, అక్రూరుడు వరుసకు తండ్రిలాంటి వాడాయనకు. బంధుండవు సద్యోహిత సంధుండవు, వావిజూడ జనకుడవని కృష్ణుడే అంటాడా మాట. అయినా పరమాత్మకు తండ్రులేమిటి. తల్లులేమిటి. అది ఒక నటన. అందరూ ఆయనకు భక్తులే. తదీయ గుణ గణాసక్తులే. అలాంటి వాడే ఈ అక్రూరుడు. క్రూరుడు కాని వాడక్రూరుడు. ఆయన పేరే చెబుతున్న దాయన ఎంత సౌమ్య స్వభావుడో. అయితే అక్రూరుడైనా క్రూరుడైనా కంసుణ్ణి కాదనలేకపోతాడు. సరిగా రామాయణంలో విభీషణుని లాంటివాడు. భీషణుడు కానివాడు విభీషణుడయినట్టే క్రూరుడు కాని వాడక్రూరుడు. అన్నగారి దుండగా లాయన సహించినట్టే సహించాడు అక్రూరుడు కూడా కంసుని దుండగాలు. ఆయన చివరకన్నను కాదని వెళ్లిపోయినట్టే ఈయనా సందేశమనే నెపంతో కంసుని పట్టణం విడిచి వెళ్లిపోయాడు.

కృష్ణుడు వ్రేపల్లెలో ప్రచ్ఛన్నంగా వసిస్తున్నాడని నారదుడు చెప్పగా విని దానికి తగిన జాగ్రత్తలన్నీ తీసుకొన్న తరువాత ఎలాగైనా రామకృష్ణులను దగ్గరికి రప్పించి వారిని మట్టుపెట్టదలచాడు కంసుడు. అందుకోసం ధనుర్యాగమనే ఒక మిష కల్పించాడు. అప్పుడ క్రూరుణ్ణి పిలిపించి భుజంమీద చేయి వేస్తూ ఇలా అంటాడు. "అక్రూరత్వము తోడ నీవు మనగా నక్రూరనామంబు నిర్వక్రత్వంబున జెల్లె మైత్రి సలుపన్ వచ్చున్ నినుంజేరి నీ వక్రోధుండవు" కనుక నిన్ను పంపుతున్నాను. నీవు పోయి బలరామకృష్ణులను నాకు తెచ్చి ఒప్పగించమంటాడు. చూడండి. క్రూరుడైన కంసుడు కూడా ఆయనను అక్రూరుడని సంబోధిస్తాడు. అలాంటి నీతో మైత్రి సలపటం ఎవరికైనా శ్రేయస్కరమే నంటాడు. క్రూరస్వభావుల వల్ల కూడా సేబాసనిపించే ప్రశంసాపత్ర మందుకొన్నాడంటే అది ఎంత గొప్పతనమో చెప్పబని లేదు. పైగా మైత్రి సలుపవచ్చునట. సజ్జనులెప్పుడూ ఇరుపక్షాల వారికీ విహితంగానే ఉంటారు. పరస్పరంకారాలు మిరియాలు నూరుకొనే ఇరువాగులవారు కూడా

అలాంటి వారంటే ఎవరికి వారు తమ మనిషిగానే భావిస్తుంటారు. ఇది లోక సహజం. అయితే సజ్జనులు వారిని సత్కార్యాలకు నియోగిస్తే దుర్జనులు దుష్కార్యాలకు వాడుకొంటారు. ఇదీ లోకసహజమే. ఇది వారి సాధుత్వానికొక కఠిన పరీక్ష కూడా.

ఇలాంటి పరీక్షే ప్రస్తుతమీ అక్రూరునికి కూడా ఎదురయింది. నారాయణుడే దేవతల కార్యార్థమై యదువంశంలో పుట్టి నందుని ఇంట పెరుగుతున్నాడని విన్నాను. అన్న బలరాముడు కూడా అతనితోనే ఉన్నాడు. వారినిక్కడికి తీసుకురా – నేను వారి ప్రాణాలు తీయటానికి సిద్ధంగా ఉన్నానని చెబుతాడు కంసుడు. దానికా పరమ భాగవతుడిచ్చిన సమాధానమిది.

పంపిన బోని వాడనె – నృపాలక – మానవులెన్న దమ్మునూ
హింపరు – దైవయోగముల నించుక గానరు – తోచినట్లు ని
ష్కంపగతిం జరింతు రది కాదన వచ్చునె – ఈశ్వరేచ్ఛ ద
ప్పింపగ రాదునీ పగతు బిడ్డల దెచ్చుద బోయి వచ్చెదన్

చూడండి. ఇందులో ఎంత గంభీరమైన భావమిమిడి ఉన్నదో. భగవత్సంకల్పమే సర్వమూ, మంచి అయినా చెడ్డ అయినా అంతా ఆయన ప్రణాళికే. అందుకే నీకీ దుర్బుద్ధి పుట్టింది. బహుశా ఇది ఒక నెపంగా నీకు ధనుర్యాగంలోనే ఆయువు మూడి ఉంటుందాయన చేతిలో. అది ఈశ్వరేచ్ఛే అయినప్పుడలాగే కానీ. దానిని తప్పించటానికి మనమెవరం. ఆ ఈశ్వర సంకల్పానికి నేనూ ఒక సహకారినైతే అంతకన్నా కావలసిందేముంది. తప్పక అలాగే నడచుకొంటాను.

భక్తుడెప్పుడూ స్వతంత్రుడు కాడు. సర్వావస్థలలోనూ భగవదిచ్ఛానువర్తి అయి బ్రతుకు సాగిస్తుంటాడు. అది మంచి ఇది చెడ్డ అని చూడడు. చెడ్డ అయినా భగవదిచ్ఛ అయితే అది మంచే అతని పాలిటికి.కనుక ఏది ఎప్పుడెలా జరుగుతున్నా ఎదురాడరాదు. **"న ద్వేష్టి సంప్రవృత్తాని"** అన్నట్టు దాని ననుసరిస్తూ పోవటమే భగవత్కైంకర్యంగా భావిస్తాడు. ఇలాంటి సేవా బుద్ధితోనే బయలుదేరాడు అక్రూరుడు. నందగోకులం చేరాడు. చేరాడో లేదో ఇక కృష్ణ సందర్శనం తన కవశ్యంగా లభిస్తుంది గదా అని ఎంతో మురిసిపోతాడు. అంతేకాదు.

సూరులు దొల్లియే విభుని శోభిత పాద నఖ ప్రభావళిం
జేరి భవాంధకారముల జిక్కక దాటుదు - రట్టిదేవరన్
వైరము తోడనైన పిలువన్ ననుబంచి శుభంబుసేసె-ని
ష్కారణమైన ప్రేమనిదె కంసుని బోలు సఖుండు గల్గునే

అని తంతే పూల పానుపు మీద పడ్డట్టు కంసుడే ఉద్దేశంతో చేసినా అది తన పాలిటి కొక మహాభాగ్యమని ఆనందిస్తాడు. ఇంకా ఆయన కొక అద్భుతమైన ఆలోచన వస్తుంది. **"ఇతడా కంసుని చేత పంపు వడినన్ హింసింప నేతెంచినా - డతి దుష్టుండని చూచునో"** ఇంతకు పూర్వం పూతనాది రాక్షసులెందరో కంసుని చేత పంపబడి వచ్చి ఆయన చేత చంపబడ్డారు. అలాగే వీడు కూడాకంసుని దూతగా వస్తున్నాడు. నన్ను హింసటానికేమో నని నన్ను కూడా రూపుమాపడు గదా ఆ పరమాత్మ అని సందేహించి మరలా వెంటనే **"సకల భూతాంతర్బ హిర్మధ్య సంగతుడౌటం దలపోసి నన్ను సుజనుంగా జూచునో"** అయినా నాకెందుకీ భయం - ఆయన పరమాత్మ గదా - సకల భూతాంతర్యామి అయిన ఆ మహాత్ముడికి నా అంతరంగమెలాంటిదో తెలియదా అని ధైర్యం తెచ్చుకొంటాడు. ఇందులో మొదటిది లౌకికమైన ఆలోచన. రెండవది భక్తుడికి కలిగే పరిశుద్ధ భావన. ఇది ఆ మొదటి దాన్ని త్రోసిరాజని ముందుకు వస్తుంది. సాధకుని ముందుకు నడుపుతుంది. కనుకనే,

మాపటి వేళ నేనుజని మాధవు పాద సమీప మందు దం
డాపతి తుండనైన - నతడా శుగకాల భుజంగ వేగ సం
తాపిత భక్తలోక భయ దారణమైన కరాబ్జమౌదలన్
మోపి హసించి నా కభయమున్ కృప తోడత నీయకుండునే

అని తనలో తానే సమాధానం చెప్పుకొంటాడా మహాభక్తుడు. దాసుని తప్పులు దండంతో సరి అన్నారు పెద్దలు. శత్రువునైనా శరణంటే మన్నించే పరమాత్మ పాత్రుడైనవాడు పాదపతితుడైతే ఉపేక్షిస్తాడా. ఆమెలకువ తెలిసిన వాడక్రూరుడు. కనుకనే అలాంటి పవిత్రమైన ఆలోచన కలిగిందా మనసుకు.

మనస్సును మించిన స్యదస్సుతో వెళ్లాడు ముందుకు. బృందావనం ప్రవేశించాడు. అక్కడ జలజాంకుశాది రేఖలుగల హరిపాదముల చొప్పు తిలకించాడు.

భక్తి భావంతో పులకించాడు. అనతి దూరంలో తన సర్వస్వమైన రామకృష్ణుల దివ్యమూర్తులను దర్శించాడు. అవశుడై పోయి వారి పాదములను స్పృశించాడు. వారాయనను కౌగలించుకొని బంధు మిత్రాదుల క్షేమమడిగి వచ్చిన కార్య మెఱిగింపుమంటారు. ధనుర్యాగ విషయం విన్నవిస్తా డక్రూరుడు. నిజమే అలాగే వెళ్లి చూడాలి తప్పదు గదా. పాలు పెరుగు నెయ్యి కట్నాలుగా కట్టి పెట్టండని హెచ్చరిస్తాడు గోపాలురను కృష్ణుడు. ఇంతలో గోపికలంతా అయ్యో అక్రూరుడు వచ్చి మన గోపాల కుమారుణ్ణి కొనిపోతున్నాడే అని గగ్గోలు పడతారు. అక్రూరుడని పేరు పెట్టుకొన్నాడే గాని నిజానికింత కన్నా క్రూరుడు లేడని ఆడిపోస్తారు. ఉఱుముఱిమి మంగలం మీద పడిందని చూడండి ఎలాటి నీలాపనింద వచ్చిందో ఆ మహాత్ముడికి. కంసుడి లాంటి క్రూరుడే ఆయన నక్రూరుడని అంతగా మెచ్చుకొంటే గోపికల లాంటి భక్తులే ఆయనను క్రూరుడని తిట్టి పోస్తున్నారు. ఆ భక్తుల చేతనే అక్రూరుడనిపించికొన్నవాడు పరమ భక్తులకు క్రూరుడెలా అయినాడు. ఇదే మానవుల దృష్టి భేదం. ఎవరి దృష్టితో వారు చూస్తారు భాగవతుణ్ణి. ఆ చూడటం కూడా తమ ప్రయోజనాన్ని బట్టే. తమకు పని బడితే దుర్మార్గులు కూడా మనకు సర్మార్గుడనే బిరుదు నిచ్చి పూజిస్తారు. తమ పనికి విఘాతం కలిగితే ఎంత సన్మార్గుడైనా వారి పాలిటికి దుర్మార్గుడు గానే కనిపిస్తాడు. ఇది కేవలం లోకుల దృష్టి మాత్రమే. అంత మాత్రాన ఒక సజ్జనుడు దుర్జనుడు కాడు. ఆయన సౌజన్యమెప్పుడూ సౌజన్యమే. అది లోకులకు తెలియదు. లోకేశ్వరుడైన పరమాత్మకే తెలిసిన తత్త్వం.

అందుకే తన్ను నిత్యమూ అంటి పట్టుకొన్న గోపికలను లెక్కచేయక వారి పట్టు విడిపించుకొని పయనమయినా డక్రూరుడితో. దారిలో యమునా నది తారసిల్లింది. దిగి స్నానాదులు గావించి రామసహితుడై కృష్ణుడు రథంలో వచ్చి కూచుంటాడు. అక్రూరుడు కూడా నదిలో దిగి మజ్జనం చేసి వేదమంత్రాలు జపిస్తూ అలా చూచేసరికి జలమధ్యంలో రామకృష్ణుల రూపాలు కనిపిస్తాయి. ఇదేమిటి వీరు రథంలో గదా వెళ్లి కూచున్నారు. ఈ జలంలో కెప్పుడు వచ్చారని తల పయికెత్తి చూచేసరికి మరలా రథంలో కనిపిస్తారు. ఆశ్చర్యపోయి ఇంతకూ జలంలోనా రథంలోనా అని మార్చి మార్చి చూడగానే ఇటూఅటూ కూడా ఏకకాలంలో గోచరిస్తారు. ఇది ఏదో దేవరహస్యం భేదించాలని మరలా శిరోదఘ్నంగా నీటిలో

మునిగి చూచేసరికందులో అజస్ర సహస్రఫణా మండల మండితుడైన ఆదిశేషుడూ, ఆశేషతల్పం మీద అనల్ప ప్రభాభాసురమైన పీతాంబరం ధరించి శిరస్సున కిరీటమూ, ఉరస్సున మహాలక్ష్మి కరార విందములలో శంఖచక్రాది దివ్యాయుధాలూ, పదార విందములలో దివ్యమణి నూపురాలూ దాల్చిన శ్రీమహావిష్ణువు దివ్యమంగళ రూపం సాక్షాత్కరిస్తుంది. అది చూచి తన జన్మ ధన్యమయిందని చెప్పిఆ పురాణ పురుషుని వేనోళ్ల పొగడుతా డక్రూరుడు. కలలం బోలెడి పుత్ర మిత్ర వనితా గారాదులన్నీ ఎండమావుల లాంటివి. అయినా వాటినే యధార్థమని నమ్మి ఇంత కాలమూ పరమార్థానికి దూరదూరంగానే ఉండిపోయాను. ఇది తత్త్వజ్ఞానమెలా అవుతుంది. కనుక తత్త్వమేదో దాన్ని తెలుసుకొనేందుకు నాకు నీ పాదయుగం చూపమని ప్రార్థిస్తాడు. పాదయుగమేదో గాదు. అది ఈ నామరూపాలే. వీటి ద్వారానే వీటి వెనకాల దాగి ఉన్న ఆ పరతత్త్వాన్ని అర్థం చేసుకోవాలి సాధకుడు. అది ఆ భగవదను గ్రహంవల్లనే సిద్ధించాలి. ఇదే భక్తుడి కాంక్ష.

అది కనిపెట్టిన పరమాత్మ వెంటనే తన రూపం మాపుచేసి ఎప్పటిలాగా రథంలో ఉన్నట్టు దర్శనమిస్తాడు. అక్రూరుడది చూచి రథాన్ని సమీపించగానే ఏమి టక్రూరా ! ఎంత సేపయింది నీవు నదిలోకి వెళ్లి, ఇంత తడవక్కడ ఏమి చేస్తున్నా వెక్కడా లేని చోద్యమేదైనా నీ కక్కడ కనిపించిందా అని ఏమీ తెలియనట్టు ప్రశ్నిస్తాడు. అప్పుడా మహాభక్తుడదంతా భగవన్మాయే నని అర్థం చేసుకొని మహాత్మా !

నీలోన లేని చోద్యము - లే లోకము నందు
జెప్పనీశ్వర నీటన్ నేలన్ -నింగిని నున్నవె

ఉన్న చోద్యాలన్నీ నీలోనే ఉన్నాయి పొమ్మంటాడు. భగవంతుని మర్మం భాగవతుడికే ఎఱుక - మరి ఎవరికీ గాదనేందుకీదే నిదర్శనం. తరువాత మధురా ప్రవేశమూ-కంస వధా జరుగుతాయి. అన్న కన్నులార చూచి అక్రూరుడు భగవదంకిత సర్వజీవనుడయి తన గృహంలోనే కాలక్షేపం చేస్తుంటాడు.

ఆ తరువాత కొంత కాలానికి మరలా అక్రూరుడి దగ్గరకు స్వయంగా వస్తాడు కృష్ణుడు. భక్తుడెక్కడ ఉన్నా ఉండవచ్చు. భక్తి భావమనేది నిశ్చలంగా ఉండాలే గాని భగవంతుడలాంటి భాగవతుడి కెప్పుడూ దూరం కాడు. వెతుక్కొంటూ వస్తాడక్కడికి.

ఉద్ధవుడితో కలిసి వచ్చాడు. ఉద్ధవుడూ తనలాంటి ఒక మహాభక్తుడే. రాగానే ఉద్ధవుణ్ణి గాఢంగా కౌగిలిస్తాడక్రూరుడు. భక్తి అనే సూత్రమెంత గాఢమయిందో అది సజాతీయాన్ని సజాతీయంతో కలపటంలో ఎనలేని పటిమ గలది. తన ఇష్టదైవతం పాదాలు తొడలమీదే ఇడుకొన్నా డక్రూరుడు. ఆయన పరతత్త్వ ప్రభావమూ, అవతార ప్రయోజనమూ, నానావిధాల స్తోత్రం చేస్తాడు. **"ఏ పుణ్యాతిశయ ప్రభావముననో ఈ జన్మ మందిక్కడన్ నీ పాదంబులు గంటిని - నా భవ బంధాలు పాప"**మని ప్రార్థిస్తాడు. సరేనని సర్ది చెబుతూనే ఆయనకు సంసార మోహాన్ని కీలు కొలుపుతూ ఆ పరమాత్మ ఆయన కొక ఉద్యోగాన్ని అప్పగిస్తాడు. అక్రూరా నీవు గుణవంతుడవు, పరమ భాగవతుడవు, విగ్రహారాధనలు, తీర్థాటనాదులు, చేసే వారికన్నా మత్పద భక్తులైన మీబోటి వారు చాలా గొప్పవారు. అలాంటి నీకొక పని అప్పగిస్తున్నాను. అది ఏమంటే పాండవులు మనకు బంధువులు. చాలా కావలసిన వారు. వారు తమ తండ్రిని కోలుపోయి హస్తినాపురానికి వచ్చి ఉన్నారు. వారి పెద్ద తండ్రి ధృతరాష్ట్రుడు వారి నంత ప్రేమగా చూడటంలేదు. కాబట్టి నీవు నా తరఫున పోయి ధృతరాష్ట్రుడికి నా మాటగా బుద్ధి చెప్పి వారిని చక్కగా చూచేలాగా చేసి రమ్మని రాయబారిగా పంపుతాడు.

చూడండి. ఇది ఎంత చిత్రమైన కథో. అక్రూరుడెవరు. పాండవులెవరు. వారి దగ్గర కితడు రాయబారిగా వెళ్లటమేమిటి. భారత పాత్రలు పాండవులు. భాగవత పాత్ర అక్రూరుడు. ఒకరికొకరికి సంబంధమే లేదే. బట్ట తలలకు మోకాళ్లకు ముడిపెట్టి నట్టున్నదిది. ఇదే మహర్షి కథా కల్పనా పాటవం. ముందే మనవి చేశాను. ఒకానొక సత్యాన్ని చాటటానికి సంకేతమే కథలని. అలాంటి సత్యాన్నే చాటుతున్నదిది. ఏమిటా సత్యం. భారతంలో సంజయుడి రాయబారమని ఒకటున్నది. అది కౌరవుల దగ్గరి నుంచి పాండవుల దగ్గరకు నడచిన రాయబారం ధృతరాష్ట్రుడు తమ్ముని కొడుకులకు రాజ్య భాగమివ్వదలచుకోలేదు. దుర్యోధనుని కంటే దుర్మార్గుడు ధృతరాష్ట్రుడు. అతడు పలువ అయితే ఇతడు సాధు పలువ. తీయని మాటలు చెప్పి ప్రాణాలు తీసే యత్నమది. దానికి తగినవాడినే ఎన్నుకొన్నాడు రాయబారిగా. వాడే సంజయుడా ముసలాయనకు నమ్మిన బంటు. ప్రజ్ఞాచక్షుని మించిన అఖండ ప్రజ్ఞాశాలి. నెత్తురు కూడు తినేదానికన్నా అయిదుగురూ కలిసి బిచ్చమెత్తుకొని బ్రతకటమే మీ నడవడికి తగిన పనిఅని నిండు సభలో ధర్మజునికి సలహా ఇచ్చేటంత సాహసి అతడు.

అలాటి ఛద్మరూపమైన దౌత్యమేదో చూచాము భారతంలో. అది ఛద్మ స్వభావులైన భారత వీరులకు తగినట్టే సాగిందక్కడ. అదే సాధు స్వభావుడైన ఒక భాగవతుడి ద్వారా నడిస్తే ఎలా ఉంటుందో చూపదలచా డిక్కడ మహాముని. అది క్రూర స్వభావుడిదైతే ఇది అక్రూర స్వభావుడిదీ రాయబారం. సాధుపలవ ఎలా మాటాడుతాడో తెలుసుకోవలసి ఉంది. ఇందులో స్వార్థం లేదు. ఛద్మం లేదు. కేవల లోకహితమే ప్రయోజనం. భగవానుడి ఉద్యమమే అది. భగవద్ధత్తాధికారులైన లోక సంగ్రహ పరాయణులది కూడా అదే. ఏతదర్థ నిరూపణార్థమే ఈ సన్నివేశం.

అక్రూరుడు మహా ప్రసాదమని కృష్ణుని వీడ్కొని కరిపురాని కరిగి ధృతరాష్ట్రాదులనూ, కుంతీ విదుర సమేతులైన పాండవేయులనూ ఇరువాగుల వారినీ కలుసుకొంటాడు. కొన్ని రోజు లేదీ బయట పెట్టకుండా అలాగే ఉండిపోతాడు. కుంతి తమ పుట్టింటి వారి క్షేమ సమాచారాలన్నీ అడుగుతుంది. తన బిడ్డలకు కలిగిన ఆపదలన్నీ వలపోసుకొని బాధపడుతుంది. వారి ఆపదలను పాపటానికి కృష్ణుడిప్పటికైనా సంసిద్ధుడేనా అని ప్రశ్నిస్తుంది. అక్రూరుడు విదురునితో కలిసి ఆమె నోదార్చిన తరువాత ధృతరాష్ట్రుని కొలువు కూటంలో దర్శిస్తాడు. నలుగురూ వినేలాగా కొలువులో అత్యద్భుతంగా ఉపన్యసిస్తాడు. అది సంజయునిదీ గాదు. కృష్ణునిదీ గాదు. అక్రూరుని ఉపన్యాసమది. ఒక మహాభక్తుడూ విరక్తుడూ అయినవాడు కేవల లోకహితం కోరి ఎలా ధాటిగా నిర్మొగమాటంగా చెబుతాడో అలా చెప్పాడు. ఈ రాజ్య ధనాదులు శాశ్వతమని భ్రాంతి పడుతున్నావు ధృతరాష్ట్రా. మీన జీవనభూత మిళిత జలమిది. ఒక చేప మ్రింగి క్రక్కిన జలమింకొక చేప మ్రింగుతుంది. అదీ క్రక్కవలసిందే మరలా. కాబట్టి.

నిందం బొందకు మయ్య ఈ తనువు తానిద్రా కళా దృష్టమౌ
సందోహంబు విధంబు – నిల్వదు సుమీ – జాత్యంధతం బొందియున్
మందప్రజ్ఞతనేల చేసెదవు సమ్యగ్ జ్ఞాన చక్షుండవై
సందేహింపక యిమ్ము పాండవులకున్ సర్వం సహా భాగమున్

అని తెగవేసి ముక్తసరిగా ఉన్న సత్యాన్ని బోధిస్తాడు. శారీరకంగా వచ్చిన గ్రుడ్డితనాన్ని ఏమీ చేయలేకపోవచ్చు. కానీ మానసికంగానైనా గ్రుడ్డి వాడనుకాదని

నిరూపించుకోరాదా అని ఎంత నాజూకుగా మందలిస్తాడో చూడండి ఆ మహనీయుడు. దాని కా ముదుసలి నీ మాట మంచిది, నిశ్చయంబని మెచ్చుకోక తప్పింది గాదు. అయినా ధృతరాష్ట్రుడు ధృతరాష్ట్రుడే గదా. నాదేముంది అంతా ఈశ్వరేచ్ఛ అది ఎలా ఉంటే అలాగే జరుగుతుందని లౌక్యం ప్రదర్శించబోతాడు. లోకోత్తరుడైన మహాభక్తుడి దగ్గరనా ఈ లౌక్యం. దాని కక్రూరుడిచ్చిన జవాబు చూడండి. నీ తలంపు గనుంగొంటి. నీ కిష్టంబగునట్లు వర్తింపుము. అంటే నీ తలంపే దుష్టమైనది. దానికి తగినట్టే నీ ప్రవర్తన. మరి ఆ ప్రవర్తనకు తగిన ఫలితమే చవి చూడబోతావు చివరకని హెచ్చరిక. ఈ హెచ్చరిక చేసి ఇక ఇతనికి చెప్పుట మనవసరమనుకొన్నాడో ఏమో. వెంటనే మధురకు బయలుదేరుతాడు. ఇదీ అక్రూరుని భాగవత సేవ.

పోతే ఈ జంటలో రెండవవా డుద్ధవుడు. ఇతడూ యదువంశోద్భవుడే. వయో వృద్ధుడే. కృష్ణుని కితడు స్నేహితుడూ, అమాత్యుడూ, ఆచార్యుడూ, చివరకు శిష్యుడూ కూడా. ఇన్ని భూమికలలోసేవించాడా పరమాత్మను. ఉద్ధవం, ఉత్సవం ఇవి రెండూ పర్యాయపదాలు. పండుగ అని శబ్దార్థం. భగవంతుడి సాహచర్యమే అతని కొక పండుగ. ఒక విందు భోజనం. అది తప్ప అన్యమెఱుగని వాడు. ఎఱిగినా అంతకన్నా మెఱుగసని వాడు. మరి తన స్వామిచేతనే తాను సిద్ధవిచారుడనీ, గభీరుడనీ, వృద్ధవచో వర్ణనీయుడనీ వృష్ణిప్రవరుడనీ, బుద్ధినిధి అనీ, అమర గురుసముడనీ, ఎంతగానో ప్రశంసలందుకొన్న మహనీయుడాయన. కనుకనే ఏదైనా తన కాంతరంగిక కార్యముంటే అది అక్రూరుని లాగానే ఉద్ధవుడికే అప్పగిస్తుంటాడా పరమాత్మ.

రమ్మా యుద్ధవ గోపకామినులు నారాకల్ నిరీక్షించుచున్
సమ్మోహంబున నన్నియున్ మఱచి యే చందంబునం గుందిరో
తమ్మున్ నమ్మిన వారి దిగ్గ విడువన్ ధర్మంబు గాదంద్రు - వే
పొమ్మా ప్రాణములే క్రియన్ నిలిపిరో ప్రోద్యద్వియోగాగ్నులన్

అని అక్రూరుణ్ణి పంపినట్టే రాయబారం పంపుతాడు గోపికల వద్దకు. అయితే అక్రూరుడాయనను మధురకు తీసుకుపోవటానికైతే - ఉద్ధవుడాయన రాక తెలపటానికి.

ఇదంతా ఒక నటన పరమాత్మకు. నిజానికిది తన కోసం కాదు. భక్తుల కోసం. ఒక భక్తుడి చిత్తవృత్తి ఎట్టిదో మరొక భక్తుడు గ్రహించాలి. తనదే కాదు భక్తి అంటే. అంతకు మించిన భక్తి మరొకరికి కూడా ఉండవచ్చు లోకంలో. అది స్వయంగా పోయి కనులారా చూస్తే చెవులారా వింటే తన మనసులో దాగి ఉన్న గర్వగ్రంథి విరిసిపోగలదు. నిరహంకారమైన భక్తే నిజానికి భక్తి. అంతేకాదు. తన సమక్షంలోనే కాదు. పరోక్షంలో కూడా భక్తి నిలవాలి మానవులకు. అదే నిజమైన దీక్ష. అది నీకు నిజంగా ఉందోలేదో మరొకరిని చూచి అయినా తెలుసుకోమని భగవానుడు చేసే పరీక్ష అయినా కావచ్చు. అంతేకాదు. ఒక చోట కూచొని నా మూర్తిని దర్శిస్తూ నన్ను స్మరించటమే గాదు. నా మూర్తినందరిలో దర్శిస్తూ నా పనులు చేసి పెడుతూ, తద్ద్వారా నా లోకహితచర్య నీవూ కొంత పంచుకొని చేసినప్పుడే అది భాగవత భక్తి ప్రచారమని కూడా కావచ్చు. ఇన్ని మార్మికమైన అంతరార్థాలున్నా యిందులో. ఈ దృష్టితోనే ఇలాంటికార్యాలీ మహాభాగవతుల కప్పుడప్పుడూ పురమా యిస్తుంటాడు పరమాత్మ. వీరిరువురకే పురమాయించాడంటే ఆయనకు వీరెంత సన్నిహితులో చెప్పమని లేదు. ఉద్ధవుణ్ణి పంపేటపుడు పైగా ఒక మాట అంటాడు. **"లౌకిక మొల్లక నన్నా - లోకించు ప్రపన్నులకును లోబడి కరుణా లోకనముల బోషింతును. నాకాశ్రిత రక్షణములు నైసర్గికముల్"** ఇది ఎంతో సాభిప్రాయమైన మాట. లౌకిక విషయవాగురలో తగలుకొనక అలౌకికమైన తన భావాన్ని అంటి పట్టుకొన్న వారినెప్పుడూ తాను తప్పజూడడట. వారిని రక్షించటమే తనకు నైజమట. ఇది గోపికలకు చెప్పమని ఉద్ధవుడితో అన్నాడంటే ఉద్ధవుడి విషయంలోనూ అది వర్తిస్తుందనే గదా భావం. అందుకే మందహాసం చేస్తూ ఆయనను సాగనంపుతాడు. ఈ మందహాసమే కొంపదీసే మందహసం. దీని సంగతి తరువాత మనవి చేస్తాను.

సరే. ఉద్ధవుడు బయలుదేరుతాడు. నంద గోకులానికి పోయి నందాదులను కలుసుకొంటాడు. ఆ పుణ్యాత్ముని కౌగిలించుకొని నందాభీరు డానందియై మాపాలింటికా కృష్ణుడీతడనుచున్ మన్నించి పూజించాడట. చూడండి. ఇక్కడ ఒక విశేషం గమనించాలి మనం. అక్రూరుడి కంటే ఉద్ధవుడి స్థాయి ఇంకా ఒక మెట్టెక్కువగా కనిపిస్తున్నది. అక్రూరుడాయన విరాడ్రూపాన్ని దర్శించగలిగాడంత వరకే. ఈయన అలాగాదు. ఆ రూపాన్నే తన రూపంగా భావించగలిగిన పరమ

భక్తుడు. అందుకేనేమో ఆయనను చూచేసరికి కృష్ణుడే తమ దగ్గరికి నడచి వచ్చినట్లనిపించింది నందాదులకు. అంతేకాదు. తరువాత గోపికలు కూడా ఆయన ఎక్కడో ఒక ఏకాంత ప్రదేశంలో ధ్యాన నిమీలిత లోచనుడై కూచొని ఉంటే పారజూచి

రాజీవాక్షుడు సుందరాస్యుడు మహోరస్కుండు – పీతాంబరుం
దాజానుస్థిత బాహుడంబురుహ మాలా లంకృతు డుల్లస
ద్రాజత్కుండలు డొక్క వీరు డిచటన్ రాజిల్లుచున్నాడు మా

రాజీవాక్షుని భంగినని భ్రాంతి పడతారు. సగుణభక్తిలో ఇది సారూప్యమనే భక్తి భూమిక. భగవద్రూపమే సంక్రమిస్తుంది భాగవతుడికి. అంతకన్నా స్పృహణీయమైనదేముంది.

ఉద్ధవుడికిలాటి భగవద్రూపమే గాదు. భగవత్తత్త్వ విషయమైన జ్ఞానం కూడా ఉంది.

బలుడుం గృష్ణుడు మర్త్యులే – వసుమతీ భావంబు వారింప
వారల రూపంబున బుట్టినాడు హరి

అని చెబుతాడు గోపకులకు. అంతేకాదు. ఆ నారాయణుడఖిలాత్ముడు అఖిల భూతములతో ఇంధన జ్యోతిలాగా మెలగుతున్న తత్త్వమది. దానికి జననీ జనకదార సఖిపుత్ర బాంధవ శత్రుప్రియా ప్రియజనులంటూ ఎవ్వరూ లేరు. ఆయనకు జన్మ కర్మములును జన్మంబులును లేవు. గుణ విరహితుడయ్యు గుణవంతుడయి సర్వరక్షణ వినాశకేళి సలుపుతున్నాడా మహానుభావుడు. అలాంటి పరతత్త్వాన్ని చింతించు పరమభక్తుడు కూడా **"అలఘు శ్రేయము బొందు బ్రహ్మమయుడై నిత్యుడై"** అని భక్తి మార్గ నిర్గళిత రహస్యాన్ని కూడా బయటపెడతాడందరికీ.

అయితే ఉద్ధవుని ఇంత భాగవత దీక్షా పని చేయలేదా గోపకాంతల దగ్గర. వారు తమ్ము మోసగించిన ధూర్తగోపాలునే గాక ఆ ధూర్తునికి దూతగా వచ్చాడని చెప్పి ఇతణ్ణి కూడా ధూర్తుడుగానే భావించి ఉపాలంభించసాగారు. అక్రూరుడిలాగానే ఉద్ధవుణ్ణి కూడా అనరాని మాటాలంటారు. **"భ్రమరాదుర్జన మిత్ర"** ఆ కృష్ణుడు దుర్జనుడైతే ఆయన మిత్రుడవు నీవు ఇద్దరూ భ్రమర స్వభావులే. కృష్ణుడు మంచివాడని మాకెందుకు ఘోషపెడతావు. మరెవరి దగ్గరైనా ఏ కరువు పెట్టు నీకింత తిండి

పెడతారు. ఇదంతా ఉపాలంభం కాదు. కేవలమూ కృష్ణ విప్రలంభ జనిత తృష్ణాతిరేక ప్రేమాతిశయ విజృంభమే. అర్థమయింది ఉద్ధవుడికి-అనురాగం శ్రుతి మించితే భక్తుడి మనస్తత్త్వమలాగే ఉంటుందని. ఆ వాలు గంటుల భక్తిముందు తన భక్తి కూడా చాలదని భావించాడు.

జపదాన వ్రతహోమ సంయమ తపః స్వాధ్యాయ ముఖ్యంబులన్
నిపుణుల్ గోరియునే విభున్ మనములో నిల్పంగలే - రట్టి స
ద్విపులా కారునిపై మహా మహిము పై విశ్వేశుపై మీ కజ
ప్ర పటు ధ్యానము లిట్లు నిల్చునె భవ చ్చారిత్రముల్ చిత్రముల్

అని వారినెంతగానో కీర్తిస్తాడు. నిపుణులనే మాటలో ఎంతైనా అర్థముంది. పండితులకు పాండిత్య గర్వ విక్షేపాదు లడ్డు తగులుతాయి భక్తి మార్గంలో. అందుకే వారికంత గట్టిగా నిలవదది. పామరులకలాటి విక్షేపాదులుండవు కాబట్టి గట్టిగా నిలుస్తుందని భావం. కృష్ణమూర్తి తప్పక మిమ్ము అచిరకాలంలోనే కలుసుకొంటాడు. మిమ్ము తలకవలదని నాచేత చెప్పి పంపాడని చెప్పి వారి ననునయిస్తాడు. వారి మధురభక్తి జనిత విధుర వచనాల నాలకిస్తూ కొన్ని మాసాలా వ్రజపురంలో గడపి తరువాత ప్రవ్రజితుడై మధురకే పయనమై వస్తాడు. కృష్ణుడికి వారి ప్రతిసందేశం వినిపిస్తాడు.

అక్రూరుడిలాగానే ఉద్ధవుడు కూడా యాదవకుల శ్రేష్ఠుడూ, విద్యా వరిష్ఠుడూ గుణ గణజ్యేష్ఠుడే సందేహం లేదు. ఇరువురూ భగవద్భక్తి సాగరంలో కంఠదఘ్నంగా మునిగిన వారే అనుమానం లేదు. అయినా విద్యావతులుకాని గొపికల నిసర్గ మధురమైన భక్తి భావమెంత నిర్వ్యాజమో ఎంత గాఢమో తెలుపదలచాడు వారికా ఈశ్వరుడు. భక్తిలోని గాఢత్వాని కొక్కటే నిదర్శనమది భగవద్వియోగా సహిష్ణుత. తన్నిమిత్తంగా సాగే నిష్ఠురోక్తులూ. ఇది మనకు గోపికల పట్టుననే కనిపిస్తుంది. మరి ఎక్కడా కనుపట్టదు. వారు కృష్ణ వియోగమొక్క క్షణకాలం సహించరు. అక్రూరోద్ధవుల నాడి పోసుకొన్న దందులకే. కడకు తమ ప్రాణనాథుడైన కృష్ణుణ్ణి కూడా నిష్కరా లాడేందుకు వెనుదీయలేదా సుందరులు. వారి ప్రగాఢమైన భక్తి ఎలాంటిదో ప్రౌఢులైన ఉద్ధవాదులు కూడా గ్రహించాలనే పరమాత్మ వారికలాటి సుకుమారమైన రాయబారం అప్పగించటం.

ఉద్ధవుడు మరలా మనకు కృష్ణుడు రాజసూయ యాగానికి బయలుదేరే ముందు కనిపిస్తాడు. రాజసూయానికి వెళ్లటమా, మానటమా, అని తేల్చి చెప్పమని ఉద్ధవుని అడుగుతాడు కృష్ణుడు. పైగా **"అనఘ చారిత్ర నీవు మా అక్షి యుగము వంటివాడవు. మనకు నవశ్యమగుచు జేయదగినట్టి కార్యంబు జెప్పు"**మని తనకు తెలిసినా ఆ భక్తుడికి మర్యాద ఇచ్చి మాటాడుతాడు. ఇది మర్యాద ఇవ్వటమయినా కావచ్చు. ఆయన భక్తి మర్యాద ఎంతటిదో పరీక్షించటమైనా కావచ్చు. ఆ భక్తుడెప్పుడో గమనించాడా మాటలలోని మర్మం. అతని పాదాంబు జంబులు మనంబున నిడుకొని వృద్ధాను మతంబుగా నాయెఱింగిన తెఱంగు విన్నవించెదనంటాడు. ఆ తెఱగత డెఱిగిస్తే అక్కడ ఉన్న యాదవులు సదస్యులు నారదుడు అందరూ ఆయన నభినందిస్తారట. అలా తన భక్తుణ్ణి నలుగురూ అభినందించాలనే అప్పటికా నంద నందనుడి ఆశయం.

మరలా ఇక ఉద్ధవుడు మనకు సకల యదువంశ సంక్షయమైన తరువాతగాని కనిపించడు. అదే ఇక ఆఖరుసారి కనిపించటం. యుగక్షయమయి పోతున్నదిక నీవూ మాకు దూరమవుతున్నావు. నీదాసులమైన మాకేదైనా తరుణోపాయం ప్రసాదించి పొమ్మని ప్రాధేయపడతా డుద్ధవుడు. దానికి నందాత్మజుడానందించి ఆయన కెవరికీ చెప్పని జ్ఞానయోగ రహస్యాలన్నీ సోదాహరణంగా వర్ణించి చెప్పి చివరకు.

గచ్ఛోద్ధవ మయా దిష్టో – బదర్యాఖ్యమ్ మమాశ్రమమ్
తత్ర మత్పాద తీర్థోదే – స్నానో పస్పర్శనైశ్శుచిః
ఈక్షయాలక నందాయా విధూతా శేష కల్మషః
వసానోవల్క లాన్యంగ వన్యభుక్సుఖనిస్పృహః
తితిక్షుర్ద్వంద్వ మాత్రాణాం – సుశీల స్సంయ తేంద్రియః
శాంతస్సమాహి తధియా – జ్ఞాన విజ్ఞాన సంయుతః
మయాను శిక్షితం యత్తే – వివిక్త మను భావయన్
మయ్యా వేశిత వాక్చిత్తో – మద్ధర్మ నిరతో భవన్
అతిక్రమ్య గతీస్తిస్రో – మామేష్యసి తతః పరమ్

అని శేషజీవితం ఎలా గడపాలో ఉపదేశించి - అలా గడిపితే అవసానంలో తన అనుగ్రహం ఎప్పటికీ ఉంటుందని హామీ ఇచ్చి సాగనంపుతాడు. అలాగే తన జీవిత శేషం బదరికాశ్రమంలో చరితార్థం చేసుకొని ఆ పరమ భాగవతుడు

యథో పదిష్టాం జగదేక బంధునా- తపస్సమాస్థాయ హరేరగాద్గతిమ్

ఇదీ ఉద్ధవుడి భాగవత చరిత్ర. ఉద్ధవుడి చరిత్ర హరివంశంలో లేదు. అక్రూరుడి వృత్తాంతముంది గాని అతని దౌత్య వ్యవహారం కానరాదు.

మొత్తం మీద కుంతి దగ్గరి నుంచీ ఉద్ధవునిదాకా సగుణభక్తి అనేది ఏమిటో ఎలాంటిదో ఏ కరువు పెడుతూ వచ్చాము ఇందులో ఎన్నో భూమికలూ ఎంతో వ్యవహారముంది. అది కూడా ఆయా వ్యక్తుల చిత్త వృత్తులనూ భక్తిలో వారికుండే మందమధ్య తీవ్ర తీవ్రతరాది వేగాలనూ బట్టి నానావిధాలుగా మనకు దర్శనమిస్తుంది. అయితే ఎంత తీవ్రాతి తీవ్రమైనా ఇది సగుణమే ననే మాట మనం మరచిపోరాదు. కడకు అక్రూరోద్ధవులది కూడా సగుణమే. పరమాత్మ వారికెంత సన్నిహితుడైనా కావచ్చు. ఎన్ని శాస్త్ర రహస్యాలైనా బోధించి ఉండవచ్చు. సంసార తారణమే వాటన్నిటికీ ప్రయోజనమే కావచ్చు. అయినా అది సగుణసీమ దాటిపోదు. కృష్ణ సందర్శనమే వారి ధ్యేయం. ఆయనతో సహా శయ్యా సనాది సుఖమే వారు కోరుకొనేది. ఆయన తోడి క్షణకాల విరహంకూడా వారికి సహస్ర యుగోపమం. గోపికలే కారు ఉద్ధవాదులే కారు. అందరికీ అదే పిచ్చి. అది భక్తిలో ఒక భూమికేగాని భక్తి సర్వస్వం కాదని తెలుసు పరమాత్మకు. అందుకే వారితో ఉన్నట్టే ఉండి అదృశ్యమవుతాడు. వారి నాదరించినట్టే ఆదరించి ఒకమందస్మితం చేసివారిని మరలా మాయలో పడదోస్తాడు. ఈ మందహాసమే మహామోసం. నవ్వు రాజిల్లెడు మోమువాడన్నట్టు ఇది ఒక అంతుపట్టని గుణం. ఈ గుణజాలమొక ఇంద్రజాలం మాదిరందరి మీదా ప్రయోగించి వారి మనో విహంగమాల నాజాలంలో బందీ చేయటంలో అందె వేసిన చేయి ఆయనది. ఇది తెలుసుకోలేక వారాయన మనవాడే గదా అని ఏమోమో కోరుతారు. ఇస్తాడని ఆశపడతారు. ఇవ్వడూ. చేయడు. ఇచ్చినట్టు కనిపిస్తాడంతే. కనుకనే గోపికలను కలుసుకొంటానని చెప్పి మరలా కన్నెత్తి చూడలేదు. అక్రూరుని వీడ్కొలిపి మరలా ఆలోచించలేదాతని సంగతి. ఒక్క ఉద్ధవునికే ఏదో చెప్పినట్టు కనిపిస్తాడు. అది కూడా సగుణభావన ఉన్నంతవరకూ పనిచేయదు. అపేక్షితమైన

మోక్షఫల మందీయదు. కాబట్టి జీవిత శేషమంతా అంతవరకూ పట్టుకొన్న గుణ చింతనకు స్వస్తి చెప్పి తత్పరిపాక రూపమైన జ్ఞాన విజ్ఞానాల నాలంబనం చేసుకొని తరించమని చివరకు బోధ చేస్తాడు. ఇంతకూ కేవల సగుణ దృష్టి ఉన్నంత వరకూ త్రిగుణాత్మక సృష్టి నుంచి ముక్తిలేదు భక్తుడికి. అది ప్రకృతి గుణాలే కావచ్చు. భగవద్గుణాలే కావచ్చు. గుణాలు గుణాలే. అవి అపరిచ్ఛిన్నమైన తత్త్వాన్ని పరిచ్ఛిన్నం చేసి చూపుతాయి. అలా చూపటంవల్లనే కడపటిదాకా కృష్ణుని దివ్యసుందర విగ్రహాన్నే చూస్తూ ఆయన మధురమైన మాటలే వింటూ, ఆయన గారి లీలలే తలకిస్తూ, పరవశులై బ్రతుకులు సాగిస్తూ పోతే చాలు. అదే పరమపద ప్రాపకమని నమ్ముతూ వచ్చారా గోప గోపికాదులంతా. అక్రూరాదులూ అలాగే విశ్వసించారు. అది ఎప్పటికైనా తుప్పు రాలినట్టు రాలిపోతే తప్ప అసలైన భగవత్తత్త్వాన్ని మీరు పట్టుకోలేరని బోధించటానికే భగవానుడు చివరకు వారందరినీ ఎక్కడి వారి నక్కడ దూరంగా సాగనంపి తాను కూడా వారికి దూరమై పోతాడు. ఆయన అలా భౌతికంగా దూరమై పోవటంలో ఇదీ పరమార్థం. అలా ఆయన దూరమైనప్పుడే అర్జునాది పాండవులు గానీ, అక్రూరాది యాదవులుగానీ, అందులోని అంతరార్థాన్ని గ్రహించి బాగుపడగలిగారు.



Brahmasri Yallamraju Srinivasa Rao
www.saitavenapalli.org

11. సగుణ నిర్గుణ సంధి - గజేంద్రుడు

మనమింత వరకూ భాగవతంలోని సగుణభక్తిని గురించీ - ఆ మార్గంలో పయనించిన ఆయా భాగవతుల జీవితాలను గూర్చీ చర్చించాము. పోతే ప్రస్తుతం క్రమప్రాప్తంగా మనమింక ఆఖరుదైన నిర్గుణభక్తిని గూర్చి చర్చించవలసి ఉంది. నిర్గుణభక్తి అన్నా, పరాభక్తి అన్నా, జ్ఞాననిష్ఠ అన్నా, అన్నీ ఒకే అర్థాన్ని చెప్పే మాటలు. ఇది మోక్షసాధన మార్గంలో ఆఖరి భూమిక. దీని తరువాత సాధన అంటూ ఏదీలేదు. ఇకసిద్ధే. అది మోక్షమే. ఈ మోక్షం కోసమే పరీక్షిత్తు తాపత్రయం. అది ఎలా లభిస్తుందో సెలవీయమనే శుకమహర్షి నాయనప్రాధేయపడింది. దాన్ని ఆయన కుపదేశించటానికే బ్రహ్మరాతుడైన శుకుడాయనకీ భాగవతాన్నంతా ఏ కరువు పెట్టింది. అంచేత భాగవత తాత్పర్య మీ నిర్గుణ భక్తి ప్రతిపాదనమే. కనుకనే ఇది కట్టకడపటి దశ. మిగతా కర్మ యోగాదులన్నీ దీనికి పూర్వదశలు. ఒక్కసారిగా దీనికి నోచుకోలేని మానవులాయా భూమికలలో ప్రయత్నం సాగిస్తూ వస్తే వాటన్నిటి ఫలితంగా ఇది చేతికి చిక్కుతుంది. కాబట్టి పూర్వ పూర్వం ఉత్తరోత్తరానికి పూరకం.

అందులో మొదటి కక్ష్య కర్మయోగం. అది సాధకుడికి చిత్తశుద్ధిని ప్రసాదిస్తుంది. రెండవ కక్ష్య సమాధి. అది వాసనా క్షయం ద్వారా ఏకాగ్రతను ఆపాదిస్తుంది. మూడవది సగుణభక్తి. అది ఒక ఆలంబనాన్ని సమకూరుస్తుంది. పోతే ఆలాలంబనాన్ని కూడా వదిలేసిన నాలుగవ కక్ష్య ఇది. ఆలంబనమంటే భగవతత్త్వాన్ని ఏదో ఒక రూపంలో గుణంలో పట్టుకోటం. అలా పట్టుకొంటూ వచ్చినవారే గోపికలూ అక్రూరుడూ ఉద్ధవుడూ ఇలాటి భాగవతులంతా. అవ్యక్తమైన తత్త్వాన్ని వ్యక్తమైన రూపంలో చూస్తూ పోయారు వారు. అయితే అది అసలైన తత్త్వం కాదు. అందుకే **"అవ్యక్తమ్ వ్యక్తి మాపన్నమ్-మన్యంతే మామ బుద్ధయః"** అని వారినందరినీ అల్పమేధనులని అంత మెచ్చడు పరమాత్మ. అయితే మరి ఎవరు సుమేధనులని అడిగితే **"పరమ్ భావమజానంతో మమా వ్యయ మనుత్తమమ్"** అవ్యయమూ అనుత్తమమూ అయిన నా పరతత్త్వాన్ని దర్శించినవాడే పరమ భాగవతుడని

భంగ్యంతరంగా చాటుతాడు.అవ్యయమూ అనుత్తమ మంటే అప్పటికి నిరాకారమూ సర్వవ్యాపకమూ సర్వానన్యమైన శుద్ధ చైతన్యమే. అది భాగవతుని స్వరూపమే. తన స్వరూపమే సర్వత్రా పరచుకొన్నట్టు చూడగలగాలి సాధకుడు. అలా చూస్తే అది కర్మగాదు. సమాధిగాదు. భక్తిగాదు. పరాభక్తి లేదా జ్ఞానయోగం.

ఇలాంటి జ్ఞానయోగులైన మహాత్ముల చరిత్రను భాగవతమెక్కడ ఎలా ప్రతిపాదించిందో ప్రస్తుతం మనం సూక్ష్మేక్షికతో పరిశీలించవలసి ఉంది. ప్రతి భూమికకూ కొందరు భాగవతుల వృత్తాంతాన్ని మన ముదాహరిస్తూ వచ్చాము. అలాగే ఈ జ్ఞాన భూమికకు కూడా ఉదాహరణ భూతమైన ఉదంతమీయవలసి ఉంది. అలాంటిఉదాహరణప్రాయమైన జీవితాలొకటి ప్రహ్లాదుడిదీ మరొకటి కుచేలుడిదీ. వారు పుట్టగానే సమ్యగ్ జ్ఞాన సంపన్నులైన మహానుభావులు. కాని అలా జన్మతః గాక జీవిత మధ్యంలో జ్ఞానులైన వారూ లేకపోలేదు. అలాంటి వారు పూర్వజన్మలో సగుణ యోగాభ్యాసులై తద భ్యాస ఫలంగా ఉత్తర జన్మలో జ్ఞానోదయమైనవారు. ఇలాటి సగుణనిర్గుణ సంధికి నిదర్శన ప్రాయుడైన వాడే గజేంద్రుడు. గజేంద్రుడేమిటి మోక్షణమేమిటి.అసలిది వాస్తవమేనా. ఇది వాస్తవంగా జరిగిందనుకోటాని కాస్కారమే లేదు. ఎందుకంటే అది ఒక గజం గాదు. దానిచుట్టూ అనేక లక్షల గజాలున్నాయి. దశ లక్ష కోటి కరిణీ నాథుడనని గజేంద్రుడే మొఱపెడతాడు. పిడి ఏనుగులైనా అవీ ఏనుగులే. అలాంటి ఏనుగుల మధ్య ఒక ఎనుగు హ్రదంలో ప్రవేశించింది. పూర్తిగా ప్రవేశించను కూడా లేదు. కాలు మాత్రమే మోపింది నీళ్లలో. వెంటనే ఒక మొసలి వచ్చి వాటేసుకొంది. వేసుకొంటే మాత్రం గట్టిగా కాలుజాడిస్తే పోయి అవతలపడదా. పైగా మహాబల సంపన్నుడా గజేంద్రుడు. అన్యాలోకన భీకరుడు. జితా శానేక పానీకుడు. కొండలకైనా తలగనివాడు. అతని ధాటికి పులుల మొత్తములు కూడా పొదరిండ్లలో దూరేవి. ఘోర భల్లూకములు కూడా గుహలలో జొరబారేవి. హస్త రంధ్రముల నీరెక్కించి పూరించి వదలితే చండభ మార్గమంతా నిండిపోయేది. ఇలాంటి గజేంద్రుడేమిటి. ఆ మకరిపట్టు విడిపించుకోలేకపోవటమేమిటి. అదేమి ఐరావతమా శక్తి వాహనమైన కంఠరవమా, గట్టిగా పాదంతో మట్టితే చిత్తయి పోవలసింది. పైగా అన్ని లక్షల ఏనుగులు చుట్టూ ఉన్నాయి అన్నీ కలిసి మర్దిస్తే ఒక్క తునుక మిగులుతుందా. అయినా దాని బారికి

చిక్కి శల్యావశిష్ట మయిందట. తొండము పయికెత్తి కుయ్యో అని మొఱ పెట్టిందట. మొఱ చెవిన బడిందో లేదో ఇటూ అటూ చూడక ఆ శ్రీమన్నారాయణుడే పరుగెత్తి వచ్చాడట. అవక్రమైన ఆ మకరాన్ని చక్రంతో ఛేదించి దాని పాదం విడిపించి కాపాడాడట.

ఇది యథార్థంగా జరిగిందనేనా. జరిగిందని అనుకోటం దేనికి. అనుకోవాలని వ్రాయలేదీ కథ మహర్షి. కథలన్నీ పరమార్థానికి సంకేతాలుగానే భావించి కల్పించాడని గదా ముందు నుంచీ వాకొన్నాము. పురంజనో పాఖ్యానంలో అది మహర్షే మనకు దాఖలా చేసి చూపాడు. ఇదీ ఒక పురం జనోపాఖ్యానం లాంటిదే. అంతకన్నా వేరుగాదు. అక్కడ వాచా సంకేతాన్ని వివరించిచెబితే ఇక్కడ మన కక్కడక్కడా వ్యంగ్యంగా సూచిస్తూ వస్తాడు. గజమంటే అసలు అహంకారమని అర్థం.

యదా కించిద్జ్ఞోహమ్ గజ ఇవ మదాంధస్సమ భవమ్
తదా సర్వజ్ఞో స్మీత్య భవదవలిప్తం మమ మనః
యదా కించి త్కించిద్బుధజన సకాశాదధి గతమ్
తదా నజ్ఞోస్మీతి జ్వర ఇవ మదోమేవ్యవగతః

అన్నాడు భర్తృహరి.

తెలివి యొకింత లేని యెడ దృప్తుడనై కరి భంగి సర్వమున్
తెలిసితి నంచు గర్విత మతిన్ విహరించితి దొల్లి

దృప్తత అంటే గర్వమే. అది అహంకారానికి మారుపేరు. ఏ మాత్రమూ జ్ఞానం లేకపోయినా ప్రతివాడూ తానెంతో సర్వజ్ఞుడనని గర్వంతో తిరుగుతుంటాడు. అంతో ఇంతో పెద్దల దగ్గర విషయం తెలుసుకొన్నాడంటే చాలు. అనవసరంగా తెచ్చి పెట్టుకొన్న ఆ మిడిసి పాటంతా పటాపంచెలవుతుంది. ఇదుగో ఈ మిడిసి పాటూ ఈ అహంభావమే గజభావం. అహంభావిని గజంతో పోల్చి చెప్పటంలోనే ఈ రహస్యం బోధపడుతున్నది.

ఇలాగే వేమన కూడా ఒక మాట అంటాడు.

కుక్కదిన్నవాడు గురుమింద జంగంబు
పంది దిన్నవాడు పరమయోగి
ఏన్గు దిన్నవాడు ఎంత సుజ్ఞానిరా
విశ్వదాభి రామ వినురవేమ

కుక్కను దింటే వాడు గొప్ప శివభక్తుడు. పందిని దింటే వాడు పరమయోగి. ఏనుగునే తినకలిగితే ఇక వాడెంత జ్ఞానో చెప్పలేమట. కుక్క ఏమిటి, పంది ఏమిటి, ఏనుగేమిటి. వాటిని మనం తినటమేమిటి. ఇది గాదు వేమన అభిప్రాయం. ఆయనచెప్పదలచిన రహస్యం వేరు. అది అధ్యాత్మికం. కుక్క అంటే మనస్సు. కుక్కలాగా చపలమయింది. పంది అంటే మమకారం. పందిలాగా బురదలోనే పోయి పడుతుంది. అంటే సంసార పంకం. పోతే ఏనుగేమిటి ఇక. ఏనుగంటే అహంకారమే. ఏనుగులాగా ఇటూ అటూ చూడకుండా ఎవరినీ లెక్క చేయకుండా వీధి వెంట ఛాతీ విరుచుకొని వెళ్లుతుంటా డహంయువైన మానవుడు. ఇలాంటి అహంకారాన్ని కూడా అణచి పుచ్చగలిగితే వాడే మహాజ్ఞాని అని కవి హృదయం.

దీనిని బట్టి గజేంద్రుడనే మాట ఇక్కడ కేవల మహంకారమనే భావానికొక ప్రతీక మాత్రమే. దానికి తగినట్టే ఉన్నదా గజేంద్రుని ప్రవర్తన కూడా. అడవిలో ఉండే సింహ వ్యాఘ్ర భల్లూక ఫణి ఖడ్గ గవయాదులన్నీ తన ధాకకు నిలవలేక పరుగెడుతుంటే దొరకిన వాటిని పట్టి శిక్షిస్తూ కొండలు కూడా తలక్రిందై పడేలాగా మారులేక మసలుతూ వచ్చింది. ఇదంతా అహంకారానికీ సూచనే. అహంకార మెప్పుడుందో అది తప్పకుండా మమకారానికి దారి తీస్తుంది. రెండూ ఒకదానికొకటి అన్నదమ్ముల లాంటివి. అహంకారమే మమకారానికి మార్గదర్శి. గజేంద్రుడు దశలక్ష కోటి కరిణీ నాథుడట. అవి ఉభయ పార్శ్వములా బలసి కొలుస్తుంటే వాటిమీద తగులంతో తిరుగుతుండేవాడు.

పల్వలంబుల లేత పచ్చిక మచ్చిక జెలుల కందిచ్చు నచ్చికము లేక
ఇవురుజొంపముల గ్రొవ్వెలయుపూ గొమ్మల ప్రాణవల్లభలకు బాలు పెట్టు
ఘన దాన శీతల కర్ణ తాలంబుల దయితల చెమటార్చుదనువులరసి
మృదువుగా గొమ్ముల మెల్ల న గళములు నివురుచు బ్రియముతో నెఱపువలపు

పిఱుదు చక్కట్ల డగ్గఱి ప్రేమతోడ
డాసి మూర్కొని దివికి దొండంబు సాచు
వెద వివేకించు - క్రీడించు - విశ్రమించు
మత్త మాతంగ మల్లంబు మహిమ తోడ

చూడండి ఆడ యేనుగులపై దానికెంతటి మమకారమో.

అంతేగాదు. సహజమైన వాటి అందచందాలతో పోటీ పడి ఆనందించే వాడా గజేంద్రుడు.

తనకుంభముల పూర్ణతకు డిగ్గి యువతుల-కుచములు పయ్యెద కొంగులీగ
తనయాన గంభీరతకు జాల కబలల-యానంబు లందెల నండ గొన గ
తన కరశ్రీ గని తలకి బాలల చిఱు -దొడలు మేఖల దీప్తి దోడు పిలువ
తనదంతరుచి కోడితరుణులనగవులు ముఖచంద్ర దీప్తుల ముసుగుదిగువ

తనదు లావణ్య రూపంబు దలచి చూడ
నంజనాభ్రము కపిలాది హరి దిభేంద్ర
దయిత లందఱు దన వెంట దగిలి నడవ
గుంభివిభుడొప్పె నొప్పుల కుప్పవోలె

చూడండి. ఇది ఆడు ఏనుగుల వర్ణనా, లేక ఆడువారి వర్ణనా, ఏదయిందీ అర్థం కానిది. ఏనుగులే అయితే వాటి కాళ్ల కంటె లెక్కడివి. పాలిండ్లమీద పయ్యెద లెక్కడివి. మేఖల లెక్కడివి. మెఱుగు లెక్కడివి. ఇదంతా ఒక కల్పన. ఏనుగుల వేషంలో ఉన్న మానవుల వ్యవహారమే ఇది. గజేంద్రుడొక అహంభావి అయిన మానవుడైతే వాడి పరివారమైన పుత్ర మిత్ర కళత్రాది గతమమకారమే ఇదంతా.

దీనితో నానాగహన విహరణం చేస్తు మార్గం తప్పాడట గజేంద్రుడు. అంటే సంసార విషయాలే ఆగహనం. అహంకార మమకారాలతో వాటి ననుభవించే కొద్దీ మార్గం తప్పక మరేమవుతాడు మానవుడు. అంతేకాదు. పిపాసా పరాయత్త చిత్తుడు కూడా అవుతాడు. విషయ సుఖాలనుభవించే కొద్దీ అంతకంత కవి నవనవోన్మేషంగా భాసించి తృష్ణ పెంచి మనసు నాకర్షిస్తూ పోతుంది. శబ్ద స్పర్శాదికమైన విషయ

పంచకంలో మానవుని పంచేంద్రియాలూ లగ్నమవుతాయి. దానితో ఎక్కడలేని మఱపూ మైకమూ గ్రమ్మి సంసార సాగరంలో తలమునుకలవుతారు.

తోయజ గంధంబు దోగిన చల్లని – మెల్లని గాడ్పుల మేను లలర
కమల నాళాహారవిమల వాక్కుల హంస, రవములు సెవుల పండువులు సేయ
ఫుల్లదిం దీవరాం భోరుహా మోదంబు ఘ్రాణ రంధ్రంబుల గారవింప
నిర్మల కల్లోల నిర్గతా సారంబు – వదన గహ్వరముల వాడు దేర్పఁ

త్రిజగ దభి నవ సౌభాగ్య దీప్తమైన
విభవ మీక్షణముల కును విందుసేయ
నరిగి పంచేంద్రియ వ్యవహారములను
మఱచి మత్తేభయూథంబు మడువు సొచ్చె

ఏమిటిది. మదగజ వ్యవహారమా. కాదు. మద గజ వ్యాజంతో సాగిన మానవ వ్యవహారమే. పంచేంద్రియ వ్యవహారములూ మరచి మడుగు సొచ్చిన వాడు మానవుడే. చొచ్చి ఊరకున్నాడా. లేదు.

ఇభ్రలోకేంద్రుడు హస్త రంధ్రముల నీరెక్కించి పూరించి చం
డభ మార్గంబున కెత్తి నిక్కి వడి నుద్దాడించి
కరిణీ కరోజ్ఝిత కంకణచ్ఛట దోగిసెలయేటి నీలాద్రి చెలువు దెగడు
హస్తినీ హస్త విన్యస్త పద్మంబుల వేయిగన్నుల వాని వెరవు సూపు
మద కరేణు ముక్త మౌక్తిక శక్తుల మెఱుగు మొగిలు తోడమేల మాడు
నెదురులేని గరిమ నిభ రాజమల్లంబు వనజ గేహకేళి వాలునపుడు

ఇలా అంతకంతకా విషయ సుఖాలతో తాదాత్మ్యం చెంది తనకు గాగా ఇంతటి ఐశ్వర్య మబ్బిందని ఎంతటి వాడినైనా బెబ్బెబ్బె అంటూ ఎదురు లేని వీరుడి లాగా స్వైర విహారంచేస్తాడు. ఎక్కడ. కాసారంలో కాదు కాదు. సంసారంలో. సంసారమే కాసారం. సారం లేకపోయినా సారభూతంగా భాసిస్తుంది. చక్కగా అలంకరించుకొని ఎదుట సాక్షాత్కరించిన గృహలక్ష్మి మన పాలిటికది. దానితో వివిధ కేళీ లాలసులమై

విహరిస్తాము. అది మనకెలా కనిపిస్తుంది. అనంగ విద్యా నిరూఢపల్లవ ప్రబంధ పరికంపిత శరీరాలంకార యగు కుసుమ కోమలిలాగానే వ్యాకీర్ణ చికురమత్త మధుకర నికర, విగత రస వదన కమల, నిజ స్థాన చలిత కుచ రథాంగ యుగళ లంపటిత జఘన పులినతల ఇంత ముగ్ధ మనోహరంగా భాసిస్తూ మన మనసులనే దోచుకొంటుంది. ఇటు అటు కదలనీయదు. గట్టిగా పట్టుకొంటుంది.

అలా పట్టుకొనేదే గ్రాహం. గ్రహమన్నా గ్రాహమన్నా అక్షరార్ధం ఒక్కటే. గ్రహించేదేదో అది గ్రహం. కాలమే గ్రహం. అదే గ్రాహం మన పాలిటికి. ఎప్పుడే రూపంలో వచ్చి మనమీద దాడి చేస్తుందో ఏమి ముప్పు తెచ్చి పెడుతుందో చెప్పలేము. మన అంతవాడు లేడు గదా అని విఱ్ఱవీగుతుంటాము. మయి మఱచి ఉంటాము. అలా ఏమఱించి పైన బడే స్వభావం దానిది. మకరి పట్టు దాని పట్టు. అలాగే పట్టింది గజేంద్రుణ్ణి.

భుగ భుగాయిత భూరిబుద్బుదచ్ఛటలతో కదలుచోదివికి భంగంబులెగయ
భువన భయంకర ఫూత్కార రవమున ఘోర నక్ర గ్రాహకోటి బెగడ
వాల విక్షేప దుర్వారఝంఝానిల వశమున ఘుమఘుమావర్త మదర
కల్లోల జాలసంఘట్టనంబుల తటీ తరుల మూలంబులై ధరణి గూల

సరసిలో నుండి పొడగని సంభ్రమించి
యుదరి కుప్పించి లంఘించి హుంకరించి
భాను గబళించి పట్టు స్వర్భాను పగిది
నొక్క మకరేంద్రు డిభరాజు నొడిసి పట్టె

భానుడంటే సూర్యుడు. సూర్యుడు మన బుద్ధి తత్త్వమే. బుద్ధి పెడతల పట్టినప్పుడే కాలమనే గ్రాహం మనలను ఒడిసిపట్టేది.

అయితే అలా పడితే చూస్తూ ఊరుకోలేడు మానవుడు. అహం మమలు రాజ్యమేలుతున్నాయి గదా. ఎలా ఊరుకోగలడు. అవే పురికొల్పుతాయి ప్రతీకారానికి. వాటి బలంతో శక్తి కొద్దీ పోరోడుతాడు. వచ్చిన ఉపద్రవమెలాగైనా తప్పించుకోవాలని శతవిధాల ప్రయత్నిస్తాడు. అలాగే యత్నం సాగించాడు గజేంద్రుడు.

కరి దిగుచు మకరి సరసికి

కరి దరికిని మకరిఁదిగుచుఁగరకరి బెరయన్

కరికి మకరి- మకరికిఁగరి

భర మనుచును నతల కుతల భటు లరుదువడన్

ఇది దానినీ అది దీనినీ ఇటూ అటూ లాగటంతో సరిపోయింది. లోక భీకరంగా జరిగింది పోరాటం. నిర్గత నిద్రాహారములై అవక్ర పరాక్రమ ఘోరములై అవి అలా పోరుతుంటే తమ నాథుణ్ణి ఒంటి జేసి పోలేక పెంటి ఏనుగులన్నీ గ్రుడ్లప్పగించి చూస్తూ నిలబడి పోయాయి. వాటికీ మమకారమే గదా ప్రాణ విభుడంటే. విడిచి ఎలా పోగలవు.

ఇలా ఏండ్లూ పూండ్లూ గడుస్తున్నాయి. బలమూ చలమూ జీవమూ అంతకంత కెక్కువవుతున్నాయి మకరానికి. కారణం దానికి జీవనమే జీవనం. ఎక్కకేమవుతుంది. జీవనమంటే జలం. జలమే జీవనం గదా మొసలికి.అందుకే విజృంభించింది. మనకు పట్టుకొన్న సంసార మకరానికి కూడా మన జీవనమే జీవనం. అంటే మన జీవితమే దాని కాటపట్టు. అందుకే దీనికీ ఇంత విజృంభణ. పోతే ఇలాంటి బలమైన ఆధారం లేని శుష్కమైన భూమిమీద నిలిచి ఉన్నది గజేంద్రం. కనుకనే **"డస్సె మత్తేభ మల్లంబు బహుళ పక్షశీత భానుపగిది"** డయ్యక ఏమవుతుంది. మరి దీని బలం సన్నగిల్లే కొద్దీ దానికెక్కడ లేని నిక్కు. ద్విగుణీకృతమవుతుంది దాని ప్రతాపం.

ఉఱుకుం గుంభ యుగంబుపై హరిక్రియన్ హుమ్మంచు పాదమ్ములన్ నెఱయున్, కంఠము వెన్ను.... దన్ను శల్యంబులున్ దంతముల్ విఱుగన్ వ్రేయుచు బొంచి పొంచి కదియున్

ఇలా ఎన్ని విధాలుగానైనా సరే పైన బడి బాధిస్తుంది. పొంచి ఉంటాయి ఈ సంసార క్లేశాలు కూడా. ఎప్పుడు వచ్చి ఏది మీద బడి మనలను పీడిస్తుందో చెప్పలేము. అందుకు కారణమొక్కటే. అహంకార మమకారాలు కారణాలైనా వాటికి కూడా మూలకారణమొకటున్నది. అది మహా మాయాంధకారం. అది జ్ఞాని అయినవాడి జోలికి రాదు. వాడినేమీ చేయదు. అల్పహృదయుడి జ్ఞానదీపాన్ని మాత్రమాక్రమిస్తుంది. రూపుమాపుతుంది. ఆర్పివేస్తుంది.

అలా మాపితే ఇక మిగిలిందేమిటి మన పాలిటికి.

ఊహ కలంగి జీవనపు టోలమునం బడి పోరుచో – మహా

మోహ లతా నిబద్ధ పదమున్ విడిపించు కొనంగ లేక సం

దేహము బొందు దేహి క్రియ దీన దశన్ గజముండె – భీషణ

గ్రాహ దురంత దంత పరిఘట్టిత పాద ఖురాగ్ర శల్యమై

ఈ దీన దశ గజేంద్రుడిదే గాదు. మానవ గజేంద్రుడిది కూడా. అది జీవనపు టోలాన బడి పోరుతున్నట్టే వీడూ పోరుతుంటాడు. జీవనమంటే జలమూ జీవనమే. జీవితమూ జీవనమే. జలాన్ని ఒక ఆదరువు చేసుకొని విజృంభిస్తున్నది మకరి. అలాటి ఆధారం లేనివాడు గజేంద్రుడు. అందుకే బ్రతుకుమీద ఎంత ఆశ ఉన్నా తన పదాన్ని విడిపించుకోలేడు. కారణం. అది మహా మోహలతా నిబద్ధం. ఒక మానవుణ్ణి కూడా ఈ మోహమే ఒక లతా వలయంలాగా చుట్టుకొని బాధిస్తున్నది. దానివల్ల వీడు కూడా ఈ సంసార కర్దమంలో దిగబడ్డ తన పాదాన్ని పైకి తీసుకోలేక చీకాకు పడుతుంటాడు. అందుకే ఊహలన్నీ అపోహలయి సందేహాలే క్రందు కొంటాయి దేహిని. ఈ దేహధారి అయిన మానవుడిలాగే ఉన్నాడా గజేంద్రుడు కూడా. భీషణ గ్రాహ దురంత దంత పరిఘట్టన కక్కడా తట్టుకొనే పరిస్థితి కాదు. ఇక్కడా కాదు.

అయితే ఏమిటిక గతి. ఏమిటని ప్రశ్నే లేదు. ఎన్ని రాత్రులు పోరినా పగళ్లు పోరినా, వారాలు మాసాలు, అయనాలు వర్షాలు –గడచినా – మనం జయించలేము. పృథుశక్తిన్ గజమా జలగ్రహముతో పెక్కేండ్లు పోరాడింది. అయినా ప్రయోజన మేముంది. బాగా శిథిలమయి పోయింది. అంతే, అప్పుడు గాని కండ్లు తెఱిచింది కాదది. ఆలోచించింది కాదు. దీన్ని గెలవటమిక మనకు సాధ్యం కాదని తీర్మానించుకొన్నది. ఇక్కడ ఉంది మనం గ్రహించవలసిన ఒక రహస్యం. అంతకు ముందు గడచిన జీవితానికిది ప్రతిలోమమైన జీవితం. ముందెంత వైభవోపేతంగా బ్రతుకుతాడో మానవుడు కాలం చాలకపోతే అంత దీనాతిదీనంగా బ్రతకవలసిన కర్మ పడుతుంది. ఆ మిడిసి పాటే ఈ భంగపాటుకు దారి తీస్తుంది. అలాగే జరిగిందీ గజేంద్రుడి విషయంలో.

అయితే జరగటమనేది సర్వ సాధారణమైనా అనుభవించక తప్పనిసరి అయినా దృక్పథంలో తేడా ఉంటుంది మానవులకు. అది పర్వత సర్షపాలకున్నంత తేడా. ఆరి వారి అంతస్తులను బట్టి ఉంటుందది. దానికే అధికార తారతమ్యమని పేరు. మందుడైతే అయ్యో అని కుప్పకూలిపోతాడు. మధ్యముడు మనకిది అపరిహార్యమేమి చేయగలమని అనుభవిస్తాడు. పోతే ఎవడో ఉండుత్తముడైనవాడు. **"మనుష్యాణాం సహస్రేషు"** అని నూటికి కోటికొకడు – అలాంటి ఉత్తమాధికారి. వాడు పోరాడినంతవరకూ పోరాడి ఇక లాభం లేదనుకొన్నప్పుడు నిరాశ చెందటం వరకే గాదు. అంతవరకే అయితే అది ప్రతిలోమచర్య. కేవల ప్రతిలోమం జ్ఞాని లక్షణం కాదు. అనులోమం కూడా అలవడాలి. అలాంటి జ్ఞానమే అలవడిందిప్పుడు గజేంద్రుడికి. జ్ఞానమెప్పుడలవడిందో అప్పుడతనికి వ్యథ లేకుండా పోయింది. ఏమిటా జ్ఞానం. ఎలా అలవడింది ఉన్నట్టుండి అలవడటానికేమిటి నిమిత్తం. పూర్వ పుణ్యఫల దివ్య జ్ఞానసంపత్తి అని సమాధానమిస్తున్నాడు మహాకవి. జ్ఞానమంటే ఇది మామూలు జ్ఞానం కాదు. దివ్యజ్ఞానం. అదే మానవుడి పాలిటికొక సంపద. ఇలాంటి సంపద చేకూరాలంటే ఎవరికంటే వారికి చేకూరదు. పుణ్యానికి ఫలంగా రావాలది. ఎప్పటిదా పుణ్యం. ఈ జన్మలోదైనా కావచ్చు. లేక ముందు జన్మలలో చేసిందైనా కావచ్చు. ఎప్పుడో ఒకప్పుడు చేసి ఉంటేనే అది ఇప్పుడు ఫలించేది.మంచిగాని, చెడ్డగాని చేసింది ఎక్కడికీ పోదు. దాచిపెట్టుకొన్న సొమ్మది. ఎప్పటికైనా మనకు దక్కవలసిందే. అలాగే దక్కింది గజేంద్రుడికి.

ఈ గజేంద్రుడిప్పటివాడు కాడు. ఇంతకుముందు నుంచీ ఉన్న జీవుడే. గజంగా జన్మించక ముందతడు ఇంద్రద్యుమ్నుడనే మహారాజు. ఇతెవడీ గజేంద్రుడెందుకిలా పట్టు పడ్డాడని పరీక్షిత్తు అడగకపోయినా అడిగినట్టే భావించి ఇలా అతని పూర్వ వృత్తాంతాన్ని వర్ణిస్తాడు శుకయోగి.

అవనీ నాథ గజేంద్రుడా మకరితో నాలంబు గావించె మున్
ద్రవిడా ధీశు డతండు పుణ్యతము డింద్రద్యుమ్న నాముండు

ఇంద్రద్యుమ్నుడంటే ఇంద్రుడిలాంటి తేజో విశేషం కలవాడనే కాదు. ఇంద్రుడంటే ఆధ్యాత్మిక పరిభాషలో జీవుడని అర్థం. ద్యుమ్నమంటే ప్రకాశం. ధనం.

జీవుడికుండే ధనమూ, ప్రకాశమూ అతని జ్ఞానమే. అలాంటి ఈశ్వర భావనా జ్ఞానమూ ఉన్న మహనీయుడాయన. వైష్ణవ ముఖ్యుడు. విష్ణు భక్తులలో అగ్రేసరుడు. మౌనవ్రత ధారియై సర్వాత్ముడైన నారాయణమూర్తి నొక పర్వత శిఖరం మీద కూర్చొని షోడశోపచారాలతో విశేషంగా పూజ చేస్తూ వచ్చాడు.

ఇలా ఉండగా

ఒకనాడా నృపుడచ్యుతున్ మనములో నూహించుచున్ మౌనియై
యకలంక స్థితి నున్నచో - కలశజుం డచ్చోటికిన్ వచ్చి

మనస్సులో విష్ణు స్వరూపాన్ని నిలుపుకొని ఎలాటి మనో విక్షేపమూ లేకుండా మౌనముద్ర ధరించి నిశ్చలంగా ఉన్నాడట. అలాంటి సమయంలో బొట్టు పెట్టినట్టు వచ్చాడక్కడికి అగస్త్యుడనే మహర్షి. **"లేవక పూజింపక యున్న మౌని గని"** వస్తే ఈ రాజు లేవనే లేదు. అర్ఘ్యపాద్యాదులతో పూజించలేదు. ఎలా చేస్తాడు మౌని గదా. అయినా సహించలేదా అగస్త్యుడు. **"నవ్యక్రోధుడై వెంటనే ఎక్కడ లేని కోపం వచ్చింది. "మూఢ ! లుబ్ధ ! కరీంద్రోత్తమ యోని బుట్టుమని శాపంబిచ్చె"** ఓరి మూఢా, ఓరి లుబ్ధా, నీవు నన్నవమానించావు కాబట్టి వెంటనే పోయి ఒక గజేంద్రుడి జన్మ ఎత్తు పొమ్మని శాపమిచ్చి వెళ్లిపోతాడు. వెంటనే కరినాథుడయ్యే నాతడు కరులైరి భటాదులెల్ల.

ఏమిటీ అన్యాయం. ఆయన చేసిన పాపమేమిటి. వైష్ణవ ముఖ్యుడు పుణ్యాత్ముడయిన వాడా ఇంద్రద్యుమ్నుడు. ఏదో మౌనంగా ధ్యానంలో కూచొని ఉన్నాడు. ఎవరినీ అవమానించటమూ గాదది. తూలనాడటమూ గాదు. మహా అయితే వచ్చిన పెద్ద మనిషిని లేవలేదు. సత్కరింపలేదని గదా. ఎలా లేస్తాడు. సత్కరిస్తాడు. కండ్లు మూసుకొని మౌన సమాధిలో కూచున్నవాడాయె. కన్నెత్తి చూస్తే గదా లేవటమూ. సత్కరించటమూ. అది అతని అపరాధమెలా అవుతుంది. కాకుంటే ఇతడు శాపమివ్వటమేమిటి. శాపమిచ్చేటంత మహాపరాధమేమి చేశాడని. చేయకపోతే అతడెలా శాపమిచ్చాడు. ఇచ్చాడేపో. అది ఎలా ఫలించగలిగిందని ప్రశ్న పరంపర ఉదయించే అవకాశ ముందిక్కడ.

దీనికి కొంచెం లోతుకు దిగి చూస్తే ఆ అగస్త్యుడా రాజునే చేసిన సంబోధనలోనే ఉంది జవాబు. మూఢ, లుబ్ధ అని గదా సంబోధించాడాయన. మూఢ అంటే

మోహం తమస్సుని అర్థం. లుబ్ధ అంటే లోభం. రాగం. అంటే రజస్సుని అర్ధం. రజస్తమో గుణాలున్న వాడవని భావం. రజస్తమస్సులే ఆత్మ చైతన్యానికావరణ విక్షేప దోషాలు. వీటివల్ల ఆత్మ అనేది సాధకుడి స్వరూపమే అయినా ఆవరణం చేత అది సంకుచితమయి విక్షేపం చేత అది మనకు భిన్నంగా ఎక్కడో భాసిస్తుంది. అదే తనకొక ఇష్టదైవత మవుతుంది. అది శివుడు కావచ్చు. విష్ణువు గావచ్చు. ఏదైనా గావచ్చు. విష్ణువుగానే గోచరించింది ఆయనకు. దానినే ధ్యానిస్తూ కూచున్నాడతడు. అది కూడా ధ్యాత అయిన తనకు భిన్నంగానే. మరి ఆ ధ్యేయమైన విష్ణుమూర్తికి భిన్నంగా తానే కాదు. ఈ బాహ్యప్రపంచం కూడా దానికి భిన్నంగానే తోచిందా రాజుకు. కనుకనే ప్రాదేశమాత్రమైన ఆ స్వరూపంలోనే మనసు లీనం చేసి మరేదీ దాని రూపంకానట్టు ఏ మాత్రమూ పట్టించుకోకుండా కూచున్నాడు. ఇది అసలైన భక్తి కాదు. ప్రాకృత భక్తి అని పేరు పెట్టింది దీనికి భాగవతం.

అర్చాయా మేవతు హరేః - పూజాంయః శ్రద్ధయే హతే
నతద్భక్తేషు చాన్యేషు - సభక్తః ప్రాకృతః స్మృతః

ఎవడైతే భగవదర్చనలోనే నిమగ్నుడై ఆయన పూజ శ్రద్ధాభక్తులతో ఆచరిస్తూ ఆ భగవద్భక్తులైన ఇతర మానవుల నుపేక్షిస్తాడో వాడు ప్రాకృతుడట. అలాగే ఉపేక్షించాడింద్రద్యుమ్నుడు కూడా. తన కోసమని వచ్చిన అగస్త్యుని కన్నెత్తి చూడలేదు. అతడు భక్తుడు కాదనా, భగవదంశ లేనివాడనా, **"ఈశ్వర స్సర్వ భూతానామ్. వాసుదేవ స్సర్వమితి"** అని గదా శాస్త్ర వచనం. సర్వమూ ఈశ్వర స్వరూపమే అయినప్పుడు సర్వత్రా ఆ రూపాన్నే దర్శించాలి నీవు. అలా దర్శిస్తే ఇక లేవకపోవటమూ, పూజించకపోవటమంటూ ఉండదు. కాని అలాంటి దర్శనానికి నోచుకోలేదీ ఇంద్రద్యుమ్నుడు. సగుణభక్తుడే గాని నిర్గుణభక్తుడు కాడతడు. అందుకే కండ్లు మూసుకొంటే అతడికిక ప్రపంచమే కనపడలేదు. ఆయన కళ్లు తెరిపించదలచాడు సత్యప్రబోధం చేసి. ఎవరు. అగస్త్యుడా. కాదు. అగస్త్యుడనే నెపంతో పరమాత్మే. ఆధ్యాత్మికంగా చూస్తే అగస్త్యాదులైన ఇలాంటి వారినంతా అధికారిక పురుషులంటారు. వారికొకరిని భూషించాలని లేదు. దూషించాలనీ లేదు. భగవంతు డాయా భక్తుల చిత్తవృత్తిని పరీక్షించి తన్మూలంగా వారి నప్పుడున్న స్థాయి నుంచి పయిస్థాయికి తీసుకుపోవాలని ఒక పరీక్ష పెడతాడు. తాను పెట్టబోయే

ఆ పరీక్షకిలాంటి జీవన్ముక్తులైన మహర్షులనొక ఆలంబనం చేసుకొని పంపుతాడు. భగవత్సంకల్ప ప్రేరితులై వస్తారు వారు. కాబట్టి తదనురూపంగానే ఉంటాయి వారి మాటలూ, చేష్టలూ. అంబరీషుడి దగ్గరకు దుర్వాసుడు వచ్చాడన్నా, ఇంద్రద్యుమ్నుడి దగ్గరికి అగస్త్యుడు వచ్చాడన్నా, వచ్చి వారిపైన ఆగ్రహించారన్నా అది ఈ దృష్టితో చూడాలి మనం. అది పైకి ఆగ్రహంగా కనిపించినా చివరకు వారి ద్వారా భగవానుడు వారిపట్ల చూపే అనుగ్రహమే గాని వేరుగాదు.

ప్రస్తుత మీ కుంభ సంభవుడు రావటమూ, హడావుడిగా ఆ రాజును శపించి పోవటమూ కూడా ఇలాటి వ్యవహారమే. అనుగ్రహమే ఇది. ఆగ్రహం కాదు. అంత వరకూ సగుణమైన దృష్టితోనే ఉన్నాడా రాజు. ఎంత వైష్ణవుడైనా, ఎంత అచ్యుత ధ్యాననిష్ఠ గరిష్ఠుడైనా, ఆయన దృష్టిలో ఉన్నదొక్క విష్ణువే. అదీ ఏకదేశ నియంత్రితమే. సర్వ జగద్వ్యాప్తమైన తత్త్వం కాదు. అలాంటి తత్త్వాన్ని ఎప్పటికైనా పట్టుకొంటే గాని మోక్ష సామ్రాజ్యానికి పట్టాభిషిక్తుడు కాలేడు. పట్టు తన పాటికి తాను చిక్కించుకోలేక బాధపడుతున్నాడు. కాగ దాని నెలాగైనా ఆయనకు అందివ్వాలని భగవత్సంకల్పం. అయితే అందరి విషయంలో కలగదా సంకల్ప మీశ్వరుడికి. అందులకు తగిన యోగ్యతా, పరిపాకమూ, సాధకుడి కంతకుముందు సిద్ధించి ఉండాలి అదిఉంటేనే ఆయన కరావలంబం మనకు లభించేది. ఇంద్రద్యుమ్నుడికా యోగ్యత దండిగా ఉన్నది. సగుణభక్తిలో పరిపక్వమైన జీవితమాయనది. నిరంతర ధ్యాననిష్ఠ గరిష్ఠుడు. ఎటు వచ్చీ అది తావన్మాత్ర పర్యవసితం గాక విశ్వతో వ్యాప్తమయి దీప్తి వహించాలి. అప్పుడే నిర్గుణంగా మారి అది నిర్వృతిని ప్రసాదించేది. దాని నందుకోటానికి కావలసిన సామగ్రి ఆయనకు సిద్ధమయి ఉన్నదని భావించటంవల్లనే తదనంతర భూమిక ఆయనకు ప్రసాదించాలని సంకల్పం కలిగిందా భగవానుడికి. **"దైవమ్ మానుష రూపేణ"** అన్నట్టు వెంటనే ఒకానొక శుభముహూర్తంలో పంపాడా కలశ సంభవుణ్ణి. అంచేత శాపం కాదిది. వరప్రసాద మాయన పాలిటికి.

అంత కఠినంగా ఆయన శపించిపోతే అది శాపం కాకపోవటమేమిటి. మానవేంద్రుడుగా జీవించే మహారాజును గజేంద్రయోనిలో జన్మించమని శపించటం శాపం గాక వరమెలా అవుతుంది. నిజమే. పైకి చూస్తే అలాగే భాసిస్తుంది. కాని తిట్టు కాదది. దీవనే. ఎందుకంటే కరీంద్రోత్తమ యోని బుట్టుమని ఇచ్చాడాయన

శాపం. కోపం వచ్చిన వాడింత డొంక తిరుగుడుగా ఇంత మెలిక పెట్టి మాటాడడు. ఏదో ఒక ఏనుగువో, పీనుగువో అయి పొమ్మని తిట్టి వెళ్లిపోయేవాడు. అలా కాదిక్కడ. కరిగాదు. కరీంద్రుడుగా పుట్టమన్నాడు. అందులోనూ అధమం గాదు. మధ్యమంగాదు. ఉత్తమమైన గజంగానే జన్మించమన్నాడు. అందులో కూడా గజంగా కాదు. గజయోనిలో. అంటే అర్థం. గజ శరీరమనేది నీకొక ఉపాధిగా మాత్రమే ఏర్పడుతుంది గాని ఆ ఉపాధిలో ఉపహితమై ఉన్న పూర్వ సంస్కారమెక్కడికీ పోదు. అది ఎప్పటికైనా ఉద్బుద్ధమై మరలా నిన్ను కాపాడుతుంది సుమా. ఇంతలోతైన భావమిమిడి ఉంది ఇందులో.

కనుకనే ఆ ఇంద్రద్యుమ్న జన్మలో పోగుచేసుకొన్న ప్రాక్తన పుణ్య సంస్కార మెక్కడికీ పోలేదు. గజేంద్రుడుగా జన్మించినా అది కొంత కాలానికి ఫలితమిచ్చింది. అదే పూర్వ పుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తి అని పేర్కొనటం. శాస్త్రమే మనకిస్తున్నదీ హామీ. **"తత్ర తం బుద్ధి సంయోగమ్ - లభతే పౌర్వ దైహికమ్"** ఇంతకుముందు జన్మలో చేసుకొన్నదెక్కడికీ పోదు. మంచిగాని, చెడ్డగాని అది ఒక కూడబెట్టిన ధనం లాంటిది. మన సొమ్మే పొమ్మన్నది. అదైనా ఎందుకు మనకు ప్రాప్తించటమంటే **"యతతేచ తతో భూయ స్సంసిద్ధౌ కురునందన"** మరలా ఇతోధికంగా ప్రయత్నం చేసి చివరకు సాయుజ్య ఫలాన్ని చవిచూడటానికే నన్నారు. అలాగే ఈ గజేంద్రుడికి కూడా ఆ పూర్వజన్మ పుణ్యఫలంగా ఇన్నాళ్లకు జ్ఞానోదయమయింది. పుట్టగానే రావచ్చు గదా. ఇంత కాలమెందుకు పట్టిందని మరలా ఆశ్చర్యపడరాదు. ఫలించే సామగ్రి తయారుగా ఉన్నా కాలమూ కర్మమూ కలిసి వస్తే గాని అది ఫలించదు. కాల కర్మలనేవి దానికి నిమిత్తం. అలాటి నిమిత్తమిన్నాళ్లూ రాలేదా గజేంద్రుడికి. అందుకే గజేంద్రుడి పూర్వ జీవితమంతా పైలా పచ్చీసుగానే గడచిపోయింది. అలా పైలాపచ్చీసుగా వర్ణించటంలో కవి ఉద్దేశం కూడా ఇదే. అంతవరకూ నిమిత్త మేర్పడలేదు. అది ఆవిలాసమయ జీవితంలో తాత్కాలికంగా మరుగుపడి పోయింది. పోతే ఇప్పుడేర్పడింది ఆ నిమిత్తం. అదే దానికి జలావగాహం చేయాలని బుద్ధి పుట్టటం. హ్రదంలో ప్రవేశించటం. వెంటనే ఆ గ్రాహం వచ్చి కాలు పట్టుకోటం.

గ్రాహమనేది ఇంతకూ ఒక నిమిత్తమే. నిమిత్తం గనుకనే **"గ్రాహేణ పాశేన విధాతురావృతః - అపారయ న్నాత్మ విమోక్షణే చిరమ్"** అని మొరపెడతాడు

గజేంద్రుడు. ఈ గ్రాహమనేది నిజంగా గ్రాహం కాదు. విధి నా యెడల పన్నిన ఒక పాశం. ఆపాశం నన్ను ఆ పాద మస్తకమూ గట్టిగా చుట్టుకొన్నది. దాని పట్టు విడిపించుకోటం కర్మ పరాధీనుడనైన నా వల్ల కాని పని. అసలు గ్రాహమనే గాదు విధాత పన్నిన పాశం. ఆ మాటకు వస్తే గజ శరీరమనేదే ఒక పెద్ద పాశం. గ్రాహం మనచుట్టూ ఉన్న సంసార పాశమైతే, గజరూపం మనలో లోపల దాగి ఉన్న అహంకారమనే పాశం. శాస్త్ర పరిభాషలో అహంకారమంటే కేవల గర్వమని గాదు. దానికి కారణభూతమైన దేహాత్మాభిమానం. కనిపించే దేహమే నా ఆత్మ లేదా నా స్వరూపం. ఇంతకు మించి నా స్వరూపమెక్కడా లేదని భావించటమే అసలైనా అహంకారం. ఈ అహంకారమే అన్నిటికీ మూలకారణం. కనుకనే దీనికి కారణ శరీరమని పేరు. దీనివల్ల ఏర్పడిందే కళత్ర పుత్రాదుల మీది మమకారం. దానివల్ల వచ్చి నెత్తిన పడ్డవే సాంసారికమైన పీడలన్నీ. శాస్త్ర పరిభాషలో ఉన్న ఈ వ్యవహారమే పురాణ పరిభాషలో సంసార బాధలంటే గ్రాహమనీ, మమకారమంటే దశలక్ష కోటి కరిణీ సాంగత్యమనీ, అహంకారమంటే నేనీ బలగానికంతా నాథుడనైన గజేంద్రుణ్ణి గదా అనీ సంకేత శబ్దాలుగా పరిణమించాయి.

ఇంతకూ దేహాత్మాభిమాన రూపమైన అహంకారమే ఉత్తరోత్తరమైన అన్ని అనర్థాలకూ మూలకారణం. కాబట్టి ఆ అనర్థాన్ని పోగొట్టుకోవాలి మొట్టమొదట. అలా పోగొట్టుకోవాలనే అసలు గజేంద్రుడి ఆక్రందన కూడా

జిజీవిషే నా మిహాముయాకిమ్ అంతర్బహిశ్చా ఽవృతయే భయోన్యా ।
ఇచ్ఛామి కాలేన నయస్య విప్లవః తస్యాత్మ లోకావరణస్య మోక్షణమ్ ॥

ఇది గజేంద్రుడి నోట స్వయంగా వచ్చిన మాట. నేనీ గజ శరీరంతో జీవించాలనే ఇచ్ఛ ఎప్పుడూ లేదు. ఇది నాలోపలా, వెలపలా ప్రతి అణువూ వ్యాపించి నన్ను పెనవేసుకొని ఉన్నది ఈ గజభావం. దీనిని దగ్గర పెట్టుకొని నాకేమి ప్రయోజనం. పెట్టుకొన్నా ఇది ఎంతో కాలముండేది కాదు గదా. ఎంత అభిమానించినా కొంత కాలానికిదీ పోవలసిందే. పోతే కాల ప్రవాహం ధాటికెప్పుడూ దెబ్బ తినక తట్టుకోగల శరీరమేదో అది కావాలని కోరిక నాకు. అది ఇక శరీరమే కాదు. శరీరం కాని శరీరమది. అంటే అశరీరమని పిలువబడే మోక్షమే. అంతవరకూ ఎలాటి దివ్య శరీరం సంపాదించినా ఉపయోగం లేదు. అది ఆత్మచైతన్యాని కొక ఆవరణమై

పరిణమిస్తుంది. ఆవరణ భంగమైతే గాని మోక్షానికి నోచుకోలేము. అది ఈ గజశరీరం నుంచి మోక్షణమే.

అప్పటికి గజేంద్రమోక్షమంటే ఏమిటో అర్థం చెప్పినట్టయింది. ఒక మొసలి పట్టు నుంచి విడిపించటం కాదు గజేంద్రమోక్షణ మంటే. నిజమైన మోక్షణం గజ జన్మ నుంచి. ఇదే గజేంద్ర మోక్షణం. గజేంద్రుడు కోరిందీ అదే దేవుడు ప్రసాదించిందీ అదే. అలాంటి మోక్షణం సాధించాలే గాని అందులో ఈ మొసలి దాని కాలు పట్టుకోటమెంత. దాని నుంచి విడిపించుకొని బయట పడటమెంత. అది ఏపాటి. అప్రయత్నంగా సిద్ధించే వ్యవహారమది దాని కోసం పృథక్ర్ప యత్నమక్కరలేదు. అహంకారం తొలగితే అన్నీ వాటిపాటికవే తొలగిపోతాయి. దానితో ఇక గ్రాహమూ లేదు. పట్టుకోటమూ లేదు. బాధ పడటమూ లేదు. మొత్తం గజేంద్ర మోక్షణ సంకేతమంతా ఈ శ్లోకం ద్వారా వ్యంగ్యంగా మనకు భాసింపజేశాడు మహాముని.

ఇలాంటి గొప్ప ఊహ జనించిందంటే గజేంద్రుడి కది ఎంత పూర్వ పుణ్యఫలం. కరీంద్రోత్తమ యోని బుట్టు మని గదా ఆశీర్వదించాడు మహర్షి. అందుకే కరీంద్ర జన్మ ఎత్తినా ఉత్తమమైన సంస్కారమెక్కడికీ పోలేదా రాజుకు. దానికి తగిన ఉన్నతోన్నతమైన భావాలే ఉదయిస్తున్నాయి మనసులో. అవన్నీ పూర్వ పుణ్య ఫలంగా కలిగిన దివ్యజ్ఞాన సంపత్తి నుంచి వెలువడిన జ్ఞానకిరణాలు. ఇలాంటి దివ్యమైన జ్ఞానమంతకు ముందు జన్మలో లేదు. అది సగుణభావనతోనే గడచిపోయింది. కనుక ఇంత దివ్యభావన లేదక్కడ. పోతే ఇది దాని ఫలితంగా నిర్గుణ మార్గంలో అడుగు పెట్టిన జన్మ. కనుక దీనికి తగిన దివ్యమైన ఆలోచనలే కలుగుతున్నాయి ఇప్పుడు. ఎలాటివా ఆలోచనలంటే ఇక ఎంతగానో వర్ణించి చెబుతున్నది భాగవతం.

ఏ రూపంబున దీని గెల్తునిట మీదే వేల్పు జింతించు - నె
వ్వారింజీరుదు - నెవ్వరడ్డమిక - నివ్వారి ప్రచారోత్తమున్
వారిం పందగు వారలెవ్వ - రఖిల వ్యాపార పారాయణుల్

లేరే మ్రొక్కద....నని తొలుదొల్త భయపడి దీనాలాపాలు చేస్తుంది. దిక్కుమాలిన తన మొఱ ఆలకించే పుణ్యాత్ములెవ్వరూ లేరా అని ఆక్రందన చేస్తుంది. ప్రాణోపద్రవం సంభవించినప్పుడు దేహధారి అయిన వాడికెవడికైనా ఇది సహజమే. తప్పదు.

మరి అలాంటప్పుడు తన గత వైభవాన్ని స్మరించుకొని బాధపడటం కూడా సహజమే ప్రాణులకు.

నా నానే కప యూథములువనము లోనం బెద్ద కాలంబు స
న్మానింపం దశ లక్ష కోటి కరిణీ నాథుండనై యుండి - మ
ద్దానాంభః పరిపుష్ట చందన లతాంత చ్ఛాయ లందు

.... హాయిగా ఆనందంగా కాలం గడిపేవాణ్ణి ఈ నీరాశ నన్ను పేరాశ అయి ఇటెందుకు తెచ్చింది. ఎందుకింత భయం వచ్చి నెత్తిన పడింది. ఇది ఎలా తొలగిపోతుందో గదా ఈశ్వరా ! అని వాపోతుంది. ఆ వాపోవటంలో పురాకృత సుకృతం కొద్దీ ఈశ్వరుడి నామం దాని నాలుకమీద అప్రయత్నంగా దొరలింది. వెంటనే ఆత్మజ్ఞానం సహస్రముఖాలుగా ఆవిర్భవించింది మనసులో. ఇక కీర్తించ నారంభించింది. ఏమని.

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై
యెవ్వని యందు డిందు - పరమేశ్వరుడెవ్వడు - మూలకారణం
బెవ్వ డనాది మధ్యలయు డెవ్వడు - సర్వము తానయైన వా
డెవ్వడు వాని - నాత్మ భవు నీశ్వరునే శరణంబు వేడెదన్

ఆ ఈశ్వరుడెలాంటి వాడంటే వర్ణిస్తున్నాడు. ఎవడీ ప్రపంచ సృష్టి స్థితి లయాలకు మూడింటికీ కారణభూతుడోవాడట. **"జన్మా ద్యస్య యతః"** అనే సూత్రాన్ని జ్ఞప్తికి తెస్తున్నదీమాట. చరాచర రూపంగా మన చుట్టూ పరచుకొని ఉన్న సర్వ ప్రపంచమూ ఒక కార్యం. దానిపాటికది ఆవిర్భవించలేదిది. దీనికేదో కారణముండి తీరాలి. సమస్తానికీ కారణం కాబట్టి దానికి కారణమంటూ ఉండనేరదు. అందుకే అది మూలకారణం.

అయితే కారణమనే సరికది కుండకు మట్టిలాగా ఆభరణానికి బంగారం లాగా అచేతనమనే ఆశంక కలగవచ్చు. అలా అచేతనం కాదది. సచేతనం. పరమేశ్వరుడంటే అదే అర్థం. అన్నింటినీ ఈశనం చేసేవాడు. వశంలో ఉంచుకొని నడిపేవాడు. అలాంటి ఈశనం చేయాలంటే అచేతనమైన పదార్థం చేయలేదు. పరిపూర్ణమైన చేతన పదార్థమే చేయగలదు. అప్పటికీ మృదాదులలాగా సత్పదార్థమే

గాక తద్విలక్షణమైన చిత్పదార్థం కూడా ఇది. ఇలా సచ్చిదాత్మకమైన తత్త్వమేదో అదీ ఈ కార్యరూపమైన జగత్తుకంతా కారణం. అది మన కదృష్టమైనా దృష్టమైన ఈ కార్యాన్ని బట్టే ఆ కారణాన్ని ఊహించవచ్చు మనం. అది లక్ష్యమైతే ఇది దానికి లక్షణం.

మరి కార్యం కారణమనే సరికివి రెండూ ఎప్పుడూ ఇలా తీర్థానికి తీర్థంగా, ప్రసాదానికి ప్రసాదంగా – విడిపోయి ఉంటాయని మరలా భ్రాంతి పడవచ్చు. అలాటి అపోహ పెట్టుకోరాదు. సర్వమూ తానయైన వాడట. రెండూ కలిసి ఒక్కటే. ఒక్కటే అంటే ఇది అది అవుతుందనా లేక అది ఇది అవుతుందనా అని మరలా సందేహం రావచ్చు. ఇందులో ఏదైనా అది ఒక్కటే. అందుకే చెబుతున్నాడు. **"సర్వము తానయైన"** అని. అంటే తాను సర్వమూ కావటం కాదు. మీదు మిక్కిలి ఈ కనిపించే సర్వమూ తానే అవుతుందట. అంటే జగత్తు ఈశ్వరాకారంగాని, ఈశ్వరుడు జగదాకారం కాదు. ఈశ్వరుడు జగదకారమనుకొంటే అది ఆభాస. జగత్తు ఈశ్వరాకారమని భావిస్తేనే అది సత్యం. ఏమి, అదే ఆభాస అయి ఇది సత్యమెందుకు కారాదు. అనాది మధ్యలయుడెవ్వడని ఈ ప్రశ్నకు జవాబు. ఆది మధ్యాంతాలున్నంత వరకూ అది తాత్కాలికమే గాని త్రికాలా బాధ్యమైన సత్యం కాదు. సత్యమనేది ఎప్పుడూ నిరపేక్షం. మరొక దానిమీద ఆధారపడరాదు. ఆది మధ్యాంతాలనే సరికి వాటి కోస మింకొక దాని నాశ్రయించవలసి వస్తుంది. ప్రపంచాని కిప్పుడాది మధ్యాంతాలను మనం చూస్తున్నాము. కనుక ఇది తన ఉనికి కోసం మరొక దాని నాశ్రయిస్తున్నది. ఆ ఆశ్రయమే దీనికి మూల కారణమైన ఈశ్వరచైతన్యం. అది మరలా ఆది మధ్యాంతాలు కలిగిందైతే మరొక మూల పదార్థాన్ని పట్టుకోవలసి వస్తుంది. అది ఎక్కడికీ నిలవక అనవస్థా దోషానికి దారి తీస్తుంది. కాబట్టి జగత్తు కంతా మూలమైన తత్త్వమని ఎప్పుడు పేరు పెట్టామో దానికిక ఆది మధ్యాంతాలు లేవు. లేకుంటే దీనిలాగా సాపేక్షం కాదు సాపేక్షకం కాకుంటే అది ఇక సత్యమే. అది సత్యమైతే ఇది దాని కాభాస అని వేరుగా చెప్పనగక్కరలేదు. దాని ఆభాసే కాబట్టి ఇది దానికన్నా ఇక వేరయిన పదర్థం కాదు. అంటే కార్యకారణ రూపంగా ఒకే ఒక చైతన్యం విస్తరించి ఉందన్న మాట. ఎక్కడ ఉందది. ఆత్మభువు. ఆత్మభూః అనే రూపానికిది తత్సమరూపం. ఆత్మభూ అంటే స్వయంభూ. తన పాటికి తానున్నది.

తనకు తానే ప్రమాణమని అర్థం. మరొకటుంటే గదా ఎక్కడ అనే ప్రశ్న. ఆధారమూ అదే. ఆధేయమూ అదే. ఇక ఎక్కడ అనే ప్రశ్న ఏముంది. స్వమహిమ్ని ప్రతిష్ఠితమది. అలాంటి ఈశ్వరుణ్ణి భజిస్తానంటాడు గజేంద్రుడు. ఎంత గొప్ప భావమిది. వేదాంత శాస్త్ర ప్రమేయమంతా ఒక్కచోట రంగరించి పెట్టిన చక్కని పద్యమిది.

సరే ! బాగానే ఉంది. అయితే సకలమూ ఆ ఈశ్వరుడే గదా. అలాంటప్పుడీ ప్రపంచ సృష్టి ఏమిటి. ఇందులో మనం పుట్టటం పెరగటమేమిటి. ఈ బాధలు పడటమేమిటి. దానికి సమాధానమిస్తున్నాడు. **"ఒక పరిజగములు వెలినిడి - ఒక పరిలోపలికి గొనుచు"** వాస్తవమే. అంతా ఆ ఈశ్వర స్వరూపమే. ఈశ్వరుడు గనుకనే ఆయన కొక లోకోత్తర శక్తి ఉన్నది. తన్నిమిత్తంగా అతడీ బ్రహ్మాండ భాండాలనన్నింటినీ తన స్వరూపంలో నుంచే బయట పెడతాడు. కొంత కాలమలా నిలుపుతాడు. మరలా వీటన్నిటినీ తన లోపలికే తీసుకొంటాడు. ఒక మహాసముద్రం లాంటి వాడాయన. సముద్రం తనలో నుంచే తరంగ ఫేన బుద్బుదాలను వేలకు వేలు సృజిస్తుంది. తనమీదనే త్రిప్పుతుంటుంది. అలా త్రిప్పినట్టే త్రిప్పి మరలా కొంత సేపటికి వాటినన్నిటినీ తన గర్భంలోనే ఇముడ్చుకొంటుంది. అలాగే ఇక్కడా. అయితే ఈ సమస్త లోకాలనూ వెలినిడుతూ లోగొంటూ పోతే ఆయనకూ ద్వంద్వ బాధ తప్పదు గదా-అంటే అలాంటి బాధ ఏదీ లేదా పరమాత్మకు. ఏమి కారణం. ఆయన సకలార్థ సాక్షి. అకలంకుడు. వెలినిడినప్పుడీ సమస్త సృష్టికీ సాక్షి ఆయన. కాబట్టి దాని పీడ ఆయన నంటదు. లో గొన్నప్పుడా ప్రపంచమనే కళంకమిక లేనే లేదు. కాబట్టి ఆ పాటి పీడ కూడా కలగబోదు.

ఆయన కంటే సరే. ముక్త సంగుడు. అద్వితీయుడు. సర్వశక్తుడు. మరి మన బోటి జీవుల గతి ఏమిటి. మనకంతటి సామర్థ్యం లేదు గదా. వాస్తవమే. లేనట్టే కనిపిస్తుంది మనకలాటి సామర్థ్యం. కాని ఇది వ్యావహారికమే. పారమార్థికంగా మాటాడితే మనకూ ఆ ఈశ్వరుడికి భేదం లేదు. ఈశ్వరుడద్వితీయు డన్నప్పుడిక మనమనే జీవులమెక్కడున్నాము. అర్థం చేసుకోలేకనే మనమెక్కడో ఉన్నట్టు అజ్ఞులమూ అశక్తుల మయినట్టు భాసిస్తున్నాము. చక్కగా అర్థం చేసుకొంటే మనమూ ఆయనలాగా అసక్తులమే. శక్తులమే. అది ఎలాగంటే చెబుతున్నాడు.

లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన - తుది నలోకంబగు పెం
జీకటి - కవ్వల నెవ్వం డేకాకృతి వెలుగునతని నే సేవింతున్

పెంజీకటి కవ్వల ఉండే వెలుగా పరమాత్మ. వెలుగనేది ఒక్కటే. మిగతాదంతా ఇక చీకటి. చీకటి వెలుగు కంటే భిన్నంగా కనిపిస్తుంది. కాని వాస్తవంలో కాదు. అది కూడా వెలుగే. అప్పుడిక చీకటి వెలుగులనే ద్వంద్వం లేదు అంతా వెలుగే. అదే ఏకాకృతి అంటే. ఎటు వచ్చీ ఈ చీకటి కూడా వెలుగుగా చూడగలగాలి. ఏమిటి చీకటి అంటే ఇక్కడ. ఈ లోకాలూ, లోకాధిపతులైన దేవతలూ, ఆ లోకాలలో నివసించే జీవులూ. ఇవన్నీ వాస్తవంలో లేవు. అంతా హుళక్కే. వ్యక్తమైన ఈ ప్రపంచమంతా అవ్యక్తమైన బీజశక్తే. అందుకని ఇదితెగితే చివరకు నిలిచేది అదే. అది కూడా శక్తిమంతుడైన పరమాత్మతో ఓతప్రోతమై దానికన్నా విలక్షణం కాదు గనుక అంతా ఏకమే. పరమాత్మే. అయితే ఇది పరమాత్మ కెప్పుడూ ఎఱుకే. మనబోటి జీవాత్మల కలాటి ఎఱుకలేదు. దాన్ని మరలా అలవరుచుకోగలిగితే చాలు- మనమంతా ఈ సృష్టికి సాక్షి భూతంగా అకలంకంగా నిలువగలం.

అసలీ పరమాత్మ జీవాత్మ అని పేరేగాని రెండు తత్త్వాలు లేవు వాస్తవానికి. అంతా చైతన్యమే అయినప్పుడవి రెండెలా కాగలవు. రెండాకాశాలుండట మనేది సంభవం కానట్టే రెండు చైతన్యాలు కూడా లేవు. మరి ఎలా వచ్చిందీ జీవేశ్వర వ్యవహారం. అది ఆ మహాచైతన్య లీల.

నర్తకుని భంగి పెక్కగు మూర్తులతో నెవ్వడాడు - మునులు దివిజులుం
గీర్తింపనేర - రెవ్వని వర్తన మెరులెఱుగ రట్టివాని నుతింతున్

ఒక వేషగా డెలాగైతే రాజు, రైతు, దొంగ, దొర, రకరకాల వేషాలు వేసుకొని రంగ స్థలం మీద నటిస్తూ మనకు దిగ్భ్రమ గొలుపుతాడో అలాగే మహానటుడైన ఆ పరమాత్మ కూడా మృగ పశుపక్షి మనుష్యాదికమైన భిన్న భిన్న నేపధ్యాలలో మనకు భిన్నంగా గోచరిస్తున్నాడు. ఆ భూమికలనే మనం జీవుడని పేరు పెట్టి చూస్తున్నాము. నిజానికి భూమికలే లేవు. అవన్నీ ఆయనవే. ఆ ఒక్కడే పెక్కురీతులుగా కనిపిస్తున్నాడు. అంత మాత్రమే. ఈ నానాత్వంలో ఆ ఏకత్వాన్ని దర్శించగలవాడే ధన్యుడు. అది దేవతలకూ ఋషులకే అగమ్య గోచరం. అది ఒరులెఱిగే విషయం కాదు. మరి

ఏమిటి తరణోపాయం. ఒరులనే భావాన్ని మరచి అది నేనే గదా అని ఎఱిగినప్పుడే అది కరతలా మలకం.

ఎవరయినా ఉన్నారా అలాంటి ఎఱుక గలవారు. అయ్యో లేకేమి. **మనుష్యాణాం సహస్రేషు** అన్నట్టు అంత బహుళంగా కాకపోయినా విరళంగా నైనా దొరకక పోరు. వారే ముక్త సంగులైన మునులు. వారెప్పుడూ దిదృక్షులే. సర్వభూత హితత్వం, శాంత చిత్తత్వం ఇలాంటి దైవగుణ సంపన్నులు. దానికి తోడు అసదృశ వ్రతాధ్యులు కూడా. యమ పట్టుదల వారికి. అలాంటి వారికి తప్పకుండా కనపడుతుందా దివ్యమైన పదం. **"దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా"** అని గదా శాస్త్ర ప్రమాణం. మాటలతో ఎఱుకలతో మనసులతో చేరరానిదే కావచ్చునది. అయినప్పటికీ సత్యమే. జీవిత గమ్యంగా భావించి నిపుణంగా తరచి చూచే నిష్కర్ముడికది ఎప్పుడూ చేరువే. ఇంతకూ రహస్య మేమంటే అసత్యమనెడి నీడతో వెలుగుతున్నదది. అసత్యమెప్పుడూ అసత్యమే కాబట్టి దానితో వెలుగుతున్నా అది ఎప్పుడూ ఒక్కటి. మరి అసత్తత్వంతో కలిసి ఉన్న నేరానికి సకారణమైతే, స్వరూపతః నిష్కారణమయి కూచున్నది.

మరి ఈ రెండు మాటలలో దాగి ఉన్న రహస్యం తెలిసిన వారే యోగాగ్ని దగ్ధ కర్ములైన యోగీశ్వరులు. వారే మహాత్ము లీసృష్టిలో. సద్యోగమంటే సమ్యగ్దర్శనమనే యోగంతో విభాసితమైనవి వారి మనసులు. అలాంటి మసృణీ భూతమైన మనో దర్పణాలలో చక్కగా ప్రతిఫలించిన ఆ ఆత్మతత్వాన్ని వారు నిరంతరమూ దర్శిస్తూనే ఉంటారు. ఇలా అనుకొంటూ ఉండగానే గజేంద్రుడికి తనపాశవమైన ఉపాధి మనసుకు వచ్చింది. ఉపాధి లక్షణమెక్కడికి పోతుంది. అది జ్ఞాపకం రాగానే మొరపెడుతున్నాడు. **"మాదృక్ప్రపన్న పశుపాశ విమోక్షణాయ-ముక్తాయ భూరి కరుణాయ నమో ఽకలాయ"** అని. అంతేకాదు. **"ఆత్మాత్మ జాప్త గృహవిత్త జనేషు సక్తైఃదుష్ప్రాపణాయ గుణ సంగ వివర్జితాయ"** శరీరబంధు మిత్ర పుత్ర కళత్ర విత్త గృహ క్షేత్రాదులలో సదా సక్తులమైన పశుబుద్ధి మాది. అలాటి బుద్ధిగల మాబోటి పశువుల కందరాని పదం నీది. ఎప్పటికైనా నీ వనుగ్రహించి ఈ పశుపాశ విమోక్షణం చేస్తేనే మాకు మోక్షమని వాపోతాడు. గజేంద్రుడు కోరిన మోక్షణమప్పటికీ సంసార పాశమోక్షణమే మరేదీగాదు.

మరి అలాటి పరమాత్మ ఒకడున్నాడా. అనుమానం కలిగింది మరలా గజేంద్రుడికి దేహమనే ఉపాధి ఒకటున్నంత వరకూ దాని చెహరా అది చూపుతూనే ఉంటుంది. ఎంత జ్ఞానికైనా అప్పుడప్పుడు మనో నిబ్బరం దెబ్బ తింటుంది. దాని ప్రభావమలాంటిది. ఆ దెబ్బే తగిలిందిప్పుడు గజేంద్రుడికి కూడా. ఉన్నట్టుండి అనుమాన పిశాచ మావరించిం దతణ్ణి.

కలడందురు దీనుల యెడ కలడందురు పరమయోగి గణముల పాలం
గలడందు రన్ని దిశలను కలడు కలం డనెడు వాడు కలడో లేడో

అసలు వాడున్నాడా లేడా. ఉంటే అన్నీ తెలిసిన యోగుల దగ్గర ఎలాగో ఏమీ తెలియని దీనులదగ్గర కూడా ఉండాలి గదా. అసలీ యోగులేమిటి. దీనులేమిటి. సమస్త దిక్కులలో కూడా పిక్కటిల్లి ఉన్న తత్త్వమని గదా వర్ణించారు పెద్దలు. మరి ఎందుకు నన్నాదుకోడు. అని ప్రశ్న వచ్చింది. దీనితో మనసు కుంగింది. అధైర్యంతో గుండె దిగజారింది. తన శరీర బాధ మరలా తనకు జ్ఞాపకం వచ్చింది. దానితో మరలా దీనాలాపాలు చేయసాగాడు.

కలుగడే నా పాలి కలిమి సందేహింప – కలిమి లేములు లేక కలుగువాడు
నా కడ్డ పడరాడె నలిన సాధువులచే – బడిన సాధుల కడ్డపడెడు వాడు
చూడడే నా పాటు చూపుల జూడక – చూచు వారల గృప జూచువాడు
లీలతో నా మొఱాలింపడే మెఱగుల మొఱలెఱుంగుచుదన్ను మొఱగువాడు

అకించనులకూ ఆర్తులకూ అడ్డపడవలసిన వాడే. అయినా పడలేదంటే అది ఒక మోసం. అది ఆ పరమాత్మ స్వభావంలోనే ఉంది. ఆయన చూపులతో చూడకుండా చూచేవారినే చూస్తాడు. మొఱ పెట్టే వారి మొఱ లెఱుంగటానికే తన్ను మఱుగుపరుస్తాడు. అయినా అఖిల రూపాలూ తన రూపమైన వాడే గదా. పైగా భక్త జనముల దీనుల పాలివాడే గదా. వినకపోతాడా. చూడకపోతాడా. రాకపోతాడా.

ఏమో వస్తాడో లేదో – అని భయపడటానికాయన ఎక్కడ ఉన్నాడని ఇంతకూ మరలా పూర్వ సంస్కారం తళుక్కున్న మెఱసి జ్ఞానోదయమయింది గజేంద్రుడికి. దానితో ఇలా వర్ణిస్తున్నాడు.

విశ్వకరు విశ్వదూరుని విశ్వాత్ముని - విశ్వవేద్యు - విశ్వు నవిశ్వున్
శాశ్వతు - నజు - బ్రహ్మ ప్రభు నీశ్వరునింబరమపురుషు నే భజియింతున్

ఎవ్వనిచే జనించు అనే పద్యంలాగా సమస్త శాస్త్రసార సంగ్రహమిది. అంతేకాదు. కేవల శాస్త్రార్థమే గాకఅపరోక్షమైన దాని అనుభవం కూడా పొందుపడి ఉన్నదిందులో. విశ్వకరుడట ఆ పరమాత్మ. విశ్వమనే పదార్థాన్ని తయారుచేసిన వాడు. విశ్వదూరుని. తయారుచేసి తయారయిన ప్రపంచానికి దూరంగా ఉన్నాడు. ఒక కుమ్మరిఉన్నాడు. కుండ ఉన్నది. కుండను కుమ్మరే తయారుచేస్తాడు. చేసినా ఆ చేసిన కుండలో లేడా కుమ్మరి. దానికి దూరంగానే ఉంటాడు. అలాగే ప్రపంచాన్ని సృష్టించినా ఈ సృష్టికి అతీతంగానే ఉన్నాడా స్రష్ట అయితే అంత అతీతంగా దూరంగా ఉండిపోతే ఎలాగ. అది అసలు ఉందో లేదో మనకు తెలియదు. కుమ్మరి విషయ మంటే అది వేరు. కుండతో అవినాభావంగా లేకపోయినా దానికి బాహ్యంగానైనా ఎక్కడో ఒకచోట లోకంలో కనిపిస్తున్నాడు. కనుక నమ్మకం మనకు వాడున్నాడని. ఇక్కడ అలా కాదు. సృష్టించి మన ముందు పారేసి తానెక్కడో ఉన్నాడని చెబుతున్నారు. చెబుతున్నారే గాని మనం చూడటం లేదు గదా. ఏమిటి నమ్మకమని ప్రశ్న వస్తుంది. అందుకే విశ్వాత్ముని, విశ్వానికంతా ఆత్మ. అంటే స్వరూపమాయన. కుండకు కుమ్మరి నిమిత్తమైతే మట్టి అనేది స్వరూపం. కుమ్మరి దూరంగా ఉన్నా మట్టి అలా దూరం కావటానికి వీలులేదు. ఎందుకంటే అది దాని స్వరూపమే అయి కూచుంది. ఎలా దూరమవుతుంది. అలాగే ప్రస్తుతం ఈ సృష్టించిన విశ్వానికంతా ఆయన కుమ్మరిలాగా కేవల నిమిత్త కారణమే గాదు. మట్టిలాగా స్వరూపం కూడా. అంటే ఆ ఈశ్వర చైతన్యమే ప్రపంచాకారంగా భాసిస్తున్నది. అంచేత ఎంత దూరమో అంత దగ్గర ఆ పరమాత్మ దీనికి. నిమిత్తంగా దూరమనుకొంటే ఉపాదానంగా మరలా దగ్గరే. దగ్గరంటే లోపలా వెలపలా మధ్యలో సర్వత్రా ఆ స్వరూపమేనని అర్థం. పోతే విశ్వవేద్యు. అంత కలగా పులగంగా వ్యాపించి ఉన్నా అది మనకీ విశ్వంలో ఎందుకు కనపడటం లేదని మరలా సందేహం. మట్టిలాగా దానికొక నిర్దిష్టమైన రూపంలేదు. శుద్ధచైతన్యమది. అందుకే కనపడటం లేదు. మరి కనపడకపోతే ముక్తి లేదా మానవుడికి. అంచేత కుండను బట్టి దానిలో ఉన్న మట్టిని పోల్చుకొన్నట్టే ఈ ప్రపంచాన్ని ఆధారం చేసుకొనే దానిలో దాగి ఉన్న ఆ తత్త్వాన్ని పట్టుకోవాలి మనం.

మట్టి నల్లగా గట్టిగా అణురూపంగా ఉన్న ఒకానొక పదార్థం. అది కుండలోనే ఉన్నా కుండ యొక్క గుండ్రని ఆకారమూ కుండ అనే బుద్ధీ మనకున్నంత వరకూ దృష్టికి రాదు. అక్కడే ఉన్నా తాత్కాలికంగా మఱుగుపడి ఉంటుంది. ఆ నామరూపాలు మనసుకు రాకుండా చూస్తే బయటపడి కనిపిస్తుంది. అలాగే ఈ విశ్వమంతా పరచుకొని ఉన్నా అది ఈ విశ్వంలోని నామరూపాలు చూస్తున్నంతదనుకా మనకు మనసుకు రాదు. వీటిని ప్రక్కకు త్రోసి ఆకాశంలాగా సమానంగా పరచుకొని ఉన్న ఒక నిశ్చలమైన పదార్థం లాగా దానినెప్పుడు భావన చేస్తామో అప్పుడే ఈ నామరూపాలన్నీ ఆ సచ్చిద్రూపంగా మనకు దర్శనమిస్తాయి. ఈ ప్రకారంగా ఇవే చివరకా తత్త్వాన్ని పట్టి ఇచ్చాయి కాబట్టి విశ్వం చేతనే వేద్యుడతడు.

అంతేకాదు. విశ్వు నవిశ్వున్. విశ్వమూ కాదది అవిశ్వమూ కాదట. ఇదేమిటీ గొడవ. అయితే విశ్వమైనా కావాలి లేదా విశ్వం కాకుండానైనా పోవాలి. రెండూ అదే ఎలా అవుతుంది. అవుతుంది. అదే చిత్రం. ఎలాగంటే విశ్వమంతా దాని సృష్టే దాని వివర్తమే కాబట్టి ఆభరణాలన్నీ బంగారే అయినట్టు ఈ విశ్వమంతా అదే. అలాగే ఈ విశ్వమెంత సృష్టి అయినట్టు కనిపించినా ఇది వాస్తవంలో సృష్టే కాలేదు. రాలేదు. ఆది మధ్యాంతాలలో ఉన్నదా ఒకే ఒక చైతన్యం. కాబట్టి అది విశ్వం కానేకాదు. అవిశ్వమే. ఇలా విశ్వమయి కూడా కాని తత్త్వమది. కనుకనే శాశ్వతం. ప్రపంచంలాగా నశ్వరం కాదు. కారణం. అజుడు. జీవిలాగా అది జన్మించింది కాదు. అదే అన్నిటికీ మూలమైనప్పుడెలా జనిస్తుంది. అయితే అజుడు మరొకడున్నాడు గదా అంటే బ్రహ్మ ప్రభు. అజుడంటె బ్రహ్మదేవుడని అర్థమైనా ఆ బ్రహ్మకు కూడా ప్రభుడైన అజుడీయన. దేని నుంచి ప్రభవిస్తాడో అది ప్రభువు. బ్రహ్మ సాక్షాత్తూ ఆయన నాభి నుంచి ప్రభవించిన వాడే. కాబట్టి జుడేగాని అజుడు కాదు. నిజమైన అజుడా పరమాత్మే. ఈశ్వరుడు. తాను జన్మించకుండా తన నుంచి జన్మించే సమస్తానికి ఈశ్వరుడాయన. వీటి స్థితిగతులను నడిపేవాడు. ఇది ఆయన విభూతి దశ. పోతే పరమ పురుషు అలా అన్నింటిలో చేరి అంతర్యామి రూపంగా అన్నింటినీ శాసిస్తూ కూడా పరముడూ పురుషుడూ. అంటే అన్నింటికీ అతీతుడు. కారణం అన్నింటినీ పూరించినవాడు. అంతః పూర్ణమ్ బహిః పూర్ణమన్నట్టు సర్వత్రా పూర్ణమైన తత్త్వమది మరొక పదార్థానికి ఆస్కారం లేదు. అలాంటప్పుడిక

శాసించేవడెవడు. శాసించబడే దేమిటి. అంతా అబద్ధమే. ఇది ఆయన స్వరూపావస్థ. ఇలాంటి స్వరూపాన్నే భజిస్తానంటాడు గజేంద్రుడు. ఎంత గొప్ప విజ్ఞానంతో పలికిన పలుకులివి.

అయితే ఎంత పలుకైనా అది పలుకే. జ్ఞానంతోనే పలకవచ్చు. ఆ జ్ఞానానికి వైరాగ్యం తోడుకావాలి. సర్వ సంగ పరిత్యాగమే వైరాగ్యం. **"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకమ్ శరణమ్ వ్రజ"** అన్నాడు భగవానుడు. పుణ్యం పాపమనే వివేచన చేయక అన్ని ప్రపంచ ధర్మాలకూ తిలాంజలి ఇవ్వాలి. అది కూడా మనసా, వాచా, కర్మణా అప్పుడే ఆ కలిగిన జ్ఞానం నిష్ఠగా మారుతుంది. ఆ నిష్ఠ ఉన్నప్పుడే **"అహమ్ త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి"** అని భగవానుడిచ్చిన హామీ ఫలిస్తుంది. ప్రస్తుతం గజేంద్రుడలాంటి శరణా గతి నవలంబిస్తాడు చివరకు. **"లావొక్కింతయు లేదు. ధైర్యము విలోలంబయ్యె - ప్రాణంబులున్ తావుల్ దప్పెను"** ఇవన్నీ కూడా కాదు. **"నీవే తప్ప నితఃపరం బెఱుగ"** అనే భావం రావాలి మనసుకు. మామేకమ్ అనే సూత్రానికి వ్యాఖ్యానమిది. అంతేకాదు. **"ఓ కమలాప్త యోవరద - యోప్రతిపక్ష విపక్ష దూర"** అని సగుణ నిర్గుణాత్మకంగా కూడా ధ్యానించాడా పరతత్త్వాన్ని. ఇర్గుణమైనా అది సగుణ రూపంగా సాక్షాత్కరించగలదు. ఆర్తుడైన తన తాపాన్ని హరించగలదు గదా అని భక్తుడి తాత్పర్యం.

అలాగే సాక్షాత్కరించిం ద్రది. ఇంత పరాకాష్ఠకు వచ్చి పలవిస్తే ఎలా సాక్షాత్కరించక పోతుంది. తప్పకుండా సాక్షాత్కరిస్తుంది. మరి అలా సాక్షాత్కరించే శక్తి ఆయన కుందంటే అది విశ్వమయుడు గనుకనే ఉండగలిగింది. ఎంత విశ్వాతీతుడో అంత విశ్వమయుడాయన. విశ్వాతిగమైన జ్ఞానంతో ప్రపన్నులైనవారిని విశ్వమయుడై కాపాడుతాడు. తలపడె అన్నందుకు వెంటనే భక్తుడి కడ్డుపడ్డదలచాడు తలచాలంటే ముందు వినాలి గదా. విన్నాడు కూడా. కుయ్యాలించాడు. వినటం తలచటమే గాదు. వేగ రావాలి గదా. వేగంగానే వచ్చాడు కూడా. ఎక్కడో వైకుంఠంలో నగరిలో ఆ మూలసౌధంలో-మందార వనం దగ్గరి సిరితో ఏకాంతంగా క్రీడిస్తున్న ఆ హరి

"సిరికిం జెప్పడు - శంఖ చక్ర యుగముం జేదోయి సంధింప డే
పరివారంబును జీర డభ్ర గపతిం బన్నింప డా కర్ణికాం

తర ధమ్మిల్లము చక్క నొత్తడు వివాద ప్రోద్ధత శ్రీకుచో
పరి చేలాంచలమైన వీడడు గజ ప్రాణావ నోత్సాహియై"

ఆ గజప్రాణాలు కాపాడుదామనే సంరంభంలో ఆయన అన్నీ మరచిపోయాడు. సిరితో ఒక్కమాటైనా చెప్పలేదు. శంఖచక్రాది దివ్యాయుధాలు చేపట్టలేదు. పరివారాన్ని పరికించలేదు. వాహనమైన గరుడాళ్వారును గూడా పాటించలేదు. మరే కథాలేదు. అంతా మరచాడు. మరచాడా నిజంగా. పరిపూర్ణ చేతనుడైన పరమాత్మ ఏమిటి. మరవటమేమిటి. అసహాయ శూరుడు పరమాత్మ అని చెప్పటమే ఇందలి అభిప్రాయం. పరమాత్మ అంటే అది అద్వితీయమైన తత్త్వం గదా. అద్వితీయ మన్నప్పుడు సర్వశక్తులూ దానికే ఉన్నాయి. అది సర్వస్వతంత్రం. అనన్యాపేక్షం. అలాంటి భగవత్తత్త్వానికి మరొక దాని సహాయమేమిటి. అసలుంటే గదా మరొక పదార్థమనేది.

అయితే చమత్కారమేమంటే మరొకటేదీ వాస్తవంలో లేకపోయినా దాని మాయాశక్తి చేత దాని కన్నీ సంపన్నమే. నిత్యసిద్ధమే. సంకల్ప మాత్రం చేతనే ఆయన కవి సిద్ధిస్తాయి. చేతికి వస్తాయి. కనుకనే

తన వెంటన్ సిరి - లచ్చి వెంట నవరోధ వ్రాతమున్ - దానివె
న్కను బక్షీంద్రుడు - వాని పొంతను ధనుఃకౌమోదకీ శంఖ చ
క్ర నికాయంబును - నారదుండు - ధ్వజినీ కాంతుండు - తావచ్చి రొ
య్యన వైకుంఠ పురంబునం గలుగు వా - రాబాల గోపాలమున్

ఇందిరా కాంత ఏమి - మిగతా అంతఃపురాంగనలేమి - విహంగ మాధిపతి ఏమి, విష్వక్సేనుడేమి, శంఖ చక్రాది పరికరాలేమి, సర్వమూ ఆయన సంకల్పాను సారియై తరలి వచ్చింది. ఏమిటాయన సంకల్పమింతకూ. గజ ప్రాణావనం. అది ఎప్పుడా దివ్య చిత్తానికి తగిలిందో అప్పుడే అవన్నీ సన్నిధి చేశాయి. **"ఇచ్ఛా మాత్రమ్ ప్రభోఃసృష్టిః"** అనేది ఇదే. యోగీశ్వరులైన వారే సంకల్ప మాత్రంచేత ఆయా అద్భుతాలు సృష్టిస్తుంటే యోగీశ్వరేశ్వరుడైన భగవానుడి కది చెప్పేదేముంది. సర్వజ్ఞుడూ సర్వశక్తి సంపన్నుడూ ఆయన. ఎటు వచ్చీ అది ఆయా జీవుల సుకృత కర్మ పరిపాకం కొద్దీ ప్రాదుర్భవిస్తుంది. గజేంద్రుడి కర్మ ఇప్పుడీ క్షణానికి పాకానికి వచ్చింది. కనుకనే ఈక్షణగోచరుడయ్యాడు పరమాత్మ తనమందీ మార్బలంతో గూడా.

ఈక్షణ గోచరుడయింది ఒక్క గజేంద్రుడికే గాదు. గజేంద్రుడిలాంటి పుణ్య జీవులకంతా దర్శనమిచ్చాడు పరమాత్మ.

"విను వీథిం జనుదేర గాంచి రమరుల్ విష్ణున్ - సురారాతి జీ
వన సంపత్తి నిరాకరిష్ణు - కరుణా వర్ధిష్ణు - యోగీంద్ర హృ
ద్వన వర్తిష్ణు - సహిష్ణు - భక్త జన బృంద ప్రాభవాలంకరి
ష్ణు - నవోద్యోల్లస దిందిరా పరిచ రిష్ణుం జిష్ణు రోచిష్ణునిన్"

దుష్ట శిక్షణా శిష్ట రక్షణా ఆచరిస్తూ భక్త జన త్రాణ పారీణుడని పేరు గాంచిన ఆ శ్రీమన్నారాయణుడు ముక్కోటి దేవతలకూ పరిచితుడే గదా కనుకనే వారిలో వారు...

చను దెంచెన్ ఘనుడల్ల వాడె - హరి - పజ్జన్ గంటి రే లక్ష్మి - శం
ఖ నినాదం బదె - చక్రమల్లదె - భుజంగ ధ్వంసియున్ వాడె - క్ర
న్నన నేతెంచె"నని...

ఒకరి కొకరు చేయి చాపి చూపుతూ దగ్గరకు రాగానే **"ఓమ్ నమో నారాయణాయ"** అని తిరు మంత్రాన్ని జపిస్తూ వరుసగా నిలిచి ఆయనకు నమస్కరించారు వేల్పులు.

అది కూడా గమనించలేదా మహానుభావుడు. స్వీకరించను కూడా లేదు. కారణం. కుంజరేంద్ర పాలన పారవశ్యమట. అప్పటికా గజేంద్రుడే ముక్కోటిదేవతల కన్నా మేటి అని అర్థమవుతున్నది. భక్తి మార్గంలో కూడా అంతస్తులున్నాయి. అంతకంత కంతస్తుపెరిగే కొద్దీ పరమాత్మకు సన్నిహితుడవుతాడు సాధకుడు. మిగతా వారనాదరణీయులని గాదు. **నమే ద్వేష్యోస్తిన ప్రియః** అని పరమాత్మ కెవరూ సరిపడని వారు కారు. **ఉదరాస్సర్వ ఏవైతే.** అంతా ఉదారచరితులే. అయినా **జ్ఞానీత్వాత్మైవమే మతః** జ్ఞాని అయిన వాడు నా స్వరూపమే. ఎందుకని. **"అస్థిత స్సహిధర్మాత్మా మామే వానుత్తమాం గతిమ్"** నన్నే నమ్ముకొని ఉన్నాడతడు. నేను తప్ప సృష్టిలో మరేదీ కనపడటం లేదతనికి. **"ప్రియోహి జ్ఞాని నోత్యర్థ మహమ్ - సచ మమ ప్రియః"** అతడికి నేను ప్రియుణ్ణి గనుకనే నాకూ అతడంటే ప్రియమని చాటాడు గదా భగవానుడు. అదే ఇక్కడ గజేంద్రుడి వ్యవహారంలో చూపుతున్నాడు.

సరే ఎవరినీ సరకు చేయక మనస్సమాన సంచారుడై పోయి ఆ సరోవరాన్ని సమీపించి వెంటనే **"కరుణా సింధుడు శౌరి వారి చరమున్ ఖండింపగా బంపె"** దేనిని. సుదర్శనచక్రాన్ని. ఎలాంటి చక్రమది. బహువిధ బ్రహ్మాండ భాండచ్ఛటాంతర నిర్వక్రము. ఎక్కడా దాని ధాటికి తిరుగులేదు. సాటిలేని మేటి దివ్యాయుధ మది. స్వామివారు ప్రయోగించటమేమిటి. వెంటనే బయలుదేరట మేమిటి. అంభోజాకర మధ్య నూతన నలిన్యాలింగన ప్రక్రియా రంభుండైన వెలుంగు తేని క్రియ ఆ కొలనులో జొరబాఱి భీమంబై తలద్రుంచి ప్రాణముల బాపిందా మకరమనే పాపిని. వాడూ పాపి గాదు. ఆ మాటకు వస్తే హూహువనే గంధర్వుడు. వాడి కర్మంచాలక ఏదో అపచారం చేసి దేవలుడనే మహర్షి శాపం వల్ల మకరమై జన్మించాడు. శ్రీహరి చక్ర స్పర్శవల్ల శాప విముక్తుడై ఆయనకు భక్తి తాత్పర్యంతో నమస్కరించి తదనుజ్ఞాతుడై తిరిగి నిజరూపం ధరించి తన లోకానికి వెళ్లిపోతాడు. హరిచక్ర స్పర్శచేత గాని దేహబంధం పాయలేదంటే ఆ దేహమెంతో దుర్భేద్యమైనదే కావాలి. హేమక్ష్మాధర దేహమది. అంతేగాక నిస్సీ మోత్సాహము వీత దాహమైనది. శాపప్రభావంచేత సంక్రమించిన బలం గనుకనే ఆ గ్రాహమంతగా విజృంభించింది. పృథు శక్తితో వెయ్యేండ్లు పోరాడినా గజేంద్రు డలసిపోయాడే గాని ఆ గ్రాహం చెక్కు చెదరలేదు. అన్ని ఏనుగులు బాసట ఉండి కూడా దానినేమి చేయలేకపోయాయి. అది చకిత వన్యే భేంద్ర సందోహం. లేకుంటే అంత గొప్ప గజేంద్రుడేమిటి. దానిని జయించలేక పోవటమేమిటి. మహర్షి శాపప్రభావమది. హరి చక్ర స్పర్శవల్ల విముక్తి చెందవలసి ఉన్నదది. ఆ స్పర్శ దానికి కలగాలంటే విష్ణువు ప్రత్యక్షం కావాలి. కావాలంటే ఒక మహాభాగవతుడి కాలు తాన పట్టుకోవాలి. అందుకే పట్టుకొని బాధించాడా గజేంద్రుణ్ణి. దీనివల్ల గజేంద్రుడెంత మహాభక్తుడో మనకు భంగ్యంతరంగా సూచిస్తున్నది భాగవతం.

దుష్టశిక్షణమయింది. ఇక శిష్ట రక్షణ కావలసి ఉంది. దుష్టుని శిక్షించటం మాత్రమే శిష్ట రక్షణకాదు. శిష్టుడికి తరుణోపాయం చూపినప్పుడే అది నిజమైన రక్షణ. అదికూడా వారి వారి అధికార తారతమ్యాన్ని బట్టి. **యే యథామాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమని** గదా శాస్త్రం. ఇక్కడ గజేంద్రుడి అధికారమేమిటి. అతడు కోరిందేమిటి. ఇంతకు ముందు జన్మలో అయితే అది సగుణం. కాని ఇప్పుడు

సగుణం కాదు. కేవల నిర్గుణమైన మార్గంలోనిది. వాసుదేవ స్సర్వమితి అని సర్వమూ ఈశ్వరమయంగానే భావిస్తున్నాడిపుడు. పరిపూర్ణమైన జ్ఞాననిష్ఠ ఇది. ఇలాంటి ఉత్తమాధికారికి భగవానుడివ్వవలసింది కేవలం మోక్షమే. అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి అని గదా హామీ ఇచ్చాడు. అదే ఇచ్చాడనుకోవాలి ఇప్పుడు.

తమముం బాసిన రోహిణీ విభు క్రియన్ దర్పించి సంసార దుఃఖము వీడ్కొన్న విరక్త చిత్తుని గతిన్ గ్రాహంబు పట్టూడ్చి పాదము లల్లార్చి కరేణుకా విభుడు సౌందర్యంబుతో నొప్పె

నని వర్ణించటంలో కూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తున్నాడు భాగవతకారుడు.

అయితే మరి

హస్తిలోకనాథుడజ్ఞాన రహితుడై విష్ణు రూపుడగుచు వెలుగుచుండె అని వర్ణించాడే కవి. మూలంలో కూడా

"గజేంద్రో భగవతః స్పర్శా - ద్విముక్తో ఽజ్ఞాన బంధనాత్
ప్రాప్తో భగవతో రూపమ్ పీత వాసా శ్చతుర్భుజః"

అని ఉంది. ఈ వర్ణన చూస్తే అతనికి విష్ణు సారూప్యమే వచ్చినట్టు కనిపిస్తున్నది. మోక్షం లభించినట్టు లేదని ఆశంకించవచ్చు. విష్ణు సారూప్యమనేది విభూతి ప్రాధాన్యాన్ని బట్టి చెప్పిన మాటే గాని మరేమీ గాదు. విష్ణువంటే కూడా ఇక్కడ కేవల శబ్ద స్వరూపాన్ని బట్టి మోసపోరాదు. విష్ణువంటే ఎవరో ఏమిటో ఇంతకు ముందే నిరూపించి ఉన్నాము. **"పరమ పూరుషుడొక్కడాద్యుడు పాలనోద్భవ నాశముల్ సొరిది జేయ ముకుంద పద్మజ శూలి సంజ్ఞల"**దాల్చాడని వర్ణించారే ఆ పరమ పురుషుడే ఇక్కడ విష్ణువు. ఈ విషయం తరువాత ప్రహ్లాద చరిత్రలో ఇంకా సవిస్తరంగా మనవి చేస్తాను. ఇంతకూ విష్ణువంటే సర్వవ్యాపకమైన తత్త్వం. అలాంటి తత్త్వంతో ఐక్యం చెందటానికే గదా అతడు గజేంద్రుడుగా జన్మించింది. అలా కాక కేవల విష్ణుత్వమే చెంది వికుంఠంలోనే వసించటానికైతే అది ఇంద్రద్యుమ్నుడి జన్మలోనే పొంది ఉండేవాడు. పరమ వైష్ణవుడు గదా అతడు. యం యం వాపి స్మరన్ భావమన్నట్టు ఆ భావంతోనే ప్రాణోత్క్రమణమయి అది అప్రయత్నంగానే గడించేవాడు.

దానికీ గజేంద్రయోనిలో వచ్చి మరల ఒక జన్మ ఎత్తవలసిన అగత్యమేమిటి. మరలా జన్మించాడంటేనే అప్పటికా జన్మలో అంతటి పరిపాకం రాలేదన్న మాట. మోక్షఫలాన్ని అందుకోదగిన పరిపాకమప్పుడు కలగలేదు. అది సాధించటానికే మరొక జన్మ కావలసి వచ్చింది. ఇది జడ భరతుడికి లేడి జన్మలాంటిది. అది తీరగానే అతడికి మరు జన్మలో జీవన్ముక్తి ఎలా లభించిందో అలాగే ఇంద్రద్యుమ్నుడికి కూడా గజజన్మ సాధన పరిసమాప్తి కోసం ప్రాప్తించింది. అది ఆలంబనంగా సాధన పూర్తి చేసుకొని పరిపూర్ణ జ్ఞాననిష్ఠుడయి చివరకా గజోపాధిని కూడా కాలదన్ని అశరీరమైన మోక్షసుఖాన్నే అందుకొన్నాడు. దానికీ మకర గ్రహణమూ, ఈ దుఃఖానుభవమూ, భగవదనుగ్రహమూ, విష్ణు సారూప్యమూ, ఇవన్నీ సహకారులు. మొత్తానికి సగుణ సాధన అనేది ఎలా పరిమితమో, అది నిర్గుణ సాధనగా పరిణమించినప్పుడే ఎలా ఫలదాయకమో, మనకు బోధించటమే ఈ కథా తాత్పర్యం. అందుకోసం చేసిన ఒక బృహత్కల్పనే ఈ గజేంద్ర మోక్షణ వృత్తాంతం. నిజానికి గజేంద్రుడూ లేడు. గ్రాహమూ లేదు. మానవుడి దేహాభిమానమే గజం. తన్మూలంగా ఏర్పడిన సంసార క్లేశమే గ్రాహం. పరిచ్ఛిన్నమైన ఆ అభిమానం వదిలేస్తే ఈ సంసార తాపత్రయమే లేదు. అప్పుడు వీడే ఈశ్వరుడు కాబట్టి సగుణ దృష్టీ లేదు. అదే మోక్షం. అసలైన గజేంద్ర మోక్షం.



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

12. నిర్గుణ భక్తులు - ప్రహ్లాదుడు

కడచిన అధ్యాయంలో మనం సగుణ నిర్గుణ సంధిని గురించి వర్ణించాము. దాని కుదాహరణ ప్రాయమైన గజేంద్రమోక్షణ కథా వృత్తాంతాన్ని కూడా విపులంగా ప్రస్తావించాము. ఇంద్ర ద్యుమ్నుడి జీవితం సగుణంతో గడచిపోతే అది నిర్గుణంగా మారి ముక్తి పొందటానికా భక్తుడు మరలా గజేంద్ర జన్మ ఎత్తవలసి వచ్చింది. ఎత్తిన తరువాత కూడా వెంటనే పని చేయలేదా ప్రాక్తనసంస్కారం. అది ఉద్బుద్ధం కావటానికి కొంతకాలం పట్టిందా గజేంద్రుడికి. పోతే అలాంటి విలంబం కూడా లేక పుట్టగానే నిర్గుణ భావంతో పుట్టిన మహాజ్ఞాని చరిత్ర ఇప్పుడు చెప్పుకోవలసి ఉంది. అదే ప్రహ్లాదుడి చరిత్ర. పుట్టగానే కాదు. ఆ మాటకు వస్తే మాతృగర్భంలో ఉండగానే కలిగిందా భావమా మహనీయుడికి.

ప్రహ్లాదుడే చెబుతాడీ విషయం తన తోడి బాలురకు. వారు నీకీ గొప్ప బుద్ధి ఎలా అలవడిందని ప్రశ్నిస్తే ప్రహ్లాదుడు వారితో ఇలా అంటాడు. ఇలా అంటాడని నారద మహర్షి రాజసూయ యాగంలో ధర్మరాజుకు చెప్పిన వృత్తాంతమిది.

ఏవమ్ దైత్య సుతైః పృష్టో - మహాభాగవతో ఽసురః
ఉవాచ స్మయ మానస్తాన్ - స్మర న్మదను భాషితమ్

వారడిగిన ప్రశ్నకు నవ్వుతూ మహా భాగవతుడైన ప్రహ్లాద కుమారుడు నా మాటలన్నీ స్మరణకు వచ్చి ఇలా సమాధానమిచ్చాడంటాడు నారదుడు.

పితరి ప్రస్థితే ఽస్మాకమ్ తపసే మందరా చలమ్
యుద్ధోద్యమమ్ తదా చక్రు ర్విబుధా దానవాన్ ప్రతి

మా తండ్రి హిరణ్యకశిపుడు తపస్సు కోసం మందర పర్వత సమీపానికి వెళ్లగా సందు చూచి సకలదేవతలూ రాక్షసుల మీదికి దండెత్తి వచ్చారు. **"ఇంద్రస్తు రాజ మహిషీమ్ - మాతరం మమ చాగ్రహీత్"** అప్పుడు దేవేంద్రుడు మా తల్లి లీలావతిని బలాత్కారంగా పట్టుకొని పోసాగాడు. **"నీయమానామ్ భయోద్విగ్నామ్ - క్రందం తీం కురరీమివ"** సమయాని కాదరిని పోతూ ఉన్న నారద మహర్షి

అతని బారికి చిక్కి భయంతో వణుకుతూ ఆక్రందనం చేసే మా తల్లిని చూచాడు. చూచి ఇంద్రా ఈవిడ అనపరాధిని. పరభార్య. పతివ్రత. ఇలాంటి దాన్ని కొనిపోవటం నీ అంతవాడికి ధర్మం కాదు. విడిచి పెట్టమని మందలిస్తాడు. **"ఆస్తే ఽస్యాజఠరే వీర్య - మవిషహ్యమ్ సురద్విషః"** ఈవిడ గర్భంలో శిశువు పెరుగుతున్నాడు. వాడు జన్మించాడంటే దేవలోకానికితోధికంగా ముప్పు తెచ్చి పెడతాడు. వాణ్ణి ప్రసవించగానే చంపి వేయాలి. అంతదాకా ఈవిడ నా చెరలో ఉండాలంటాడు దేవేంద్రుడు. అందుకు నారదుడు నవ్వి

"సోఽయం నిష్కిల్బిషః - సాక్షా - న్మహా భాగవతో మహాన్
నత్వయా ప్రాప్స్యతే సంస్థామ్"

ఆవిడ గర్భవాసంలో పెరిగే శిశువెవరనుకొన్నావు. అతడు నీవనకొన్న రాక్షసుడు కాదు. క్రూరుడు కాదు. ఒక మహాభాగవతుడు. అతడు నీచేత చచ్చేవాడు కాదు సుమా అని హెచ్చరిస్తాడు.

ఆ హెచ్చరిక విని మనసులోని ఆందోళన విడిచి దేవేంద్రుడు తానూ విష్ణుభక్తుడే గనుక తన కార్యానికది అనుకూలమేనని భావించి ఆవిడను వదలిపెట్టి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వెళ్లిపోతాడు. తరువాత నారదుడు మాతల్లిని ఊరడించి తన ఆశ్రమానికి తీసుకెళ్లి ఆవిడ తనకు పరిచర్య చేస్తుంటే సకల ధర్మాలూ, సంసార తారకమైన విజ్ఞానమూ బోధిస్తాడు. ఆ తరువాత అది పెద్ద కాలంబు నాటి వినికి గావున నాడుది యగుటం జేసి పరిపాటి దప్పి సూటిలేక మరచిపోయిందట ఆ తల్లి. తనయుడైన తనకు మాత్రం

వెల్లిగొని నాట నుండియు నుల్లసితంబైన దైవ యోగంబున - శో
భిల్లెడు ముని మతమంతయు నుల్లంబున మఱపు పుట్ట దొకనాడైనన్

దైవానుగ్రహం వల్ల ఆ నారద గురూపదేశం అప్పటి నుంచీ మనసుకు పట్టి ఇప్పటికీ మరపురాకుండా మనసులో నాటుకొని పోయిందనీ చాటుతాడు.

చూడబోతే పంచశర ద్వయస్కుడవు బాలుడవని హిరణ్యకశిపుడన్నట్టు అయిదేండ్లు కూడా నిండలేదప్పటికి ప్రహ్లాదుడికి. ఆ వయసులో ఎవరికిగానీ చిన్నతనంలో జరిగిన వృత్తాంతం జ్ఞాపకం ఉండటమే అరుదు. అందులోనూ శైశవం

కూడా కాదు. గర్భంలో ఉండగా జరిగిన వృత్తాంతమది. అది ఇప్పుడెలా గుర్తుకు వచ్చిందా బాలుడికి. తండ్రి హిరణ్యకశిపుడు చెప్పాడా. అతడికా విషయమే తెలియదు. పైగా అతడి మతానికది విరుద్ధమైనది. కాబట్టి నారదుడు కూడా చెప్పి ఉండడాయనకా విషయం. పోనీ తల్లి లీలావతి చెప్పిందా. ఆవిడే పెద్దకాలం నాటి విషయమై మరచి పోయిందంటున్నాడు ప్రహ్లాదుడు. అలాంటప్పుడితని కెలా బోధిస్తుంది. పోతే ఇక నారదుడొకడే బయటపెట్టి ఉండాలతని కెప్పుడో ఒకప్పుడు. ఏదీ నారదుడా తరువాత ఎప్పుడుగానీ ప్రహ్లాదుణ్ణి కలుసుకొన్న సందర్భమే లేదు గదా. ఎలా బయట పెట్టటం. అంచేత దీనిని బట్టి చూస్తే ఎవరూ చెప్పకుండానే గర్భస్థ వృత్తాంత మా కుర్రవాడికి స్వయంగానే స్మరణకు వచ్చిందని తేట పడుతున్నది. అది ఆ కుర్రవాడే చెబుతున్నాడు. దైవయోగం చేత నాటి నుంచీ నాకది మరపు రాకుండా నిలిచి పోయిందని.

ఇలాటి జన్మాంతర స్మృతి అతనికున్నదంటే అతడెంత మహా భాగవతుడో ఇక చెప్పనక్కరలేదు. ఇలాటి వాడొకడున్నాడు వామదేవుడనే మహర్షి. **"గర్భస్థ ఏవ వామ దేవః ప్రతిపేదే అహమ్ మనుర భవమ్ - సూర్యోభవమితి"** అని చాటుందుపనిషత్తు. తల్లి గర్భంలో ఉండగానే నేను మనువునయ్యాను. సూర్యుడ నయ్యానని కేక వేశాడట ఆయన. సర్వాత్మ భావసిద్ధి కలిగినవాడు గాని అలా ధైర్యంగా అనలేడు. అది పరిపూర్ణమైన నిర్గుణ బ్రహ్మాత్మజ్ఞానంవల్లనే గాని మానవుడికి లభించదు. **"బహూనామ్ జన్మ నామంతే - జ్ఞానవాన్ మాం ప్రపద్యతే - వాసుదేవ స్సర్వమితి - స మహాత్మా సుదుర్లభః"** ఎన్నో కోట్ల జన్మలయి ఏ జన్మకో చివర కిదంతా ఆ స్వరూపమే ననే అఖండ జ్ఞానం కలిగితే ఆజ్ఞానంతో గాని నా అసలైన రూపం పట్టుకోలేడు సాధకుడు. అలాటివాడే నిజమైన మహాత్ముడు లోకంలో. మరి అలాంటి మహాత్ముడు నూటికి కోటికొకడు కనిపిస్తాడో లేదో - అని పరమాత్మ చాటుతున్నాడు లోకానికి. వామదేవాది మహాజ్ఞానుల కోవలోకి చేరిన అలాటి మహాత్ముడీ ప్రహ్లాదుడు. అతడిక జన్మించి సాధించవలసింది ఏదీ లేదు. జన్మించటమే సిద్ధుడుగా జన్మించాడు.

ఆహ్లాద సంహ్లాదానుహ్లాద ప్రహ్లాదులని అసలు హిరణ్యకశిపుడికి నలుగురు కుమారులు. అందులో ఆ మొదటి ముగ్గురికీ ఊరు పేరు లేదు. నాలుగవవాడే నాణెమైనవాడు. ప్రహ్లాదుడని పేరు పెట్టటంలోనే అవగతమవుతుంది మనకది.

"ప్రజ్ఞానమ్ బ్రహ్మ" అన్నారు. ప్రకృష్టమైన జ్ఞానమేదో అది ప్రజ్ఞానం. అదే బ్రహ్మస్వరూపం. అది అద్వితీయం కూడా గనుక ఆనంద స్వరూపం కూడా. ఎంత ఆనందమది. ఎంత జ్ఞానమో అంత. ఎంతటిదా జ్ఞానం. ప్రకృష్టమైనది. అలాగే ప్రకృష్టమైన ఆనందమే కావాలి ఆనందం కూడా. ఆనందానికే హ్లాదమని పేరు. అది ఆహ్లాదం కావచ్చు. అనుహ్లాదం కావచ్చు. సంహ్లాదం కావచ్చు. అవన్నీ తగ్గు రకాలు. అన్నిటికన్నా నిరతిశయమైతే అది ప్రహ్లాదం, ప్రజ్ఞానమన్నట్టు అది ప్రహ్లాదం. **"సేయమ్ ఆనందస్య మీమాంసా భవతి"** అని తైత్తిరీయంలో ఆనంద మీమాంస జరుగుతుంది. మనుష్యానందం, గంధర్వానందం ఇలా ఆనందంలోని అంతస్తులు వింగడిస్తూ చివరకు వచ్చేది బ్రహ్మానందమని వర్ణిస్తుంది. దాని వివిధ శాఖలే తతిమా ఆనందాలన్నీ అని కూడా పేర్కొంటుంది. ప్రస్తుత మీ ప్రహ్లాద అనే పేరు ఆ బ్రహ్మానందాన్నే సూచిస్తున్నది. అదీ ఇందులో సంకేతం.

దీనికి వ్యతిరిక్తంగా హిరణ్యకశిపు అనే అతని తండ్రి నామధేయం భాసిస్తున్నది. కొడుకు ప్రహ్లాదుడైతే అతడు హిరణ్యకశిపుడు. ఏమిటి హిరణ్యకశిపుడంటే అర్థం. హిరణ్యమంటే బంగారు. కశిపు అంటే వస్త్రమనీ, ఆహారమనీ అర్థం. బంగారమే కప్పుకొని తిరిగేవాడు. కబళించేవాడు. బంగారమేమిటి. ఐహిక భోగాలూ, ఐశ్వర్యాలు. ఇవే పరమార్థమని భావించేవాడే హిరణ్యకశిపుడు. అలా కాక సర్వాత్మకమైన శాశ్వతమైన ఆ బ్రహ్మాత్మ భావమే పరమార్థమని ఎంచేవాడు ప్రహ్లాదుడు. ఒకటి ఐహికం. వేరొకటి ఆముష్మికం. చూడబోతే రెండూ రెండు ధ్రువాలు. వీటికెలా లంగ రందటం. అందుకనే ఆ హోరా హోరిగా జరిగిన పోరాటం.

మరి తండ్రి కొడుకుల మధ్య పోరాటమేమిటి. ఒకరి మతమొకరి కర్థం గాకనా. అయికూడా మకురు తనమా. అర్థం కాదనటాని కాధారం లేదు. ప్రహ్లాదుడు పుట్టుకతోనే మహాజ్ఞాని. అతనికి తండ్రి స్వభావం తెలియకపోదు. ఒకవేళ అతడు తన మతం కాదని త్రోసి పుచ్చినా, అదీ తనకు సమ్మతమేనని తదనుగుణంగా నడుచుకోగలడు. బ్రహ్మజ్ఞాని అసలలాగే నడవాలి కూడా. అలా నడిస్తే ఇక వివాదమే లేదు పోతే ఇక హిరణ్యకశిపుడి కేమీ తెలియదా అంటే అదీ అర్థం లేని మాటే. ఎందుకంటే అతడు గొప్ప వేదాంతి. సకల శాస్త్ర పారంగతుడూ, తపస్సంపన్నుడూ కావటమే గాక అధ్యాత్మ విద్యలో ఆరి తేరినవాడు. దీనికి నిదర్శనమొకటి

భాగవతంలోనే కనిపిస్తుంది మనకు. హిరణ్యకశిపుని తమ్ముడొకడున్నాడు హిరణ్యాక్షుడని. వాడి కండ్లకెప్పుడూ ప్రపంచం తప్ప మరేదీ గోచరం కాదు. ఉన్నట్టుండి వాడీ భూమండలాన్నంతా చాపకట్టగా చుట్టి తీసుకుపోతుంటాడు. వాడిని పరమాత్మ వరాహ రూపంతో వెంటాడి వధిస్తాడు. అది విని వాడి తల్లి దితీ అంతఃపురకాంతలూ అందరూ పెద్ద పెట్టున ఆక్రందన చేస్తుంటారు. అప్పుడు హిరణ్యకశిపుడు వెళ్లి వారినిలా ఓదారుస్తాడు.

నీరాగార నివిష్ట పాంథుల క్రియన్ నిత్యంబు సంసార సం
చారుల్ వత్తురు - కూడి విత్తురు సదా సంగంబులే దొక్కచో
శూరుల్ పోయెడి త్రోవ బోయెను భవత్సూనుండు తల్లీ ! మహా
శూరుండాతడు తద్వియోగ మున కున్ శోకింపనీ కేటికిన్

సర్వజ్ఞుడీశుండు, సర్వాత్ముడ వ్యయుం డమలుండు, సత్యుడనంతుడాద్యు డాత్మరూపంబున నశ్రాంతమునుదన మాయా ప్రవర్తన మహిమ వలన గుణముల గల్పించి, గుణ సంగమంబున లింగ శరీరంబు లీలదాల్చి కంపిత జలములో కదలెడి క్రియ దోచుపాదపంబుల భంగి భ్రామ్యమాణ చక్షువుల ధరిత్రి చలితయై కానంగ బడిన భంగి వికల భావ రహితుడాత్మ మయుడు కంపి తాంతరంగంబున గదలినట్ల తోచు గదలకుండు ఈ విధంబున ఈశ్వరుండు లక్షణవంతుండుగా కుండియు లక్షితుండయి కర్మాను సరణంబున జీవులకు యోగ వియోగంబుల నొందించు.

అని బోధిస్తూ దీనికి తార్కాణగా అతడు ప్రేత బంధుయమ సంవాదమనే ఇతిహాస ముదాహరిస్తాడు తల్లికి. అందులో మరలా ఆ ప్రేతుని బంధువులకు బాల విప్రవేషధరుడయి వచ్చిన యమధర్మరాజు దాహరించిన విహంగమ వ్యాధుల కథ కూడా ఏ కరువు పెడతాడు. ఈ రెండు కథలూ చెప్పిన తరువాత మరలా ఇలా చెబుతూ పోతాడా తల్లికి తమ్ముని భార్యలకు.

పరులెవ్వరు, తామెవ్వరు, పరికింపగ నేక మగుట భావింపరు -త
త్పరమ జ్ఞానము లేమిని పరులును నేమనుచు దో చు బ్రాణులకెల్లన్

ఇవన్నీ ఎవరో గాదు. సాక్షాత్తూ హిరణ్యకశిపుడు పలికిన సుభాషితాలు. ఇంత గొప్ప వేదాంత విజ్ఞానం ఒలకబోసిన హిరణ్యకశిపుడేమీ తెలియని వాడని ఎలా

అనటం. తెలియని మూఢుడైతే ఇలా మాటలతని నోట రాగలవా. మరి ప్రహ్లాదుడు కూడా అలాంటి విజ్ఞాన సంపన్నుడే గదా. పైగా తన తనయుడే గదా. అలాంటి జ్ఞాని తన కుమారుడుగా జన్మించినందు కింకా ఎంతో ఆనందించవలసింది పోనిచ్చి అతనితో పోరాటానికి సిద్ధం కావటమేమిటి. పైకి చూస్తే ఆశ్చర్యంగానే తోస్తుంది మనకు. కాని భాగవతం దీనికి సమాధాన మెప్పుడో చెప్పింది. మనమది మనసుకు తెచ్చుకోటం లేదు. తెచ్చుకొని చూస్తే ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

ఏమిటది. అసలీ హిరణ్యాదులెవరు. సాక్షాత్తుగా ఒకప్పుడు వైకుంఠ ద్వారపాలకులు. సనకాదుల శాపం వల్ల వారికక్కడ నుంచి అధఃపతన మేర్పడింది. అయితే స్వామివారను గ్రహించి వారిని శత్రువులుగా మూడు జన్మలో మిత్రులుగా బహుజన్మలో ఏది కోరుతారని అడిగితే అంత దీర్ఘకాలమాయన వియోగం భరించలేక మూడు జన్మల శత్రుత్వాన్నే కోరుకొని వచ్చారు. వారు కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్యకశిపులు. ఊరక వీరు చేతులు ముడుచుకొని కూచుంటే ఎలాగ. వరానుగుణంగా వైరం సాధించి తీరాలి. అందుకోస మాయనను రెచ్చగొట్టాలి. ఏమి చేస్తే రెచ్చిపోతాడాయన. వారికి తెలుసు. సూటిగా ఆయనను నలుగురి ఎదుటా ఇష్టం వచ్చినట్టు దూషించైనా దూషించాలి. అది ద్వాపరంలో శిశుపాలుడు చేశాడా పని. పోతే ఆయన ఆత్మీయులనూ, భక్తులనూ పట్టి వేధించనైనా వేధించాలి. అలా చేసినవాడు త్రేతాయుగంలో రావణుడు. అతడాయన భార్యనే అపహరించి బంధంలో ఉంచాడు. పోతే కృతయుగంలో ఈ హిరణ్యకశిపుడు. ఇతడాయన కత్యంత ప్రియుడైన మహాభక్తుణ్ణే పట్టి బాధిస్తాడు. ఇలా బంధించటమో బాధించటమో చేస్తేగాని వారాయన దృష్టి తమవైపు ఆకర్షించలేరు. ఆగ్రహానికి గురి కాలేరు. తదీయ కోపాగ్నిలో బడి పరిశుద్ధులై మరలా తమ తమ నెలవులు చేరలేరు. ఈ దృష్టితోనే ప్రస్తుత మీ హిరణ్యకశిపుడు కూడా ఎంత ఆధ్యాత్మ విశారదుడయినా తన కుఆరుడితో నిరంతర పోరాటానికి దిగింది. ఇదీ మనమిక్కడ చెప్పుకోదగిన సమాధానం.

అయితే దూరమాలోచిస్తే ఇది కూడా ఒక అర్థవాదమే. ఒక సంకేతమే. కథలన్నీ సంకేతాలనే గదా మొదటనే మనవి చేశాను. దానిని బట్టి అసలు జయ విజయులూ లేరు. సనకస నందనులూ లేరు. శాపమూ లేదు. అనుభవించటమూ లేదు. ఒక ఆధ్యాత్మిక రహస్యాన్ని బోధించటానికి కప్పిన కవచమది. ఏమిటా రహస్యం. జయ

విజయులంటే రజస్తమో గుణాలే. అవే మానవుని మోక్షద్వారంలో ప్రవేశించకుండా అడ్డు తగులుతున్నాయి. అందులో ఒకటి చిత్తానికి విక్షేపమిస్తే మరొకటి ఆవరణ చేస్తుంది. ఆవరణాత్మకమేతమస్సు. అది ఆత్మ చైతన్యాన్ని కప్పి పుచ్చుతుంది. విక్షేప మాత్మేతరమైన సంసార బాధలు తెచ్చి పెడుతుంది. అది రజస్సు. ఇందులో తమస్సుకన్నా రజస్సు ప్రమాదకరమైంది. అది మొద్దులాగా పడి ఉండటం వరకే. ఇది అలాకాక నలుమొగాల విజృంభించి మన ప్రాణం తీస్తుంది. ఇందులో జయ విజయులీ రెండు గుణాలనూ పంచుకొని జన్మించారు. జయుడు రజస్సయితే విజయుడు తమస్సు. ఆజయుడి రూపాంతరాలే కృతంలో హిరణ్యకశిపుడూ, త్రేతలో రావణుడూ, ద్వాపరంలో శిశుపాలుడూ. భగవంతుని నిందించినా, భగవద్భక్తులను బంధించినా ఆ ఆరం భారం నెత్తిన వేసుకొన్న వారు వీరే. హిరణ్యకశిపుడిది కూడా ఇలాటి రాజస ప్రకృతి.

రాజసంలో ఉండే మరో రహస్యమేమంటే ఇది తమస్సులాగా జడమూ కాదు. సత్త్వంలాగా శుద్ధచేతనమూ గాదు. జడమైతే ఏ జ్ఞానానికీ నోచుకోక ఊరక మొద్దులాగా పడి ఉండేది. అలా పడి ఉన్నవారే కుంభకర్ణాదులు. మరి శుద్ధచైతన్యమైతే పరమార్థ జ్ఞానమే గడించి తరించి ఉండేది. పోతే అటూ ఇటూ గాని దశ ఇది. జ్ఞానమసలు లేనిదీ గాదు. ఉంటే పూర్తిగా ఉన్నదీ గాదు. హిరణ్యకశిపుడి దశ ఇలాంటిది. జ్ఞానమున్నవాడే. జ్ఞానమంటే కేవల లౌకిక జ్ఞానమే గాదు. ఆ మాటకు వస్తే తత్త్వజ్ఞానం కూడా గడించినవాడు. అదే గదా ఇంతకు ముందు వర్ణిస్తూ వచ్చాము. కాబట్టి జ్ఞానవంతుడని చెప్పటాని కభ్యంతరం లేదు. అయితే మరి వచ్చిన తిరకాసేమిటి. జ్ఞానముందేగాని అది రాజసం. సాత్త్వికం కాదు. సత్త్వాత్సంజాయతే జ్ఞానమ్. సత్త్వం వల్లనే సరియైన జ్ఞానమేర్పడేది. అది రజస్తమస్సులున్నంత వరకూ లాభం లేదు. అవి రెండూ క్షాళితమై సత్త్వం శుద్ధి కావాలి. ఆ క్షాళనమే సన్యాసం. **"సన్యాస యోగా ద్యతయ శుద్ధ సత్త్వాః"** అని ఘోషిస్తుంది శాస్త్రం. సన్యాస యోగం వల్లనే శుద్ధ సత్త్వులయ్యారట మహాత్ములు. అయినందుకేమిటి గుర్తు. విశుద్ధ సత్త్వ స్తతస్తుతమ్ పశ్యతే నిష్కలమ్. విశుద్ధ సత్త్వులైన మహాజ్ఞానులా తత్త్వాన్ని నిష్కలంగా చూడగలుగుతారట. అంటే సగుణంగా పరిచ్ఛిన్నంగా కాక నిర్గుణంగా సర్వవ్యాపకంగా దర్శిస్తారు.

ఇలాంటి దర్శనం ప్రహ్లాదుడిది. కారణం అతడు విశుద్ధసత్త్వుడు. సాత్వతుడైన భాగవతుడు. రజస్తమో దోషాలు లవలేశం లేని మహాజ్ఞాని. ఇంచుక మాయ లేక మదినెప్పుడు బాయని భక్తితోడ వర్తించే వాడని భాగవతం వర్ణించిన పరమ భాగవతుడతడే. మరి ఇలాంటి నిర్గుణ నిరుపాధిక జ్ఞానానికి నోచలేదా హిరణ్యకశిపుడు. కారణం అది శుద్ధసత్త్వం వల్ల కలిగింది కాదు. రజోమాత్ర జన్యమైనది. కనుక అది సగుణ భావన వరకే వచ్చి నిలిచిపోయింది. నిర్గుణ జ్ఞానాన్ని గూర్చి మాటాడుతాడు. నిజమే. కాని అది మాటలవరకే. ఆచరణలోకి వచ్చే సరికి అది నిలవదు. మరలా సగుణమే తొంగి చూస్తుంది. మనసా వచసా కర్మణా త్రికరణాలలో ఒకటిగానే ఉంటే అది సగుణం కాదప్పుడు నిర్గుణమే అయి ఉండేది. అలాంటప్పుడిక ప్రహ్లాదుడితో వివాదమేముంది. మరి అతడితో అనుక్షణమూ జగడం పెట్టుకొన్నాడంటే అది సగుణంలో నుంచి నిర్గుణాని కెదగలేకనే.

దీనిని బట్టి చూస్తే ఇది తండ్రి కొడుకులకు భౌతికంగా ఏర్పడిన కలహంగాదు. సగుణ నిర్గుణ దర్శనాల మధ్య జరిగే పోరాటం. ఒకటి తత్త్వాన్ని తన స్థాయికి దించి పరిచ్ఛిన్నంగా చూడగోరితే మరొకటి తత్త్వమున్న స్థాయికి నీవెదిగి చూడాలని హెచ్చరించేది. ఈ రెండు భావాలకూ కేవలం ప్రతీకలే హిరణ్యకశిపు ప్రహ్లాదులనే పాత్రలు. ఇందులో పయిస్థాయి కెదిగే నేర్పు లేక ఓర్పు కోలుపోయినవాడు హిరణ్యకశిపుడు. కనుకనే తన భావానికి విరుద్ధంగా మాటాడుతున్నాడు ప్రవర్తిస్తున్నాడని కొడుకు మీద అతడికి కోపం. అతడి స్థాయికి తానెదగటానికి బదులు అతడే తన స్థాయికి దిగి రావాలని పట్టుదల. ఇలాటి పట్టుదల రాజస ప్రకృతి ఉన్నవాడికి సహజమే. దాని కనుగుణంగానే నడచిందతని వ్యవహారం.

అయితే ఒక ప్రశ్న. హిరణ్యకశిపుడంటే రజోదూషితుడు కాబట్టి పరిచ్ఛిన్న బుద్ధి అయి అతణ్ణి బాధ పెట్టాడు. మరి ప్రహ్లాదుడలా పరిచ్ఛిన్నుడు కాక పరిపూర్ణుడైన జ్ఞాని గదా. అతడికి తన తండ్రితో సహా తనతో సహా ఈ సమస్త ప్రపంచమూ ఆత్మస్వరూపమేననే జ్ఞానముంది గదా. అతడే ఇతడితో సర్దుబాటు చేసుకొంటే సరిపోయేది గదా. తండ్రి మూర్ఖుడైతే అంత ఉత్తముడైన కొడుకు కూడా కావటం దేనికి. వాస్తవమే. కానక్కరలేదు. కాగూడదు కూడా మన సిద్ధాంతాన్ని బట్టి. కాని ఇక్కడా ఒక ఆధ్యాత్మిక రహస్యమిమిడి ఉంది. అదేమిటంటే నీవు నీ సుకృత విశేషం

కొద్దీ మహాజ్ఞానివి కావచ్చు. తరించవచ్చు. కాని నీవు తరించే లోపల చేతనైనంత వరకూ ఇతరులను కాడా తరింపజేసి పోవాలి. ఇతరులంటే మరలా అయోగ్యులూ అనధికారులూ గాదు. కొంతవరకూ జ్ఞానముండి కూడా పరిపూర్ణ జ్ఞానం లేనివారు. అలాంటివాడే ప్రస్తుతం తన తండ్రి హిరణ్యకశిపుడు. అతడికి జ్ఞానముందిగాని అది పరిపూర్ణం కాదు. పరిపూర్ణం కానంత వరకూ తరించలేడతడు. ఇంట గెలిచి రచ్చ గెలవమన్నట్టు ముందు తన జనకునికి బోధించాలి తాను. అందుకే అతడు తన మాట విన్నా వినకపోయినా విసుగు చెంది తన్ను బాధించినా హింసించినా వదలలేదు. చెవి నిల్లు కట్టుకొని చెబుతూనే వచ్చాడు. ఈ చెప్పటమే చెప్పి తండ్రిని బాగు చేయాలనే ప్రహ్లాదుడు అతనితో సాగించిన పోరాటం. ఇది పోరాటం కాదు. అతని దృష్టిలో తండ్రి కోసం పడే ఆరాటం. ఎంత ఆరాటమంటే అది. అంత మూఢత్వంలో కూడా హిరణ్యకశిపు డప్పుడప్పుడు తనలో తానే ఆత్మవిచారణ చేసుకోవలసి వచ్చింది.

ఏషమే బహ్వ సాధూక్తో - వధోపాయాశ్చ నిర్మితాః
తైస్తైర్మోహై రసద్ధర్మై - ర్ముక్తః స్వేనైవ తేజసా

ఈ కుర్రవాణ్ణి నేనెంతగానో కఠినంగా మందలించాను. వినకుంటే వధించటానికి కూడా ఆజ్ఞాపించాను. ఎన్ని విధాల ప్రయత్నించినా వీడు వధ్యుడు కాడు. వీడి తేజస్సే వీణ్ణి కాపాడుతున్నది. **"బాలో ప్య జడ ధీరయమ్"** బాలుడయి కూడా అచలమైనది వీడి బుద్ధి. **"అప్రమేయాను భావోయ మకుతశ్చి ద్భయో ఽ మరః"** అప్రమేయ ప్రభావుడూ ఆకుతో భయుడూ వీడు. **"నూనమేత ద్విరోధేన మృత్యుర్మే భవితానవా"** చూడబోతే వీడితో విరోధం మూలంగానే నాకు మరణం సంభవించేట్టున్నది.

కుమారుడితో వైరం వల్ల తనకు మరణం వస్తుందనే చూచాడు గాని అతని బోధ వింటే తాను అమృతత్వాన్నే అందుకోవచ్చు నని అనుకో లేకపోయాడా తండ్రి. తండ్రి మీద కొడుకు ఉపదేశం అంతవరకే పని చేయగలిగింది. మన అర్హతను బట్టే పెద్దలు చేసిన బోధ మనకు ఫలించేది. అధికార తారతమ్యమనేది ఎప్పుడూ ఉంటుంది. హిరణ్యకశిపుడి అధికారమంత వరకే. పరిచ్ఛిన్నమైన సగుణ దృష్టే

అతనిది. ద్వారపాలకుడి కంతకంటే పయి దృష్టి ఎలా వస్తుంది. లోపల ఉన్న స్వామివారి సగుణ విగ్రహమే కనిపిస్తుంటుంది కంటికి. అది అప్పుడే గాదు. ఇప్పుడు కూడా అదే చూడాలని కోరుకొంటున్నది. అప్పుడు భక్తితో అయితే ఇప్పుడు వైరభక్తితో. అది నిరంతరమూ చూస్తూనే ఉన్నాడు ప్రహ్లాదుడు. చుట్టూ ఉన్న ప్రపంచంలో చూస్తున్నాడు. ప్రపంచా తీతంగానూ చూస్తున్నాడు. ఇందుగల డందులేడని సందేహం లేదతనికి. ఆ సందేహమంతా హిరణ్యకశిపుడికే. సగుణంగా మాత్రమే చూడబోయే సరికి అతడికెక్కడా కనపడటం లేదా తత్త్వం. సగుణం కాబట్టి అంతటా కనిపించదు. ఎక్కడో ఒక చోటనే ఉండాలది. ఎక్కడ ఉందో అది తాను గానకుండా ఎప్పటికైనా దాన్ని భేదించి పట్టుకోవాలని ఆ తండ్రి పట్టుదల.

ఇలాంటి తండ్రి దృష్టికి కొడుకు దృష్టికీ హస్తి మశకాంతరమున్నప్పుడు రెంటికీ ఎలా లంగరందుతుంది. కనుకనే అనుక్షణమూ ఆ ఇద్దరి మధ్య పోరాటం. ఎవరి దారికి వారు ఇతరులను మళ్లించుకోవాలని ఆరాటం. ఈ ఆరాటానికీ పోరాటానికీ ప్రతీకమే ఈ కథ అంతా. కథారంభంలోనే ప్రశ్నిస్తాడసలు పరీక్షిత్తు శుకమహర్షిని.

సమః ప్రియ సుహృ ద్బ్రహ్మన్ భూతానాం భగవాన్ స్వయం
ఇంద్రస్యార్థే కథం దైత్యా స వధీ ద్విషమో యథా

ఇదంతా భగవత్సృష్టే గదా. దేవతలైనా దానవులైనా అంతా ఆయనకు సమానమే. అలాంటప్పుడు దేవకార్యమని పేరు పెట్టుకొని వచ్చి రాక్షసులను నిర్దాక్షిణ్యంగా సంహరించటమేమిటి. ఈ ప్రశ్నకు శుకుడిలా సమాధానమిస్తాడు.

నిర్గుణోపిహ్యజో ఽవ్యక్తో - భగవాన్ ప్రకృతేః పరః
స్వమాయా గుణమావిశ్య - బాధ్య బాధకతాం గతః

ప్రకృతి గుణాల కతీతుడయి కూడా ఆ పరమాత్మ తన మాయాబలంచేత సగుణుడిలాగా కనిపిస్తూ తానే బాధకులైన రాక్షసుల రూపంలోనూ బాధ్యులైన దేవతల రూపంలోనూ కనిపిస్తున్నాడు మనకు. అంతేకాదు. ఈ గుణాలాయనవి గావు. సృష్టి అయిన ఈ దేవదానవాది జాతులవి.

జయకాలేతు సత్త్వస్య - దేవర్షీన్ -రసజా ఽసురాన్
తమసో యక్ష రక్షాంసి తత్కాలాను గుణో ఽభజత్

అందులో దేవతలది సత్త్వగుణమైతే – అసురులది రజోగుణమైతే – తమోగుణం యక్షరక్షస్సులది. వీరి వీరి గుణాల కనుగుణంగా ఒకరితో ఒకరు కలహిస్తుంటే ఆయన వారి కాల స్వభావ కర్మల ననుసరించి రక్షిస్తూ, శిక్షిస్తూ ఉన్నట్టు తోస్తున్నాడు. ఇంతకూ బాధ్య బాధకాలు రెండూ ఆయన స్వరూపమే. అయినా రెండు విరుద్ధ రూపాలుగా భాసించటం కేవలమాయన గారి మాయ.

దీనిని బట్టి సాత్వతులైన ప్రహ్లాదులు ఎందుకు బాధ పడ్డారని ప్రశ్నలేదు. వారిని హిరణ్యాదులెందుకు బాధించారని ప్రశ్నాలేదు. అది వారి వారి స్వభావాని కనుగుణంగా జరిగిన వ్యవహారం. **"స్వభావో దురతి క్రమః – స్వభావస్తు ప్రవర్తతే"** స్వభావాన్ని దాటి ఎవడూ పోలేడు. హిరణ్యకశిపుడు రజో దోష దూషితుడు కాబట్టి వాడి దృష్టి అంతే. అది శుద్ధ సత్త్వ సంపన్నుడైన ప్రహ్లాదుడి స్థాయి కెదగమంటే ఎలా ఎదుగుతుంది. ఎదగదు. ఎదగలేదు. లేకనే ఇరువురి మధ్యా ఆ పోరాటం. అసలు తపస్సు చేసి బ్రహ్మవల్ల వరాలు పొందినప్పుడే వాడి రజోగుణం బయట పడుతుంది. మరణం లేకుండా అనుగ్రహించమంటాడాయనను. ఇది సాధ్యమా. సాధ్యమే. అయితే రాజసమైన ప్రవర్తన ఉన్నంతవరకూ కాదు. శుద్ధ సత్త్వ బుద్ధితో ఉత్తమ జ్ఞానమార్జించినప్పుడే అది సాధ్యం. అది ఎక్కడ తెచ్చి ఇస్తావా దానవుడికి. అది లేకుండానే ఇంత మహాఫలాన్ని చవిచూడాలని కోరుకోవటం వట్టి అవివేకం. ఇలాటి అవివేకికా ఫలాన్ని ప్రసాదించానని పితామహుడు హామీ ఇచ్చినా అది ఎలా నెరవేరుతుంది. అందులోనే దాగి ఉంటుందెంతో మోసం. అది తెలియదా దానవుడికి. రాజస ప్రకృతికది మాత్రమెలా బోధపడుతుంది. పడకనే తానిక అజరామరుడనని తలపోశాడు. దానితో గరుడ గంధర్వాది దేవతలనందరినీ బాధించసాగాడు.

ఒకనాడు గంధర్వ యూథంబు పరిమార్చు దివిజుల నొకనాడు తెరలదోలు భుజగుల నొకనాడు భోగంబులకుబాపు గ్రహముల నొకనాడు కట్టివైచు కడిమి నొకనాడు కిన్నర ఖచర సాధ్యచారణ ప్రేతభూత పిశాచ వన్య సత్త్వ విద్యా ధరాదుల సంహరించు

ఇలా మారు లేకుండా మసలజొచ్చాడు. **"ఏ దిక్కాలుర జూచి నేడలుగునో ఏదేవు బంధించునో"** అని వారంతా భయాందోళనలతో విలపించేవారు. చివరకేదీ

దిక్కు తోచక **"ఎక్కడ నున్నవాడు జగదీశ్వరుడాత్మమ యుండు మాధవుండని"** ఆ క్షీరసాగర శయనుణ్ణి శరణువేడుతారు. వారికాయన అభయమిస్తూ **"కన్నకొడుకు నెవాడెన్నడు రోషంబున ఆపన్నత నొందించునపుడె పట్టి వధింతును"** పొమ్మంటాడు.

చూడండి. రజః ప్రకృతికిది పరాకాష్ఠ. నా అంతవాడు లేడని గర్వించటం నలుగురినీ బాధించటం. కడకు భగవద్భక్తుల నుత్తములను తమ కడుపున బుట్టిన వారిని కూడా హింసించటం. ఇంతకన్నా రాజసమేముంది. అజ్ఞానంలోనే కాదు. విజ్ఞానంలో కూడా అది రాజసమే. మొదట చెప్పినట్టు విజ్ఞాన సంపన్నుడే హిరణ్యకశిపుడు. అది కూడా లౌకికమైనది కాదు. వేదాంత విజ్ఞానమే. అయినప్పటికీ అది సాత్వికం గాక రాజసమైనందు మూలాన సగుణంతోనే ఆగిపోయింది. ఆ సగుణం నిర్గుణంగా మారాలంటే రజస్సు నశించి శుద్ధ సత్త్వం చోటు చేసుకోవాలి. అంతవరకూ అందులో కూడా తనకున్నదే గొప్ప విజ్ఞానం, తానిక నేర్చుకోవలసింది తెలుసుకోవలసిందీ ఏదీ లేదని రాజస స్వభావుల ఆగ్రహం. ఆదురాగ్రహంతోనే ఒకనాడు తన కొడుకును చూచి **"లభ్యంబైన సురాధి రాజపదమున్ లక్షింపడు - సభ్యత్వంబున నున్న వాడబలుడై జాడ్యంబునన్ వీడు, విద్యాభ్యాసంబున గాని తీవ్రమతిగా"**డని ఆలోచిస్తాడు. అబలుడూ జడుడూ నటవాడు. వీడు విద్యాభ్యాసం చేయిస్తేగాని వాడికి విద్య పట్టుపడదట. వాడికి వీడు నేర్పించక మునుపే పట్టుపడ్డది ఒక మహావిద్య. ఏమిటిదా విద్య. విశ్వమందు గన్న విన్న యర్థములందు వస్తు దృష్టి జేసి వాంఛయిడడు ధరణి నాథ దైత్య తనయుండు హరి పరతంత్రుడై హతాన్యతంత్రుడగుచు

హరిపదాంభోజ యుగ చింతనామృతమున
నంతరంగంబు నిండినట్లైన నతడు
నిత్య పరిపూర్ణడగుచు నన్నియును మఱచి
జడత లేకయు నుండును జడుని భంగి

అంతేకాదు. ఏ ని చేస్తున్నా అదే చింత.

పానీయంబులు ద్రావుచుం గుడుచు చున్ భాషించుచున్ హాసలీ
లా నిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత

శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతా స్వాదసం
ధానుండై మఱచెన్ సురారిసుతు డేతద్విశ్వమున్ భూవరా

పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్ననే శాస్త్రధ్వని కిది పురాణం చేసే ప్రతిధ్వని. ఇలాంటి పరావరమైన తత్త్వాన్ని పట్టుకొని కూచున్నాడా ప్రహ్లాదుడు. అలాటి పరవిద్యా సంపన్నుడి కలవడిన విద్య ఏమిటో ఈ జడుడి కర్థం కాలేదు. అర్థం కాక వాణ్ని జడుడనీ వాడికేదో విద్య నేర్పించాలనీ యత్నిస్తాడు పాపం.

వెంటనే శుక్ర కుమారులు చండామార్కులనే వారిని పిలిపిస్తాడు. పిలిపించి వారితో **"అంధ ప్రక్రియ నున్నవాడు పలుకం డస్మత్ప్రతాప క్రియా గంధం బించుకలేదు ఈ బాలకున్ గ్రంథంబుల్ సదివించి నీతి కుశలుణ్ణి"** గావించమని అప్పగిస్తాడు. చూడండి వాడి అహంకారం. తనప్రతాప క్రియాగంధముంటేనే వాడు విద్యావంతుడట లేకుంటే వాడు జనుషాంధుడే. నీతి కుశలత లేనివాడే. సరే వీడికి తోడుపోయిన వారే ఆ గురుపుత్రులు. వారేది చెప్పినా ప్రహ్లాదుడవుననడు. కాదనడు. అన్నీ నిరూపిస్తే మిథ్యాభూతమే గదా ఎట్లైతే నేమని అతని బరవసా. పిలిపించి పరీక్షిస్తాడొకనాడా తండ్రి కుమారుణ్ణి. నీకేది పట్టుపడిందో చెప్పమని అడిగితే వాడు తడువుకోకుండా.

ఎల్ల శరీర ధారులకు నిల్లను చీకటి లోపలం
ద్రెల్లక మీరు మేమను మతి భ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వమున్నతని దివ్యకళామయ మంచు విష్ణు నం
దుల్లము సేర్చి తారడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ

అని అద్వితీయాత్మ భావాన్ని బోధిస్తాడు. ఇందులో సర్వమున్నతని దివ్యకళామయమదే విష్ణు స్వరూపమనే మాట అతడెప్పుడూ విన్నది గాదు. విష్ణువంటే అతని దృష్టిలో ఈ సృష్టిలో ఎక్కడో ఏ వైకుంఠంలోనో దాగి ఉన్న ఒక పురుష విగ్రహం. అది తన్ను తప్పించుకొని తిరుగుతున్నది. ఎప్పుడో వెళ్లి పట్టుకోవాలని పగ తీర్చుకోవాలని చూస్తున్నాడు వాడు. అలాంటివాడికీ నిర్గుణస్థాయిలో ఆడిన మాటలే మాత్రమూ అంతుపట్టలేదు. పట్టకనే **"నాకుం జూడగ చోద్యమయ్యెడి గదా నా తండ్రి – ఈ దానవ శ్రేణికిన్ వైకుంఠుండు కృతాప రాధు డతనిన్ వర్ణింప నీకేటికిన్"** అని మందలిస్తాడు. విష్ణువంటే అతనికి వైకుంఠ పురవాసియే. అంతకు మించి మరెక్కడా కనిపించదా తత్త్వం.

దానికి ప్రహ్లాదుడిచ్చిన జవాబు చూడండి ఎంత చక్కగా ఉందో

అజ్ఞుల్ కొందఱు మేము తామనుచు మాయంజెంది సర్వాత్మకుం
బ్రజ్ఞాలబ్ధ దురన్వయ క్రమములన్ - భాషింపగా నేర - రా
జిజ్ఞాసా పథమందు మూఢులు గదా చింతింప - బ్రహ్మాది వే
దజ్ఞుల్ - తత్పరమాత్ము విష్ణు - నితరుల్ దర్శింపగా నేర్తురే

తండ్రీ నీవు పొరబడుతున్నావు. సర్వమున్నతని దివ్యకళామయమని నేను చెబితే నీవా విష్ణువెక్కడో ఉన్నాడని భావిస్తున్నావు. సర్వాత్మకుడు విష్ణువంటే. కేవలం తెలివితేటలతో అన్వయం చేసుకొని భాషించేది కాదది. అలాగైతే వేదవేత్తలైన బ్రహ్మాదులెప్పుడో గ్రహించి ఉండేవారు. కాని వారికి కూడా అంతుచిక్కింది కాదా తత్త్వం. ఇక నీబోటి వారేమిటి. దాన్ని దర్శించటమేమిటి. మరి నాబోటి వారికంటావా. ఇనుమయస్కాంత సన్నిధిలో మాదిరా హృషీకేశ సన్నిధిలో చిత్తం కరగి దానితో ఏకమవుతున్నది. అది అంబుజోదర దివ్య పొదార వింద చింత నామృత పాన విశేషమత్తమైన చిత్తం. దానికన్యమనే భావం లేదు. అంతా అనన్య భావనే.

ఈ అనన్య భావన అంటే ఏమిటో ఆ మొద్దు కర్థం కాలేదు. వీడెప్పుడూ ఆ రక్షస కులాంతుకుణ్ణే ప్రస్తుతి చేస్తున్నాడు పట్టండి కొట్టండని ఆజ్ఞాపిస్తాడు. అయ్యా అప్పుడే అంత కోపతాపాలు పెట్టుకోకండి. మేము మరలా ప్రయత్నిస్తామని తీసుకెళ్లుతా రాచండామార్కులు. శతవిధాల నూరిపోస్తారదీ ఇదీ ఎన్నో విద్యలు. నాయనా ఇక మా మతము త్రిప్పకు. మేము చెప్పినవి తప్పకు. అని తెచ్చి హిరణ్యకశిపుని ముందు నిలుపుతారు. నిలిపితే అతడీ లోకంలో ఉంటే గదా. అఖిల ప్రపంచంబు శ్రీవిష్ణుమయమనే ఆ తొల్లింటి భావనలోనే పాదుకొని ఉన్నాడు. నాయనా తండ్రిగారికి మ్రొక్కమంటే మ్రొక్కాడు. ఆహా ఎంత బుద్ధిమంతుడయ్యాడు నా కుమారుడని తొడమీద కూచోబెట్టుకొని ముద్దుచేస్తూ నాయనా ! ఏమిమి విద్యలు నేర్చావు. నీ విద్యాసారమెఱుంగ గోరెద, భవదీయోత్కర్షముం జూపవే అని అడుగుతాడు. అడగటమే తడవుగా చదివించిరి నను గురువులు - చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రంబులు నే జదివినవి గలవు పెక్కులు. అవన్నీ నీకు దేనికి. ఒక్క మాట చెబుతాను విను. చదువులలో ఏది మర్మమో అది చదివానంటాడు. ఏమిటా మర్మమంటే ఏ కరువు పెడతాడిక.

అంధేం దూదయముల్ మహాబధిర శంఖాధ్మానముల్ ...
... హరిభక్తి వర్జితుల రిక్త వ్యర్థ సంసారముల్
కమలాక్షు నర్చించు కరములు కరములు.. కంజాక్షునకు
గాని కాయంబు కాయమే సంసార జీమూత సంఘంబు

విచ్చునే చక్రి దాస్య ప్రభంజనము లేక అని ఒక ఝుంఝూ ప్రభంజనంలాగా. మానవ జీవితానికంతటికీ ధ్యేయమొక్క విష్ణుతత్త్వమే. అదే మనం నేర్వదగిన విద్య. ఆ విద్య చెప్పినవాడే గురువది చెప్పించిన వాడే తండ్రి. దాన్ని ఎప్పటికైనా సాధించటానికే మానవుడి కసలీ దేహేంద్రియాదు లేర్పడ్డాయి. ఇవన్నీ దాన్ని చేర్చటానికి కేవలం సాధనాలు. దానికి సాధనాలయినప్పుడే ఇవి చరితార్థం. లేకుంటే వీటి జన్మ నిరర్థకం.

ఇలా గుక్క తిప్పుకోకుండా ఉపన్యసిస్తుంటే ఆ తండ్రికి దిక్కు తోచలేదు. ఇదంతా కుమారుడి జన్మాంతరార్జిత సంస్కార ఫలమని తెలియక గురు పుత్త్రులే తనకు ద్రోహం చేశారని ఆగ్రహిస్తాడు. రజః ప్రకృతి ఏమవుతుంది. ఎలా పోతుంది. **"బ్రాహ్మణాకృతివి గాక యధార్థపు బ్రాహ్మణుడండవే"** అని వారిని దూషిస్తే వారు మావల్ల తప్పులేదు మహారాజా ! ఇదంతా మీ కుమారుడికి నైజమనీష మేమేమి చేసిందీ కాదని వాపోతారు. మరి ఒజ్జలు చెప్పని ఈ మతి మజ్ఞాతుడవైన నీకెలా ఉజ్ఞాతమయిందని ఆశ్చర్యపోతూ అడుగుతాడా కుర్రవాణ్ణి. తనకు జన్మించిన బాలుడికి తన బుద్ధే రావాలని వాడి ఉద్దేశం. తన బుద్ధే చాలా ఉత్తమమయిందని అది తన కుమారుడి కవశ్యంగా వచ్చి తీరాలని ఇవి రెండూ అవివేకమైన ఊహలే. అలా ఎప్పటికీ జరగదు. ఎవరి జన్మ సంస్కారం వారిదే. కేవలం నిమిత్త మాత్రులే తల్లిదండ్రులు. పైగా తండ్రి అయిన తన జ్ఞానమే అమోఘమని ఎందు కనుకోవాలి. కుమారుడికి కలిగిందే ఉత్కృష్టమైన జ్ఞానం కావచ్చు గదా. ఈ మాత్రం వివేచన లేదా రజోగుణ దూషితుడికి.

అతడడిగిన ప్రశ్నకు బీరు పోకుండా సమాధానమిస్తున్నాడా కుమారుడు.

అచ్చపు జీకటిం బడి గృహవ్రతులై - విషయ ప్రవిష్టులై
చచ్చుచు బుట్టుచున్ మరల జర్వితచర్వణులైన వారికిం

జెచ్చెర బుట్టునే పరులు చెప్పిన నైన - నిజేచ్ఛనైన - నే
మిచ్చిన నైన - కానలకు నేగిన నైన హరి ప్రబోధముల్

నీకీ బుద్ధి ఎవరూ చెప్పకుంటే ఎలా వచ్చిందని గదా అడిగారు మీరు. వారి వారి సుకృత విశేషాన్ని బట్టి రావాలి గాని ఒకరు చెబితే వచ్చే దదేమి బుద్ధి ఒకరు చెప్పినా రాదు. తాను కోరినా రాదు. ధనమిచ్చినా రాదు. వనభూములకు పోయినా రాదు. ఎటువచ్చీ అనేక జన్మ సంసిద్ధః అన్నట్టు బహు జన్మ కృత ప్రయత్నానుగతమై రావాలి గాని ఉట్రవడియంగా వచ్చి ఒళ్లోబడేది గాదని తెలుసుకోమంటాడు.

మరి నీకలాటి బుద్ధి కలగలేదనేందుకు గూడా కారణముంది. ఎందుకంటావేమో

కానని వాని నూతగొని కానని వాడు విశిష్ట వస్తువుం
గానని భంగి కర్మములు గైకొని కొందఱు కర్మబద్ధులై
కానరు విష్ణు ....

విష్ణువంటే నీవు తేలికగా చూస్తున్నావు. ఎక్కడో నక్కి ఉన్నాడు. పోయి పట్టుకొందామని భ్రమ పడుతున్నావు. అది ఒక గ్రుడ్డివాణ్ణి పట్టుకొని మరొక గ్రుడ్డివాడేదో వెళ్లి చూడాలనుకోటం వంటిది. కర్మమార్గంలో పయనించే నీ బుద్ధికి జ్ఞానైక గోచరమైన ఆ మహాఫలమెలా అందుతుంది. అయితే ఎవరి కందుతుందంటావేమో. అకించనులై - వైష్ణవాంఘ్రి సంస్థాన రజోభిషిక్తులై సంహృత కర్ములైన వారెవరో వారికి. మరి నీవెన్నో శోధించావు నన్ను శోధించమంటున్నావు. దేనికిన్ని గాథలు. మాధవ శేముషీ తరణి సాంగత్యంబు నంగాక దుర్మేధన్దాటగ వచ్చునే. ఏమిటది. సుతవధూ మీనోగ్ర వాంఛా మదక్రోధోల్లోల విశాల సంసృతి మహాఘోరామితాం భోనిధి. ఇలాటి అంభోనిధి దాటాలంటే సమ్యగ్ జ్ఞానమనే బోటు తప్ప మరేదీ పాటుగాదు సుమా.

అని ఇలా సూటిగా చెప్పే సరికది ఘాటుగా తగిలి ఆ రాక్షసుడి కది తలకెక్కక పోగా అక్కడి సభాస్తారులను చూచి చూచారావీడు నాకు తనయుడై యుండి పగవాడి ప్రాపు చేరి నన్నెంతగా బాధ పెడుతున్నాడో. చూడబోతే అయిదేండ్లైనా నిండలేదీ కొండికకు కించిత్తు కూడా భీతి లేక అ రాతిని కీర్తిస్తున్నాడు. వద్దంటే మానడు. వీడు నాకు తనూజుడు కాదు. తనూజమైన ఒకానొక ప్రబలవ్యాధి. పట్టండి కొట్టండి

చంపండి ఈ తెంపరినని ఆజ్ఞాపిస్తాడు. చూడండి. అంత విద్యావంతుడయి కూడా అంత అఘాయిత్యమో. అర్ధం కాకపోతే అఘాయిత్యమే మరి. దుష్టాంగాన్ని ఖండించి శేషాంగానికి రక్ష చేసినట్టు చేస్తాడట రక్షోవంశాన్ని ఆ క్రుర్రవాడని ఒకణ్ణి శిక్షించి. నిజంగా దుష్టాంగం తాను. వాడు గాదు. అంత ఆత్మజ్ఞానముంటే ఇకనేమి. బాగుపడడా. అలాపడే యోగం లేకనే ఇలాటి మిథ్యా గ్రహం.

స్వామి ముదల అయిందో లేదో ఇక బయలుదేరారా రాక్షస కింకరులంతా కేకలు వేస్తూ. వాడి మొనలు గల శూలాలు శరీరంలో గ్రుచ్చి బాధింపజొచ్చారు. కిక్కురు మనలేదా బాలుడు. పాఱడు లేచి దిక్కులకు. బాహువు లొడ్డడు. మరేమి చేశేవాడు. **"తన్ను నిశాచరుల్వాడువ దైత్య కుమారుడు మాటిమాటికో-పన్నగ శాయి - యోదనుజ భంజన"** అని బిగ్గరగా అరచేవాడు. ఇది అరపు గాదు. సర్వాత్మకమైన ఆ పరబ్రహ్మము తానయయి యమ్మహా విష్ణువునందు చిత్తంబు చేర్చి తన్మయుడయి పరమానందంబు నం బొంది యున్న ప్రహ్లాదుని ఆనందాక్రందనం. అంతా బ్రహ్మమే. అది తన ఆత్మేనని చూచే ఆస్థిత ప్రజ్ఞుడికి శూలమో, భిండివాలమో అంతా భగవంతుని ఇంద్రజాలమే. మరేదీ గాదు. అలాంటి సర్వ సమదర్శనుణ్ణి ఆ విషమ దర్శనుడింకా బాధింపజూస్తాడు.

ఒకనాడు దిక్కుంభి యూథంబు దెప్పించి
కెరలి డింభకుని ద్రొక్కింప బంపు
నొకమాటు విషభీక రోరగ శ్రేణుల
గదువడి నర్భకు గఱవ బంపు

ఇంతెందుకు. "విషము పెట్ట బంపు - విదళింపగా బంపు- దొడ్డకొండ చఱుల ద్రోయ బంపు - పట్టికట్ట బంపు బాధింపగా బంపు" అంతే గాదు. "నీరు నన్నంబు నిడ నీక నిగ్రహించు - కశల నడిపించు ఱువ్వించు గండశిలల - గదల వ్రేయించు - నేయించు ఘన శరముల"

ఏతాదృశ నానావిధ ఘాతన క్రియలెన్ని చేయించినా చెక్కు చెదరలేదా బాలుడు. ఏమి కారణం. ఎవడైనా ఇలాంటి ఘోరమైన ఆయుధాలు ప్రయోగిస్తే చావకుండా

బతికి ఉంటాడా. బ్రతికి ఉండటానికది పాంచ భౌతికమైన శరీరమా, మరొకటా. పాంచ భౌతికమైనప్పుడది జ్ఞానికైనా ఒక్కటే. అజ్ఞానికైనా ఒక్కటే దెబ్బ తినవలసిందే. ఛిన్నాభిన్నమై పోవలసిందే. తప్పదు. అలాంటప్పుడా ప్రహ్లాదుణ్ణీ కొండలమీది నుంచి దొర్లించారు. నీళ్లలో ముంచారు. నిప్పుల్లో త్రోశారు. రాళ్లతో రువ్వారు. కత్తులతో చువ్వారు. అయినా చెక్కు చెదరలేదట శరీరం. ఏమి కారణం. ఇది కథా. యథార్థమా. కథయితే నమ్మనక్కరలేదు. యథార్థమనుకొంటే మన అనుభవానికే విరుద్ధం. మరి ఏమిటి గతి అని ప్రశ్న.

ఇక్కడే ఉంది మనం గ్రహించవలసిన మహా రహస్యం. నిర్గుణ బ్రహ్మాత్మభావ సంపన్నుడైన ఒక మహనీయుని స్థితిని వర్ణిస్తున్నదీ ఘట్టం. స్థితప్రజ్ఞుడైన వాడి లక్షణాలు మనకు శాస్త్రంలో కనిపిస్తాయి. **యస్మిన్ స్థితో న దుఃఖేన గురణాపి విచాల్యతే.** ఆ దశలో ఉన్నవాడికెంత పెద్ద దుఃఖం కూడా ఏమీ చేయలేదట. ఆ శాస్త్ర వాక్యానికిది ఉదాహరణ. అంతేకాదు. **"దేహీ నిత్యమవ ధ్యేయమ్ దేహే సర్వస్య భారత"** దేహమే వధ్యంగాని దేహివధ్యుడు కాడు. ఎందుకంటే దేహంలాగా అది భౌతికం కాదు. అభౌతికమైన తత్వం. అభౌతికం గనుకనే

నైనంఛిందంతి శస్త్రాణి - నైనం దహతి పావకః
నచైనం క్లే దయంత్యాపో - నశోష యతి మారుతః

దాన్ని శస్త్రాలు ఛేదించలేవు. అగ్న్యాదులు దహించలేవు. జలరాశి ముంచలేదు. వాయువు వట్టిపో జేయలేదు. కారణం. **"నిత్య స్సర్వగతః స్థాణు రచలోయమ్ సనాతనః"** ఆత్మకంతం లేదు. ఆదిలేదు. అది సర్వగతం. అచలం. స్థిరం. అలాంటి స్థిరమైన తత్వాన్ని పట్టుకొని అదే తానని తాదాత్మ్యం చెందినవాణ్ణి ఏదిగాని ఏమీ చేయగలదు. అస్థిరం స్థిరాన్ని హింసించటమెలా సాధ్యం. ఆ గీతా సిద్ధాంతానికి ప్రహ్లాదుడి ఈ వ్యవహారమొక దృష్టాంతం లాంటిది. ఆ మాటకు వస్తే భాగవతమంతా దృష్టాంతమే. భగవద్గీత సిద్ధాంతం భాగవతం దృష్టాంతమని గదా మన రాద్ధాంతం. ప్రస్తుతం ప్రహ్లాద కుమారుడి శరీరం భౌతికమైనా దెబ్బ తినలేదంటే అది తితిక్షా ప్రభావం చేతననే గ్రహించాలి మనం. తితిక్ష అంటే ద్వంద్వాలను సహించే సామర్థ్యం. **"మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖ దుఃఖ దాః"** ఈ సుఖదుఃఖాలే ద్వంద్వాలు..

వీటన్నిటినీ ఆగమాపాయులుగా అనిత్యాలుగా చూడగలవాడికే అలాటి తితిక్ష అబ్బుతుంది. అది సర్వాత్మభావ రూపమైన జ్ఞానమొక్కటే ప్రసాదిస్తుంది. జ్ఞానం పదిలమైతే అది ఐశ్వర్యంగా మారుతుంది. ఐశ్వర్యమంటే ఈశ్వరభావం. సృష్టిలో దేనినైనా జయించగలగటం అదుపులో పెట్టగలగటమే అది. దానికే యోగమని మరొక పేరు.

నతస్య రోగో నజరానమృత్యుః ప్రాప్తస్య యోగాగ్ని మయమ్ శరీరమ్

యోగ శరీరం పొందిన జ్ఞానికి జరారోగాదులు లేవు సరిగదా. మరణ భయం కూడా లేదని శాస్త్ర ప్రమాణం. ఇలాటి జ్ఞానీయోగీ ఆ ప్రహ్లాదుడు. కనుకనే శరీరం దెబ్బ తినలేదు.

కాకపోయినా ప్రారబ్ధం తీరే వరకూ ఏ బాధలూ ఏమీ చేయలేవు మానవుణ్ణి. ఎలాటి ప్రాణోపద్రవమూ సంభవించదు. బ్రతికే యోగముంటే ఎన్ని ఉపద్రవాలు సంభవించినా చెక్కు చెదరదు ప్రాణి. ఎలాగో ఒకలాగు తప్పించుకొంటాడు. అలాటి యోగం లేకుంటే ఎన్ని ఉపాయాలు పన్ను. ఎంత సహాయ సంపద పొందు. అవి ఏమీ కాపాడలేవు. క్షణంలో మృత్యువు వాతపడతాడు. ఇది మనదైనందిన జీవితంలోనే తార్కాణ అయ్యే సత్యం. చచ్చే పరిస్థితిలో కూడా కొందరు చావరు. అలాగే బ్రతుకుతుంటారు. మన కాశ్చర్యంగా ఉంటుంది. వీడెలా బ్రతకగలిగాడా అని. ఎంత మాత్రమూ చావటానికి వీలులేని మహాబలిష్ఠులూ ఆరోగ్యవంతులూ ఉన్నట్టుండి కన్ను మూస్తారు. అది మనకింకా ఆశ్చర్యం. ఎలా జరిగిందా ఇంత పని అని. కాబట్టి.

అరక్షితమ్ తిష్ఠతి దైవ రక్షితమ్ – సురక్షితమ్ దైవ హతమ్ వినశ్యతి

అన్నట్టు ప్రాణులకు కలిగే కష్ట సుఖాలూ, జనన మరణాలూ, అన్ని వారి వారి ప్రారబ్ధ కర్మానుసారంగా నడుస్తుంటాయి. ఎప్పుడేది ఎవరికి ఎలా జరుగుతుందో ఎవరూ చెప్పేది కాదు. చేసేది కాదు. గుడ్లప్పగించి చూసేదే. అందుకే అనిర్వచనీయ మన్నారీ సంసార యాత్ర. ఇలాటి ఒకానొక అనిర్వచనీయమే ఈ మహాభాగవతుని వ్యవహారం కూడా.

అయినా పాంచ భౌతికమైన దేహం ఇంత దారుణంగా హింసించినా పంచత్వం పొందక పోవటమేమిటి. ఇది మేము నమ్మమని హేతువాదానికి దిగే వారింకా

లేకపోరు. అలాటి వారికిచ్చే ఆఖరు సమాధానమొక్కటే. అదేమిటంటే భాగవతమొక పురాణమనే విషయం మరచిపోతున్నారు వారు. పురాణమంటే అది ఒక అర్థవాదం. అర్థవాదాలన్నీ సత్యంకావు. సత్యానికవి కేవలం సంకేతాలే నని మొదటనే చెప్పాము. తద్ద్వారా ప్రతిపాద్యమైన సత్యాన్నే పట్టుకోవాలిగాని మనం దానిపైన గప్పిన కథ అనే కవచాన్ని పట్టుకొని ప్రాకులాడరాదు. ప్రస్తుతమీ ప్రహ్లాదోపాఖ్యాన మొకానొక సత్యాన్ని మనకు బయట పెడుతున్న సంకేతమేననుకొంటే సరిపోతుంది. గజేంద్రుడి కథలాగా ఇదీ ఒక కథే. అది మానవుడి దేహాత్మాభిమానానికెలా ప్రతీకమో ఇదీ బ్రహ్మాత్మభావ రూపమైన వరమాహ్లాదానుభూతిని సూచించే ఒకప్రతీక. అలా అద్వైతానందాన్ని అనుభవిస్తున్న దశలో జీవన్ముక్తుడైన మహాయోగికిక దేహమూ లేదు. మాత్రా స్పర్శలూ లేవు. తన్నిమిత్తంగా కలిగే సుఖదుఃఖాదులూ లేవు. అంతా బ్రహ్మ స్వరూపమే. ఆత్మస్వరూపమే. అలా పరిణమిస్తేనే అది ముక్తి. క్రొత్తగా పరిణమించటం కూడా కాదిది. పూర్వ సిద్ధమేనని ఘోషిస్తున్నది శాస్త్రం. కనుక అలాటి లోకోత్తర భూమికను నిరూపించేందుకే ప్రహ్లాద వృత్తాంతాన్ని ఒక ఆలంబనంగా తీసుకొని లోకానికి బోధిస్తున్నాడు భాగవతకారుడు. అంచేత ఎలాంటి విప్రతిపత్తికీ ఇక్కడ చోటులేదు అంతా చతురశ్రమే.

అయితే మనకు గాకపోయినా హిరణ్యకశిపుడికే కలిగింది ఇలాటి వితర్కం. ఇంతపని చేసినా వీడు చావకపోవటమేమిటా అని ఆశ్చర్యపోయాడు. **"వీడెవడో మహా ప్రభావుడు వీనికెందును భయంబు లేదు. వీని తోడి విరోధంబున దనకు మృత్యువు సిద్ధించు"**నని నిర్ధారణ చేసుకొన్నాడట. అంటే హిరణ్యకశిపుడప్పటికి ఒక విషయం చక్కగా గ్రహించాడు. ఎంత చెడ్డా వేదాంత విద్యావిశారదుడు గదా. మహా ప్రభావ మెవడికుంటే వాడికి దేనివల్లా భయం లేదు. ఏమిటా ప్రభావం. బ్రహ్మానందానుభవమే. "ఆనందమ్ బ్రహ్మణో విద్వాన్ – నబిభేతి కుతశ్చన" అని చాటుతున్న దుపనిషత్తు. ఆ మాట కనుగుణంగా ఉన్నదీ మాట. అంతేకాదు. వీడితో విరోధం పెట్టుకోటం వల్ల నాకు మరణం తప్పదంటున్నాడు. వాడు చావటం దేవుడెరుగు వాడి మూలంగా నేను చస్తానేమో నని భయపడుతున్నాడు. ఇదేమిటి. తాను బ్రహ్మదేవుడి వల్ల మరణమనేది లేకుండా బ్రహ్మాండమైన వరం పొందాడు గదా. మృత్యువులేని జీవనం గదా అతడు కోరింది. అలాగే ఇచ్చాను పొమ్మని గదా

హామీ ఇచ్చిపోయాడా బ్రహ్మ. ఇక తాను చస్తాననే భయం దేనికా దానవుడికి. అయినా భయపడుతున్నాడు.

ఇక్కడే ఉంది పెద్ద రహస్యం. మామూలుగా చూస్తే భయపడవలసిన అగత్యం లేదు. కాని ఒక విషయం ఆశ్చర్యం గొలుపుతున్నది వాడికి. తానెంత దారుణంగా హింసించినా చావటం లేదా బాలుడు. వాడేమీ తనలాగా తపస్సు చేయలేదు. వరాలు సంపాదించలేదు. ఏ సాధనా లేకుండా వాడెందుకు చావడు. ఏమిటా ప్రభావం. ఎక్కడి నుంచి వచ్చింది. ఏదో ఒక మహిమ లేకపోతే ఇలా జరగటానికే మాత్రమూ వీలులేదు. అది తపస్సు లేకుండానే వాడికి సంక్రమించిందంటే తనకంటే మహిమాన్వితుడయి ఉండాలి. ఏమిటా శక్తి. అది సగుణమా, నిర్గుణమా. సగుణమని విశ్వసిస్తున్నాడు తానింతవరకూ. కాదు నిర్గుణం పొమ్మని మాటిమాటికీ హెచ్చరిస్తున్నాడు వాడు. బహుశః ఫలితాన్ని బట్టి చూస్తే వాడు చెప్పిందే వాస్తవమేమో. అయినా తన భ్రాతను చంపినప్పుడు సగుణరూపంతోనే చూపట్టాడే ఆ దేవుడు. నిర్గుణమని ఎలా భావించటం. కాకుంటే వీడికీ అనన్యా దృశమైన ప్రభావమెక్కడిది.

ఇలా ఏదీ తేల్చుకోలేని విచికిత్సలో పడ్డాడు హిరణ్యకశిపుడు. అసలది ప్రహ్లాదుడు చెప్పినట్టు నిర్గుణమే అయితే తన విశ్వాసమంతా ఇక అబద్ధమే. అబద్ధమే అయితే బ్రహ్మదేవుడు తనకిచ్చిన వరాలూ అకించిత్కరమే. ఎందువల్ల. **"గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశ స్థలిన్ దిక్కులన్ రేలన్ ఘ్రములన్ తమః ప్రభల భూరి గ్రాహ రక్షో మృగవ్యాళాదిత్య నరాది జంతు కలహ వ్యాప్తిన్ సమస్తాస్త్ర శస్త్రాళిన్ మృత్యువు లేని జీవన"** మిప్పించమని కదా వాడు కోరాడు. ఆయన ఇచ్చాడు. ప్రస్తుతమీ బాలుడలాంటి తపస్సూ వరాలు లేకుండానే తాను ప్రయోగించిన అస్త్రశస్త్రాదుల వల్ల చెక్కు చెదరకుండా బ్రతికాడు. అలా బ్రతికాడంటే బ్రహ్మకతీతమైన శక్తివల్లనే బ్రతికి ఉండాలి. అలాంటప్పుడిక బ్రహ్మ వరాలంతకంటే తక్కువే గదా. అవి పని చేస్తాయని ఇక ఏమి నమ్మకం. అని పెనుభయం పట్టుకొన్నది వాడికి. ఇంతకూ సగుణంగా కనిపించిన దేవుడు తనకిచ్చిన వరం కంటే నిర్గుణంగా ఎవరి కంటికీ కనిపించకుండానే కుమారుడికి తోడుపడే వెలుపే మహిమాన్వితుడనే అనుమానం కూడా రేకెత్తింది చిత్తంలో. ఇదేదో ఐసా పైసా తేల్చుకోటం మంచిదని భావించాడు. ఆ కుర్రవాడి నింకా బాధించి వాడి అంతు చూద్దామనుకొన్నాడు.

బాగా హింసిస్తే చివరకది సగుణమో, నిర్గుణమో ఆ దైవం తేలిపోతుంది. సగుణమే అయిందా తనదే పైచేయి. నిర్గుణమే సగుణంలా భాసించిందా దాని చేతిలో తనకు నిజంగానే మరణం తప్పదు. అందులో మొదటిది తనకు యథాపూర్వంగా వైకుంఠ ద్వారపాలకత్వాన్ని ప్రసాదిస్తే రెండవది అంతకన్నా అతీతమైన మోక్ష సుఖాన్నే అనుగ్రహిస్తుంది. ఏదైనా తనకు నష్టం లేదు గదా అని తన ఉద్యమాన్ని తీవ్రతరం చేయసాగాడు.

ఇదంతా మనసులో పెట్టుకొని ఇక వీణ్ణి హింసించి లాభంలేదు. వీడి దగ్గరే ఉందా ప్రభావం. అదేదో తెలుసుకొందామని వాడితో ప్రశ్నోత్తరాల కుపక్రమించాడు. **"అమర కిన్నర గంధర్వ యక్ష విహగ నాగ విద్యాధరావళి నాకు వెఱచు -నేల వెఱవవు పలువ నీకేది దిక్కు"** మరి ప్రజ్ఞావంతులు లోకపాలకులు శుంభద్వేషులయి కూడా మదీయాజ్ఞా భంగం సేయనోడుదురే. అట్టిచో నీవెలా నా ఆజ్ఞోల్లంఘన చేయగలిగావు చెప్పమంటాడు. అంతేకాదు. కంఠక్షోభము గాగ నొత్తిలి మహాగాఢంబుగా వైకుంఠుడు వైకుంఠుడని ఘోష పెడుతున్నావే. ఏడీ ఆ వైకుంఠుడెక్కడున్నాడు. ఉంటే మరినే నమరులన్ ఖండింప దండింపగా కుంఠీభూతుడు గాక రావలదే. మరి రాలేదే. ఎందుకనిరాలేదు. చెప్పమని నిలదీస్తాడు. "దిక్కులు గెలిచితిన్నియు దిక్కెవ్వడు రోరి నీకు. బలవంతుడనే జగముల మహాబలుల జయించితి నెవ్వని బలమునన్నాడెదవు నాకు బ్రతి వీరుడవై" ఆ దిక్కేదో, బలమేదో బయటపెట్టమని గ్రుచ్చి గ్రుచ్చి అడుగుతాడు.

ఎక్కడో ఉన్నదది చూపుతాడని వాడి ఆశ. అది ఎక్కడైనా దొరికే పదార్థమైతేగా అందుకే జవాబిస్తున్నాడు ప్రహ్లాదుడు. బలమెవ్వడని అడుగుతున్నావు.

బలయుతులకు దుర్బలులకు బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బలమెవ్వడు ప్రాణులకును బలమెవ్వండట్టి విభుడు బల మసురేంద్రా

తనకే గాదట తనతండ్రికి బలం కూడా అదేనట. హింస పడినా తట్టుకొనేందుకు తనకు బలమైతే, హింస పెట్టేందుకు తండ్రికి కూడా బలమదే. అప్పటికి హిరణ్యకశిపుడి కున్న బలమూ, ప్రహ్లాదుడిలో ఉన్న బలమూ ఒక్కటే. సర్వాత్మకమైన తత్త్వమయినప్పుడు రెండు బలాలెక్కడ నుంచి వస్తాయి. రెండూ ఒకటని చూస్తున్నాడు

కుమారుడు. రెండూ రెండుగా భావిస్తున్నాడు హిరణ్యకశిపుడు. అదే సగుణదృష్టిలో ఉండే దౌర్బల్యం. సార్వత్రికమైన బలాన్ని ప్రత్యేకించి తన బలమని భావించటమే ఒక బలహీనత. ఇలాటి బలహీనుడైన బలవంతుడా హిరణ్యుడు. కనుకనే వాడు చేసిన మారణ హోమాలేవీ ఆ బాలుడి మీద పనిచేయలేదు.

ఇంకా చీవాట్లు పెడుతున్నాడా కుర్రవాడు తండ్రిని.

లోకము లన్నియున్ గడియ లోన జయించిన వాడవింద్రియా
నీకము జిత్తమున్ గెలువనేరవు - నిన్ను నిబద్ధజేయునీ
భీకర శత్రులార్వుర బ్రభిన్నుల జేసిన బ్రాణి కోటిలో
నీకు విరోధి లేడొకడు నేర్పున జూడుము దానవేశ్వరా

ఆ లోక మీలోకం జయించానని మాటిమాటికీ గొప్పలు చెప్పుకొంటున్నావు. ఏ లోకమూ జయించబనిలేదు నీలో ఉన్న ఇంద్రియానీకాన్ని జయిస్తే. అంతకన్నా లోపల దాగి ఉన్నాయి మరి అరుషూతుక మృగాలు. అవి నిన్నెప్పుడో చీల్చి చెండాడుతాయి. ఆ లోపలనే వాటిని నీవు నిర్మూలించగలిగితే నీకీ ప్రపంచంలో ఇక శత్రువే లేడు సుమా. అయితే ఈ సూక్ష్మం తెలుసుకోటానికెంతో నేర్పుకావాలి. అది ఓర్పుతో గాని రాదు. నీకా ఓర్పూ నేర్పూ లేదు మరి. అందుకే ఇంత పెడసరంగా నాతో వాదిస్తున్నావు. ఈ అనవసర వాదం కట్టిపెట్టి

పాలింపుము శేముషి-ను న్మూలింపుము కర్మబంధముల సమదృష్టిన్
చాలింపుము సంసారము - కీలింపుము హృదయమందు కేశవ భక్తిన్

అని అద్భుతమైన సలహా ఇస్తాడు.

అది వాడి జాజ్వల్యమానంగా మండే కోపాగ్ని కాజ్యం పోసినట్టయింది. అయినా వాడినేమీ చేయలేనని తెలుసు తనకు. తనకిప్పుడు కావలసిందొక్కటే. తాననుకొన్నది నిజమా. వాడు చెప్పేది నిజమా. పెద్ద కుతూహలం పట్టుకొన్నదా రాక్షసుడికి. అందుకే దాని కనుగుణంగా ఇలా ప్రశ్నించాడు.

నా తోడం బ్రతి భాషలాడెదు - జగన్నాథుండ నాకంటె నీ
భూత శ్రేణికి రాజు లేడొకడు సంపూర్ణ ప్రభావుండ - ము

భ్రాతం జంపిన మున్ననే వెదకితిన్ బల్మాఱు నారాయణుం
డేతద్విశ్వము లోన లేడు మఱివా డెందుండు రా దుర్మతీ

ఇంతకు పూర్వం నా తమ్ముని చంపిపోయాడు వాడు. వాడు విష్ణువేనని తెలుసు నాకు. అయితే వాడెక్కడికి పారిపోయాడో మాత్రం తెలియదు. వాడికోసమెంతగానో గాలించానీ చతుర్దశ భువనాలూ అయితే వాడి జాడనాకెక్కడా కనపడలేదు. మరి నీకెక్కడ కనిపించాడురా అర్భకా.

ఎక్కడ గలడే క్రియనే చక్కటి వర్తించు నెట్టి జాడను వచ్చున్
చక్కడతు నిన్ను విష్ణుని పెక్కులు ప్రేలెదవు వాని భృత్యుని పగిదిన్

నీకేదో వాడు కూలి ఇచ్చి పొగడించుకొన్నట్టు ప్రేలుతున్నావు. వాడెక్కడ ఉన్నాడెలా ఉన్నాడే రకంగా వచ్చి పోతుంటాడు. ఆ రహస్యం బయట పెట్టమంటాడు. నిజంగా అదేదో రహస్యం తెలుసుకోవాలని వాడి తాపత్రయం.

దానికా అర్భకుడిచ్చిన జవాబు అతిలోకం.

కలడంభోధి గలండు గాలి కలదా కాశంబు నం గుంభినిం
గల డగ్నిన్ దిశలం బగళ్ల నిశలన్ - ఖద్యోత చంద్రాత్మలం
గల డోంకారము నం ద్రిమూర్తులఁద్రిలింగ వ్యక్తులందతటం
గల డీశుండు గలండు తండ్రీ ! వెదకంగా నేలయీయా యెడన్

ఎక్కడంటే అక్కడ ఉన్నవాణ్ణి ఎందుకయ్యా వెతకటం. వెదకినా నీవెక్కడని వెదుకుతావు. ఇక్కడా అక్కడా వెదకబోతావు. ఇక్కడా అక్కడా వెదకితే ఎలా కనిపిస్తుందా తత్త్వం. ఏమి ఎందుకు కనిపించదు. అంతటా ఉన్నాడని మీరే గదా చెబుతున్నారు. అంతటా ఉన్నప్పుడెక్కడ వెతకినా కనిపించాలి గదా. వాస్తవమే. కనిపిస్తుంది. కాని ఆ మేరకే కనిపిస్తుందది. ఎందుకంటే నీవు వెదుకుతున్నది ఎక్కడో ఒకచోట. అది తత్త్వంలో ఏకదేశం. కనుక ఆ మేరకే కనిపిస్తుందది. అంటే ఒక నామమనీ, రూపమనీ క్రియ అనీ విశేషరూపంగా భాసిస్తుంది. అంతేగాని సామాన్య రూపంగా గోచరించదు. సామాన్య రూపమంటే ఏ రూపమూ లేకపోవటమే. సర్వత్రా అన్నప్పుడు రూపమెలా ఉంటుంది. జడమైన ఆకాశానికే లేదే రూపం. శుద్ధ

చైతన్యమైన దానికెలా సంభవం. కనుక దానినలాగే దర్శించగలగాలి మానవుడు. అప్పుడే అది నిజమైన జ్ఞానం. దానికి వ్యతిరిక్తమైనదంతా ఇక అజ్ఞానమే. ఇలాంటి అజ్ఞానం వదలకుండానే అడిగాడు హిరణ్యకశిపుడది ఎక్కడ ఉందో చెప్పమని. ఎక్కడ ఉండటమేమిటి. సర్వత్రా ఉన్నది. ఎక్కడ అంటే అది విశేషం. నామ రూపాదులన్నీ ఇలాంటి విశేషాలే. ఈ విశేషాలు గాక ఈ విశేషాలలో సమానంగా పరచుకొని దాగి ఉన్న ఆ తత్త్వాన్ని పట్టుకో చేతనైతే. అదే నీవు వెదకవలసింది ఇది గాదని హెచ్చరిస్తున్నాడు మరలా.

ఇందు గల డందులేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన అందందే గలడని

"భూతేషు భూతేషు విచిత్య ధీరాః" అన్నదుపనిషత్తు. ప్రతి అణువులో వెతకి చూడాలట తత్త్వదర్శి. వెతకటమూ, చూడటమూ రెండున్నాయిక్కడ. వెతకటం జ్ఞానమైతే చూడటం అనుభవం. ప్రపంచంలోనే వెతకాలి దాన్ని. మరెక్కడా గాదు. అయితే ప్రాపంచికమైన వస్తువులను గాదు. వస్తువులన్నీ వ్యాపించిన అసలు వస్తువును. కుండలనూ, బానలనూ, అటికలనూ, ముంతలనూ, వెతికితే ఏముంది. అవి పైకి కనిపించే రూపాలు. ఆ రూపాలనన్నిటినీ అలముకొని ఉన్న మృత్తిక అనే మూలతత్త్వాన్ని వెతికి పట్టుకోవాలి. పట్టుకొంటే అప్పుడీ రూపాలన్నీ ఆమృద్రూపాలే గదా అని మృదేకత్వ జ్ఞానం కలుగుతంది. అలాగే ఈ వననదీ పర్వతారణ్య గ్రహచంద్ర సూర్యనక్షత్ర తారకాది చిత్రవిచిత్రమైన బ్రహ్మాండమంతా సద్రూపమే గదా, చిద్రూపమే గదా అని దర్శిస్తూ పోతే చివరకంతా సదే కత్వమనే జ్ఞానమే ఉదయిస్తుంది. అది మన స్వరూపమే కాబట్టి ఇక వెదకే ప్రయాసే లేదు మనకు. అంతవరకూ ఎక్కడ వెదకినా ప్రయోజనం లేదు. ఇదీ ఆ మహాభాగవతుడి ఉపదేశవచో హృదయం.

ఎంత హృదయమైనా అర్థమయితే గదా ఆ అహంభావికి. ముందు పేర్కొన్నట్టు మహాబధిర శంఖాధానమది. ఒకడి దృష్టి సోపాధికం. మరొకడి దృష్టి నిరుపాధికం. రెండూ రాజీపడటమెలాగ. అందుకే ఒకరితో ఒకరీ వాదించుకోటం. హరి సర్వాకృతులం గలండనుచు ప్రహ్లాదండు భాషిస్తే సత్వరుడై యెందును లేడు లేడనిసుతున్ దైత్యుండు తర్జిస్తున్నాడు. ఉన్నాడనే వాడీ చూచే ఆ కృతులన్నీ అదే

గదా అనే సమ్యగ్దృష్టితో ఉన్నాడంటున్నాడు. పోతే లేడనే వాడీ ఆ కృతులే గదా మనకు కనిపించటం ఈ ఆకృతులలో దాని ఆకృతి ఎక్కడా కనపడటం లేదు కాబట్టి అది అసలు లేనే లేదు పొమ్మంటాడు. ఇదీ వీరి వాదం. ఈ వాదంతో తలబట్టి పోయిందసలా దేవుడికి. ఒకడెక్కడ బడితే అక్కడ ఉన్నాడంటున్నాడు. మరొకడెక్కడా లేడంటున్నాడు ఏమి చేయాలిప్పుడు. హిరణ్యకశిపుడిప్పుడు తనకు పరీక్ష పెడితే ఏమిటి గతి. పెట్టవచ్చు గూడా. అక్కడ ఉన్న ఏ స్తంభమో కుడ్యమో పగులగొట్టి అంతటా ఉన్నాడన్నావుగదా దీనిలో ఉన్నాడా చూపమని అడిగితే ఏమిటి మార్గం. కనపడటమా, కనపడకపోవటమా, కనపడితే ప్రహ్లాదుడి మాట తప్పవుతుందేమో కనపడకపోతే హిరణ్యకశిపుడి మాట ఒప్పువుతుందేమో ఎలా దీనికి పరిష్కారం.

ఉన్నట్టుండి పరిష్కారం స్ఫురించిందా పరమాత్మకు. ఇదేమిటి నేను పరమాత్మను గదా. సర్వత్రా ఎలా ఉన్నానో ఏకత్రా కూడా అలాగే ఉండగలను. సర్వత్రా ఉన్నప్పుడేకత్రా ఎలా లేకపోతాను. లేకపోతే అప్పుడు సర్వత్రా అనే మాట కర్థమేముంది. మహా అయితే సర్వత్రా ఉన్న దానికి రూపం లేదు అది నా స్వరూప దశ. పోతే అదే ఏకత్రా ఉన్నదంటే దానికొక విశేషమైన రూపం వచ్చి పడుతుంది. అది నా విభూతి దశ. స్వరూపం విభూతులు రెండూ నేనే గదా. నా అద్వితీయత్వానికి లోపమేముంది. ఇందులో ఈ రెండింటినీ అర్థం చేసుకొన్న పరమ భాగవతుడీ బాలుడు. వీడికోసం ప్రయత్నమక్కరలేదు నాకు. ఎటువచ్చీవయస్సు వచ్చినా అర్థం కాని వృద్ధ బాలుడీ హిరణ్యుడు. వీడికీ నేనేదో ఒక విశేషాకారంగా కనిపిస్తే గాని నమ్మడు నా ఉనికి. అంచేత వీడి నమ్మకం కోసమేదో ఒక రూపంలో కనిపించటమే మంచిది. అప్పుడైనా అర్థం చేసుకొంటే బాగుపడతాడు. లేదా అదే నా రూపమని సగుణ భావనతోనే మరణిస్తాడు. మరణిస్తే మరొక జన్మలోనైనా నిర్గుణ భావముదయిస్తుంది వీడికి. ఇలా ఆలోచించి **"శ్రీ నరసింహాకృతి నుండె నచ్యుతుడు నానా జంగమ స్థావరోత్కర గర్భంబుల నన్నిదేశముల నుద్ధండు ప్రభావోన్నతిన్"** స్థావర జంగమాత్మకమైన ప్రపంచంలో ప్రతి అణువులో తావన్మాత్రంగా నరుడూ గాని సింహమూగాని ఒకానొక విచిత్ర రూపంలో దాగి ఉన్నాడట.

అప్పటికప్పుడు వేషం వేసుకొన్నాడా లేక అంతకుముందే ఉన్నదా ఈ రూపం. ముందు నుంచీ ఉన్నది గాదు. వేషం వేసుకొన్నదే. రూపమనేది ఎప్పుడూ లేదా

పరమాత్మకు. స్వతహాగా రూపం లేకపోయినా ఏదో ఒక రూపంలో కనిపిస్తుందప్పుడప్పుడూ. **"జననము లేక కర్మముల జాడలబోక"** అనిగదా మొదటనే నిరూపించాము. జననమే లేకుంటే రూపమెక్కడిది. అయినా రూపం ధరించిందంటే అది దాని విభూతి యోగం. దేనికీ ప్రదర్శన. ప్రదర్శనే నిజానికిది. అదైనా దేనికంటే ధర్మ సంస్థాపనమే దాని ప్రయోజనం. అదే గదా భగవదవతార ప్రయోజనమని ఇంతకు ముందే వాక్రుచ్చి ఉన్నాము. అలాంటి ధర్మ సంస్థాపన కోసమే ఇప్పుడీ నరసింహావతారం. ఇది నరాకృతి గాదు. సింహాకృతి గాదు. ఏమిటీ విచిత్రం. హిరణ్యకశిపుణ్ణి సంహరించాలంటే ఇలాగే రావాలి మరి. ఎందుకని. వాడు గాలింగుంభిని అని దేనివల్లా చావు లేకుండా వరం తెచ్చుకొన్నాడు. కాబట్టి ఏదీగాని ఆకృతిలో వచ్చి ఏదో ఒక భంగిమలో వాణ్ణి వధించిపోవాలి. అలాగైతేనే బ్రహ్మవరాన్ని మన్నించినట్టవుతుంది. అంతేగాదు. వాడు ఏడీ ఎక్కడా ఏ రూపంలో ఉంటాడని గదా అడుగుతూ వచ్చాడు. ఇదుగో ఈ రూపంలో వచ్చాను. చూడు. చేతనైతే ఇదేమిటో చూచి అర్థం చేసుకో నా స్వరూపాన్ని అని ఈశ్వరుడు వాడిని నిశ్శబ్దంగా నిలదీసి అడిగే పెద్ద ప్రశ్న ఇది.

కనుకనే వాడు డింభకా సర్వస్థలములా వాడున్నాడని వాగుతున్నా వీ స్తంభంబున చూపగలవె ? స్తంభంలో చూపకపోతే నీతల వేయి ప్రక్కలు చేస్తానప్పుడా చక్రి వచ్చి నీ కడ్డుపడగలడేమో చూస్తానంటాడు. ఎలాగూ అడ్డుపడతాడప్పుడైన చూడవచ్చుననే ఉందా వైర భక్తుడి హృదయంలో. పిపీలికాది బ్రహ్మ పర్యంతమంతటా ఉన్న వాడీ స్తంభంలో ఉండటానికేమి అభ్యంతరం పొమ్మంటాడు ప్రహ్లాదుడు. పైగా నేడు నీకు ప్రత్యక్షంగా కనపడతా డంటాడు. ఎంత సాభిప్రాయమైన మాటో ఇది. ఈశ్వరుడి స్వరూపం అనుభవైక గోచరమైతే ఆయనవిభూతి ఇంద్రియ గోచరం. నీవిలా ఇంద్రియాలతో ప్రత్యక్షంగా చూడాలనుకొంటే అలాగే కనపడతాడు. ప్రతిబంధ మేముందని హెచ్చరిక ఇది. సరే నీ మాట కాదనటం దేని కలాగే చూపమంటూ లేచి సభాభవన స్తంభాన్ని అరచేత ఆస్ఫాలించాడా దానవుడు.

ఆస్ఫాలించటమేమిటి. వెంటనే ఆవిర్భవించట మేమిటా రూపం. అదృష్ట పూర్వమైన ఆ అద్భుతాకారం చూచి హడలిపోయాడు వాడు.

నరమూర్తి గాదు కేవల హరి మూర్తియు గాదు మానవాకారముకే
సరి యాకారము నున్నది హరి మాయా రచితమగు యథార్థముసూడన్

ఇప్పటి కర్థమయింది వాడికిదంతా హరి మాయేనని. యథార్థం చూస్తేనే అర్థమయింది. అంతవరకూ మాయ అయిందీ తెలియదు. స్వరూపమయిందీ తెలియదు. స్వరూప జ్ఞానం కలిగితే గాని మిగతా వేషభాషలన్నీ మాయమయమని గ్రహించలేడు మానవుడు. ప్రస్తుత మలాంటి స్వరూప జ్ఞానమేమి కలిగిందని హిరణ్యకశిపుడికి. నరమూర్తి హరిమూర్తి రెండూ కాకుండానే రెండూ అయింది నేను చూచానంటున్నాడు వాడు. ఇదే స్వరూప జ్ఞానం. ఎలాగ. నరరూపమంటే నశించే జీవుడి రూపం. హరి రూపమంటే దాన్ని హరించే లేదా నశింపజేసే ఈశ్వర రూపం. ఈ జీవేశ్వరులు రెండూ కాని దా పరతత్త్వం. అదే మరలా మనకు కనపడ వచ్చేసరికీ నరకేసరి రూపంలో కనిపిస్తున్నది స్వరూపమే విభూతిగా మారి దర్శనమిస్తున్నది. అలా దర్శనమివ్వటమే మాయ. ఈ మాయవెనకాల ఉన్న ఆ మాయావే స్వరూపం. ఇదీ ఆ దానవ భక్తుడు గ్రహించిన తత్త్వ రహస్యం.

ఈ రహస్యమతడు కారణ జన్ముడు కాబట్టి మొదటి నుంచే గ్రహించి ఇంత కాలమూ తన జన్మ కడతేర్చుకొని పోవటానికలా దుర్మార్గుడుగా నటిస్తూనైనా వచ్చి ఉండాలి. లేదా మొదటి నుంచీ సగుణ బుద్ధి వదలకుండా మెలగుతూ వచ్చి నిర్గుణ భావనిష్ణాతుడైన కుమారుడి హిత బోధనల మూలంగా మనసు మారి చిట్టచివరకిలా సత్యాన్ని దర్శించిన వాడైనా కావాలి. ఏదైనా ఒక్కటే. కేవల సాకారం గాక సత్యం నిరాకారమూ సాకారమూ కూడనని గ్రహించటమే చాలు. అది వాడి చిత్తపరిపాకాన్ని సూచిస్తుంది. ఇలాటి పరిపాక మతడికి కలిగినట్టు తరువాతి వ్యవహారం చూస్తే మనకు దాఖలా అవుతుంది.

తెంపున బాలుడాడినను ధీరత సర్వగతత్వమున్ ప్రతి
ష్ఠింప గ వచ్చినాడు – హరిచే మృతి యంచు దలంతు నైన నా
సొంపును బెంపు నందఱును జూడ జరింతు హరింతు శత్రువున్

నా స్వామి అయిన విష్ణుదేవుడే నన్ను శిక్షించాలని ఈ రూపంలో సాక్షాత్కరించాడు. తన సర్వాత్మకత్వాన్ని నిరూపించుకోవాలని ఇలాటి వేషం

ధరించాడు. ఈ దేవుడి చేతిలో నాకు చావు తప్పదు. అయినా లోకం కోసం కొంతనా పరాక్రమం ప్రదర్శించి చూస్తానంటాడు.

చూడండి ఈ మాటలలో ఎంత భావ గాంభీర్యముందో ఈశ్వరుడు సర్వగతుడనే విషయం వాడికెఱుకే అప్పటికి. అయినా కుర్రవాణ్ణి రెచ్చగొట్టాడంటే ఆయన ఈ రూపాన్ని ధరించి బయటపడతాడో లేదో చూతామని. తాను అనుకొన్నట్టె బయట పడ్డాడాదేవుడు. ఇంకేమి. ఆయన చేతిలో తన శాప జన్మ తీరిపోతుంది. తాను ముక్తుడవుతాడు. త్వరగా ఆయనను మీద వేసుకోవాలంటే తానాయనపై చేయి చేసుకోవాలి. అలా చేస్తే తన స్వామితో కలిసి క్రీడించాననే తృప్తి అయినా ఉంటుంది. ఆ తరువాత సాయుజ్యం లభిస్తే ఎలాగూ లేదా వినోదం. ఇదీ ఆ దానవ భక్తుడి మాటలలోని మర్మం. అందుకే మెత్తబడిన చిత్తంతో గదా దండమెత్తి ఆయన మీద జళిపించాడట. జళిపిస్తే ఆయనేమి తక్కువ వాడా. భక్తుడి హృదయమర్థం కానివాడా. వాడు తన్ను హరించటం కాదు. తానే వాణ్ణి హరించాలనుకొన్నాడు. వాడు తన్ను హరించాలంటే అది సాత్వికంతో రావాలి. మరి రాజసమైంది వాడి భక్తి. అంచేత వాణ్ణే తాను హరించాలి. అంటే రజః ప్రమార్జనం చేసి సత్వాన్ని వాడికందివ్వాలి. సత్వజన్యమైన జ్ఞానంతో వాడుతరించాలి. అంచేత **"సటలు జళిపించి గర్జించి సంభ్రమించి జిహ్వ యాడించి లంఘించి చేతనొడిసి"** పట్టాడు వాణ్ణి. విహగేంద్రుం డహి వ్రచ్చుకైవడి మహోద్ధత్తితో వాడి శరీరాన్ని వ్రచ్చాడు. వాడు చచ్చాడు. వాడు కాదు వాడి ఉపాధి. అది అనాత్మ. అనాత్మ గనుకనే అది ఆనరకేసరి ఖరనఖర శిఖా విదారితమయిపోయింది. క్షురధారోపమములైన ఆఖర నఖరములే స్వామి సన్నిధికి మార్గం చూపి జయుడికి మరలా నిజమైన జయాన్ని ప్రసాదించాయి.

ఇక్కడికి హిరణ్యుని పరీక్ష పూర్తి అయింది. ఇక ప్రహ్లాదుడికి పరీక్ష. అది ప్రతిలోమమైతే ఇది అనులోమం. అది దారుణమైతే ఇది సుకుమారం. త్రిదశులంతా వచ్చి కీర్తించారా మూర్తిని. కాని ఆ మూర్తికి దగ్గరగా రావటానికందరికీ భయాందోళనలే. ఒకరినొకరు మీరు వెళ్లి చెప్పండి. మీరు వెళ్లి చెప్పండి. అని ముందటికి తోస్తుంటే మళ్ల బడి వెనుకకు తగ్గేవారే. నారదుడేమిటి, బ్రహ్మ ఏమిటి, కడకు నిత్యానపాయని అయిన మహాలక్ష్మి ఏమిటి, ఎవరు గానీ అడుగు ముందుకు వేయలేకపోయారు. అందరూ కలిసి చివరకు ప్రహ్లాదుణ్ణే ముందుకు తోస్తారు.

తోస్తే జంకూ కొంకూ లేక ఆ భాగవతుడు సరసర దగ్గరకే పోయి సాష్టాంగ ప్రణామం గావిస్తాడు. కరుణా తరంగితా పాంగావ లోకములతో ఆలోకించి ఆ దేవుడు తన దక్షిణ హస్తమా బాలుడి మస్తకం మీద మోపుతాడు. అదే అనుగ్రహంగా భావించి పరిపరివిధాల కీర్తిస్తాడా దేవుణ్ణి ప్రహ్లాదుడు. ఆ దేవుడు అతని అచంచల భక్తి ఎలాంటిదో పరీక్షిద్దామని ఏదైనా వరం కోరుకోమంటాడు. **"వరమ్ వృణీష్వాభి మతమ్ - కామపూరో ఽస్మ్యహం నృణామ్"** మానవులేది కోరినా తీరుస్తాను కోరమంటాడు.

ఏవం ప్రలోభ్యమా నోపి - వరైర్లోక ప్రలోభనైః
ఏకాంతిత్వా ద్భగవతి - నై చ్ఛత్తా నసురోత్తమః
స్మయ మాన ఉవాచైనమ్ - మామ్మా ప్రలోభయోత్తృత్వా
సక్తం కామేషు తైర్వరైః తత్సంగ భీతో నిర్విణ్ణోవిముముక్షు రుపాశ్రితః

ఎందుకయ్యా నన్నిలా ప్రలోభపెడతావిలాంటి వరాలు నాకక్కరలేదు. ఇవన్నీ సంసారంలో పడదోసేవే. నాకు కావలసింది మోక్షమనేది ఒక్కటే నని తెగవేసి చెబుతాడాయనతో.

ఇదే సగుణానికీ నిర్గుణానికీ తేడా. నిర్గుణుడికే వాంఛా లేదు. వాడికున్న వాంఛ అల్లా ఒక్క మోక్షమే. అది వాడికి జ్ఞానంలోనే అంతర్భూతమయి ఉంటుంది. ఏ దేవుడూ ఇవ్వనక్కరలేదు. ప్రహ్లాదుడి దిలాటి ఉత్తమోత్తమ స్థితి. సర్వమూ ఆత్మమయమే అతనకి. ఇక క్రొత్తగా కోరవలసిందేముంది. పొందవలసినదేముంది. నృసింహమూర్తి హస్తమస్తకయోగం చేశాడన్నా దాని అర్థం వేరు. వీడొక్కడే సుమా సమ్యగ్దర్శి. ఇలాంటి సమ్యగ్దర్శన మలపరుచుకొని బ్రతకండి మీరంతా - నని అక్కడ మూగిన బ్రహ్మేంద్రాదులకు చేసే సూచన అది. మరి ప్రహ్లాదుడాయన గుణగణాలనూ మహిమలనూ కీర్తించటం కూడా ఫల నిరపేక్షంగా లోక సంగ్రహ దృష్టితో చేసే వ్యవహారమే. ధీరులు నిరపేక్షులు నాత్మారాములు నైన మునులు హరి భజనమ నిష్కారణము సేయుచుందురని సూత మహర్షి శుకయోగిని గూర్చి ఎప్పిన మాటే ఇక్కడా వర్తిస్తుంది.

పోతే ప్రహ్లాదుడి కథ ఇక్కడితో ముగియలేదు. ఇది ప్రహ్లాదుడి బాల్యచరిత్ర. మరి వయసు వచ్చిన తరువాత రాజ్యపాలన చేసినప్పటి వృత్తాంతం కూడా ఎంతో ఉంది. అందులో ఒకటి రెండు ఘట్టాలు వస్తాయి మనకు భాగవతంలో. ఒకటి ప్రహ్లాదా జగర సంవాదం. అది ఇంతకు ముందే వర్ణించబడింది. దీనిని బట్టి బాల్యంలోనే సమసిపోక ఆ బ్రహ్మాకార వృత్తి వయసు మళ్లినా అనువర్తిస్తూనే ఉందని తెలుసుకోవచ్చు. మరి ఒకటి బలి మర్దన ఘట్టం. బలి చక్రవర్తి ప్రహ్లాదుని మనుమడే. అతణ్ణి త్రివిక్రముడు పాతాళానికి అణగద్రొక్కే సమయంలో ప్రహ్లాదుడక్కడికి వస్తాడు. అప్పటికి వరుణ పాశ వేష్టితుడు కావటం మూలాన బలి ఆయనకు ప్రణామం చేయలేక సిగ్గు పడతాడు. ప్రహ్లాదుడు నేరుగా వామన దేవుడున్న చోటికి పోయి సాష్టాంగదండ ప్రణామం చేసి ఇలా అంటాడు. స్వామీ ! నీవితనికి మొదట ఇంద్రపదవి ప్రసాదించి పిదప దానిని దూరం చేశావు. చాలా మంచి పని చేశావు. ఆ పదవి వలన అహంకారానికి గురి అయినాడు మావాడు. నీవది తొలగించి శిక్షించటమే గాని వీణ్ణి బంధించటం కాదిది. తత్త్వజ్ఞుడైన వాడికి మహేంద్ర పదవి మరి ఒక పదవి దేనికి. నీ పాద కమలసేవ ఏమరకుంటే చాలదా. దాని మేర ఏదో చూపి వీడి ఏమరుపాటు పోగొట్టావు. చాలా సంతోషమని ప్రదక్షిణం చేసి వెళ్లిపోతాడు.

ఇలా చూస్తూ పోతే ఒక మహాజ్ఞాని అయిన వాడి ప్రవృత్తి ఎలాటిదో మనకర్థ మవుతుంది. బహు జన్మార్జిత పుణ్యఫలంగా ఒక్కసారి ఆ బ్రహ్మాత్మ జ్ఞానమనేది ఉదయించాలే గని ఉదయించిన తరువాత దానికిక అస్తమయం లేదు. అసలనుదితా నస్తమితమన్నారు దాన్ని అభిజ్ఞులు. అది కలిగిందో జీవితాంతమూ జ్ఞాని నతని నీడలాగా అనుసరించి ఉంటుంది. ఎప్పుడూ విడనాడదు. విడనాడేప్రశ్నే లేదు. విడనాడితే అది సమ్యగ్దర్శనమే గాదు. ఇలాటి అవిచ్ఛిన్న పరిపూర్ణానన్యభక్తి రూపమైన జ్ఞానయోగానికి నిదర్శనమే ఈ ప్రహ్లాదోపాఖ్యానం.



Yallamalasrinivasa Rao
www.advaitavedanta.in

13. నిర్గుణ భక్తులు - కుచేలుడు

ప్రహ్లాదోపాఖ్యానమయింది. ఇక కుచేలోపాఖ్యానానికి వచ్చాము. ప్రహ్లాదుడూ, కుచేలుడూ ఇరువురూ జ్ఞానయోగులే. నిర్గుణోపాసకులే. కేవల జ్ఞాననిష్ఠాపరులై ఇరువురూ మోక్షఫలాన్ని చవిచూచిన వారే. ఐతే ఎంతవరకంటే ప్రహ్లాదుడు రాక్షస వంశంలో పుట్టిన కారణ జన్ముడైతే కుచేలుడు అచ్చమైన బ్రాహ్మణ వంశంలో జన్మించినవాడు. **"శుచీనామ్ శ్రీమతాం గేహే"** అన్నట్టు ఒకరు ఆ గర్భ శ్రీమంతుని ఇంట్లో జన్మిస్తే మరొకరు **"అథవా యోగినా మేవ కులే భవతి"** అన్న రీతిగా అకించనులైన మహాయోగుల కులంలో జన్మించారు. అతడు బ్రహ్మచర్యంలోనే జ్ఞాని అయితే ఇతడు గృహస్థుడయి ఉండి కూడా మహాజ్ఞాని. ఇదే చాలా కష్టమైన విషయం. అసిధారా వ్రతంలాంటిదిది. ఎందుకంటే బ్రహ్మచారిగా బ్రతికేవాడికి భార్యా బిడ్డలనే తగులముండదు. కాబట్టి వాడికే బాదర బందీ లేదు. కాలమంతా వాడి అధీనమే. ఎంత పరచింతనతో గడపినా గడపవచ్చు జీవితం. అలాగే గడపాడు ప్రహ్లాదుడు. పోతే కుచేలుడి విషయమలాకాదు. ఇతడు గృహస్థుడు. పెండ్లాముంది. బిడ్డలున్నారు. వారూ ఒకరుగా రిద్దరు కారు. ఆవిడ కడుపు ఫలించినంత మంది. వీరందరినీ పెట్టి పోషించాలంటే అతడు ఏమీ సంపన్నుడు కాడు. పూట గడవని నిష్ఠదరిద్రుడు. ఇలాటి కఠోర దారిద్ర్యమనుభవిస్తూ కూడా దానినే మాత్రమూ పట్టించుకోక మనసు నిరంతరమూ పరచింతనా భరాయత్తంగా బ్రతుకు సాగించాడంటే అది నిజంగా గొప్ప విషయం. ఎంతో గొప్ప వైరాగ్యభావముంటే గాని అది సంభవం కాదు.

జ్ఞానముంటే లాభం లేదు. జ్ఞానానికి వైరాగ్యం కూడా తోడు కావాలి. జ్ఞానమనులోమంగా అభ్యాసానికి దారి తీస్తే వైరాగ్యం తదితరమైన విషయ ప్రపంచానికి మనలను దూరంగా తీసుకెళ్లుతుంది. దీనికి దూరమైతే గాని దానికి చేరువ కాలేడు మానవుడు. ఇది పూర్తి దూరమైతే అది పూర్తి దగ్గరవుతుంది. అప్పుడే జ్ఞానం జ్ఞాననిష్ఠగా మారి ముక్తి సుఖాన్ని ప్రసాదిస్తుంది మనకు. కనుకనే జ్ఞానానికి వైరాగ్యాన్ని అంగంగా పేర్కొంటుంది శాస్త్రం. **"అభ్యాసే నతు కౌంతేయ - వైరాగ్యాభ్యామ్ తన్ని రోధః"** అని యోగశాస్త్రాలు కూడా ఘోషిస్తున్నాయి. ఈ

వైరాగ్యాన్నే సన్న్యాసమని కూడ వ్యవహరిస్తుంది శాస్త్రం. **"జ్ఞానమ్ సన్న్యాస లక్షణమ్"** జ్ఞానానికి సన్న్యాసమే లక్షణమట. ఇవి రెండూ సమగ్రంగా ఉన్నప్పుడే సమగ్రమైన ఫలాన్ని మనకవి ప్రసాదిస్తాయి. ఇందులో జ్ఞానమనేదాని కుదాహరణ ప్రాయం ప్రహ్లాదుడి చరిత్ర అయితే – వైరాగ్యాని కుదాహరణం ప్రస్తుత మీ కుచేలుడి కథ. రెండూ పరస్పరం అవినాభూతమైన లక్షణాలైనా ఒక్కొక్క దాని స్వరూపాన్నీ మనం విడివిడిగా చూచి పట్టుకోటానికీ రెండు కథలూ మనకు రెండు విధాలుగా ఉపకరిస్తాయి. రెండు భావాలకూ రెండు కథలూ కేవలం ప్రతీకలే. అది వారి నామధేయాలే మనకు వెల్లడి చేస్తున్న రహస్యం. ప్రహ్లాద అంటే అఖండమైన నిర్వృతి. అది జ్ఞానానికి చిహ్నం. అలాగే కుచేల అంటే దుర్వాసన్ అన్నట్టు జీర్ణ వస్త్రధారి అని శబ్దార్థం. శబ్దార్థమిదే అయినా భాగవత ముద్దేశించిన లక్ష్యార్థం వేరు. జీర్ణ వస్త్ర మెవడు ధరిస్తాడు. కేవల దరిద్రుడు. దరిద్రత అంటే ఏమిటిక్కడ. ఏదీ లేకపోవటం. అంటే ప్రాపంచికమైన భోగ భాగ్యాలకు దూరం కావటం. ఇది కేవల వైరాగ్యానికి సూచకం.

అంచేత కుచేలోపాఖ్యానం కేవల వైరాగ్యభావానికి ప్రతీకగా సాగిన కథ. కుచేలుడికి మరొక నామధేయం కూడా ఉన్నది. అది శ్రీదాముడు. దామమంటే పూలమాల. శ్రీ అంటే లక్ష్మి. లక్ష్మిని మెడలో ఒక దండలాగా ధరించి తిరిగేవాడు. అంటే చాలా ధనవంతుడని గదా అర్థం. మరి అలాటివాడు కుచేలుడెలా అయ్యాడు. అదీ చిత్రం. భౌతికంగా ఏ ధనధాన్యాలూ, భోగభాగ్యాలూ లేకున్నా అధ్యాత్మికంగా ఐశ్వర్యంగా భావించేవాడంటే అది ఎంత మహాజ్ఞాని కుండవలసిన లక్షణం. **"వాసుదేవ స్సర్వమితి"** అని ద్వంద్వాత్మకమైన సృష్టినంతా పరమాత్మ రూపంగా దర్శించి దాన్ని నిత్య జీవితంలో అనుభవానికి తెచ్చుకొన్న బ్రహ్మవేత్తకే అది సాధ్యం.

కుచేలుడలాంటి బ్రహ్మవేత్త. ఆయన పాత్రను మనకు ప్రవేశపెట్టటంలోనే భాగవతమిలాటి మహదాశయాన్ని ప్రకటిస్తున్నది.

కృష్ణస్యాసీ త్సఖా కశ్చి – ద్బ్రాహ్మణో బ్రహ్మవిత్తమః
విరక్త ఇంద్రియార్థేషు – ప్రశాంతాత్మా – జితేంద్రియః

కృష్ణ పరమాత్మ అవతరించిన కాలంలో ఆయనకు సాక్షాత్తూ ప్రాణస్నేహితుడైన ఒక బ్రాహ్మణుడు కుచేలుడనేవాడు ఉండేవాడు. ఆయన బ్రహ్మవేత్తే గాదు. బ్రహ్మవేత్తలలో వరిష్ఠుడట. అంత వరిష్ఠుడు కావటం మూలాన్నే ఇంద్రియార్థాలు వేటిలోనూ లగ్నం గాక విరక్తుడయి ప్రశాంతంగా బ్రతుకుతుండేవాడు. అయితే మరి ఆయనకు జీవనమెలాగ అని ప్రశ్న వస్తే చెబుతున్నాడు. **"యద్భ్యో పప న్నేన వర్తమానో గృహాశ్రమీ" "యదృచ్ఛాలాభ సంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః"** అని స్వామి వారు చెప్పినట్టు ఎప్పుడేది లభిస్తే దానితో దేహధారణ చేస్తూ కాలం గడిపేవాడట. చూడండి. కృష్ణుడి కాలంలో ఉన్నాడు కుచేలుడు. ఆయనతోపాటు చదువుకొన్నవాడు. బాల్యంనుంచీ ఆయనకు ప్రాణస్నేహితుడు. అలాంటప్పుడు పెరటిలో కామధేనువును కట్టి వేసుకొన్నట్టే గదా. ఎంతైనా భోగభాగ్యాలతో నిత్యమూ తులతూగుతుండాలా బ్రాహ్మణుడు. కానీ నిష్ఠదరిద్రుడు. ఏమిటీ చిత్రం. ఇందులో చిత్రమేమీ లేదు. బ్రహ్మవి ద్వరిష్ఠుడూ విరక్తచిత్తుడూ గనుకనే దారిద్ర్యాన్నే మహైశ్వర్యంగా భావిస్తున్నాడు. పండితా స్సమదర్శినః అన్నట్టు సమదర్శి అతడు. అతని సమదర్శి స్వభావాన్ని చాటటానికే ఈ విరోధా భాస.

మరి అతడైతే బ్రహ్మవేత్త గనుక అలా ఉండగలిగాడు గాని అతణ్ణి కట్టుకొన్న భార్యాపుత్త్రులకెలా ఉంటుందా నిబ్బరం. వారు దుర్భరమైన దారిద్ర్య బాధ సోర్చుకోలేక పోయారు. ఓర్చుకోలేకనే ఒకనాడాయన భార్య భర్తను చూచి ఇలా మొరపెడుతుంది. **"నను బ్రహ్మన్ భగవత స్సఖా సాక్షాచ్ఛ్రియః పతిః"** స్వామీ మీరు మహానుభావులు సాక్షాత్తూ లక్ష్మీపతి అయిన కృష్ణ భగవానుడు మీకు బాల్య స్నేహితుడు. **"బ్రహ్మణ్యశ్చ శరణ్యశ్చ భగవాన్ సాత్వతాం పతిః"** అతడు బ్రాహ్మణ ప్రియుడు. శరణాగత రక్షకుడు. కాబట్టి **"తముపైహి మహాభాగ - సాధూనాంచ పరాయణమ్"** ఆయన గారిని మీరు పోయి అడిగి చూడండి. **"దదాతి ద్రవిణమ్ భూరి - సీదతే తే కుటుంబినే."** అడిగితే ఇవ్వకపోడు. అయ్యో ఈ కుటుంబీకుడు చాలా క్రుంగిపోతున్నాడే అని అడిగిన దానికన్నా ఎక్కువే మీకు ప్రసాదిస్తాడు. చూడండి ఆ బ్రాహ్మణుడి భార్య ఎంత మహనీయురాలో. ఆయనే గాదు. ఆవిడ కూడా ఆయన స్వభావానికి తగినదే. కొందరు గయ్యాళి గంపలుంటారు. కర్కోటకులుంటారు. మొండి సన్యాసులుంటారు. మరీ పెనిమిటి దరిద్ర స్థితిలో ఉన్నాడంటే ఎంతైనా చులకన చేసి మాటాడుతారు.

తూలనాడతారు. చివరకు మెడపట్టి ఇంటి నుంచి గెంటినా గెంటుతారు. కుచేలుడి భార్య అలాంటిది కాదు. **"తస్యభార్యా కుచేలస్య పతివ్రతా"** అంటాడు కవి. పతివ్రత ఆవిడ. ఇది సార్థకమైన మాట. ఆయన ఏ వ్రతం పడితే అదే ఆవిడ వ్రతం కూడా. ఆయన యదృచ్ఛా లాభసంతుష్టుడు. జితేంద్రియుడు, విరక్తుడు. ఈవిడా అంతే. ఇది లేదది లేదని ఒక్కనాడై నా నిష్ఠుర మాడింది కాదు. అలాగైతే ఎప్పుడో వారిద్దరూ చెరి ఒక దారిపట్టి ఉండేవారు. అలాటిది కాదు గనుకనే ఇంత పేదరికమైనా భరిస్తూ పల్లెత్తు మాట అనక ఆయనను కనిపెట్టుకొని కాలక్షేపం చేస్తున్నది.

అయితే ఇప్పుడు మాత్రమేమి అలాగే ఉండరాదా అంటే ఉండవచ్చు. **"క్షుత్క్షామాచ తథా విధా పతివ్రతా"** క్షుత్ క్షామ అయినా పతిననుసరిస్తూనే వచ్చింది. కాని తన కోసమని కాకపోయినా కడుపున బుట్టిన బిడ్డలు కష్టపడుతుంటే చూడలేక పోయింది. అంతేగాక కట్టుకొన్న మగడంత మహనీయుడలాంటి దీనస్థితిలో ఉండటం కూడా భరించలేకపోయింది. కనుకనే **"దారిద్ర్యాద్దేప మానాసా మ్లాయతా వదనేనసా"** అంటాడు. ఇంటిల్లిపాదికి తారసిల్లిన దారిద్ర్యానికి ముఖం వెలవెలబోతూ అప్పటికీ ఎంతో మృదుమధురంగా అలా మాటాడింది. సుకుమారంగానే పెనిమిటిని హెచ్చరించింది. ఆ హెచ్చరించటం కూడా ఒక విధంగా ఈశ్వర సంకల్పమే కావచ్చు. లేకుంటే ఇన్నాళ్లూ పుట్టని బుద్ధి ఆవిడ కానాడే పుట్టి ఆయనకు బోధ చేయటమేమిటి. చేస్తే ఆయన బయలుదేరి పోవటమేమిటి. అప్పటికి తీరిపోయిందా జీవుని ప్రారబ్ధం. అనన్యాదృశమైన ఐశ్వర్యం ప్రాప్తించే క్షణం సమీపించింది. దాని కనుగుణంగా ఆవిడకా బుద్ధి పుట్టింది. పైగా ఆవిడకెలా తెలిసిందో ఏమో **"అస్తే ఽధునా ద్వారవత్యామ్. భోజ వృష్ణ్యంధకేశ్వరః"** ఆ మీ బాలసఖుడిప్పుడు ద్వారకలోనే ఉన్నాడు. వెంటనే వెళ్లి దర్శిస్తే సమస్తమూ మీకప్పగిస్తాడని తొందర చేస్తుంది. భర్తకు కూడా తెలియని వృత్తాంత మామెకు తెలిసి చెప్పిందంటే అది నిజంగా భగవంతుడు పుట్టించిన బుద్ధే మరేదీ కాదు. ఆయనే ఆ బుద్ధి ఆమెకు పుట్టించి ఆమె భర్తను తన దగ్గరకు స్వయంగా రప్పించుకోటానికి పన్నిన పన్నాగం.

దానికి తగినట్టే చూడండి. ఏది ప్రాప్తమైతే అదే చాలునని నిర్లిప్తంగా బ్రతికే ఆ మహనీయుడు ఆవిడ అన్నదో లేదో – సరే అలాగే వెళ్లి వస్తానని ఆమె మాట ఆమోదిస్తాడు.

ఏవమ్ సభార్యయా విప్రా – బహుశః ప్రార్థితో మృదు
అయమ్ హి పరమో లాభ – ఉత్తమ శ్లోక దర్శనమ్

అయితే మహావిరక్తుడు కాబట్టి ఆ బ్రాహ్మణుడు దాని కనుగుణంగా ఒక మాట అంటాడు. ద్రవ్యమడగటానికి కాకపోయినా అలాటి మహానుభావుణ్ణి దర్శనం చేసుకోవటమే గొప్ప లాభమట. చూచారా ఈ చమత్కారం. ద్రవ్యం కోసమని భార్య ప్రోత్సహించిందాయనను పోయి రమ్మని. న్యాయమైతే అప్పుడాయన ఉన్న దశలో ద్రవ్యలాభమే లాభంగా భావించాలి. కాని ఆయన దానినొక లాభంగా భావించటం లేదు. పై పెచ్చు భగవద్దర్శనమే లాభంగా పరిగణిస్తున్నాడు. చూడబోతే **"యంలబ్ధ్వాచాపరం లాభం – మన్యతే నాధికం తతః"** అని గీతాకారుడు వర్ణించిన స్థిత ప్రజ్ఞ లక్షణమిక్కడ మనకు దాఖలా అవుతున్నది. స్థితప్రజ్ఞుడైన మహానుభావుడిక ఏదీ లాభంగా చూడడు. ఆత్మ లాభమొక్కటే అతడు చూచే లాభం. అంతకు మించిన లాభం మరేదీ లేదు. ప్రస్తుతం కుచేలుడి స్థితి అదే. పరమాత్మ దర్శనమే లాభమతని పాలిటికి. మరేదీ గాదు. అంటే ఆయన వల్ల పొందే ధనధాన్యాదులేవీ కావని భావం.

అయితే ఇక్కడ మరొక విశేషం కూడా ఉంది మనం తెలుసుకోవలసింది. ఆ మాటకు వస్తే కృష్ణ దర్శనార్థం వెళ్లవలసిన అవసరం కూడా లేదాయనకు. బ్రహ్మవేత్తలలో కెల్లా ఉత్తముడు గదా అతడు. బ్రహ్మవేత్తకి ప్రపంచమంతా బ్రహ్మమయమే. ఆత్మమయమే. ఆత్మరూపంగా నిత్యమూ దర్శిస్తూనే ఉన్నప్పుడిక ప్రత్యేకంగా ఎప్పుడో ఒక ముహూర్తం చూచుకొని ఏ ద్వారకకోపోయి ఆయనగారిని దర్శించాలనే ప్రయత్నం దేనికి. ప్రహ్లాదుడెక్కడికి వెళ్లి దర్శించాడని. అడుగుతున్నా తాను జ్ఞాని కాబట్టి **"కలండు తండ్రి వెదకంగా నేల యీ యా యెడన్"** అని దబాయించినవాడా బాలుడు. అలాగే కుచేలుడు కూడా సర్వత్రా భగవద్దర్శనం చేస్తూనే ఉన్నాడు. అలా చేస్తున్నాడు గనుకనే దారిద్ర్య నివారణార్థమని కాకపోయినా బాల్యమిత్రుడనే దాక్షిణ్యంతో నైనా చూడకుండానే ఎన్నో ఏండ్లు పూండ్లు గడుపుతూ వచ్చాడు. ఏమి కారణం. కృష్ణుడంటే అభిమానం లేదా. లేక కాదు. కావలసినంత ఉంది. కానీ అది భగవద్విభూతే గాని స్వరూపం కాదని తెలుసునా బ్రహ్మవేత్తకు. స్వరూపమెక్కడ బడితే అక్కడే ఉంటుంది. నిరాకారంగా నిశ్చలంగా ఉందది. దానినెప్పుడూ తన కభిన్నంగా దర్శిస్తూనే ఉన్నాడాయెను. ఇక క్రొత్తగా పోయి చూడవలసిన పని ఏముంది. అందుకే పోలేదెప్పుడూ.

మరి ఇప్పుడెందుకు వెళ్లటం. భార్య చెప్పిందనా. కాదు. దారిద్ర్యం పోగొట్టుకోవాలనా. అంతకన్నా కాదు. ఉత్తమ శ్లోక దర్శనమయినా అవుతుందని. అక్కరలేదన్నారుగా బ్రహ్మవేత్తకు. నిజమే. అక్కరలేదు వాస్తవానికి. అయితే అది స్వరూపానుభవం. ఆ స్వరూపమే విభూతిగా వెలసింది ద్వారకలో. నీలమేఘ శ్యామలమైన నిత్యలీలా ప్రదర్శకమైన ఆ మూర్తి కేవలమా చైతన్య విభూతే మరేదీ గాదు. అది పరమైతే ఇది అపరం. అది అవ్యక్తమైతే ఇది వ్యక్తం. అది అచలమైతే ఇది నిత్య ప్రచలితం. అది సర్వవ్యాపకమైతే ఇది ఏకదేశ వివర్తి. **"తస్మిన్ దృష్టే పరావరే"** అన్నట్టు యోగి అయినవాడదీ ఇదీ రెండూ దర్శించాలి. దర్శిస్తూ ఇవి రెండూ తన స్వరూపమే గదా అని అనుసంధించుకోవాలి. ఇది బ్రహ్మవేత్తల జీవితంలో అతి నిగూఢంగా జరిగే ఒక ప్రౌఢమైన వ్యవహారం. అలా సాగినప్పుడే వారి బ్రహ్మానుభవానికి పరిపూర్ణత.

యదాభూత పృథగ్భావమేకస్థమను పశ్యతి
తత ఏవచ విస్తారమ్ బ్రహ్మ సంపద్యతే తదా

అని గదా శాస్త్రవచనం. దానికి తార్కాణమిప్పుడీ కుచేలుడి ప్రవృత్తి. తద్ద్వారా మోక్షసాధకుల కలాటి ఒక సందేశమివ్వాలని కూడా ముని హృదయం. అందుకే ఈ ఉత్తమ శ్లోక దర్శనం. అందుకే ఈ ప్రయాణం.

మరి ఊరక రిక్త హస్తాలతో పయనమై పోతే ఎలాగ. పెద్దలను చూడటానికి వెళ్లేటప్పుడేదైనా వారికొక ఉపాయనం తీసుకెళ్లాలని లోకంలో ఒక ఆచారముంది. అలాటి లోకాచారాన్ని పాటిస్తూ కుచేలుడు కూడా అడుగుతున్నాడు తన భార్యను. **"అప్యస్త్యుపాయనమ్ కించి ద్గృహే కల్యాణీ దీయతామ్"** మన ఇంట్లో ఆయనకు సమర్పించవలసిన వస్తువేదైనా ఉంటే చూడు. ఆయన నడగటానికి వెళ్లేవాడు తానే ఆయనకేదో సమర్పిస్తానంటాడు చూడండి. ఇది ఎంత బాగుందో ఈ మాట. కేవలం లోకధర్మం కోసమని చెప్పినా పూట గడవటం కష్టంగా ఉన్నవాడు తానేమీయగలడని. అసలయ్య వారి నట్టిల్లులాగా ఉన్న తన ఇంట్లో ఏముందని. అయినా బరవసాగా ఆ మాట అన్నాడంటే ఆ బ్రాహ్మణుడు ఏ దృష్టితో అన్నాడో ఆలోచించాలి మనం. తన దగ్గర ఉందని గాదు. చేసిందని గాదు. ఉందో లేదో తెలియదా అతనికి. బాగా తెలుసు తనకేదీ లేదని. అయినా ఇస్తానంటున్నాడు. ఆ ఇస్తానంటున్న దప్పటికేదో

ఒక పదార్థమని గాదు. పదార్థాలన్నీ భౌతికాలు. భౌతికమైన ఈ పదార్థాలా పరమాత్మ కిచ్చినా ఒకటే. లేకున్నా ఒకటే. కాకపోయినా ఆయనకు మనమిచ్చేదేమిటి. ఇదంతా ఎవరబ్బ సొమ్మని. **"ఈశావాస్య మిదమ్ సర్వ"**మని అంతా ఆ పరమాత్మ తాలూకు ఆస్తే గదా. ఇందులో మనకేమి హక్కుంది. పూచిక పుల్ల కూడా లేదు. మరిఏముంది ఇవ్వటానికని అడగటం దేనికి. ఇచ్చే పదార్థం కాదు ప్రధానం. ఇచ్చే బుద్ధి. **"తేనత్యక్తేన భుం జీథాః"** అని త్యాగబుద్ధే ఇక్కడ కావలసింది మానవుడికి. ఆ బుద్ధి ఉంటే పదార్థమేదైనా ఎంతైనా చాలు. **"పత్రమ్ పుష్పం ఫలమ్ తోయమ్ - యోమే భక్త్యాప్రయచ్ఛతి"** అని పరమాత్మే హెచ్చరిస్తున్నాడు మనలను. భక్తే ప్రధానంగాని ఇది పత్రమా పుష్పమా అని కాదు.

కుచేలు డడగటంలో ఇంకొక రహస్యం కూడా ఇమిడి ఉంది. **"సర్వ ధర్మాన్ పరిత్యజ్య"** అన్నట్టు భాగవతుడు తన సర్వస్వమూ భగవంతుడికి సమర్పించటం మొదటి కర్తవ్యం. అలా నిరవశేషంగా సమర్పణ చేసినప్పుడే అది పరిపూర్ణ వైరాగ్యమూ, సన్యాసమూ. అలాటి ముక్తసంగుడికే ఆయన ముక్తిని ప్రసాదించేది. అలా కాక ఏ కొంచెం తనది అని దగ్గరుంచుకొన్నా ఆ మహాఫలానికి నోచుకోలేడు. దానిమీదికే పోతుంటుంది మనసు. మనసు విషయ ప్రపంచం నుంచి తొలగి నిర్మలం కావాలంటే దాని వాసన కూడా పని చేయగూడదు. తను ధనమనః ప్రాణాదులలో అణుమాత్రం మిగిలి ఉన్నా - తనది అనే అభిమానమున్నా ఆ మేరకు వాడు రక్తుడే. లిప్తుడే. బద్ధుడే. ముక్తుడు కానేరడు. అది వదలినప్పుడే దాని కర్తృడు. ఇలాటి అర్హత జీవులకుండాలని నిరూపించటానికే ఈ సన్నివేశం. అంతేగాని ఈయన దగ్గర ఏదో ధన కనక వస్తు వాహనాది సామగ్రి ఉందని గాదు. ఆయనకిస్తాడని కాదు. దీని కోసమాయన కనిపెట్టుకొని కూచున్నాడనీ కాదు.

సరే. భర్త అడిగాడో లేదో ఆ భార్య తన భర్తకన్నా నాలుగాకు లెక్కువ చదివింది. ఈయన మన ఇంట్లో ఏదైనా ఉందేమో చూడమని అడిగితే ఆవిడ పొరుగింటికి వెళ్లి అప్పుతెచ్చింది. ఏమిటి. నాలుగు పిడికిళ్లు అటుకులు. **"యాచిత్వా చతురో ముష్టీన్ - విప్రాన్ పృథుక తండులాన్ భర్త్రే ప్రాదాదుపాయనమ్"** అక్కడా ఇక్కడా నాలుగు పిడికిళ్లటుకులు యాచించి తెచ్చి భర్త గారి కందిచ్చింది. ఏమిటీ న్యాయం. అప్పయినా తెచ్చి ఇవ్వకపోతే నేమీ ఇంట్లో ఉంటే చూడమన్నాడు గాని అప్పు తెచ్చి

ఇవ్వమనలేదే. మన దరిద్రస్థితి ఎల ఉందో ఇప్పటికైనా చూచి తెలుసుకోమని పతిని ఎత్తి పొడవటమా ఇది. ఛీ. పతివ్రత అయిన ఆ ఎలానగ ఇంత అవహేళన చేస్తుందా భర్తను. మరి దేనికది. లౌకికమైన ఆచారాన్ని నిలబెట్టటానికా. అదీ కాదు. ఉంటే ఆచారంగాని లేకుంటే ఏమాచారం. మరిదేనికి తెచ్చినట్టు. భౌతికంగా మాటాడితే ఇంతకాలమింత పేదరిక మనుభవిస్తున్నా ఆ ఇల్లు ఎలా గడుస్తున్నదో మన మర్ధం చేసుకోటానికి. ఇరుగుపొరుగూ ఆ దంపతుల మీద ఎంతో గౌరవంతో అదరంతో అప్పుడప్పుడు తోచిన సహాయం చేస్తుంటే ఆ మాత్రమైనా నిలబడిందా సంసారం అని తెలుసుకోవాలి మనం. ఇది ఒక సమాధానం. పోతే ఆధ్యాత్మికంగా మరొక సమాధానమేమంటే నీవు జ్ఞానివై నిష్కామంగా బ్రతకటానికి సంసిద్ధుడవయి ఉండాలే గాని నిన్నా సర్వేశ్వరుడెప్పుడూ తప్పజూడడు. **"ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశే ర్జున తిష్ఠతి"** అన్నట్టు అంతర్యామి రూపంగా సర్వుల హృదయాలలో ఉన్నాడు కాబట్టి ఆయనే ఎవరికో ఒకరికి సద్బుద్ధి పుట్టించి నీకు సహాయపడేలాగా చూస్తాడు. ఇదీ అంతరార్థమిక్కడ.

సరే బయలుదేరాడు కుచేలుడు భగవత్సందర్శనార్థం. బయలుదేరి దారిలో నడచిపోతుంటే ఆ బ్రాహ్మణుడికున్నట్టుండి ఒక సందేహం పట్టుకొన్నది.

ద్వారాకా నగరంబు నేరీతి జొత్తును - భాసురాంతఃపురవాసియైన
యప్పుండరీ కాక్షు నఖిలేశు నెబ్భంగి - దర్శింపగలను - తద్ద్వారపాలు
రెక్కడి విప్రుడ - వెందేల వచ్చెద - వని యడ్డపెట్టిరే నపుడు వారి
కేమైన బరిదానమిచ్చి చొచ్చెద నన్న - నూహింప నర్థశూన్యుండ నేను

ద్వారకా నగరమంటే అది ఒక పల్లెగాదు. పట్నంగాదు. బ్రహ్మాండమైన రాజధాని. అలాంటిదెప్పుడూ కని విని ఎరిగినవాడు కాదా బ్రాహ్మణుడు. అందులో ప్రవేశించటమే అసలు కష్టసాధ్యం. అదే కష్టమైతే ఆ పట్టణంలో ఆ పరమాత్మ ఉండే ప్రాసాదమెక్కడో అందులో అంతఃపుర మెక్కడో అతడి కేమాత్రమూ అంతుపట్టే వ్యవహారంకాదు. పోతే అసలు ద్వారం దగ్గరే అక్కడే ఉన్న ప్రతీహారు లడ్డగించి పొమ్మని బెదిరిస్తే తాను చేసేదేమీ లేదు. పోనీ వారికేమైనా కొంచెం ముట్టజెప్పి జొరబడుదామంటే గోచి పాతరాయడు తన దగ్గర ఏముందని ఇదీ అతనికి పట్టుకొన్న సంశయం.

అనుమానం పెనుభూతమన్నట్టు అన్నిటికన్నా పాపిష్ఠిదైనది సంశయం. పాపిష్ఠస్సంశయః అని భగవత్పాదులే ఒక చోట సెలవిచ్చారు. అజ్ఞానమూ, అశ్రద్ధా, సంశయమూ ఈ మూడూ సాధన మార్గంలో జీవుణ్ణి ప్రతిఘటించే దుష్టశక్తులు. మూడూ దుష్టమే అయినా మూడింటిలో **"సంశయాత్మా వినశ్యతి"** అన్నది గీత. సంశయమనేది మిగతా రెంటికన్నా పాపిష్ఠిది. అది కలగకుండానే ఉండాలి గాని కలిగితే పాడయిపోతాడు మానవుడు. ఎందుకంటే **"నాయమ్ లోకోస్తి నపరో – న సుఖమ్ సంశయాత్మనః"** ఇటు ఇహమూ లేదు. అటు పరమూ లేదు. సంశయాత్ముడికి రెంటికీ తప్పిన వాడికసలు సుఖమే లేదు. కాబట్టి ఐహికమేమిటి. ఆముష్మికమేమిటి. ఎక్కడా కూడా సంశయమనేది పనికిరాదు. అది రెంటికీ చెడ్డ రేవడి సామెతవుతుంది. ఆసించిన ఫలితం లేకపోగా అనుకోని దుష్ఫలితం వచ్చి నెత్తిన పడుతుంది.

అయితే చిత్రమేమంటే పిలిస్తే పలుకుతుందీ సంశయమనేది ప్రతివాడికీ. మోక్ష సాధన మార్గంలో పయనించే ప్రతివాడికీ ఎక్కడో ఒక భూమికలో ఇది ఎదురవుతుంది. తప్పదు. అంత దివ్యజ్ఞాన సంపత్తితో మొరపెట్టే గజేంద్రుడు కూడా మధ్యలో ఏమన్నాడు. **"కలదు కలండనెదు వాడు కలడో లేడో"** అని వాపోయాడు ఏమి కారణం. ఎంత మొఱపెట్టినా పలకలేదే అసలున్నాడా లేడా ? అని అనుమాన మేర్పడింది. అలా ఏర్పడటం కూడా సహజమే. ఎందుకంటే మోక్షమనేది మానవుడింత వరకూ చూచింది గాదు. చేసింది గాదు. అది ఎలా ఉంటుందో ఆఅనుభవం తెలీదు. అయితే ఉంది సందేహం లేదని గట్టిగా బల్లగుద్ది చెబుతున్నాయి శాస్త్రాలూ, గురువులూ. ఆ వాక్యాలు శ్రవణం చేయటమే తప్ప మనకంతకన్నా దాని అనుభవం లేదు. అది అందుకొనే మార్గం కూడా వారు చెప్పే మాటల మీది నమ్మకంతోనే పట్టుకొని ముందుకు పోతున్నాము. పోతున్నామే గాని అది మనలను గమ్యం చేర్చేటంత వరకూ పూర్తి నమ్మకం లేదు మనకు. కాబట్టి పెద్దలెంత అభయమిచ్చినా మనకు భయమే. **"అభయే సతి బిభ్యతి"** అని గౌడపాదులే గోల పెట్టారు. ఇందుకేనేమో బ్రహ్మదేవుడంతవాడు భగవన్నాభి కమలం నుంచి బయటపడ్డాడో లేదో నలువైపులా చూచి తాను తప్ప మరేదీ కనిపించకపోయే సరికేది సత్యమో అది ఎలా అర్థం చేసుకోవాలో తెలియక భయపడి పోయాడట. కనుక పరిచితమైన ప్రాపంచిక విషయాలలోనే తప్పనప్పుడిక అదృష్టపూర్వమైన మోక్షమార్గంలో సంశయ మెదురయిందంటే తప్పేముంది. అలాగే ఎదురయిందిప్పుడు కుచేలుడికి కూడా.

అయితే ఒక విశేషముంది ఇందులో మరలా. సామాన్యుడికైతే సంశయ పిశాచం పట్టుకోటం వరకే. పట్టిందంటే సామాన్యంగా వదలదది. పోతే ప్రాజ్ఞులూ, మహా భాగవతులూ, అయిన పెద్దల విషయమలా కాదు. మానవ సహజంగా ఒకవేళ అలాంటి భూతమావేశించినా, అది తాత్కాలికమే. ఎప్పటికీ పట్టి పీడించేది కాదు. మంచులాగా కప్పినట్టే కప్పి మరలా క్షణంలో ఎక్కడిక్కడ విరిసిపోగలదు. దానికి కారణం వారి కపురూపంగా ఉదయించిన జ్ఞానమే. సమస్తమూ పరమాత్మేననే సమ్యగ్ జ్ఞానమది. అలాటి జ్ఞానం ప్రారబ్ధవశాత్తూ తాత్కాలికంగా సంశయభూతాన్ని రెచ్చగొట్టినా మరలా జోకొట్టి దాన్ని నిద్ర పుచ్చగలదు. తనదారి కడ్డు లేకుండా చేసుకొని ముందుకు సాగిపోగలదు. ఇలాంటి నిశ్చయ జ్ఞానమున్నవాడు గనుక కుచేలుడు మరలా ఇలా భావన చేయసాగాడు.

"ఐన నాభాగ్యమతని దయార్ద్ర దృష్టి గాక - తలపోయగా నొండుగలదె యాతడేల నన్ను నుపేక్షించు నేటి మాటలనుచు నా ద్వారకాపుర మతడు సొచ్చి"

ఎంత పిచ్చి నాకు. ఎందుకు నాకీ సందేహం. నా అదృష్టమెలా ఉంటే అలా జరుగుతుంది. నా ప్రాప్తమూ, ఆయన అనుగ్రహమూ ఇవి రెండూ గాక మరొక ఆలోచన కాస్కారమేముంది. అనన్య దృష్టితో జీవితయాత్ర సాగించే నన్ను ఆయన ఎందుకుపేక్షిస్తాడసలు. పట్టణమెలా ప్రవేశించాలో ప్రాసాదమెలా ప్రవేశించాలో ద్వారపాలకుల కేమి చెప్పాలో అంతా ఆయనే చూచుకొంటాడు. నాకు దేనికీ చింత అనుకొంటాడు. ఏమిటర్ధం. జీవుడు చింత పెట్టుకొన్నంత వరకూ దేవుడు కాపాడబోడు. వాడే చూచుకొంటాడు పొమ్మని ఉపేక్షించి ఊరుకొంటాడు. అలా కాక అయ్యా అంతా నీదే నాదేమీ లేదని అనన్య భావనతో ఉన్నపుడే ఆయన అనుగ్రహిస్తాడు సాధకుణ్ణి.

అనన్యా శ్చింతయంతో మామ్యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్

అని గదా భగవద్వాణి. జీవుడి యోగక్షేమాల కాయనే జవాబుదారు.

ఇలా జవాబుదారీ ఆయనకే ఎప్పుడొప్పజెప్పాడో కుచేలుడిక ఆ భాగవతుడి దారి కడ్డమాక లేకుండా పోయింది. ద్వారకాపుర మెలా ప్రవేశించాలి. రాజభవనమెలా

కనుక్కోవాలని గదా అంతకుముందు సందేహించాడు. ఎలా ప్రవేశించాడో ఏమో ఆయనకే ఎఱుకలేదు. ద్వారకాపుర మతడు సొచ్చి రాజమార్గంబునం జనించని కక్ష్యాంతరంబులు గడచిచని ముందట ఎవరో చేయి పట్టి తీసుకుపోతే పోయినట్టా పట్టణం ప్రవేశించాడు. రాజమార్గంలో నడచివెళ్లాడు. రాజగృహ కక్ష్యాంతరాలన్నీ దాటగలిగాడు. ఎలా దాటగలిగాడు. ద్వారపాలకులు లేరా అక్కడ. అడ్డగించలేదా. అదే చిత్రం. అదేమీ ప్రస్తావించడు మహాకవి. పాఠకులుగా మనమే ఊహించుకోవాలి. భగవచ్ఛక్తి ఆ భాగవతుడి మనసు కెప్పుడు నిశ్చయం కలిగిందో అప్పటినుంచే పని చేస్తున్నది. అది పనిచేయటం మూలాన్నే అంత నిరాఘాటంగా లోపల ప్రవేశించ గలిగాడు. ఆ ప్రవేశించటంలో కూడా సరాసరి అంతఃపురంలోకే చొచ్చుకొని పోగలిగాడు. అంతా ఆ పుండరీకాక్షుడి కటాక్ష వీక్షణమేనని తెలుసు ఆ భాగవతోత్తముడికి.

తత్ప్రసాద దూరీకృత సకల విధంతరాయుడైన ఆ పరమ భాగవతుడు లోనికి వెళ్లాడో లేదో వెంటనే ఆయన దృష్టి మృదులమైన హంస తూలికా తల్పం మీద తానూ తనప్రియురాలు రుక్మిణీ బహువినోదములతో క్రీడించే మహిత లావణ్యుడైన ఆ మన్మథ మన్మథుడి మీదనే పోయి వాలింది. **"ఇందీవరశ్యాము వందిత సుత్రాము – కరుణాల వాలు–భాసురక పోలుడైన ఆ లీలా మానుషవేషధారి నాది నారాయణుణ్ణి"** దర్శించి దగ్గరగా రాసాగాడు. అలా వస్తూ ఉన్న ఆ భాగవతోత్తముణ్ణి చూచీ చూడటంతోనే ఎదురు వచ్చాడా పరమాత్మ. ఎలా వచ్చాడు. దళత్కంజాక్షుడై వచ్చాడట. అంతకు ముందూ కంజాక్షుడే స్వామి. మరి దళత్ అనటంలో ఏమిటి వివక్షితం. తన బాల్యసఖుణ్ణి చూచేసరికి ఒక్కసారిగా ఆశ్చర్యంతోనూ ఆనందంతోనూ రెండు కళ్లూ విప్పారాయి ఆయనకు. ఏమంత కళ్లు విప్పుకొని చూడవలసినంత విగ్రహమా అది. పేదవిప్రుడూ, అశ్రాంత దరిద్ర పీడితుడూ, కృశీభూతాంగుడూ, జీర్ణాంబరుడూ ఏమిటిలాంటి వాణ్ణి చూచేదాయన. ఇలాంటి వాళ్లనే చూస్తాడు. అకించనులైన భాగవతులే పరమాత్మ అనుగ్రహానికి పాత్రులు. అయితే ఇక్కడ అకించనుడే గాక కుచేలుడు ఘనతృష్ణాతుర చిత్తుడయి ఉన్నాడట. అందుకే హాస్యనిలయుడయినాడు కృష్ణుడికి. ఆ తృష్ణ ఒకటి ఉత్తరీయం మాదిరిపైన కప్పుకోకపోతే బాగుండును. ఖండోత్తరీయుడయి ఉండేవాడు కుచేలుడు. సరే దానిని తానే ఖండించి నెమ్మదిగా అనుగ్రహిద్దామనుకొన్నాడు. వెంటనే సంభ్రమ విలోలుడై తల్పం దిగి ఎదురుగా

వచ్చాడు. గాఢాలింగనం చేశాడు. దగ్గరి బంధువు వచ్చినట్టుగా తోడ్తెచ్చి తన శయ్యమీదనే కూచోబెట్టాడు.

ఇక చూడండి. ఆ కుచేలుడి కాయన చేసిన మర్యాదలు. రాజోపచారాలు చేశాడు. బంగారు కలశంతో కాళ్లు కడిగాడే. ఆ జలం తన శిరసుమీద చల్లుకొన్నాడే. హరిచందనం అతడి శరీరమంతటా అలదాడే బడలిక తీరేలాగా తాళవృంతంతో విసిరాడే. మణిదీపాలతో నీరాజనమిచ్చాడే. సురభి కుసుమ మాలికలు సిగలో తురిమాడే. కర్పూర తాంబూల మొసగాడే. ఆఖరు కొక మంచి పాడియావును తెప్పించి అప్పటి కప్పుడా బ్రాహ్మణుడికి దానం కూడా ఇచ్చాడు. అంతేకాదు. **"దేవీ పర్యచర ద్ధ్మేమీ- చామర వ్యజనేనవై"** తన పెనిమిటితోపాటు తానూ ఒక వీవనచేత బుచ్చుకొని ఆయనకు వీస్తూ కూచుంది సాక్షాల్లక్ష్మీ స్వరూపిణీ అయిన రుక్మిణీ. ఏమిటీ సంరంభం ఈ హడావుడి. తాను క్షత్రియుడు. ఆయన బ్రాహ్మణుడు. ఎంత స్నేహితుడైనా జాతిరీత్యా ఆయనను తాను గౌరవించి తీరాలి. పైగా ఎవడో అపరిచితుడు కాదాయన. తనతో చిన్ననాటి నుంచీ చదువుకొన్నవాడు. కలిసి ఆడుకొన్నవాడు. చాలా కాలానికి తన దగ్గరికి వచ్చాడు. అలాంటివాడి విషయంలో తానెంతైనా అభిమానం చూపాలి. అంతేకాదు. ఆయన తనకు ఇష్టసఖుడే గాక పరమ భాగవతుడూ, మహాజ్ఞాని. **"ప్రియో హిజ్ఞాని నో త్యర్థ మహం - సచ మమప్రియః"** అని తానే చాటించాడు లోకానికి. అలాంటప్పుడు తనకు జ్ఞానులపైన ఎంత అనురాగమున్నదో అక్కడ ఉన్న నలుగురికీ ప్రదర్శించాలి. ఎవరక్కడ ఉన్నవారు. తన కత్యంత ప్రీతి పాత్రమైన అంతఃపుర కాంతలు. వారందరికీ ఒక అహంభావముంది కృష్ణుడు తమవాడే తమకన్నా ఆయన కాప్తులు లేరని. మీరేమిటి మిమ్ములను మించిన మహానీయులున్నారు తెలుసుకోండి అని వ్యంగంగా వారికి చాటి చెప్పటమిది. అందుకే ముందుగా ఆయన కెదురు పోవటం దగ్గరి నుంచీ గోదానం వరకూ తానాయనకు సకలోపచారాలు చేసి తన కాంతలచేత కూడా చేయించాడు.

ఆ కాంతలు కూడా తెలియని వారు కాదాయన గారి హృదయం. పట్ట మహిషి రుక్మిణితో సహా భర్త ఆయన కన్ని పరిచర్యలు చేస్తుంటే ఆ మాత్రం గ్రహించలేరా. గ్రహించే ఇలా అనుకొంటారు తమలో తాము.

ఏమి తపంబు సేసె నొకొ యీ ధరణీ దివిజోత్తముండు తొ
ల్బామున యోగి విస్ఫుర దుపాస్యకుడై తనరారు నీజగ
త్స్వామి రమాధి నాథు నిజ తల్పమునన్ వసి యించి యున్నవా
డీ మహనీయ మూర్తికెనయే ముని పుంగవులెంత వారలున్
తన మృదు తల్పమందు వనితా మణియైన రమాలలామ పొం
దునునెడగా దలంపక యదు ప్రవరుండెదురేగి మోదముం
దనుకగ గౌగిలించి యుచిత క్రియలం బరితుష్ట జేయుచున్
వినయమునన్ భజించె ధరణీ సురుడెంతటి భాగ్యవంతుడో

బాగానే గ్రహించారా పడతులు. ముని పుంగవులెంత వారలైనా ఆయన కెనగారట. కారణం. తమ భర్త తల్పంమీద అంతవరకూ ఏ మునీశ్వరుడూ కూచోగా చూడలేదు వారు. కుచేలుడొక్కడే కూచోగలిగాడు. అలాగే ఎంతో భాగ్యవంతుడట. కారణం సాక్షాల్లక్ష్మియైన రుక్మిణే స్వయంగా వింజామర పుచ్చుకొని వీస్తున్నది. దీనిలో అంతరార్థమేమంటే అంతకు ముందాయన దరిద్రుడైనా లక్ష్మీకటాక్షం వల్ల ఇక మీదట తప్పకుండా భాగ్యవంతుడు కావటానికి సందేహం లేదు.

సరే వీరలా తమలో తాము గుసగుస లాడుతుంటే ఇక ఆ సహాధ్యాయులేమి చేస్తున్నారు.

మురసంహరుడు కుచేలుని కరము కరంబున దెమల్చి కడకన్
మనమా గురు గృహమున వర్తించిన చరితములని కొన్ని
నుడివి చతురత మఱియున్

కృష్ణుడు కుచేలుడి చేయి పట్టుకొని చిన్నప్పుడు తామిద్దరూ గురుకులంలో చదువుకొన్నప్పటి సంగతులు కొన్ని ప్రస్తావన చేస్తాడు. ఇది సహజమే ఈ వ్యవహారం. చిరకాలానికి కలుసుకొన్న మిత్రులు తమ బాల్యవిషయాల గూర్చి మాటాడుకోవటంలో ఆశ్చర్యం లేదు. కాని అందులో కూడా ఎంతో చతురత ఉందంటున్నాడు కవి. ఏమిటా చతురత. ఆ బాల్యంలో జరిగిన విషయాలెన్నో ఉన్నాయి. అందులో కొన్ని మాత్రమే ప్రస్తావించాడిప్పుడు. ఒక విషయం తరువాత ప్రస్తావన చేయబోతున్నాడు.

ఆ ప్రస్తావన చేయటంలో ఒక అభిప్రాయముంది. అది ఇప్పుడే బయటపెట్టరాదు. అది బయటపెట్టే ముందు లోక ధర్మంగా తన స్నేహితుడి యోగక్షేమాలు విచారించాలి. అలా విచారిస్తూ వచ్చి ప్రసంగవశాత్తూ ఆ విషయం బయటపెట్టి నట్లుండాలి. అప్పుడే అదిసహజంగా ఉండేది. చతురత కూడా అదే.

అలాంటి చతురతతోనే ఇలా అడుగుతున్నాడా బాల్యస్నేహితుణ్ణి.

బ్రాహ్మణోత్తమ ! వేదపాఠన లబ్ధ రక్షణ గలచారు వంశంబు వలన
పరిణయంబై నట్టి భార్య సుశీల వర్తనముల దగ భవత్సదృశయగునె
తల ప గృహక్షేత్ర ధనదార పుత్త్రాదులందు నీ చిత్తంబు చెందకుంట
తోచుచున్నది - యేను తుది లోక సంగ్రహార్థంబు కర్మాచరణంబు సేయు
గతి మనంబుల దాము మోహితులు గాక
యర్థిమై యుక్త కర్మంబు లాచరించి
ప్రకృతి సంబంధములు వాసి భవ్య నిష్ఠ
దవిలి యుందురు కొందఱుత్తములు భువిని

ఏమయ్యా ! పెండ్లి చేసుకొన్నాడు గదా. శుభలేఖ అయినా పంపలేదేమిటి నాకు. పోనీ పంపకపోతే మానె. నీకు తగిన వంశంలోనే చూసుకొన్నావా కన్యను. ఆవిడ నీ కన్నివిధాలా అనుకూలంగా వర్తించే సౌశీల్యవతియేనా. ఏమిటిలా అడగటంలో స్వారస్యం. లలిత పతివ్రతా తిలకంబని మొదటనే వర్ణించాడు కవి ఆవిడ పాతివ్రత్యాన్ని. ఇక్కడ మరలా అదే మాట కృష్ణుడి నోట పలికిస్తున్నాడు. అంత అనుకూలవతి గనుకనే అది లేదిది లేదని అల్లరి పెట్టకుండా గుట్టుగా కాపురం చేస్తూ వచ్చిందా మహాతల్లి. లేకుంటే ఏమయిపోయేవాడో ఆ కుచేలుడు. అది సర్వాంతర్యామి అయిన ఆ కృష్ణ పరమాత్మకు బాగా తెలుసు. అంతేకాదు. నీ మనసు ధనదారాదుల యందు లగ్నం కానట్టుగా నాకు తోస్తున్నదంటాడు. ఇది ముందరి కాళ్లకు బంధాలు వేసేమాట. ధనం మీద దృష్టిలేని విరక్తచిత్తుడవు గదా నీవు నా దగ్గరకు ఎందుకు వచ్చినట్టు. బహుశః దార సుతోదర పోషణార్థమంటావా. వారి విషయంలో కూడా నీవు విరక్తుడవేదా. మరి ఎందుకంటావా నీ రాక. ఎందుకో తానే భంగ్యంతరంగా బయట పెడుతున్నాడు మరలా. నా మాదిరే కొందరు తమకోసం

గాకపోయినా లోకహితం కోసమని కర్మలాచరిస్తుంటారు. అదీ ఎంతవరకో అంత వరకే. అలా ఆచరించేటపుడు కూడా వారికి మిగతా లోకుల కున్నట్టు రాగద్వేషాదులుండబోవు. చూడండి. కుచేలుడి మనస్తత్త్వమేదో బాగా పట్టేశాడు పరమాత్మ. తనలాంటి వాడేనట అతడూ. తానెలా నిర్లిప్తుడూ నిష్కాముడూ అయి కర్మ లాచరిస్తున్నాడో అతడూ అంతే. ఇలా తన స్థాయికి చేర్చి మాటాడడంటే ఎంత గొప్ప ప్రశంసా పత్రమో ఇది. ధనమున్నా లేకున్నా అప్పటికి కుచేలుడు దరిద్రుడు కాడు. తన మాదిరి సకలార్ధ సంపన్నుడే.

ఇలా అతని యోగక్షేమాలు విచారణ చేస్తూ చేస్తూ మధ్యలో తమ చిన్ననాటి గురుశుశ్రూషాదులూ, ఆ గురువు గారి మాహాత్మ్యమూ బ్రహ్మాండంగా వర్ణించి చెబుతూ "కుచేలా నీకొక ఉదంతం జ్ఞాపకమున్నదా. ఒకనాడు కట్టెలు లేవని గురుపత్ని మనల నడవికి పంపితే ఉన్నట్టుండి అక్కడ బ్రహ్మాండమైన వర్షం కురిసింది. అంతలో సూర్యుడస్తమించి గాఢాంధకారమలము కొన్నది. బయలు, గొంది – మిఱ్ఱు, పల్లం అని గుర్తు చిక్కని ఆ కటికి చీకటిలో జడివానకు తప్ప తడసి ఒండొరుల చేతులూతగా గడగడ వణుకుతూ ఒక చెట్టుక్రింద కూలబడి ఆ కాళరాత్రి గడిపాము. తెల్లవారగానే మన గురువుగారు సాందీపని మనలను వెదుకుతూ వచ్చి చూచి బిడ్డలారా మా కోసం మీరు ఎంత కష్టాల పాలయి నారురా శిష్యులు తీర్చవలసిన ఋణం తీర్చుకొన్నారు. కాబట్టి మీకిట మీద **"విస్ఫుట ధన బంధు దార బహుదార బహు పుత్ర విభూతి జయాయు రున్నతుల"** అన్నీ సమకూరు గాక అని దీవించి తరువాత మనలను మననెలవులకు పొమ్మని వీడ్కొలిపి పంపాడు. నీకిదంతా జ్ఞాపకముంది గదా అని అడుగుతాడు.

ఏమిటీ కథ ఇప్పుడు ప్రస్తావన చేయటంలో అంతరార్థం. ఎన్నో సంఘటనలు జరిగి ఉండవచ్చు బాల్యంలో. ప్రత్యేకించి ఈ సన్నివేశాన్నే ఎందుకు ప్రస్తావించినట్టు. ఇందులో ఒక గొప్ప చమత్కారముంది. సాందీపని శిష్యులిద్దరినీ దీవించి పంపాడు. ఏమని. మీకు కావలసినంత ధనమూ, బంధు పుత్ర కళత్రాదులూ, ఆయురారోగ్యాలూ, జయాభ్యుదయాలు, కలుగుతాయని గురువు గారలా ఆశీర్వదించి పంపాడంటే ఆయన మాట అమోఘం గదా. తప్పక ఫలించి తీరవలసిందే అది. ఇరువురి జీవితంలోనూ చెప్పినవన్నీ ఫలించాలి. ఒకరికి ధనకనక వాహనాదులూ మరొకరికి కేవలం

బహుపుత్ర సంతానమూ నని కాదు. అలాగే ఫలించిన నాడు కుచేలుడూ కృష్ణుడిలాగానే సకలైశ్వర్యాలతోనూ తులతూగుతుండాలి గదా. దరిద్రమెలా అనుభవిస్తున్నాడు. ప్రస్తుతం ధనార్థి అయి తన దగ్గరికెలా వచ్చాడు. వచ్చాడంటే అప్పటికి ధనహీనుడు కావటం మూలాన్నే గదా. మరి ధనహీనుడైతే గురువు గారి మాట ఖాళీ అయినట్టే గదా. ఏమిటది. ఇలా ఎందుకు జరిగింది. నాకేమీ అర్థం కావటం లేదే చెప్పమని అడిగినట్టుంది కృష్ణుడి మాట. ఆయన కర్థం కాక కాదు. బ్రహ్మజ్ఞుడైన ఆ బ్రాహ్మణుడేమి సమాధానమిస్తాడో విందామని.

మరి ఆయనకన్నా ధీరుడీ మహానుభావుడు. అంతఃపురంలో అడుగు పెట్టింది మొదలు ఈ మాట చెవిన బడేదాకా పెదవి విప్పి ఒక్క పలుకు కూడా పలకలేదా బ్రాహ్మణుడు. అన్ని వ్యవహారాలూ మౌనంగానే చూస్తున్నాడు. మౌనంగానే ఆలకిస్తున్నాడు. అలాంటి వాడిప్పుడీ మాట వినగానే పెదవి విప్పాడు. సమాధానం చెప్పసాగాడు. ఏమని.

వనజోదర ! గురు మందిర
మున - మనము వసించునాడు ముదమున గావిం
పని పనులెవ్వియు గలవే
వినుమవి యట్లుండ నిమ్ము విమల చరిత్రా

కృష్ణా గురుకులంలో విద్యాభ్యాసం చేసే రోజుల్లో మనమొకటేమిటి. ఎన్నో ఘనకార్యాలు చేశాము. అవన్నీ దేనికిప్పుడు. ఒక్కమాట చెబుతాను విను.

గురుమతి దలపగ ద్రిజగ
ద్గురు డ వనం దగిన నీకు గురుడనగా - నొం
డోరుడెవ్వ డింతయును నీ
కరయంగ విడంబనంబ యగు గాదె హరీ ...

కొంచెం లోతుకు దిగి ఆలోచిస్తే నాకుంటే ఉండవచ్చు గాని నీకు గురువెవడున్నాడు. త్రిలోకాలకూ నీవే గదా గురువు. అలాంటివాడికొక గురువంటూ ఎవడుంటాడు. సాందీపని కారు, మరొకడుకాడు నీకు గురువు. అదంతా లోకుల కళ్లు గప్పే నీ మాయ తప్ప మరేదీ గాదు సుమా అని సాభిప్రాయంగా పలికాడు.

చూచారా దొంగను పట్టటానికి దొంగే కావాలన్నారు పెద్దలు. కృష్ణుడే దొంగ అనుకొంటే అంతకన్నా దొంగ కుచేలుడు. ఆయన గురువుగా రాశీర్వదించారు గదా సకలైశ్వర్యాలూ సంభవిస్తాయని. మరి నీవు జీవితంలో దరిద్రుడవెలా వయ్యావని అడిగితే ఆ గురువనుగ్రహిస్తే ఏమవుతుందయ్యా ! త్రిజగద్గురుడవైన నీవనుగ్రహించాలి గాని. ఆ నీ అనుగ్రహం లేకనే ఇన్నాళ్లూ కష్టదారిద్ర్యమనుభవించాను. అందుకోసమే ఇప్పుడు నీ దర్శనార్థం వచ్చానని ఈయన జవాబు.

ఇది పైకి తేలకుండా ఇద్దరు మిత్రులూ నర్మగర్భంగానే ఒకరిపై ఒకరు విసురుకొనే వ్యవహారం. కనుకనే కుచేలుడు సాభిప్రాయంగా పలికితే ఆ పలికిన పలుకులు విని సమస్త భావాభిజ్ఞుండైన పుండరీకాక్షుండు మందస్మిత సుందరవద నారవిందుడయినాడట. సమస్త జీవుల భావాలూ చెప్పకుండానే తెలిసినవాడు కుచేలుడి ఈ పలుకులలోని భావం గ్రహించలేడా. గ్రహించే మందహాసం చేశాడు. ఇదుగో ఈ మందహాసమే మహామోసం. ఇది ఇంతకు ముందే ఎంతో మంది భక్తుల విషయంలో చేస్తూ వచ్చాడు. ఇప్పుడూ అదే ఒలకబోస్తున్నాడు. అంటే వీడు నా గుట్టు బయటపెట్టాడే అసాధ్యుడు ఈ కుచేలుడని దానిలోని ఆంతర్యం. అయినా అప్పుడే బయటపడగూడదు తాను. అంత సులభంగా అనుగ్రహించగూడ దాబ్రాహ్మణుణ్ణి. మరికొంత పరీక్షకు గురి చేయాలి. ఏమిటా పరీక్ష. "కుచేలా ! నీవిచ్చటికి వచ్చునప్పుడు నాయందుల భక్తింజేసి నాకు నుపాయనంబుగా నేమి పదార్థంబు దెచ్చితి వప్పదార్థంబు లేశమాత్రంబైన బదివేలుగా నంగీకరింతు" ఆ పదార్థమేదో బయటపెట్టమంటాడు.

చూడండి. ముందుగనే పసిగట్టాడా ధూర్తగోపాలుడు. ఇన్నాళ్లకు సెలవుగా ఇంత దూరం తన్ను వెతుక్కొంటూ వచ్చిన ఆ బ్రాహ్మణుడు కేవలం రిక్తహస్తాలతో రాడు. ఏదో ఒకటి తనకు కానుక పట్టుకువచ్చే ఉంటాడు. అది కూడా తట్లూ పుట్లూ కావు. లేశమాత్రమేనని కూడా తెలుసు నాయనకు. ఒకవేళ అది యత్కించిత్తనే కించతో ఆ బ్రాహ్మణుడు తన కివ్వడేమో నని ముందుగానే హామీ ఇస్తున్నాడు. దానినే నేను పదివేలుగా భావిస్తాను. బయటపెట్టమని లేశమాత్రమంటే మరలా అది ఎలాటి అమూల్యమైన పదార్థలేశమో నని అతడు సందేహించవచ్చు. అలాటి సంకోచం కూడా అతనికి కలగకుండా ఇలా అంటాడు.

దళమైన - పుష్పమైనను - ఫలమైనను - తోయమైన పాయని భక్తిం
గొలిచిన జనులర్పించిన - నెలమిన్ రుచిరాన్నముగనె యేను భజింతున్
నూటికి నూరుపాళ్లూ ఇది భగవద్గీతలోని శ్లోకాని కనువాదం
పత్రమ్ - పుష్పమ్ - ఫలమ్ - తోయమ్ - యోమే భక్త్యా ప్రయచ్ఛతి
తదహమ్ - భక్త్యుపహృతమ్ - అశ్నామి ప్రయతాత్మనః

అని దీనికి మూలం. భక్తుడు భక్తితో ఇచ్చింది ఏదైనా సరే. తానది ఎంతో ఇష్టంగా భక్షిస్తాడట.

ఏమిటిదంతా. ఇలా మాటాడటంలో ఏమిటి ఉద్దేశం. అసలు నాకేమి కానుక తెచ్చావని ఆయన నోరు దెఱచి అడగటమేమిటి. అది ఎలాంటిదైనా ఏ కొంచెమైనా చాలునని ఒడ్డుకోటమేమిటి. అది తాను తింటానని చెప్పటమేమిటి. పసిపిల్లవాడా తిండి కోసమే కారటానికి. ఏదో ఉన్న దాంతర్యం. ఏమిటది. భక్తుడు భగవంతుణ్ణి ఏదైనా కోరవచ్చు. ఎంతైనా కోరవచ్చు. ఇచ్చేవాడుంటే కోరటానికేమి కొరత. కట్టలు తెంచుకొని ప్రవహిస్తుంటాయి కోరికలు. మానవుడి కన్నీ కొరవలే కాబట్టి కోరటమూ సహజమే. భగవంతుడు సర్వాధికారి కాబట్టి ఇవ్వటానికి సమర్థుడే. కాని ఎంత సమర్థత ఉన్నా ఇవ్వడొక రాగరాగాన. ఏమి. ఎందుకని అడిగే మానవుడికది పుచ్చుకొనే అర్హత ఉందో లేదో తెలుసుకోవాలాయన. పైగా అడిగిందే తడవుగా ఇస్తూ పోతే దాని విలువ తెలియదతనికి. దుర్వినియోగం చేసినా చేయవచ్చు. అహంకరించినా అహంకరించవచ్చు. రెండూ ప్రమాదమే. ఇచ్చీ నిష్ఫలమౌతుందా కోరిక. అందుకే నీకు యోగ్యత ఉందని నిరూపించుకొనేదాకా ఉలకడు పలకడాయన.

అయితే ఏమిటా అర్హత. త్యాగబుద్ధి. **"తేన త్యక్తేన భుంజీథాః"** అని శాస్త్రం. నీకొకటి భుజించాలని ఉంటే ముందు నీ దగ్గర ఉన్నది త్యజించాలి. అవి పైకి త్యజించినట్టు కనిపించినా ఇంకా దాగి ఉంటుంది మనలో త్యజించవలసిందొకటి అదే అహంకారం. అది కూడా త్యజించాలి. **"యేన త్యజసి తత్త్యజ"** అనే భారత సుభాషతంలోని అంతరార్థమిదే. పైపై వస్తువులు త్యజించటం మమకార త్యాగానికి సూచకమైతే లోపలి దాన్ని త్యజించటం అహంకార విసర్జనానికి చిహ్నం. మొత్తంమీద మనదనుకొనేది, మనమనుకొనేది ఏముందో అదంతా చిన్నదీ పెద్దదీ అని ప్రశ్నలేదు.

నిరవశేషంగా సమర్పణ చేయాలి. ఎవరికి. పరమాత్మకు. పరమాత్మకు దేనికిసమర్పణ చేయటం ఆయన సర్వసంపన్నుడు గదా. దీని అవసరమేమిటాయనకు. మీదు మిక్కిలి జీవుడికే గదా అవసరం. అవసరమున్న జీవులకాయన ఇవ్వాలి గాని ఏ అవసరమూ లేని తాను జీవుల దగ్గర అదీ ఇదీ ఆసించటమేమిటి.

ఇక్కడే ఉందొక గొప్ప రహస్యం. **"అత్తా చరాచర గ్రహణాత్"** అని శారీరక సూత్రం. అత్త అంటే తినేవాడని అర్ధం. చరాచర సృష్టినంతా భక్షించేవాడు కాబట్టి ఆ పరమాత్మకు అత్త అని పేరు. భక్షించటమంటే తనలో పూర్తిగా లయం చేసుకోటమని అర్థం. అది ఆయనపాటి కాయన ఎప్పుడు చేసుకొనే ఉన్నాడు. చేసుకొని **"ఏక మేవా ద్వితీయ"** మన్నట్టు ఏకైకరూపంగా నిలిచి ఉన్నాడు. నిత్యముక్తుడాయన. ముక్తికోసమిక ప్రయత్నమక్కరలేదు. అక్కర ఉన్నదల్లా మనబోటి జీవులకే. మనకూ ఆ స్థితి లభించాలంటే ఒక్కటే షరతు. మనలోపలా వెలపలా పరచుకొన్నట్టు చూచే ఈ చరాచర ప్రకృతినంతా ప్రయత్న పూర్వకంగా ఆయనలో లయం చేయాలి. చేస్తే ఆయనా మనమూ అనే తేడా లేదిక. అంతా మన స్వరూపమే. అదే ముక్తీ. ఇదుగో ఇక్కడ లయం చేయటమంటున్నామే. ఇదే సమర్పణ. పత్రం పుష్పం ఫలమనే మాట మాట సామెతగా చెప్పింది. అది మనమున్న యావత్ప్రపంచానికీ ఉపలక్షణం. ఈ మొత్త విషయ జగత్తంతా నని అర్ధం. ఇదంతా ఆయనకే మనం సమర్పించాలి. అంటే ఆ మహాచైతన్యంలో ప్రవిలయం చేయాలి. అంటే ఇదంతా తదాత్మకంగానే భావించాలని అర్ధం.

అయితే మనమే సమర్పిస్తూ పోతే ఇక ఆయన మనకిచ్చేదేమిటి. ఆయన గదా మనకివ్వవలసింది. ఆయన మనకు క్రొత్తగా ఇవ్వవలసినదంటూ ఏమీ లేదు. ఇచ్చే ఉన్నాడా మాటకు వస్తే. ఆత్మరూపంగా ఎప్పుడూ ఉండనే ఉన్నాడు. మనలోపలా వెలపలా ఉన్నది వాస్తవంలో ఆత్మచైతన్యమే. అది మనకు నిత్యసిద్ధం. సిద్ధమని గుర్తించలేక దాన్ని సాధించాలని తాపత్రయపడుతున్నాము. ఎవరో మనకివ్వాలని అఙ్ఞలు చాస్తున్నాము. ఎవరూ ఇవ్వనక్కరలేదు. ఆత్మను గుర్తించకపోయేసరికదే మన పాలిటి కనాత్మగా భాసిస్తున్నది. ఈ అనాత్మ ఒకటి వేరుగా కనిపించటం మూలాన్నే మనకేవేవో కోరికలు. ఈ కోరికలు తీరాలంటే ఈ అనాత్మనంతా ఆ ఆత్మచైతన్యానికే అప్పజెబితే చాలు అంటే ఆత్మగా దర్శిస్తే చాలు. అప్పుడిదీ అదీ

అంతా ఆత్మే కాబట్టి అది మనకెప్పటి నుంచో సిద్ధమయి ఉందనే ప్రత్యభిజ్ఞ ఒక్కసారిగా ఉదయిస్తుంది. ఇందులో అనాత్మనాత్మగా దర్శించటమే మనమా పరమేశ్వరుని కర్పణ చేయటమనే మాటకర్థం. అలా చేస్తే మనతో సహా ఉన్నదంతా ఒకే ఒక ఆత్మచైతన్య మది మనకు ఎప్పుడూసిద్ధమే నన్న ప్రత్యభిజ్ఞ ఏర్పడుతుంది. కాబట్టి అదే ఆ పరమాత్మ మనకు సమస్తైశ్వర్యాలూ ప్రసాదిస్తాడనే మాటకర్థం. మనమివ్వనిదే ఆయన మనకివ్వడని లౌకికంగా చెప్పేమాట కలౌకికంగా మనం గ్రహించవలసిన అంతరార్థమిది.

ఇదే ఇప్పుడు కుచేలుని విషయంలో కూడా జరుగుతున్న వ్యవహారం. అటుకులు తెచ్చాడంటే కుచేలుడవి అటుకులు కాదు. నామరూప క్రియాత్మకమైన ఈ అనంతకోటి బ్రహ్మాండాలకూ ప్రతీకలవి. ఒక్కొక్క అటుకుగింజా ఒక్కొక్క అండం. అన్నీ కలిసి ఈ చరాచర సృష్టి కుపలక్షణం. దీని నాయన ఇవ్వకపోయినా తానే కొంగు విప్పి అందుకొని భక్షించాడా పరమాత్మ. అదే చరాచర ప్రకృతినీ తనలో లయం చేసుకొనే ఆయనగారి అత్తృత్వం. అయితే జీవుడు సమర్పిస్తే గదా ఆయన అందుకోవలసింది. స్వయంగా ఆయనే అందుకొన్నట్టు చెప్పటమేమిటి. సమర్పించినట్టే కుచేలుడు. సమర్పించటానికే గదా తెచ్చాడు. పైగా భార్య తనకు ఆలోచించి ఇచ్చింది కూడా కాదు. తన పాటికి తను భార్య నడిగి తెచ్చాడవి ఇంత దూరం. అప్పటికి మనసులో ఇవ్వాలనే సంకల్పముంది. భౌతికంగా మాత్రమే తీసి బయటపెట్టలేదు. మనసులో ఉంటే చాలు పరమాత్మకు. మన స్సంకల్పమే కదా అన్ని క్రియలకూ మూలం. సంకల్పముంటే అప్పటికది సమర్పణే. అలా మానస సమర్పణ చేశాడు గనుకనే కృష్ణ పరమాత్మ ఆయన చేతులతో తీసి ఇవ్వకపోయినా తానే అందుకొని భక్షించసాగాడు.

పైగా అందుకొని వాటిని భక్షించే ముందు తనలో తానిలా ఆలోచిస్తాడు కూడా. ఈ కుచేలుడు పాపం నా దగ్గరకు ఐశ్వర్యకాముడై వచ్చాడు. ఇంతకుముందు జన్మలో కూడా వీడు ఐశ్వర్యకాముడే. అయితే ఆ కామనవరకే నిలిచిపోయాడు. నన్ను సేవించిన పుణ్యానికి నోచలేదు. ఇప్పుడీ జన్మలో దానికి ఫలితంగా దరిద్రుడయి జన్మించాడు. అనేక జన్మల సుకృతం కొద్దీ జ్ఞానియై తనకోసం కాకపోయినా నిజకాంతా ముఖోల్లాసం కోసమని చెప్పి నావద్దకు వచ్చాడు. వీడికిప్పు డీక్షణంలోనే నేను

సమస్తైశ్వర్యాలూ ప్రసాదింతును గాక అని సంకల్పిస్తాడట. ఏమిటీ సంకల్పం. భగవత్సంకల్పమనేది అలాగే ఉంటుంది. మానవుడేది కోరితే అది ఇవ్వాలని లేదు భగవానుడికి. వాడు సృష్టికర్త అయిన తన్ను విస్మరించి కేవలం తన సృష్టినే పట్టుకోటం ఇష్టం లేదాయనకు. అలా పట్టుకొనే కొద్దీ తన తత్త్వానికి దూరమైపోతాడు వాడు. అది వాడి వినాశానికే మూలం. జీవుడు సర్వాత్మనా నశించిపోవటం తనకిష్టం కాదు గదా. ఎలాగైనా వాడి నుద్ధరించాలి తాను. అందుకే కుచేలుడైశ్వర్యకాముడైనా తన్ను భజించాలని చెప్పి వాణ్ణి నిష్ఠదరిద్రుడుగా జన్మింపజేశాడు. బహుజన్మార్జితమైన సుకృతమెలాగూ ఉంది కాబట్టి దాని బలంతో ఈ దారిద్ర్యాన్ని కూడా భరించే జ్ఞానముంది అతడికి. దానితో ఎలాగూ భజిస్తాడు తన్ను. జ్ఞానవైరాగ్యాలు రెండూ ఒకదాని కొకటి తోడయినప్పుడిక అదే ఐశ్వర్యం. అది ఇక తాను ఇవ్వనే అక్కరలేదు. అయత్న సిద్ధమిది. అయినా సృష్టిలో ఏది జరిగినా అది ఈశ్వర సంకల్పమే గదా. ఆ భావాన్ని చాటటానికే ఈ సంకల్ప మా పరమాత్మకు కలిగినట్టు వర్ణించటం.

అయిందక్కడికి. అటుకుల ముడివిప్పి ఒక గుప్పెడు భక్షించాడు. రుచిగా ఉన్నవో ఏమో. ఊరక వచ్చినవి రుచిగా ఉండటంలో ఆశ్చర్యమేముంది. బాగున్నాయని చెప్పి మరి ఒక గుప్పెడందుకో బోయాడు. ఇంకా అందుకొన్నాడో లేదో అప్పుడే కనిపెట్టింది ప్రక్కన ఉన్న కమలాలయ. వెంటనే ఆయన చేయిపట్టుకొని అయ్యా **"సొంపారగ నితనికి బహుసంపద లందింపనివియ చాలును - నిక భక్షింపగ వలవదు"** అని నివారించిందట. ఏమిటిందులో అంతరార్థం. ఆవిడ ఎందుకు నివారించటం. ఆయన ఆరగిస్తే ఈవిడ కెందుకంత ఆరాటం. ఏమీలేదు. ఆ భక్షించినందుకు గాను ఈయనగారా భక్తుడి కెక్కడ లేని ఐశ్వర్యమివ్వవలసి ఉంది. అందులో భక్తుడు లేశమాత్రమిస్తే చాలు దానికి ప్రతిగా హేమాచల తుల్యమైన ఐశ్వర్యమిస్తాడు స్వామి. ఒక్క పిడికిలికే అది ఇప్పుడు ధారాదత్తం. ఇంకా పిడికిళ్లు పిడికిళ్లు బొక్కుతూ కూచున్నాడంటే ఏదీ మిగలకుండా సమస్తమూ ఆ కుచేలుడికే సమర్పణ చేసి కూచోవాలి. చేస్తే ఏమి నష్టం అని అడగవచ్చు. రెండే నష్టాలు. ఒకటి జగత్సృష్టి స్థితి లయాల కొకరుగాక ఇద్దరు కర్తలయి కూచుంటారు. మరొకటి కుచేలుడింతవరకూ సంపద అంటే ఎలాంటిదో ఎఱగని వాడు. ఇప్పుడు క్రొత్తగా చవిచూడబోతున్నాడు. అది ఎంతవరకో అంత వరకైతే పరవాలేదుగాని అపరిమితమైతే

కష్టం. అలవిగాని సంపద ఒక్కసారిగా చూచేసరికదే జీవిత సర్వస్వమని చెప్పి అందులోనే మునిగిపోయే ప్రమాదముంది. జ్ఞానముంది గదా అది జవాబు చెప్పదా అంటే చెబుతుంది. సందేహం లేదు. కాని అది కూడా చెప్పగలిగి నంతవరకే చెబుతుంది. జీవన్ముక్తుడైనా లోకంతో వ్యవహరించాలి గదా. అలా వ్యవహరిస్తూనే ఎప్పటికప్పుడా కర్మ వాసనలు తనకంటకుండా ఆత్మజ్ఞాన బలంతో అతడు ప్రవిలాపనం చేసుకొంటూ పోతాడు. కర్మ వాసనలు మరీ ఎక్కువైతే ఆ జ్ఞానబలం కూడా సడలిపోవచ్చు. అంచేత కన్నుబోయే కాటుక ఎప్పుడూ పనికి రాదు. అందుకే ప్రస్తుతమీ కుచేలుడికి కూడా భావిజీవితంలో అలాటి దౌర్బల్య మేర్పడకుండా ఉండాలి. ఇదీ ఆవిడ భర్తను వారించటంలో ఉండే ఆంతర్యం.

సరే. అప్పటికీ స్పృహ వచ్చిందయ్యగారికి. అథవా వచ్చినట్టు నటించాడు. తినటమిక మానివేసి తన స్నేహితుడితో బ్రహ్మానందంగా ఆ రాత్రి గడిపాడు. కుచేలుడి కిదంతా ఒక అద్భుతమైన స్వప్నంలాగా ఇంద్రజాలం లాగా కనిపించింది.

"శ్వోభూతే విశ్వ భావేన స్వగుణే నాభినందితః
జగామ స్వాలయం తాత - పథ్యను వ్రజ్యనందితః"

తెల్లవారగానే కల్యకరణీయాలు తీర్చుకొని ఆ జగన్నాథుడు తన్ను కొంత దూరం వచ్చి ఆలింగనం చేసుకొన్నాడు. **"నివాసితః ప్రియాజుష్టే పర్యంకే భ్రాతరో యథా"** తోడబుట్టిన వాడిలాగా తనప్రియురాలి పర్యంకం మీద కూచోబెట్టాడు. **"మహిష్యా వీజితః శ్రాంతో వాలవ్యజన హస్తయా"** అమ్మవారే స్వయంగా వింజామర పుచ్చుకొని వీచింది నాకు. **"శుశ్రూషయా పరమయా"** పాద సంవాహనాది సపర్యలు కూడా చేసి నన్నెంతో సత్కరించాడా మహనీయుడు.

అయితే ఇంత చేసి కూడా ఆ మహానుభావుడేమిటీ వింత **"శ్రీనిధి యిట్లు నన్నుపచరించి ఘనంబుగ-విత్తమేమియు నీ్నిని తెఱంగుగానబడె"** ఇన్ని ఉపచారాలూ చేసి చివరకు వట్టి చేతులతోనే పంపాడే నన్నింటికి అని ఉన్నట్టుండి ఒక కొఱత ఏర్పడుతుంది కుచేలుడికి. నిజమే. ఎంత నిర్లిప్తుడూ నిష్కాముడైనా ఒక కొఱత ఏర్పడుతుంది కుచేలుడికి. నిజమే. ఎంత నిర్లిప్తుడూ నిష్కాముడైనా తానప్పుడు వచ్చింది ధనకాముడయి. అది శ్రీకృష్ణుడు గ్రహించని వాడు కాడు. పైగా ఆయన

తెచ్చిన అటుకులు కూడా అడిగి పుచ్చుకొని కమ్మగా భక్షించినవాడు. అందుకోసమైనా ఆయన కోరిక తీర్చి పంపవలసి ఉంది. అది అలా ఉంచి ఆ పిడికె డటుకులు తిన్నందుకే ఎంతో మనమాయనకు ఋణపడి ఉన్నామని ఇకతింటే సర్వస్వమూ ఇచ్చుకోవలసి ఉంటుందని రమాదేవి చెప్పనే చెప్పింది. ఏదీ మరి ఆయన ఇచ్చి ఉంటే ఈయన ఇంకా దరిద్రుడననే ఎందుకు భావిస్తున్నాడు. ఇంతకూ ఇచ్చాడా ఆయనకు లేదా. ఇచ్చాడు. ఇచ్చాను పొమ్మని ఇంతకుముందే చెప్పాడు పరమాత్మ. పైకి గాదు తన మనసులో పరమాత్మకా సంకల్పమెప్పుడు కలిగిందో అప్పుడే అబ్బింది కుచేలుడికా లిబ్బి. అయితే ఎందుకిలా గాబరా పడుతున్నాడు. తానింకా ఇంటికి వెళ్లలేదు. చూడలేదు. వెళ్లి చూస్తే తెలిసేది – ఆయన ఎంత ఇచ్చాడో ఏమో. దారిలోనే ఉన్నాడాయె. అందుకే గాబరా ఇచ్చాడో లేదో నని.

అయినా ఇందిరాదేవి అప్పుడే చెప్పింది గదా అటుకులు పిడికెడు భక్షించి మరలా పిడికెడందుకొనే సమయంలో ఈయన కిప్పటికే ఎంతో ఐశ్వర్యమిచ్చామని. అది కుచేలుడి సమక్షంలోనే గదా చెప్పిందావిడ. వాస్తవమే. కాని అది కుచేలుడు వినలేదు. కారణ మామె భర్త చెవిలో రహస్యంగా చెప్పిందా మాట. పరమాత్మది మనసులోని సంకల్పం కాబట్టి తెలియలేదు. అమ్మవారిది మాటయినా అది రహస్యంగా చెవిలో చెప్పింది కాబట్టి తెలియలేదు కుచేలుడికి. తెలియలేదు గనుకనే చివరకు చందమామ ఘుటిక అయిందే నా బ్రతుకు అని ఈ ఆందోళన. అయితే ఇలాటి ఆందోళన బ్రహ్మవేత్త అయిన వాడి కుండవచ్చునా. ఉండకూడదు వాస్తవానికి. ఎందుకున్నది మరి. ఉపాధి ఉన్న నేరానికని జవాబు. జీవన్ముక్తుడు విదేహముక్తుడి లాంటివాడు కాదు. వాడికింకా శరీరా ద్యుపాధులతో సంపర్కముంది. ఉన్నా తన జ్ఞానబలంతో లేనట్టు మెలగుతుంటాడు. అంతేగాని బొత్తిగా అవి లేవని గాదు. అడపా దడపా జ్ఞానానికి బలం చాలకపోతే అవి మరలా దెబ్బ తీస్తాయి. బలమెందుకు చాలదు. ప్రారబ్ధం వల్ల. జీవన్ముక్తుడికి కూడా ప్రారబ్ధమనే దున్నది గదా. అది కారణంగా బాధితమైనా ఈ నంసార వాసనలను వృత్తమవుతుంటాయి అప్పుడప్పుడూ. అవే లేని పోని అనుమానాలు గాబరాలూ తెచ్చి పెడుతుంటాయి. ప్రస్తుత మీ కుచేలుడి విషయం కూడా అంతే. ద్వారకకు బయలుదేరినప్పుడెంతగా అనుమానించాడో చూచాము గదా. అలాగే ఇప్పుడు మరలా తన విషయంలో ఆందోళన చెందుతున్నాడు. అయితే చెందినా అది తాత్కాలికమే బ్రహ్మవేత్తకు.

కనుకనే మరలా తన మనసుకిలా వెంటనే సమాధానం చెప్పుకొంటాడు కుచేలుడు. ఏమని. **"ఎన్న దరిద్రుడు సంపదంధుడై కానక తన్ను జేరడని కాక శ్రితార్తి హరుండు సత్కృపాం భోనిధి సర్వవస్తు పరిపూర్ణునిగా ననుజేయకుండునే."** వీడికి కోరినదంతా మనమిచ్చి పంపితే ఆ ఊబిలో బడి పోయి మరలా మన ఊసైనా ఎత్తుతాడో లేదో. వీణ్ణి ఇలా దరిద్రుడు గానే ఉంచటం మంచిది. అనుక్షణమూ మన స్మరణ ఏమరకుండా ఉంటాడనే సదభిప్రాయంతోనే నాకేదీ ఇచ్చి ఉండడు. అలా కాకపోతే అంత దయామయుడూ దీన జన బాంధవుడూ అయిన భగవానుడు నన్నీ పాటికి సకల సంపదలలోనూ ముంచి తేల్చకపోయాడా. ఈ మాటలలో ఉంది కుచేలుడి గొప్పతనం. స్వామి నడగటానికదే పనిగా వచ్చాడు. తన కాయన ఏమీ ఇవ్వలేదు. చేయలేదు. మీదు మిక్కిలి శుష్క వచనాలతో శూన్య హస్తాలతోనే వెనుకకు పంపాడు. అలాంటప్పుడేమో ఇవ్వలేదే అని సందేహించి కూడా అది స్వామి అపరాధం కాదు. తనదేనని చెప్పుకోటమే గొప్ప. జీవుడిలో ఉండే దౌర్బల్యం వల్లనే దేవుడనుగ్రహించలేదనే భావం మహాభాగవతులకు తప్ప మరి సామాన్యుల కెవరికీ మనసుకు రాదు. ఏమిటా జీవగత దౌర్బల్యమని అడగవచ్చు. అదే కుచేలుడిప్పుడే చెప్పాడు అంధత్వమని. సంపదలచేత అంధుడవుతాడు మానవుడు. ఏది దగ్గర చేరితే అదే సంపద. అది చేరేకొద్దీ దానిలోనే కూరుకుపోతాము. కూరుకుపోయే కొద్దీ మరేదీ కనపడదు కంటికి. దానితో అజ్ఞానానికి జ్ఞానమబ్బదు. జ్ఞానికి నిష్ఠ అబ్బదు. అన్ని అనర్ధాలకూ మూలమప్పటికి ధనమదాంధత్వం. అందుకే తెలిసో తెలియకో ఇదే మాట కుంతీదేవి కూడా అన్నది కృష్ణుడితో పూర్వం **"అకించన గోచరుడగు నిన్నున్ వినుతింపగనేర"**రని. అసలు కుంతి ఏమిటి. ఆవిడ తెలియక అంటే అన్నీ తెలిసిన పరమాత్మే అన్నాడొకచోట ఎవ్వరిని నేననుగ్రహింపదలిస్తే వారి సర్వస్వమూ ముందుగా అపహరిస్తానని. ఇందులో ఆధ్యాత్మికమైన రహస్యమేమంటే ఇది అసత్తు. అది సత్తు. అసత్తును పట్టుకొని కూచున్నంత వరకూ సత్తుకు దూరంగాక తప్పదు. అలాకాక దానికి దగ్గర పడాలంటే అసత్తును వదలుకొని గాని దాన్ని పట్టుకోటానికి లేదు. ఆ వదలటమే దారిద్ర్యమనే మాట కర్థం.

కుచేలుడీ ఉదాత్తమైన భావనతో ఎప్పుడూరు చేరాడో అప్పుడా ఊరే మారిపోయింది. ఇల్లే మారిపోయింది. భానుచంద్ర ప్రభాభాస మాన స్వర్ణ చంద్ర

కాంతోపల సౌధాలే గాదు. మానిత కూజితో ద్యానాలే గాదు కల్హార కైరవోల్లసిత కాసారాలే గాదు. దాస దాసీ జనాలే గాదు. అంతా అయోమయమై పోయిందా బాపడికి. ఎప్పుడూ కనివిని ఎఱిగింది కాదా వైభవం. ఏ పుణ్యాత్ముడి భవనమో అనుకొన్నాడు. చూడండి ఈ మాట. అప్పటికీ తనదనే భావంగాని అయితే బాగుండుననే ఆశగాని లేదాయనకు. సమదర్శి అయిన జ్ఞాని లక్షణమే అంత. అలా క్షణకాలం చూస్తూ నిలబడ్డాడో లేదో. అంతలోనే అప్సరసల వంటి కాంతలు కొందరు నృత్తగీత వాద్యాలతో ఎదురు వచ్చి సగౌరవంగా లోనికి తీసుకెళ్లారట. అప్పటికే తన పతి రాకకై వేయి కన్నులతో ఎదురు చూస్తూ వేచి ఉన్న ఆయన ధర్మపత్ని లేచి వచ్చి ఆనంద భాష్పాలతో ఆయన పాదాల కభిషేకం చేసి భావంలోనే గాఢాలింగనం చేసుకొంటుంది. అదంతా చూచి అప్పటి కర్ధం చేసుకొంటాడా మహాత్ముడిదంతా తన బాలసఖుడి లీలా విశేషమని. ఆహా ! కృష్ణుడంటే కృష్ణుడు కాదు. ఎంతటి జగన్నాటక సూత్రధారి ఆ జగన్మోహనుడు. **"ఎన్న గ్రొత్తలైన యిట్టి సంపదలు నా కబ్బు టెల్లహరి దయావలోకనమున గాదె"**

ననునా వృత్తాంతంబును-దన మనమున గనియు
నేమి దడవక నను బొమ్మని - యీ సంపద లెల్లను
నొనర గనొడ గూర్చి నన్ను నొడయని జేసెన్

కుచేలుడి ఈ స్వగతంలో ఉన్నదేమున్నా ఆ జగన్నాటక సూత్రధారి నాటక రహస్యాన్ని భేదించే పాత్రధారి ఈ కుచేలుడు. నాటక ప్రదర్శనమంతా ఇంత కాలమూ మౌనంగా చూస్తూ వచ్చాడు. ఇది ఏమిటా ఎందుకిలా చేశాడా అని అప్పుడప్పు డనుమానం తగిలినా ఎందుకైనా కావచ్చు. అంతవాడు చేసే చేతలలో ఎంతైనా ఉండవచ్చు అర్ధమని అప్పటికప్పుడు తన మనసుకు సమాధానం చెప్పుకొంటూ వచ్చాడా మహాభక్తుడు. ఆఖరుకు ఇంటికి తిరిగి వచ్చే సందర్భంలో అయో వట్టి చేతులతోనే పంపాడే నన్నని సందేహించి కూడా అదీ ఒకందుకు మేలే తమ్మాలంగా పరమాత్మ స్మరణనైనా ఏమరకుండ వచ్చుననే భావించాడు. కార్యసిద్ధినీ అసిద్ధినీ ఒకటిగానే భావించాడు. ఇలాటి పరిపూర్ణమైన సమదర్శనమే భక్తికిగాని జ్ఞానానికిగాని పరాకాష్ఠ. మరి బ్రహ్మవేత్తలలో ఉత్తముడని గదా పేర్కొంటూ వచ్చాము కుచేలుణ్ణి.

అలాంటి వేత్త అయినందు కీపాటి దృష్టి లేకుంటే ఎలాగ. ఈ దృష్టి ఎప్పుడు గట్టిపడిందో ఆయనకప్పుడే కట్టెదుట సాక్షాత్కరించింది లక్ష్మి. ఎవరా లక్ష్మి. పరమాత్మ కటాక్షమే. ఆయన విభూతే. తదీయానుగ్రహమే. **"సర్వ ధర్మాన్ పరిత్యజ్య"** అన్నప్పుడే దాని ఆవిర్భావం. అంతవరకూ తిరోభావమే. అది ఎప్పుడు భక్తుడు ప్రదర్శించాడో భగవానుడప్పుడే నిదర్శించి చూపాడు.

ఇలాటి భగవదంకితమైన బుద్ధి, జ్ఞానోపార్జితమైన సమదృష్టి ఉన్నవాడు గనుకనే అయాచితంగా తనకంత ఐశ్వర్యమా పరమేశ్వరుడు ప్రసాదించినా ఉబ్బి తబ్బిబ్బులు కాలేదా మహాభాగవతుడు. **'విషయాన్ జాయయా త్యక్ష్యన్ బుభుజే నాతి లంపటః'** మనసులో ఏ మాత్రమూ లగ్నం కాకుండానే తానూ తన పత్నీ ఆ విషయ సుఖాలన్నీ యథోచితంగా అనుభవిస్తూ వచ్చారు. **"అసక్తస్సుఖ మన్వభూ"** త్తని పూర్వం మహారాజులే అలాంటి అసిధారా వ్రతంతో బ్రతికినప్పుడు భాగవతులు బ్రతకటంలో ఆశ్చర్యమేముంది. ఈ ప్రకారంగా **"రాగాది విరహితుండును నిర్వికారుండు నునై యఖిల క్రియలయందు నవంతుని యనంత ధ్యానసుధా రసంబునం జొక్కుచు విగత బంధనుండై యపవర్గ ప్రాప్తినొందా"**డట ఆ కుచేలుడు. జీవన్ముక్తి తరువాతనే విదేహముక్తి. సమస్త భోగాలూ అనుభవిస్తున్నా నిర్వికారత్వం. అఖిలక్రియలూ ఆచరిస్తున్నా అనంత ధ్యాననిష్ఠత్వం. ఇవే జీవన్ముక్తికి నిదర్శనాలు. ఇలా జీవన్ముక్తుడై జీవిస్తూ ప్రారబ్ధావసానంలో శరీరపాతమై అపవర్గం పొందాడట. అపవర్గమంటే విదేహ కైవల్యమే. మరేదీ గాదు.

ఇదీ కుచేలుడి చరిత్ర. ప్రహ్లాదుడి చరిత్ర చూచాము. మరలా ఈ మహానుభావుడి చరిత్రా చూచాము. రెండూ నిర్గుణ భక్తికి రెండు మచ్చు తునకలు. ఒకటి అభ్యాసమనేది ఎలా ఉండాలో ప్రదర్శిస్తే వేరొకట వైరాగ్యభావమెలా ఉండాలో నిరూపిస్తుంది సాధకుడికి. అందులో ప్రహ్లాదుడు బాల్యంలోనే పరిపక్వత చెంది ఆ పరిపాకాన్నే జీవితాంతమూ నిలుపుకొన్నాడు. కుచేలుడు ప్రౌఢవయసులో పరిపాకమున్నట్టు కనిపించినా బాల్యంనుంచే దాని లక్షణాలలవరచుకొంటాడు. అలా ఉంటేనే అవి యౌవనంలో వార్ధక్యంలో అనువర్తిస్తాయి. దీనిని బట్టి ఈ రెండు కథల ద్వారా మనకు భాగవతం చాటే పరమ సత్యమేమంటే నీవు బాల్యంలో ప్రదర్శించి తరువాత మరచి పొమ్మని గాదు లేక మొదట అంతా విస్మరించి తరువాత వయసు

చెల్లే దశలో అలవరచుకొమ్మనీ గాదు. మోక్షసాధకుడైన వాడు పుట్టి తెలిసినప్పటి నుండీ మరలా గిట్టి నేల మీద పడేవరకూ పరమార్థాన్ని ఏమరకుండా నిరంతరమూ మనోవాక్కాయాలతో త్రికరణశుద్ధిగా అదే అవలోడనతో కాలం గడుపుతూ దాని అనుసంధాన బలంతోనే ఈ లౌకిక వ్యాపారాలూ నడుపుతూ చివరకదీ ఇదీ అనే తేడా లేక అంతా ఆత్మస్వరూపంగానే దర్శిస్తూ ప్రారబ్ధావసానం కోసం చూస్తూ అది తీరగానే **"స్వమహిమ్ని ప్రతిష్ఠితః"** అన్నట్టు తన స్వరూపంలోనే తాను పరినిష్ఠితుడయి ఉండటమే యావజ్జీవం చేయవలసిన కర్తవ్యమని భంగ్యంతరంగా చేసే హెచ్చరిక ఇది.



Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

14. భాగవతము - సందేశసారము

మనమింతవరకూ భాగవత మహాపురాణాన్ని గూర్చి చాలా విపులమైన సమీక్ష గావించాము. అందులో భగవతతత్వాన్ని గూర్చీ భాగవతుల జీవితాన్ని గూర్చీ కూడా చర్చించాము. భాగవతమంటే అసలు భగవంతుడి చరిత్రేగాక భగవద్భక్తుల తాలూకు చరిత్ర కూడా నని గదా పేర్కొన్నాము. ఒకటి పైనుంచి క్రిందికి చూడటమైతే మరొకటి క్రింది నుంచి పైకి చూడటం. మొదటిది భగవంతుడవతరించటం రెండవది భాగవతుడైన మానవుడు తరించటం. ఆమాటకు వస్తే భగవంతు డవతరించాడని చెప్పడం కూడా ఒక కల్పనే. జీవుడు సాధనచేసి తరించాడని చెప్పటం వరకే సత్యం. దానికి దైవానుగ్రహం కూడా తోడు పడాలి కాబట్టి దానికొక ఆలంబనంగా భావించి చెప్పిందే భగవదవతారాలనేవి. అప్పటికొక విధంగా చూస్తే భగవచ్చరిత్ర కూడా కాదిది వాస్తవానికి. అంతా భాగవతులైన భక్తుల చరిత్రే. చిత్ర విచిత్రమైన మార్గాలలో నడచిన వారి జీవిత చరిత్రల సంపుటీకరణమే ఈ పురాణమంతా.

అయితే ఎన్ని విభిన్న మార్గాలలో ఎవరు తమ సాధన కొనసాగించినా చివరకు చేరిన గమ్యం మాత్రమొక్కటే. దానినే పరమ సత్యమని పేర్కొన్నది భాగవతం. అంతేకాదు.

వదంతి తత్తత్వ విదః - తత్త్వమ్ యద్ జ్ఞాన మవ్యయమ్
బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి చోచ్యతే

అదే తత్వం - అదే జ్ఞానం, అదే పరమాత్మ, అదే బ్రహ్మం, అదే భగవంతుడని కూడా అనేక సంజ్ఞలతో నిర్దేశిస్తున్నది. ఇలాంటి సర్వాత్మభావానికే మోక్షమని కూడా పేరు. పరమాత్మకూ మోక్షానికీ తేడా లేదు వేదాంతంలో. **"బ్రహ్మ భావశ్చ మోక్షః"** అని భాష్యకారుల నిర్వచనం. ఇదే మానవ జీవిత పరమార్థం. ఏకైక గమ్యం. ఈ గమ్యాని కభిముఖంగా సాగించవలసిందే ఎవరు సాగించినా తమ పయనం.

ఇదుగో ఈ సాగించే పయనమూ లేదా సాధన మార్గానికే ధర్మమని పేరు పెట్టింది భాగవతం. గమ్యం సత్యమైతే దానికి గమనమైన ఈ సాధన ధర్మం.

అయితే అది పరమ సత్యమయినట్టే ఇది పరమ ధర్మం. దీనికే భాగవత ధర్మమని మరొకపేరు. ఇది మామూలుగా మనమనుకొనే మిగతా శాస్త్రాలు చెప్పే ధర్మం లాంటిది గాదు. ఆ ధర్మానికున్నట్టు దీనికి విధి నిషేధాలుగాని నియమ నిబంధనలు గాని లేవు. దీనికున్న నియమమల్లా ఒక్కటే. అది పరమాత్మ దృష్టి. దీనికున్న నిషేధమల్లా ఒక్కటే. అది తదితరమైన దృష్టి వదలుకోటం. అలా వదలుకొంటూ పోతే ఆ సాధకుడి జీవితమంతా ఇక పరమాత్మైక పరాయణమే అయిపోతుంది.

అయితే అయిపోవటం వరకూ విప్రత్తి పత్తి లేదు గాని ఆ అయిపోవటంలో ద్రుతవిలంబ గతిభేదమనేది మాత్రముంటుంది. ఒకటి వెంటనే పరిపక్వమై భగవత్సాయుజ్యాన్ని ప్రసాదిస్తే మరొకటి అలాటి పరిపాకానికి రావటానికి కొంత కాలం పడుతుంది. అందుకు కారణం సాధకుల ప్రవృత్తిలో ఉన్న తారతమ్యమే. **"యే యథామాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్"** అని గదా భగవానుడి హెచ్చరిక. ఎవరే దృష్టితో సమీపిస్తే వారిని దాని కనుగుణంగానే అనుగ్రహిస్తాడాయన. తత్త్వమనేది ఒకటేనని గదా చెప్పారు. మరి ఈ తారతమ్యమెందు కేర్పడినట్టు. ఇది తత్త్వంలో ఏర్పడింది కాదు. తత్త్వాన్ని దర్శించే సాధకుల దృష్టిలో ఏర్పడింది. ఒకరు సగుణంగా చూస్తే మరొకరు దాన్ని నిర్గుణంగా దర్శిస్తారు. ఎందుకంటే తత్త్వమెప్పుడూ నిర్గుణం నిరుపాధికం. ఒక్కసారి అలా నిరుపాధికంగా దర్శించలేని భక్తులు దానికి నామరూపాది గుణాలు ఆరోపించి దర్శిస్తారు. అది పరిష్ణుమైన తత్త్వస్వరూపం కాదు. తత్త్వవిభూతి అది. ఇలాటి విభూతులే భగవదవతారాలు. సగుణ భక్తుల ననుగ్రహించటానికే అవి లోకంలో ఆవిర్భవించాయి. వారి భక్తి కడ్డు తగిలే దుష్టశక్తులను శిక్షించటమూ వారి సాధాన మార్గాన్ని రక్షించటమూ ఇవి రెండూ వాటి ఉద్యోగం.

ఈ సగుణ మార్గంలోని అవాంతర భేదాలే కర్మ, సమాధి, భక్తి శాఖలు మూడూ. ఈ మూడింటిలోనూ తామారాధించే భగవత్తత్త్వం వేరూ తాము వేరూ ననే కించిద్భేద దృష్టి వెంటాడుతుంటుంది భాగవతులను. అలాటివారే అంబరీషాదుల దగ్గరినుంచీ జడభరతాదుల దగ్గరి నుంచీ ఉద్ధవాదుల వరకూ ఉన్న భక్త కోటి అంతా. అయితే వీరు మొదట మొదట ఇలా భేదదృష్టితో జీవితం సాగించినా జీవితాంతంలో క్రమంగా భేదదృష్టి వదలుకొని అభేద దృష్టి నలవరచుకొని భగవదైక్యం పొందగలిగారు.

కనుకనే ఇది విలంబగతి అని చెప్పటం. పోతే నిర్గుణోపాసకులకు ఇలాటి విలంబం లేదు. వారిది ద్రుత గతి. పట్టుకోటం పట్టుకోటమే నిర్గుణంగా నిరుపాధికంగా పట్టుకొన్నారు పరమాత్మ తత్త్వాన్ని. పరమాత్మకే మాత్రమూ నామరూపాదులారోపించి చూచే ప్రసక్తి లేదు వారికి. ఇలాటి భాగవతుల కోటిలో చేరినవారు ప్రహ్లాద కుచేలురు. అసలు భాగవత ధర్మప్రచారకులైన శుకనారదులే ఇలాటివారు. వీరందరూ జ్ఞాన నిష్ఠాపరులూ, అనన్యభక్తులూ, నిర్గుణోపాసకులూ వీరి దృష్టిలో జగత్తు లేదు. జీవులు లేరు. ఈశ్వరుడూ లేడు. త్రిపుటి అనేది కరగిపోయి సంపుటీ కృతమై అంతా వారికాత్మ స్వరూపంగానే అనుభవానికి వస్తుంటుంది. అలాంటివారు గనుకనే వారివలె గాక వీరు సాక్షాత్తుగానే మోక్షసామ్రాజ్యాన్ని చూరగొంటారు.

అయితే ద్రుతమైనా విలంబమైనా మొత్తం మీద భాగవతులందరూ ఎప్పటికైనా ఎవరైనా జీవజగదీశ్వరులనే భేద దృష్టి పరిత్యజించి సర్వమూ ఆత్మ స్వరూపమే నని భావించినప్పుడే ముక్తులు కాగలిగారు. అలాగే వర్ణిస్తూ వచ్చింది ప్రతి భక్తుడి చరిత్రనూ భాగవతం. అసలలా అయినప్పుడే అది జీవిత గమ్యమైన పరమసత్యాన్ని చేరుస్తుంది. లేకుంటే అది భాగవతధర్మమే గాదు. అది చేర్చేది భాగవత సత్యమే గాదు. తదాభాస మాత్రమే. అలాటి ఆభాస కోసమే అయితే అసలీ పురాణం లోకంలో అవతరించనే అక్కరలేదు. శాపగ్రస్తుడైన పరీక్షిత్తు కోరింది ఏడు రోజులలో తనకు మోక్షం లభించే మార్గం. అది ఏ మహర్షీ చెప్పలేకపోతే అది చెప్పటానికి వచ్చినవాడు శుకమహర్షి. అతడు బ్రహ్మరాతుడు. బ్రహ్మరాతుడు గనుకనే అది బోధించడాని కర్హుడాయన ఒక్కడే. పోతే ఆ బోధ నందుకోటాని కర్హత ఉన్నవాడెవడు. విష్ణురాతుడైన పరీక్షిత్తు. పరీక్షించే స్వభావముంది. అయితే అది సగుణమైన విష్ణుతత్త్వం వరకే పరిమితమైఉంది అంచేత సగుణ దృష్టి నిర్గుణంగా పరిణమిస్తే గాని ముక్తిలేదు. అంచేత సగుణ దృష్టిని నిర్గుణ దృష్టిలోకి క్రమంగా మార్చటానికి చేసి ప్రయత్నమే ఈ భాగవత కథా కథనమంతా. ప్రపంచ సృష్ట్యాదికం దగ్గరనుంచీ అవతార కథల దగ్గరి నుంచీ ఆయా సగుణ నిర్గుణ భక్తుల జీవిత చరిత్రల దగ్గరినుంచీ, ఏ కరువు పెడుతూ రావటం అందుకే. అంతా ఏ కరువు పెట్టి చివరకు ఒక్కమాటలో తేల్చివేశాడు శుకుడు. **"అహమేవ పరమ్ బ్రహ్మ - బ్రహ్మాహమ్ పరమం మతమ్"** నేనే జీవ జగదభిన్నమైన ఆ ఈశ్వర తత్త్వాన్ని. ఆ ఈశ్వరుడు మరలా ఏదో గాదు. ఎక్కడో

లేదు. నేనే. అదీ సకల మంత్రాలకూ సారభూతమైన మూల మంత్రం. **"ఏవమ్ సమీక్ష న్నాత్మాన మాత్మన్యాధాయ నిష్కలే"** అలా నిరంతరమూ తనలో తాను సాధకుడు పరామర్శించుకొంటూ ఎక్కడి కక్కడ ఈ విషయ జగత్తునంతా తన స్వరూపంలో ప్రవిలాపనం చేసుకోవాలి. అలా చేసుకోగలిగితే అప్పుడిక తక్షకుడు లేడు. కాటు వేయటమూ లేదు. చావటమూ లేదు.

ఇది ఒక పరీక్షిత్తుకే గాదు. మనకు కూడా చెప్పిన మాట. పరీక్షిత్తనేది ఒక నెపం. పరీక్షించే స్వభావమున్న మధ్యమాధికారులంతా పరీక్షిత్తులే. మరీ మందులమూ, అంతిమందులమూ కాము కాబట్టి అంతో ఇంతో మన కాస్తిక్య బుద్ధి అనేది ఏర్పడింది జీవితంలో. అందుకే మనం నాస్తికులమూ హేతువాదులమూ గాక ఆ ఊబిలో పడకుండా తప్పించుకొని విష్ణురాతుల మనిపించుకొన్నాము. అంటే ఎక్కడో ఉన్నదొక భగవత్తత్త్వం, అది ఈ సృష్టికంతా ఆధారభూతం, దానివల్లనే సమస్తమూ నడుస్తున్నది, మనమూ మన జీవితాలూ ఆ ఇరుసుమీద తిరిగే చక్రాలేనని నమ్ముతున్నాము. అయితే ఇదే పరమార్థం కాదు. ఇంతకన్నా పై స్థాయి అయిన అభేద దృష్టి నలవరచుకోవాలి మనం. అలవరచుకోవాలంటే ఏ శుకమహర్షి లాంటి ఆచార్య పురుషుడో దొరకాలి. అతడుపదేశించే ఏ భాగవత పురాణంలాంటిదో శ్రవణం చేయాలి. అది క్రమంగా మననమై ధ్యానమై అనన్యమైన దృష్టి నిస్తే ఇప్పుడు చెప్పిన మూలమంత్రం ఒంటబట్టి మనకూ లేడు తక్షకుడు. అతడు కాటు వేయటమూ లేదు. మరణించటమూ లేదు. తక్షకుడంటే ఎవడు. కాలమే గదా తక్షకుడని చెప్పాము. కాలమే మనలను కాటువేసే దెప్పటికైనా దానివల్లనే మనకెప్పటికైనా మరణం. మరి కాలమంటే ఏమిటి. మార్పు. ఒక దశ మారిపోయి మరొక దశ రావటమే గదా కాలం. ఒకే బ్రహ్మాకార వృత్తిలో పాదుకొని పోయిన సాధకుడి దృష్టి కిక మారేదేముంది. అప్పుడు మరణమనే మాట కర్థమే లేదు. అదే అమృతత్వ రూపమైన మోక్షం. అదే జీవిత పరమార్థం. భాగవత సత్యం. దాన్ని చేర్చేదే భాగవత ధర్మం.

ఈ ధర్మాన్ని అవలంబించి ఆ సత్యాన్ని చేరండని మనకు బోధించటానికే భాగవతమవతరించింది. ఇవి రెండు చాటి చెప్పటమే అది మనకిచ్చే సందేశం. అందుకోస మల్లిన అల్లికలే ఆయా కథలన్నీ. అవన్నీ పన్నెండు స్కంధాల్లోనూ మర్రి ఊడలలాగా దిగి వేళ్లు పాతుకొని ఉన్నాయి. కథలన్నీ యథార్థంగానే జరిగాయని

భావించ నక్కరలేదు మనం. **"విభూతి రేషా నతు పారమార్థ్య"**మని భాగవతకారుడే చెబుతున్నాడు. ఇదంతా కవి వాగ్విలాసమే. యథార్థంకాదు. మరి యథార్థమేమి టంటారు. **"విజ్ఞాన వైరాగ్య వివక్షయా"** అంటాడు. విజ్ఞాన వైరాగ్యాలు మనకు నేర్పటానికే ఈ కథలు. విజ్ఞానమేమిటి. వైరాగ్యమేమిటి. జీవిత గమ్యమైన ఆ సత్యాన్ని తెలుసుకోవటమే విజ్ఞానం. పోతే దానికి వ్యతిరిక్తమైన సమస్త ప్రపంచాన్నీ అసత్కల్పమని భావించటమే వైరాగ్యం. నిజానికి కనిపించే అండ పిండాత్మకమైన సృష్టి అంతా దానిపాటికది అసత్తే. ఆత్మచైతన్య దృష్ట్యా చూస్తేనే అది సత్తు. అప్పుడది భగవద్విభూతిగా దర్శించటమే నిజమైన వైరాగ్యం. అలా దర్శించే కొద్దీ స్వరూప విభూతులు రెండూ ఒకే ఒక ఆత్మ చైతన్యమనే నాణానికి బొమ్మ బొరుసులుగా అనుభవానికి వస్తాయి. ఇలాంటి లోకోత్తరమైన అనుభవమే మానవులుగా మనం ఆర్జించవలసిన విజ్ఞాన ధనం.

ఇదే మనకు పరీక్షిచ్ఛుక ప్రశ్నోత్తర వ్యాజంతో భాగవత పురాణం చాటి చెబుతున్నది. పరీక్షిత్తు మొదటనే అడుగుతాడు శుకమహర్షిని.

పురుష స్యేహ యత్కార్యమ్ – మ్రియ మాణస్య సర్వదా
యచ్ఛ్రోతవ్య మథో జప్యం – యత్కర్తవ్యమ్ నృభిః ప్రభో
స్మర్తవ్యం భజనీయం వా – బ్రూహి యద్వా విపర్యయమ్

మహాత్మా మర్త్యుడై పుట్టిన ప్రతి ఒక్కడూ ఎప్పుడో ఒకప్పుడు మరణించక తప్పదు. అలాంటప్పుడీ బ్రతికిన నాలుగు రోజులే మానవుడి కవకాశం. ఇందులో మనం చేయవలసిన కార్యమేమిటంటారు. ఏమి చేయాలి మనం. ఏదైనా జపించాలా, తపించాలా, స్మరించాలా, భజించాలా. ఇవన్నీ కాక ఇంకేదైనా ఉందా. ఏది చేస్తే మన ఈ జీవిత సమస్యకు పరిష్కారమో సెలవీయండి స్వామీ అని ప్రాధేయపడతాడు. దానికా మహర్షి ఇచ్చిన సమాధానం చూడండి ఎలాంటిదో.

వరీయా నేషతే ప్రశ్నః కృతో లోక హితో నృప
ఆత్మవిత్సమ్మతాం పుంసాం – శ్రోతవ్యాదిషు యః పరః

రాజా ! నీవు నన్ను వేసిన ప్రశ్న చాలా గొప్ప ప్రశ్న. ఆత్మవేత్తలందరూ అభినందించే ప్రశ్న ఇది. లోకులందరి హితం కోరి అడిగావు నన్ను. **"శ్రోతవ్యా**

దీని రాజేంద్ర నృణాం సంతి సహస్రశః" లోకంలో మానవులు విని తెలుసుకోదగిన విషయాలు సవాలక్ష ఉన్నాయి. అయితే అవన్నీ ఎందుకూ పనికిరాని ఊకదంపుడు ప్రసంగాలు. అవి తెలిసినా ఒకటే తెలియకున్నా ఒకటే. ఎందుకంటే విలువైన కాలమెలాగూ గడచిపోతున్నది.

నిద్రయా హ్రియతే నక్తమ్ - వ్యవాయేన నవం వయః
దివాచార్థే హయా రాజన్ - కుటుంబ భరణేన చ

రాత్రులంతా నిద్రోతోనూ మైథునాది క్రియలతోనూ గడచిపోతున్నది. పగలంతా సంపాదనతోనూ కుటుంబపోషణతోనూ గడుస్తున్నది ప్రాణులకు. పోతే ఇక **"దేహా పత్య కళత్రాది ష్వాత్మ సైన్యేష్వ సత్స్వపి"** శరీర పుత్ర కళత్రాదులనేవి ఆత్మకావు. ఆత్మకు చెందిన పరివారమిది. ఇది వాస్తవంలో లేనిది. లేని సరుకే ఉన్నట్టు కనిపిస్తుంటే **"తేషాం ప్రమత్తో - నిధనం పశ్యన్నపి న పశ్యతి"** వాటి ఉచ్చులలో చిక్కి అవి తన కళ్ల ఎదుట రూపు మాసిపోవటం చూస్తూ కూడా తెలుసుకో లేకున్నాడు మానవుడు.

అంచేత నేను చెప్పేదేమంటే

తస్మాద్భారత సర్వాత్మా - భగవాన్ హరి రీశ్వరః
శ్రోతవ్యః కీర్తి తవ్యశ్చ స్మర్తవ్యశ్చేచ్ఛతా ఽభవమ్

సర్వాత్మరూపుడైన భగవానుడొక్కడే మనం వినదగిన కనదగిన తెలియదగిన విషయం. అసలిది అనుభవానికి తెచ్చుకొని తరించటానికే **"జన్మ లాభః పరః పుంసా మంతే నారాయణ స్మృతిః"** మానవజన్మ లభించింది మనకు. మానవ జన్మ లభించి నందుకు పరతత్వాన్వేషణమే ప్రయోజనం. అంతేగాని కేవల మాహారాదులతో ప్రొద్దు పుచ్చటానికి కాదీ జన్మ. అంత మాత్రమే అయితే మానవ జన్మే దేనికి.

తరవః కిమ్ నజీవంతి - భస్త్రాః కిమ్ న శ్వసంత్యుత
నఖాదంతి నమేహంతి - కిం గ్రామ్యాః పశవో ఽపరే

చెట్లు చేమలు మాత్రం జీవించటం లేదా. ప్రాణం లేని కొలిమి తిత్తులు గాలి పీల్చి వదలటం లేదా - మరి మనచుట్టూ తిరిగే పశువులూ పక్షులూ తినటం లేదా విసర్జించటం లేదా. అంత మాత్రమే అయితే మన గొప్పేమిటి. మన విశిష్టత

ఏమిటి. **"శ్వవిడ్వరా హోష్ట్ర ఖరైః సంస్తుతః పురుషః పశుః"** ఖర వరాహ సూకరాదులతో సమానుడే అవుతాడు మానవుడు. అలా కాక మానవుడు మానవుడనిపించుకోవాలంటే మాత్రం **"సవై పుంసాం పరో ధర్మో – యతో భక్తి రధోక్షజే"** పరమాత్మ విషయికమైన భక్తి ఒక్కటే అనుసరించవలసిన పరమధర్మం.

ఇదీ పరీక్షిత్తుకు శుకుడు బోధించిన విషయం. పరీక్షరత్తనేది ఒక నెపమని చెప్పాము. పరీక్షాశీలుడైన మానవుడు ప్రతివాడికీ చెప్పవలసిన మాట ఇదే. అతడు చేయవలసిందీ ఇదే. మనం చేయవలసినవెన్నో ఉన్నాయి. తెలుసుకోవలసినవెన్నో ఉన్నాయి. అన్నిటినీ కలిపినాలుగే నాలుగు వర్గాలుగా విభజించారు మన ప్రాచీనులు. అవే ధర్మార్థ కామ మోక్షాలు. ఇందులో మధ్యలో ఉన్న అర్థకామాలు రెండూ మనకా జన్మసిద్ధమే. వాటికోసం ప్రయత్నమక్కరలేదు. పశుపక్ష్యాదులకూ మనకు సమానమే అవి. అంచేత వాటిని పాటించినంత మాత్రాన మనం మానవులమనిపించుకోలేము. పోతే ధర్మబద్ధంగా అవి సేవించినపుడే మానవుడికి విశిష్టత. ధర్మమనేది అర్థకామాలను నియమించి మానవుణ్ణి అనర్థం నుంచి కాపాడుతుంది. అనులోమంగా అభ్యుదయాన్ని ప్రసాదిస్తుంది. అయితే అదీ సాపేక్షమే. జనన మరణాద్యనర్థాల నుంచి మాత్రం మనలను రక్షించలేదది. అంచేత దాన్ని కూడా మించిన పరమధర్మమేదో దాన్ని ఆశ్రయించాలి మానవుడు. అదే మోక్షమనే నాలుగవది. ఇది చరమమైన పురుషార్థం. పరమమైన ధర్మం. భాగవత ధర్మమనేది ఇదే. దీనిలో జీవజగదీశ్వరులనే భేదవార్త లేదు. అంతా కలిసి ఆత్మస్వరూపంగా ఏకమై భాసిస్తూ అది అపరోక్షంగానే మానవుడి అనుభవానికి వస్తుంది. ఈ అనుభవమే విజ్ఞానం. దీనికి విజాతీయమైన విషయ ప్రపంచమేదీ లేదు కాబట్టి ఇదే వైరాగ్యం. ఇలాటి విజ్ఞానవైరాగ్య వివక్ష కోసమే భాగవత పురాణమవతరించింది. తత్తత్కథా వ్యాజంతో లోకానికీ మహోన్నతమైన సందేశాన్నే అందజేస్తున్నది.

ఈ సందేశాన్ని అందజేయటంతో పురాణ కర్తవ్యం తీరిపోయినా దీన్ని అందుకొని పాలించనంత వరకూ మానవుడి కర్తవ్యం తీరదు. "ధర్మం చర" అని గదా వేదానుశాసనం. ఆచరిస్తేనే అది ధర్మం. ఆచరణ వదిలేసి ఊరక దానిని గూర్చి మాటలు చెబితే అది ధర్మం కాదు. అది మనకు ఫలితమివ్వదు. మామూలు వైదిక ధర్మమే ఇవ్వకపోతే ఇక అన్నిటికన్నా పరమమైన భాగవత ధర్మమిస్తుందా.

అసలు ఇవ్వదు. ఏమిటది ఇచ్చే ఫలితం మనకు. సుఖమూ శాంతీ. సుఖమనేది సర్వమూ ఆత్మస్వరూపమే ననే విజ్ఞానంవల్ల కలిగితే తద్భిన్నమైన దేదీ సృష్టిలో లేదంతా దాని విభూతేననే వైరాగ్యభావన వల్ల శాంతి చేకూరుతుంది. ఇవే నిజమైన సుఖశాంతులు. మనం లౌకికంగా అనుకొనే ఆశించే సుఖశాంతులన్నీ దీని ఆభాసలే. అవి వాస్తవంలో సుఖమూ గాదు. శాంతీ గాదు. ఇది మనకనుభవ సిద్ధమే. పోతే ఎప్పటికీ మార్పు లేని మాసిపోని సుఖశాంతులీ భాగవత ధర్మమూలకాలే.

అయితే ఎటువచ్చీవీటికి నోచుకొని ఉండాలి మానవుడు. ధర్మం పాటిస్తేనే అలా నోచుకోగలం. లేకుంటే సుఖశాంతులను పడయకపోగా వాటికి విరుద్ధమైన ఫలితాలకు గురి కావలసి వస్తుంది. ఏమిటా విరుద్ధ ఫలాలు. సుఖానికి అసుఖమూ, శాంతికి అశాంతీ. ఇవి రెండూ రెండు దయ్యాల మాదిరి ఎప్పుడూ పొంచి ఉంటాయి మనమీద లంఘించటానికి. మనలను కబళించటానికి. వీటి ధాటికి చోటివ్వకుండా మనుగడ సాగించేవాడే భాగవతోత్తముడు. అలాటి భాగవతోత్తములైన మానవుల కాలమే కృతయుగం. నిరంతరమూ సర్వాత్మ భావరూపమైన సత్యాన్నే దర్శిస్తున్న మానవులు వారు. కనుకనే దానికిసత్యయుగమని పేరు. అది తప్ప వారికి జీవితంలో చేయవలసింది కూడ ఏదీలేదు. అంతా దానిలోనేకలిసి వస్తుంది వారికి అందుచేతనే దాని కసలు కృతమని కూడా పేరు వచ్చింది. నిత్యమూ సత్యదర్శనం చేత సంపూర్ణ సుఖశాంతులను మానవుడు చూరగొనే కాలమే కృతయుగం.

పోతే సత్య తపోదయాదానాలనే నాలుగు ధర్మపాదాలలో సత్యమనే పాదానికి ముప్పు సంభవిస్తే అది త్రేతాయుగం. త్రేతా అంటేనే అసలు మూడని శబ్దార్థం. త్రేతాగ్నులనే మాటలో తెలుస్తుంది మనకు. సత్యం తప్ప మిగతా మూడూ ఉంటాయి ఇందులో. సత్యమప్రయత్నంగా దర్శనమిస్తే కృతంలో ఈ త్రేతలో అది ప్రయత్న సాధ్యమవుతున్నది. ఆ ప్రయత్నమే తపస్సు తపస్సంటే ఏకాగ్రమైన బుద్ధితో చేసే అతితీవ్రమైన ఆలోచన. తద్వారా గాని సత్యాన్ని దర్శించలేకపోయాడు మానవుడు. అలాటి మానవుల కాలమే త్రేతాయుగం.

పోతే ఈ సత్య తపస్సులు కూడా కుంటుపడి కేవలం దయా దానాలనే రెండు పాదాలతోనే నడుస్తూ పోతే అది ద్వాపరం. ద్వా అంటే రెండు. రెండే పరం అంటే పరాయణం దీనికి. అంచేత ద్వాపరమయిందిది. అంతేకాదు. రెండనే సరికి

ద్వంద్వాలవి. మంచీ చెడ్డా, పుణ్యం పాపం, సుఖం దుఃఖం, నిత్యమనిత్యమనే ద్వంద్వాలలో ఏది ఉపాదేయమేది హేయమనే వివేచన దుష్కరమయింది మానవులకు. కారణం సత్యమూ తపస్సూ రెండూ లోపించటమే. రెండూ లోపించే సరికి స్వయంగా దర్శించలేడు. ఆలోచన చేసి తెలుసుకోలేడు. ఇక ఎలాగ. దానమూ దయా ఇవి రెండే శరణ్యం. ఇందులో దానమనేది ప్రధానమయిందీ ద్వాపరానికి. ఎవరికో ఒకరికేదైనా తమకున్నది దానం చేసి సంపాదించాలి విద్యా వినయ వివేకాదులు. అది భక్తిగాని శుశ్రూషగాని వస్తు వాహనాది వితరణగాని ఏదైనా కావచ్చు. త్యాగబుద్ధి ప్రధానం. దానివల్ల లోటు భర్తీ చేసుకోలసి ఉంది మానవుడు. ఇది ద్వాపరయుగ లక్షణం.

పోతే అంతకన్నా దిగజారిపోయింది ఈ కలియుగం. ఇందులో ఒకటిగాదు, రెండుగాదు, మూడు పాదాలు లోపించాయి.సత్యం లేదు, తపస్సు లేదు, దానం లేదు. అంటే మానవుడికి స్వతహాగా స్ఫురించదు ఆలోచించి తెలుసుకోలేడు. ఒకరికి శుశ్రూష చేసి తెలుసుకోవాలనే బుద్ధీ లేదు. మరి ఇక ఏమున్నట్టు. మీను మీసంలాగా దయ అనే పాదమొక్కటే శేషించింది. దయ అంటే అయ్యో పాపం, వాడూ మనలాటి వాడేగదా అనే భావం. ఈ భావమున్నంతవరకూ ఒకరికి హాని చేయబోడు మానవుడు. మానవులకే గాదు ఏ ప్రాణికీ చేయలేడు. భూతకోటినంతా సానుభూతిగా చూడగలడు. ఇది కలియుగారంభంలో బాగా ఉంటూ వచ్చింది. రాను రాను ఆ భావం గూడా అంతకంతకూ సన్నగిల్లి ఇప్పుడు గిల్లితే వెళ్లి వస్తుంది కర్కోటకత్వం. అది పరస్పర విద్వేషాలకూ కలహాలకూ దారి తీస్తుంది. ఇదే ప్రస్తుతం మనమందరమూ చూచే ఈ కలికాలం. కలి అనే పేరు దీనికిప్పుడు సార్థకం. కలి అంటే కలహమని గదా అర్థం. కలహమే ఎక్కడ పట్టినా తాండవిస్తున్న దిప్పుడు ప్రపంచంలో.

దీని ఫలితంగా మనకిప్పుడు తారసిల్లిన మహోపద్రవమేమిటి. సుఖం లేదు. శాంతి లేదు. విజ్ఞాన వైరాగ్యాల వల్ల గదా సుఖశాంతులని చెప్పాము. అవి ఎప్పుడు కరువయ్యాయో వీటికీ అప్పుడే నోచుకోలేదు మనం. అన్నివిధాలా భ్రష్టమయి పోయింది మానవజాతి. మానసికంగా భ్రష్టులమయితేచాలు. అదే మాటలలో చేతలో కూడా తొంగి చూస్తుంది. అన్ని అనర్థాలకూ మూలం మనస్సు. ఈ మనస్సే నేమి. నేమి అంటే చక్రం. మనోమయమైన చక్రాన్ని దొర్లించాడట ఆపరమేష్ఠి. అది వచ్చి

వచ్చి భూమండలంమీద ఒకచోట పడి జీర్ణమయిందట. అదేనట నైమిశారణ్యం. అంటే అరణ్యం లాంటి ఈ సంసారమే. మనోబలం బాగా దెబ్బతినే మానవుడీ సంసారంలో పడిపోయాడు. కనుకనే అలసులూ, మందబుద్ధి బలులూ, అల్పతరాయువులూ, ఉగ్రరోగ సంకలితులూ, మందభాగ్యులూ ఈ కలికాల మానవులు. అన్నీ అవలక్షణాలే. ఇక మంచి పనులు చేయమంటే ఎలా చేస్తారు. సుకర్మములేవి చేయజాలరట. చేయకపోతే ఇక చేసేవన్నీ దుష్కర్మలే. ఏమిటి వాటి ఫలితం సౌఖ్యం లేదు. శాంతి లేదు. పరమార్థానికి దూరమై పోతే అవి రెండూ ఎలా సంభవం.

అందుకే అవి ఎలా కలుగుతాయని అడుగుతున్నారు శౌనకాదులు సూతుణ్ణి. ఎక్కడో లేరీ శౌనకులూ, సూతుడూ మనలోనే దారి తప్పి జన్మించిన కారణ జన్ములైన మహానుభావుడెవడో వాడు సూతుడు. అలాంటి వారిని సేవించి వారి బోధలు విని జీవిత సత్యమేదో తెలుసుకోవాలంటే శ్రద్ధా భక్తులున్న ఏ కొద్దిమంది విజ్ఞానులో శౌనకులు. అలాటి వారింకా కొందరుండబట్టే ఇంత కలికాలంలోనూ ఈ సంసారం మనపాలిటికి కేవల మరణ్యం గాకుండా విష్ణుక్షేత్రమని పేరు పొందింది. వారు జీవితమంతా ఒక జ్ఞాన యజ్ఞంగా భావించి పరమార్థాన్ని గూర్చి నిరంతరమూ అన్వేషణ సాగిస్తుంటారు. తమకే గాక తమ తోడివారైన ఈ కలియుగ మానవులంతా తరించే ఉపాయమేమిటా అని మథన పడుతుంటారు. ఈ కలియుగమందు మానవులని నిర్దేశిస్తారు శౌనకులు. అలా నిర్దేశించటం వల్ల భాగవతం కలియుగానికి సంబంధించిన పురాణమని, కలియుగ మానవుల కోసమే ముఖ్యంగా అది అవతరించిందని అర్థమవుతున్నది. మత గ్రంథాలని ప్రసిద్ధి చెందిన మూడింటిలోనూ రామాయణం త్రేతాయుగానికైతే – భారతం ద్వాపరానికైతే భాగవతం కలియుగానికి చెందిన పురాణం. ఇది ఆ కథలు జరిగిన, రచించిన కాలాన్నిబట్టి మాత్రమేగాదు. అవి లోకానికే ప్రబోధం చేస్తున్నాయో దాన్ని బట్టి కూడా. కర్మ, జ్ఞానం, భక్తి అని మూడే భూమికలున్నాయి మోక్షసాధన మార్గంలో. కర్మముదిరితే జ్ఞానం. జ్ఞానం ముదిరితే భక్తి అవుతాయి. భక్తి అంటే అనన్య భక్తి. అది జ్ఞానం కన్నావేరుగాదు. తన్నిష్ఠా రూపమైనది. జ్ఞానం పరినిష్ఠితమైతే అదే ఇక మోక్షం. ఇందులో మొదటి భూమిక అయిన కర్మ మానవుడాచరించవలసిన ధర్మమే. దాన్ని సవిస్తరంగా

బోధిస్తుంది రామాయణం.పోతే భారతం ఆ తరువాతి భూమిక అయినజ్ఞానాన్ని ప్రధానంగా చెబుతుంది లోకానికి. కౌరవ పాండవుల కథనిమిత్త మాత్రమే. తరుచుగా చేస్తూ వచ్చింది జ్ఞానబోధే భారతం. భగవద్గీతేమి, విదుర నీతేమి, సనత్సుజాతీయ మేమీ, మోక్షధర్మాలేమి ? అంతా జ్ఞానకోశమే. జ్ఞానం కోసమే. పోతే ఇక మూడవదైన భాగవతం దగ్గరికి వచ్చే సరి కాకేవల జ్ఞాన భూమిక కూడా దాటి మనం దాని పరిపాక రూపమైన భక్తిలో అడుగు పెడతాము. **"అహం బ్రహ్మాస్మి"** అనే ఐక్యాను సంధానమే ఇక్కడ వ్యవహారం. ఆ అఖండాత్మాను భూతిని సాధించటానికే భాగవత కథా వస్తువంతా. దీనితో మన ప్రయాణమే ముగుస్తున్నది. కర్మ, జ్ఞానం కోసమే. కర్మ , జ్ఞానంలో చేరిపోతే, జ్ఞానం భక్తిలో కలిసిపోతే, ఆ భక్తి నేరుగా మోక్షానికే దారి తీస్తున్నది. ఈ భావానికి ఒక సూచన అయి ఉండవచ్చు రామాయణం భారతంలోనూ, భారత రామాయణాలు భాగవతంలోనూ, ప్రస్తావించ బడటం. యూగాలెలాగైతే త్రేత ద్వాపరంలోనూ, ద్వాపరం కలియుగంలోనూ, చేరిపోతున్నాయో అలాగే యుగానుసారిగా వచ్చిన ఈ మూడింటి రచనలు కూడా ఒకదానిలో ఒకటి చేరిపోయినట్టు వర్ణించటం ఒక చమత్కారం. ఒక శాస్త్ర సంకేతం.

ఇంతకూ ఏ దృష్టితో చూచి చెప్పినా కలియుగానికి చెందిన కలియుగ మానవోద్ధరణ కవతరించిన పురాణం భాగవతం. కలియుగారంభంలోనే గదా పరీక్షిత్తు దీనిని శ్రవణం చేసింది. అప్పటికి కృష్ణ నిర్యాణమయింది. కృష్ణ నిర్యాణంతో ద్వాపరమంతమయి పోయింది. ద్వాపరాంతంలోనే వ్యాసుడీ భాగవతం రచించి తన కుమారుడు శుకుడికి బోధించాడు. అతడు ప్రాయోపవిష్టుడైన పరీక్షిత్తుకు దాని విషయమంతా ఏడు రోజుల పాటు వివరించి చెబుతాడు.

అసలిక్కడ ఇంకొక రహస్యం కూడా దాగి ఉన్నది. కృష్ణ నిర్యాణమైన వెంటనే కలియుగ మారంభమయిందంటే ఏమి టర్థం. కలి అంటే మనోబలం పూర్తిగా క్షీణించి పోవటమని గదా చెప్పాము. మనసు క్షీణించేదెప్పుడు. పరమార్థానికి బాగా దూరమైనప్పుడే. అదే దానికి క్షీణదశ. కృష్ణ నిర్యాణమైన తరువాత కలి ఆరంభమయిందంటే ఇదే అర్థం. కృష్ణుడంటే పరమార్థం. అది నిర్యాణమయిందంటే మానవుడి మనసుకది పూర్తిగా దూరమయిందన్న మాట. దూరమైనందుకు నిదర్శనమే కలిపురుషుడి విశృంఖల విహారం. వృషభ రూపంలో ఉన్న ధర్మాన్నీ గోరూపంలో

ఉన్న భూమాతనూ వాడు నిష్కారణంగా తన్నాడని చెప్పటం కూడా ఇదే. ధర్మాన్ని ఏ మాత్రమూ లెక్క చేయకుండా తిరుగుతున్నారీ కలియుగ మానవులు. ధర్మం తప్పితే ఇక బ్రతుకేమున్నది. సకాలానికి వర్షాలు కురవవు. భూమి ఫలించదు. తిండి తీర్థాలు లేవు. నిరంతరమూ కరువు కాటకాలతో పాడయిపోవలసిందే ఈ జాతి.

అయితే రక్షకుడైన ప్రభువొకడుంటే కొంత కాలం నిలిచి ఉంటుంది. లేకుంటే చేతికి చిక్కకుండా పోతుంది. అలాంటి రక్షకుడే పరీక్షిత్తు. పరీక్షాశీలుడే కదా పరీక్షిత్తని పేర్కొన్నాము. ఇంత ఘోర కలిలో కూడా అశోకుడిలాంటి ధార్మికప్రభువులు రాజ్యం చేసినంతవరకూ ఏకపాదంతోనైనా ఇది దేకుతూ వచ్చింది. వారూ అంతరించి చివరక పరీక్షితకారులూ అనపేక్షితచారులూ అయిన పాలకమ్మన్యులెప్పుడు వచ్చారో అప్పుడిక చెప్పవలసిందేముంది. కలికాల భుజంగం సహస్ర ఫణాలు విప్పి కనపడ్డ వారినంతా కాటువేస్తున్నది. ప్రస్తుత కాలంలో మనచుట్టూ అనుక్షణమూ మనం చూస్తూ ఉన్న దారుణ పరిస్థితులన్నీ అవే. ఏ రంగంలో చూచినా ఎంత దారుణమో ఎంత అన్యాయమో ఆ పరమాత్మకే ఎఱుక. ప్రతి ఒక్కటీ పూసగ్రుచ్చినట్టు వర్ణిస్తూ వచ్చింది భాగవతం. అదీ ఎప్పుడూ. శుకోపదేశమంతా సమాప్తమయి పరీక్షిత్తు ఆ బోధ అంతా మనసుకు పట్టి తదను సంధానబలంతో తక్షక విషాగ్ని దగ్ధమైన శరీరాన్ని ఒకదగ్గపటంలాగా వదలి ముక్తుడై పోయిన తరువాత. అంటే ఏమని భావం. ఒక మహనీయుడు చెప్పటమూ, అది శ్రద్ధా భక్తులతో వినటమూ, విని భాగవత ధర్మమేమిటో గ్రహించి ఆ ధర్మమార్గంలో నడవటమూ, ఇలాటి సంప్రదాయం పూర్తిగా దెబ్బ తిన్న తరువాత నని భావం. అలాటి సంప్రదాయమే దెబ్బ తింటే ఇక మిగిలిందేమిటి మానవుడికి. ఏమిటో మన బ్రతుకులు మనకే ఏ కరువు పెట్టి వర్ణిస్తున్నాడు భాగవతకారుడు.

కలియుగంలో రాజనేవాడు లేడు. రాజన పేరుతో శూద్రులే రాజ్యం చేస్తారు.

శౌచత్య శ్రుకలా సాధ్వీ - దుర్భ గేవోజ్ఝితా సతీ
అబ్రహ్మణ్యా నృపవ్యాజాః శూద్రా భోక్ష్యంతి మామితి

శూద్రరాజులు నన్ను పాలిస్తారే అని పరితపిస్తున్నదట భూదేవి. ఇప్పుడు జరుగుతున్నదదే కదా. శూద్రులు గాక సుక్షత్రియులెవరు పాలిస్తున్నారని ప్రపంచ

రాజ్యాలన్నీ శూద్రప్రభుపాలితాలే. శూద్ర అనగానే ఉలిక్కిపడ నక్కరలేదు. ఒక వర్ణం వారిని హేళన చేస్తున్నారని గాబరా పడనక్కరలేదు. శూద్ర శబ్దం వర్ణమాత్ర పరం కాదిక్కడ. గుణపరం. శూద్రగుణమే శూద్రత్వం. ఏమిటా గుణం. శ్లోకంలోనే ఉంది. **"అబ్రహ్మణ్యా"** అని. బ్రహ్మ అంటే వేదం. బ్రహ్మణ్య అంటే వేదచోదితమైన ధర్మాన్ని అనుసరించేవాడు. అలాంటివాడు కాకుంటే వాడబ్రహ్మణ్యుడు. అంటే శాస్త్ర విహితమైన ధర్మాన్ని కూడా ఉల్లంఘించి ఇష్టానుసారం పాలించే నిరంకుశ పాలకుడు. వారేగా ఇప్పుడు మనకు పాలకులు ! న్యాయస్థానాలూ చట్టాలు కూడా కొట్టి పారేసి కదా వీరు రాజ్యాలు చేయటం. మరి శూద్రఅంటే తప్పేముంది. సంస్కార శూన్యుడెవడో వాడే శూద్రుడు. పశువుల లాగా కేవలం ప్రాకృతంగా బ్రతికేవాడని అర్థం. అలాటి దుష్టగుణ విశిష్టుడే శూద్రరాజంటే **"తతో నృపా భవిష్యంతి శూద్ర ప్రాయా అధార్మికాః"** అధార్మికులైన రాజులే శూద్రులని భాగవతం స్పష్టంగా చెబుతున్నది.

ఏతే ఽధర్మానృత పరాః ఫల్గుదా స్తీవ్ర మన్యవః
స్త్రీబాల గోద్విజఘ్నాశ్చ - పరదార ధనాదృతాః
ఉదితాస్తమిత ప్రాయాః - అసంస్కృతాః క్రియా హీనాః
రజసా తమసాఽ వృతాః ప్రజాస్తే భక్షయిష్యంతి
మ్లేచ్ఛా రాజన్య రూపిణః

ధర్మానికి న్యాయానికీ పూర్తిగా తిలాంజలి ఇచ్చి చెప్పేదొకటి చేసేదొకటి అయి రాజసతామసగుణాలు విజృంభించి స్త్రీలనూ నోరులేని పశువులనూ, విద్యావంతులను, పొట్టన బెట్టుకొంటూ, పరదార పరధనాప హరణంలో సిద్ధహస్తులై - దొంగతనాలు దోపిడీలకూ తామే చేయూత ఇస్తూ చోరస్వభావులూ, క్రూర స్వభావులూ అయి చివరకు ప్రజలనే విరుచుకు తినేందుకు కూడా వెనుదీయ రటరాజులు చూడండి ఇది ఎంత వాస్తవమైన మాటో. మనమిప్పుడు వర్తమాన కాలంలో ఉండే రాజకీయాలను తరచి చూస్తే ఇంతకన్నా తార్కాణమేమి కావాలనిపిస్తుంది. ప్రజాప్రభుత్వాలనే వ్యాజంతో ప్రజలనే వేపుకు తినటం వాళ్ల ఆస్తిపాస్తులు కాజేయటం అదేమిటని ప్రశ్నించిన వారిని హతమార్చటం తప్ప ఏమున్నదిప్పుడు పాలకులు

చేసే ఘనకార్యం. ఎంత కళ్లకు కట్టినట్టు వర్ణిస్తున్నదో చూడండి పురాణం. అందుకే పురాణమన్నారు దాన్ని. పూర్వమెప్పుడో వ్రాసింది అయినా ఇప్పటి పరిస్థితులు పూర్వమే ఎలా చూచి వ్రాయగలిగారని అడుగుతారేమో. అదే త్రికాలజ్ఞులైన మహర్షుల విశిష్టత. త్రికాలజ్ఞులు గనుకనే వారు క్రాంత దర్శనంతో దర్శించగలిగారీనాటి సంఘటనలు కూడా. లేకుంటే ఇంత సూటిగా వర్ణించటమనేది పొసగదు.

ఒక్క పాలకుల వ్యవహారమే గాదు. పాలితులైన ప్రజల వ్యవహారం కూడా ఎలా వర్ణించారో చూడండి

తన్నాథాస్తే జానపదాః - తచ్ఛీలా చార వాదినః
అన్యోన్యతో రాజభిశ్చ క్షయం యాప్యంతి పీడితాః

పౌరజానపదులందరూ అలాటి వారి ఏలుబడిలో ఎలా బ్రతకాలో అలాగే బ్రతుకుతుంటారు. **"యథా రాజా తథా ప్రజాః"** అలాటి స్వభావాలే. అలాటి ప్రవర్తనలే అలాటి మాటలే. చివరకా పాలకులచేత కొంతా తమలో తాము కొంతా కుమ్ము సుద్దులాడుకొని పాడయిపోతారు. పాడయిపోక ఏముంది.

తతశ్చా సుదినం ధర్మం స్సత్యం శౌచంక్షమా దయా
కాలేన కలినా రాజన్ - సంక్ష్య త్యయు ర్బలమ్ స్మృతిః

కలి బలం పుంజుకొనే కొద్దీ సత్యశౌచాది దైవగుణాలు క్షీణించక తప్పదు. **"విత్తమేవ కలౌ నృణామ్ జన్మాచార గుణోదయః" "సర్వేగుణాః కాంచనమాశ్రయంతే"** అన్నట్టు జన్మాచారాది వైశిష్ట్యమంతా మానవులకు ధనం వల్లనే వచ్చి పడుతుంది. **"ధర్మ న్యాయ వ్యవస్థాయాం కారణం బలమేవహి"** ఎవడికి బలముంటే వాడి కనుకూలంగా ధర్మమూ, న్యాయమూ మారుతూ పోతుంది. **"దాంపత్యే ఽభిరుచిర్హేతుః - స్త్రీత్వే పుంస్త్వే చాభిరతిః"** స్త్రీలూ, పురుషులూ, అన్యోన్యాభి రుచితోనే కలుసుకోటమూ, పెండ్లాడటమూ అంతకుమించి మరే వ్యవస్థాలేదు. **"లింగమేవాశ్రమ ఖ్యాతౌ అన్యోన్యాపత్తి కారణమ్"** బ్రహ్మచర్యం మొదలు సన్యాసాశ్రమం వరకూ పైపై వేషభాషలే చాలు హామీ పత్రమివ్వటానికి. ఆ వృత్త్యాన్యాయ దౌర్బల్యమ్. న్యాయానికి బలం లేదు. **"పాండిత్యేచాపలం వచః"** బాగా వాగ గలగటమే పాండిత్యం. **"అనాఢ్యతై వాసాధుత్వే - సాధుత్వే చాఢ్యతైవహి"** డబ్బుంటే చాలు వాడెంత దుష్టుడైనా

శిష్టుడే. అది లేకుంటే శిష్టుడైనా వాడు దుష్టుడే. **"స్వీకార ఏవచో ద్వాహే"** ఎవడి కేపిల్ల మీద దృష్టి పడితే వాడు దాన్ని స్వీకరించవచ్చు. **"సభ్యత్వే ధార్ష్ట్య మేవహి"** దబాయించగలవాడికే ఎక్కడైనా సభా మర్యాద.

పోతే **"దాక్ష్యం కుటుంబ భరణే"** ఎవడి కుటుంబాన్ని వాడు పోషించుకోటమే గొప్ప. **"యశోర్థే ధర్మ సేవనం"** పదిమందీ మెచ్చుకోవాలనే ఏ ధర్మమైనా అనుష్ఠించటం. **"బ్రహ్మవిట్ క్షత్ర శూద్రాణాం యోబలీ భవితా నృపః"** నాలుగు వర్ణాలలో ఎవడ కెక్కువమందీ మార్బలముంటే వాడే ప్రజలచే ఎన్నుకోబడి వారికి పాలకుడవుతాడు. **"వాక్సౌర్యం వ్యావహారికే"** లోకుల అన్యోన్య వ్యవహారాలలో నోరున్న వాడిదే మాట. **"విప్రత్వే సూత్రమేవచ"** ఎవడు జందెం వేసుకొంటే వాడే బ్రాహ్మణుడు. **"దూర వార్యయనం తీర్థం."** ఎంత దూరాన నీరు కనిపిస్తే అదే గొప్ప తీర్థం. **"లావణ్యే కేశ ధారణమ్"** ఆడా మొగా తేడా లేకుండా జుట్టు పెంచకోటమే లావణ్యం. చివరకు **"శాక మూలామిష క్షౌద్ర ఫల పుష్పార్షిభోజనాః"** కాయలూ, కూరలూ, విత్తనాలూ, దుంపలూ ఏది దొరికితే అది తింటూ **"అనా వృష్ట్యా వినంక్ష్యంతి యాస్యంతి గిరి కాననమ్"** అనావృష్టితో పంటలు లేక అలమటించి పోతూ అరణ్య పర్వతాదులకు పడిపోవలసి వస్తుంది.

శీత వాతా తప ప్రాపృడ్భిమై రన్యోన్యతః ప్రజాః
క్షుత్తృడ్భ్యాం వ్యాధిభిశ్చైవ - సంత ప్స్యంతేచ చింతయా

శీతవాతాది ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నిరంతర చింతలతో వంతలతో కుమిలి కుమిలి కమిలిపోతారు మానవులు. పోతే ఏముంది. **"తతోర్థ కామాభి నివేశితాత్మనాం - శునాం కపీనా మివ వర్ణ సంకరః"** అర్థకామాలొకటే జీవిత లక్ష్యమయిపోయి దానితో కుక్కలు కోతుల మాదిరి స్త్రీ పురుషులు స్వైర విహారం చేయసాగుతారు. **"త్రింశ ద్వింశతి వర్షాణి పరమాయుః కలౌనృణాం"** ఇరవయి ముప్పయి సంవత్సరాల కంటే ఎక్కువ కాలం బ్రతికే ఎత్తు మానం లేదు.

క్షీయమాణేషు దేహేషు దేహినాం కలి దోషతః
వర్ణాశ్రమ వతాం ధర్మే - నష్టే వేద పథే నృణాం
పాషండ ప్రచురే ధర్మే - దస్యుప్రాయేషు రాజసు

చౌర్యానృత వృధా హింసా - నానా వృత్తిషు వైనృషు
శూద్రప్రాయేషు వర్ణేషు - ఛాగ ప్రాయాసు ధేనుషు
గృహప్రాయేష్వాశ్రమేషు - యౌన ప్రాయేషుబంధుషు
అణుప్రాయా స్వోషధీషు - శమీ ప్రాయేషు స్థాన్నుషు
విద్యుత్ప్రాయేషు మేఘేషు - శూన్య ప్రాయేషు సద్మసు
ఇత్థమ్ కలౌ గతప్రాయే - జనేషు ఖర ధర్మిషు
ధర్మ త్రాణాయ సత్త్వేన భగవా నవత రిష్యతి

ఈ విధంగా కలికాల ప్రభావం మూలంగా మానవుల శరీరాలు క్షీణించిపోతూ వర్ణాశ్రమ ధర్మాలు నశిస్తూ, పాషండ ధర్మమే ధర్మమై, రాజులంతా దొంగలై, దోపిడులూ దొంగతనాలూ, దారుణమైన హత్యలూ వీటితో ప్రాణికోటి నానా తెరువులు పట్టిపోగా, మానవులంతా శూద్రులైపోయి, ధేనువులన్నీ మేకలూ గొఱ్ఱెలలాగా మారిపోయి, ఆశ్రమాలు వైభవోపేతమైన భవనాలయిపోయి, యోని సంబంధమే బాంధవ్యమయి, ఓషధులూ వనస్పతులూ వ్రేలెడు పరిమాణమై, మేఘాలు మెరవటం తప్ప కురవటమే లేకుండా పోయి, ఊళ్లూ పల్లెలు పాడుపడ్డ బీడులయి పోతాయి చివరకు.

చివరకనేది ఏదోగాదు. ఇప్పుడే ఆ కాలం వచ్చిందా అని భయం వేస్తుంది మనకు. సరిగా ఇలాటి వైపరీత్యాలే ఉన్నాయి చాలా వరకిప్పుడు. పోతే పైన వర్ణించినట్టు జనులు కేవలం గాడిదలలాగా బ్రతుకుతూ అసలే వర్షాలు లేక అణుప్రాయంగా పైరుపంటలు మారిపోయే రోజులింకారాలేదని సంతోషించవలసిందే మనం. అవీ ఎంతో దూరం లేదు. త్వరలోనే కొన్ని దశాబ్దాలలోనే దాపురించినా ఆశ్చర్యం లేదు. వస్తే ఏమవుతుంది. ఏమవుతుందో అదీ భాగవతమే చెబుతున్నది మనకు. సత్త్వహరమైన ఈ కలియుగానికి స్వస్తి చెప్పి మరలా కృతయుగ ధర్మాన్ని ప్రవర్తింపజేయటానికా భగవానుడు సత్త్వ ప్రధానుడై అవతరిస్తాడట. మొదటినుంచీ జరుగుతూ వచ్చిందదే గదా అసలు. ఒక యుగం ముగిసిపోయేది ప్రళయంతోనే. ఆ ప్రళయం ఒక భయంకరమైన సంగ్రామంతోనే. కృతయుగం దేవదానవ సంగ్రామంతో అంతరించింది. త్రేతాయుగం రామ రావణ యుద్ధంతో

సమాప్తమయింది. ద్వాపరం కౌరవ పాండవుల పోరాటంతో ముగిసింది ఒకటి దేవతలూ రాక్షసుల మధ్య. మరొకటి మానవులూ రాక్షసుల మధ్య. ఇంకొకటి మానవులూ మానవుల మధ్య. ఎక్కడ ఉన్నారీ దేవదానవ మానవులు. మనలోనే మన మానవ సమాజంలోనే. మనలో ఉన్న త్రిగుణాలకు ప్రతీకలే వీరు. ఈ గుణ సంక్షోభమ ఒక సంగ్రామం. వాటి సామరస్యమే వ్యవస్థ. అలాటి సామరస్యం రజస్తమో మాలిన్యం క్షాళనమై సత్త్వం బాగా పరిశుద్ధమైతే గాని ఏర్పడదు.

అదే ఇప్పుడీ కలియుగంలోనూ దెబ్బ తిన్నది. ఆ దెబ్బ తిన్న లక్షణాలే ఇంతవరకూ ఏ కరువు పెట్టింది. ఇది తారస్థాయికి చేరుకోటానికిక ఎంతో దూరం లేదని కూడా చెప్పాము. ఇది మన ఊహాగానమే గాదు. నేటి శాస్త్రజ్ఞులు కూడా ఇలా ప్రవచిస్తున్నారు. దైవజ్ఞులు కూడా సూచిస్తున్నారు. ప్రాజ్ఞులైన పెద్దలకు కూడ అలాగే తోస్తున్నది. దీనికి తగినట్టు ఆయా దేశాలవారు దారుణమైన మారణాయుధ సామగ్రి లెక్కకు మిక్కిలిగా పోగుచేసుకొని కూచున్నారు. అణు పరిశోధన లద్భుతంగా సాగుతున్నాయి. అంతరిక్షయానాలు గ్రహాంతర పరీక్షలు చెప్పనలవి గాదు. లక్షల కోట్ల మందిప్రాణులను త్రుటిలో పుటమార్చి బూడిద చేసే చిత్ర విచిత్ర యంత్ర పరికరాల కంతులేదు. అంతా సిద్ధంగా ఉంది. అవి ఇక మీట నొక్కి ప్రయోగించటమే తరువాయి. దానికి బుద్ధి పుట్టటమే ఆలస్యం. ఆ బుద్ధికి కామక్రోధాదులొకటి పెల్లుబికితే చాలు. అది ప్రపంచ మానవుల కర్మ విపాకాన్ని బట్టి. దానికి దైవ సంకల్పం తోడు కావాలి. అయితే ఇక క్షణమాగదు. పూర్వంలా దీర్ఘకాల సంగ్రామంతో కూడా పనిలేదు. ఎక్కడి ప్రాణి అక్కడే హతం. హతమైతే ఆ క్షణం నుంచీ ఇక కృతమే.

సంపూర్ణమైన పరివర్తనమే రావాలంటే ఎప్పుడు గానీ జాతి బాగా అధఃపతనమై మరలా దానిపాటికది పైకి లేవాలి. ఈ విశ్వ సత్యాన్నే హరి వంశంలో ఇలా బయట పెట్టాడు వ్యాసభట్టారకుడు.

శీల వ్యసన మాసాద్య - ప్రాపస్యంతే హ్రాస మాయుషః
ఆయుర్హాన్యా బలగ్లానిః - బలగ్లాన్యా వివర్ణతా
వైవర్ణ్యాద్వ్యాధి సంపీడా - నిర్వేదో వ్యాధి పీడనాత్
నిర్వేదా దాత్మ సంబోధః - సంబోధాద్ధర్మ శీలతా
ఏవమ్ గత్వా పరాంకాష్ఠామ్ - ప్రపత్స్యంతి కృతం యుగమ్

సదాలోచనా సత్ప్రవర్తానా లోపిస్తే ఆయుర్దాయం క్షీణిస్తుంది. ఆయువు క్షీణిస్తే బలక్షయమవుతుంది. బలం పోతే కళే మారిపోతుంది. దానితో నానావ్యాధులూ సంక్రమిస్తాయి. వ్యాధి పీడితులైతే గాని విరక్తి జన్మించదు. విరక్తి కలిగినప్పుడే తానెవడో తన జీవిత గమ్యమేమిటో అన్వేషణ బయలుదేరుతుంది. అది వెంటనే ధర్మంవైపు బుద్ధి మళ్లిస్తుంది. ఇలా అధర్మం పరాకాష్ఠ చేరితేగాని ధర్మాభిరుచి కలిగి జాతి మరలా కృతయుగాన్ని కండ్ల జూడదు.

ఒక అతీంద్రియ రహస్యముంది ఇందులో మనం గమనించవలసింది. సృష్టికర్త ఏదిగాని నిష్ప్రయోజనంగా సృష్టించడు. అలా నిరర్థకంగా సృష్టించాడంటే అది ఆయన సర్వజ్ఞతకే లోపం. పిపీలిక మొదలు బ్రహ్మదాకా ప్రతి ఒక్కదానికీ ఏదో ఒక ప్రయోజనముంటుంది. అది సాధించటానికే దాని సృష్టి ఉదాహరణ కొక గుఱ్ఱాన్నే తీసుకొని చూతాము. గుఱ్ఱమనేది గాడిద జాతే. దాని మాదిరే ఉంటుందిదీ. అయితే దానితో సరిపుచ్చుకోవచ్చు గదా. మరలా ఈ అశ్వజాతి ఎందుకు సృష్టి అయినట్టు. దానికంటే విశిష్టమైన ప్రయోజనముంది దీనికి. ఇది బండికి కడితే లాగుతుంది. సవారీకి పనికి వస్తుంది. ఆట నేర్పితే నేర్చుకొంటుంది. పందానికికూడా నిలుస్తుంది. మరి ఇలాటి గుణాలు లేవు గాడిదకు. దానికున్న గుణం వేరు. బరువులు మోయటానికి మాత్రమే అది. ఇది అంతకు మించిన కార్యాలు చేస్తున్నది. అయితే అలా చేస్తేనే దాని సృష్టి సార్థకం. చేయటానికి బద్ధకించినా పాలుమాలినా ఇక అది గుఱ్ఱమే కాదు. గాడిద స్థాయికి దిగజారుతుందది.

అలాగే ప్రస్తుత మీ మానవ సృష్టి కూడా ఒకానొక విశిష్ట ప్రయోజనం కోసమేర్పడింది. ఏమిటా ప్రయోజనం. జీవిత సత్యాన్వేషణ. అది ఇక ఏ ప్రాణీ చేసే వ్యవహారం కాదు. మానవుడే చేయవలసింది. అందుకు తగిన మనసనే పరికరం కూడా అతని కొక్కడికే ఏర్పడింది. దాని బలంతో ఏది హేయమేది ఉపాదేయమని గుర్తించి హేయమైన అసత్ప్రపంచాన్ని వదలి ఉపాదేయమైన ఆ పరమాత్మ స్వరూపాన్నే పట్టుకోవాలి మానవుడు. అప్పుడే వాడి జీవితం సార్థకమవుతుంది. అలా కాక తన ధర్మాన్ని విడనాడి పశుపక్షి మృగధర్మాన్నీ అంతకన్నా నీచమైన పైశాచిక ధర్మాన్నీ ఎప్పుడు పాటిస్తాడో, అప్పుడే ఈ మానవ జాతికి వినాశం. మానవుడికి స్వధర్మమైన తత్త్వాన్వేషణలో నిధనం సంభవించినా పరవాలేదు. మరుజన్మలోనైనా కడతేరుతాడు.

పరధర్మమైన దానవ ధర్మాన్ని అనుసరిస్తేనే అది మహాప్రమాదం. **"స్వధర్మే నిధనమ్ శ్రేయః పరధర్మో భయావహః"** అని గీత చెప్పిందంటే అది ఈ దృష్టితో కూడా.

అయితే ఎవరెంత చెప్పినా మానవుడు తాను తన బుద్ధితో గ్రహించి మార్గంలో నడవనంత వరకూ ప్రయోజనం లేదు. ఎవడికి వాడు గ్రహించుకోవాలి. అదీ అందరూ గ్రహించాలి. అలా ఎప్పటికీ జరగదు. కొంత కాలం బ్రహ్మ ప్రయత్నం మీద అలా నడచినా ఎప్పటికో ఒకప్పటికి మార్గం తప్పుతాడు మానవుడు. దానికి మూలమతని కామమే. కామరూపుడే గదా మానవుడంటే. అది ధర్మంచేత నిగృహీతమై ఉంటుంది చాలావరకు. ధర్మమెప్పుడు దుర్బలమవుతుందో అప్పుడిది ప్రబలమై జాతి వినిపాతానికే దారి తీస్తుంది. అదే యుద్ధం. అదే వినాశం. అదే యుగాంతం. అప్పుడప్పుడలా జరిగిందని భంగ్యంతరంగా చెప్పుతూ వచ్చింది భాగవతం మనకు. యాదవ కులంలో ముసలం పుట్టటమూ – దాని ప్రభావంతో వారంతా చివరకు సమసిపోవటమూ, ఈ సంఘటన ఒక్కటి తరచి చూస్తే చాలు మనం. కృష్ణుడి సందర్శనార్థం మహర్షులు రావటమేమిటి. వారిని యాదవ బాలురంతా కలిసి అవహేళన చేయటమేమిటి. వారా వంశానికి శాపమివ్వటమేమిటి. దానితో వారు సమసి పోవటమేమిటి. కృష్ణుణ్ణి చూడటానికి వచ్చి వాళ్లు కృష్ణుడి వంశానికే ఎసరుపెట్టారు. ఏమిటీ అన్యాయం. అన్యాయం కాదు. న్యాయమే. **"వినాశకాలే విపరీత బుద్ధిః"** అన్నట్టు వినాశం కావలసి వచ్చి వారికా దుర్బుద్ధి పుట్టింది. అది వారి ప్రాక్తన కర్మ పరిపాకమే. దానికి మహర్షుల శాపమనేది ఒక నిమిత్తం. ఇదంతా ఫలితానికి రావాలంటేభగవత్సంకల్పం కూడా తోడు కావాలని చెప్పాము గదా. అందుకే కృష్ణుడి ఉదాసీనత. అన్నీ తెలిసి కూడా అది ఎలాగూ తప్పదని ఆయన ప్రతీకారమాలోచించలేదు. ఆలోచించకపోగా హతశేషులైన వారొకరిద్దరు కనపడితే వీరు మాత్రమెందు కుండాలని వారిని తానే స్వయంగా మట్టుపెట్టాడు.

భాగవతంలో ఈ సన్నివేశం చదువుతుంటే మనకీనాటి ప్రపంచ ధోరణికి సరిగా అద్దం పట్టినట్టు కనిపిస్తుంది. పెద్దలను అవహేళన చేయటమే ఇప్పుడూ జరుగుతున్నది. ప్రాజ్ఞులైన వారి మాట ఎవరూ పాటించటంలేదు. దేనిమీదా లక్ష్యం లేదెవరికీ. జీవితమంటే ఒక ఆట అయింది ప్రతివాడికీ. ఇలాటి నిర్లక్ష్య జీవితానికి ఫలం మనకీనాడు శాస్త్రజ్ఞులు తయారుచేసిన మారుణాయుధ సామగ్రి. ఇదే ముసలం

మనపాలిటికి. అది సాంబుడి గర్భంలో నుంచి రాగానే వారెలా హడలిపోయారో అలాగే హడలిపోతున్నా మీ సామగ్రి శాస్త్రకారుల బుద్ధి కుహరంలో నుంచి రాగానే. దానిని తప్పించుకోటానికి వారు పొడి చేసి సముద్రంలో కలిపినా అది సమసిపోలేదు మీదు మిక్కిలి ఒక తుంగ మాదిరి తీరంలో మొలచి వారికోసం కనిపెట్టుకొనే ఉంది. అలాగే ఈ ఆయుధాలను కూడా ఎలా రూపుమాపాలని చూచినా పోవటం లేదు. అంతకంతకు వాటి సంఖ్య ఎక్కువవుతూ అవన్నీ మన అంతిమ సమయం కోసం కనిపెట్టుకొనే ఉన్నాయా అని భయం వేస్తుంది.

అసలు జాతి సురక్షితంగా ఉండాలంటే ప్రతివ్యక్తి తన ధర్మాన్ని తాను పాటిస్తూ పోవాలి. అలా పాటించాలంటే దేశాన్ని పాలించే ప్రభువులు అందరూ ధర్మాన్ని పాటించేలాగా చూడాలి. చూడాలంటే వారు ముందు ధర్మమార్గాన్ని తప్పకుండా అనుసరించాలి. **"రాజా కాలస్య కారణం - యధా రాజా తథా ప్రజా"** అన్న సుభాషితాలిందు కోసమేర్పడ్డవే. ఈ సూత్రం తెగిపోయినప్పుడే జాతికంతటికీ ముప్పు. అది కూడా మనకు భాగవతమే తత్తత్కథా వ్యాజంతో బయట పెడుతున్నది. పృథు చక్రవర్తి తండ్రి అయిన వేనుడి కథ ఇలాంటిదే. ప్రజాక్షేమం చూడవలసిన పదవిలో ఉండి కూడా అతడు తన బాధ్యత మరచాడు. మరవటమే గాక స్వార్థపరుడయి ప్రజలను బాధించాడు. నిరంకుశంగా పాలన సాగించాడు. నేనే ఈశ్వరుణ్ణి నాకంటే వేరెవడూ లేడు నియంత అని లోకానికి చాటాడు. అతడి దర్పమూ దౌర్జన్యమూ సహించలేక ప్రజలు తహ తహ లాడారు. చివరకు మహర్షులు కలగజేసుకొని వారించినా వాడు వారి మాటలు నిర్లక్ష్యం చేస్తాడు. దానికి కోపించి వారు తమ తపశ్శక్తితోనే వాణ్ణి దగ్ధం చేశారు. ఏమిటీ కథ.

ఈనాటి వ్యవహారమే ఇదంతా. ఇప్పుడూ ఉన్నారు వేనుడి లాంటి నిరంకుశ పాలకులు. స్వార్థైక పరాయణులు. ప్రజాకంటకులు. సజ్జనులైన మేధావుల మాట వీరు పెడచెవిన పెడుతున్నారు. ఎప్పుడో ఒకసారి ఏ పర్వతారణ్యాలలోనో తపోదీక్షతో నివసిస్తున్న మహాత్ముల దివ్యశక్తులు వీరిని నిలువునా నీఱుచేసి తుదముట్టించటం ఖాయం.

ఇలా ఒకటి గాదు. ఎన్నో ఉదాహరణలు చూపవచ్చు. రాక్షసులు దేవతలనూ, ఋషులనూ పెట్టే ఆగడాలన్నీ సాధువులనూ, మేధావులనూ దుర్మార్గచరులైన

పాలకులూ వారి ఆసరాతో వర్తించే దుండగులూ, పెట్టే వ్యవహారానికి నిదర్శనమే. దక్షాదుల అవివేక చర్యలన్నీ కేవల కర్మిష్ఠుల అజ్ఞానానికీ అహంకారానికీ తార్కాణమే. నహుషాదుల కథలన్నీ అకాలంగా అయోగ్యులకు ఉన్నత పదవులు లభిస్తే వారు కన్ను మిన్ను గానక నడచుకొనే వ్యవహారమే. కడకు అకారణంగా సాధువులకు దుర్వాసుఁ ప్రభృతులు శాపాదులిచ్చినట్టు వర్ణించటం కూడా మంత్ర తంత్రాదులచేత క్షుద్ర శక్తులను సాధించి వాటిని దుర్వినియోగం చేసే వారి అనుచిత వర్తనమే. ఇలా భాగవత కథలన్నీ బాగా తరచి చూస్తే మనకప్పుడెప్పుడో జరిగిందనే గాదు. ఇప్పటి లోకవ్యవహారం కూడా కండ్లకు కట్టినట్టు కనిపిస్తూనే ఉంది. అసలీ కథలన్నీ కల్పనలనే గదా పేర్కొన్నాము. కొందరు చక్రవర్తుల కథలూ, వారు నివసించిన ప్రాంతాలూ, నదీ పర్వతారణ్యాదులూ, చారిత్రకంగా సత్యం కావచ్చు. అలాటి సత్యం పది శాతమైతే మిగతా తొంబది శాతం దానిమీద చేసే ఒక బ్రహ్మాండమైన కల్పన. అయితే ఏ కథ చెప్పినా అది ఏదో ఒక జీవిత సత్యాన్ని బయట పెట్టటానికే. అది అప్పుడే గాదు. ఇప్పుడూ సత్యమే. సార్వకాలికమే. పింగళ అనే వేశ్యవృత్తాంతమూ, అజగర వృత్తాంతమూ, ఇలాటివెన్నో మనకీ విషయంలో అద్భుతమైన ఉదాహరణలు. ఇలాంటి నిత్య సత్యాలను మనకందిచ్చి మనలను బాగుచేయటానికే పురాణ మవతరించింది లోకంలో. అదే దాని పురాణవత్వం. పురాణత్వం.

ఇంతకూ మానవజాతి తన ధర్మాన్ని తప్పకుండా జీవించినప్పుడే దాని కభ్యుదయం. లేకపోతే వినిపాతం తప్పదు. అది ఆయా యుగాలలో క్రమంగా లోపించినప్పుడే ప్రళయం సంభవించింది. కృతంలో నాలుగవ పాదంలో తప్పితే అది త్రేతలో మూడవపాదంలో అయితే, ద్వాపరంలో రెండుకయితే, ఇప్పుడీ కలిలో అది మొదటికే మోసం తెచ్చింది. కలియుగారంభంలోనే అది ఒక ప్రబలమైన వ్యాధిలాగా ప్రవేశించింది. ధర్మాన్ని కూలదన్నింది. దానితో అతివృష్టి, అనావృష్టి, భూకంపాలూ, అన్యోన్యకలహాలూ, దారుణ హత్యలూ, మానభంగాలూ, మారణాయుధాలూ, ఎక్కువయి నేలతల్లి ఫలించకుండా వట్టిపోయింది. ఎంత పరీక్షిత్తయినా దుష్టశక్తుల నుపేక్షిస్తే సంభవించే ఉపద్రవమిది. అది చివర కజ్ఞాతంగా అతనిలోనే ప్రవేశించి అతణ్ణే నిర్మూలిస్తుంది. సచ్ఛీలురైన ప్రభువు లంతరిస్తే, చివరకు ప్రాప్తించేది మనకు మ్లేచ్ఛపాలనమే. దానితో ధర్మం లేదు. భాగవత ధర్మానికేమి

నోచుకోగలం. అది ఎప్పుడో కరువయిపోయింది. పోతే ఇహానికి పరానికీ రెంటికీ దూరమయిన ఈ కలిలో ఇకమనుగడ ఏముంది మానవుడికి. కలియుగాంతమే ఇది. ఇది భాగవతమే గాదు ఆధునికులైన త్యాగరాజాది మహాపురుషులు కూడా తమ రచనలలో స్పష్టంగా చాటిచెబుతున్నారు. పెద్దలందరికీ అలాగే మనసుకు తోస్తున్నది. కనుక యుగాంతం తప్పదు. ఇది అంతమైతే గాని మరలా కృతయుగ ధర్మం ప్రవర్తించదు. దాని చిహ్నాలు కూడా ఇప్పుడే కనిపిస్తున్నాయి మనకు. ప్రపంచ వ్యవహారాలిప్పుడేవి చూచినా బాగా భ్రష్టమైన స్థితికి వచ్చింది. బ్రతుకు నానాటికీ బరువయి పోయింది. మానవులకు ఎక్కడ చూచినా బాధలే. భీతాహాలే. దీనితో ఏ గ్రంథాలూ చదవకుండానే ఏ గురూపదేశం లేకుండానే విరక్తి కలుగుతున్నది మానవులకు. జీవితమంటే రోతపుడుతున్నది. జీవిత గమ్యమేమో, దీనికంతటికీ అతీతమైన శక్తి ఏదైనా ఉందేమో, లేకుంటే ఎందుకిలా జరుగుతోంది, దానినెలా పట్టుకోటమా అని మరలా మరలా తీవ్రమైన అన్వేషణ ప్రారంభమయింది. నిజమైన శ్రద్ధాభక్తులతోనే సాగిస్తున్నారన్వేషణ. అన్ని దేశాలలోనూ సాగుతున్నదిది.

ఇలాటి అన్వేషణాపరులే శౌనకాదులు. శునక గుణమైన శ్రద్ధ ముఖ్యంగా ఉన్నవారు. **"శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్"** అది ఒకటి ఉంటే చాలు. బాగుపడతాము. దానివల్లనే జ్ఞానం, విజ్ఞానం రెండూ లభిస్తాయి. వీరు కొందరైనా ఉండబట్టే ఈ ప్రపంచం కేవలం నైమిశారణ్యమయిపోక విష్ణుక్షేత్రమనిపించుకొంటున్నది. మరలా సూతునిలాంటి ఉగ్రశ్రవులైన మహాత్ములవల్ల జీవిత సత్యమేదో దాన్ని శ్రవణం చేస్తూ మానవులు భాగవత ధర్మాన్ని అనుసరిస్తున్నారు. అలసులూ, మందబుద్ధులూ అయిన ఈ కలికాల మానవులలో సౌఖ్యం శాంతి పూర్తిగా లుప్తమయిందని తెలిసి వీరు పరమ సత్యప్రాప్తి కోసం పాటుపడుతున్నారు. శతవర్ష సమ్మితమైన జీవితమంతా శతవార్షికమైన ఒక జ్ఞానయజ్ఞంగా భావించి అందులోనే దీక్షితులయి ఉన్నారు. పరీక్షిత్తు ప్రాయోపవేశ దీక్ష కూడా ఇదే. తక్షకుడి లాటి కాలమెలాగూ కాటు వేస్తుంది రేపు మనలనందరినీ. ఎంత మంచి వారమైనా ఎంత జ్ఞానులమైనా పోవలసిందే. తప్పదు.

ఎందుకంటే కలియుగాంత మవుతుందని గదా చెబుతున్నది భాగవతం. ఇంత ధర్మ విప్లవ మేర్పడిన తరువాత కాక తప్పదు. ఇప్పుడో అప్పుడో అన్నట్టున్నది.

అయితే ఇంతకు ముందు వచ్చిన అవతారాలు తొమ్మిది పోగా ఇక వచ్చేది పదియవది కల్క్యవతారం. కలికి కావలసినది కల్క్యవతారమే. ఇది ఇక విలక్షణమైన రూపం. మత్స్యకూర్మాదుల లాంటిది గాదిది. రామకృష్ణాదుల వంటిది కూడా కాదు. ఆనాటి పరిస్థితులకు సరిపోయినా యవి. ఇప్పటి స్థితి అలా కాదు. మానవుడిప్పుడు బాగా తెలివి మీరిపోయాడు. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు వెట్టివెట్టి వేషాలు వేస్తున్నాడు. ఆటంబాంబులు లేసరు కిరణాలు కనిపెట్టాడు. అంతరిక్షంలో రాకట్లలో కూచుని వీరవిహారం చేస్తున్నాడు. నక్షత్రయుద్ధాలు సాగిస్తానంటున్నాడు. లేసరు కిరణాల మూలంగా నిమిషంలో ఈ సృష్టినంతా నిర్మూలం చేస్తానని బెదిరిస్తున్నాడు.

మరి ఇలాటి బెదరింపులకు జవాబు చెప్పే అవతారమెలా ఉండాలి. తాడి తంతే తలదన్నాడన్నట్టు దీనిని మించి పోవాలది. అలాగే వర్ణించింది భాగవతం. ఏమని

శంబల గ్రామముఖ్యస్య – బ్రాహ్మణస్య మహాత్మనః
భవనే విష్ణు యశసః – కల్కిః ప్రాదుర్భవిష్యతి

శంబళమని ఒక గ్రామమట. అది ఈనాటి సంబళపూరు కాదు గదా. అక్కడ విష్ణుయశుడనే బ్రాహ్మణుడట. అంటే ఒక భాగవతోత్తముడైన మహనీయుడు. అలాటి ఉత్తమాధికారిని నిమిత్తంగా చేసుకొని అవతరిస్తాడట కల్కి. అతడి గర్భవాసంలో జన్మిస్తాడని కూడా లేదు. అతని భవనంలో నని ఉంది. దీనిని బట్టి అయోనిజుడయి అవతరించవచ్చు. అంతేకాదు. జన్మించగానే

అశ్వమాశుగ మారుహ్య దేవదత్తం జగత్పతిః
అసినా ఽసాధు దమన – మష్టైశ్వర్య గుణాన్వితః
విచరన్నాశునా క్షోణ్యాం – హయేనా ఽప్రతిమద్యుతిః
నృపలింగచ్ఛదో దస్యూన్ – కోటికో నిహ నిష్యతి

అతి శీఘ్ర గమనమైన ఒక అశ్వాన్ని ఆరోహిస్తాడట. అప్పటికి సద్యోజాతుడే గాక సద్యోయౌవనుడు కూడా అయి ఉండాలా మహాత్ముడు. అలా అయితేగాని అశ్వాన్ని వెంటనే ఆరోహించలేడు. అశ్వమంటే ఇది మామూలు గుఱ్ఱం కాదు. మామూలు గుఱ్ఱమది ఎప్పటికి జవాబు చెప్పాలీ లేసరు కిరణాలకు ? **"అశ్నోతి**

సర్వమ్ సర్వత్రేతి అశ్వః" అని అశ్వ శబ్దానికర్థం. సర్వత్రా సర్వపదార్థాలను కనులు మూసి తెరిచేలోగా వ్యాపించేదేదో అది అశ్వమంటే. మనోజవంతో ప్రయాణించే ఒక సాధనం. తమకన్నా వేగంగా పోయే ఎగిరే పాత్రలేమిటో Flying Saucers అంతు పట్టటం లేదీ ఆధునికులకు. అత్యాధునికమైన ఈ పరికరమేమిటో ఇక ఎలా పడుతుంది. అలా అంతుపట్టని వాహనం ఎక్కడి దాయనకు. దేవదత్తమట అది. దేవతలంటే మన కతీతమైన దూరపు గోళాలలో నివసించే అతీతశక్తులు గల జాతి. అది సరఫరా చేసిన వాహనమది. దానిమీద తిరుగుతూ మెరుపుదాడి చేసే ఆ అజ్ఞాత వీరుణ్ణి ఎవరడ్డుకోగలరు.

పైగా యంత్రబలమే గాదు. సహజంగానే బలసంపన్నుడాయన. సహజ బలమంటే దేహబలమని కాదు. దేహబల మీనాటి యంత్రబలం ముందేమి పని చేయగలదు. అది కాదాయన బలం. మరి ఏ బలం. అష్టైశ్వర్య బలం. అష్టసిద్ధులే అష్టైశ్వర్యాలు. అణిమ మహిమ, లఘిమ, గరిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం. ఇవి ఎనిమిదీ అష్టసిద్ధులు, ఇందులో ఏ ఒకటి ఉన్నా చాలు ఈనాటి భౌతిక విజ్ఞానానికి జవాబు చెప్పవచ్చు. ఎనిమిదీ సిద్ధిస్తే ఇక చెప్పేదేముంది. ఇవి ఆ పరమేశ్వరుడనుగ్రహిస్తే సిద్ధిస్తాయి యోగులకు. అలాంటప్పుడా పరమాత్మకే ఇవి ఉండటంలో ఆశ్చర్యమేముంది. జ్ఞానైశ్వర్య బలవీర్య తేజశ్శక్తులనే షడ్గుణాలూ సమగ్రంగా ఉన్నవాడే గదా భగవంతుడంటే అలాంటి భగవంతుడికి తిరుగేముంది. కనుకనే అసినా ఒ సాధు దమనమ్. నందకమనే తన దివ్యకరవాలంతో చెక్కలు ముక్కలు చేస్తాడా కల్కి. ఎవరిని. అసాధువులను. ఇదే దుష్టశిక్షణ. దీని కుపయోగించే ఆ కరవాలానికే మారణాయుధాలూ దీటేగావు. సహస్రాంశుడి దగ్గర ప్రదీపాంశువుల మాదిరి నిస్తేజవై నిలిచిపోతాయి. ఆశుగమైన హయాన్ని అధిరోహించి అప్రతిమానమైన ప్రాభవంతో దశదిశలా చరిస్తూ, రాజలాంఛనంతో బ్రతికే చోరులైన రాజులందరినీ చించి చెండాడుతాడా దేవుడు.

యదావ తీర్ణో భగవాన్ - కల్కిర్ధర్మ పతిర్హరిః
కృతం భవిష్యతి తదా - ప్రజా సూతిశ్చసాత్త్వికీ

ఆ విధంగా భగవానుడు కల్కిరూపంగా అవతరించి అతిమానుషమైన బలంతో దుష్టబలాన్ని శిక్షించటమేమిటి. మరుక్షణమే కృతయుగ ధర్మమావిర్భవించటమేమిటి.

అప్పటినుంచే ప్రజలందరూ శుద్ధ సత్త్వసంపన్నులై మనుగడ సాగిస్తారు. ధర్మదేవత మరలా నాలుగు పాదాలతో నడుస్తుంది.

నిజంగానే ఇలా జరుగుతుందా లేక ఇదంతా పురాణర్షి చేస్తున్న ఊహాగానమా, అని ఈనాటి హేతువాది సందేహించవచ్చు. పైగా దశావతారాలని మాటేగాని మనమిప్పటికి మనకన్నులతో ఏ అవతారమూ చూడలేదు. మనం చూడకుండానే తొమ్మిది అవతారాలు జరిగిపోయినాయి. పదియవదైన ఆ కల్క్యవతారమా ఇంకా రాలేదు. ఈ మధ్య కాలంలో బ్రతుకుతున్నాము మనం. అందుకే మనకీ కథలు వింటుంటే ఎక్కడ లేని అనుమానం. అయితే ఒక్కమాట. మన అనుభవానికి రానంత మాత్రాన ఏదీ కొట్టివేయరాదు. అలా కొట్టివేస్తాడీ నాటి మానవుడు. అది సత్యాన్వేషి అయిన శాస్త్రజ్ఞుడి లక్షణంకాదు. ఎందుకంటే సృష్టిలో ఎంత ఉందో ఏముందో అంతా మన అవగాహనకు వచ్చే వ్యవహారం కాదు. మన ఆకళింతకు వచ్చేది సముద్రంలో ఒక బిందువు. ఈ బిందువు నాధారం చేసుకొనే ఆ మహాసముద్రం తాలూకు అస్తిత్వాన్నీ సామర్థ్యాన్నీ మన మూహించుకోవాలి. అది ఊహ అయినా ఈ అనుభవాన్ని బట్టి చేసింది కాబట్టి ఇదెంత గట్టో అదీ అంత గట్టిదేనని అర్థం చేసుకోవాలి మనం. అలా చేసుకోమనే ఏ శాస్త్రమైనా మనకు చెప్పే సత్యం. మరి శాస్త్రానికి శాస్త్రమైన అధ్యాత్మ రంగాన్ని మనం కాదని కొట్టివేయటం దేనికి. ఇది సత్యమైతే అది వీటికన్నా సత్యం. దేశకాలపాత్రావస్థా వైచిత్ర్యాన్ని ఆధారం చేసుకొనే అది ఈ రహస్యాలను వక్కాణిస్తున్నది. కాకపోయినా చేతనా చేతనాత్మకమైన ఈ విశ్వమంతా పరస్పర సాపేక్షంగా Relative కనిపిస్తున్నదంటే దీనికంతటికీ ఒక నిరపేక్షమైన తత్త్వం Absolute మూలభూతమైనది లేకుంటే ఎలా సాధ్యం. ఉంటే అది సర్వజ్ఞమూ సర్వశక్తి సమన్వితమూ కాక తప్పదు. అది తాను సృష్టించిన ఈ ప్రపంచ సృష్టి స్థితిలయాలు యథాకాలంగా చేయకా తప్పదు. అందులో దీని స్థితికి ధర్మం మూలమైతే లయానికి ధర్మవిప్లవం హేతువు. అది నివారించి మరలా విశ్వస్థితిని కాపాడే బాధ్యత ఆ ఈశ్వరుడు తన చేతన సృష్టిలో విశిష్టమైన జాతి కొప్పగిస్తాడు. వారే మానవులు. వారిది ఎప్పుడు విస్మరిస్తారో అప్పుడిక తానే దానిని చక్కదిద్దాలి. దిద్దాలంటే తానెక్కడో అమూర్తంగా అజ్ఞాతంగా ఉండిపోతే లాభంలేదు. ఏదో ఒక ఆకృతిలో మూర్తీభవించి నలుగురిలో దృశ్యమానుడై ఆ గురుతర బాధ్యత తానే

నిర్వహించవలసి ఉంటుంది. అదే ఇంతకు ముందు జరిగిందని చెప్పే ఇప్పుడిక జరగబోతుందని చెప్పే అవతార రహస్యం.

కాబట్టి అల్పజ్ఞులమైన మనం నమ్మినా నమ్మకపోయినా నిత్య ప్రవాహశీలమైన ఈ సంసార యాత్రలో జరగేదేదో జరుగుతుంది. జరిగి తీరుతుంది. ఇది ఇలా జరుగుతుందని నీవూ నేనూ అనుకొంటేనే జరుగుతున్నదా ఏదైనా ఈ సృష్టిలో మంచిగాని చెడ్డగాని ఏది ఎంత మోతాదులో ఎప్పుడు జరగాలో అప్పుడది అంత గాఢంగానూ, గూఢంగానూ జరుగుతూనే ఉంది. చూస్తూనే ఉన్నాము. అందులో చెడ్డ మాత్రమే జరిగి మంచి జరగకుండా పోదు. చక్రనేమి క్రమంగా ఒకదాని తరువాత ఒకటిదాని కాలానికది జరగవలసిందే. రాత్రి పోతే పగలు రావటం లేదా అలాగే ఇది. ఇప్పుడీ కాలంలో చెడ్డ అనేది ఎంత చూడాలో అంత చూస్తున్నాము మనం. ఇదే కలికాలమంటున్నాము. ఇది పోయి మరలా దీనికి భిన్నంగా మంచి జరగవలసి ఉంది. అదే కృతయుగం. అలా పరివర్తనం కావాలంటే సామాన్యమైన పనిగాదు. మనబోటి అల్పవీర్యులైన మానవులు సాధించేది కాదు. మనతో కలుపుకొని ఈ సమస్త సృష్టికి అధినాథుడెవడో వాడి కర్తవ్యమది. అదే మత్స్యాది కల్యంతమైన అవతారోదంతం.

అసలీ విచికిత్స దేనికి మనకు. పోనీ ఇదంతా వట్టి పుక్కిటి పురాణమే అనుకొందాము. పురాణకథలనేవి కాల్పనికమే నని హేతువాది అనకముందు మేమే స్వయంగా చెబుతున్నాము గదా. అయితే కథ కల్పన అయినా అది సూచించే భావం మాత్రం కల్పన కాదు. మన అనుభవమెంతో అంత యథార్థమది. ఆ యథార్థాన్ని చెప్పటానికే ఈ కథ అనే ప్రణాళిక Medium. అలా భావించినా ఈ అవతారాదుల అంతరార్థం బోధ పడుతుంది మనకు. మన వైయక్తిక జీవితాలలోనే చిన్నప్పటి నుంచీ ఇప్పటిదాకా దేశ కాలావస్థలలో ఎన్నో మార్పులూ చేర్పులూ చూస్తున్నాము. దేశచరిత్ర, ప్రపంచ చరిత్ర చూస్తే ఎన్నో వింతలు, విశేషాలు, విడ్డూరాలు. నేటి మానవుడు నమ్మశక్యంగాని మాటలుగా కనిపిస్తాయి. దీనిని బట్టి ఈ విశ్వచరిత్ర ఇంకా ఎంత చిత్ర విచిత్ర రీతులలో నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఎంతో బంగారం వంటి కాలం చూస్తూ చూస్తుండగానే పోతుంది. పనికిమాలిన కాలం వస్తుంది. మానవుల బుద్ధులూ దానికి తగినట్టే తయారవుతాయి. అదే ధర్మ

విప్లవం. ఈ క్లేశాలన్నీ అనుభవించి రోత పుట్టిన మానవజాతి తన దౌర్బల్యాన్ని తాను గుర్తించి బాగుపడే అవకాశం సృష్టిలో లేకపోదు. అది సహజ వైరాగ్యం వల్ల కొంతా, పరిస్థితులవల్ల కొంతా కలిగితే అదే దైవికమైన ప్రబోధన. అది ఏదో ఒకరీతిలో మనలో పాదుకొన్న దుష్టభావాలను ఖండించి మనలోనే అట్టడుగున పడిపోయిన శిష్టగుణాలను పైకి లాగుతుంది. దైవికమైన ఒక అతీంద్రియ శక్తి మనలో అవతరిస్తేనే గాని ఆ బలంతో మనకీ రెండూ అలవడవు. కాబట్టి అదే భగవదవతారమనుకొన్నా అనుకోవచ్చు. మత్స్యకూర్మాదులని వర్ణించింది కూడా ఇలాటి అభిప్రాయంతోనే అని ఇంతకుముందే వాటి అంతరార్ధం వివరించి ఉన్నాము. పోతే అలాటి శిష్ట మానవకోటి బ్రతికే కాలమే కృతయుగమనకోండి. తప్పేముందు. కాబట్టి ఆధిభౌతికంగా జరిగినట్టు పురాణం వర్ణించే ఈ వ్యవహారమంతా ఆధ్యాత్మికంగా సమన్వయించుకొన్నా సమన్వయించుకోవచ్చు మనం. ఎలాగైనా చెల్లే వ్యవహారమే ఇది.

ఇంతకూ పురాణహృదయమేదో అది గ్రహించాలి మనం. మన మీనాడు కలికాలమను, మరొక కాలమను, చావు బ్రతుకుల సంధిలో ఉన్నాము. సతమత మవుతున్నాము. దృష్టమైన ప్రపంచాన్నే నమ్మి అదృష్టమైన ఈశ్వర తత్త్వాన్ని పూర్తిగా మరచిపోయాము. ఈ దృష్టానికా అదృష్టమే మూలాధారమనే విషయమే మనసుకు రావటం లేదు మానవుడికి. దానితో సత్యం మరుగయింది. సత్యం కాని ప్రపంచమే మెరుగయింది. సత్యం కాదు గనుకనే ఇది మనమెంత గట్టిగా పట్టుకొన్నా నిలవకుండా జారిపోతున్నది విప్లవాలకూ, విషాదాలకూ గురి చేస్తున్నది. చివరకు నట్టేటిలో ముంచుతున్నది. అటు సత్యానికి దూరమై ఇటు సత్యమని నమ్మిన సంసారానికీ భారమై మానవుడిప్పుడు భగవద్గీత చెప్పిన **"నాయమ్ లోకోస్తి నపరో"** అన్నట్టు బ్రతుకుతున్నాడు జీవచ్ఛవం మాదిరి. ఇలాటి హీనమైన బ్రతుకుకు స్వస్తి చెప్పి మరలా పరిపూర్ణ మానవుడిలాగా బ్రతకాలంటే పరీక్షిత్తులాగా దీనినుంచి మోక్షం సంపాదించాలి మనం. దానికోసం శౌనకాదులలాగా శ్రవణం చేయాలి. ఏమిటా శ్రవణం. భాగవత సత్యం. భాగవత సత్యాన్ని శ్రవణం చేసి, మననం చేసి, దానిని నిరంతరమూ ధ్యానిస్తూ, జీవితాలు గడపటమే మనమవలంబించవలసిన భాగవత

ధర్మం అంబరీషాదులు రాజ్యాలు చేస్తూ కూడా అనుసరించారా ధర్మం. కుచేలాదులు గృహస్థులయి కష్టదారిద్ర్య మనుభవిస్తూ కూడా అనుష్ఠించారు. ప్రహ్లాదులు బాల్యం నుంచీ అదే చింతనతో కాలం గడిపారు. మనకు రాజ్యాలు లేవు. భోజ్యాలు లేవు. తారకమైన భాగవత ధర్మాన్ని ఆచరించటానికేమి కష్టం.

తస్మాత్సర్వాత్మనా రాజన్ హరిస్సర్వత్ర సర్వదా
శ్రోతవ్యః కీర్తి తవ్యశ్చ - స్మర్తవ్యో భగవాన్ నృణామ్

శ్రోతవ్యం కీర్తి తవ్యం స్మర్తవ్యమైన విషయమది ఒక్కటే మానవులకు. పరీక్షిత్తును నెపం చేసుకొని మనలనే హెచ్చరిస్తున్నది భాగవతం.

యస్తూత్తమ శ్లోక గుణానువాదః సంస్తూయతే భీక్ష్ణ మమంగళఘ్నః
తమేవ నిత్యం శృణుయాదభీక్ష్ణమ్...

ఈనాడు మనకు మన జీవితాల్లో ఎదురయ్యే అన్ని అనర్థాలూ తొలగిపోవాలంటే దానికి దివ్యౌషధం లాంటిది భగవత్తత్త్వాను సంధానమొక్కటే నని సందేశమిస్తున్నది. అంతేకాదు.

కర్మతంత్రుడగుచు కమలాక్షు గొల్చుచు - నుభయ నియతవృత్తి
నుండెనేని... చెడును కర్మమెల్ల శిథిలమై....

అని తద్భగవత్సేవా బలంతో మన సంచిత కర్మకూడా క్రమంగా సంక్షయమై మనోబలం చేకూరుతుందని కూడా హామీ ఇస్తున్నది. అలాటి మనశ్శుద్ధి సంపాదించినప్పుడే మనమూ ఆ పరీక్షిదాదులలాగా సాత్వతులమవుతాము. సాధకులమవుతాము. భాగవతులమయి భాగవత ధర్మాన్నే అనుసరిస్తాము. అదే మనకెప్పటికైనా ఆ పరమ సత్యమైన భగవత్స్వరూపాన్ని సాక్షాత్కరింపజేసి పూర్ణపురుషులుగా మార్చి మనకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది. పరీక్షిత్తుకలాగే ప్రసాదించింది. శౌనకాదుల కలాగే అనుగ్రహించింది. మనమూ పరీక్షా శీలురమూ, శ్రద్ధాళువులమూ, అయితే చాలు. ఈశ్వరానుగ్రహం కూడా తోడయితే ఏ శుకుడో, ఏ సూతుడో మనకు దర్శనమిస్తాడు. ఉద్ధరిస్తాడు. ప్రకృతే అలాటి మహద్భాగ్యాన్ని మనకు ప్రసాదిస్తుంది. అచంచలమైన

అలాటి చిత్తశుద్ధీ కార్యదీక్షా మనకు నేర్పటానికే ఈ కలియుగాదిలో ఈ భాగవత మహాపురాణమవతరించింది. అవతరించి మహావిభవ సంపన్నులైన చక్రవర్తుల దగ్గరి నుంచీ అకించనులైన కుచేలాదులు దాకా, స్త్రీ పురుష, బాలవృద్ధ, బ్రహ్మక్షత్ర, వైశ్య శూద్రాంత్యజాది, వర్ణ వర్గభేదం లేకుండా, పాత్రలూ, కథలూ, సన్నివేశాలూ, చిత్ర భంగిమలలో అల్లిబిల్లిగా అల్లి అన్యాపదేశంగా ఉదాత్త గంభీరమైన ఒకానొక దివ్య సందేశాన్ని సమస్త దేశకాలాలకూ అందజేసింది. ఇది దాని సందేశమైతే దాని నందుకొని తదనుగుణంగా భాగవతమైన జీవితం జీవించటమే ఈ కలిక్లేశాన్ని దాటటానికి మనం చూపవలసిన ఏకైకాభినివేశం.

ఓమ్

శాంతిః శాంతిః శాంతిః



Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in